రసగంగాధరము

శ్రీ ధరణికోట వేంకటసుబ్బయ్య



ప్రచురణ :

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ

తిలక్ రోడ్డు : హైదరాబాదు

దరవ్యస్వామ్యసంకలితము

494 8275

C. 9170

1963

3840

రసతరంగిణీ ముద్రాశాల విజయవాడ

శ్రీ శృంగేరీ శ్రీ జగద్గురు సంస్థానమ్

శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యవర్య, పదవాక్య ప్రమాణ పారావారపారీణ యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణ సమాధ్యష్టాంగయోగానుష్ఠాననిష్ఠ తపశ్చక్రవర్తి అనాద్యవిచ్ఛిన్న శ్రీ శంకరాచార్య గురుపరంపరా ప్రాప్త షడ్దర్శన స్థాపనాచార్య వ్యాఖ్యాన సింహాసనాధీశ్వర సకల నిగమాగమ సారహృదయ సాంఖ్యత్రయ ప్రతిపాదక వైదికమార్గ ప్రవర్తక, సర్వతంత్ర స్వతంత్ర ఆది రాజధానీ విద్యానగర మహారాజధానీ కర్ణాటక సింహాసన ప్రతిష్ఠాపనాచార్య శ్రీమద్రాజాధిరాజ గురు భూమండలాచార్య ఋష్యశృంగ పురవరాధీశ్వర తుంగభద్రా తీరవాస శ్రీ మద్విద్యాశంకర పాదపద్మారాధక శ్రీ జగద్గురు శ్రీ చంద్రశేఖర భారతీ స్వామి గురుకమల సంజాత శ్రీ జగద్గురు శృంగేరీ శ్రీమదభినవ విద్యాతీర్థస్వామిభిః అస్మదత్యంత ప్రియశిష్య ధరణికోట శ్రీ వేంకట సుబ్బయ్యవిషయే విరచితాః నారాయణ స్మరణ పూర్వికా ఆశిషః సముల్లసన్తు

నెల్లూరు నివాసావసరే అస్మాన్ సందృశ్య భవత్ప్రణీతం రసగంగాధరాంధ్రభాషానువాదం తత్ర తత్ర అశ్రావయద్ భవాన్ ఏవం గుంటూరు నగరమప్యాగత్య అస్మదాదేశానుసారం రసప్రకరణాదికం శ్రావితవాన్ కావ్యలక్షణగ్రంథేషు మూర్ధన్యోహి రసగంగాధరః అన్యేహి కవయః లక్షణానాం ఉదాహరణాని

ప్రాచీనాన్యేవ పద్యాని ప్రాయో విచిన్వతే అయంతు జగన్నాథకవిః పండితరాజః లక్ష్యాణ్యపి స్వయమేవ విరచయ్య పాండిత్యాతిశయం ప్రాకాశయత్ గ్రంథాదౌ తేనైవోక్తమ్ 'నిర్మాయ నూతన ముదాహరణానురూపం కావ్యం మయాత్ర విహితం నపరస్య కించిత్ ' ఇతి అత్రహి గ్రంథే తంత్రాంతరాణాం బహవః ప్రమేయాః తత్ర తత్ర సంకలితాః తాదృశస్య గ్రంథస్య భవదారచితోఽయం ' ఆంధ్రానువాదః మూల మనతిలంఘయన్ అర్థాన్ విపులయన్ కవేర్హృదయం ఆవిష్కుర్వన్ సుమధురపదనిగుంభః సన్ అస్మాకం మోదనివహ మావహత్ భవా నత్ర నితరాం మననం విధాయ గ్రంథం నిరమిమీత గ్రంథోఽయం విశిష్ట పండితమండలం మండయన్ చిరం ప్రకాశతా మిత్యాశాస్మహే

26-4-1961
విజయవాటికా
ఆంధ్రప్రదేశః

ఇతి నారాయణస్మరణమ్
శ్రీ

P Durgiah,
Reader
O. U Arts & Commerce Co ege Hyd

శ్రీమాత్రేనమః శివాయ గురవేనమః

రసగంగాధర వరివస్యావతరణిక

శ్లో॥ ఛందఃపాదయుతాం నిరుక్తనఖరాం శిక్షాదిజంఘాన్వితాం
ఋక్సామోరుయుగా మధర్వజఘనా మధ్వర్యువేదోదరామ్
తర్కన్యాయకుచాం పదస్మృతిభుజాం కావ్యారవిందాననాం
వేదాంతామృతలోచనాం భగవతీం వాగ్దేవతా మాశ్రయే

శ్లో॥ ఆనన్దస్య నిరన్తరాయ మహతే జ్ఞానాయ విశ్వాత్మనే
నిత్యాయాకుంఠితతేజసే సుమనసాం గమ్యాయ వై యోగినామ్
నానాకార విధాయినే ప్యవికృతాకారాయ చిత్తాన్తరే
ప్రోన్మీలద్రసరూపిణే భగవతే తస్మై పరస్మై నమః

మ॥ తొలి నెంతున్ ముఖ చాతురీహృదయ మాధుర్యాత్తకామాతిగ
త్వలసద్ఖ్యాతి నరాకృతిన్ వెలసె నద్వైతాప్తి మూర్తిత్రయం
బిల నాఁగన్ విలసిల్లు నట్టి ఘను సర్వేశున్ దయాసాంద్రు ఛా
త్రలలామాన్వితు భాష్యకారు భగవత్పాదప్రభున్ శంకరున్

శా. శ్రీమత్కాశ్యపగోత్రుఁడన్ శివకృపాశ్రీలుండఁ గామాంబికా
రామస్వామి సుధీతనూజుఁడ బుధప్రఖ్యుండ వేదాన్వయ
శ్రీమద్వేంకటరాయశాస్త్రి గురునిస్సీమానుకంపాత్త భా
షామాధుర్య రసజ్ఞుఁడన్ సుకవితా సాహిత్య సంపన్నుఁడన్.

మ తనియం దెల్లున దైవి నాంగ్లమున ని సంద్రానుర క్తిన్ సుకా
వ్యనికాయంబు నుదాత్తదృశ్యచయ మాస్వాదించితిం గావ్య ద
ర్శన సిద్ధాంతము లాకలించితిని, దర్కంబించు దార్జించితిన్
జని సాఫల్యము నొందె శంకరగురుజ్ఞానాధ్వయానంబునన్

సీ రసఘనాత్మకమని రసికనిశ్చితమైన
స్వప్ననాటక మాంధ్రి సంతరించి
నాట్యశిల్పవిశేష నైపుణి రూపింపఁ
గాఁ బ్రతిజ్ఞారూపకము రచించి,
సరసవస్తుప్రీతి సంఘిల్లఁ దెల్లునఁ
గుందమాలను గూర్చి కొల్చి వాణి
న్యాయప్రవేశజిజ్ఞాసూపకృతి కాంధ్ర
తర్కభాషను వ్రాసి తజ్జ్ఞ లలర

తే. తేట వేదాంతసారంబుఁ దెల్లుఁ జేసి
నవ్యకవితా స్వరూపంబు నైజరీతి
బయలుగాఁగఁ బ్రయోగించి పాశుపతము,
భక్తి నమృతేశు మహిమను బ్రస్తుతించి

తే కవుల ప్రజ్ఞకు నికషంబు గద్య మనెడి
వామనోక్తిని బాటించి బహువిధములఁ
గౌశలంబునఁ గమనీయ గద్యకావ్య
ములను రచియించి సరసమోద మెంచి.

తే తనియ కే నిప్డు వివరింపఁ దలఁచినాఁడఁ
గావ్యమీమాంసను రస గంగాధరంబు
ఖ్యాతకీర్తి జగన్నాథ కవి సహృదయ
సార్వభౌముని కృతి నిట్లు సాహసించి.

ఉ సాహస మూర కాదె బుధచంద్రుల కైనఁ దరంబె యీకృతి
వ్యాహృతి యాంధ్రభాష? నటులైనను దెప్ప మహాబ్ధి దాటఁగా
నీహ యొనర్చినాఁడ బరమేశ్వరుఁ డేలొ మదాత్మలోన ను
త్సాహము గొల్పుఁ దత్కృపయె సర్వమఖర్వము నిర్వహించుతన్

చ ఇసుమంతేఁ బ్రతిభావలేపమునఁ గా దే నీ కృతిం బూనుకో
లసమానంబు రసజ్ఞకల్పకము ధ్వన్యాలోక భాష్యంబుఁ గా
వ్యసమగ్రార్థ నిరూపణాద్భుతము నవ్యన్యాయనిష్కృష్టమున్
రసగంగాధరమున్ భజించి విబుధాంధ్రశ్రేణి నర్చించెదన్

శా ప్రాణాయామపు గాసిలేద కరణగ్రామోపసంహారపుం
గ్లానిస్తోకము లేద లేదనశనాలాపంబునున్ బ్రహ్మచ
ర్యానైష్ఠుర్యము లేద నిల్ప శివుపై స్వాంతంబు సత్కావ్య ని
ర్మాణంబే రససిద్ధుఁడౌ కవికి సారస్వాత్మయోగం బగున్.

ఉ వ్యాసుఁడె తాత గౌతముఁడె యాత బతంజలియాత యన్య వి
ద్యాసముపేతుఁ డింకొకఁడె యాత నెవానికి సర్వశాస్త్రమే
యాసమసాహితీవిభవ మబ్బదొ వానికి లోకమందు నా
యాసమె దక్కెఁబో, సహృదయత్వ మహత్వయశంబు దక్కనే?

క రసగంగాభగవతిఁ దన
యసదృశ మూర్ధమునఁ దాల్చు నభవునికన్నన్
రసికుఁ డెవం డాతని ప్రా
గ్రసరార్చకుఁడే కదా జగన్నాథుఁ డనన్.

మ. తవునంచుందలఁదాల్చెఁజంద్రకళఁదత్సాంద్రామృతాత్మస్పృహా
వివశీభూతుఁడు గంరమందె యణఁచెన్ విశ్వప్రణాశంకరో
గ్రవిషంబున్ గుణదోషయోగ్యవిధి సర్వజ్ఞుండు స్వాయత్తపూ
శివరూపంబును సార్థకం బొనరుపం జెల్లున్ రసజ్ఞాలికిన్

ఉ పిన్నటనుండియున్ శివుని ప్రేమను శంకరదేశికేంద్రు వి
శ్వోన్నతి నార్ష మార్గరతి నోరిమి నామది నాటి ప్రోది చే
సె న్నను లోకమందు బుధసేవకు నర్హునిగా నొనర్చె నా
యున్నతతాతపాదుల ఋణోదధి యెట్టుల నిస్తరింపనా ?

క గంగాధర వరివస్యా
ఖ్యం గను నీకృతిని గొల్తు సన్మజ్జనకున్
గంగాధర వరివస్యా
రంగద్భవ్యాంతరంగు రామస్వామిన్

శా శ్రీమంతుండు శివార్చనాపరుఁడు సౌశీల్యోజ్జ్వలుం డార్యసే
వామాన్యుండు తనూజశిక్షణకళాపారీణుఁ డుక్తిస్థిరుం
డాముష్యాయణుఁ డూర్జితుండు వ్యవహారాధ్యర్ణ చాణక్యుఁ డా
రామస్వామియ యాత్మపాత్రిఁ గృతి దీనిన్ రక్తి లాలించుతన్

శ్రీమాత్రే నమః. శ్రీశంకరగురుపరబ్రహ్మణేనమః

రస గంగాధరము

ప్రథమాననము వరివస్యా వివరణ సముల్లసితము

1 కావ్య ప్రకరణము సద్యోజాతము

అధి 1 గ్రంధారంభము

శ్రీమత్పండితరాయజగన్నాథుఁడు సహృదయకవిచూడామణి ఆలంకారికమూర్ధన్యుఁడు రసగంగాధరసమాఖ్యమును నూతనకావ్యమీమాంసాత్మకనిబంధనగ్రంధవతంసమును సంతరింపఁ బ్రారంభించుచు దన్నిర్విఘ్న పరిసమాప్తిని ప్రతిబంధించు దురితంపుఁ బ్రశమనార్థమును ఆనుషంగికముగ సహృదయాంతర్వాణి లోకమున స్వగ్రంధ వ్యాపనార్థమును, శ్రోతృ వ్యాఖ్యాతృ పరితృజన శుభావాప్త్యర్థమును శ్రుతిబోధితశిష్టసంప్రదాయానుసారము మంగళాచరణ మొనర్చి శిష్యశిక్షార్థము గ్రంథాదిని నిబంధించుచున్నాఁడు

స్మృతాపి తరుణాతపం కరుణయా హరంతీ నృణా
మభంగుర తనుత్విషాం వలయితా శతై ర్విద్యుతామ్
కళిందగిరి నందినీ తట సురద్రుమాలంబినీ
మదీయమతిచుంబినీ భవతు కాపి కాదంబినీ

స్మరించిన మాత్రముననే సకలమానవుల (సంసార తాప త్రయ మను) ప్రచండాతపమును నైసర్గికదయాతిశయముచే బోఁగొట్టుచున్నది, అనశ్వరమైన శరీరకాంతులు గల మెఱుపుఁదీఁగల శతములచే (నూర్ల కొలఁది గొల్ల మెఱుంగుబోఁడులచే) పరివృత మైనది యమునానదీతట (బృందావన) కదంబమందారాది సుందర

తరునికరముల నాలంబముగాఁ గలదియు నగు నొకానొక (అని ర్వాచ్యస్వరూపవిరాజమాన మైన)కాదంబిని (మేఘమాల)[శ్రీకృష్ణాఖ్యము] మద్బుద్ధికి గోచరీభూతమై వఱలుఁగాక - అని శృంగార రసాలంబనమగు శ్రీకృష్ణరూపేష్టదేవతాస్తుతి చమత్కారసారము రసము కావ్యపరమాత్మ రసజ్యేష్ఠము శృంగారము తదాలంబనము శ్రీకృష్ణభగవానుఁడు. ఇట్లు శాస్త్రప్రాశస్త్యమును నిర్దిష్టము

స్మరించిన మాత్రమున' అనుటచే ఇఁక దర్శన స్పర్శనాది భాగ్యము లభించిన మఱెంత ఫలము కలుగునోకదా ఇట్లు కైముతికన్యాయమున అర్థసమన్వయముచే కావ్యార్థాపత్త్యలంకారము.

ఆతపము విద్యుత్తులు కాదంబిని అను నుపమానము లను మాత్రమే చెప్పుటచేత తాపత్రయము గోపకాంతలు శ్రీకృష్ణుఁడు అను నుపమేయములగు శబ్దములఁ జెప్పక పోవుటచేత- విషయనిగరణం జేసి భేదాభేదాత్మకము అతిశయోక్తి అలంకారము ఇటఁజెప్పిన కాదంబిని లోకమునందలి యన్యకాదంబినుల వంటిది కాదు లోకోత్తరము కడమ కాదంబిను లెల్ల జడములు వాని ధర్మముకాని దయ' దీనికిఁ జెప్పఁబడినది ఇది లోకోత్తర చైతన్య రూపశ్రీకృష్ణ భగవల్లక్షణము

మఱియు కడమ కాదంబినులు ఉదయించినప్పుడే ఆతపహారము లగును ఇది యన్ననో స్మరణమాత్రమున నరుల సంసార తాపత్రయములనెల్ల మునుముట్ట హరించునది

అవి క్షణభంగురము లగు మెఱపుఁదీఁగల కాంతులతోఁ గూడినవి ఇది యన్ననో అభంగురతనుకాంతిసంపన్నలగు వల్లవ పల్లవాధరల నెమ్మేని కాంతులచే సమావృతము ఇట్లు మేఘశ్యామము శ్రీకృష్ణాఖ్యభగవన్మూర్తి విరాజిల్లుచున్నది ఇట్లు ఉపమానమునకన్న

ఉపమేయమును ఉత్కృష్టగుణశాలిగా వర్ణించుటచే వ్యతిరేకాలంకారమును ఈ యలంకారముల సంకరము ఇందు కవియొక్క భగవద్విషయకరతిభావము ధ్వనితమగుట ఇది ధ్వనికావ్యము ఉత్తమోత్తమము

ఇష్టదేవతాస్తుతికి పిమ్మట సదాచారానుసారము గురునమస్కారము చేయుచు తన్మూలమున నిజవంశవిద్యాధిక్యముల పద్యద్వయమున గ్రంథకర్త వర్ణించుచున్నాఁడు

శ్రీమజ్జ్ఞానేంద్రభిక్షో రధిగత సకలబ్రహ్మవిద్యాప్రపంచః
కాణాదీ రాక్షపాదీ రపి గహనగిరో యో మహేంద్రా దవేదీత్
దేవాదే వాధ్యగీష్ట స్మరహరనగరే శాసనం జైమినీయం
శేషాంకప్రాప్త శేషామలభణితి రభూత్ సర్వవిద్యాధరో యః

పాషాణా దపి పీయూషం స్యందతే యస్య లీలయా
తం వందే పేరుభట్టాఖ్యం లక్ష్మీకాంతం మహాగురుమ్.

జ్ఞానేంద్రభిక్షువునుండి సకలవేదాంతశాస్త్రమును పొందినవాఁడును, గంభీరములైన వాగ్విన్యాసములు గల వైశేషిక న్యాయశాస్త్రముల మహేంద్రపండితుని నుండి గ్రహించినవాఁడును కాశీనగరమున ఖండదేవుని యొద్ద పూర్వమీమాంసాశాస్త్రము నధ్యయనించినవాఁడును శేషవీరేశ్వరుని కడ వ్యాకరణశాస్త్రము నభ్యసించినవాఁడును ఇట్లు సర్వశాస్త్రపారంగతుఁడైనవాఁడును మఱి పాషాణమునుండియు అమృతము ఉట్టిపడు నట్టి శిక్షావిలాసము గలవాఁడును, గ్రంథకర్త తల్లియగు లక్ష్మాంబకు భర్తయు మహావిష్ణుసదృశుఁడును నైన మజ్జనకునికి, మంత్రోపదేష్టకు, అవలీలమై

సకలశాస్త్రాధ్యాపనము చేసిన మహాగురునికి పేరిభట్టను పేర ప్రసిద్ధుఁడైనవానికి నమస్కరించుచున్నాఁడను.

పేరిభట్టుని పాండిత్య మెంత గొప్పదో శిష్యశిక్షణకౌశలము అంత గొప్పది ఎంత మందమతియైన శిష్యునైనను (నావంటి వానిని) బోధన సామర్థ్యముచే రసజ్ఞశేఖరుని జేసి రసగంగాధరమువంటి గ్రంథమును తీర్చిన యుపాధ్యాయుఁడు మా తండ్రి అని పండిత రాయని భావము

అట్టి విద్వత్పరవంశమునఁ బుట్టి అట్టి మహాగురువులయొద్ద సకలశాస్త్రముల నభ్యసించినవాఁడును పదవాక్యప్రమాణపారీణుఁడు నగు జగన్నాథుఁడు స్వకీయగ్రంథంపుటుత్కృష్టతను బ్రతిపాదించుచున్నాఁడు.

నిమగ్నేన క్లేశై ర్మననజలధే ర న్తరుదరం
మయోన్నీతో లోకే లలితరసగంగాధరమణిః
హర న్నంతర్ధ్వాంతం హృదయ మధిరూఢో గుణవతా
మలంకారాన్ సర్వా నపి గలితగర్వాన్ రచయతు

నేను సాహిత్యశాస్త్ర ప్రమేయమును మననము చేసి చేసి మహాక్లేశముపడి తత్ఫలితముగా జిజ్ఞాసు రసజ్ఞలోకోపకారార్థము ఈ సుందరమగు రసగంగాధర మను సాహిత్యమీమాంసాశాస్త్ర గ్రంథమును సంతరించితిని ఇది యధికారులైన సహృదయుల హృదయములందు నెలకొని తద్విషయమున వారలకున్న భ్రమ ప్రమాద విపరీతభావరూప మగు నజ్ఞానము నెల్లఁ బోఁగొట్టఁజాలును దీనిచేఁ బూర్వాలంకారగ్రంథముల స్వోత్కర్షాభిమానము రాలిపోవుఁ గాక ఇది ప్రస్తుతార్థము దీనిచే సముద్రములో మునిగి క్లేశము పాలై దాని కడుపులోపల నున్న మణిని తెచ్చి లోకమున కొకఁడు ఇచ్చుట, దానిని లోకులు దారములో గ్రుచ్చి హృదయమున ధరింప,

అది యీ హృదయాంతరాళముఁ గప్పిన చీకటిని మాపి సర్వాలంకారాతిశాయి శోభతో ప్రకాశించుట అను వస్తుసూచాప్రస్తుతార్థము స్ఫురించుచుండుటచే సమాసోక్తి అలంకారము మననమునే జలధిగను రసగంగాధరమునే మణిగను నిరూపించి ఉపమానోపమేయముల కభేదము చెప్పుటచే రూపకము గుణవంతులు అనుచోట సహృదయత్వ గుణవిశిష్టులని, దారము గలవారని నానార్థముల కలిమిచే శ్లేష. ఏతదుభయానుప్రాణితము సమాసోక్తి

ఇదివఱకే ధ్వన్యాలోక కావ్యప్రకాశ సాహిత్యదర్పణాద్యలంకారగ్రంథము లెన్నేని లోకమునఁ బ్రచారమున నున్నవి కదా! తద్గ్రంథ నిర్మాతలు సాహిత్యమీమాంసాకృషి యెంతేని చేసినవారు ఆ గ్రంథములచే నిది గతార్థముకాదా? అనఁగాఁ జెప్పుచున్నాఁడు గ్రంథకర్త

పరిష్కుర్వ న్త్వర్థాన్ సహృదయధురీణాః కతిపయే
తథాఽపి క్లేశో మే కథ మపి గతార్థో నభవితా
తిమీంద్రాః-సంక్షోభం విదధతు పయోధేః పున రిమే
కిమేతే నాయాసో భవతి విఫలో మందరగిరేః ?

తొల్లి కొందఱు సహృదయశేఖరులు కావ్యార్థములను పరిష్కరించిరిగాక అట్లయినను నా యీ క్లేశము ఎతెఱంగునను గతార్థముకాదు. ఎట్లన తిమింగిలములు సముద్రమును ఎంతేని కల్లోల పెట్టునుగాక దానిచే మందరగిరి యొక్క పయోధిమంథనాయాసము వ్యర్థ మైనదా? కాలే దనిభావము. తిమింగిలములది కేవల సముద్రసంక్షోభనమే అది వ్యర్థవ్యాపారము. అట్లే ఆ యన్యాలంకారికులదియు. మందరగిరిమంథానము చేతనే కౌస్తుభమణి అమృతము కలిగినవి అట్లే ఈ రసగంగాధరమే లెస్సగా కావ్యార్థమును మీమాంసించి నిగ్గుతేల్చినది. దానిచేతనే సహృదయులకు అపూర్వ

పరితోషము చేకుఱును కావున గ్రంథకర్త కృషి గతార్థముకాదు, చరితార్థమే అని భావము

నభవితా" కిం న భవతి' అని వస్తుప్రతివస్తూపమాలంకారము

అదిగాక ఈ గ్రంథమునందు వైలక్షణ్యమున్నది అ దేమన,

నిర్మాయ నూతన ముదాహరణానురూపం
కావ్యం మయాఽత్ర నిహితం నపరస్య కించిత్
కిం సేవ్యతే సుమనసాం మనసాఽపి గంధః
కస్తూరికా జననశక్తిభృతా మృగేణ ?

ఈ నిబంధనగ్రంథమందు ఉదాహరణోచితములైన రమణీయార్థ ప్రతిపాదక వాక్యములను నేను నిర్మించియుంచి మదీయ గ్రంథములనుండి గ్రహించియుంచి సమకూర్చితిని ఇతరులవాక్యముల నించుకేనియు లక్ష్యములుగా గ్రహింపలేదు కస్తూరిని పుట్టింప శక్తిగల కస్తూరికామృగము పూలతావిని గ్రహింప మనసున తల పెట్టనైన తలపెట్టునా ? ఇతరాలంకారికులు సముచితలక్ష్యనిర్మాణ శక్తిలేక అట్లు పరోపజీవులైరి నాకు అవి యేల? నేను సముచిత లక్ష్య నిర్మాణ ప్రతిభాధారేయుఁడను స్వతంత్రుఁడను అని భావము ఇందు నూతనోదాహరణనిష్పత్తి కస్తూరికాజననశక్తి, వీనికి వస్తు ప్రతివస్తు భావము కలిమిం జేసి ప్రతివస్తూపమాలంకారము

గ్రంథమునందు ప్రవృత్తి కలుగుటకై అనుబంధ చతుష్టయము ప్రతిపాదించుచున్నాఁడు గ్రంథకర్త.

మననతరితీర్ణవిద్యార్ణవో జగన్నాథపండితనరేంద్రః
రసగంగాధరనామ్నీం కరోతి కుతుకేన కావ్యమీమాంసామ్

మననమను నావచే విద్యాసముద్రమును తరించినవాఁడు జగన్నాథపండితరాజు రసగంగాధరనామకమును కావ్యమీమాంసాగ్రంథమును కుతుకముతో (అవలీలగా) సంతరించుచున్నాఁడు ప్రమేయమును గూర్చిన విచారము క్లేశకరము గ్రంథరచనమన్ననో కుతుకాపాదకము శ్లోకపూర్వార్థమున గ్రంథకర్తృసామర్థ్యము ప్రకటమగుచున్నది కావ్యార్థమననముచే నలంకారవాఙ్మయప్రపంచము నెల్ల చూఱగొన్నవాఁడు అలంకారశాస్త్రోదధి కర్ణధారుఁడు స్వతంత్రుఁడు జగన్నాథుఁడు అట్టివాఁడు రచించిన గ్రంథము సర్వథా ఉపాదేయమని తేటతెల్లము కావ్యమీమాంసాం అనుటచే (1) విషయము (2) ప్రయోజనమును ఎఱుకపడుచున్నవి. (3) సాహిత్యశాస్త్రమునకును ప్రకృతగ్రంథమునకును గల సంబంధము' ప్రతిపాద్య ప్రతిపాదకభావము (4) అధికారి - సర్వకావ్యమీమాంసాశాస్త్రమున కెవఁడో వాఁడే (సహృదయుఁడే) దీనికిని అధికారి అందుచే నిట వేఱుగాఁ జెప్పఁబడలేదు ఇవి అనుబంధచతుష్టయ మనఁబడును అవి తెలిసినవాఁడే గ్రంథమునందు ప్రవృత్తుఁ డగును

కవి శుభాశంసనము.

రసగంగాధర నామ్నా సందర్భోయం చిరం జయతు
కించ కులాని కవీనాం నిసర్గసభ్యాంచి రంజయతు.

'రసగంగాధరము' - రసమే గంగ దానిని ధరించినవాఁడు సహృదయుఁడు శివుఁడు ఒండె రసపరబ్రహ్మస్వరూపుఁడు శివుడు రస మను గంగాధరుఁడు త్రిలోకశివంకరరసప్రతిపాదకగ్రంథము రస గంగాధరము. ముమ్మందు రత్యాద్యవచ్ఛిన్నచైతన్యము, విగళితవేద్యాంతరము, సచ్చిదానందాత్మకము రసము అని రసో వైసః అని శ్రుతి ప్రామాణ్యముగఁ బ్రతిపాదింపబోవు చున్నాఁడు గ్రంథకర్త అట్టి శివాత్మకమైన యీ యుత్తమగ్రంథము లోకమున సర్వాలంకారగ్రంథములలో ప్రకృష్టరీతి వర్ధిల్లుఁగాక. సత్కా-

వ్యముల రచనయందు వివేచనమునందు సముచితసమ్యక్స్వభావులు కవి సహృదయ బృందారక బృందములు ఏతద్గ్రంథప్రతిపాదితసిద్ధాంతముల ననురంజితులై అనుసరింతురుగాక ఆలంకారికసంప్రదాయములలో ఈ రసగంగాధరసంప్రదాయమే శాశ్వతముగ లోకమున కొనసాగుచుండుగాక అని గ్రంథకర్త శుభాశంసనము అది తదాశంసానుసారముగనే నెరవేరుచున్నది చివర జయతు సమ్యంచి రంజయతు' అని యమకము ఇట్లు అర్థపరిపోషకముగా శబ్దాలంకారములఁ బ్రయోగించుట సముచితమని సూచన

రస గంగాధరము

పరివస్యావివరణసముల్లసితము

అ॥ 2 కావ్య ప్రయోజనము

"ప్రయోజన మనుద్దిశ్య న మన్దోపి ప్రవర్తతే" అను న్యాయము ననుసరించి మందుఁడైనను ప్రయోజనము మాలిన పని పొంతఁ బోవఁ డనఁగా నిఁక నభిజ్ఞుల విషయము చెప్పనక్కఱలేదు కదా! మఱి యెంతెంతకాలము నుండియో వాల్మీక్యాది కవిబృందారకులు కావ్యములు సంతరించుచున్నారు సహృదయశేఖరులు వానిని ఆస్వాదించుచు నున్నారు. ఇట్లు కవి సహృదయప్రవృత్తిజనకమైన కావ్యము యొక్క ప్రయోజనము లెవ్వి?

> కీర్తి పరమాహ్లాదము గురురాజ, దేవతాప్రసాదమ
> మున్నగు ప్రయోజనములు కలది కావ్యము దాని
> విశిష్టజ్ఞానము రచనార్థము కవికిని, ఆస్వాదనార్థము
> సహృదయునకును, ఉభయులకు వలసినది.

1 కావ్యప్రయోజనములలో నొకటి కీర్తి ఉత్తమ కావ్య నిర్మాతలు కాళిదాసాదులు జననమరణప్రవాహరూప మగు నీ సంసారము చిరము గడచినను ఇప్పుడును సహృదయులచేఁ బ్రస్తుతింపఁ బడుచు నశ్వరమైన పాంచభౌతికశరీరము నుజ్జగించియు నిత్యము నిరవద్యమునైన కావ్యప్రకర్షోద్భూత శరదిందుకీర్తికాయులై భూమిని విలసిల్లుచున్నారు 'సప్తసంతానములలోఁ బ్రశస్తిఁ గాంచి ఫలము గావించునది ధాత్రి కృతియు" "కృతి నెవ్వాని నాయము సత్కృతి నెన్ని దినంబు లుండు దివి నా పుణ్యవ్రతుఁ

డంతకాలముండును" అను ధర్మశాస్త్ర ప్రమాణమును బట్టి కావ్యనిమిత్తమున కవికి స్వర్నివాసమును కలుగును అందుచే కీర్తికాములై కవులలోఁ బలువురు కావ్యములు రచియింతురు

2 గురురాజ దేవతాప్రసాదము" ఇందు అన్యాలంకారికులు చెప్పిన ప్రయోజనములు అనేకములు చేరినవి ఎట్లన, 'చతుర్వర్గప్రాప్తి' (సా ద) ధర్మార్థకామమోక్షములు చతుర్వర్గము. అందు ధర్మము పుణ్యము రామాయణ భారత భాగవతాదిధర్మబోధక కావ్యరచనచే కవికిని, తత్పఠనమున సహృదయునకును అది చేకూఱును 'అర్థము' సరసకావ్యపరితుష్టు లగు రాజప్రభృతుల ప్రసాదముచే కవికి లభించును తొల్లి హర్షాదులవలన బాణాదులకుం బోలె, కృష్ణరాయాదులవలన పెద్దనాదులకుం బోలెను 'కామ' ప్రాప్తి ధనద్వారమున ఒండె శృంగారరసమయకావ్యపరవశీభూతచేతస్కులు రసజ్ఞులు కామరసాస్వాదప్రౌఢు లగుదురు 'మోక్షము' ప్రబోధచంద్రోదయాది మోక్షోపయోగికావ్యముల రచించుటచే కవికి కలుగును తదర్థానుసంధానమున సహృదయునకు మోక్షాభిలాష జనింపుడు, గురుప్రసాదమున వేదాంతశ్రవణజనితజ్ఞానమున మోక్షము లభించును ఇట్లు చతుర్వర్గప్రాప్తి మఱి 'శివేతరక్షతి' (కా ప్ర) సర్వానర్థనివృత్తియు సకలశుభావాప్తియు గురుదేవతావిషయక సత్కావ్యముచే నొదవును తొల్లి సూర్యశతకరచనమున మయూరుఁడు సూర్యదేవతాప్రసాదముచేఁ గుష్ఠవ్యాధినుండి విముక్తుఁడై సుఖంచెను.

3 వ్యుత్పత్తి - 'వ్యవహారవిదే' (కా ప్ర) కావ్యమునకుఁ బ్రమేయము కానిది లేదు

"న తచ్ఛబ్దం నతద్వాక్యం, న సా విద్యా, న సా కలా,
జాయతే య న్న కావ్యాంగ మహో భారో గురుః కవేః"

కావ్యాంగముకాని శబ్దముగాని, వాక్యముగాని విద్యగాని కలగాని యుండదు కవిభారము కొడ్డది ఇట్లు వేదశాస్త్ర పురాణేతిహాసములవలన లోకాద్యవేక్షణమువలనఁ గలుగు సకల జ్ఞానమును కావ్యముచేతనుంగూడను గల్గును కాని విశేషము కలదు వేదశాస్త్రాదులు నీరసములు మహాక్లేశైకసాధ్యములు పరిణత బుద్ధులకే సుగ్రహములు కావ్యమన్ననో సరసము కావ్యముచే రసాంగభూతవ్యంజనావ్యాపారద్వారమున సుఖమయరీతిని సుకుమార మతులకు సకలజాతివర్ణములవారలకును సర్వవిజ్ఞానమును కల్గును కటుకౌషధముచే శమనీయమైనరోగము తెల్లచక్కెరచే నుప శమించుచో దానిని పరిణతబుద్ధియైనవాఁ డెవ్వఁడు కోరకుండును? అందుచే సాధీయ మగు కావ్యరమణీయమార్గము ఎల్లరకును అభీష్ట మైనది అందుచే నీ కావ్యజ్ఞానోపదేశము కాంతోపదేశసదృశము ప్రయోజనములలో 'మున్నగు ప్రయోజనములు కలది అనుదానిచే అది గ్రాహ్యము దానిఫలము పరమాహ్లాదము.

4 'పరమాహ్లాదము'

యశస్సు అర్థము వ్యవహారపరిజ్ఞానము మున్నగు ప్రయోజ నము లెన్ని ఆలంకారికులు చెప్పినను అవెల్ల నప్రధానములు అన్యథా సిద్ధములు అవి కవి సహృదయ సాధారణములునుం గావు మఱి కవి సహృదయోభయ ప్రయోజకము అనన్యథాసిద్ధము, సర్వప్రయోజ నాలంబనము నైనది పరమాహ్లాదము అది యొక్కటే కావ్యమునకుఁ బరమప్రయోజనము అట్లే ప్రతిపాదించినాఁడు ఆచార్యహేమ చంద్రుఁడు కావ్యానుశాసనమున

3)

నవనవోన్మేషశాలినియైన ప్రజ్ఞను ప్రతిభ యందురు తదుపజీవియై జీవద్వర్ణనా నిపుణుఁడైనవాఁడు కవి తల్లోకోత్తరమైన కర్మ కావ్యము అట్టికావ్యమునకు బ్రయోజనము ఆనందము అది సద్యోరసాస్వాదసముద్భవము, విగళితవేద్యాంతరమును (అనఁగా అన్యజ్ఞానముల నెల్ల నడఁచి ప్రకాశించునది) బ్రహ్మానందసదృశమగు ప్రీతి కవి సహృదయు లిర్వురకు సంబంధించినది ప్రయోజనములకెల్ల నుపనిషద్ఖ్యాతమైనది అనఁగా పరమపురుషార్థమును మోక్షమును ఉపనిషత్తు ప్రతిపాదించునట్లు కావ్య ప్రయోజనముల కెల్ల పైదియైన యానందమును కావ్యము కవి సహృదయు లిర్వుర హృదయములకును సాక్షాద్గోచర మొనరించునని భావము అర్థము కీర్తి మున్నగు ప్రయోజనములన్న కవి యొక్కనికే ఆ కీర్తిచేతనుం గూడ కడకు సాధింపఁదగినది ఆనందమే ఎట్లన ప్రీతికర మనియే కదా కీర్తిపై కోరిక ఆ కీర్తిని స్వర్గఫల మని పెద్దలు చెప్పుదురు [స్వర్గము నిరతిశయ సుఖరూపము] ఇఁక వ్యుత్పత్తియు ఆనందముకొఱకే ఎట్లన ప్రభుసమ్మితములు- అనగా కర్తవ్య మిది యని యాదేశించునవి, శబ్దప్రధానములు (శబ్దపరివృత్త్యసహములు) అగు వేదాగమశాస్త్రముల కన్నను మిత్ర సమ్మితములు అనఁగా ఈ కర్మకు ఇది ఫలము అని యుక్తియుక్తముగ కర్మఫలసంబంధముల నావిష్కరించునవియు అర్థప్రధానములు [2] (శబ్దపరివృత్తిసహము లయ్యు నర్థపరివృత్త్యసహములు) అగు పురాణేతిహాసములకన్నను విలక్షణమైనది కావ్యము దానియందు వాచ్యవాచకములు (శబ్దార్థములు) రెండును అప్రధానములు వ్యంగ్యాత్మరసము (చమత్కారసారము) ప్రధానము అట్టి కావ్యము కాంతవలె సరసత్వము నాపాదింపఁ జేసి

1 శబ్దము మార్పు నోర్వనివి. 2 శబ్దము మార్పు నోర్చియు అర్థంపు మార్పు నోర్వనివి.

కాంతుని సమ్ముఖీకరించుకొని వశంవదు నొనర్చుకొని రామాదుల వలె వర్తింపవలెను రావణాదులవలె వర్తింపరాదు అని యుపదేశించి అప్రయాసముగ సుఖరీతిని పాఠకుని కర్తవ్యపరు నొనర్చును అతనికి (చతుర్వర్గ) వ్యుత్పత్తిని కలిగించు నని భావము నీరసములు బహు ప్రయాసలభ్యములు పరిణతబుద్ధ్యేకగ్రాహ్యములు నగు వేద శాస్త్రాదులచే వ్యుత్పత్తి నొందనోపనివారు శ్రమించి నేర్వనోపని వారు సుకుమారమతులు రాజపుత్రాదులకు (నేటి బహుకార్యాసక్తులగు జనులు) సరసరీతిని నిజభుజాక్షేపకటాక్షాదికముచే హృదయాను ప్రవేశద్వారమున కాంతవలె కావ్యము వ్యుత్పత్తిని వెలయింప సమర్థము కావ్యమునకు హృదయానుప్రవేశము ఎట్లన కవి తా రచించు కావ్యమునందు రసోచితవివిధభావాద్యుపనిబంధనము చేసి దాని నాస్వాదించు రసజ్ఞులకు చిత్తపారవశ్యము చేకూర్చును కావున వ్యుత్పత్తికిని ప్రీతియే పరమప్రయోజన మని సిద్ధము

ధనము కావ్యమువలననే లభించు ననరాదు అది అనైకాంతికము అనియతము)వ్యవహారకౌశల మన చాణక్యాదివిరచిత శాస్త్రములచేతను కలుగును అనర్థనివారణమును మంత్రాద్యనుష్ఠానమున చేకూరును అందుచే కావ్యమే తప్పక తత్ప్రయోజక మనరాదు అందుచే అన్యథాసిద్ధములను అనైకాంతికములను ఆనుషంగికములను ఇట్లు సర్వథాజఘన్యము లగువానిని నేము కావ్యప్రయోజనములుగాఁ జెప్పలేదు

ఇట్లు పరమాహ్లాదనే కావ్యముయొక్క పరమప్రయోజన మని సిద్ధము

రస గంగాధరము

వ్యాఖ్యావివరణసముల్లసితము

అ॰ 3 కావ్యలక్షణము

గుణాలంకారాదులచే నిరూపణీయ మగు నా కావ్యము నందు విశేష్యతావచ్ఛేదకమును తదితరబుద్ధిసాధనము నగు తల్లక్షణము తొలుదొల్త నిరూపింపఁబడుచున్నది- రమణీయార్థప్రతిపాదకశబ్దము కావ్యము అని.

ఇట నొకశంక-కావ్యము గుణాలంకార రసభావాది విశిష్టము కదా (అనఁగా గుణాలంకారాదులు విశేషణములు. కావ్యము విశేష్యము) కావ్యమీమాంసాత్మకమైన యీ గ్రంథమునందు ఆ గుణాలంకారాదుల స్వరూపము యథాసంభవముగా నిరూపింపఁబడునుగదా దానిచేతనే కావ్యస్వరూపము తెల్లముకాదా? మఱల నిట దానిని వేఱుగఁ జెప్పవలసిన పనియేమి?' అని అందులకు సమాధానము - విశేషణములకన్న నతిరిక్తము విశేష్యము విశేషణ ములు ధర్మములు విశేష్యము ధర్మి విశేష్యము మొదట సిద్ధించిననే విశేషణములకు ఆశ్రయము లభించును విశేష్యము నాశ్రయించు కొని విశేషణములు పెక్కుఉండవచ్చును అవెల్ల సమప్రధానము లుగా నుండవు అన్నియు నియతముగ నన్నియెడల నుండవలసినది లేదు అవి అన్యత్ర నుండ వనను రాదు అందుచే అనియతవృత్తులగు నా విశేషణములనిరూపించినమాత్రముననే విశేష్యస్వరూపము స్పష్ట పడదు ప్రకృతము గుణాలంకారాదులు (విశేషణములు) కావ్య

మున (విశేష్యమున) నెల్లెడల నుండవలె నని నియమము లేదు. గుణాలంకారాదుల సంఖ్యాస్వరూపములందు మతభేదమును గలదు. అవి యున్ననుంగూడ కావ్యమునకుఁ గావ్యత్వము సిద్ధించు ననరాదు అవి కావ్యాత్మయైన చమత్కారమునకు నిమిత్తమాత్రములు ఆ గుణాలంకారాదుల నిరూపణమాత్రమునఁ గావ్యస్వరూపము తేట పడదు అందుచే విశేషణములవలెఁ గాక విశేష్యమున అన్యూనానతిరిక్తముగ నుండు ధర్మ మొకండుకలదు దానికి విశేష్యతావచ్ఛేదక మని పేరు అవచ్ఛేదకమనగా అన్యూనానతిరిక్తప్రసక్త మగు ధర్మము గోవునందు గోత్వము. ఆ విశేష్యతావచ్ఛేదకము విశేష్య మున్న చోటుల నెల్ల నుండును విశేష్యము లేని చోటుల నుండదు ఇటఁ గావ్యమున కావ్యత్వము విశేష్యతావచ్ఛేదకము కావ్యత్వము కలది కావ్యము అని కావ్యలక్షణము ఇట కావ్యము లక్ష్యము కావ్యత్వము లక్ష్యతావచ్ఛేదకము అది లక్ష్యమునందే యుండును లక్ష్యము యొక్క యసాధారణధర్మము 'ఇట లక్షణము చెప్పుటెందులకు ? వ్యవహారము కాని వ్యావృత్తికాని లక్షణమునకు ప్రయోజనము ('వ్యావృత్తిర్వ్యవహారోవా లక్షణస్యప్రయోజనమ్") ఇప్పుడు చెప్పిన కావ్యలక్షణము - (కావ్యత్వముకలది కావ్యము అనునది) వ్యావహారికలక్షణము అది అవ్యాప్తి అతివ్యాప్తి అసంభవము అను లక్షణదోషములు లేక కావ్యవ్యవహార మాత్రమునకు ఉపయోగించును దానిచే కావ్యముయొక్క విశేషస్వరూపము తెలియరాదు అందులకై తదితర వ్యావృత్తి సాధనము 'వ్యావర్తకలక్షణము" రమణీయార్థ ప్రతిపాదకశబ్దము కావ్యము అని చెప్పఁబడినది ఈ లక్షణము కావ్యమును కావ్యేతరమునుండి వేఱుచేసి దాని శుద్ధ స్వరూపము అనుమానించి నిరూపింప నుపకరించును అది యిట్లు

కావ్యము కావ్యేతరభిన్నము రమణీయార్థ ప్రతిపాదక శబ్ద మగుటవలన ఏది రమణీయార్థప్రతిపాదకశబ్ద మగునో అది కావ్యము-రఘువంశముకోలె ఏదియేది రమణీయార్థ ప్రతిపాదకశబ్దము కాదో అది కావ్యముకాదు తర్క-సంగ్రహముకోలె ఇట్లు అను మానముచే కావ్యస్వరూపము నిరూపితమైనది 'రమణీయార్థ ప్రతి పాదకశబ్దము కావ్యము" అను నీ వ్యావర్తకలక్షణము వ్యావహారిక లక్షణము నగును వ్యావర్తకలక్షణములు వ్యవహారలక్షణములు నగును కావున రమణీయమైన=విలక్షణ చమత్కా-రమును పుట్టించు నట్టి మనోహరమైన యర్థమును ఏది బోధించునో ఆ శబ్దము-శబ్ద పుంజము కావ్యము అని యర్థము కావ్యమని యొకటి మొదల నేర్పడ నిది తద్రామణీయకనిమిత్తభూతము లగు గుణాలంకారాదులకు ఆశ్రయము లభింపదు కావున తొలుదొల్తనే కావ్యలక్షణము ఇట నిరూపితమైనది యథాసంభవముగా గుణాలంకారాదులు మున్ముందు నిరూపింపఁ బడును

లక్షణపరిష్కారము

పైఁజెప్పిన కావ్యలక్షణమందు 'శబ్దము' అను దళము రమణీరమణీయ కటాక్ష విక్షేపార్థము నందలి అతివ్యాప్తి వారించుటకు. ఏలన, రమణీ కటాక్ష విక్షేపములును రమణీయమైన యనురాగా ద్యర్థమును ప్రతిపాదించున వేకదా 'శబ్దము" అను పదముచే ఆ యతివ్యాప్తి వారించినది వాచక' అనక ప్రతిపాదక' అనుట లక్ష్యార్థవ్యంగ్యార్థముల సంగ్రహార్థము కావ్యమునఁ బ్రయుక్తములై వాచకములేకాక లక్షక వ్యంజక శబ్దములును తత్తదర్థముల బోధించును మీఁదుమిక్కి-లి వ్యంగ్యార్థప్రధానము అందును రసప్రధానము ఉత్త

మోత్తమకావ్యముగ సమ్మతము ప్రతిపాదక' అనుటచే ఆ యవ్యాప్తి తొలఁగినది అర్థ' అనుట రమణీయశబ్దప్రతిపాదకములైన వ్యాకరణ సంగీతాది శాస్త్రములం దతివ్యాప్తి వారించుటకు వ్యాకరణము శబ్దానుశాసనము శబ్దరూపముల సాధుత్వప్రతిపాదననే తత్ప్రయోజనము ఆ శబ్దరూపసాధుత్వమే అందు రమణీయత్వము అర్థరామణీయకము కాదు కావ్యమన్ననో అర్థరామణీయకప్రతిపాదకము అట్లే శ్రుతిమనోహరమాత్ర శబ్దప్రయోజకము సంగీతము అందు శ్రుతికమనీయత్వమే రమణీయత్వము అట్లే కదా చెప్పిరి పెద్దలు

సంగీత మపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయమ్
ఏక మాపాతమధురం త్వన్య దాలోచనామృతమ్

సంగీతము అర్థజ్ఞానాపేక్షతోఁ బనిలేక విన్నంతనే తటుకున మాధుర్యము గొల్పును అట్లుకాక, సాహిత్యము కావ్యము అర్థరామణీయకప్రధానము కావ్యార్థమననమున - భావనచే-పరమానందము కల్గించును అందుచే అది ఆలోచనామృతము ' లక్షణమున అర్థ' శబ్దనివేశనముచే ఈ యతివ్యాప్తి తొలఁగినది రమణీయ' అనుట 'ఘటము తెమ్ము' అను మున్నగు అరమణీయార్థప్రతిపాదకశబ్దము లందు కావ్యలక్షణము అతిప్రసక్తము కాకుండుటకు

ఇట్లు కావ్యలక్షణము అనవద్యము

లక్షణవివేచనము

(శం) రమణీయార్థప్రతిపాదకము కావ్యమంటివి రమణీయత్వమన నేమి ?

(సమా.) లోకోత్తరమైన యాహ్లాదమును పుట్టించు జ్ఞానమునకు విషయమగుట రమణీయత్వము (లోకోత్తరత్వము ఆహ్లాదము) ఇట్లు లోకోత్తరాహ్లాదజనకజ్ఞాన విషయమగు నర్థమును ప్రతిపాదించు శబ్దము కావ్య మని భావము.

(శం) ఆహ్లాదగత మగు లోకోత్తరత్వముయొక్క స్వరూపమేమి ?

(సమా) 'లోకోత్తరము' అనుటచే లౌకికానందభిన్న మని భావము. 'జ్ఞానవిషయము' అనుటచే (లోకోత్తర) జ్ఞానాత్మకము ఆనందఘనము,నిర్విషయకముఅగు బ్రహ్మానందమునకన్న విలక్షణమని యభిప్రాయము అట్టి సవిషయము లోకోత్తరాహ్లాదజనకము నగు కావ్యాహ్లాదము చమత్కార మన బరఁగును. ఆహ్లాదము యొక్క లోకోత్తరత్వమునకు చమత్కారమని యింకొకపేరు.తదుపజీవులైననే గుణాలంకారాదులెల్ల చరితార్థములు. చమత్కారము రససారము. "చమత్కారోపసంపన్నమైననే కవివాక్కు ఇతరవాగ్విలక్షణమై సహృదయ హృదయముల నానందము కలుజులు పొరలి వెల్లివిరియించును" అని విశ్వేశ్వరుఁడు, చమత్కార చంద్రికాకారుఁడు. కవికంఠాభరణమున క్షేమేంద్రుఁడు ఆ చమత్కారమహిమను ఇట్లు ఉగ్గడించినాఁడు.

"సుకవి రతిశయార్థీ వాక్చమత్కారలోభా
దభిసరతి మనోజ్ఞం వస్తు శబ్దార్థసార్థే
భ్రమర ఇవ వసన్తే పుష్పకాన్తే వనాన్తే
నవకుసుమవిశేషామోద మాస్వాదలోలః"

వసంతమున పూలచే విలసిల్లు నందమైన వనమునందు మధుపము ఆస్వాదించు నాసతో క్రొంగొత్త పూలమేలితావిని అన్వేషించు

నట్లు విలక్షణవాక్ఛమత్కారలోభమున సుకవి శృంగారసార మందు అత్యంతమనోజ్ఞ మైన వస్తువును అభిసరించును సచేతస చేతశ్చమత్కృతి సంధాయిని యైనదే కవిత కావున చమత్కార విరహితుఁ డైన కవికి కవిత్వమును లేదు. అతని కావ్యమునకు కావ్య త్వమును లేదు. అనర్ఘ మణి ప్రభ లేని సువర్ణము వలె, లావణ్యహీన మగు లలనాతారుణ్యమువలె, చమత్కృతి లేని కావ్యము నిర్దుష్టమైనను సహృదయహృదయముల కెక్కదు. ఇంత యేల? చమత్కారమే కావ్యాత్మ, కవిత్వమునకు జీవ మని భావము. చమత్కృతిహీనమైన "నీరసపుఁ గావ్యశవముల దూరముననఁ బరిహరింపుదురు నీతిజ్ఞుల్" (కవికర్ణరసాయనము 1 ఆ) ఇట్టి మహిమ గలది చమత్కారము తత్సమవేతము చమత్కారత్వము, ఒక జాతి విశేషము. అనఁగా విలక్షణ జాతి యని భావము. కేవలగుణము - ధర్మమాత్రము కాదు. ఏలన ధర్మములు అనిత్యములు, అనైకాంతికములు(అనియతవృత్తులు) చమత్కారత్వమన్న రస భావ గుణాలంకారరీతి వృత్తి పాకాదికృతము లైన చమత్కారవ్యక్తుం దెల్ల నేకాకారమున ననుగతమై నిత్యసమ వేతమై విలసిల్లును. ఆ చమత్కారత్వజాతికిఁ జెందనిది, లోకోత్తరా హ్లాదకత్వము లేనిది కావ్యమే కాదని నిగ్గు.

[శంక] చమత్కార పర్యాయము లోకోత్తరాహ్లాదకత్వ జాతి యొకటి కలదన నేమి ప్రమాణము?

[సమా] సహృదయబృందారకుల ప్రత్యక్షానుభవమే - విల క్షణమానసికప్రత్యక్షమే - ప్రమాణము. లౌకిక ప్రమాణము కాదని, ప్రత్యక్షేతరము కాదని - అనగా అనుభూతిగమ్య మని.

[శంక] ఆ చమత్కారమునకు [లోకోత్తరాహ్లాదమునకు] ఏది హేతువు ?

[సమా] అది కావ్యార్థజ్ఞానముచే జనించును. ఇట ఆ జ్ఞానము భావనావిశేష రూపము, పునఃపునరనుసంధానాత్మకము. అనుసంధాన మన అర్థమును ప్రత్యక్షకల్ప మొనర్చుకొనుట. ('ప్రత్యక్ష ఇవ కరణమ్') అనఁగా కనులయెదుట రామాదులు లేకున్నను ఉన్నట్లొనర్చుకొనుట. అది లౌకికవిషయకముకాక, కావ్యవిషయకము - విలక్షణము అని యెఱుకపడుటకై భావనకు 'విశేషము' అను విశేషణము వేయఁదగును. అనఁగా సహృదయులైన వారు కావ్యార్థమును మనసున పునఃపునరనుసంధానము చేసికొని (మననముచేసి - భావనచేసి యుండె) దానిని (మనసున) సాక్షాత్కల్ప మొనర్చుకొని యుండె, [ఇట్లు కావ్యార్థమునకు లోకోత్తరత్వము ప్రసాదించునట్టి] యీ భావనామహిమచే లోకోత్తరాహ్లాదమును మాఱుకొందురు. అట్టి లోకోత్తరాహ్లాదజనకమైన యర్థమును ప్రతిపాదించు శబ్దము కావ్యము అని భావము.


(శంక) "లోకోత్తరాహ్లాదము" అనుటేల ? - ఊరక "ఆహ్లాదము" అన్నఁజాలదా ?

(సమా) చాలదు. ఏలన 'నీకుఁ గొడుకు పుట్టినాఁడు, 'నీకు ధనమిత్తును' అను మున్నగు వాక్యార్థముల భావనచేఁ (పునఃపునరనుసంధానముచేత) సైతము ఆహ్లాదము కలుగును. కాని అది ఈ భౌతికలోకమునకు సంబంధించినది. కావ్యభావనాప్రపంచ సంబంధికాదు. భావనాప్రపంచమున ఈ భౌతిక సంబంధములైన పరిమితత్వాదిలోపములు లేవు. అది పరమాహ్లాదమయము.

అట శోకమును ఆహ్లాదాత్మకమే. విస్తరము రసాధ్యాయమందు ఎఱుకపడును. అందుచే కావ్యాహ్లాదము అలౌకికము.

పైఁజెప్పిన ధనపుత్రాది నిమిత్తమగు నాహ్లాదమునకు లౌకికమగుట, కావ్యత్వప్రసక్తి లేదు అందుచే కావ్యలక్షణము అట్టి లౌకికాహ్లాదకర వాక్యములందు అతిప్రసక్తము కాకుండుటకై 'లోకోత్తర' పదము నివేశింపఁబడినది ఉక్తమైన రమణీయార్థ ప్రతిపాదకశబ్దము కావ్యము అనగా, ఇట్లు 'చమత్కారజనకభావనావిషయార్థప్రతిపాదకశబ్దము కావ్యము' అని సిద్ధము లోకోత్తరాహ్లాదము (చమత్కారము) నకు భావన నియతకారణము. భావనాత్వము కారణతావచ్ఛేదకము. ఆ భావనాత్వవిశిష్టభావన అర్థవిషయకమైనది ఆ యర్థమును ప్రతిపాదించునది శబ్దము

పై లక్షణము సమూహాలంబన జ్ఞానమున అతివ్యాప్తమైనది అది యిట్లు. -1.'ప్రొద్దు గ్రుంకినది,' 2 'పృథ్వి గంధవతి 'ఇత్యాద్యాకారము కలది ఒక సమూహాలంబనజ్ఞానము భిన్నసందర్భములందు భిన్నవ్యక్తులచే నుచ్చరింపఁబడిన యా వాక్యద్వయము వెనువెంట విన్న మఱి యొక్కనికిఁ - [శాబ్దబోధసామగ్రిబలమునఁ] దదుభయవాక్యవిషయకముగాఁ గలిగిన యఖండజ్ఞానరూపము - ధారావాహికజ్ఞానాత్మకము అది. ఆ జ్ఞానమును గల్గించు రెండు వాక్యములలో పూర్వవాక్యము కావ్యము. రెండవవాక్యము అకావ్యము. ఎట్లన, పూర్వవాక్యము సంకేతస్థలమునం బ్రొద్దుగ్రుంకునఁ బ్రియునిగలిసికొన నువ్విళ్ళూరుచు తన మనోరథ సిద్ధికిఁ బ్రతికూలమైన పవలు ఎట్లెట్లో గడపి, ఎట్టకేలకుఁ బ్రొద్దుగ్రుంకఁగా 'ప్రొద్దు గ్రుంకినది' అని యుత్సుకయై పలుకు నొకానొక యభిసారికా వాక్యము. దానిని అట్లు గ్రహించినవానికి తన్నాయకావిషయమైన విప్రలంభ...



శృంగారము వ్యజ్యమాన మగుటంజేసి, ఆ వాక్యము చమత్కారార్థకనే. కాని, రెండవవాక్యము చమత్కారరహిత మగు లోకసామాన్యార్థమును బోధించునది యగుట అచమత్కారార్థకము. ఏకనాళావలంబి ఫలద్వయము చందమున ఈ రెండు 'వాక్యములును నఖండవిషయకముగా (ధారావాహికముగ) భాసించునట్టి యీ సమూహాలంబనజ్ఞానమునకు చమత్కారార్థ జనకభావనావిషయార్థ ప్రతిపాదకశబ్దత్వము కలదు. అందుచే సమూహాలంబనజ్ఞానమునందలి 'పృథ్వీ గంధవతి అను వాక్యమునకుఁగూడ కావ్యత్వము ప్రసక్తమైనది.

ద్వితీయ లక్షణము

ఇట్లు అతివ్యాప్తిజుష్టమైన పూర్వోక్తలక్షణమును పరిహరించి లక్షణాంతరమును గ్రంథకర్త చెప్పినాఁడు. అది యిట్లు: "ఏ శబ్దప్రతిపాదితార్థమును గూర్చిన భావన నియత చమత్కారజనకమే యగునో అది కావ్యము. ('యత్ప్రతిపాదితార్థవిషయకం చమత్కారజనకతావచ్ఛేదకమ్ తత్త్వమ్".) సమూహాలంబనజ్ఞానమున శబ్దప్రతిపాదకార్థముల భావన చమత్కారాచమత్కారోభయసామాన్యజనకమైనది. అందుచే అతివ్యాప్తి యుప్పతిల్లినది. అట్లుగాక ఎట భావన కేవలచమత్కారార్థజనకమే యగునో, అచమత్కారార్థజనకము కానేకాదో, అట్టి విలక్షణభావనావిషయకార్థప్రతిపాదక శబ్దము కావ్యము అనిలక్షణము నిర్మించుటచే అతివ్యాప్తి తప్పినది. లక్షణము నిర్దుష్టమైనది.

కాని యత్తత్పదఘటితమై లక్షణము గురుభూతమైనదని, అర్థము సుకరముగ తటాలున బోధపడునట్లు విశేషణముల

నెల్ల సంబంధకోటిలో నైచి లఘురూపమున లక్షణాంతరము గ్రంథ
కర్త చెప్పినాఁడు.

తృతీయ లక్షణము

ఎట్లన, స్వవిశిష్టజనకతావచ్ఛేదకార్థప్రతిపాదక సంబంధమున-
చమత్కారవత్త్వము కావ్యత్వము అని, చమత్కారవంతము
కావ్యము అని ఫలితార్థము.

(శం) ఇట చెప్పఁబడిన సంబంధమునుగూర్చి శంక పొడమును.
చమత్కారము గుణము. (కావ్యరూపమున) శబ్దము సైతము
గుణము. అందుచే శబ్దమునందు చమత్కార మెట్లుండును? గుణ
మున గుణము సాక్షాత్సంబంధమున నున్నదని అంగీకృతము కాదు
గదా! ఇక పారంపర్య సంబంధమున నున్నదని చెప్పవలెను. ఏది
ఆ పారంపర్య సంబంధము?

(సమా) స్వవిశిష్టజనకతావచ్ఛేదకార్థప్రతిపాదకత్వము సంబం
ధము. ఇట స్వశబ్దముచే చమత్కారత్వజాతి గ్రాహ్యము. తద్వి
శిష్టములు చమత్కారములు వ్యక్తులు. జాతి వ్యక్తులకు సమ
వాయము సంబంధము. అలంకారకృత చమత్కారము, గుణకృత
చమత్కారము, రీతికృత చమత్కారము, వృత్తికృత చమత్కారము,
భావకృతచమత్కారము, రసకృతచమత్కారము- ఈ చమత్కార
వ్యక్తులం దెల్ల చమత్కారత్వజాతి సమవాయసంబంధమున నుండును.
ఆ చమత్కారమునకు జనకము భావన. భావన కావ్యార్థవిషయక
జ్ఞానరూపము. అందుచే చమత్కారమునకు కారణమైనది కావ్యార్థ
భావన. ఇట కావ్యార్థము భావనకు (కారణమునకు) విశేషణము-

(అవచ్ఛేదకము). ఆ కావ్యార్థావచ్ఛిన్నభావన కారణముయొక్క విశేషణమునకు కారణతావచ్ఛేదకమని శాస్త్రపరిభాష. ఆ కావ్యార్థమును ప్రతిపాదించునది శబ్దము. ఈ పారంపర్యసంబంధమున శబ్దాత్మకకావ్యమున నున్నది చమత్కారము. అనఁగా చమత్కారజనకమైన భావనకు గోచరమైన యర్థమును ప్రతిపాదించుశబ్దము కావ్య మని పిండితార్థము. (ఒండె సహృదయుఁడైనవానికి శబ్దప్రతిపాదితార్థభావనచేఁ గలుగు చమత్కారము కావ్యము.)

కావ్యానంద స్వరూపము

కావ్యముచే లోకోత్తరానందము లభించు ననికదా చెప్పఁబడినది. ఇట నొకప్రశ్న. మఱి ఈ కావ్యానందము సాతిశయమా? నిరతిశయమా? (అనఁగా దీనిని మించిన యానందముకలదా? లేక ఇదే అన్నిటికన్న పైదియా?) ఇది సాతిశయ మగునేని, వ్యక్తిభేదమునుబట్టి రుచిభేదమునుబట్టి భిన్నభిన్నానందములు లోకమందు అనేకనిమిత్తముల నుద్భవించునవి కలవు. అందిది యొక్కటి యగును. ఇదేమి గొప్ప? దీనికై ఎందుల కింత పెద్దప్రయత్నము? అటుకాక, నిరతిశయ మన్నచో, ఇది బ్రహ్మానందమేయగును. అది శాస్త్రాంతర ప్రతిపాదితమై యుండనే యున్నదికదా? దానికిఁ బ్రయత్నము చేయక, దీనికేల?

[సమా] మున్న చెప్పినారము, లోకోత్తరము ఈ కావ్యానందము, వైషయికమగు లౌకికానందముల కన్నను, నిర్విషయమగు బ్రహ్మానందమునకన్ననుం గూడ విలక్షణమైనదని. వాని రెంటికి మధ్యేమార్గమున వఱలును. అట్లు చెప్పబడినది.—

"సంసారేస్మిన్ సుఖం గ్రాహ్యం, దుఃఖం హేయ మితి స్థితిః
అతస్తు సుఖమూలంహి దుఃఖ మిచ్ఛన్తి నేతరత్

సుఖం, ద్విధైవ కథితం నిత్యానిత్య విభేదతః
నిత్యం తద్బ్రహ్మరూపం హి, అనిత్యం విషయోద్భవమ్

కేవలం యోగిభి ర్గమ్యం బ్రహ్మానందమయం విదుః
ప్రచారో విరల స్తస్య, లోకేస్మిన్ విషయోన్ముఖే

యత్సుఖం విషయోత్థం హి నానారుచి సమాశ్రయమ్
తదేవ బహుధా భిన్నం ప్రాప్నో త్యైవాతిసుందరమ్,

రసరూపం సుఖం యత్తు తద్ద్వయో రపి మధ్యమమ్,
అనిర్వాచ్యతయా యత్తు పూర్వాచార్యై ర్నిరూపితమ్

తస్మా దసారే సంసారే సారరూపో రసో మతః
యత్ర ప్రీతిః సువిపులా వర్ధతేహి దినే దినే

ప్రత్యక్షా ఇవ దృశ్యన్తే యత్ర రామాదయోపి చ
పారిజాతతరుచ్ఛాయా మాస్థితా కిన్నరస్త్రియః,

సురవారాంగనా యత్ర నృత్యన్తే భావభూషితాః,
విజృంభమాణ కిరణ విస్ఫురద్రత్న భూమయః,

ఏవం నియుద్ధం సుచిరం శరపాత భయంకరమ్,
అసత్రప్రత్యక్షతా మేతి సంస్రవచ్ఛోణితాకులమ్,

ఇత్థం విచిత్రా భావాస్తు హర్షోత్కర్ష ప్రదాయినః
నిమజ్జయన్తి మనుజాన్ నిస్సీమ సుఖసాగరే.

[రసరత్న ప్రదీపికా – ద్వితీయపరిచ్ఛేదః.]

ఈ జననమరణ ప్రవాహాత్మకమగు సంసారమునందు సుఖము ఉపాదేయము దుఃఖముహేయము, ఇది వస్తుస్థితి. అందుచే జగత్తు సుఖమూలము అన్యమును దుఃఖమును ఎవ్వరును గోరరు సుఖము ఇఱుదెఱంగుగఁ జెప్పఁబడినది – నిత్యము అనిత్యము అని నిత్యము బ్రహ్మరూపము, అనిత్యము విషయోద్భవ మైనది బ్రహ్మానందము యోగులకు మాత్రమే లభ్యము విషయములకై యువ్విళ్లూరు నీలోకమునందు దానికి ప్రచారము విరళము మఱి విషయసము ద్భవమైన సుఖమన్ననో భిన్నరుచుల నాశ్రయించినది అది అనేక విధముగా నున్నది పర్యవసానమున అది మిగుల అమనోహరము మఱి రసరూపసుఖ మేది కలదో, అది ఆరెంటికి నడిమిది దానిని అనిర్వాచ్యముగాఁ బద్దలు నిరూపించినారు. అందువలన అసార మైన సంసారమునందు సారరూపమైనది రసము అందు ప్రీతి సువిపు లముగా నానాఁటికి వర్ధిల్లుచున్నది రసాత్మకమైన కావ్యమునందు ప్రాచీనులు రామాదులు కనులయెదుట లేకున్నను ఉన్నట్లు చూపట్టుచున్నారు పారిజాతతరుచ్ఛాయలందు నెలకొన్నవారై భావభూషితలైన కిన్నరస్త్రీలును సురవారాంగనలును మన కనుల యెదుట నృత్య మొనర్తురు ఆ కావ్యభూములు విజృంభమాణ కిరణములతోఁ బ్రకాశించునట్టివి. నవరత్నమయములు అట్లే అచట శరపాతభయంకరమును సంస్రవచ్ఛోణిత సమాకులమును నైన నియు ద్ధము జరుగకున్నను జరుగుచున్నట్లే మన కనులకుఁ దోఁచును. ఇట్లు నానాభావములును చిత్రచిత్రములు కావ్యమునందు హర్షోత్కర్షప్రద ములు. మనుజుల నెల్ల నవి మేఱలుమీఱిన సుఖసాగరమున నోల లాడించును.

ఈ కావ్యానందము సర్వానందవిలక్షణము, పరమాహ్లాద కరము, లోకోత్తరము అయినను సవిషయమగుట కావ్యశీలనకాల

పర్యంతమే యుండును అందువలన నిర్విషయమును నిత్యమును అగు బ్రహ్మానందసబ్రహ్మచారి తత్కల్పము అని పెద్దలు చెప్పుదురు

ప్రాచీనోక్త కావ్యలక్షణఖండనము

ప్రాచీనులు (కావ్యప్రకాశకారాదులు మమ్మటభట్టప్రభృతులు) 'అదోషములు, సగుణములు సాలంకారములు నగు శబ్దార్థములు కావ్యము" అని కావ్యలక్షణము చెప్పిరి అది విచార్యము

లక్షణమున విశేష్యపరిశీలనము —

(1) "శబ్దార్థయుగళము కావ్యశబ్దార్థము ' అనుటకుఁ బ్రమాణము లేదు. మఱి అది సర్వవ్యవహారవిరుద్ధ మగును ఎట్లన కావ్యము బిగ్గఱగాఁ జదువఁబడుచున్నది. అర్థము ఎఱుకపడుచున్నది' అను మున్నగు సార్వజనీనములైన వ్యవహారములు కలవు (ఇట వినఁబడుచున్నది అనఁగనే శబ్దాత్మకమే అని సిద్ధమైనదికదా) ఆ వ్యవహారములు తప్పక ప్రమాణముగా నంగీకర్తవ్యములు వానిచే కావ్యము శబ్దార్థయుగళము అని ఏర్పడకపోవుటేకాదు తద్విపరీతముగా శబ్దవిశేషమే కావ్యము అని మును మాచెప్పిన యభిప్రాయమే సిద్ధమగుచున్నది

(౨) ఇఁక మామ్మటీయులు 'శబ్దార్థయుగళమే కావ్యము. మీా నుడివిన వ్యవహారములందన్ననో కేవల శబ్దమాత్రమునఁ బ్రయోగింపఁబడిన కావ్యమునకు లక్షణచే నిర్వాహము అని సమాధానము చెప్పనత్తురేమో వారికి నే మిట్లు ప్రతివచింతుము

(సమా) ముఖ్యార్థబాధయో తాత్పర్యానుపపత్తియో యున్నచోట అట్లు లక్షణచే నిర్వాహమునైతము కల్పింపవచ్చును అట్లు కల్పించిన స్థలములలో రూఢియో ప్రయోజనమో పొనరి యున్నట్లు ప్రమాణము వలయును అట్లే కావ్యపదార్థముగా పరాభిమతమైన శబ్దార్థయుగళమందు కావ్యశబ్దమునకు శక్తి (రూఢి) యున్నట్లు నిశ్చాయకమైన ప్రమాణ మొకండు (శబ్దమాత్రమందే రూఢి అని మా చూపిన ప్రమాణమునకన్న) దృఢతరము ఉన్నచో, అప్పుడు వారు కోరినట్లు లక్షణచే నిర్వాహము ఒప్పును. మఱి అట్టి దేదియుఁ గానము ప్రతిపక్షుల వాక్యము కానవచ్చుచున్నను దానిని అనుపపత్తి చూపి నిరాకరించితిమి కావున అదెట్లు మాకు ప్రమాణ ముగా సమ్మతమగును? ఇట్లు ప్రతివాదివాక్యము అశ్రద్ధేయముకాఁగా, కావ్యశబ్దమునకు శబ్దార్థయుగళమందు శక్తిగ్రాహకము ప్రమాణము లేకపోవఁగా కావ్యము బిగ్గఱగాఁ జదువఁబడుచున్నది యను మున్నగు పూర్వోక్తవ్యవహారములవలన శబ్దవిశేషమునందు (రమణీ యార్థ ప్రతిపాదకశబ్దమందు) సిద్ధించుచున్నట్టి కావ్యశబ్దంపుశక్తిని వారింప నెవనితరము ?

ఇట్లు వ్యవహారరూప శక్తిగ్రాహకప్రమాణముచే శబ్దవిశే షమునందే కావ్యమునకు శక్తి అని నిర్ణీతము కాఁగా వెండియు

వినిగమకములేదు కావున శబ్దార్థోభయమందునుంగూడ శక్తి అను పూర్వపక్షులవాదము ప్రత్యాఖ్యాతము వినిగమకము లేదని ఘోషింపనేల ? శబ్దవిశేషమునందే శక్తి అని మా చూపిన వ్యవహారాదివినిగమకము ఉండనే యున్నది

శక్తిగ్రహం వ్యాకరణోపమానకోశా ప్తవాక్యాద్ వ్యవహార
తశ్చ వాక్యస్య శేషాద్ వివృతే ర్వద న్తి సాన్నిధ్యతః సిద్ధపదస్య
వృద్ధాః

శక్తిగ్రహము వ్యవహారమువలనను వ్యాకరణమువలనను నిఘం
టువువలనను వాక్యవిశేషమువలనను వివరణమువలనను సన్నిధి
వలనను కలుగునని ప్రాజ్ఞులు చెప్పుదురు గదా!

ఇట్లు సర్వదా దానికే శబ్దవిశేషరూపకావ్యమునకే లక్షణము
చెప్పుట యుక్తము కాని, ప్రతివాదులు స్వయముగఁ గల్పించిన
శబ్దార్థయుగళరూపకావ్యమునకుఁ గాదు

వేదాదిసామ్యము

మెండియు శబ్దమే కావ్యపదార్థ మన మాకు యుక్త్యంతరమును
గలదు ఎట్లన వేదపురాణాదియందును ఇదే సరణి వేదము
శ్రుతము అర్థము అజ్ఞాతము ఇత్యాది వ్యవహారములఁబట్టి వేదాదుల
కును శబ్దవిశేషమునందే శక్తిని నిర్ణయించి వేదాదులును శబ్దాత్మకము
లని యంగీకరింపవలెను అట్లుగాక శబ్దార్థోభయ రూపముగ నంగీక
రించినచో వానికిని (శబ్దాత్మకముగా నంగీకరింపమిచే) కావ్యముపట్ల
నుప్పతిల్లిన వ్యవహారవిరోధాదిరూప దురవస్థ సంభవించును

'ఆస్వాదోద్బోధకము కావ్యము' అను వాదము యొక్క
ఖండనము.

[శంక] ఆస్వాదోద్బోధకత్వమే కావ్యప్రయోజనము ఈ
లక్షణము శబ్దమునందును అర్థమునందును సాధారణముగఁ బొల్చును

[సమా] అని శబ్దార్థోభయము కావ్యమని సమర్థింపఁ జాతు కేనియుఁ బొసఁగదు ఏలన ఉక్తలక్షణము అతివ్యాప్తి దోషజుష్ట మగును ఎట్లన, సంగీతశాస్త్రప్రతిపాదితమగు రాగమునకు రస వ్యంజకత్వము అనఁగా ఆస్వాదోద్బోధకత్వము - ధ్వనికారాది (3 ఉద్యో) సకలాలంకారాదిసమ్మత మగుటంజేసి ప్రస్తుత లక్ష ణముచే కావ్యత్వము ఆపన్నము కావలయును ఒక్క రాగమునకే కాదు నృత్తగీతాది వాద్యాది నాట్యాంగముల కన్నింటి కినిగూడఁ బ్రాయికముగ రసవ్యంజకత్వము కలుగుటంజేసి కావ్య త్వాతివ్యాప్తి దుర్వారనే. అది ధ్వనికారాదులకును ఇష్ట మన నేరము ఆలంకారికులయందు కావ్యత్వము శబ్దార్థేతరముల కను వారు లేరు.

కాని ఇట తత్త్వమేమనఁగా ఉక్తరాగాదికి రసోద్బోధకత్వము సర్వసమ్మతమేకాని కావ్యత్వముకాదు. ఏలన రసోద్బోధక మైనదెల్ల కావ్యము కానేరదు స్వప్రతిపాదితార్థవిషయకభావనావిశేష మూలమున శబ్దము రసోద్బోధకమగునో కాంతోపదేశసదృశోప దేశకము నగునో ఆ విలక్షణశబ్దగుంఫనరూపకవికర్మయే కావ్య మగును దీనంజేసి రసోద్బోధ సమర్థ మెల్ల కావ్యలక్ష్య మను వాదము పరాస్తము.

ఆంశికవాదనిరాశము

మఱియు, శబ్దార్థయుగళము కావ్యము అనువారలఁ గూర్చి మాకు ప్రష్టవ్యము కలదు ఏమన, కావ్యపదప్రవృత్తి నిమిత్తము (శక్యతావచ్ఛేదకము) 1 శబ్దార్థములు రెండింటికిఁ గలసి యొక్కటియా ? (వ్యాసజ్యవృత్తియా?) లేక 2 వేర్వేఱా?

(ప్రత్యేక పర్యాప్తమ్వా?) త్తొంటిది కాదు ఏలన అప్పుడు "ఏకో న ద్వౌ' (ఒకటి రెండు కాదు) అను వ్యవహారము వంటిది కావ్యవిషయమునను రావలసియుండును ఎట్లన రెండొకట్ల సము దాయమునకు రెండను వ్యవహారము కలదు ఆ సముదాయంపు టవయవములైన యే యొకటికిని రెండను వ్యవహారము లేనట్లే, ఇచ్చోటను శ్లోకవాక్యమునకుఁగాని శ్లోకార్థమునకుఁగాని కావ్యత్వ వ్యవహారము లేకపోవును. రెంటికిని కలిపి కావ్యమని వ్యవహరింప వలసి యుండునేకాని, ఆ సముదాయమున నవయవమైన వాక్య మాత్రమును గాని అర్థమాత్రమును గాని కావ్యమని వ్యవహ రించు టెట్లు కుదురును? పోనీ అవ్యాసజ్యవృత్తి యందమన్న ఒక పద్యమందే శబ్ద మొక కావ్యము అర్థ మొక కావ్యము- ఇట్లు కావ్య ద్వయవ్యవహారము రావలసియుండును. అది మాకు ఇష్టమే అని ప్రతివాదులు అందు రేనియు, అది పొసఁగదు ఏలన అప్పుడు 'ఏకం కావ్యమ్" (ఒక్కటికావ్యము) అను ప్రమాత్మకప్రతీతికి ఉచ్ఛేదము ఉప్పతిల్లును. ఇట్లు శబ్దార్థయుగళమునందు కావ్యపదప్రవృత్తినిమి త్తము రెండు తెఱంగులను అసాధ్యము

కావున వేదశాస్త్రపురాణాదులకుంబోలె కావ్యమునకు ప్రవృత్తి నిమిత్తము కేవల శబ్ద నిష్ఠముగనే చెప్పినట్లు కావ్యమున కును శబ్దాత్మకలక్షణమునే అంగీకరించుట ఉచితము. అందుచే మమ్మటాద్యుల లక్షణమున శబ్దార్థయుగళము కావ్యము అను విశేష్య దళము నిరస్తము.

ఇక విశేషణ దళములఁ గూర్చి విచారింపనగును

1 'సగుణములు' అను దళము కావ్యసామాన్యలక్షణమందు గుణాలంకారాది నివేశనముసైతము యుక్తముకాదు ఏలన (ఉదితం

మండలం విధోః) నిండు నెల పొడిచినది' (గతోఽ స్తమర్కః) ప్రొద్దు గ్రుంకినది' అను నిత్యాదివాక్యములకు అందు గుణాలంకారములు లేకపోవుటం జేసి కావ్యత్వము లేకపోవలసివచ్చును. కాని వానియందుఁ గావ్యత్వము లేదన శక్యపడదు ఏలన నిందు చమత్కారము లెన్నేని వక్తృవైశిష్ట్యముంబట్టి వక్ష్యమాణరీతిని ప్రస్ఫురించుచున్నవి ఎట్లన, ఆ వాక్యములు దూతి పల్కినవేని వెన్నెల వచ్చినది ఇఁక సంకేత స్థానమునకు పోయెదను' అని దూతి యొక్క యభిసరణవిధిరూపమైన వ్యంగ్యార్థము స్ఫురింపఁ జేయును అభిసారికమాటలేని 'వెన్నెల వచ్చినది ఇప్పుడు అభిసరింపఁబోయిన గుట్టురట్టగును కూడదు' అని యభిసారిక నాయికయొక్క స్వాభిసరణనిషేధరూపమైన వ్యంగ్యార్థము స్ఫురింపఁజేయును మఱి విరహిణియగు నాయిక మాటలేని నెలపొడిచినది ఇఁక నేను దీనిని ఓర్చి ఎట్లు బ్రదుకుదును' అని విరహిణీనాయికయొక్క జీవితాశాశూన్యరూపమైన వ్యంగ్యార్థము అభివ్యక్తమగును అట్లే సఖి మాటయేని నెలపొడిచినది ఇఁక నీపతి నిను వీడియుండ లేఁడు. వచ్చును" అని నాయికకు పతిప్రాప్తిరూప వ్యంగ్యార్థము ధ్వనితము. ఇట్లు వక్తృవైశిష్ట్యముంబట్టియు తత్తచ్చిత్తసరసవైశిష్ట్యమును బట్టియు(According to their apperception)భిన్న భిన్న వ్యంగ్యస్ఫూర్తి ఇట్టి వ్యంగ్యవైభవంపుఁ గలిమిచే పై వాక్యములు ఉత్తమకావ్యములని బట్టబయలగుచుండ అందు గుణాలంకారాదులు లేవని ప్రతిపక్షులు మొండొడ్డి దానిని అకావ్యమనఁ జొత్తురేని తదభిమతమైనదానిని గూడ నిజముగ కావ్యమనుట కాస్పదమున్నను అకావ్యమని హారముచేయ మాకును శక్యమే కావ్యజీవితము చమత్కారత్వము, గుణాలంకారాదిమత్త్వము కాదు ఆ చమత్కారము పై వాక్యములందు ధ్వనికృతమై విలసిల్లుచున్నది. అది గుణాలంకారము లున్న

ప్పుడును లేనప్పుడును అవిశిష్టముగఁ గావ్యమందుండును వీలన గుణాలంకారాదులకు అనుగమము లేదు అనఁగా అవి ఇవియని, యిన్నియని ఇచ్చటనే యుండునని స్వరూపసంఖ్యాస్థలాదులందు ప్రాచీన నవీనాలంకారికులకు వైమత్యము కలుగుటజేసి నిశ్చయింప రాకున్నది అందువలన గుణాలంకారాదులను కావ్యసామాన్య లక్షణమునఁ జేర్చుట సరికాదు

'అదోషము' : దోషమన స్ఫుటదోషమా ? కాదు. దోష సామాన్యమే

[శంక] అనుగమనము కలదు ('రసవృత్తిత్వే సతి రసోపయోగిత్వమ్ గుణత్వమ్ శబ్దార్థాన్యతరత్వే సతి పరంపరయా రసోపకారిత్వమలంకారత్వమ్) రసములందుండి సాక్షాద్రసోపకారకము లైనవి గుణములు శబ్దార్థములు రెంటిలో దేనియందేని యుండి పారంపర్యముగా రసోపకారకములు అలంకారములు - అని ప్రాచీన నవీన మతములంబట్టియు అనుగమము ఉండనే యున్నది అందుచే కావ్య లక్షణమున గుణాలంకారనివేశనమున బాధలేదు

[సమా]అట్లు ప్రతివాదులు వచింపఁజాలరేని, తదభిమతాను సారము అట్లే అనుగమ మున్నదని తుష్యతు దుర్జన' న్యాయమున అంగీకరించినను, అదోషములు ' (=అదోషౌ) అను విశేషణము నకు ఉపపత్తి కుదరదు అదోషములు శబ్దార్థములుకదా! అదోష మాత్రములైన కేవల శబ్దార్థములు (అన్యధర్మములతోఁ బనిలేక) కావ్యమని ప్రతివాదుల యభిప్రాయము కాదని సగుణాలంకారాది విశేషణము చెప్పుటచే స్పష్టముకదా! అందుచే 'గుణాలంకారాది విశిష్టమై నిర్దుష్టమగు శబ్దార్థయుగళమే కావ్యము" అని తదభిప్రాయ

మని తేటతెల్లము. అప్పుడును గుణాలంకారాదులు ఉన్నను దోషసామాన్య మున్నచో కావ్యత్వము లేదుకదా 'న్యక్కారో హ్యాయమేవ' ఇత్యాది సుప్రసిద్ధశ్లోకములందు వ్యంగ్యవైభవము తల పొల మంటియున్నను సర్వాలంకారికులును ఉత్తమకావ్యము లని ఉద్ఘోషించుచున్నను అందు విధేయావిమృష్టాద్యంశమందు దోషము కలదని కావ్యత్వము లేదనవలసినదేకదా లోకమందు ఏదోషము లేని కావ్యము అరిది కావున, ఇఁక కావ్యత్వవ్యవహారము అతి విరళ విషయమై పోవలసినదగును

అదియునుంగాక శబ్దార్థములకు 'అదోషములు' అను విశేష ణము నివేశించుటచేత దుష్టము కావ్యము' అను సార్వజనీన వ్యవ హారము కుదరకపోవును నిర్దుష్టమైన శబ్దార్థయుగళమే కావ్యమని మీ లక్షణముచే సిద్ధమగుటచేత

[శంక] దుష్టము కావ్యము అను చోట ముఖ్యార్థముకాదు కావ్యపదమునకు వివక్షితము గుణాలంకారమాత్రము కలది, దోష సహిత శబ్దార్థయుగళము కావ్యమువంటిది, అను లక్ష్యార్థము వివక్షి తము. కావ్యసదృశమందు లక్షణము.

[సమా] నిర్దోషమగు కావ్యార్థమందు 'సదోషము' అని లక్ష్యార్థము చెప్పుటకు ఇట హేతువు లేదు ముఖ్యార్థబాధ, ముఖ్యార్థ సంబంధము, రూఢి ప్రయోజనములలో నొకటి లక్షణా బీజమై వలయును. ఇట మొదలు కావ్యలక్షణమందు నిర్దోష' పదము ప్రయోగించుటకును, దానికి ముఖ్యార్థబాధ చెప్పుటకును బలవత్ప్ర మాణము లేదు కావున అట్లు సమర్థింపఁబూనుట వ్యర్థశ్రమ

[శంక] 'అదోషౌ 'అను శబ్దముచే వివక్షితము దోష సామాన్య రాహిత్యము కాదు, స్ఫుటదోషరాహిత్యమే అప్పుడు సామాన్య

దోషము లున్నను కావ్యత్వవ్యవహారభంగము రాదు స్ఫుటదోష మున్నదానికే అకావ్యత్వము. 'దుష్టకావ్య'మన్న వ్యవహారము నకును స్ఫుటదోషయుక్తకావ్యము' అని గతియుఁ గుదురును

[సమా]ఆ సమర్థనమును కుదురదు ఏలన 'స్ఫుటదోషము అనుచోట దోషమునకు స్ఫుటత్వ మననేమి?

[శంక] శాబ్దబోధప్రతిబంధకత్వము అనియే అర్థము. దానిచే, నిరాకాంక్షత్వము (ఆకాంక్ష లేమి) అనాసన్నత్వము (ఆసత్తి లేమి) వివక్షితములు అంతియకాని శాబ్దబోధము కలిగిన పిమ్మట కావ్యార్థము విచార్యమాన మగునప్పుడు పుట్టునట్టి దోష ములు - రసాదిదోషములు ఏవి కలవో - అస్ఫుటదోషములు అవి ఇట వివక్షితములు కావు ఇట్లు అదోషపదమునకు స్ఫుట దోషరాహిత్యమే వివక్షిత మనక దోషసామాన్యరాహిత్యమే అన్నచో 'దుష్టము కావ్యము' అను వ్యవహారము కుదరకపోవును అందుచే నేమట్లు వివక్షించుటలేదు ఇప్పు డన్నచో దుష్టము కావ్య మన్న అస్ఫుటదోషయుక్తము అని కుదురును అందువలన 'అదోషౌ శబ్దార్థౌ' అనుచోట కేవలస్ఫుటదోషరహితము లగు శబ్దార్థములు వివక్షితములు రసదోషరహితములు కాదు

[సమా] పైఁజెప్పిన పూర్వపక్ష వివక్షావాదమును సరి పడదు ఏలన అర్థ' శబ్దముచే వాచ్యలక్ష్యార్థములేకాక వ్యంగ్యార్థ మును గ్రాహ్య మగుటంజేసి తద్భేదమగు రసమునుంగూడ చెప్పిన దైనది అందుచే దోషశబ్దమునకు 'స్ఫుట'' దోషత్వకల్పనోద్యోగా భోగమును, రసదోషపరిహారోపాయమును నిరస్తములైనవి కాఁగా దోషశబ్దము లక్షణమున దోషసామాన్యవాచకముగనే నిల్చినది

6)

అంశభేదవాద నిరాసము

(శంక) ఓయీ 'దుష్టము కావ్యము' అను వ్యవహారమునకు అంశభేదమున నర్థము నిర్బాధకము అప్పుడు దోషశబ్దముచే స్ఫుట దోషమైనను అస్ఫుటదోషమైనను దోషసామాన్యమైనను గ్రహింప నగును ఎట్లన 'సంయోగాభావవద్వృక్షము సంయోగి' అనుచోట- సంయోగమువ్యాప్యావ్యాప్యవృత్తికావున-చెట్టుమొదటపిట్టయున్నది, శాఖయందులేదు అని యొక్క వృక్షరూపాధికరణమునందే మూల మున విహంగసంయోగమును శాఖయందు విహంగసంయోగా భావమును అంశభేదమున నున్నట్లే ప్రస్తుతమునను ఒక్కటే కావ్య మందు దోషముండుటచే కావ్యత్వాభావమును, కడమతావుల దోషాభావ ముండి కావ్యత్వసద్భావమును ఉండుటయు సుసంగత మగును అప్పుడు కావ్యము దుష్టము అను వ్యవహారమునకు 'కొంత దుష్టము' అని అర్థము కుదురును అందుచే కావ్యత్వము వ్యాప్యా వ్యాప్యవృత్తిగ (అనఁగా నొకభాగమున నుండి కడమ భాగములందు లేనిదిగ) గ్రహింపఁదగును

[సమా] ఉక్తవాదమును సరికాదు ఏలన వృక్షము చూచిన వానికి మూలమునందు వృక్షము విహంగసంయోగి శాఖయందుఁ గాదు అని జ్ఞానము కలుగును అట్లు దుష్టము కావ్యము అను వాక్యము విన్నవానికి ఈ పద్యము 'పూర్వార్థమునఁ గావ్యము ఉత్తరార్థమున నకావ్యము' అని ప్రతీతి కలుగవలయుఁగదా! అది సర్వసహృదయానుభవమునకు విరుద్ధము అందుచే దోషాభావము వ్యాప్యావ్యాప్యవృత్తి అని యెట్లు స్వీకరించుట? అవ్యాప్యవృత్తి అని సైతము సాధించుటెట్లు? అనఁగా కావ్యత్వము ఒక భాగమున లేదు. ఇంకొకభాగమునఁ గలదు అని ఒక భాగముననే కలదు అని యేవి

సాధించు టెట్లు ? అందుచే ఈ మార్గమునను కావ్యము దుష్టము అను వ్యవహారము ఎట్లును సరిపడుట లేదు.

మఱియు 'సగుణములు సాలంకారములు" అను విశేషణములు సైతము (అదోషత్వమునుంబోలె) కావ్యశరీరభూతమైన సామాన్య లక్షణమున నివేశించుట సరికాదు ఏలన లోకమునందు శౌర్యాదులు జీవాత్మధర్మములు హారాద్యలంకారములు శరీర మాత్రోపస్కారకములు అవి కరచరణాద్యవయవములు కావు అట్లే మాధుర్యాదిగుణములు కావ్యాత్మయగు రసముయొక్క ధర్మములు (ప్రయోజకములౌండె) అనుప్రాసోపమాద్యలంకారములు కావ్య శరీరమైన శబ్దార్థములకు శోభాజనకములు కావ్యంపుటాత్మధర్మములను శరీరభూతమైన శబ్దార్థముల విశేషణములుగాను శరీరోపస్కారకములైన యలంకారములను శరీరమున నవయవభూతములుగాను సామాన్యలక్షణమున నిబంధించుట అత్యంతము అసంగతము

ఇట్లు ప్రాచీనాలంకారికులు మమ్మటభట్టాదులు వచించిన కావ్యలక్షణము నిర్ణిక్తము కాదని తేటతెల్లము

సాహిత్యదర్పణోక్త నవీనకావ్యలక్షణఖండనము

మఱి నవీనాలంకారికుఁడు విశ్వనాథకవిరాజు సాహిత్యదర్పణమునందు "రసాత్మకవాక్యము కావ్యము" అని యే లక్షణమును నిర్ణయించెనో అదియు సరికాదు (అనఁగా రసాత్మకము కావ్యము కాదని కాదు అది ఉత్తమోత్తమకావ్య మని నేము అనుపదము నిరూపింపఁ బోవుచున్నారము రసాత్మకమే కావ్యమని తదితర మెల్ల కావ్యమే కాదనియు ప్రతిపాదించుట ఉచితము కాదని

మా యభిప్రాయము) ఏలన రసాత్మకము కానిదెల్ల అకావ్య మగుచో, వస్తు ప్రధానములు అలంకారప్రధానములు (వస్త్వలంకారవ్యంజకములు) సర్వ సందర్భములు (గ్రంథములు) కావ్యము కాకపోవలసివచ్చును అవి కావ్యములు కాకపోవుట మాకు ఇష్టమే ' అనరాదు. ఏలన అట్టిచో మహాకవి సంప్రదాయమునకు ఆకులీభావము (ఉచ్ఛేదము) ఏర్పడును. ఎట్లనగా నిజకావ్యములందు మహాకవులు జలప్రవాహవేగ పతనోత్పతనభ్రమణాదులను బాలకాదివిలాసములను (వస్తుమాత్రములను) వర్ణించినారు. వానికి సాక్షాత్తుగా సరసత్వము లేదు అందుచే ప్రస్తుత లక్షణానుసారము ఆ జలప్రవాహాది రచనలకు కావ్యత్వమే లేకపోవలసివచ్చును

[శంక] సాక్షాత్తుగా లేకున్నను పారంపర్యముగ వానికి

సద్భావశ్చేద్ విభావాదే ర్ద్వయో రేకస్యవా భవేత్
ఝటిత్యన్యసమాక్షేపే తదా దోషో న విద్యతే ॥

విభావాదులలో నొకదానియొక్కగాని రెంటియొక్కగాని సద్భావమున్నచో, అట్టితఱి ఆకస్మికముగా మఱియొకటి (జలప్రవాహాది వర్ణనము) సమాక్షిప్తమైనను అప్పుడు దోస మేమియునుండదు

అను నభియుక్తోక్తి చొప్పున రసస్పర్శ సిద్ధించును. కాదా కావ్యము మొత్తముమీఁద రసవ్యంజక మగునో దన్మధ్యపతిత నీరస వాక్యమునకును రసస్పర్శ యుండనే యున్నది అందుచే మా చెప్పిన కావ్యలక్షణమునకు నేగి లేదు

[సమా] అది సమాధానమేని అప్పుడు గోవు కదలుచున్నది జింక పరుగెత్తుచున్నది అను నీరసవాక్యములందును

మీ చెప్పిన కావ్యలక్షణము అతిప్రసక్తమగుటంజేసి వానికిని కావ్య త్వము సిద్ధింపవలసియుండును ఏలన అవి కావ్యాంతర్గతములే కావున కాదా అర్థమాత్రమైన దెల్ల విభావమో అనుభావమో వ్యభిచారి భావమో, ఏదో యొక బాదరాయణసంబంధమున కానే యగును అందుచే సాక్షాత్సంబంధముచే రసవ్యంజకవాక్యము కావ్యమై, పారంపర్యముగ ఏదో యొకరీతిని నీరసవాక్యమును కావ్యము కావలయుటంజేసి అతిప్రసక్తి తప్పదు అందుచే దర్పణోక్తమయిన లక్షణమును సమీచీనము కాదు

అందుచే మా చెప్పిన రమణీయార్థప్రతిపాదకశబ్దమే కావ్య మని పిండితార్థము

కావ్యహేతువు

విలక్షణ కవికర్మరూపమైన యీ కావ్యమునకుఁ గారణము (జనకము) కవిగతప్రతిభ యొక్కటే ప్రాచీనులు మమ్మటాదులు చెప్పినట్లు ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసత్రయసముదాయము కాదు ఆ ప్రతిభ కావ్యఘటనానుకూలశబ్దార్థోపస్థితి (ఝటితిస్ఫూర్తి) రూపము

[శం] అది కల దన నేమి ప్రమాణము ?

[సమా] అనుమానము ప్రమాణము. లోకములో అకారణ ముగా నేకార్యమును జనింపదు కావున కావ్యము నిష్పన్నమగుటకు సమవాయకారణ మేదేని వలయును కారణము కారణత్వధర్మ విశిష్టముగ (అవచ్ఛిన్నముగా) నుండును అది కారణమునందు మాత్ర ముండి కారణము కానిదానియం దుండనట్టి కారణసమనియత

ధర్మము - కారణతావచ్ఛేదకము మఱి యిచ్చోటను భిన్నభిన్న కావ్యముల నిష్పాదనమునకు కారణమైన ప్రతిభావ్యక్తులం దెల్ల సమవేతమై కావ్యకారణతావచ్ఛేదకముగా ప్రతిభాత్వ మను జాతివిశేషము అనుమానముచే సిద్ధించును అనుమానప్రయోగ మిట్లు.

కావ్యసమవాయకారణము కించిద్ధర్మావచ్ఛిన్నము కారణమగుటం జేసి,ఘటమునకుఁ గారణమైన దండమున నున్న కారణతవలె ఇట్లు అనుమానముచే ప్రతిభాత్వసిద్ధి జాతి యన ననేకానుగతమును నిత్యమునునగు నొక్క-ధర్మము కావున ప్రతిభాశాలులగు కవుల ప్రతిభలందెల్ల 'ఇది ప్రతిభ ఇది ప్రతిభ యను ననుగతప్రతీతి జనింపఁజేయు ధర్మాకారముగ సమవేతమైయుండును ప్రతిభాశాలియైనవాఁడే కావ్యమును రచింప వలంతి యని సిద్ధము. జాతి నిత్యము కావున ప్రతిభలు (ప్రతిభాశాలులు) పుట్టుచు గిట్టుచున్నను ప్రతిభాత్వమును కావ్యరచనయు నిత్యముగఁ గొనసాగుచుండునని యేర్పడినది కాని ప్రతిభాత్వమును జాతిగా నంగీకరించుటకై పలుప్రతిభావ్యక్తుల నంగీకరింపవలసి వచ్చినది అఖండోపాధిగా నంగీకరించిన పలు ప్రతిభావ్యక్తులతో నక్క-ఱ లేదు ప్రతిభాత్వావచ్ఛిన్నప్రతిభ యొకటే ఆకాశమువలె సర్వకావ్యజనకముగఁ జాలును ఇట్లు లాఘవము కలదు ఇంతటికి పిండితార్థము - కావ్యఘటనానుకూలమగు పదపదార్థములఁ గూర్చిన ఝటితిస్మృత్యాకార మగు ధీవిశేషము ప్రతిభానామకము ఒక్క-టే కావ్యమునకు నియతనిష్పాదకహేతువు

(౪౦) ఆ ప్రతిభ ఎట్లు కలుగును?

(సమా) 1 ఒకప్పుడు దేవతామహాపురుషాది ప్రసాదముచే జనించు నదృష్టము (పుణ్యము) చే ప్రతిభ పుట్టును. 2 ఒకొ్క-క

ష్వాను విలక్షణవ్యుత్పత్త్యభ్యాససముదయముచేఁ బుట్టును. నానా లోకవృత్త శస్త్రకావ్యేతిహాసాది పర్యాలోచనముచే జనించినట్టిది, కావ్యనిర్మాణనైపుణ్యాత్మకవిశేషజ్ఞానము వ్యుత్పత్తి. శయ్యా పరిపాక పర్యాప్తిపర్యంతము అవిరతశౌనఃపున్యమున కావ్యప్రవృత్తి అభ్యాసము. ఈ రెండింటిచేఁ గలుగు విశిష్టశక్తియు కొందఱకు కావ్యరచనా జనకప్రతిభను పుట్టించును ఈ రెండు ప్రత్యేకకారణములలో నేదే నొక్కడాన ప్రతిభ జనించును అంతేకాని ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసము- యీ మూడును కలిసియే కావ్యజనక మగునని నియమములేదు

(శం) ఇట ప్రతిభకు దేవతామహాపురుషప్రసాదరూపాదృష్ట హేతు వేల కల్పింపవలెను?

(సమా) ఏలన, బాలకాదులందు విలక్షణ వ్యుత్పత్త్యభ్యాసములు లేకయే ప్రతిభ ఉదయించుట చూపట్టుచున్నది బాలురు కావున లోకశాస్త్రాద్యవేక్షణాత్మకమును వ్యుత్పత్తిని సంపాదించుటయు చిరతరకావ్యకరణాభ్యాసము చేయుటయు అసంభవ మని స్పష్టముకదా వారును ఉత్తమకావ్యములు రచించుట చూతుమే! ఎట్లు వారికి ప్రతిభ కలిగినది? ఏదేనియుఁ గారణము ఉండక తప్పదు కదా! అకారణముగ ప్రతిభ పుట్టుననుచో లోకములో నేల నెల్లరయందు దది పుట్టుటలేదు? ఎల్లరు ఏల వ్యాసకాళిదాసాదులవంటి కవిపరివృఢులై అట్టి కావ్యరత్నముల సంతరించుటలేదు? అందువలన నిచ్చోట దేవతామహాపురుషాదుల యనుగ్రహముచే నుత్పన్నమైన పుణ్యవిశేషము—అదృష్టము హేతువుగాఁ జెప్పుట ఉచితము.

అట్టి ప్రాక్తనపుణ్యప్రాగ్భారప్రాదుర్భూతము ప్రతిభను పెద్దలు ఇట్లు ప్రస్తుతించి యున్నారు

'న నామ్నా మావృత్త్యా పరిచయవశా చ్ఛందసి న వా,
న శబ్దవ్యుత్పత్త్యా నిభృత ముపదేశా న్న చ గురోః
అపి త్వేతాః స్వైరం జగతి సుకవీనాం మధుముచో
విపచ్యన్తే వాచః సుకృతపరిణామేన మహతా"

(అలంకార మహోదధి పుట-౫)

సుకవి వాక్కులు నిఘంటు పదములను ఏకరువు పెట్టుటవలన గాని ఛందస్సుల పరిచయముచేఁగాని శబ్దవ్యుత్పత్తిచేఁగానిఁ గొప్ప గురూపదేశముచేఁగాని ఫలించుటలేదు అవి స్వేచ్ఛగా గొప్ప సుకృత పరిణామము చేతనే మకరందస్యందులై ప్రకాశించుచున్నవి

[శం] వ్యుత్పత్త్యభ్యాసరూపమైన దృష్టహేతువును గాక పై పెచ్చు మఱియొకదానిని ప్రతిభకు అదృష్టహేతువు నంగీకరించుటకన్న (నాస్తిక రచిత గ్రంథములందు మంగళము లేకున్నను సమాప్తి చూపట్టుటంజేసి యుప్పతిల్లిన కారణము లేకయు కార్యము పుట్టుట అను హేతుదోషము) వ్యభిచారమును వారించుటకై జన్మాంతరమున తత్కృతమంగళము కల్పించి (అనుమానించి) గౌరవమును సహించినట్లే, ఇచ్చోటనుంగూడ ఆ ప్రతిభాశాలులైన బాలకాదుల పట్ల తజ్జన్మాంతరీయవ్యుత్పత్త్యభ్యాససముదాయమునే కారణముగా గల్పించుట మేలుకదా?

[సమా] అది పొసఁగదు ఏలన అందు గౌరవము కలదు ఇహజన్మసంబంధహేతు వొకటి దేవతాద్యనుగ్రహపుణ్యరూపము ఇట సంప్రతిపన్నముగా నుండఁగా దానిని కాదని జన్మాంతరీయ హేతుకల్పనక్లేశ మేల? మంగళమునకును సమాప్తికిని కార్యకారణ భావ మన్ననో పూర్వమే శ్రుతిస్మృత్యాదిప్రమాణసిద్ధమై యున్నది

ఆ నిశ్చయజ్ఞాన మున్నప్పుడు, దృష్టకారణము లేనప్పుడు జన్మాంతరీయ మంగళరూపకారణానుమానము యుక్తము ఇచ్చట అట్టి నిశ్చయజ్ఞానములేదు లేకయు అట్లు కల్పింపఁ బాల్పడినను జన్మాంతరీయవ్యుత్పత్త్యభ్యాసరూపహేతు వున్నదన నేమిప్రమాణము? అది యటుండఁగాక, ఇట్లు జన్మాంతరీయహేతుకల్పన మైనను కార్యము అన్యథా అనుపపన్నమగునో అగతికముగ కల్పింపఁబడును ఎట్లన విపశ్చిల్లోకమున శ్రుత్యాదిరూపబలవత్ప్రమాణముచే కార్యకారణభావమునుగూర్చి నిశ్చయాత్మకజ్ఞానము పూర్వసిద్ధమై యుండఁగా పిమ్మట నుపస్థిత మైనట్టి వ్యభిచారమును వారించుటకై అన్యథానుపపత్తిసహకృతజన్మాంతరీయకారణము ధర్మాఽధర్మాదిలక్షణము కల్పింపఁబడును లాఁతిచో- అనగా బలవత్తరశ్రుత్యాదిప్రమాణముచే ముం దేతన్నిర్ణయము లేనినాఁడు తత్సహకృతప్రమ లేకపోఁగా, వ్యభిచారము ఉపస్థితమగుడు జన్మాంతరీయకారణతానిర్ణయమునకుం గడంగునో (అనుమానసామగ్రిలోపముచే ప్రమ కలుగకపోఁగా భ్రమయే కల్గును మఱేప్రయోజనమును చేకూరదు అందుచే నట్టికల్పనము అప్రామాణికము కూడదు

(శం) పోనీ, ఈ కల్పనము లేవియు నక్కఱలేదు జన్మాంతరీయము కానీ ఇహజన్మీయము కానీ. వ్యుత్పత్త్యభ్యాసములు మొదలే మాని ప్రశస్తముగా నున్నట్టి యా యదృష్టకారణ మొక్కటే చెప్పరాదా? లాఘవము పొసఁగునే!

(సమా) అది సంప్రతిపన్నముకాదు అట్లు కేవలము అదృష్టమే కారణమనుట అనుభవవిరుద్ధము. ఏలన ఎంతెంత కాలమో కావ్యము సంతరింప శక్తిలేనివారై యుండి వెనుక ఎట్లట్లో

(నిరతవిద్వత్సేవ చేసి ఎన్నెన్నో గ్రంథములు చదివి) ఎంతెంతో శ్రమపడి వ్యుత్పత్త్యభ్యాసముల నలవఱచుకొన్నవారు దానం జేసి ప్రతిభ పుట్టగా పెద్దతనమున (వార్ధకమున) నెప్పుడో కావ్య రచనము చేయుటయుఁ జూచుచున్నారము వీరల ప్రతిభకును అదృష్టమే కారణమని అంగీకరింతమన్న ఆ యదృష్టము ఆ వ్యుత్పత్త్యభ్యాస నిమిత్తము చేకుఱుటకు ముందును ఉన్నదేకదా ఆ నిమిత్తము కలుగుదాఁక అది ప్రతిభను పుట్టింపకపోవు టేల? ఇట అదృష్టమున్నను ప్రతిభ పుట్టలేదన్నచో అన్వయవ్యభిచారము — కారణమున్నను కార్యము పుట్టమి - ఎట్లు పరిహార్యమగును?

(శం) ఎట్లన ఆ పెద్దల ప్రతిభకు తగ్‌వ్యుత్పత్త్యభ్యాసముల కన్న ముందటిదైన యదృష్టమే వ్యుత్పత్త్యభ్యాసములు హేతువు కాదు అది అంతకాలము ప్రతిభను పుట్టింపనికి కారణము పాపరూపము అదృష్టాంతరము ప్రతిబంధించుటే అని కల్పింతుము కార్యోత్పాదకసామగ్రిలోఁ బ్రతిబంధాభావమును కలదుకదా! ఎట్లో ఆ ప్రతిబంధము నశింపఁగా తొంటి యదృష్టముచేతనే ప్రతిభ పుట్టినది

(సమా) ఈ వాదమును సరిపడదు ఏలన అనేక స్థలములలో రెండదృష్టములు కల్పించుటయందు వ్యర్థగౌరవక్లేశము అది యిట్లు: (1) ప్రతిభాజనకము పుణ్యరూపాదృష్టము (2) తత్ప్రతిబంధకము పాపరూపాదృష్టము (3)తత్ప్రతిబంధకధ్వంసకము కార్యోత్తేజకము వ్యుత్పత్త్యభ్యాసరూపనిమిత్తము - ఇన్ని కల్పనలు చేసిననే ప్రతిభకుఁ గారణత్వము కుదురును తొలిది పుణ్యరూపాదృష్టము, మలిది వ్యుత్పత్త్యభ్యాస నిమిత్తము ముందే అంగీకృతములు (క్లప్తములు)

ఉభయవాదిసమ్మతములును ఇవిగాక పూర్వపక్షులు రెండవ యదృష్టమును అధికముగ కల్పింపవలసియున్నది అందుచే వారికి కల్పనాగౌరవము అనివార్యము మాకన్ననో ప్రతిబధ్యప్రతిబంధక భావకల్పనక్లేశము లేక పూర్వసిద్ధములైయున్న (క్లృప్తములైన) వ్యుత్పత్త్యభ్యాసములై యున్న వ్యుత్పత్త్యభ్యాస సముదయమునకే కారణత్వము అంగీకరించుటంజేసి లాఘవము కలదు అందుచే పూర్వోక్తరీతిని ప్రతిభకు అదృష్ట మొకచోటను వ్యుత్పత్త్యభ్యాసములు రెండును కొండొకచోటను కారణమని యొప్పుట లెస్స ఇట్లు వేఱుగా తృణారణిమణిన్యాయమున రెండుకారణములచేతను ప్రతిభ జనించును

[శం] ఒక్క కార్యమునకు (ప్రతిభకు) రెండు కారణములు ఒప్పుటంజేసి అందేదియు హేతుతావచ్ఛేదకము హేతుత్వసమనియతధర్మము-నియతహేతువు కాకపోవును

[సమా] అట్టి యాశంకకు తావులేదు ఏలన రెండు కారణముల చేతను వైలక్షణ్యరహితమగు నొక్కటే కార్యము నిష్పన్నమగునేని ఉక్తవ్యభిచారదోషము ఉప్పతిల్లక తప్పదనుట సరి కాని ఇట విశేషము కలదు ఏమన కేవలాదృష్టజన్యప్రతిభ వేఱు (కేవల వ్యుత్పత్త్యభ్యాసజన్యప్రతిభ వేఱు అదృష్టజన్యప్రతిభకు వ్యుత్పత్త్యభ్యాసములు కారణముకాదు అట్లే వ్యుత్పత్త్యభ్యాసజన్యప్రతిభకు అదృష్టము కారణముకాదు) ఇట్లు రెంటికిని వైలక్షణ్యమున్నది

[శం] ప్రతిభాత్వము కవితకు నియతకారణముకదా అదృష్ట జన్యము వ్యుత్పత్త్యభ్యాసజన్యము అను నిఱు తెఱంగు ప్రతిభచేతను

కావ్యము పుట్టును ఇట్లు ఒక్క కార్యమునకు రెండు కారణములు చెప్పవలసినది అని మఱల వ్యభిచారము తప్పలేదు

[సమా] అట్లుకాదు ఏలన తొల్లి కారణములకు వైలక్షణ్యము అంగీకరించినట్లే ఇప్పుడు కార్యములకును వైలక్షణ్యము అంగీకరింతుము అదృష్టహేతుక(జన్య)ప్రతిభచేఁ బుట్టు కావ్యము వేఱు వ్యుత్పత్త్యభ్యాసహేతుక(జన్య)ప్రతిభచేఁ బుట్టు కావ్యము వేఱు ఇట్లు వైలక్షణ్యము కార్యకారణములకు ఉభయత్ర అంగీకరించుటం జేసి విలక్షణప్రతిభచే విలక్షణకావ్యోత్పత్తి సిద్ధమైనది

[శం] ఇంత శ్రమపడి వ్యుత్పత్త్యభ్యాసములకు ప్రతిభాకారణత్వము మీరు సాధించినదియు నిష్ఫలము ఏలన లోకములో వ్యుత్పత్త్యభ్యాసము లున్న చోటులనెల్ల ప్రతిభ నియతముగ నుదయించుటలేదు అందుచే వ్యభిచారము ఉప్పతిల్లినది

[సమా] అట్లనరాదు ఏలన విలక్షణ 'ప్రతిభావ్యుత్పత్తులే కదా ప్రతిభకు నియతకారణ మంటిమి ఏ వ్యుత్పత్త్యభ్యాసములు నియతముగ ప్రతిభోత్పాదకములో అవే వివక్షితములు అదే తద్వైలక్షణ్యము మఱి ప్రతిభాజనకములు కావని మీరు చెప్పిన యుదాసీన వ్యుత్పత్త్యభ్యాసము లేవి కలవోఁ అవి విలక్షము లనఁ బ్రమాణములేదు కావున అవి నియతప్రతిభాజనకములు కావని భావము

[శం] ఓయీ అదృష్టజన్యప్రతిభ కార్యోత్పాదకముకాని పాపరూపప్రతిబంధకముచేత గాని, కారణాసామర్థ్యముచేఁ గాదు కొండొకచోట నీ చెప్పిన వైలక్షణ్యము (అదృష్టసహకృతత్వరూపము) ఉండియు ప్రతిభ పుట్టుటలేదు

[సమా] నీవు అట్లు అరుచి చూప కొరంకొన్నను వ్యభిచార వారణోపాయము అన్యము మాకు కలదు ఏలన అట కార్యము పుట్టకపోవుటకు కారణసామర్థ్యలోపమునఁ గాదు అచ్చట మహత్తర పాపరూపాదృష్ట - అగ్నిదాహనశక్తిని (చంద్రకాంత) మణి సమవధానముంబోలె - ప్రతిబంధించుటంజేసి ప్రతిభపుట్టుటలేదు అని యేని కల్పించుట దోషముకాదు

[శం] కల్పనాగౌరవము కలదుకదా !

[సమా] లేదు ఏలన ఇది మేము గతిలేక ఇచ్చోట ఇందు లకై క్రొత్తగా కల్పించుకొన్నదికాదు కార్యోత్పాదనమును గూర్చి ప్రతిబంధకాభావముకూడ (సామాన్య) కారణముగ నంద ఱును అంగీకరించినదే అంతియకాక కావ్యోత్పత్తికి శక్తి నిపుణత అభ్యాసము అను మూడింటిని సముదితకారణములుగా నొప్పినట్టి యా మమ్మటాదులకును శక్తిమాత్రవాదులకు అన్యులకును ఏత దంశమున మాతో మతభేదములేదు ఆ విషయ మటుండుఁగాక ప్రతి బంధకాభావము నొప్పక ఆ ప్రతివాదులకును శక్యమా? చూడుఁడు అనేకకావ్యములు రచించినవాఁడేని - ప్రతివాదిచేసిన మంత్రాది ప్రయోగ కారణమునఁ గొన్ని దినములపాటు వాక్స్తంభనముపాలై అంతకాలము కావ్యరచనము చేయలేకపోవుట చూచుచున్నారము కదా బహుగ్రంథకరణముచే శక్త్యాదిమంతుఁడే అని సిద్ధము వాక్స్తంభనముచే తచ్ఛక్తి ప్రతిబద్ధ మాటయు స్పష్టము. అది తీరిన పిమ్మట శక్త్యాదిచే కావ్య ముత్పాదింపఁజేయుటయుఁ దెల్లనే ప్రతి వాదులును ఇచ్చోట ప్రతిబంధకమును ఒప్పక తీరదుకదా! మాకును అంతియ కల్పనాగౌరవము అధికములేదు

ఇట్లు కావ్యమునకు విలక్షణప్రతిభ యొక్కటే కారణమని ఆ ప్రతిభ ఒకచో అదృష్టజన్య మగునని మఱొకచో విలక్షణ వ్యుత్పత్త్యభ్యాసజన్య మగునని సిద్ధాంతము

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అధి 7 కావ్యభేదములు.

ఆ కావ్యము (1) ఉత్తమోత్తమము (2) ఉత్తమము (3) మధ్యమము (4) అధమము అని నలుతెఱంగు అందు ప్రథమము [ధ్వని కావ్యము] ఏకావ్యమునందు శబ్దార్థములు తాము గుణీభూతములై - అనఁగా వ్యంగ్యార్థమున కన్న నప్రధానములై - ఒకానొక నిరతిశయచమత్కారనిధానమైన యర్థమును వ్యంజనావృత్తిచే అభివ్యక్తము చేయునో అది ఉత్తమోత్తమ కావ్యము [ఇట వ్యంగ్యార్థముది సర్వప్రాభవము కొండొక వ్యంగ్యార్థమునకుం గూడ అది విధేయముకాక సమ్రాట్టునుం బోలె సర్వస్వతంత్రముగ సముల్లసిల్లును]

పైలక్షణమున ఒకానొక (నిరతిశయచమత్కారనిధాన మైనట్టి) అనుటచే(గుణీభూతవ్యంగ్యప్రకారములైన) అతిగూఢవ్యంగ్యము అతిస్ఫుటవ్యంగ్యము అను నీ రెండును నిరస్తములు అనఁగా వానియందు లక్షణమునకు అతివ్యాప్తి లేదు ఏలన వ్యంగ్యార్థము అతినిగూఢముగ సహృదయులు క్లేశపడి తెలిసికొనఁదగి (ఘూర్జరీకుచయుగ క్రియ) ఉన్నను, లేక [ద్రావిడీ(కేరళీ)స్తనగతి] మిక్కిలి తేటతెల్లముగా నున్నను చమత్కారము ఉండదు అది 'అరచాటగు నాంధ్రవధూటి చొక్కపుంజనుగవ లీల' శబ్దార్థములచే పిహితముగను అపిహితముగను ఉన్ననే చమత్కారసముల్లాసము 'శబ్దార్థములు తాము గుణీభూతములై' అను దళముచే గుణీభూతవ్యంగ్య

ములలో నొకండైన యసుందరవ్యంగ్యనిరాసము ధ్వనిత మగును అందుచే తొంటిదళముచే పై రెంటి వ్యావృత్తినే కంఠము క్రముగఁ జెప్పుట ఏలన శబ్దార్థములు అసుందరవ్యంగ్యమున గుణీభూతము లునుం గావు చమత్కారవంతములునుం గావు అచట వాచ్యార్థ చమత్కారమే తెలుపున సహృదయసంవేద్యమగును వ్యంగ్యార్థ మున్నను చమత్కారవిధురముగ నుండును ఉక్తవిశేషణముచేతనే చమత్కార మున్ననుంగూడ గుణీభూతప్రభేదములు అపరాంగ వ్యంగ్యము వాచ్యసిద్ధ్యంగము వెలార్పబడినవి ఎట్లన అపరాంగ వ్యంగ్యమున వ్యంగ్యము అన్యవ్యంగ్యమునకు అంగ మగుటంజేసి ప్రధానముకాదు వాచ్యసిద్ధ్యంగవ్యంగ్యమున వ్యంగ్యము వాచ్యా ర్థంపు టన్వయసిద్ధికి ఉపకారకమగును - అంగమగును అందుచే వ్యంగ్యమునకు ప్రాధాన్యములేకపోవుటే కాక వాచ్యమునకు ప్రాధాన్య మును కలుగును గుణీభూతవ్యంగ్యములలో శేషించినవానికి - కాక్వాక్షిప్తవ్యంగ్యము, సందిగ్ధ ప్రాధాన్య వ్యంగ్యము తుల్య ప్రాధాన్య వ్యంగ్యము అనువానికిని - అపరాంగవ్యంగ్యము ఉపసంగ్రాహకము దానిచే అవెల్ల నిరస్తము లని భావము ఇట్లు ఈ లక్షణమునకు గుణీభూత వ్యంగ్యప్రకారములందు అతివ్యాప్తి లేదు ఈ యుత్తమోత్తమ కావ్యమున వ్యంగ్యము వాచ్యలక్ష్య వ్యంగ్యములలో దేనికిఁగాని అంగముగా నుండక అత్యంతప్రాభవ ముతో విలసిల్లవలయునని యభిప్రాయము

ఉదా : ఒకానొక నవోఢవృత్తాంతము వర్ణింపఁబడుచున్నది.

శయితా సవిధేఽప్యనీశ్వరా
సఫలీకర్తు మహో మనోరథాన్
దయితా దయితాననాంబుజం
దరమీలన్నయనా నిరీక్షతే

సెజ్జపై పజ్జనే పరుండియు తనకోర్కె తీర్చుకొననేరక అర మోడ్పుగనులది ప్రియురాలు అహో దయితుని ముఖకమలమును అట్టె నిరీక్షించుచున్నది

ఇక్కడ నాయకుఁడు ఆలంబనవిభావము సెజ్జలో పజ్జనఁ బరుండుట ఏకాంతస్థానము మున్నగునవి ఉద్దీపనవిభావములు దరమీలాలన్నయననిరీక్షణము అనుభావము దర' (ఇంచుక) శబ్దముచే నభివ్యక్తము త్రపయు నిరీక్షణశబ్దాభివ్యక్తము ఔత్సుక్యమును వ్యభిచారిభావములు వీనియన్నింటి సంయోగముచే నాయకుని యందలి (నాయకాలంబనకమగు) నాయికాగతరతి ఉపచితమై సంభోగశృంగారరసీభావ మొంది ప్రధానముగ నిట సహృదయ హృదయములకు ఆస్వాద్యమాన మగుచున్నది ఇట వాచ్యవాచ కములకు గుణీభావము (అప్రాధాన్యము) అందుచే ఇది ఉత్త మోత్తమ కావ్యోదాహరణము


ఆలంబనాదుల స్వరూపము మున్ముందు చెప్పఁబడును మఱి ఇచ్చోటఁ గొందఱు రతివ్యంగ్యత్వమును ప్రధానముగా నొప్పక 'అతఁడు నిదురించిన నే నతని మోమ్ము ముద్దుగొందుఁ గాక'' అను నాయికేచ్ఛామాత్రము వ్యంగ్యము అని ఉగ్గడింతురు అది సరిపడదు చుంబనేచ్ఛ ప్రధానవ్యంగ్యము కాదు 'మనో రథాన్' (కోర్కెలను) అను బహువచనముచే చుంబనేచ్ఛ యొక్కటేకాక ఆ లేమ హృదయమందున్న మనోరథములెల్ల ఎఱుకపడుచున్నవి అవి యేవియో విప్పి విశేషించి శబ్దములచేఁ జెప్పక సామాన్యముగ మనోరథములు' అని వచించుటచే కడమ మనోరథములతోఁబాటు చుంబనేచ్ఛయు వ్యక్తమే.

[శం] అట్లైననుంగూడ మనోరథపదముచే మనోరథత్వా కారమున మనోరథసామాన్యము వాచ్యమైనను 'చుంబింతును' అను చుంబనేచ్ఛ (విశిష్టేచ్ఛ) వ్యంగ్యమగుట కేమి బాధకము ?

[సమా] ఏది బాధక మనఁగా చమత్కారము లేకపోవు టొక్కటే బాధకము ఏలన విశేషాకారమున (విశేషధర్మావచ్ఛిన్న ముగ) వ్యంగ్య మయ్యు సామాన్యాకారమున వాచ్య మగు నర్థము సహృదయులకుఁ జమత్కృతి గొలుప సమర్థకముకాదు (ఏలన వ్యంగ్యచమత్కారోత్పాదనసామర్థ్యము వాచ్యసంబంధముచే తగ్గి పోవును) అందువలన ఏవిధముగను - సామాన్యరూపమునఁగాని విశేషరూపమునఁగాని - వాచ్యవృత్త్యనాలింగిత (అబోధిత) మైనట్టి వ్యంగ్యమునే అత్యంతచమత్కారవంతముగా ఆలంకారికులు అంగీక రించినారు ప్రకృతమున నన్నునో చుంబనేచ్ఛయు ఇచ్ఛయే కావున అది వ్యంగ్య మయ్యు మనోరథపదముచే బోధితమగుటచేత (అచమ త్కారి వాచ్యవృత్త్యాలింగిత మగుట గుణీభూతమైనది అది ప్రధాన వ్యంగ్యచమత్కారాతిశయము నుత్పాదింప నేర దని నిగ్గు

మీఁదుమిక్కిలి వ్యంగ్యమును వాచ్యమైనస్ఫుట వమనాఖ్య దోషముగఁ బ్రాచీనులు పరిగణించినారు ఆ దోసం గటుండుఁగాక చుంబనేచ్ఛ ప్రధానవ్యంగ్యము కాదని రతియే ప్రధానవ్యంగ్య మనుటయే లెస్స ఎట్లన చుంబనేచ్ఛ రతికి ఫలముకదా రతిలేకున్న అది యుండదు అందుచే చుంబనేచ్ఛ రతికి అనుభావముగ వ్యజ్య మాన మైనప్పుడే రమణీయము అట్లు వ్యంగ్యముగాఁగాక కేవలము 'నే నితన్ని చుంబింతును' అనుశబ్దముల వాచ్యార్థముగ అది యుపస్థిత మగునేని చమత్కారవంతము కాకపోవును అందుచేతఁ దొలుత రతికి

8)


Sundarayya ... Kendram
Library
Ac. No ...
Hyd... 044.

(శృంగారమునకు) ప్రధానవ్యంగ్యత్వము ఒప్పి తదనుభావముగా (అంగముగా) గుంబనేచ్ఛ వ్యజ్యమాన మగునని అంగీకరించుట ఉచితము అట్లే త్రపయు ప్రధానవ్యంగ్యము కాదు దరమీలన్నయనా" అను విశేషణముచే అభివ్యక్త మగుచున్నది దానికి ప్రాధాన్యములేదు ఏలన ప్రాధాన్యము వాక్యతాత్పర్యవిషయత్వ (ముఖ్య) సంబంధము కలదానికే ఇట త్రపకన్నో అట్టి సంబంధము లేదు ఏలన అది పై వాక్యములో విధేయము (Predicate కాదు దరమీలన్నయనాత్వము విధేయము నిరీక్షణరూప వాచ్యార్థముతో అనువాద్యము (ఉద్దేశముగ) (Subject) గ నన్వయమును బొరయు చున్నది (పూర్వసిద్ధ మైనట్టి యర్థము విశేషణోపస్థాపితమై వాక్యము యొక్క ముఖ్యార్థముతో (విధేయముతో) నన్వయమును బొంది అనువాద్య మనఁబడును) అందువలన నట్లు అనువాద్యముగా వ్యంగ్య మగుదానికి, త్రపకు ప్రాధాన్యము లేదు.

[శం] మఱి త్రపను అనువాద్య మనక, దానిని కూడ విధేయ కోటిలోఁ జేర్చి దరమీలన్నయనాత్వ విశిష్టనిరీక్షణము ' అని చెప్ప రాదా ? అప్పుడు దానికి ప్రాధాన్యము వచ్చునుగదా

[సమా] అప్పుడును త్రపకు ప్రాధాన్యము దుస్సాధనమే ఏలన నయనగతదరమీలనత్వము త్రపాకార్యమైనను దరమీలన్నయనాత్వ విశిష్ట నిరీక్షణము కేవలరతికార్యమే యగును త్రపాకార్యము కానే కాదు అందుచే నిరీక్షణాభివ్యక్తరతికే ప్రాధాన్యము

[శ్లో] పోనీ దరమీలన్నయనాత్వమాత్రమే విధేయ మగుఁ గాక సమగ్రవిధేయదళము వ్యంగ్య మగుటంజేసి త్రపకు ప్రధాన వ్యంగ్యత్వము సిద్ధించును.

(సమా) అట్టిచో నిరీక్షణమునకుఁ జరితార్థత యుండదు. కవికిఁ ద్రపనే ప్రధానముగా నభివ్యక్తముచేయుట అభిమతమేని దర నయననిమీలనముమాత్రమే చెప్పియుండును. ఏలన అంతటితోడనే తదభిమతము (త్రప) సిద్ధించునుగదా. అట్లుగాక, నిరీక్షణమువఱకు అధికోపాదానము చేయుట కేమి ఫలము? కావున ఆ పక్షము సరి కాదు రతికిఁ గార్యముగాఁ దద్వ్యంజకమును నిరీక్షణమును చెప్పుటం జేసి కవి యభిమతము ప్రధానముగా రతియే వ్యంగ్యమని చెప్పుటే కాని, త్రపను ప్రధానవ్యంగ్యముగాఁ జెప్పుట కానేకాదని తేట తెల్లము

(శం) ఓయీ, విధేయకోటియందు విశేష్యవిశేషణభావము తాఱుమాఱు చేసి 'నిరీక్షణవిశిష్ట దరమీలన్నయనాత్వమే' విధేయ మనరాదా? అప్పుడు నిరీక్షణమునకు వైయర్థ్యము లేదు. త్రపకు ప్రధానవ్యంగ్యత్వము సిద్ధించునుకదా?

[సమా] ఆ పక్షమును సరిపడదు ఏలన 'భావప్రధాన మాఖ్యాతమ్' అను సిద్ధాంతమును బట్టి ధాత్వర్థమే ముఖ్యవిధేయము కావలెను అందుచే నిరీక్షతే' అను నాఖ్యాతమే (క్రియయే) విధే యము ఇట శ్లోకములో 'దరమీలన్నయనా నిరీక్షతే" అను పదముల రెంటి యర్థమును వాచ్యవృత్తిచే బోధింపఁబడుచున్నది ఇందు అన్వయసరణిచిబట్టి నిరీక్షణము ఆఖ్యాతము ప్రధానవిధే యము అది రతికి అనుభావము (కార్యము) దరమీలన్నయనా త్వము ఉద్దేశము (అనువాద్యము) విధేయమైన నిరీక్షణమునకు అది (వాచ్యవృత్తిచే) అంగముగా సిద్ధించియున్నది ఈ భంగినే వ్యంజనా వృత్తిచేతను రతికిఁ బ్రధానవ్యంగ్యత్వమును, త్రపకు తద్గుణీభావ మును అంగీకరించుటే ఉచితము, సరసమును అగును ఇట్లు ఒప్పుటచే

శబ్దార్థములు రెండును గౌణములై (అప్రధానములై) రతిని అభివ్యక్త మొనర్చుటచే, ఇట సంభోగ శృంగారరస చమత్కారము ప్రధానముగా వ్యంజనావృత్తిచే సహృదయాస్వాద్యమాన మగుచున్నది అందుచేతనే ఇది ఉత్తమోత్తమ కావ్యోదాహరణము

ఉదాహరణాంతరము. వయసుకాఁడొకడు తన నెచ్చెలితోఁ జెప్పినమాటలు

గురుమధ్యగతా మయా నతాంగీ
నిహతా నీరజకోరకేణ మందమ్
దరకుండలతాండవం నతభ్రూ
లతికం మామవలోక్య ఘూర్ణితాసీత్

అత్తమామలు మున్నగు గురుజనుల నడుమ నుండుటంజేసి సముచితమగు సిగ్గుచే నమ్రభావము దాల్చి (తలవంచుకొని) యున్నట్టిది ఆ లేమ, తన్నుఁ అల్లన నిభృతముగా తమ్మిమొగడతో నేను కొట్టఁగా, ననుఁ గనుఁగొని తన చెవికమ్మలు ఇంచుక యాడునట్లు కనుఁబొమలీవ వంగునట్లు సుడిసిన దాయెను.

ఇచ్చోట సుడిసిన దాయెను ("ఘూర్ణితాసీత్") అను దానిచే 'ఓయీ అవివేకుఁడా ఏమి యిట్లు తగనిపని చేసితివి? అను వస్తువ్యంజనాపురస్సరముగా నాయిక యొక్క యమర్ష భావము అభివ్యక్త మగుచున్నది ఆ యమర్షము ఆస్వాదదశఁ దల పోలము నంటి యున్న దగుటచే ప్రధానము దానికి శబ్దార్థములు గుణీభూతములు

తొంటిది రసధ్వని యుదాహరణము అందు రతి (సంభోగ శృంగారము) ప్రధానము వాచ్యార్థము గౌణము ఇందు అమర్షము

(వ్యభిచారి భావము) ప్రధానవ్యంగ్యము వస్తువ్యంగ్యమును వాచ్యార్థమును రెండును గుణీభూతములు

[రెంటికి అంగాంగిభావము అది చర్వణా విశ్రాంతిధామము. అనఁగా ఆస్వాదము తత్పర్యంతము తలపోలము నంటియున్న దని భావము] ఇది భావధ్వనికి లక్ష్యము (మూర్ఛితాసీత్ ఇత్యాది) ఇది రెండు ఉదాహరణములకు భేదము

మఱియొక యుదాహరణము

నవవధూవృత్తము వర్ణింపఁ బడినది.

తల్పగతాపిచ సుతనుః శ్వాసాసంగం న యా సేహే
సంప్రతి సా హృదయగతం ప్రియపాణిం మంద మాక్షిపతి

ఒక్కటే తల్పమం దున్నదయ్యు ఆ కోమలి (మునుపు) ప్రియుని యూర్పు సైతము సైపనిది ఇప్పుడు తన యెడందను జేరి యున్న ప్రియపాణిని అల్లన త్రోసివేయుచున్నది.

ఈ శ్లోకము నా (జగన్నాధుని) భామినీ విలాసము (నవోఢా ప్రకరణము) నందలిది పూర్వప్రకరణాకాంక్ష సహృదయులకు ఉండునని ఇంచుక వ్యాఖ్యానము చేయుచున్నాఁడను నాయిక క్రొత్త పెండ్లికూఁతురు తన ప్రియునితోడ నొక్కటే సెజ్జపైఁ బరుండి యున్నను నవోఢాసహజమైన లజ్జ పెల్లిదమునం జేసి ప్రియుని యూర్పులేశముంగూడ తగులనట్లు నెమ్మోము వంచుకొని యొక మూల ముడిఁగి పరుండునది అట్టి యా సిగ్గఱిగరితయె యిప్పుడు ప్రియుఁడు ప్రవాసముపోవునాఁటి ముందటిరాతిరి ప్రియుఁడు (విరహము నీ లేమ ఎట్లు ఓర్చునా అని సంశయించుచునె) తన

యెడందపై నుంచిన కరమును - సహజలజ్జాభరస్వాంత లగు నవ వధూజాతిస్వభావముచే త్రోసివేయుచున్నది కావి (మునుపటి వలె తటుకునఁగాక) 'మెల్లన' త్రోసివేయుచున్నది ఇచట తన వక్షస్థలమునందున్న కాంతుని చేతిని (భావివిరహాగ్నిభీతిచే) మెల్లఁగాఁ దీసి దాని తొంటి నెలవునఁ జేర్చుచున్నది అదే ఇట త్రోసివేయుట అన దానిచే ఆ నాయికయొక్క రత్యాఖ్యస్థాయి భావము సంలక్ష్యక్రమమున వ్యక్త మగుచున్నది. రతిని స్థాయి భావ మని చెప్పుటచే (వ్యభిచారిగా చెప్పమిచే) తద్రసరూపము అభి వ్యక్తము

ప్రకరణము స్పష్టముగా నున్నప్పుడు తటాలునఁ బ్రతీయ మానము లగునట్టి విభావానుభావవ్యభిచారిభావములచే రస మనుపేర రత్యాదిస్థాయిభావము అత్యంతసూక్ష్మకాలమున సహృదయునకు అభివ్యక్తమగును అందు హేతుహేతుమత్తుల పౌర్వాపర్యక్రమము గుఱుతింపరాకుండును అచ్చో రత్యాదికి అసంలక్ష్యక్రమవ్యంగ్య మని పేరు మఱి ఎచ్చోట ప్రకరణము తటుకున ఎఱుంగరాదో, అది విచార వేద్యముగా నుండునో, విభావాదులునుంగూడ బుద్ధిచే నున్నేయము లగునో అచ్చోట రసాభివ్యక్తి సామగ్రిసంవలన (సంయోగ) విలంబన మునంజేసి చమత్కారము తటాలున నుదయింపకపోవుటచేత కారణ కార్యముల పౌర్వాపర్యక్రమము సంలక్ష్యమగుట కలదు అచ్చట రత్యాదులకు సంలక్ష్యక్రమము పైన నుదాహరించిన పద్యమందు సంప్రతి (ఇప్పుడు) అనుపదముచే ఆ లేమ నవవధు వగుట, మునుపు పరాయిదానివలెనే సంకోచముతో మెలఁగెడిది ఇప్పుడన్నానో భావి విరహాకాతరత్వముచే ఆ సంకోచమునకు సంకోచముగలిగినట్లు తెల్ల మైనది_అని పూర్వోత్తరానుసంధానమువలన నర్థావగతికి విలంబము

అందువలన నంతలో క్రమము సంలక్ష్యమగును కావున రత్యాది సంలక్ష్యక్రమవ్యంగ్యరూపమున గ్రహింపవలెను.

ఈ యుత్తమోత్తమ కావ్యప్రభేదమునే ధ్వనికారాదులు ప్రాచీనులు 'ధ్వనికావ్య' మనిరి. ఇది శ్రోత్రది కాదు

"యత్రార్థః శబ్దోవా తమర్థ ముపసర్జనీకృత స్వార్థౌ
వ్యఙ్క్తః కావ్యవిశేషః స ధ్వని రితి సూరిభిః కథితః
(ధ్వన్యాలోకము)

ఏకావ్యమునందు అది వ్యంగ్యోపస్కారక మగుటంజేసి, అప్రధానములైన శబ్దార్థములు రెండును అర్థమును వ్యంజనాబలమున సముల్లసింపఁజేయునో, ఆ కావ్యమును పెద్దలు ధ్వనికావ్యమందురు. ఇట శబ్దార్థములు రెండును వ్యంగ్యార్థమునకు వ్యంజకములు అగునని భావము

అప్పయ్యదీక్షిత శ్లోకఖండనము

చిత్రమీమాంసయందు అప్పయ్యదీక్షితులు ఈ క్రింది శ్లోకమును ఉత్తమోత్తమకావ్యమునకు ఉదాహరణముగా నిచ్చినారు.

నిశ్శేషచ్యుతచందనం స్తనతటం
నిర్మృష్టరాగోఽధరః
నేత్రే దూర మనంజనే, పులకితా
తన్వీ తవేయం తనుః
మిథ్యావాదిని దూతి, బాంధవజన
స్యాజ్ఞాత పీడాగమే

వాపీం స్నాతు మితో గతాసి, న పున
స్తస్యాధమ స్యాన్తికమ్
(అమరుకము)

స్తనతటమందు (చనుగట్లపైని) చందనము నిశ్శేషముగా రాలి పోయినది అధరమున రాగము (రక్తిమ) తుట్టతుద తుడిగిపోయినది కనులయందు కాటుక బొత్తిగాలేదు నీ సన్నమేను పులకలం దాల్చి యున్నది, ఓసిక్కల్లలాడీ దూతీ నీ యిష్టజనములకుంగలిగిన బాధ నెఱుంగవు జలకమాడ బావికిఁబోయితివి కాని ఆ యధమునికడకుఁ బోలేదు పోయి వచ్చినట్లు కల్లలాడుచున్నావు

ఈశ్లోకమునకు ధ్వన్యుదాహరణప్రసంగమున దీక్షితులు ఇట్లు వ్యాఖ్యానించినారు - ఉత్తరీయకర్షణమున (పైఁట లాగుట) జందనము ఒకించుక వదలిపోవును కావున నట్టి యన్యథాసిద్ధిని పరిహరించుటకై సంభోగనిమిత్తమే అని వచించుటకై నిశ్శేష ముగ చందనము చ్యుతమగుట, పిమ్మట చందనచ్యుతికి స్నానసాధా రణ్యమును వ్యావర్తిపఁజేసి సంభోగచిహ్నమే అని యుగ్గడించు టకై తట (పైభాగమున) అనుట స్నానముచేతఁ గదా అంత టను చందనచ్యుతి కలుగును నీ కన్ననో చనుమొనలందే అది కానవచ్చుచున్నది కాన నీ చందనచ్యుతి కౌఁగిలింతచేఁ గల్గినదే అట్లే నిర్మృష్టరాగోఽధరః అను చోట తమ్ములము కాలవిలం బనమునంజేసి తొంటిరాగము ఒకించుక మాసిపోవును కావున ఆ యన్యథాసిద్ధిపరిహారమునకు 'నిర్మృష్టరాగ' (నితరాం మృష్ట) మునుముట్టఁ దుడువఁబడుటం జెప్పుట, మఱల స్నానసాధారణ్య వ్యావర్తనముచే సంభోగచిహ్నోద్ఘాటనము చేయుటకే 'అధరః' అని విశేషించి క్రిందిపెదవిం గైకొనుట పై పెదవి చుంబనానర్హ

మగుట అచుంబితమై సరాగముగా నుండఁగా (రతి సర్వస్వ మధరమ్ కామినీనా మధరాస్వాదః సురతా దతిరిచ్యతే ' అని వ్రాసి గన్న) క్రింది పెదవికి మాత్రమే రాగము నిర్మృష్టమగుట చుంబనము చేతనే కల్గినది అని స్పష్టము (ఇక్లే నేత్రే దూర మనంజనే ప్రొద్దున పెట్టుకొన్న కాటుక కాలము గడచుటచే ఇంచుక మాసి పోయి యుండును అని తదన్యథాసిద్ధిని పరిహరింప దూరమ్ బొత్తిగా అనుట బొత్తిగా కాటుకపోవుట సంభోగముచేతనే దీనిచే కాలాన్యథాసిద్ధి నిరాసము మఱల స్నానసాధారణ్యవ్యావర్తనమున సంభోగచిహ్న మని యుగ్గడించుటకు దూర ' శబ్దమునకు ప్రాంతము ' (పొంత) అని నాయిక మనసులో నున్న యర్థము కాలము వలనను స్నానమువలనను మొగమున నంతటఁ గూడ అంజన లోపము వ్యాపించును కాని నీ కన్నుల కన్ననో పొంత నొకింతకే కాటుకలేదు అందువలన నిది తప్పక చుంబనకృతమే) అను వాక్యముల చేతను 'ఇదియు ధ్వనికి ఉదాహరణము అను ముగింపు వాక్యములను బట్టియు తటాది ఘటితమైన విశేషణవాక్యార్థములు స్నానవ్యావృత్తిద్వారమున సంభోగాంగములైన యాశ్లేషచుంబనాదులం బ్రతిపాదించుటంజేసి ప్రధాన వ్యంగ్యమునకు (సంభోగమునకు) ఉపకరించుచున్నవి అను నీ వాక్యముల చేతను తన్మతము తేటతెల్లమైనది అదెల్ల (1) ప్రాచీనాలంకారికగ్రంథవిరుద్ధ మగుటంజేసియు (2) ఉపపత్తి విరోధమునం జేసియు అలంకారశాస్త్రతత్త్వానవబోధనిబంధనము

ప్రాచీనాలంకార గ్రంథవిరోధము

ప్రాచీనాలంకార గ్రంథవిరోధము ఎట్లన — పంచమోల్లాసము తుదిని – నిశ్శేషచ్యుతచందన' శ్లోకమునందు సంభోగరూపార్థ(వ్యంగ్య)ము ఏది స్ఫురించుచున్నదో దాని జ్ఞానమునకు వ్యంజనావృత్తి అనావశ్యకము అనుమానమువలననే అది లభ్యమగును' అను మతమును ఖండించు సందర్భమునఁ గావ్యప్రకాశికాకారులు మమ్మటభట్టు ఇట్లు వచించెను 'నిశ్శేషచ్యుత చందనమ్ అను మున్నగు వానియందు సంభోగవ్యంజకములు అనుమితికార్యములు (జ్ఞాపకములుగా) చందనచ్యవనాదులు ఉపాత్తములు అవి సంభోగ వ్యాప్యములు (అసాధారణకార్యములు) కావు వానికి సంభోగముతో వ్యాప్తిలేదని భావము సంభోగేతర స్నానాది కారణాంతరములచేతను ఉపాత్తములు కావున అన్యథాసిద్ధములు అనన్యథాసిద్ధ నియతపూర్వభావి యైనదే హేతు వనఁబడును ఆ కారణమున ఈ చందనచ్యవనాదులు అసద్ధేతువులు (అనైకాంతికములు = వ్యభిచారులు) అట్టి వ్యభిచారి హేతువులవలన నెట్లు దూతీకృతసంభోగరూపమగు సాధ్యము అనుమానింప వీలుపడును? పడనే పడదు కావున అనుమానముచేఁగాక వ్యంజనచేతనే సంభోగవ్యంగ్యము లభించును' అని సిద్ధాంతము చేసిరి ఇట్లు వ్యంగ్యములకు సాధారణ్యము చెప్పిన కావ్యప్రకాశికాగ్రంథమునకు అసాధారణ్యము చెప్పిన చిత్రమీమాంసాకారుల వచనము విరుద్ధమని బట్టబయలు

మఱియు ఆ కావ్యప్రకాశికాకారులే పంచమోల్లాసమందే మఱి అట్టి వ్యభిచారి హేతువుచే వ్యంగ్యముమాత్ర మెట్లు వ్యంజనావృత్తిచే స్ఫురించును? అను ననుమానమతవాదికి మహిమభట్టుని

యాక్షేపమునకు సమాధానము ఈ శ్లోకము నుదాహరించి ఇట్లు చెప్పినారు

భ్రమ ధార్మిక విస్రబ్ధః స శునకోఽద్య మారిత స్తేన
గోదావరీకచ్ఛనికుంజవాసినా దృప్త సింహేన

ఓయి ధార్మికుఁడా ఇఁక నిర్భయముగా సంచరింపుము ఆ కుక్కను గోదావరీ కచ్ఛంపుఁ బొదరులో నివసించు గండుసింగము నేఁడే పొలియించినది

ఇట ఒక కులటయైన నాయిక గోదావరినదియొడ్డున సంకేతమైన పొదరింటిలో తన యుపపతితో స్వేచ్ఛగా విహరించుట కలవాటుపడెను అచ్చటి కొక బిచ్చగాడు పూలు గోసికొనుటకు వచ్చుచు వారివృత్తికి భంగకారి యగునట్లుగా నుండెను ఒకనాఁడు ప్రాంగణములోనికివచ్చిన యా బిచ్చగానినిజూచి యామె యీమాటలనెను ఇచట ఓ బిచ్చగాడా మా ప్రాంగణములో స్వేచ్ఛగా బిచ్చమునకు రమ్ము నిన్ను బెదరించుటకు ఆ కుక్క లేదు అది గోదావరినదియొడ్డున నున్న మత్తసింహముచే చంపబడినది అనుటచే నిచట వాక్యార్థము మా ప్రాంగణములో బిచ్చమునకై స్వేచ్ఛగా రమ్ము అని విధి గోదావరినదియొడ్డున పొదరింటిపొంతకుఁ బోకుము అచట నున్న మదసింహము వెళ్ళినచో నిన్ను చంపును అను నిషేధము వ్యంగ్యము

ఇట్టి చోటుల మహిమభట్టు వచించున దేమన వ్యంజనముతో నక్కఱలేదు లింగ లింగజ (హేతుజన్యానుమితి) జ్ఞానరూపమైన యనుమానముచేతనే వ్యంజనగతార్థము అనుమాన మిట్లు ఈగోదావరీనికుంజము భీరుభ్రమణాయోగ్యము – ఉపలభ్యమానభయకార

ణము (సింహము) కలదియగుట వలన - (అన్వయవ్యాప్తి) ఏది యేది ఉపలభ్యమాన భయకారణవంతయో అది యది భీరుభ్రమణా యోగ్యము - మహారణ్యముకోలె. (వ్యతిరేకవ్యాప్తి) ఏది యేది భీరుభ్రమణాయోగ్యము కాదో అది యది ఉపలభ్యమానభయ కారణవంతముకాదు - గృహము కోలె కావున ఈ గోదావరీ నికుంజము భీరుభ్రమణాయోగ్యము ఈ యనుమానముచే అభిలషితార్థసిద్ధి యగుటంజేసి వ్యంజన అని వృత్త్యంతరము అంగీకరింపవలసినదిలేదు అనన్యలభ్యమైన యర్థమందే వృత్త్యంతర కల్పనము యుక్తముకదా ' అని వ్యక్తివివేకమున స్వమతాను సారము నుడివినాఁడు కావ్యప్రకాశికాకారుఁడు తన్మతమును ఖండించి అనుమానమునకుఁ బ్రవేశములేని చోటనుంగూడ వ్యంజనకుఁ బ్రవేశముకలదు సద్ధేతు వున్న చోటనే అనుమానమునకుఁ బ్రసక్తి అప్పుడే హేతువునకు సాధ్యముకోవ్యాప్తి (వియతసాహచర్యము) ఉండును అన్యత్ర హేతువు వ్యభిచరితము (దుష్టము) అగును ప్రకృతోదాహరణమున హేతువు వ్యభిచరితము ఎట్లన ఉపలభ్యమాన భయకారణము (సింహము) ఉన్నను గురురాజాది యాదేశమున్నప్పుడు నిధిలాభనిశ్చయ మున్నప్పుడు కాంతానురాగ మున్నప్పుడు అది భీరుభ్రమణాయోగ్యము కాకపోవును అందుచే ఉత్కట భ్రమణకారణ రాహిత్యము ఇచ్చోట నుపాధి (ప్రతిబంధకము)కావున హేతువు అనైకాంతికము ఇచ్చోట ధార్మికునకు దేవపూజార్థము పూలుకోయువానికి కుక్క కఱచునని భయముకాక తాఁకు నని పాపభయము ఉండుటయు వీరుఁడగుట సింహమునకు జంకక వేటాడ నుత్సహించుటయు సుసంభవము

(2) అప్పుడు గోదావరీనికుంజము సింహ మున్నదను హేతువుచే అతనికి భ్రమణాయోగ్యము కాకపోవును అందుచే సాధ్యముతోఁగాక సాధ్యాభావముతో (సింహాభావముతో) వ్యాప్తి కలుగుటంజేసి హేతువు విరుద్ధము

(3) మఱియు గోదావరీనికుంజమందు సింహముండుట ప్రత్యక్షముచేఁగాని అనుమానముచేఁగాని నిశ్చితముకాదు కేవలము ఆ స్వైరిణి మాటలఁబట్టియేకదా నిశ్చితముకావలెను వాక్యజన్య జ్ఞానము (శాబ్దజ్ఞానము) వక్త ఆప్తుఁడు (యథార్థవాది) యను దృఢ నిశ్చయ మున్నప్పుడే సమర్థము (ప్రామాణ్యము) అగును ఆప్తత్వము సందిగ్ధమైనచో ప్రకృతస్వైరిణి మాటలయందుంబోలె అప్రామాణ్యశంకాస్కందిత మౌటంజేసి హేతువు అసిద్ధ మగును ఇంక అప్రామాణ్యశంకాస్పద మగు నసద్ధేతువున్నచో అనుమానము, సంచరణాయోగ్యత ఎట్లు ఉపలబ్ధమగును ? కాని ఆ చోట సింహము లేదు నిజము కాని ఆజాణ మాటకు తన ప్రియసమాగమసంకేత మగు నచ్చోట సంచరింపవలదని తాత్పర్యము అని విదగ్ధు లగువారలకు అర్థానుభవము కలుగును కావున వ్యంజనావృత్తిచేతనే ఆ వ్యంగ్యార్థ గ్రహణము సిద్ధము వ్యంజనాపక్షము వారలకు మాకు వ్యాప్త్యాద్యనుసంధానము అపేక్షణీయముకాదు ఆ బాధ అనుమానవాదులకే. మాకు అసద్ధేతువు చేతనుంగూడ వ్యంగ్యార్థస్ఫూర్తి కలుగును. అనైకాంతికము అసిద్ధము సందిగ్ధము నను దోషము గల హేతువునకును వ్యంజకత్వము ఒప్పుదుము

అట్లే ప్రథమోద్యోతమునందు ధ్వనికారులు వాచ్యవ్యంగ్య స్వరూప భేదములఁ బ్రదర్శించు సందర్భమున నంగీకరించినారు ఇట్లు వ్యంజకములకు (హేతువులకు) సాధారణ్యమే ప్రామాణికగ్రంథ

ములు ప్రతిపాదించుచున్నవి వానితో నసాధారణ్యము ప్రతిపాదించి హేతువుగ అవ్యభిచారిగాఁ గుదుర్పఁ గ్లేశపడిన చిత్రమీమాంసా గ్రంధమునకు పూర్వగ్రంథవిరోధము తప్పదయ్యెనని తేటతెల్లము కదా!

[శంక] ప్రాచీనులతో విరోధ మున్నంత మాత్రముననే ఉపపన్నమగు నభిప్రాయము వదలుకొనవలసినది లేదు ఏతద్గ్రంథకర్త (జగన్నాథుఁడే) అందులకు సాక్షి. నిజ మాలోచించినఁ బూర్వగ్రంథములతో చిత్రమీమాంసాకారులకు విరోధమే లేదు ఏలన ధ్వనికార ప్రకాశకారాదులు వ్యంజకములకు సాధారణ్య మున్నప్పుడే వ్యంజనను స్వీకరించుటచేత అసాధారణ్య మున్నప్పుడు పూర్తిగా స్వీకరించినట్లే సిద్ధమైనది ప్రకృతమున నిశ్శేషచ్యుతచందనాది శ్లోకమున అసాధారణ్యమునుబట్టి వ్యంగ్యమును ప్రతిపాదించిన చిత్రమీమాంసాకారులకు ధ్వనికారాదులతో విరోధము కలదని ఎట్లు ఏర్పడినది?

[సమా] అట్లు గ్రంథవిరోధము లేదని తుష్యతు దుర్జన' న్యాయమున నంగీకరించినను అపరిహార్యము దోషాంతరము ఇదిగో ఉపపత్తి విరోధము ఎట్లన వ్యంజకముల యసాధారణ్యమునుంబట్టి వ్యంజనను బ్రతిపాదింపరాదు ప్రాచీనులు అట్టి ప్రతిపాదనము నంగీకరించి రనుటయు ఒప్పదు. మేము అడుగుచున్నారము "నిశ్శేష చ్యుత చందనమ్ ఇత్యాది స్థలములందు వ్యంజకరూపములైన యవాంతరవాక్యముల కెల్ల వాపీస్నానవ్యావృత్తి నెట్టకేని సంపాదించి తన్మూలమున సంభోగరూపవ్యంగ్యార్థమునకు అసాధారణ్యము సంపాదించుట ఎందులకు ? ఏమి ప్రయోజనము సాధించుటకు ? ఏమి అక్కఱ ? వ్యంగ్యవ్యంజనమునకు అది (వ్యంజకతాసాధారణ్యము)

ఉపాయ మనియా? ఉపాయమన్నచో తన్నిరాకరణమునకు ఇదిగో ఉపపత్తి.

ఔన్నిద్ర్యం దౌర్బల్యం చింతాలసత్వం, సనిశ్శ్వసితమ్
మమ మందభాగిన్యాః కృతే సఖి త్వా మపి పరిభవతి

జాగరణము దుర్బలత్వము చింత అలసత్వము నిట్టూర్పు వీని కెల్లలోనై అయ్యో సఖీ నీవు మందభాగ్యురాల నగు నాకై ఇట్లు భంగపడితివి

నాయిక యొకర్తు ప్రియునికడకు దూతిగాఁ దాఁ బంపినసఖి అతనితో నుపభోగించి రాఁగా ఉపభోగచిహ్నములంబట్టి - జాగరణాదింబట్టి - ఆ గుట్టు కనిపట్టి ఆ సఖిని జూచ్చి నాయిక పల్కినవి పద్యమునందలి మాటలు

ఇట్టి స్థలములందు జాగరణాదులు వ్యంజకములు సంభోగము చేతను వియోగముచేతను సంభవించునవి యగుట తదుభయసాధారణములే యగును సంభోగ మనుభవించిన దూతి యందును వియోగముపాలైన నాయిక యందును అవి యున్నవే. అందుచే అవి సంభోగమునకే అసాధారణ (నియత) వ్యంజకములు కావు.

[శం] అట్టిచో అవి ఇచ్చోట సంభోగపరములే అని అర్థ విశేషము ఎట్లు బోధపడును?

[సమా] ఎట్లన వినుండు వ్యంజకముల సాధారణ్యాసాధారణ్యములం బట్టి కాదు మఱి వక్తృబోద్ధవ్యాది వైశిష్ట్యమునుంబట్టి (కాముకోపభోగాది) అర్థవిశేషావగతి - అని గ్రహింపుఁడు

ఇట్లు వ్యంజకముల యసాధారణ్యప్రతిపాదనము వ్యంగ్యావబోధకు ఉపాయము కాకపోవుటేకాదు వ్యంజనకు ప్రతికూలము సైతము ఎట్లన వ్యంజకముల (హేతువుల) యసాధారణ్యముననే సాధ్యముతోడి నియత సాహచర్యముననే వ్యాప్తి యని పేరు వ్యాప్తి అనుమానానుకూలము వ్యంజనకు అనావశ్యకము అనుమానము చేతనే వ్యంగ్యార్థము సిద్ధించుచో వ్యంజనావృత్తిని తదర్థమై కల్పించుటేల? అనన్యలభ్యమైన యర్థమునందేకదా వృత్త్యంతరకల్పనము యుక్తము? ఇట్లు వ్యంజకములే అనుమితిహేతువులై అనుమానము చేతనే వ్యంగ్యార్థసిద్ధి యగుచో వ్యంజనాసిద్ధియే నిరవకాశ మగును వ్యంజనాభిమానులైన చిత్రమీమాంసాకారులకు ఇవ్వోట ఇష్టము సిద్ధింపకపోవుటేకాదు వ్యంజనోచ్ఛేదరూపము అనిష్టప్రసంజనమును ఉప్పతిల్లును ఇట్లు ఇఱుతెఱంగు బాధయు తప్పదు

దోషాంతరమును తటాద్యుపాదానమున వాపీస్నానము వ్యావర్తితమైనను నిశ్శేషచ్యుతచందనమ్' అను వాక్యార్థమునకుఅసాధారణ్యము రాదు ఏలన తడిగుడ్డతో వక్షము మొదలగునవి తుడుచుకొనుట మున్నగు కారణాంతరములచేతను స్తనతటాదికి నిశ్శేషచందనచ్యవనాదులు సంభవించును అట్టిచో అసాధారణ్యరూపవ్యాప్తివ్యంజకములకు సిద్ధింపదు. ఇట్టిచో, వాపీస్నానవ్యావృత్తిచే ఏమిప్రయోజనము సాధించినట్లైనది? ఏమియులేదు మఱి మా కన్ననో సాధారణ్యప్రతిపాదనమున ఇఱుతెఱఁగుల లాభము కలదు వ్యంజక సాధారణ్యముననే తర్కశాస్త్రమున అనైకాంతికము అని హేతుదోషమునకు పర్యాయనామము. అనైకముగ జ్ఞాతమయిన హేతువు అనుమితికి బ్రతికూలమైనను వ్యంజనకుఁ బ్రతికూలముకాదు ఇట్లు మాకు అనిష్టవ్యావృత్తియు ఇష్టప్రాప్తియు

సాధారణ్యముచే సిద్ధించినవి మీకు ఒకచోట (వాపీస్నానముకడ) అసాధారణ్యము, కడమతావుల (సలిలార్ద్రివసన ప్రోంచనాదులకడ) సాధారణ్యము ఒప్పవలసిన దుస్థితి పట్టినది ఈ యర్ధజరతీన్యాయము చాలై యేమిలాభము ?

(4) దోషాంతరము. ఇచ్చట రమించుటకు అతని సరసకే పోయితివి అను వ్యంగ్యార్థశరీరమందు అతని సరసకుఁబోవుట ఒకటి, తత్ఫలము, రమించుట ఇంకొకటి రెండంశములు చేరి యున్నవి అందు అతని సరసకే పోయితివి అను నంశమునకు దీక్షితులమతమునుబట్టి వ్యంగ్యత్వము ఉపపాదించుట దుర్ఘటము. ఏలన తటాదిఘటితమైన విశేషణవాక్యార్థము స్నానవ్యావర్తన ద్వారమున సంభోగాంగములైన యాశ్లేషచుంబనాదులఁ బ్రతిపాదించుటచేత ప్రధానవ్యంగ్యము వ్యంజనమునకు సాయపడుచున్నది అను మీ మాటలంబట్టి నిశ్శేషచ్యుతచందనమ్ అను మున్నగు వానిచే ప్రతిపాద్యములగు వాక్యార్థములు వాచ్యార్థ మగు వాపీస్నానమందు బాధితములు కావున వాచ్యకుక్షిగతమైన యర్థమందు ప్రధానములైన 'వాపీస్నానమునకుపోయితివి వానిసరసకుఁ బోలేదు అను వాక్యములందు పోయితివి ' అను విధిప్రతిపాదక శబ్దస్థానమున పోలేదు అను నిషేధప్రతీతియు పోలేదు అను నిషేధప్రతిపాదక స్థానమున పోయితివి అను ప్రతీతియు విరోధలక్షణచేతనే ఉపపన్నము లగును ముఖ్యార్థబాధ యుప్పతిల్లునప్పుడు ఉన్మీలించునర్థము లక్షణావేద్యమని లక్ష్యార్థమని ప్రసిద్ధముగ నుండ వ్యంజనావేద్యమని వ్యంగ్యార్థ' మని మీరు చెప్పుట ఉచితము కాదుకదా ఎట్లన

అహో పూర్ణం సరో యత్ర లుఠన్తః స్నాన్తి మానవాః

(అహో మడుగు నిండియున్నది ఇందుజనులు పొర్లాడి స్నానము

చేయుచున్నవారు) అను నిచ్చోట స్నానము చేయువారు జనులు వారలకు లుఠన్తః'(పొర్లుచున్నవారు) అను విశేషణము సరోవరపూర్ణత్వవిషయమున అనుపపన్నము అట్లు పూర్ణం సరః' అనువాక్యమున ముఖ్యార్థానుపపత్తి కలుగుడు పూర్ణత్వాభావము విరోధలక్షణచే భాసించును అది లక్ష్యార్థము వ్యంగ్యార్థముగాదు. అక్కడ వ్యంజనావేద్యత లేదు అట్లే ప్రకృతశ్లోకమునందును కావున త్వన్మతానుసారము తదంతికగమనము' అను వాక్యార్థాంశమునకు వ్యంగ్యత్వము దుఉపపాదము

[శంక] తదంతికగమనము లక్షణావేద్యమైన నగుంగాక తత్ఫలాంశమైన రమణము లక్ష్యశక్తిమూలధ్వనివేద్య మగుట అవ్యాహతము

[సమా] అదియు సరిపడదు ఏలన అధమత్వ మన అపకృష్టత్వము (నీచత్వము) అది జాతిచేఁగాని కర్మచేఁగాని కలుగును ఇచట జాత్యపకర్ష కాదు ఉత్తమ నాయిక నాయకుని జాత్యపకర్షను చెప్పదు అందుచే కర్మకృతాపకర్షయే కావలెను మఱియా యపకర్షను దెచ్చినకర్మ యేది? ఇట నాయిక చెప్పినది దూతీసంభోగకర్మయా ? తదతిరిక్తమా ? తదతిరిక్తము కాదు ఏలన ముందు నాయకుఁడొనర్చిన యపరాధము లెల్ల సహించియేకదా నాయిక దూతిని పంపినది అట్లు సహింపకయే యున్న దూతిని పంపుటే కుదురదు కావున, అందుచే తా నొప్పుకొన్నట్టి నాయక కృతపూర్వనీచకర్మను బట్టబయలుగా నుగ్గడింప నర్హముకాదు అందుచే నాయిక ఇట నాయకుని నీచకర్మగా నుగ్గడించినది స్వాపరాధపర్యవసాయిదూతీసంభోగముగనే పర్యవసించుచున్నది అను మీా వాక్యములంబట్టి అన్యథానుపపత్తి రూపమైన యర్థాపత్తి

ప్రమాణవేద్యతను రమణమునకు మీరే అంగీకరించినట్లు స్పష్ట మగుచుండ ఇంక దాని కెక్కడ వ్యంజనావేద్యత ? అనన్య లభ్యముకదా శబ్దార్థము ? ఈ న్యాయమునుబట్టి ఇచ్చోట అర్థాపత్తి లభ్యమైన దానికి రమణమునకు శబ్దార్థత్వము రాదుకదా ? మఱి వ్యంగ్యార్థత్వము సిద్ధింపదని వేఱ చెప్పవలయునా ?

అదిగాక ఎట్లో అర్థాపత్తి వేద్యతనుంగూడ వారించి రమణమునకు వ్యంజనావేద్యత్వమును అంగీకరించినంగూడ, మీ మనోరథము సిద్ధింపదు ఏలన వాచ్యార్థములైన నిశ్శేషచ్యుతచందనస్తనతటత్వాదులును, అధమత్వమును మీ చెప్పిన విధముగ 'గొండొకరీతి స్నానాదిచే నుపపద్యమానములు కావు కేవలదూతీసంభోగముననే పొసగును" అట్లే సంభోగింపనే వాని సరసకు పోయితివి అను గమనాంశికవ్యంగ్యార్థముచేతనే అధమత్వరూపవాచ్యార్థము ఉపపన్న మగును అందుచే రమణరూపవ్యంగ్యార్థము వాచ్యసిద్ధ్యంగ మగును అప్పుడు నిశ్శేషచ్యుతచందనశ్లోకము గుణీభూతవ్యంగ్యకావ్యోదాహరణ మగునే కాని – వ్యంగ్యమునకు అట ప్రాధాన్యము లేమింజేసి – ధ్వనికావ్యోదాహరణము కానేరదు ఇట్లు ప్రాచీనగ్రంథవిరోధమునకుఁ బైపెచ్చు ఉపపత్తివిరోధము సైతము స్ఫుటతరము. అందువలన దీక్షితులు చెప్పిన వ్యంజనా సాధారణ్యము ఎటుచూచినను పొసఁగదు

స్వవ్యాఖ్యానప్రకారము ధ్వనికావ్యత్వము

అట్లుగాక వ్యంజనాసాధారణ్యము చెప్పుటయే సముచితము అప్పుడు ప్రాచీనగ్రంథవిరోధము లేకపోవుటయేకాక ప్రకృతశ్లోకమునకు ధ్వనికావ్యత్వమును ఉపపన్నమగును. ఇట వక్త్రీ విదగ్ధయు

ఉత్తమయు నైన నాయిక నాయకునితో సంభోగించి వచ్చి సంభోగ చిహ్నముల నెల్ల దూతి దాచుచుండుట గ్రహించినది కాని నాయక కృత దూతీసంభోగసూచకర్మ ఉదాసీనశ్రోతలకుఁ దెలియవచ్చుట ఆమెకు ఇష్టముకాదయ్యెను అందుచే ప్రతారించి వారికి ఆచిహ్నము లెల్ల వాపీస్నానకార్యముగాఁ దేటపడఁ బ్రతిపాదించినది ఆ నిశ్శేష చ్యుతచందనాదిమూలముననే గూఢముగా దూతికి సంభోగకార్యములు స్ఫురింపఁగా దాని దోసఁగు దానిమనసునకే వ్యక్తమగునట్లు ఇట్లు నేర్పుమీఱఁ బల్కినది ఆ జాణ నాయిక

ఓసీ కల్లలాడీ తెలియక ఇష్టజనులకు (నాబోంట్లకు) బాధ కలిగించుదానా స్వార్థపరాయణురాలా నీవు కాలము మించిపోవునను భయమున ఇటనుండి స్నానార్థము నూతికిఁ బోయితివి (సరస్స్నాన మనక గృహస్నాన మనక వాపీస్నానమనుట స్నానసంభోగ సాధారణ్యమునకు [ఉద్యోతము] అంతేకాని దవుల నదికి గాని పరులవెతె నెఱుంగక దుఃఖపెట్టు నా యధమునిరొద్దకుఁగాని పోవైతివి పోయితిని బతిమాలినను అతఁడు రాలేదు అని కల్లలాడితివి ఇవిగో వాపీస్నానపు చిన్నెలు స్ఫుటముగా నీయందుఁ గానవచ్చుచున్నవి నూతికి వచ్చు వయసుకాండ్ర పెల్లిదమునకు బలు సిగ్గునొంది (స్వైరముగ నేనెల్ల యద్ద కొన వీలులేక) మూపులు భుజలతలఁజేర్చి స్వస్తికీకరించి రుద్దుకొనుటం జేసి నీ వలుదచనుమొనలకే నీరు తగిలి అచ్చటి గందమే రాలిపోయినది వక్షఃస్థలమున గందము ఇంచించుక అట్లే నిలచియున్నది అట్లే త్వరచే పైపెదవి అధోముఖమై (న్యుబ్జమై) యుండుటంజేసి నీరు లెస్సగాఁ దగులకపోవుటచే తెట్టనుర రాగము తుడి పోకున్నది క్రిందిపెదవియన్ననో ఉత్తానమగుట (వెలికి మిగిలియుండుట) పుక్కిలింతనీటిసంసర్గముచే పలు

లోము ప్రేళ్ళరాయిడిచేత పైపెదవికన్న నెమ్ము సమ్మర్ద మొందుటం జేసి అందు రక్తిమ పూర్తిగా తుడిగిపోయినది అట్లే స్నానకాలమున మూతపడుటచేత (కనుల) లోపల నీరు తగులమింజేసి కనుల కాటుక మాయలేదు. నీటి సంసర్గముచేత కనుపొంతలమాత్రనే కాటుక పూర్తిగా మాసిపోయినది స్నానమున కావల బాగుగ మేను తుడుచుకొనమిచేతను తిండిలేక(స్నానోత్తర మభోజనాత్' ఉద్యోతము) కృశించుటచేతను నీ మేనెల్ల పులకరించినది - అని ఆ చతురనాయిక నిగూఢతాత్పర్యముగనే పలుకుట ఉచితము లేకున్న దాని చాతుర్యమునకు భంగ మేర్పడును

ఇట్లు వ్యాఖ్యానించిన పూర్వోక్తమైన లక్షణాదోషము ఇచ్చో నుప్పతిల్లదు ముఖ్యార్థబాధయో తాత్పర్యానుపపత్తియో యున్నప్పుడే లక్షణకుఁ బ్రచారము ఇచ్చోట వాచ్యార్థములు నిశ్శేషచ్యుతచందనాదులు స్నానసంభోగ సాధారణములు కాఁగా స్నానరూపముఖ్యార్థమునకు బాధయేలేదు మఱి తాత్పర్యార్థము నీవు ఆ యధముని కడకే పోయితివి సంభోగించి వచ్చితివి అనునది- గూఢముగా నుండవలెననియే వక్తయిష్టము కావున తటుకున భాసింపదు తాత్పర్యార్థభానమే లేనప్పుడు తదనుపపత్తిప్రసంగము అసంగతముకదా! ఆ యనుపపత్తి నాశ్రయించుకొని యవతరించులక్షణకు అవకాశ మెక్కడిది ?

ఇట్లు ఉక్తలక్షణాదోషము నిరవకాశము కాఁగా వ్యంగ్య ప్రభావము ఇట్లు ఉల్లసిల్లును ఎట్లన మొదట ముఖ్యార్థప్రతిపత్తియు (జ్ఞానమును) పిమ్మట వక్తృబోద్ధవ్యాది ప్రతీతియు కలుగును తన్మహిమచే వ్యంగ్యార్థప్రతీతి కలుగును ఇది క్రమము ఇట స్నానరూపము ముఖ్యార్థము నిశ్శేషచ్యుతచందనాదివాచ్యార్థములెల్ల

దానితో సమన్వయము పొందును పిమ్మట వక్త్రి విదగ్ధురాలు ఉత్తము రాలు నైన నాయిక అనియు, బోద్ధవ్య దుశ్శీలదూతి అనియు వైశిష్ట్య జ్ఞానము ఈ ప్రకరణమహిమను 'అధమ' పదము వ్యంగ్యార్థము నకు గమకమగును. ఎట్లు ? తొలుత అధమపదప్రవృత్తినిమిత్తము గ్రహింపఁదగును లోకములో అధములు బహువిధములుగ నుందురు. వారియందెల్ల అధమపదము వర్తింపవలయుటకు సకలాధమసాధా రణముగ ప్రవృత్తినిమిత్త మొకటికలదు అది దుఃఖదాతృత్వము. అదే ఇటను ప్రవృత్తినిమిత్తముగ స్వీకరింపఁదగును ప్రకృతశ్లోక మున అది కడమవిశేషణముల కంగీకరించినట్లే వాచ్యవ్యంగ్య సాధారణ్యమున నొప్పును వాచ్యార్థదశయందు అనేకాపరాధములు చేసి తన్నిమిత్తమున అపారదుఃఖము కలిగించినవాఁడని అధమ పదమునకు సామాన్యముగ అర్థము మఱి వ్యంగ్యకక్ష్యయందున్న ప్పుడు అది దూతీసంభోగనిమిత్తక దుఃఖదాతృరూప విశేషరూప మున పర్యవసాన మొందును ఇట్లు విశేషార్థవ్యంగ్యము లభించిన పిమ్మట నీవు ఆ యధమునికడకే పోయితివి.' అతనితో రమించి వచ్చితివి" అను వ్యంగ్యము ప్రధానముగా స్ఫురించును విశేషణ ముల సాధారణ్యము (తొల్లి వాపీస్నానరూప వాచ్యార్థమునకును) ఇప్పుడు సంభోగరూప వ్యంగ్యార్థమునకు స్ఫోరకములగును. ఇది అలంకార సిద్ధాంతనిష్కర్ష.

దీనిచే – చిత్రమీమాంసయందు 'అధమత్వ మన అపకృష్ట త్వము. అది జాతిచేఁగాని కర్మచేఁగాని కలుగును ఇచట జాత్యప కర్ష కాదు ఉత్తమనాయిక నాయకుని జాత్యపకర్షను చెప్పదు స్వాపరాధమునఁ బర్యవసించునట్టిదైన దూతీసంభోగాతిరిక్తాన్య కర్మల చేతఁ గల్గిన యపకర్ష యుఁగాదు. అట్టిది దూతీసంప్రేషణమునకు

ముందటిది నాయిక ఓర్వనే యోర్చినది. కావున సంభోగ రూపమే అధమ పదముచే వివక్షితము అవి సిద్ధము అని యేది చెప్పఁబడినదో అది నిరస్తము.

ఏలన విదగ్ధయైన ఉత్తమనాయిక సఖుల యెదుట దూతీ సంభోగరూప మైనట్టి స్వనాయకాపరాధకృతకర్మాపకర్ష మునుం గూడ కంఠము క్తముగా తేటతెల్లము చేయు ననుట- అత్యంతానుచితము అందుచే అధమపదముచే సఖులకుఁ దెల్లమగునట్లు నాయిక దూతినిగూర్చి తాను మున్ను ఓర్చుకొన్న యా తొంటి యపరాధములనే - దూతీప్రేమశాదికమునే ఇప్పుడు సహింపని చందమునఁ బలుక నిచ్ఛగించినది అదే ఆమె చాతుర్యము అని నిగ్గు

రసగంగాధరము

సరిపస్యావివరణసముల్లసితము

అధి 8 ఉత్తమ కావ్యము - గుణీభూత వ్యంగ్యము

ఏ కావ్యమునందు అప్రధానమయియే వ్యంగ్యము చమత్కార కారియగునో అది రెండవ కావ్యప్రభేదము - గుణీభూతవ్యంగ్యము ఉత్తమకావ్యము అప్రధాన మయియే అనఁగా మఱియొకవ్యంగ్యమున కన్ననో వాచ్యార్థమునకన్ననో అప్రధానమై యని భావము అప్రధానమయియే అనుచోట నున్న యవధారణము (ఏ) లేకున్న-వ్యంగ్య మప్రధానమై చమత్కార కారణము అని మాత్రమే లక్షణము చెప్పిన - అపరాంగవాచ్యత్వమున అతివ్యాప్తి ఉప్పతిల్లును అచ్చోట వ్యంగ్యము వాచ్యమునకన్నఁ బ్రధానముగా నుండియు కొండొక వ్యంగ్యమునకు అంగముగానుండి చమత్కారి యగును అందులకు ఉదాహరణము

అయం స రశనోత్కర్షీ పీనస్తనవిమర్దనః
నాభ్యూరుజఘనస్పర్శీ నీవీవిస్రంసనః కరః

(స్త్రీపర్వము. 14 అధ్యా)

మొల నూలును తివిచివైచునది బలుపుఁ బాలిండ్ల విమర్దించునది నాభిని, ఊరువులను జఘనమును స్పృశించునది పోకముడిని వీడ్చునది ఈచేయి ఇది రణభూమిం గూలిన భూరిశ్రవసునియొక్క ఛిన్నహస్తముం జూచి విలపించు తద్బాంధవుల వచనము. ఇందు నాయకవిషయమైన నాయికాశృంగారము కరుణకు అంగము

తమభర్త హస్తముంజూచి తొంటి తత్కృతశృంగారోచితరశనోత్కర్షణాది విలాసముల స్మరించుకొనగా భూరిశ్రవుని వధువులకు శోకావేగము కడుంగడు ముమ్మరించుటంజేసి - శృంగారము కరుణకు పోషకము - అంగమొండె - యైనది కరుణకే ఉల్బణతచే (ఉద్రేకముచే) ఆస్వాదగోచరత్వము అట్టి ప్రియుఁడు కాలగోచరుఁడు కాఁగా ఇపుడు శోకాతిశయము వెల్లివిరిసి తెల్లమగును కావున కరుణకే ప్రాధాన్యము దానినిబట్టి ఇట (కరుణరస) ధ్వని కావ్యత్వము స్ఫుటమే ఇందు కరుణరసమునుబట్టి పర్యాలోచించిన శృంగారము అప్రధానమైనను చమత్కారకారణమై యున్నది కావున ఇది ఈరెండవ కావ్యప్రభేదమును ఉత్తమ కావ్యము కావలసి వచ్చును కాని నిజమునకు ఇది ఉత్తమోత్తమము ధ్వని కావ్యమే ఇందు ఆలంబనమైన నాయకునిమృతి కలిమింజేసి కరుణకే ప్రాధాన్యము కావున పూర్వవృత్తశృంగారముకూడ కరుణరస ప్రసంగమందు శోకోత్కర్షము కలిగించునది యగుటచే చమత్కారియే లక్షణమున ఏవార్థనివేశనమునంజేసి కరుణనుబట్టి అప్రధానమైనను (శృంగారవ్యంగ్యము) వాచ్యార్థమున కన్న ప్రధానమ యగుటంజేసి అది (వ్యంగ్యము) కేవల ప్రధానముగనే యుండక అప్రధానమునుంగూడ నైనందున నతివ్యాప్తి వారించినది రశనోత్కర్షి శ్లోకాది యపరాంగస్థలములందు ధ్వనికావ్యత్వము అవ్యాహతమైనది 'చమత్కారి అను దళమును సార్థకమే అది లేకుండ 'ఎందు వ్యంగ్యము అప్రధానమగునో అని మాత్రము లక్షణము చెప్పిన వాచ్యచిత్రములందు అతివ్యాప్తి వాచ్యచిత్రాదులందు వ్యంగ్యము లీనముగా నుండును చిత్రాదులందు అలంకారముల చమత్కారమే

తప్ప వ్యంగ్యంపుఁ జమత్కారములేదు అందుచే అతివ్యాప్తి వారింప చమత్కారకారణ మగునో ' అను దళము నివేశించుట.

కావ్యప్రకాశమునందు,

అతాదృశి గుణీభూతం వ్యంగ్యం వ్యంగ్యేతు మధ్యమమ్ '

ఏ కావ్యమందు గుణీభూతమగు వ్యంగ్యము చమత్కారము కలదియో అది మధ్యమకావ్యము - గుణీభూతవ్యంగ్యము ' అను కారికాభాగమునకు మఱి టీకాకారులు చిత్రకావ్యభిన్నత్వము అనగా అలంకారప్రధానకావ్యమున కన్న భిన్నమైనది - అని వ్యాఖ్యచేసినారు ఆ వ్యాఖ్య సరికాదు ఏలన పర్యాయోక్తము సమాసోక్తి మున్నగు నలంకారములు ప్రధానములుగాఁగల కావ్యము లందు ఆ వ్యాఖ్యనుబట్టి గుణీభూత వ్యంగ్యలక్షణమునకు అతివ్యాప్తి రావలసి వచ్చును నిజ మేమనఁగా తదలంకారవిచ్ఛిత్తి గల కావ్యము చిత్రకావ్య మగును గుణీభూతవ్యంగ్యమును అగును ఇది సర్వా లంకార సమ్మతము

గుణీభూత వ్యంగ్యోదాహరణము

శ్లో॥ రాఘవ విరహజ్వాలాసంతాపిత సహ్యశైల శిఖరేషు
శిశిరే సుఖం శయానాః కపయః కుప్యన్తి పవనతనయాయ

రఘురాముని విరహంపుమంటలచే సంతాపితములైన సహ్య పర్వతశిఖరములందు శిశిరమున సుఖముగా పరుండియున్న కపులు హనుమంతుని కోపగించుచున్నారు " సీతాన్వేషణము నకు హనుమంతుఁడు పోవఁగా శ్రీరాముఁడు కపులతోడ సహ్యాద్రి

యందు వసించియుండెను ఆయన విరహాగ్ని సహ్యాద్రియంతయు వేడెక్కునంత మిక్కుటముగానుండెను తమకు శిశిరము దుస్సహముకావున కపులు ఆవేడిమికి హాయిగా నుండిరి ఇట్లుండ హనుమంతుఁడు లంక నుండి మఱలివచ్చి సీతాదర్శనవృత్తాంతము చెప్పి శ్రీరామవిరహాగ్ని నార్పివైచెను ఆ చలికాలమున తమకు సుఖాపాదిగా నుండిన దానిని ఆ యగ్నిజ్వాలను చల్లార్చివైచి శైత్యబాధ కగ్గము చేసినాఁడని కపులకు హనుమంతునిపైని కోప ముప్పతిల్లె నని భావము

ఇందు 'జానకి కుశలవార్తానివేదనమునం జేసి రాఘవుఁడు శిశిరీకృతుఁ డయ్యెను అనునది వ్యంగ్యార్థము దానిచేఁ గాక హనుమంతునిపైని కపుల యాకస్మిక కోపరూపవాచ్యార్థము ఉపపన్నము కాదు అందువలన హనుమంతునిగూర్చి కపులు చూపిన కోపము అను వాచ్యార్థమునకు రాఘవుని మనసు చల్లఁబడె నను వ్యంగ్యార్థము ఉపపాదకము (అంగము) అగుటచే ఇది గుణీభూతవ్యంగ్యము ఇచ్చోట వాచ్యము ప్రధానము వ్యంగ్యము అప్రధానము అట్లు గుణీభూతమైనను వ్యంగ్యము - దుర్దైవ వశమున దాస్యము పాలైనను రాజమహిషి (సైరంధ్రి ద్రౌపది) వోలె అనిర్వాచ్యకమనీయత్వముతో విలసిల్లుచున్నది

[శం] వ్యంగ్యము వాచ్యార్థోపకారక మైనచో, కావ్యము గుణీభూతవ్యంగ్యము ఉత్తమకావ్యమేకదా కావలయును? మఱి తొల్లి చెప్పఁబడిన 'తల్పగతాపి అను శ్లోకమున మంద మాఽఽపతి' అనుచోట ఆక్షేపగతమాంద్యము నవవధూస్వభావ విరుద్ధము అందుచే మందాక్షేపరూపవాచ్యార్థము అది రత్యాఖ్యస్థాయి అను వ్యంగ్యముచేతనే ఉపపద్యమాన మగును వాచ్యము వ్యంగ్యోప

పద్యమానమగుట (వ్యంగ్యముచే పోషింపఁబడుట) అనునది ఇందును అందును సమానమే. అట్లుండఁగా ఇది ఉత్తమకావ్యమగుటేమి? అది ఉత్తమోత్తమకావ్యము (ధ్వనికావ్యము) అగుటేమి?

[సమా] ఈ శంక పొసఁగదు. ఏలన 'తల్పగతాపిచ' అను శ్లోకమునందు అనతిచమత్కారములైన ప్రతిదినసఖ్యుపదేశములచేతను ఈ మాంద్యము ఉపపద్యమానమగును. కావున కేవలము నాయికారతిరూప వ్యంగ్యముచేతనే ఆ మాంద్యరూపవాచ్యార్థము ఉపపన్నమగునని నియమములేదు. అట్టిచో వ్యంగ్యము గుణీభూత మనరాదు. కావ్యమును గుణీభూతవ్యంగ్యముకాదు. ఇతరవిధమున నెట్లుగాని వాచ్యార్థము ఉపపద్యమానము గాక వ్యంగ్యమాత్రముచేతనే సిద్ధించుచో అచట గుణీభూతవ్యంగ్యవ్యవహార మని ఎఱుఁగవలెను.

అదియునుంగాక ఆ మాంద్యరూపవాచ్యార్థము తోలుతనే చిత్తమునఁ జూఱగొన్నట్టిదైన విప్రలంభరతిని ప్రకాశపఱుపకయే తాను స్వతంత్రముగ రసజ్ఞుల పరనిర్వృతిచర్వణకు గోచరము కానేరదు. విప్రలంభరతిని ప్రకాశింపఁజేయునదైననే అది పరమానందాస్వాదగోచర మగును. అట్లే నిశ్శేషచ్యుతచందనమ్మను శ్లోకమునందును 'అధమత్వము' వాచ్యార్థము- దూతీసంభోగమాత్రముననే నిష్పాద్యము కాదు. నాయకుఁడు కొండొక యపరాధ కారణమున నాయికను దుఃఖపెట్టినవాఁడగుటచేతను అది సంభవించును గావున వాచ్యము ఇచ్చోటనుంగూడ కేవలవ్యంగ్యైకముగా ఉపపాద్యము కాదు. అందువలన నచ్చోటఁగూడ గుణీభూతవ్యంగ్యకావ్యత్వము ఆశంకింపరాదు. వాచ్యము నియతముగ వ్యంగ్యమాత్రముచేతనే ఉపపద్యమానమై తదితరముచేత నుపపాద్యము కానప్పుడే వ్యంగ్యము గుణీభూతమగుననియు అప్పుడే కావ్యము గుణీభూత వ్యంగ్య మని పేరొందుననియు నిగ్గు

చిత్రమీమాంసోదాహృతోదాహరణ ఖండనము

మఱి చిత్రమీమాంసాకర్త యన్ననో ఇట్లు ఉదాహరణము లిచ్చినారు.

'ప్రహరవిరతౌ ? మధ్యేవాహ్న ?
స్తతోఽపి పరేణవా ?
కిముత సకలే యాతే వాఽహ్ని
ప్రియే త్వమిహైష్యసి ?'
ఇతి దినశతప్రాప్యం దేశం
ప్రియస్య యియాసతో
హరతి గమనం బాలాఽఽలాపైః
సబాష్పగలజ్జలైః

'ఓ ప్రియా జాము గడుచునప్పటికా ? మధ్యాహ్నమునకా ? కాకున్న అపరాహ్ణమునకా ? పోనీ పవలంతయుఁ గడచునప్పటికేని నిజముగా ఇట వత్తువా ?' అని జాలువారు కన్నీటితోడి యాలాపములచే ఆ తన్వి దూరదేశమునకుఁ బోవ నిశ్చగించుచున్న ప్రియునిగమనము ఆఁపివైచెను 'ప్రాప్యమ్' చేరుటకే నూరు దినముల కాలము తిరిగి వచ్చుటకు మఱియంత, అచట పని చూచుకొన మఱికొంత_అందుచే బహుదివసాగమసాధ్యము గమన మెక్కడ? దినైకమాత్రసహ్యముకాని ప్రియురాలి విరహ మెక్కడ ?)

ఈ పద్యమునందుఁ బవలంతయుఁ బరమావధి అంతకుపైని ప్రాణములు దాల్పఁజాలను' అను వస్తువు వ్యంగ్యము ఆలాపముల చేత ప్రియగమనము బాల హరించెను అని ప్రియగమననివారణము

అను వాచ్యార్థంపుసిద్ధికి ఆవ్యంగ్యము అంగమగుటంజేసి ఈ శ్లోకము (వాచ్యసిద్ధ్యంగ) గుణీభూతవ్యంగ్యకావ్యము' అని ప్రతిపాదించెను దీక్షితప్రతిపాదనము ఇది సరికాదు సబాష్పగలజ్జలములు ప్రహారవిరతౌ' ఇత్యాద్యాలాపములు ఇవే చాలును ప్రియగమనము వారింప అనఁగా వానిచే స్ఫురించునట్టిదైన అంతకుఁబైని బ్రదుకఁజాలను' అను వ్యంగ్యార్థమే ప్రియగమనమును వారింప సమర్థక మని భావము అందుచే ప్రియగమన నివారణ రూపమైన వాచ్యంపు సిద్ధికి ఆ జలములు' ఆ 'యాలాపములు' అంగములవును కావున వ్యంగ్యము ఇట గుణీభూతము కావలసినది లేదు

[శం] వినిగమనము లేదు కావున అవే వాచ్యసిద్ధ్యంగములు కానేల ? వ్యంగ్య మేల వాచ్యసిద్ధ్యంగము కారాదు ?

[సమా] ఏలన, వినిగమనము కలదు 'ఆలాపైః' అను (కరణ) తృతీయ చేత ప్రకృత్యర్థమైన (ఆలాప పదవాచ్యమైన) హారణక్రియాకరణత్వము స్ఫుటముగా ఎఱుకపడుచుండఁగా వినిగమనము లేకపోవుటెట్లు ? 'ప్రహారవిరతౌ' అనుమాటచేత, 'అశ్రువులచేత' అను వాచ్యమే వినిగమనము అట్లు కాదేని నిశ్శేషచ్యుత చందనమ్ అను మున్నగు స్థలములందు 'దూతీ సంభోగాది" వ్యంగ్యార్థము 'అధమత్వ" రూప వాచ్యార్థసిద్ధికి అంగమై ఆశ్లోకము గుణీభూత వ్యంగ్యోదాహరణము కావలసివచ్చును మున్ను చిత్రమీమాంసాకర్త నుడివినట్లు తదభిమతధ్వనికావ్యోదాహరణము కాకపోవును

[శంక] పోనీ అగుఁగాక నిశ్శేషచ్యుత చందన శ్లోకమును గుణీభూతవ్యంగ్యముగనే మే మంగీకరింతుము అట్లే ప్రహారవిరతౌ

శ్లోకమునందును 'సబాష్పగలజ్జలము తదాలాపములు" వీనిచే ప్రవాస మేగిన వెనుక నట ప్రియుని చిరకాలావస్థితిని వారింపఁ బనికి వచ్చును అవి 'ప్రాణములు ధరింపఁజాలను' అను వ్యంగ్యముతో కూడినప్పుడు గమననివారణసమర్థకము లగును. కావున వ్యంగ్యము వాచ్యసిద్ధ్యంగ మగుఁగాక

[సమా] అట్లు నీ వంగీకరించినను ప్రయోజనములేదు ఏలన, నాయికాదులు విభావములు బాష్పాదులు అనుభావములు చిత్తావేగాదులు సంచారిభావములు - వీని యన్నింటి సంయోగముచే పానకరసన్యాయమున విప్రలంభశృంగారమువలన ఇది తప్పక ధ్వని కావ్యమే యగును వారింప నెవనితరము ?

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అధి 9. మధ్యమ కావ్యము

ఏ కావ్యమునందు వ్యంగ్యచమత్కారాసమానాధికరణముగ వాచ్యచమత్కార ముండునో, అది మధ్యమ కావ్యము– తృతీయము అనఁగా ఏ కావ్యమునందు వ్యంగ్యచమత్కారమునకన్న వాచ్య చమత్కారము స్ఫుటముగా ఉత్కృష్టముగా ఎఱుకపడుచుండునో ఆ కావ్యము మధ్యమము అని భావము.

ఉదా –

తనయ మైనాక గవేషణ లంబీకృత జలధి జఠరప్రవిష్ట హిమగిరి భుజాయమానాయా భగవత్యా భాగీరథ్యా సఖీ

తనకొడుకైన మైనాకుని (సముద్రములోఁదాఁగుకొన్నవానిని) వెదకుటకై చాచి జలధి పొట్టలో హిమాద్రి ప్రవేశపెట్టిన భుజము వలె విలసిల్లుచున్న భాగీరథీభగవతికి సఖసుమీ యీ యమునాదేవి

ఇందు ఉత్ప్రేక్షాలంకారచమత్కృతిగర్భమున విలీనమై నాగరకురాలుకాని నాయిక పూసికొన్న దట్టమైన కాశ్మీరద్రవంపు మైపూఁతలో మఱఁగిపోయినట్టి నెమ్మేని పసిమి మిసిమివలె ఇంచిం చుక – అస్ఫుటముగా – ప్రతీయమానమగుచున్నది ఇంచించు కేని వ్యంగ్యస్పర్శ లేకయే స్వయముగా రమణీయత్వ మొంద జాలు నట్టి వాచ్యార్థ మొకండులేదు వ్యంగ్యము వాచ్య మున్నచోట నుండి

నను వ్యంగ్యచమత్కారము వాచ్యచమత్కారముచే నభిభవము నొందియున్నదని ఎఱుంగఁదగును

ఈ రెండవ మూఁడవ కావ్యభేదముల కిది వైలక్షణ్యము రెంటను వ్యంగ్యము గుణీభూతమే అట్లయ్యు రెండవదాన నది జాగరూకము (Active) అనగా ప్రస్ఫుట చమత్కారశాలి తృతీయమందన్నో అది అజాగరూకము (Passive) అనఁగా అస్ఫుటము ఈ ద్వివిధకావ్యవిశేషములందును అలంకారప్రధాన మగు కావ్యప్రపంచమెల్ల నంతర్భవించుచు

చతుర్థ కావ్యవిభాగము

ఏ కావ్యమునందు అర్థచమత్కృత్యుపస్కృత మైనట్టి శబ్ద చమత్కారము ప్రధానముగ నుండునో అది అధమకావ్యము ఉపస్కృతమై యనఁగా పోషకమై, అంగభూతమై అని అర్థము

ఉదా -

శ్లో॥ మిత్రాత్రిపుత్ర నేత్రాయ త్రయీ శాత్రవ శత్రవే
గోత్రారి గోత్రజత్రాయ గోత్రాత్రే తే నమోనమః

సూర్యచంద్రులు నేత్రములుగాఁ గలవానికి వేదవిరోధులైన రాక్షసులు శత్రువులైనవానికి ఇంద్రగోత్రోద్భవులైన దేవతలకు రక్షకుఁడైనవానికి (వాహనమైన వృషభమును పాలించువాఁడవైన) శివునకు నీకు (గోపాలకుఁడవైన) విష్ణువునకు నీకు నమస్కారము

ఇందు అర్థ చమత్కృతి అప్రధానమగుటవలన అస్ఫుటమై - ప్రధానమై స్ఫుటముగా విలసిల్లుచున్న శబ్దచమత్కృతిలో లీనమై పోయినది. ఇది అధమకావ్యము

ఇట్లు నాలుగు కావ్యభేదములు

అన్యమత పరామర్శము

[శం] ఈ నాలుగుగాక అర్థచమత్కృతి యేపాటియు లేనిదై శబ్దమాత్రచమత్కృతి కలదైన కావ్యవిశేషమును ఐదవదానిగా జెప్పుట ఉచితము ఏకాక్షరపద్యములు అర్ధావృత్తియమకము పద్మాదిబంధములు మున్నగునవి అందులకు లక్ష్యములు కాఁదగును

[సమా] ఆ యభిప్రాయము సరికాదు ఏలన రమణీయార్థక ప్రతిపాదకశబ్దముకదా కావ్యసామాన్యలక్షణముగాఁ జెప్పితిమి ఈ యైదవ కావ్యభేదము తల్లక్షణ గోచరముకాదు మొదలు దానికి చమత్కారార్థలేశప్రసక్తియు లేమింజేసి కావ్యత్వమేలేదు ఇఁక కావ్యవిభాగప్రసక్తి యెక్కడిది ? అందుచే ప్రాచీనాలంకారిక పరంపరను ప్రాచీనత్వమాత్ర గౌరవముతో అవిచారితముగ ననుసరించిన కొందఱు మహాకవుల కావ్యములందు అట నట అట్టివి కొన్ని నిబద్ధములై యున్నను నేము వస్తుస్థితిని (కావ్యంపు యథార్థ స్వరూపమును) అనుసరించి వానిని చీకికిఁ గొనమైతిమి అందుచే మా చేసిన కావ్యవిభాగము అన్యూనాతిరిక్తముగా లెస్సగ పొసఁగి యున్నది అందుచే అధమాధమకావ్యప్రకారము అప్రసక్తము

మఱికొందఱు - కావ్యప్రకాశకారాదులు ప్రాచీనులు సాహిత్యదర్పణకారాదులు నవీనులు - ఉత్తమ, మధ్య మాధమము

ముక్తే జంగే కావ్యమని వచించిరి వారు ఆ విభాగమున శబ్దచిత్రమును నిర్విశేషముగా అధమాధమకావ్య మని పల్కిరి అది యుక్తము కాదు ఏలన రెంటి తారతమ్యము వారిచ్చిన యుదాహరణముల చేతనే తేటతెల్లమగుచున్నది ఎట్లన కావ్యప్రకాశికలో అర్థచిత్రము నకు ఉదాహరణముగా నిచ్చిన శ్లోకము ఇది

ఇది హయగ్రీవుఁ డను మహాసురుని మహిమానువర్ణనము

వినిర్గతం మానద మాత్మమందిరాత్
భవ త్యుపశ్రుత్య యదృచ్ఛయాపి యం
స సంభ్రమేంద్రద్రుతపాతితార్గళా
నిమీలితాక్షీవ భియాఽమరావతీ

శత్రువుల గర్వమణంచువాఁడును మిత్రులకు మానప్రదాతయునైన హయగ్రీవుఁడు తన యింటినుండి (అమరావతీ జయార్థము గాక ఊరక యలవోకగా వాహ్యాళికై బయల్వెడలినను) బయల్వెడలెనని కర్ణాకర్ణికగా విని ఇంద్రుఁడు భయవిహ్వలుఁడై తత్తరపాటుతో పరుగువాఱి గుదెగడియ వేయఁగా అప్పుడా యమరావతి భయముచే (ద్వారములను) కనులు మూసికొన్నదా అనునట్లుండెను ఇందు నిమీలితాక్షీవ అన్నచోట ఉత్ప్రేక్షాలంకారము ఇందు కవితాత్పర్యము హయగ్రీవ పరాక్రమాభివర్ణనమైనను అందుచే వీరరసము స్ఫురించియు ఆ వ్యంగ్యచమత్కృతి ఉత్ప్రేక్షాలంకార చమత్కృతిలో తిరోధాన మొందినది

చిత్ర మీమాంసలో అప్పయ్యదీక్షితులు అర్థచిత్రమున కిచ్చిన యుదాహరణము :

స చ్ఛిన్నమూలః క్షతజేన రేణుః
తస్యోపరిష్టాత్ పవనావధూతః
అంగారశేషస్య హుతాశనస్య
పూర్వోత్థితో ధూమ ఇవావభాసే

ఆ సమయమున రేగిన దుమ్ము రక్తపాతముచే భిన్నమూలమైనను, పూర్వము గాలిచేత నెగురగొట్టబడి పైన వ్యాపించుచు చల్లారిన యగ్నిహోత్రుని పూర్వోత్థితధూమమువలె ప్రకాశించెను

సహృదయుఁడైన వాఁడెవఁడు అర్థ చిత్రోదాహరణములకును కేవల పామరజన శ్లాఘనీయమైన శబ్ద చిత్రోదాహరణములకును భేదము లేదని చెప్పును ? ఈ మదంతర మున్నట్టి ధ్వని గుణీభూత వ్యంగ్యములు రెండును ప్రాధాన్యాప్రాధాన్యముల భిన్న కావ్యప్రకారములు కాఁగా తారతమ్యము గా నున్నను ఈ రెండును (మధ్యమాధమ కావ్యములు) కలపి ఎకకావ్యభేదమే అను దురాగ్రహ మేల ? ఇచ్చట శబ్దార్థచమత్కృతు లొక్కెడ నుండుచో వానిలో నేది ప్రధానమో, ఏది గౌణమో పర్యాలోచించి అర్థచమత్కృతి ప్రధానముగా నున్న మధ్యమకావ్య మని శబ్ద చమత్కృతి ప్రధానముగా నున్న అధమకావ్యమని రెండును సమానముగా నున్న మధ్యమకావ్య మని కావ్యమును వ్యవహరించుట కర్తవ్యము

రెండును సమానముగా నున్నందులకు ఉదా

సూర్యోదయ వర్ణనము —

ఉల్లాసః ఫుల్లపంకేరుహ పటల పత
న్మత్త పుష్పంధయానాం
నిస్తారః శోకదావానల వికలహృదాం
కోకసీమ న్తినీనామ్
ఉత్పాత స్తామసానా ముపహతిమహసాం
చక్షుషాం పక్షపాతః
సంఘాతః కోఽపి ధామ్నా మయ ముదయగిరి
ప్రా న్తతః ప్రాదురాసీత్
(ప్రాణాభరణము)

వికసిమ్మపూల మొత్తముల గ్రోలుచున్న మదించిన తేఁటి గండ్లకు ఉల్లాసమును వియోగంపు నెవులుకార్చిచ్చుల వికల హృదయు లగు చక్రవాకంపుటిల్లాండ్రకు దుఃఖనాశకమును తేజో వినాశకములైన చీకటిమూకలకు ఉత్పాతమును, వెలుఁగు కోల్పడిన నేత్రములకు పక్షపాతము (సహాయకము) కలదియు నైన తేజస్సంఘాత మొకటి పొడుపు గుబ్బలిపొంతఁ బ్రాదుర్భవించినది, అని సూర్యో దయ వర్ణనము

ఇందు వృత్త్యనుప్రాసప్రాచుర్యమువలనను శబ్దము ఓజో గుణప్రకాశముగ నున్నందునను ఇందలి శబ్దచమత్కృతి తేటపడు చున్నది అట్లే ప్రసాదగుణయోగమున శబ్దములు విన్నవెనువెంటనే స్ఫుటముగా నర్థము అవగతమగుచున్నది సూర్యరూప తేజస్సంఘా తమునందు(విషయమునందు)ఉల్లాసత్వము తారకత్వము నిస్తారత్వము పక్షపాతత్వము అను ధర్మములు (విషయులు) సమారోపింపబడుట చేత [ఇట్లు విషయి విషయముల కభేదము వర్ణింపఁబడుటచే రూపకా

లంకారము ఒండె మహాస్సంఘాతరూపహేతువును తత్ప్రాదుర్భూతకార్యముల నుల్లాసాదులతో సహాభావమున వర్ణించుటంజేసి హేత్వలంకారము ఇట్లు ఇందు శబ్దార్థముల చమత్కృతులు రెండును సమానస్కంధములుగ నుండుటం జేసి ప్రాధాన్యము సమానమే అందుచే ఇది మధ్యమకావ్యమే

ఇట్లు కావ్యము నాల్గుప్రకారములుగ విభజించుటే సర్వవిధముల సముచితము.

రస గంగాధరము
వరివస్యావివరణసముల్లసితము
2 రస ప్రకరణము
అ॥ 1 ధ్వనికావ్యప్రకారములు

కావ్య సామాన్య విభాగానంతరము ఆ నలుతెఱంగుల కావ్య ప్రభేదములందు ఉత్తమోత్తమమైన ధ్వనికావ్య విభజనము ఆ ధ్వని కావ్యము అసంఖ్యాకభేదములు కలది అవెల్లఁ బేర్కొనుటయు నిరూపించుటయు అసాధ్యము అందుచేత సామాన్యముగఁ గొన్నింటిని మాత్రమే నిరూపించుచున్నారము ధ్వనికావ్యము ద్వివిధము (1) అభిధామూలము (2) లక్షణామూలము అని (1) అందు తొంటిది ముత్తెఱంగు - రసధ్వని వస్తుధ్వని అలంకారధ్వని అని. అందు రసధ్వని యనునది అసంలక్ష్యక్రమమునకు ఉపలక్షణము. రస్యతే ఆస్వాద్యతే అనేన అను వ్యుత్పత్తి ననుసరించి అసంలక్ష్య క్రమము'చే రసము భావము రసాభాసము భావాభాసము భావశాంతి భావోదయము భావసంధి భావశబలత అనునవి గ్రాహ్యములు ఇవెల్ల నొక ప్రభేదముగ గణుతింపఁబడును (2) రెండవది అగు లక్షణామూలధ్వని యన్ననో అర్థాంతరసంక్రమితవాచ్యము, అత్యంతతిరస్కృతవాచ్యము అని ఇఱుతెఱంగు ఇట్లు పంచముఖమైన ధ్వనియందు మొదలిదైన రసధ్వనియే పరమరమణీయము (అలౌకికాఖండాస్వాదజనకము అని యర్థము

అందుచేత ధ్వనికావ్యప్రకారములం దెల్లను అది అత్యంత ప్రధానము అందువలనఁ దొలుత రసస్వరూపము నిర్వచింపఁబడుచున్నది

రసగంగాధరము

మర్మప్రకాశవివరణసముల్లసితము

అధి 2 అభినవగుప్తపాదాదిసమ్మత రసస్వరూపము

సముచిత రమణీయ సన్నివేశమనోహర మైన శ్రవ్యకావ్యము చదువునపుడు దృశ్యకావ్యమును ప్రయోగముగఁ జూచునపుడును, తదుపస్థాపితములై - సర్వవిఘ్నముల నభిభవించి సర్వోత్కర్షఁ బ్రకాంతమై విలసిల్లు సహృదయుని విమలాంతఃకరణమును బ్రవేశించినట్టివి తదీయ సహృదయతా సహకృత పరిపుష్టమైన (భూయో భూయోనుసంధానలక్షణ) విలక్షణ భావనామహిమచేసి లౌకికసాధారణములు ఆస్వాదప్రతిబంధకములు నైన శకుంతలాత్వము, దుష్యంతరమణీత్వము మున్నగు తమ (వైయక్తిక) విశేష ధర్మము లెల్ల విగళితము లౌట అలౌకికసాధారణ్యమున భాసించునట్టివియు అందువలననే తమ తమ లౌకిక కారణ కార్య సహకారి కారణ వ్యపదేశములు పోయి అలౌకిక విభావానుభావ వ్యభిచారిభావ వ్యవహారమును పొందినట్టివియు నైన శకుంతలాదులైన యాలంబన కారణములు చంద్రోద్యానాదులైన యుద్దీపనకారణములును అశ్రుపాతాదులైన కార్యములును చింతాదులైన సహకారి కారణములును (పానకద్రవ్యములువోలె) సమ్మిళితములై (పానక రస న్యాయమున ఏకప్రతీతి గోచరీక్రియమాణము లవును తన్నిమిత్తముననే ప్రాదుర్భావితమైన యలౌకిక (విభావాది) సాధారణీకరణవ్యాపారముచే ఆ భావనాకాలమున నప్పుడే - భిన్నత్వ పరిమితప్రమాతృత్వ (సహృదయత్వధర్మ)రూపమైన యజ్ఞానావరణము

భంగమగును గంప తివియఁగాఁ దాఁ బ్రకాశించుచు నన్య సవిధ పదార్థముల భాసింపఁజేయు దీపమువలె - అపరిచ్ఛిన్నత్వాది పరమాత్మధర్మములతో వెలుగొందు ప్రమాత (సహృదయుని) యొక్క - వా స్తవస్వరూపానందముతోఁగూడ నభేదమున - ఏది తదంతఃకరణమున మున్నె న్నఁడో ప్రవేశించి (సూక్ష్మ) వాసనాత్మకముగా నున్నదై, ఇప్పుడు (వ్యంజనావ్యాపారమహిమచే) ఆస్వాద గోచరీక్రియమాణమగునో ఆ విభావానుభావవ్యభిచారిభావ సంవలిత రత్యాదిస్థాయిభావమే రసము.

వివరణము

ఈ రససూత్రము గంభీరార్థగర్భితము విపులవ్యాఖ్యాన సాపేక్షముగా నున్నది.

సహృదయుని రత్యాది స్థాయిభావమే విభావానుభావవ్యభిచారిభావ సామగ్రి సమవధానమున ఉపచితమై ఆస్వాదపదవి నొంది రసత్వము నొందును. (విగళితవేద్యాంతరము, లోకోత్తరాహ్లాద రూపము అగును, అని సంక్షేపము) ఇట నవధేయము.

రసగంగాధరము

పరివస్యావివరణసముల్లసితము

అ॥ 2 (ఎ) స్థాయిభావములు

రతి హాసము శోకము క్రోధము భయము ఉత్సాహము విస్మయము జుగుప్స నిర్వేదము (శమము) ఇవి తొమ్మిదియు స్థాయిభావములు రసీభావ మొందకపూర్వము ఇవి సహృదయుని యంతఃకరణమున బహుజన్మముల నుండియు వాసనాత్మకములై (సూక్ష్మరూపముల) నెలకొనియున్నవి ఆ యపచితావస్థయందు (అపరిణత సూక్ష్మవాసనావస్థయందు) వానికి స్వాదుత లేదు అవి ఉపచితములై సహృదయునకు ఆస్వాద్యము లైనప్పుడే రసవ్యపదేశ మొందును

లోకములో పుట్టువొందిన వాఁడెల్ల ఏతత్సంవిద్విశిష్టుఁడగును ఇవి లేని ప్రాణి లేదు (1) 'దుఃఖసంశ్లేషవిద్వేషీ సుఖాస్వాదన సాదరః' అను న్యాయమున రిరంస(సుఖేచ్ఛ)రతి సర్వజనచిత్తముల నాక్రమించి యుండునది సుఖేచ్ఛ లేని మానవుఁడు లేడు అందుకని స్థాయిభావములలో రతికిఁ బ్రథమస్థానము (2) స్వోత్కర్షాభిమానముచే మానవుఁడు ఒరుల హసించును (3) అభీష్టనాశము కలుగ శోకించును (4) నిజాభీష్ట నాశకారణభూతులందు క్రోధపరవశుఁడగును (5) పగ దీర్చుకొనలేకున్న శత్రువులకు భయపడును (6) మహార్థసాధనమును మహాజయమును అభిలషించి ఉత్సహించును (7) కార్య గౌరవమునకు సాధితమహార్థమునకు విస్మయం పడును (8) అనుచితవస్తు వైముఖ్యాక్రాంత స్వాంతుఁడై జుగుప్స గొనును (9) కడకు ఎల్ల విషయములయెడ నిర్వేదము (వైరాగ్యము) నొంది సర్వపరిత్యాగమున శమ మొందును ఇట్లు

రత్యాదులు తొమ్మిది స్థాయిభావములు సర్వప్రాణిజాతసహజాతములై యున్నవి

అవి యంతఃకరణమునఁ దిరముగ నెలకొని యుండును ఎల్లరయందును సమపరిణామ మొందవు గంధర్వులందు రతి ఉత్కృటికము క్రోధాదులు అల్పకోటికములు ఋషులందు శమము ఉత్కృష్టము రత్యాదులు అపకృష్టములు రాక్షసులందు క్రోధము అత్యధికము భయము అసత్కల్పము అవస్థావిశేషమును బట్టియు వీనియందు న్యూనాధికభేదములు కల్గును బాలురయందు రతి అప దూాతము బ్రహ్మజ్ఞానియందు నష్టప్రాయము యువకునియందు ప్రకృష్టరూపము

స్థాయులు వ్యభిచారిభావములవలె నడుమ పుట్టి యంతలోనే సమసిపోవునవికావు విరుద్ధములుకానీ అవిరుద్ధములు కానీ యైన భావములుఎన్ని యుదయించుచున్నను అవి విచ్ఛేద మొందవు మాలతీ మాధవమునందు మాధవునియొక్క రతికి శ్మశానాంకప్రతిపాదిత మైనట్టి [విరుద్ధ] బీభత్సరసముచే విచ్ఛేదము లేదు తాము విచ్ఛేద మొందక పోవుటేకాదు అన్యభావములకు ఆత్మభావ మొసంగి స్థాయిభావములు లవణాకరమువలెనో – క్షీరాకరమువలెనో – నజలును ఇవి చిత్తమున తిరముగ నెలకొనియుండి అప్పుడప్పుడు కారణసామగ్రిసాకల్యము లభించినపుడు ఉపచితావస్థ నొంది సహృదయునకు ఆస్వాద్యమానము లగును కాని కారణసామగ్రివైకల్యమున మఱల యథాపూర్వ వాసనాస్థితి నొందుచుండును ఉదా వాసనారూపమున చిత్తమున ప్రవిలీనమై యుండిన శ్రీరాముని యుత్సాహము పరశురామాభి

యోగసమయమునఁ గార్యరూపమున నుద్దీపిత మైనది వెంటనే పూర్వావస్థ నొందినది మఱల ఖరదూషణ వాలి రావణాదుల యెదుట నుద్దీపిత మైనది వెనువెంటనే సూక్ష్మవాసనాదశ నొందినది అట్లే సర్వస్థాయిభావములును ఇట్లు ఉపచితాపచితదశాభాజనకము లగుచున్నను నాశములేక మాటిమాటికి నభివ్యక్తి నొందుటచేత నిత్య శక్తియుక్తముగ చిత్తముల స్థిరస్థాయు లగుటంజేసి స్థాయిభావములు (స్థిరములగు చిత్తవృత్తులు) అను పేరునకు అవి తగియున్నవి. అవి భావములలో నెల్లఁ బ్రధానములు అవి మానవులలో బహుపరివార పరివృతుఁడగు నరేంద్రునిచందమున బహుభావపరీవృతములు స్థాయులు భావముల కెల్ల మూలీభూతములు రసస్ఫూర్తికి మూలబీజములు వీనియందే సహృదయునకు సంవిద్విశ్రాంతిరూపపరమానందము ఇట నిది యవధేయము. ఏకఘనసంవిచ్చర్వణమునందే మనసు హృదయ విశ్రాంతి కలుగును అంతరాయశూన్యత విశ్రాంతి శరీరము అవిశ్రాంతిరూపమే దుఃఖము దుఃఖము చాంచల్య ప్రాణముగాను రజోవృత్తిరూపముగాను కాపిలులు చెప్పిరి మఱి రసము అఖండానందఘనము సంవిద్విశ్రాంతిరూపము కావున ఆనందసారము కరుణరసాదులును రసము లగుట ఆనందమయములని దీన సిద్ధము అందుచే రత్యాదులు చర్వణాపాత్రములు సుఖాకారములు అని పిండితార్థము

కేవల సహృదయుఁడైనవాని యంతఃకరణమునందు నెలకొన్న రత్యాదులే రసీభావ మొందును అతఁడే యధికారి అన్యచిత్తగత స్థాయులు రసపరిణామ మొందవు మఱి ఎవఁడు సహృదయుఁడు ? ఎవఁ డన అతఁడు వక్ష్యమాణలక్షణోపసంపన్నుఁడు కావలయును

(1) హృదయసంవాదశాలి లోకమునందలి (లౌకిక) రతిహాసాది స్థాయిభావములయు తదుపచయసామగ్రియు స్వరూ

పము లెస్సగా నెఱింగినవాఁడుగ అనుభవింపఁగలవాఁడుగ నుండ వలెను సంస్కారి కావలెను రత్యాదిస్థాయిభావముల యాస్వాద యోగ్యమగు నంతఃకరణధర్మము సంస్కారము ఏతాదృశ లౌకికానుమానోపసంస్కృతానుభవశాలి యైననే కావ్యానుశీలన సమయమున నాటకప్రయోగప్రేక్షణ కాలమునను కావ్యశబ్ద ప్రతిపాదిత మగు నాయికానాయకాదివిభావాద్యుపస్థితి కలిగి నప్పుడు ఉపేక్షతో ప్రమాదుల గ్రహించి తాటస్థ్యమున నూరకుండఁడు హృదయసంవాదనమునం జేసి — అనఁగా లోకమున నాయికానాయకులు వారి రత్యాదిచిత్తవృత్తి లక్షణములు తన హృదయమునకుఁ బూర్వము అనుమానగోచ రము లైనందున కావ్యనాటకాదులందును తత్సాదృశ్యజ్ఞానమునం జేసి నాయికానాయకుల రత్యాదిని ఊహింప భావింపఁ దత్తన్మ యీభావ మొందఁ సమర్థుఁడై యుండును కావుననే సహృదయుఁడని (సమానహృదయుఁడని) పేరు అట్టి లౌకికరత్యాదిహృదయ సంవాదను లేనివానికి కావ్యాస్వాదనము కలుగనేరదు ఉదా రత్యాది యొక్క పరిజ్ఞానము లేమిం జేసి బాలునకును నష్టప్రాయ మగుటం జేసి బ్రహ్మజ్ఞానికిని కావ్యాస్వాదన మొదవదు కావున లౌకిక రత్యాది పరిజ్ఞాన మావశ్యకము

(2) మఱి ఎవనికి కావ్యానుశీలనాభ్యాసమునం జేసి మనో ముకురము నిర్మలము కాఁగా కావ్యప్రతిపాదితార్థముతో తన్మయీ భవనయోగ్యత పొనసునో ఆ విమలప్రతిభానశాలిహృదయుఁడు సహృదయుఁడు లౌకికార్థమును అలౌకికకావ్యార్థ మొనర్చి లోకా తీతపరమాహ్లాద సంపన్న మొనర్చునది సహృదయుని భావనాశక్తి- పునఃపునరనుసంధానాత్మకము తన్మహిమచే కనుల యెదుటలేని

పూర్వరామాదులు సకలభావభూషితులై ఆ సహృదయ నిర్మలాంతః కరణమున సాక్షాత్కరింతురు అందుచే విమలప్రతిభాన శాలిత్వ మును సహృదయునకు ఆవశ్యకము

(3) కావ్యార్థానుభానమునకు బహువిధాంతరాయములు కలుగును అవి నానానిమిత్తసముద్భూతములుగ నుండును కొన్ని సహృదయకృతములు కొన్ని కవికృతములు కొన్ని నటనాట్యపరికరకృతములు అందు తొలుత సహృదయకృతములు: ప్రాయికముగ చిత్తమునకు దోషములు రజస్సుచేతను తమస్సుచేతను ఉప్పతిల్లును తమఃకారణమున నంతఃకరణము నకుఁ గాలుష్యము అతస్మిన్ తద్బుద్ధి' అను లక్షణము వ్యామో హము - దట్టముగా నావరించును అట్టి మనోదర్పణము నిర్మలముగా నుండదు అందు కావ్యార్థభానము కలుగదు రజః కారణమున చిత్తమునకు చాంచల్యము అవిశ్రాంతి అనైకాగ్ర్యము ఏర్పడును ఈ రెండుదోషములును కావ్యార్థభానమునకు (పరమార్థజ్ఞానమునకుంబోలె) ప్రధానాంతరాయములు పైజెప్పఁ బడిన యంతరాయములు సత్త్వోత్కర్షచే తొలంగును చిత్తము నిర్మలమును నిశ్చలమును అగును కావ్యార్థము లెస్సగ భాసించును ఆ నిశ్చలసంవిద్విశ్రాంతి రూపమే ఆనందము అలౌకికసుఖలక్షణము ఇట్లు సహృదయుఁడు నైజముగ సాత్త్వికాంతఃకరణుడును లౌకిక రత్యాదిహృదయసంవాదసంస్కారవంతుఁడును, భావనాభ్యాస కుశలుఁడుగ నున్ననుంగూడ కావ్యాస్వాదనకాలమునందు ఆ హృద యము (1) అప్రస్తుతమగు స్వసుఖదుఃఖ వ్యవహార వ్యాపృతము కారాదు దానికి నివారకము సముచితగీతవాద్యరంగ ప్రసాధ నాదికములు సహృదయ హృదయగ్రంథిని విడఁదీసి కావ్యా

స్వాదనోన్ముఖునిం జేయును శ్రవ్యకావ్యమునందు ఛందస్సు అను ప్రాసాద్యలంకారములు మాధుర్యాదిగుణాదులు అట్లుపకరించును
(2) మఱియు సహృదయుఁడు విభావాదికమును స్వవిషయములుగ నెంచుకొన్న చో - తన కాంతగా నెంచినచో - అప్పుడు లజ్జా జుగుప్స లుదయించును పరవిషయము లనుకొన్నచో తాటస్థ్యమున పర్యవసించును అట్లుగాక విభావాదికములను దేశకాలపాత్రానాలింగితములుగ సాధారణ్యమున' గ్రహింపవలెను. ఇందులకు నాట్య ధర్మము ననుసరించి పరికల్పితములు నటుల రామాది వేషములు, రంగపరికరములు చతుర్విధాభినయములు పూర్వరంగాదులు ఉపకరించును శ్రవ్యకావ్యములందు శబ్దార్థచమత్కారనిమిత్తములైన రీతివృత్త్యనుప్రాసగుణాలంకారములు ఉపకరించును ఇట వ్యంజనా వ్యాపారముది సర్వసామ్రాజ్యమును ఇట్లు ప్రతీత్యుపాయవైకల్య మను విఘ్నము నివర్తిల్లును

అందుచే నటులు శాస్త్రవిదులు సుశిక్షితులు స్వకార్య దక్షులు కావలెను అప్పుడు నట నిమిత్తములు రసాస్వాదవిఘ్నము లెల్లను నివర్తిల్లును

కవినిమిత్తకములు కొన్ని రసాస్వాదనాంతరాయములు ఒదవును

(౨) ప్రతిపత్తియందు అయోగ్యత సంభావనావిరహమును అట్టివి కవివర్ణిత విషయములు అసంభావ్యములుగా నుండునేని సహృదయునిబుద్ధి అందు నిలుపరాని దగును అట్టిచో సంవిద్విశ్రాంతి ఎట్లు లభించును ? అది వారించుటకై సామాన్య లోకధర్మ ముపకరించును సముచిత సన్నివేశరమణీయేతివృత్తము వలయును కవి

లోకసామాన్యవృత్తములను నమ్మ శక్య మైన వానినే వర్ణింపవలెను అలోక సామాన్యవిషయముల వర్ణింప నెంచుచో అవి ఎవరియందు సంభావనీయము లని నమ్మించునో అట్టి అఖండ ప్రసిద్ధిజనిత గాఢ గూఢ ప్రత్యయప్రసరము గల లోకోత్తర పురుష విషయములుగా వర్ణింపవలెను ఉదా శ్రీరామాదులందు సేతుబంధన సముద్ర లంఘనాదులు సుసంభావనీయము లైనను అగ్నిమిత్రాదులందుఁగాదు అందుచే నాటకాదులందు ప్రఖ్యాతవస్తునియమము పురాణకథలు గైకొని అందున్నట్లు వర్ణించుట కాని విపర్యాసములు మెలకువతో చేయుటకాని ముఖ్యము లోకధర్మము ననుసరించి దేశకాలపాత్రా ద్యనుగుణవేషభాషాచారముల వర్ణించుట ఆవశ్యకము (ప్రవృత్తి) ఇందు నటులు అస్థానకౌశలప్రదర్శనమునకుఁ జొఱక సముచితా భినయము చేయుటయు అత్యంతముఖ్యము

(బి) అప్రధానత ఇంకొకటి కవి సముచిత విభావానుభావ వ్యభిచారిభావ నిబంధనముచేసి స్థాయిభావవికాసమునకు అవకాశము చేకూర్పవలెను అస్థానపాండితీప్రకర్షోజ్జృంభణ మొనర్చి ప్రధాన వస్తువు తుంగలోఁద్రొక్కి అప్రధాన వర్ణనాదికిఁ దొడంగిన, అది సహృదయ సంవిద్విశ్రాంతిభంగ మొనర్చును ఉదా : మృచ్ఛ కటికలో వసంతసేనా గృహాంగణవర్ణనము మాఘాదులలో పర్వత వనాదివర్ణనములును ఇట నటులును ప్రకృతానుచితముగ స్వోత్కర్షా విష్టులై స్వాభిమానగానాభినయ ప్రకర్షావిష్కరణపరు లగుట విఘ్న కరము

(సి) సంశయయోగము : ప్రతిరసమును తత్తద్విభావాను భావాదికమును అసంశయప్రతీతికముగా వర్ణింపవలెను. అనుభావమును అశ్రువును ప్రకటించి అది శోకభయాదులందు దేనిదో అని సంశయ

మొదవింపరాదు విభావమును వ్యాఘ్రమును ప్రకటించి అది క్రోధ భయాద్భుతములలో దేనిదో స్పష్టము కానట్లు నిబంధింపరాదు వ్యభి చారిభావమును చింతను వర్ణించి అది భయశోకశృంగారాదులలో దేనిదో అని సంశయప్రతిపత్తి కనకాశము కలిగింపరాదు సంశయ ప్రతిపత్తి సంవిద్విశ్రాంతిభంగకరము (విస్తరము అభినవ భారతిలోఁ గననగును)

ఇట్లు వీతవిఘ్నప్రతీత్యాస్వాదమును సంవిద్విశ్రాంతియుఁ గల సత్త్వోత్కృష్టాంతఃకరణమునందే కావ్యార్థము రసము ఆనంద ఘనము భాసించును ఎప్పుడు భాసించును ? ఉక్తస్థాయిభావము లకో విభావానుభావవ్యభిచారిభావసంయోగమున విభావాను భావములు వెనుక వర్ణింపఁబడును (వానిని భావములనుట ఔపచారి కము)

ఉక్త స్థాయిభావములు గాక యితరభావములు 33 భరత నాట్యశాస్త్రమునందుఁ జెప్పఁబడినవి

నిర్వేద గ్లాని శంకాశ్చ తథాసూయా మదః శ్రమః
ఆలస్యం చైవ దైన్యంచ చింతా మోహో ధృతిః స్మృతిః
వ్రీడా చపలతా హర్ష ఆవేగో జడతా తథా
గర్వో విషాద ఔత్సుక్యం నిద్రాపస్మార ఏవచ
సుప్తి ర్విబోధోఽమర్షశ్చ అవహిత్థాఽ ప్యథోగ్రతా
మతి ర్వ్యాధి స్తథోన్మాదః తథా మరణమేవచ
త్రాసశ్చైవ వితర్కశ్చ విజ్ఞేయా వ్యభిచారిణః
త్రయస్త్రింశ దమీ భావాః సమాఖ్యాతాస్తు నామతః

14)

ఇవి వ్యభిచారిభావములు అనఁబడును ఇవి స్థాయిభావవిలక్షణములు (1) ఇవిస్థాయిభావములవలె జన్మప్రభృతి ప్రాణుల చిత్తముల నెలకొనియున్నవి కావు కావ్యమున నడుమ నడుమ పుట్టుచు గిట్టుచుండును కావ్యమున కడవఱకు రసాస్వాదము ముగియుదనుక నుండవు సముచితవిభావములు(నాయికానాయకాదులు) కలిగినప్పుడే ఉదయించును కొందఱయందు వీనిలోఁ గొన్ని పుట్టనే పుట్టవు ఉదా రసాయనసేవ చేయువానికి గ్లాన్యాలస్య శ్రమ ప్రభృతి భావములు పుట్టవు నాయికా నాయకులు ప్రేమవశంవదు లైనప్పుడే గ్లాని శంకాదులు పుట్టును తద్రతి రసీభావ మొందిన వెనుక హేతుప్రక్షయమగుటం జేసి ఆ వ్యభిచారిభావములును నశించును స్థాయిభావములకుంబోలె వీనికి మాటిమాటికి అభివ్యక్తి యుండఁగు పుట్టిన యనతి కాలమునకే ఇవి మునుముట్ట నశించును ఉని పాలఁ కునయేని యుండదు నిజసంస్కారమునేని మిగుల్ప ...వానుభావములో అలలవంటివి ...ము

(2) వ్యభిచారిణ ఇతి కస్మా దుచ్యతే ? వి అభి ఇత్యేతా వుపసర్గౌ చర గతౌ ధాతుః ధాత్వర్థ వాగంగసత్త్వోపేతాన్ వివిధ మభిముఖేన రసేషు చరంతీతి వ్యభిచారిణః చరంతి నయంతీత్యర్థః కథం నయ న్తి ? ఉచ్యతే - యథాసూర్య ఇదం నక్షత్రమముం వాసరం (వా) నయతీతి నచ తేన బాహుభ్యాం స్కంధేన వా నీయతే కింతు లోకప్రసిద్ధ మేతత్ యథాయం సూర్యో నక్షత్రం దినంవా నయ తీతి ఏవ మేతే వ్యభిచారిణ ఇత్యవగంతవ్యాః (నాట్య. శా. పు 84

(సూర్యః వాసరం సముల్లాసయన్ సుఖాస్పదం కరోతి నహి మేఘాచ్ఛన్నో సూర్యవిధురో దివసః సుఖకరో భవతి తేన సూర్యో

వాసరం నయతీతి వ్యవహారః ఏవ మపి వ్యభిచారిభావా రసరూపోప
చయే స్థాయిభావా నుపకుర్వన్తి ఉపకృత్య గచ్ఛన్తిచ తథా
ఆభిముఖ్యేన చరంతి-రసపరిణామ పదవీ మానయన్తీ త్యభిప్రాయః)

స్థాయిభావములవలె ఉత్కంఠాది వ్యభిచారిభావములు రసత్వ మొందునవికావు కాని రసత్వమొందుటయందు రత్యాదిస్థాయి భావములకు ఆభిముఖ్యమున వాగంగసత్వాభినయము క్రమములై చరించు చుండుటే వానిపని అందుచే అవి వ్యభిచారిభావము లనఁబడును అవి ఒక్కరసమునకే అని వ్యవస్థలేక రసాంతరములందును వ్యభిచరించును కావునను వ్యభిచారు లనఁబరఁగును స్థాయులను లెస్సగ సంచరింపఁ జేయును గనుక సంచారిభావము లనఁ జెల్లును సముద్రములో అలల వలె లేచు[illegible] స్సు - ఈ యున్మజ్జన నిమజ్జనములచే స్థాయిభావ [illegible]లఁ బెంపొందుచుండఁ దద్రూపమునవే వఱలును ఉ[illegible]ఁబడనది - 'స్థాయిరూపచిత్తవృత్తి సూత్రమున [illegible]శముగా (ఎడనెడఁ) గ్రువ్వఁబడిన యీ వ్యభిచారులు ఉదయాస్తమయాది వైచిత్ర్యకృత శతసహస్రధర్మముల నొందు చున్నవై రక్తనీలాదివర్ణ సూత్రములఁ గుట్టఁబడి విరళభావోప లంభన సంభావితభంగి సహస్రగర్భితములైన స్ఫటిక కాచ భ్రామక పద్మరాగ మరకత మహానీలాదిమయ గోళకముల (గుండ్ల) వలె ఆ సూత్రమందు తమ సంస్కారవైచిత్ర్యము నెలకొల్పకయు ఆ సూత్రింపుఁ బ్రాపొంది స్వయముగ విచిత్రార్థమైన (పలువన్నెలఁ బొల్చు) స్థాయిసూత్రమును మఱింత విచిత్ర మొనర్చుచున్నవై - నడుమనడుమ స్థాయిసూత్రమునకు ప్రతిభానావకాశము కలుగునట్లు [ఉపాధివంతిముగఁ జేయుచు], పూర్వోత్తర వ్యభిచారిరత్నముల

కాంతులచే శబలిత మొనర్చుచుఁ బ్రకాశించును గావున వ్యభిచారి భావము లనఁబడుచున్నవి'

(అభినవభారతి)

వ్యభిచారి స్థాయిభావ భేదము ఇట్లు స్పష్టప్రచ మగును ఎట్లన రాముఁడు గ్లానుఁడు అని వినఁగనే శ్రోతకు ఏల? అని హేతు ప్రశ్న పుట్టును దానంజేసి ఏదో కారణమున్నఁ గాని గ్లాని పుట్టదని స్పష్టమైనది అందువలన గ్లాని స్థాయిభావము కామి తేటపడినది మఱి రాముఁడు ఉత్సాహవంతుఁడు అని వినఁగనే శ్రోత స్థాయు స్థిరమేగ చిత్తమున నుండనే యున్న వే అవి బహిరుపాధిజన్యములు కావు అని ఎఱింగినందున ఏల అని ఉత్పాదక హేతుప్రశ్న నడుగక ఎవని యెదుట? [పరశురాముని యెదుటనా? రావణునియెదుటనా?] అని ఉద్బోధక హేతుప్రశ్న నడుగును ఇది వాని రెంటికి భేదము ఏలన విభావములు వ్యభిచారులకు ఉత్పాదకములై స్వరూపరంజన మొనర్చును రత్యుత్సాహాదిస్థాయుల కన్ననో ఉచితానుచితత్వ మాత్రమును ఆపాదింపఁజేయుచుండును విభావములు లేకున్న స్థాయులు శశశృంగాదులవలె నిరుపాఖ్యము (పేరులేనివి) కాఁబోవు అవి స్థాయిభావములు కావున మఱి వ్యభిచారభావము లన్ననో సముచిత విభావాదులు లేకున్నఁ బుట్టనుంగూడ బుట్టవని యొకక మఱియొక భేదమును గలదు బహువిభావప్రరోహములు రత్యాదులు అల్పవిభావప్రరోహములు వ్యభిచారులు ఇది ఉత్తరగ్రంథమున మూలకారునిచే ప్రపంచితము

విభావములు

ఉక్తస్థాయిభావములకు వాసనాత్మకములు స్వాదుతావిధు రము ప్రకృష్టదశ నొంద రసరూపపరిణామపదవిఁ జెందఁ గారణ భూతములు విభావానుభావవ్యభిచారిభావములు అందు వ్యభిచారి

భావములు ప్రపంచితములు ఇఁక విభావానుభావములు చెప్పఁబడును ఇవి నిజమునకు (స్థాయి వ్యభిచారులవలె) చిత్తవృత్తి విశేషములుకావు అందుచే భరతముని 49 భావములలో వీనిని చేర్పలేదు.

రసీభావమున లోకమున రత్యాదిస్థాయిభావములకు సీతారామాదులు నాయికానాయకులు ఆలంబనములు (సమవాయి భావములు) సీతావిషయక మగు రాముని రతికి సీత ఆలంబనము రామవిషయకమగు సీతారతికి రాముఁడు ఆలంబనము స్థిరాలంబనములైన స్థాయులకు రసత్వపరిణామమే సంభవింపదు ఇఁక నన్యభావముల యుత్పత్తికే అవకాశము ఉండదు ఆలంబన సమాశ్రయములు ఉద్దీపనములు (నిమిత్తకారణములు) ఇట్లు లోకమున ఆలంబన మని ఉద్దీపనమని కారణము ద్వివిధముగా వాసికెక్కి యున్నది లౌకికమగు నాయికుతెఱంగు కారణము శ్రవ్యదృశ్య కావ్యములందు కవిచే నభివర్ణితమై నటాభినీతమై తత్కావ్యముఖమున వానిని జనువునట్టి ప్రయోగమున సందర్శించునట్టి సామాజికుని భావనామహిమచేఁ దదంతఃకరణమునఁ బ్రతిబింబించుటచే సామాజిక నిష్ఠమై రసవ్యంజకమగును అప్పుడు ఆ ద్వివిధకారణములును ఆలంబనవిభావము లని ఉద్దీపనవిభావము లని యలౌకికవ్యపదేశము నొందును లౌకికకారణములకు ఈ యలౌకిక వ్యవహారము కలుగుట వాని యలౌకిక విభావనావ్యాపారమునం జేసి అది యిట్లు వాసనా రూపమున ఆస్వాద్యములు కాకయున్న రత్యాదులను విభావములు "విభావించును" అనఁగా రసాస్వాదాంకుర యోగ్యతకుఁ దెచ్చును విశేషముగా భావించును అనఁగా ఎఱుకపడును కావ్యస్థ విభావాదులజ్ఞానము భావనాద్వారమున సాధారణీకరణమహిమచే సహృదయహృదయమునఁ జొచ్చి అట వాసనారూపముల నున్న రత్యాది

స్థాయిభావములను ఇంచుక అభివ్యంజించును కేవలవిభావనా వ్యాపారమునకే సమగ్రరసాభివ్యక్తి కలిగించు సామర్థ్యము లేకపోవుటచే విభావములు రసాస్వాదాంకురయోగ్యతకు ' రత్యాదులను దెచ్చునని చెప్పుట అనఁగా విమలాంతఃకరణుఁడగు సహృదయుఁడు కావ్యార్థభావనము చేయుటయందు తొలిమెట్టు విభావములు - ఆలంబన విభావము - నాయికానాయకులు అనుభావ వ్యభిచారులచే విభావములతో నంకురించిన రసాభివ్యక్తి పూర్తియగును. ఇట్లు అంకురితమైన స్థాయికి ఈషదుత్కర్షాధాయకత్వము ఉద్దీపనము అనుద్దీపిత భావములు అజాతప్రాయములు జాతములైనను ద్విత్రిక్షణస్థాయులే కదా సర్వచిత్తవృత్తులు అగును అందుచే కావ్యాస్వాదనము పూర్తియగు పర్యంతము భావములను నిలుచునట్లు చేయుట ఉద్దీపనముల కార్యము ఇట్లు ఉద్దీపనములకు కారణత్వమును 'విభావ' వ్యపదేశమును (ఉపచరితము) ఉద్దీపనక్రమ మెట్లన

'ఉద్దీపనం తదుత్కర్షహేతు స్తత్తు చతుర్విధమ్,
ఆలంబన గుణశ్చైన తచ్చేష్టా తదలంకృతిః
తటస్థశ్చేతి విజ్ఞేయాః చతుర్థోద్దీపన క్రమః"

(సా. రత్నా)

ఆలంబనమునకు ఉద్దీపనము అనఁగా ఉత్కర్షాధాయకత్వము నలు తెఱంగుల కలుగును ఎట్లన ఆలంబన గుణములచే, తచ్చేష్టలచే తదలంకృతిచే ఆలంబమునకు సంబంధములేనివి తటస్థములచే

అందు (౧) గుణములు - (1) యౌవనము (2) రూపము (3) లావణ్యము (4) సౌందర్యము (5) అభిరూపము (6) మార్దవము (7) సౌకుమార్యము అనునవి ఆలంబన (నాయికా) గుణములు

(1) అనలంకృతమైనను అలంకృతమైనట్లే దేనిచే నెమ్మేను భాసించునో అది రూపము (2) ముత్తెములయందలి తరళచ్ఛాయవంటి ఛాయ యంగములం దేది విలసిల్లునో అది లావణ్యము (3) అంగ ప్రత్యంగకముల యథోచిత సన్నివేశము సుశ్లిష్టసంధిబంధము సౌందర్యము (4) తన గుణోత్కర్ష సారూప్యము నికటవస్తువునకుఁ గలిగించుట అభిరూపము (5) కోమలవస్తుస్పర్శను సైతము సహింపమి సౌకుమార్యము ఇవి ఆలంబన గుణములు

(౨) ఆలంబనచేష్టలు ఇవి (1) లీల, (2) విలాసము (3) విచ్ఛిత్తి (4) విభ్రమము (5) కిలికించితము (6) మోట్టాయితము (7) కుట్టమితము (8) బిబ్బోకము (9) లలితము, (10) విహృతము

(1) లలితవాగ్వేషభూషాచేష్టః చేత ప్రియుని అనుకరించుట లీల యనఁబడును (2) ఇష్టసందర్శనాదిచే యానస్థానాసనాదియందును భ్రూనేత్రానన వ్యాపారములందును గలుగు విశేషము విలాసము (3, కొంచె మయ్యు కాంతిపోషక మగు విన్యాస సౌభాగ్యము విచ్ఛిత్తి (4) ప్రియాగమనాదులందు సంతోషప్రేమ మదనావేశ సంభ్రమాదులచే అస్థానమునందు అలంకారాదులను తాల్చుట విభ్రమము (5) ఇష్టతమ సంగమనాదికృతహర్షముచేకలుగునట్టిది శ్రమాభిలాష గర్వస్మిత భయక్రోధ శుష్కరోదనాది సాంకర్యము కిలికించితము, (6) ప్రియానురాగవార్తాశ్రవణాది సమయములందు మనస్సు తల్లగ్నమై యుండుటచే కర్ణకండూతి అంగభంగములోనగు హేలాలీలా నిదర్శనములచే స్వాభిలాషను ప్రకటించుట మోట్టాయితము, (7) కుచకేశపాశాధరగ్రహణ వేళ ఆనందము కలుగుచున్నను దుఃఖితవోలె మృషాకోపము నటించుచు శిరము నాడించుట చేయి

విదల్చుట మున్నగునవి చేయుట కుట్టమితము (8) గర్వమానేర్ష్యా దులచే ఇష్టవస్తువునందును అనాదరము ప్రదర్శించుట బిబ్బోకము, (9) కరణ చరణాద్యంగముల సుకుమారన్యాసము భ్రూనేత్రాధర విలాస మసృణ భంగియు లలితము (10) ఈర్ష్యా మాన లజ్జాది స్వభావములచే భాషింపవలసిన వేళలందును భాషింపకుండుట విహృతము. (ఇవే గాత్రజములగు ననుభావములును)

(3) ఆలంబనాలంకృతులు - వాసోభూష మాల్యాను లేపనములు

(౪) తటస్థములు - ఆలంబనముతో సంబంధములేకయు ఉద్దీపనకములు - వసంతము ఉద్యానము, లతామండపము దీర్ఘిక సరోవరము, చంద్రోదయము, మందమారుతము మాకంద శోకాదితరువులు కోకిలషట్పదాలాపములు మేఘారవము భూగేహ ప్రాసాదక్రీడాసరిదాదులు సంగీతనృత్యాదులు

ఇవెల్ల నుద్దీపన విభావములు

అనుభావములు, సాత్త్వికభావములు

మఱి లోకమున స్థాయ్యాత్మకములు వ్యభిచార్యాత్మకములు నైన చిత్తవృత్తి విశేషములకు (భావములకు) ఇవి కార్యములుగ (ఆవిష్కారములుగ జ్ఞాపకములుగ, అనుమాపకములుగ) వాసి కెక్కి యున్నవి శ్రవ్యదృశ్యకావ్యము లభివర్ణితములై అభినయింపఁ బడియొండెడి ఇవి - ఆలంబనముల బాష్పకటాక్షాదులు - అనుభావము లని పేరొందియున్నవి ఇటను అనుభావవ్యపదేశము కార్యములకు

అలౌకిక మగు ననుభావనవ్యాపారము చేతనే అను = రసోత్పత్తికి పిమ్మట భావము=ఉత్పత్తి వేనికో అవి అనుభావములు అని వ్యుత్పత్తి ఈ వ్యుత్పత్తినిబట్టి వానికి రసకార్యత్వమే - రసనియతోత్తర కాలికత్వమే - సిద్ధించినది ఇవి చతుర్విధాభినయరూపములు

[శం] రససూత్రమున విభావై రనుభావైశ్చ' అని కరణ తృతీయచే వానికి కారణత్వమే - నియతపూర్వభావిత్వమే - చెప్పఁబడినది కావున అనుభావములును రసనిష్పత్తి కారణములుగ కావలెను ఎట్లు కార్యత్వము కారణత్వము రెండును అనుభావములకు సిద్ధించును ?

[సమా] రసపరిణతిం జెందుటయందు రత్యాదికి ఇవి కారణములు రసము నిష్పన్నమగుడు ఇవి రసకార్యములుగాను వ్యవహరింపబడును రసములు ఆంతరము లగుటచే రత్యాదులు పూర్ణపరిణామము చెంది రసత్వ మొందెనని జ్ఞానము కలుగుటకై జ్ఞాపకము అనుమాపకము ఏదేని వలయునుకదా అట్టి జ్ఞానము అనుభావములచే సహృదయునకు గలుగును కటాక్షాదులను సంభాదులను బట్టి రామాదుల యనురాగాదులను సహృదయుఁడు ఊహించునని భావము ఇవి కవిచే నభివర్ణితములై సహృదయునిచే భావితములగునప్పుడు అలౌకికము లగుటంజేసి వీని (లౌకిక) కార్యత్వము పోవును అనుభావవ్యపదేశ మొదవును కటాక్షాదులు సహృదయుని యంతఃకరణమునందున్న రత్యాదులను అభినయాదిద్వారమున అనుభావింపఁజేయును- ప్రతిబింబింపఁజేయును కావున అనుభావములని పేరు ఈ యనుభావన దశయందు రత్యాదుల స్ఫుటతరప్రకాశన వ్యాపారకాలమందు వీనికి కారణత్వమే సిద్ధము భూతపూర్వగతినిబట్టి కార్యత్వము అంగీకృతము

[శంక] కటాక్షాదులను ఉద్దీపనవిభావము లని యేల చెప్ప రాదు? కాంతాకటాక్షాదులు కామికి నాయకునకు మనోవికారమును ఉద్దీపింపఁ జేయఁజాలునుగదా ?

[సమా] నాయకుని మనసులోని రతికి అనుమాపకములగుట (అనుభావకము లగుట) అవి అనుభావము లగును అవే కంటికిఁ గనఁబడి రత్యుద్దీపకము లగుచో ఉద్దీపన విభావములును అగును


అనుభావములు స్వభావజములు అంగజములు సాత్త్వికభావ ములు అని ముత్తెఱంగు అందు 1 భావము 2 హావము 3 హేల 4 శోభ 5 కాంతి 6 దీప్తి 7 మాధుర్యము 8 ప్రాగల్భ్యము 9 ఔదార్యము 10 ధైర్యము అనునవి స్వభావజములు అందు మొదటి మూఁడును చిత్తమాత్రోత్పన్నము లయ్యు భ్రూనేత్రాదులందు తత్క్రియోత్పాదనమున అంగజములని [సాహిత్య దర్పణకారునిచే] వ్యపదిష్టములు కడమ యేడును అయత్నజములు శరీరమున స్వభావజము లని యర్థము వాని లక్షణ ములు

1 [పుట్టువు మొదలు] నిర్వికారమైన చిత్తమునందు ప్రథమ వికారము భావము 2 భ్రూనేత్రాది వికారములచే సంభోగేచ్ఛను దెలుపుచు ఈషత్ప్రకటితవికార మగు భావము హావ మనఁబడును 3 అత్యంతప్రకటితవికార మగు నా భావమే హేల యనఁబడును 4 రూప యౌవన లాలిత్య భోగాదులచే అంగములకుం గలుగుసొంపు శోభ యనఁబడును 5 ఆ శోభయే మన్మథోన్మేషముచే అతివిస్తీ ర్ణమై కాంతి యనఁబడును 6 ఆ కాంతియే వయోభేద దేశకాల గుణాదులచే అతివిస్తార ముద్దీపితమై దీప్తియనఁబడును 7 ఎల్లయవస్థా విశేషములందును రమణీయత (మార్దవము) మాధుర్య మనఁబడును

8 ప్రయోగములందు నిశ్శంకత్వము ప్రాగల్భ్యము 9 సర్వావస్థలయందు వినయము గల్గుట ఔదార్యము 10 ఎల్లప్పుడు ఆత్మశ్లాఘావిముఖమును స్థిరతరమును అగు చిత్తోన్నతి ధైర్యము [ఇవిగాక మఱి యెనిమిదింటిని సాహిత్యదర్పణకారుఁడు నాయికాలంకారములుగాఁ జెప్పెను]

(2) గాత్రజములగు ననుభావములు పూర్వోక్తము లగు పది యుద్దీపనవిభావములు లీలాదులు

(3) ఇఁక సాత్త్వికభావములు - ఇవి స్తంభము, స్వేదము, రోమాంచము స్వరభంగము వేపథువు వైవర్ణ్యము అశ్రువు ప్రలయము అని యెనిమిది ఆలంబనవిభావసంబంధులైన భ్రూవిక్షేప కటాక్షాది వికారములు సహృదయుని మనస్సునందుఁ బ్రతిబింబితములై సహృదయ హృదయస్థములై రత్యాదిభావమును ఏవి అనుభావింపఁ జేయునో - అనుభవగోచరము లొనర్చునో అవి ఆ కారణమున అనుభావము లనఁబరఁగును కదా అట్టి యనుభావములలో నంతర్గతము లగుటచే స్తంభాది సాత్త్వికభావములును కటాక్షభ్రూవిక్షేపాది వంటివే కావలసియున్నను 'విభావై రనుభావైశ్చ సాత్త్వికై ర్వ్యభిచారిభిః' అని రసనిష్పత్తికారణములలో అనుభావముల కన్న వేఱుగా అవి చెప్పఁబడినవి అట్లు గోబలీవర్దన్యాయమున, బ్రాహ్మణపరివ్రాజన్యాయమున నొండె - అనఁగా అనుభావ సామాన్యమునందుఁ జేరినను సాత్త్వికభావములకు విశేషము కలదని యెఱుక పడుటకే ఏమి ఆ విశేషము? సాత్త్వికభావములగు వికారములు సత్త్వభవములు- సత్త్వనిర్వృత్తములు సత్త్వాభివ్యక్తములొండె అవి భావములు, చిత్తవృత్తి విశేషములు అన్యా[illegible]భావములు కావు ఇది భేదము భరతముని నలువ[illegible]


Vignana ... Sundarayya ... Library A c. No

8 స్థాయులు 33 వ్యభిచారులు కాక అనుభావములలో నీ తొమ్మిని స్థాయిభావములే భావములని ఎచించినాఁడు కదా

[శంక] సత్త్వభవములు కదా సాత్త్వికములు, ఏ మా సత్త్వము?

(సమా) సామాజికుని యాత్మయందు విశ్రామముగల రసాదికి నియతప్రకాశకము (ఉద్బోధకము) అగు నాంతరధర్మము సత్త్వము (సా ద) ఆంతర అనుట అనుభావాంతరములందతిప్రసక్తి వారించుటకు ఒండె "పరగతసుఖదుఃఖాదిభావనయందు అత్యంతానుకూల మగు నంతఃకరణధర్మము సత్త్వము ఇట్టిదైన యంతఃకరణధర్మముచే కటాక్షభ్రూవిక్షేపాదులు భావింపఁబడినను అవి యనుభావమాత్రములే యగును. సాత్త్వికభావములు కానేరవు ఏలన విభావాదిదర్శనజన్యమగు ననురాగాది చిత్తవృత్తులు విభావాది (రత్యాది) తన్మయీభవనరూప మెందుచే సత్త్వ మనఁబరఁగును కావున ఇట్లు సామాజికుని మనసున నవస్థాంతరమును పొందిన రత్యాదిచిత్తవృత్తులే స్తంభాదికము సాత్త్వికభావములు విభావాదిచే నుత్తేజితములగు రత్యాదులు వ్యభిచారులచే పరిపుష్టములై సాత్త్వికభావము లను నవాంతరస్థితి నొంది పిమ్మట రసత్వ మొందును. రత్యాదులకు రసీభావమొందుటయందు సాత్త్వికభావత్వము ఒక అంతరాళదశ ఇవి బాహ్యము లగు కేవలానుభావ స్తంభాదులు కావు తద్విలక్షణములు ఆ యాంతర స్తంభాదులకు ఈ బాహ్యములు జడములు భౌతికములు శారీరములు ననగా స్తంభాదులు కార్యభూతములు చిత్తమున ఆ స్తంభాదులు ఉదయింప ఇవి శరీరమునందుదయించును. నానిని సూచించును ఇట్లు ఆంతరాళిక భావములను ఆంతర స్తంభాదులను సూచించుచు ఇవి నిజముగ రసీ

స్థాయిభావములతోడఁ బరిగణించెనుగదా.) అవి ఉద్బుద్ధము లగు క్రమ మిట్లు:

పృథ్వీభాగప్రధానమైన ప్రాణమందు సంక్రమించిన రత్యాదిచిత్తవృత్తిగణము విష్టబ్ధచేతత్వము స్తంభత్వ మొందును. జలభాగప్రధానమైన ప్రాణమందు సంక్రమించిన రత్యాదిచిత్తవృత్తిగణము బాష్పమగును ప్రాణమునకుఁ దేజస్సు నికటమగుట, తేజోభాగప్రధానమగు ప్రాణముయొక్క తీవ్రానుగ్రహమువలన రత్యాదిగణము స్వేదమును అతీవ్రానుగ్రహము గల రత్యాదిగణము వైవర్ణ్యము నగును ఆకాశభాగ ప్రధానమగు ప్రాణమునందు సంక్రమించిన రత్యాదిగణము గతచేతనత్వము ప్రలయము. వాయుస్వాతంత్ర్యమున ప్రాణమునకు మందమధ్యమోత్కృష్టావేశములు గలిసపుడు దానితో సంక్రమించిన రత్యాదిగణము వరుసగా రోమాంచము వేపథువు స్వరభేదము అగును ఇవి ఆంతరాళికభావములు వీనిని తత్కార్యములు బాహ్యస్తంభాద్యనుభావములు సూచించును నిజమునకు రసీభావ మొందులోపల నవాంతరసాత్త్వికభావదశావిశేషాపన్నములగు రత్యాదిభావములనే ఈ బాహ్యస్తంభాదులు సూచించును అని భరతవిదులు వచింతురు ఇట్లు హేమచంద్రాచార్యులు సాత్త్వికభావముల నిరూపించెను.

ఈ సాత్త్వికభావములు వ్యభిచారిభావములకన్న విలక్షణములని చెప్పితిమి ఎలన వ్యభిచారిభావములు బాహ్యకారణజన్యములు సాత్త్వికభావములు ఆంతరకారణసముద్భవములు మఱియు వ్యభిచారిభావములు నానారసముల వ్యభిచరించును సాత్త్వికబావములు ప్రతిరసభిన్నముగ సంభవించును ఈ సాత్త్వికభావములు తొలుత రత్యాదులు వెనువెంట రసాత్మకము లగును వీని ననుసరించి రసాస్వాద ముండును అట్లయ్యును భృత్యుని పెండ్లియందు తదనుగతుఁడై రాజున్నట్లుండును దప్ప వ్యభిచారులవలె స్వాతంత్ర్యగంధమును ఇవి

భావ మొందుచున్న రత్యాదులనే సూచించుచున్నవి ఇట్లగుటంజేసి స్థాయిసంఘమే రసీభావ మొందునంతలో నడుమ జీవుని మనోమయావస్థనొంది కార్యకారణ రూపమున ఇఱు తెఱంగుల కారణరూపమున నాంతర స్తంభాదిసాత్త్వికభావములను కార్యరూపమున బాహ్య స్తంభాద్యనుభావములను సంపాదించునని రహస్యము (కుమారస్వామిసోమపీథి రత్నాపణము) ఇట్లు సాత్త్వికభావములకు విశేష ప్రతిపత్తి రసోద్బోధనప్రకర్ష ప్రాశస్త్యము కలదని ఎఱుక విభావాది సామగ్రీ సమవధానమున రత్యాదులు రసత్వపరిణామ మొందుచో నియతముగ సాత్త్వికభావముల రూపొందునని అవి బాహ్య స్తంభాదులచే సూచితము లగునని నిగ్గు స్థాయిభావము రసీభావ మొందినంత ఇవియు నంతర్ధాన మొందును

స్థాయిభావములు సాత్త్వికభావము లగు విధానమునుగూర్చి మతభేదము కలదు [చూ॰ రత్నాపణము] అందు హేమచంద్రుని మత మిట్లు కావ్యానుశాసనమున ప్రతిపాదితమై యున్నది - ‘సీదత్యస్మిన్ ఇందు [ఈ సాత్త్వికభావములందు] ఉండునది సత్త్వము అను వ్యుత్పత్తివలన సత్త్వగుణములకు ఉత్కర్ష కల్గించునది సాధుస్వభావము గలిగినది యగుట ప్రాణవస్తువు సత్త్వ మనఁబడును సత్త్వమువలనఁ గలిగినవి సాత్త్వికములు స్తంభాద్యనుభావములకన్న విలక్షణములై భాసించును అనఁగా రత్యాదిచిత్తవృత్తులు తొలుత వాసనారూపమున నున్నట్టివి విభావాదులచే నుత్తేజితములైనంత రసీభావమొందునవై నడుమదారిలో అభ్యంతర ప్రాణములతోఁ జేరి స్తంభాదిరూప మొంది బాహ్యములు జడములు శారీరములునైన స్తంభాద్యనుభావములచే సూచింపఁబడును అవి భావములే. (భరతుఁడు ఈ సాత్త్వికభావముల నెనిమిదింటిని వ్యభిచారిభావములతోఁ డ

భజింపవు’ అని ఇట్లు హేమచంద్రాచార్యులు సాత్త్వికములు వ్యభిచారులకన్నను పైవిగా నిరూపించెను

హేమచంద్రుఁడు ఈ సిద్ధాంతమును “భరతవిదుల’ మతముమూగా నుల్లేఖించెను కాని భరతనాట్యశాస్త్రమందుఁగాని పూర్వాలంకారికగ్రంథములం దెచ్చటఁగాని ఇది చెప్పఁబడలేదు ఈవలివారెవరును దీనిననుసరింపనులేదు భరతముని యీమాత్రము చెప్పెను సాత్త్వికభావములఁ గూర్చి— సాత్త్వికభావములు సత్త్వసముద్భవములు సత్త్వము మనస్సంభవము అది సమాహితమానసమునుండి ఉత్పన్నమగును. మనస్సమాధానమున - అనఁగా విభావాది భావనమున నిమగ్నమైన సమాహితమనస్సున - సత్త్వమువలన నిర్వృతి కలుగును దానికి స్తంభరోమాంచాదులు స్వభావములు మనస్సు అన్యథాభావమున నున్న - అసమాహితమైన - అవి జనింపవు’ అని.

స్తంభాదుల లక్షణములు

భయ సంతోష రోగాదులచేత చేష్ట దక్కుట స్తంభము 2 రతి ఉక్క శ్రమము లోనగు కారణములచేత దేహజలము వెలికుఱుకుట స్వేదము 3 సంతోషము ఆశ్చర్యము భయము లోనగు కారణములచేత వెండ్రుకలందుఁ గల్గు విక్రియ రోమాంచము 4 మదము సమ్మదము పీడ లోనగువానిచేఁ గల్గు గద్గదస్వరము వైస్వర్యము (స్వరభంగము) 5 రాగద్వేష శ్రమాదులచేఁ గలుగు దేహకంపము వేపథువు 6 విషాద మద రోగాదులచే వర్ణము మాఱుట వైవర్ణ్యము 7 క్రోధ దుఃఖ ప్రహర్షములచేఁ గల్గిన కన్నీరు అశ్రువు 8 సుఖదుఃఖములచేత చేష్టాజ్ఞానము వెడలుట ప్రళయము

ఉదాహరణము :—

ఖేదో వాచి తథాజలం నయనయో ర్బిమ్బాధరే వేపథుః
గణ్డే పాణ్డురుచి స్తనే చ పులకవ్రాతో, లయ శ్చేతసి,
స్వేదామ్భః కుచమండలే చరణయోః స్తమ్భః సముజ్జృంభతే
తత్కిం రాజపథే వ్రజేంద్రతనయః కృష్ణ స్త్వయాఽలోకితః ?
(రసమంజరి)

నాయికనుగూర్చి సఖి మాటలు

నీకు మాటయందు గద్గదస్వరము కనులందు బాష్పము దొండపండువంటి యధరమున వడఁకు, చెక్కిటియందుఁ దెల్లఁదనము మేనియందు పులకలు ముత్తము మనస్సులో తిచ్చపాటు, చనుదను లందు చెమట, పాదములయందు బ్రామాన్పాటు అతిశయిల్లుచున్నవి రాజమార్గమందు గొల్లల దొరకొడుకును కృష్ణుని జూచితివా ఏమి ? [అట్లు కానిచో నీకును సకలసాత్త్వికములు ఒక్కుమ్మడి నేల యుదయించును ?]

ఇట్లు స్థాయిభావములు విభానుభావవ్యభిచారిభావములు నిరూపితములు ఇఁక—

రససముల్లాసక్రమము

విభావానుభావ వ్యభిచారిభావసంయోగాత్ రసనిష్పత్తిః అని భరతముని చెప్పిన రససూత్రము విభావములు నాయికానాయ కులు వారి యనుభావములు వ్యభిచారిభావములు వీనికి సహృదయ హృదయమ్మున రత్యాదిసంయోగము కలుగుటవలన రసనిష్పత్తి అని యర్థము ఇట నిది యనధేయము.

లోకమున - అనఁగా శ్రవ్యదృశ్యకావ్యాతిరిక్త స్థలమునందు రూప వేషోజ్జ్వలులకు పరస్పరగుణాకర్ణనముననో అవలోకనాదినో ప్రీతి యుదయించును అది ఆ యువల లావణ్యాలంకారాదులచేతను ఉద్యానమందసమీరణాదులచేతను ఉద్దీపిత మగును ఆ ప్రీతికి ఉత్కంఠ యని మఱియొక పేరు అది అభిలాషాకారముగ పరిణమించును దానికి రతి యని పేరు పిమ్మట మిథస్సమాగమోపాయ జిజ్ఞాస్యమానులగు నా యువల చిత్తముల గ్లాని శంకావిషాదాదులు ప్రాదుర్భవించును పిమ్మట ఆ రతిచేతను ఆ చింతాదులచేతను తదుభయవ్యంజకములు చేష్టలు జనించును ఆవల స్వయముగనో దూతీ ప్రేషణాది ద్వారముననో వారికి సమాగమము కలుగును ఆ రతి ఉత్తరోత్తర ముజ్జృంభించి లౌకికసంభోగశృంగారపరిణామ మొందును పిమ్మట చింతాదులు తొలఁగును ఇది లౌకికరస నిష్పత్తిప్రక్రియ

మఱి అలౌకికదశయందు - అనఁగా వాగంగాహార్యసాత్త్విక రూప చతుర్విధాభినయ ప్రధానమును సాక్షాత్కారయోగ్యము నగు దృశ్యకావ్యమును సహృదయుఁడు చూచునపుడును అను ప్రాసార్థాలంకారాదులను గుణరీతివృత్త్యాదులతో విలసిల్లు శ్రవ్యకావ్యమును సహృదయుఁడు చదువునపుడును తొలుదొల్త నభిధావృత్తిచే శబ్దోపాత్తము లగు దేశకాలపాత్రత్వాది వైశిష్ట్యముగనే విభావాదులను గ్రహించును అనఁగా - నాయకుని దుష్యంతునిగను పూరువంశనృపునిగను ప్రాచీనునిగను కణ్వాశ్రమగతునిగను శకుంతలారమణునిగను నాయికను శకుంతలగను కణ్వపుత్త్రిగను దుష్యంతరమణిగను గ్రహించును అట్లే గ్రహించిన 'తాటస్థ్యమునం'జేసి సహృదయునకు శకుంతలారతి యెడ ఉపేక్షాభావము పర్యవసించును రససముల్లాస మొదవదు

(2) కాని శ్రవ్యకావ్యమునందు అనుప్రాసాద్యర్థాలంకారాది మహిమచేతను గుణాలంకారాది మహిమచేతను – కవికృత సముచిత విభావాదినిబంధనముచేతను దృశ్యకావ్యములందు రంగ పరికరగీతవాద్య పూర్వరంగాదులచేతను చతుర్విధాభినయనైపుణిచేతను సహృదయుఁడు సహజమగు కావ్యార్థ పునఃపునరనుసంధాన రూపభావనా విలీనాంతఃకరణుఁ డగును

(3) ఆ శబ్దార్థప్రతీత్యనంతరభావనాబలముచే అతనికి విలక్షణ మానసిక ప్రత్యక్షజ్ఞాన మొండు కలుగును అందు విభావాదులెల్ల శబ్దోపాత్తనైయక్తిక విశేషధర్మమునుండి గళితములై తత్తద్దేశకాల సంబంధాదుల నుపహరించి భాసించును శకుంతలాదు లిపుడు కేవలము తనకు (అగమ్యత్వాభావవిశిష్ట) కాంతాత్వాది సాధారణధర్మావచ్ఛిన్నముగా శృంగారరసాద్యాలంబనమాత్రములుగ భాసింతురు వారి రత్యాదులు శకుంతలాదుష్యంతాదుల రత్యాదులుగాఁ గాక కేవల రత్యాది సామాన్యాకారముగ సర్వస్త్రీపురుషసాధారణమగు రత్యాద్యంతఃకరణ ధర్మములుగ భాసించును ఈ సాధారణీభావసిద్ధి కేవల కావ్యగత విభావాదికే కాదు అది కావ్యము నాస్వాదించు సహృదయుని విషయము ననుసరించును సహృదయునకు స్వవైయక్తిక ప్రతీతికాని (నేను దేవదత్తుఁడను అని) స్వకాంతారతిత్వప్రతీతి కాని మిత్రశాత్రవ తటస్థప్రతీతికాని ఉండదు అవి రసాస్వాదవిఘ్నరూపములు మఱి శరీరోపాధిజనితములైన యల్పజ్ఞత్వ–పరిమిత ప్రమాతృత్వాది ప్రతీతికాని యుండదు ఇవెల్ల అజ్ఞానావరణలక్షణములు నిజమునకు సహృదయుఁడు శరీరోపాధ్యతీతుఁడు పరమాత్మస్వరూపుఁడు అపరిచ్ఛిన్నుఁడు ఆనందస్వరూపుఁడు అందుచే భావనాప్రభావజనిత సాధారణీకరణసిద్ధిచే అజ్ఞానావరణభంగము కలుగును శరావాద్యావరణము తలఁగఁ దన్నును సమీపపదార్థములను

భాసింపఁజేయు దీపమునలె - స్వస్వరూపానందాంశచే తన యంతః కరణమున భాసించుచు - అందు మున్నెన్నఁడో ప్రవేశించి అంతః కరణధర్మములుగ నెలకొనియున్న రత్యాదిభావములను, విభావాది సంవలితములను ఆనందరూపమున భాసింపఁజేయును పానకరస న్యాయమున విభానుభావసాత్త్వికవ్యభిచారిభావసంవలితరతి ఏకాకార మున అఖండాస్వాదరూపమున రసఘనముగ సముల్లసించును ఆ యానందాకారావభాసమాన చిదవచ్ఛిన్న రత్యాది స్థాయిభావమే రస మనఁబడును అది విగళిత వేద్యాంతరమును, బ్రహ్మానంద సబ్రహ్మచారి (కల్పము) నగును

రసగంగాధరము

నవీనవ్యాఖ్యావివరణసముల్లసితము

అథ 3 రససూత్ర వ్యాఖ్యాన ప్రకారములు

అభినవగుప్తపాదమతము — సిద్ధాంతము

వ్యక్తిశబ్దవిచారము

కావ్యప్రకాశమునందు మమ్మటభట్టు మేము చెప్పినట్లే యిట్లు రసస్వరూపముఁ జెప్పినాఁడు

వ్యక్తః స తైర్విభావాద్యైః స్థాయిభావో రసస్స్మృతః అని

ఇందు వ్యక్తః అను పదమునకు వ్యక్తి విషయముగా జేయఁబడినది' అని యర్థము వ్యక్తి యన ఇట వ్యంజనా వ్యాపారము అని యర్థముకాదు అది అన్యత్ర ప్రసిద్ధమైనను ఇచ్చోట వ్యక్తి యన భగ్నావరణమైన (ఆస్వాదరూప) చైతన్యము వివక్షితము విభావాదులచే భగ్నావరణమైన చైతన్యమునకు విషయముగాఁ జేయఁబడిన స్థాయిభావమే రసమని చెప్పఁబడును అని యీ వాక్యమునకు అర్థము [ఆస్వాదనమునకుఁ గారణమైన వ్యంజనా వ్యాపారముకాదు రసము విభావాదులచే ఆ చైతన్యమునకు (ఆస్వాదమునకు) విషయ మొనర్పఁబడిన స్థాయిభావము రసము] అది యిట్లు

శరావాదిచేఁ గప్పఁబడియున్న దీపము ఆ మాటు తొలఁగ గనే సన్నిహితములై యున్న ఘటపటాది పదార్థములను ప్రకా

శింపఁజేయుచు తానును ప్రకాశించును అట్లే ఆత్మచైతన్యము అంతఃకరణమున అజ్ఞానరూపావరణము భగ్నముకాఁగా తానానంద రూపమున భాసించుచు (ఆ యంతఃకరణమునందే) సన్నిహితములై యున్నట్టి రత్యాదిస్థాయి భావములను విభావాదిసంవలితములను ప్రకాశింపఁజేయును (వర్ణ్యమానగోచరముల నౌనన్నను) అవి సాక్షాత్తుగా సాక్షిభాస్యములగునని భావము వేదాంత శాస్త్రమున అంతఃకరణధర్మములు సుఖదుఃఖాదులు సాక్షిబాస్యము లని అంగీకరింపఁబడినవి కావున

[శంక] సాక్షిభాస్యత్వ మననేమి

[సమా] అంతఃకరణ వృత్తి గోఁ బనిలేక (తద్వారమునంగాక) సాక్షాత్తుగా నాత్మచేఁ బ్రకాశింపఁజేయఁబడుట ఇట వేదాంత మతమున ప్రత్యక్షప్రక్రియ నెఱింగిన సాక్షిభాస్యపదార్థము తేటతెల్లమగును

వేదాంతుల ప్రత్యక్ష ప్రక్రియ

తటాకోదకము తూములగుండ బయల్వెడలి చేలలోఁ బ్రవేశించి ఆ చేలవలెనే చతుష్కోణాకారముగ నగుటఁ జూతుముకదా అట్లే తైజసము అంతఃకరణము సైతము చక్షురాదీంద్రియ ద్వారమున విషయదేశమును పొంది ఘటాదివిషయాకారమునఁ బరిణమించును ఆ పరిణామమునకే వృత్తి అని పేరు వెనువెంటనే తద్ద్వారముననే పోయి చైతన్యము ఘటాదివిషయాకార పరిణతమైన యా యంతఃకరణవృత్తియందుఁ బ్రతిఫలించును అంత ఇది ఘటము అను ప్రత్యక్ష ప్రమితి ఉదయించును మఱి విషయములు బాహ్యములు కానప్పు

డును బాహ్యములైనను ప్రాతిభాసికములు (భ్రాంతికల్పితములు) అయినప్పుడును అంతఃకరణవృత్తితోఁ బనిలేదు ఉదా అంతఃకరణ ధర్మములైన సుఖదుఃఖాదులు అంతఃకరణమునసే యుండును గావున తద్భాసనార్థము అంతఃకరణవృత్తి బయల్వెడల నక్కఱయుండదు అవి చైతన్యముచే సాక్షాద్భాస్యము లగును భ్రాంతి కల్పిత శుక్తి రజతాది పదార్థములు వాస్తవములుకావు గావున అవి బాహ్యము లైనను అంతఃకరణవృత్తి బయల్వెడలి తదాకారపరిణామ మొందుట ఘటిల్లదు ఇట్లు అంతఃకరణవృత్తి ద్వారమునంగాక ఆత్మచైతన్య ముచే సాక్షాత్తుగాఁ భాసింపఁజేయఁబడు పదార్థములు సాక్షిభాస్య ములు రత్యాది స్థాయిభావములు అంతఃకరణధర్మములు అట్టివి సుఖదుఃఖాది సదృశములు

[శం] సరి రత్యాదులు అంతఃకరణమునందే యున్నందున సాక్షిభాస్యము లగుఁగాక మఱి విభావాదులో? అవి బాహ్యము లగుట ఘటపటాదులవంటివే కదా? వానికి సాక్షిభాస్యత్వ మెటు సంగతము?

[సమా] లోకములో నాయికాది లౌకికవిభావాదులు బాహ్యములైన ఘటపటాదులవంటివే కాని, విలక్షణకావ్య ప్రపంచమునందు లోకోత్తర విభావనాది మహిమచే విభావాదులు అలౌకికత్వ మొందును అనఁగా సహృదయుని భావనామహిమచే విభావాదులును రత్యాదులవలె నంతఃకరణధర్మములై అందు నెల కొన్నవై చర్వణాసమయమున పానకరసన్యాయమున రత్యాదులతో కలిసి యేకీభూతములై సాక్షిభాస్యము లగును ఎట్లన విభావాదులకు నుంగూడ స్వప్నతురగాదులకుంబోలె రంగరజతాదులకుంబోలె సాక్షిభాస్యత్వము అవిరుద్ధము

లోకమున తురగము తగరము (రంగము) ఇవి బాహ్య పదార్థములు అందుచే సాక్షిభాస్యత్వము వానికి లేదు. కాని, స్వప్నమునందు తురగము భాసించునో ఆ స్వప్నతురగప్రత్యక్షము కాల్పనికము ఎట్లన స్వప్నదశయందు ఇంద్రియ వ్యాపారము లెల్ల నుపరతము లగుటంజేసి భోక్తయగు నాత్మ శ్రోత్రయింద్రియ ములను మానసికములను కల్పించుకొని తురగాది పదార్థముల యనుభవ మొందును అందుచే స్వప్నతురగము అంతఃకరణబాహ్య పదార్థము కామింజేసి అంతఃకరణధర్మాదుల వలెనే సాక్షిభాస్యము అట్లే జాగ్రద్దశయందే దూరమున నుండి ఎండలో తగరమును జూచి దాని ధాళధళ్యదోషముచే రజతభ్రాంతి గొన్న వానికి ఎదుట నున్నట్లు చూపట్టుచున్న (ప్రాతిభాసిక) రజతమునకు చక్షురింద్రియసంయోగము లేదు పారమార్థికముగ నున్న పదార్థములతో నింద్రియములకు సన్నికర్ష యుండునుగాని ప్రాతిభాసికములతో నుండదు ఇంద్రియార్థసన్నికర్షము లేనప్పుడు అంతఃకరణము బయల్వెడలి విషయదేశము నొందదు అందుచే రంగరజతము సాక్షిభాస్యము స్వప్నతురగ రంగరజతాదు లెట్లో అట్లే నాయికాది విభావములును బాహ్యములైనను భావనారూఢము లగుట కాల్పనికములు అలౌకికములు కావున సాక్షిభాస్యములగుట ఒప్పియున్నది

రసమునకు ఉత్పత్తివినాశములు ఔపచారికములు

[శంక] ఓయీ విభావాదులకును రత్యాదులకుం బోలె సాక్షిభాస్యత్వము ఉండుఁగాక మఱి ఆత్మచైతన్యము రసమునకన్న వేఱుకాదని ఎట్లు అంగీకరింపవగును? అట్లంగీకరించిన ఆత్మ నిత్యమగుట, రసమును నిత్యముకదా కావలెను? అట్లైనచో రసము ఉత్ప

న్నము' రసము వినష్టము అను నీ సర్వానుభవసాక్షికము లగు రసోత్పత్తివినాశము లెట్లు సంగతము లగును ?

[సమా] అవి యౌపచారికప్రయోగములు రసము నిత్యమే ఉక్తవ్యవహారములకు నిమిత్తమేమన రసవ్యంజకము లగు విభావాదుల చర్వణయొక్క యుత్పత్తివినాశములు వ్యంగ్యమగురసమునందు సమారోపింపఁబడుటయే కాదా ఆవరణభంగముయొక్క యుత్పత్తివినాశములఁ బట్టి రసమునందు ఉత్పత్తివినాశములు ఆరోపింపబడుటయే నిమిత్తము అంతియేకాని నిజముగా రసమునకు ఉత్పత్తివినాశములు లేవు ఇందులకు నిదర్శనము శబ్దనిత్యత్వము నంగీకరించు వైయాకరణులు మీమాంసకులు గకారము పుట్టినది గకారము నశించినది అను వ్యవహారములకు ఎట్లు గతి కల్పించిరి ? వారు నిత్యములగు గకారాది శబ్దవిషయమున తద్వ్యంజకములకు కంఠతాల్వాది వర్ణోచ్చారణానుగుణవ్యాపారముల యుత్పత్తి వినాశముల యారోపమునుకదా నిమిత్తముగాఁ జెప్పుదురు అట్లే ప్రకృతమున నగుఁగాక

[శంక] ఇట తొలుత విభావాదుల చర్వణ నుల్లేఖించి వెంటనే పక్షాంతరముగా ఆవరణభంగమును వచింపనేల ?

[సమా] వీలన రసాదివ్యంజకము లగు విభావాదులచర్వణ రసమునకన్న వేఱుకాదు విభావాది సంవలిత రత్యాదియే రసముగా నాస్వాదింపఁబడును కావున అందువలన విభావాది చర్వణకును రసమునకుంబోలె వాస్తవికమగు నుత్పత్తి వినాశములే సంభవింపవు అందుచే ఆ పక్షమున అరుచి కలదని పక్షాంతరము ఉక్తము ఆవరణభంగ మన్ననో నిత్యముకాదు దానికి కలవు ఉత్పత్తివినాశములు

[శంక] రత్యాది స్థాయులు వాసనారూపమున నంతఃకరణమున నిత్యముగ నెలకొనియుండునుగదా మఱి (ఆవరణ భంగము కలుగ) సర్వదా ఏల రసాస్వాదము కలుగదు ?

[సమా] ఆవరణ భంగమునకు విభావాదుల చర్వణ అవధి (మేర) ఆ విభావాదిచర్వణ ముగియఁగా ఆవరణభంగము ముగియును రసరూప చిదానందాస్వాదమును ముగియును అప్పుడు విభావాదులు సూక్ష్మాకారమున (వాసనారూపమున) నంతఃకరణమున నున్నను వాని చర్వణ యుండదు అవి ఆస్వాద్యములు కాకపోవు నని భావము అందుచే రసాస్వాదము నిత్యముకాదు సమవాయికారణమున్నంతవఱకే కార్యమునకు ఉనికి తంతు లున్నంతవఱకే వస్త్రమునకు ఉనికి తంతువులు దగ్ధమగుడు వస్త్రము మిగిలియుండదు అందుచే ఎంతవఱకు విభావాదిచర్వణ యుండునో అంతవఱకే ఆవరణభంగము వెంటనే జ్ఞానాత్మ ప్రకాశమును ఆవృత మగును దీపమును శరావాది మూసినపైన సన్నిహితఘటపటాదిపదార్థములు ఎట్లు భాసింపవో అట్లే అంతఃకరణమునందు రత్యాదులు సన్నిహితములై యున్ననుంగూడ ఆవృతచైతన్యమునకు తదాస్వాదము ఉండదు

భావనావ్యాపారము వ్యాపార విశేషము కాదు

ఇంతవఱకుఁ జెప్పిన ప్రక్రియనుబట్టి చెప్పంబడిన భావన వ్యంజనవలె నొక వ్యాపారవిశేషముకాదు సహృదయునకు నిజ సహృదయత్వబలముననే యున్మేషించిన యంతఃకరణధర్మ విశేషము విభావాదిపునఃపునరనుసంధానరూపము తన్మహిమ

చేతనే తత్తత్స్థాయీభావ విషయకము రసాభిన్నచిదాత్మస్వరూపా
నందము - సమాధిలో యోగికింబోలె నుదయించును.

వ్యంజనావ్యాపార మొక్కటే చాలును

ఈ మతమునుబట్టి రసాత్మకప్రతీతి ఉదయించుటకు కేవలము
వ్యంజనావ్యాపారము ఒకటేచాలును. దానికి భావన సహకారి

[శంక] భావన అను స్వతంత్రవ్యాపారము నొప్పుకున్న అజ్ఞానా
వరణము భంగ మగుట దుర్ఘటముకదా ?

[సమా] కాదు ఆవరణభంగము సాధారణీకరణముచేఁ
గల్గును సాధారణీకరణము భావనచేఁ గల్గును సహృదయుఁడైన
వానికి ఆ భావనాసామర్థ్యము నైజసిద్ధము. భావనాఖ్యవ్యాపార
లభ్యముకాదు వ్యంజనావ్యాపారమే సహృదయత్వ సహకృతమై
కావ్యార్థ విషయమున పూర్వోత్పన్న విభావసాధారణీకరణరూపా
వరణభంగము పొనర్పఁజాలును ఆ కారణమున ఆ వ్యంజనావ్యా
పారమే ఆత్మచైతన్యరూపానందాకారవృత్తిని అంతఃకరణమున నుత్పా
దింపఁజేసి సహృదయుని తత్స్వరూపునిగ భాసింపఁజేయఁజాలును
అది సమాధికాలమున యోగిచిత్తమున నుత్పన్నమగు నానందాకార
వృత్తి (పరిణామము) వంటిది అది సాహిత్యశాస్త్రమున రస మనఁ
బడును అని భావము రసరూపానంద మిది లౌకికముఁ లగు స్రక్చం
దనవనితాద్యుపభోగజనిత సుఖమువంటిదికాదు ఏలన లౌకికములు
అవి అంతఃకరణవృత్త్యవచ్ఛిన్నరూపములు రసమన్ననో అంతఃకరణ
వృత్త్యనవచ్ఛిన్నరూపము శుద్ధచైతన్యరూపముగ ననుభూతమగుచు

పై (జెప్పినదెల్ల అభినవగు ప్తమమ్మటభట్టాదుల గ్రంథసార స్యమున రససూత్రమునకు సిద్ధించిన యర్థము - భగ్నావరణచిద్వి శిష్ట (విషయీభూత) రత్యాదిస్థాయీభావము రసము అని

గ్రంథకర్త వ్యాఖ్యాన చాతుర్యము

కాని, వాస్తవమునకు రత్యాద్యనచ్ఛిన్నము భగ్నావరణము నగు చిత్తే రసము

ఏతన్మతమునుబట్టి రసము రత్యాది స్థాయిభావరూపము కాదు. చిదభిన్నమే. చిత్స్వరూపమే అందుచే రసము సచ్చిదానంద స్వరూపము కాని, అది బ్రహ్మానందవిలక్షణము ఏలన, బ్రహ్మా నందము శరీరేంద్రియ మనోబుద్ధ్యాది సర్వోపాధిరహితము నిర వచ్ఛిన్నము, నిర్విషయము నగు నానందము రసమన్ననో రత్యు పాధ్యనచ్ఛిన్నము (రత్యాది విషయకము) సవిషయకము ఇది భేదము.

రసము (1) రత్యాద్యనచ్ఛిన్నచిత్తు ఐనను (2) చిదవచ్ఛిన్న రత్యాది యైనను - ఈ రెండుపక్షములందును రసాద్యభివ్యక్తి విశిష్టాత్మయగుటచే - విశేషణ మైనను విశేష్య మైనను చిదంశను బట్టియే అందుచే రసమునకు నిత్యత్వము (ఉత్పత్తి వినాశరాహి త్యము), స్వప్రకాశ్యత్వము (ప్రకాశాంతరాప్రకాశ్యత్వము - విగ లితవేద్యాంతరత్వము) సిద్ధము

[శంక] నిత్యము స్వప్రకాశము రస మగుచో మఱి లోక మున 'ఉత్పన్నము రసము' 'వినష్టము రసము" అను వ్యవహారము లెట్లు కుదురును?

[సమా] రత్యాద్యంశే నవలంబించిన కుదురు నని ఎఱుంగ వలెను ప్రథమకల్పమును బట్టి రసము రత్యాదిగా గ్రహించిన రసము అనిత్యము ఇతరభాస్యము నగును ద్వితీయ పక్షము ననుసరించి రసము చైతన్యాంశగా గ్రహించిన నిత్యము స్వప్రకాశము నగును ఇట్లు ఉభయవ్యవహారములును సంగతము లగును

[శంక] మఱి చర్వ్యమాణము రసము' అను చిరంతన వ్యవహారము కలదే అదెట్లు సరిపడును ?

[సమా] ఎట్లన ప్రాచీనమతము ననుసరించి చర్వణ యన చైతన్యము నావరించియుండు నజ్ఞానధ్వంసనే అజ్ఞానావరణ భంగము కాగా రసాస్వాదము తనంతనే కలుగును అది రసము [అందుచే అజ్ఞానధ్వంసముచేఁ గల్గు రసాస్వాదము చర్వణ] కాదా (మతాంతరము ననుసరించి) ఆనందాకారవృత్తి (ఆనందాకార పరిణామము పొందిన రత్యాద్యవచ్ఛిన్నాంతఃకరణము) చర్వణ అంతఃకరణము వేఱుగా లేదని భావము

ఈ చెప్పిన చర్వణ అసంప్రజ్ఞాతసమాధి కన్న (అందు తత్కాలోత్పద్యమాన బ్రహ్మరసాస్వాదమున కన్న - పరబ్రహ్మ సాక్షాత్కారమున కన్న) విలక్షణము ఎట్లన రసచర్వణకు విభావాది విషయ సంవలిత (మిశ్రిత) మగు చిదానందము ఆలంబనము ఇట నభిప్రాయ మిది (1) పరబ్రహ్మ సాక్షాత్కారము విషయసంవలితము కాదు (2) శ్రవణ మనన నిదిధ్యాసాదివ్యాపారజన్యము తత్త్వమస్యాది శబ్దజన్యము) (1) మఱి రసాస్వాదమన్ననో విభావాది విషయ సంవలితాత్మానందము (2) రసము కావ్యవిలక్షణమైన వ్యంజనా (రసనా) వ్యాపారమాత్రజన్యము [వ్యంజనావ్యాపార విషయక శబ్దజన్యము) ఇది భేదము

[శంక] మఱి చర్వణకు సుఖాంశభానమున ఏమి ప్రమాణము?

[సమా] సమాధియందు యోగికి కలుగు ప్రతీతి సుఖాత్మక మన నేమి ప్రమాణము ? అని నేము ప్రతిప్రశ్న చేయుదుము. సహృదయులయొక్కయు యోగీశ్వరులయొక్కయు అనుభవమే ప్రమాణము ఇంకొక ప్రమాణము ఉభయత్ర సాధ్యముకాదు

యత్రోభయోః సమో దోషః
పరిహారోఽపి తాదృశః
నైకః పర్యనుయోక్తవ్యః
తాదృగర్థవిచారణే.

అని నియమము ఏ విషయమున వాది ప్రతివాదులకు దోష పరిహారములు సమానములో అట్టి యర్థవిచారణము పట్ల ఒకఁడు ఇంకొకని ప్రశ్నింపరాదు ఉభయులు మిన్నకుండుట పాడి

[శంక] సమాధి ప్రతీతికి సుఖాంశ మున్నదను మాకు స్మృతి ప్రమాణము కలదు ఎట్లన —

"సుఖ మాత్యంతికం యత్ తద్
బుద్ధిగ్రాహ్య మతీంద్రియమ్,
వేత్తి యత్ర నచైవాయం
స్థిత శ్చలతి తత్త్వతః'

(గీతా. ౬ అధ్యా. ౨౧ శ్లో)

అనంత మగు సుఖ మేదికలదో అది ఇంద్రియనిరపేక్షము కేవల బుద్ధిగ్రాహ్యము (కేవల బుద్ధిభాసకము) అగును అవిషయ

జనితమగు నిట్టి సుఖమును సమాధియందు ఎవఁ డనుభవించు చున్నాఁడో వాఁడు జ్ఞాని, ఆత్మస్వరూపమునందు నిలిచినవాఁడు కావుననే అతఁడు తాత్త్విక రూపమునుండి చలింపఁడు అని భావము.

[సమా] రసచర్వణాదులకును సుఖాంశభావము కల దన మాకు గరీయఃప్రమాణము, శ్రుతిప్రమాణము కలదు

(1) 'రసో వై సః', (2) 'రసగ్ం హ్యేవాయం లబ్ధ్వాఽఽనందీ భవతి' అని [తైత్తిరీయోపనిషత్తు] నిశ్చయముగా ఆ సచ్చిదానంద స్వరూపుఁడు ఆత్మరసము. ఆ యాత్మరసమును పొంది ప్రమాత ఆస్వాద్యుఁడే - పరమానందరూపుఁడే - యగును నిజము" అని శ్రుత్యర్థము కావ్యరసాస్వాదమందు నాటకము చూచునట్టి కాని, శ్రవ్యకావ్యమును విను నట్టిగాని, సకల సహృదయులయొక్క ప్రత్యక్షానుభవము ప్రమాణము అట్లే సమాధియందు ఆత్మ సాక్షాత్కారమొందు యోగీశ్వరుని యపరోక్షానుభవము ప్రమాణము. ఇట్లు ఉభయులకును ప్రమాణము కలదనుట తుల్యము ఇది ప్రథమ పక్షానుసారము.

ద్వితీయపక్షమందు రసచర్వణ ఏది చెప్పఁబడెనో, అది ఆనందాకార చిత్తవృత్తి. అది శబ్దవ్యాపారమగు వ్యంజనావ్యాపారమగుటంజేసి శాబ్ది (శాబ్దబోధరూపము) వెండియు అపరోక్షవిషయీభూతము ఏ యానందముకలదో అది ఆత్మరూపము అది ఈ చర్వణకు ఆలంబము. (విషయము) అగుటఁ బ్రత్యక్షరూపము

[శంక] శాబ్దికత్వము అపరోక్షత్వము ఎట్లు సరిపడును? నైయాయికమతము ఒప్పదే.

[సమా] పోనీ, నైయాయికులు ఒప్పరుగాక! వేదాంతులు ఒప్పుదురు 'తత్త్వమసి' అను శ్రుతివాక్యముచే జీవబ్రహ్మైక్య ప్రతీతి కలుగునపుడు అది అపరోక్షమును శాబ్దమునైన జ్ఞానముగ నంగీకృతము అట్లే సాహిత్యశాస్త్రమునందును రసచర్వణము శాబ్దమును అపరోక్షము నైన జ్ఞాన మని యెఱుక

ఈ పైఁజెప్పినది అభినవగుప్తాచార్యపాదుల మతము. ఇది సిద్ధాంతము

రసగంగాధరము

వఠివస్యావివరణసముల్లసితము

అధి. 4 రససూత్రవ్యాఖ్యాన భేదములు

అభినవగుప్తాచార్యుల మతముగాక రసస్వరూపనిరూపణమున వ్యాఖ్యాతృబుద్ధివైలక్షణ్యమును బట్టి మతభేదములు పెల్లుగా నేర్పడినవి ఎల్లరకును భరతముని రససూత్రమే మూలము ఇట ఆ భిన్నమతములు ప్రతిపాదింపఁబడును అన్నియు పూర్వపక్షము లైనను అందు సిద్ధాంతమతమునకు పూర్వాపూర్వములు సన్నిహితములు, ఉత్తరోత్తరములు దవీయములు

అందు భట్టనాయకమతము సిద్ధాంతమతమునకు అత్యంత సన్నిహిత మగుట తదనంతరము ఇట నిరూపింపఁబడుచున్నది భట్టనాయకుఁడు సాంఖ్యుఁడు హృదయదర్పణ గ్రంధకర్త, భరతనాట్యశాస్త్రవ్యాఖ్యాతలలో నొకడు పూర్వవ్యాఖ్యాత లగు భట్టలోల్లట శంకుకాదుల మతముల నిరసించి స్వమతమును ప్రతిపాదించెను వారు ప్రతిపాదించినట్లు రసము (౧) ప్రతీతము(అనుమేయము)నుంగాదు (౨) ఉత్పన్నమునుంగాదు (3) అభివ్యక్తమునుంగాదు ఏలనఁ దొలిపక్షము ననుసరించిన, అనుకార్యులగు రామాదులందుఁ గాని అనుకర్తయగు నటునియందుఁగాని రసము ప్రతీయమాన మగునేని (అనుమీయమాన మగునేని) అది పరగత మగును అందుఁ గూర్చి సహృదయునకుఁ దాటస్థ్యము' తప్పదు అది యిట్లు

సహృదయుఁడు (శాకుంతలాది) నాటకప్రయోగము చూచుతఱి రంగస్థలమునందు దుష్యంతుఁడు శకుంతలను (ఆలంబనవిభావ

మును) చూచునప్పు తదీయ రూపలావణ్యాదులచే అతనికి ఆమెపైఁ ప్రేమ జనించినట్లు తత్స్వేదరోమాంచాద్యనుభావములను తద్గ్లాన్యాది సంచారిభావములను నటుఁడు అభినయింపఁగా వీక్షించి వానినిబట్టి దుష్యంతునకు శకుంతలావిషయకరతి కలదు అని అనుమానించును రత్యాది స్థాయిభావములు సకలప్రాణిజాతంపు టంతఃకరణములందు అనాదిసిద్ధము లగుటచే అనుకార్యులైన దుష్యంతాదులయందును అనుకర్తలగు నటులందును అనుభోక్తలగు సామాజికులందును గలుగును కావున సామాజికుఁడు ఉక్తరీతిని అనుమానించుచో ఆరతి దుష్యంతుని దగుటచే తనకు సంబంధించినది కాదని తద్విషయమున తాటస్థ్యము - ఔదాసీన్యమొండె - వహించును అందుచే సామాజికునకు ఆస్వాద్యము కాదు కాదా ఆ రతి అనుకర్తలందు (నటులందు) ఉన్నట్లు అనుమానించినను అట్లే యగును?

[శంక] అట్లుగాక ఆ రతి స్వసంబంధమైనదిగా నేను శకుంతలాదివిషయకరతి కలవాడ నని యాస్వాదాత్మక ప్రతీతిని పొందును గాక సామాజికుఁడు అప్పుడు తాటస్థ్యదోషము ఉండదు కదా?

[సమా] అది దుర్ఘటము అట్లు రతి స్వగత మౌట దుర్ఘటము ఏలన శకుంతలాదులు సామాజికులకు విభావములు కావు కదా ఆలంబనవిభావము ఆధారములేకున్న ఉద్దీపనవిభావములు అనుభావములు సంచారిభావములును నిరాలంబనములుకాఁగా ఇక నెట్లు రత్యాదులు సామాజికునకు ఆస్వాద్యమానము లగును?

[శంక] శకుంతలావేషధారిణి యగు నర్తకియందు దుష్యంతునకును సామాజికునకునుంగూడ సాధారణమగు కాంతాత్వము కలదు

కావున ఆ యాలంబన విభావతాసమనియతసాధారణధర్మముచు ఆధారము చేసికొని రసోత్పత్తి కలుగవచ్చును కదా

[సమా] అట్లును పాసంగదు కాంతాత్వమేకాదు ఆలంబన సమనియతధర్మము (అలంబన విశేష్యతావచ్ఛేదకము) అదియే యగునో స్వసోదర్యాదులందును అది ఉండునుకదా అందుచే ఇది నాకు అగమ్యకాని కాంత అను నిశ్చయము సామాజికునకు వలయును నిశ్చయ మనుటేల యన ఇది నాకు అగమ్యకాని కాంత యగునా కాదా ? అను సంశయజ్ఞానముకాని ఇది నాకు అగమ్య కాని కాంత అను విపర్యయజ్ఞానముకాని కార్యసిద్ధికి ప్రయోజక ములు కావు ఆ నిశ్చయజ్ఞానమును అప్రామాణ్యానాలింగితము (అవిషయము) కావలెను ఏలన ఇది అగమ్యకాని కాంత' అని విధా వాదులయెడ నిశ్చయజ్ఞాన మున్నను అది అప్రామాణికము కాదప నిశ్చయము లేకున్న కార్యసిద్ధి లేదు అట్టిది అప్రామాణ్యానాలింగి తము ఆలంబనవిశేష్యకము అగు నగమ్యత్వాభావప్రకారకకాంతా త్వవిశేష్యక నిశ్చయభావము శకుంతలాదులయందు సామాజికునకు లేదు అందుచే శకుంతలావిషయకరతిమంతుడను నేను అను జ్ఞానము అతనికి కలుగుట ఘటిల్లదు ఇది యొక్క శృంగారరస విషయమునసే కాదు చూడుడు కరుణరసవిషయమునందు ఆలంబనవిభావన మైన వినష్టపురుషునందు వీడు కాపురుషుడుకాడు అశోచ్యుడుకాడు అను నిశ్చయజ్ఞానము (అప్రామాణ్యానాలింగితము ఆలంబనవిశేష్య కము) ఆలంబనత్వసమనియతభావము వలయును అప్పుడే తదాలంబన విషయక మగు శోకము ప్రకృష్టమై కరుణరసవ్యపదేశ మొందును ఆ మృతపురుషుడు (ఆలంబనము) బ్రహ్మజ్ఞాని యగునేని అశోచ్యు డగును అట్లే లోకకంటకుడు రావణుడు కాపురుషుడు వీడు

అశోచ్యుఁడు అని నిశ్చయ మున్నచో మృతపురుషునందు కరుణరసా లంబనవిభావత్వము పొసఁగదు ఇట్లే అన్యరసముల విషయమందును ఊహింపనగును అట్టిజ్ఞానము పుట్టుట దుర్ఘట మగుటచే శకుంతలాది విషయకమగు నాలంబనవిభావత్వము సామాజికుని రసప్రతీతిని ప్రతి బంధింపనే ప్రతిబంధించును

[శంక] మఱి, సామాజికునకు దుష్యంతో౽హం (నేను దుష్యంతుఁడను) అను దుష్యంతాభేదబుద్ధి కల్గినచోఁ జాలును గదా

[సమా] అదియు దుర్ఘటమే ఏలన నాయకునందు ధరా ధారేయత్వము, ధీరత్వము లోకోత్తరశౌర్యవత్త్వము ప్రాచీనత్వము మున్నగు గుణములు ఏవి కలవో అవి సామాజికునకు లేవు సరికదా తద్విరుద్ధగుణములు - అల్పత్వము అసారత్వము ఆధునికత్వము మున్నగునవి - నాయకునందు అసంభావ్యములు - కలుగుటకుఁ దోడు వెనుకఁజెప్పిన గుణములు తనయందు లేవను స్ఫుటప్రతి పత్తియుఁ గలదు అట్టిచో సామాజికునకు తాను దుష్యంతా భిన్నుఁ డను బుద్ధి ఎట్లు కలుగును?

రసము ఆహార్యప్రతీతి కాదు

[శంక] దుష్యంతుఁడు తానను ఆహార్యజ్ఞానము సామాజికు నకు కల్గుచో తాను దుష్యంతభిన్నుఁ డను బాధనిశ్చయము పుట్టదు కదా! బాధ సమకాలీనేచ్ఛాజన్యజ్ఞానము కదా ఆహార్యజ్ఞాన మన

[సమా] రసముగా నభిమతమగు నీ ప్రతీతియొక్క స్వరూపము విచారించినచో అది ఆహార్యప్రతీతి కాదని తేటతెల్ల మగును

రాగాదులతో ఇంద్రియసన్నికర్షము నామాజికునకు లేమింజేసి అది ప్రత్యక్షప్రతీతి కాదు వ్యాప్తిగ్రహము అసాధ్యము కావున అనుమానము కాదు సాదృశ్యజ్ఞానమూలము కాదు కావున ఉపమానము కాదు ఇఁక గతిలేక శాబ్ది (శబ్దజన్యము శాబ్దబోధాత్మకము) అని చెప్పవలెను ప్రత్యక్షాతిరిక్తములైన జ్ఞానము లెల్ల చమత్కార విరహితములు అని సర్వసమ్మతము అందుచే శాబ్దిరూపప్రతీతియు అచమత్కారనే యగును మఱి రసే సారః చమత్కారః అని యుల్లేఖనీయమగు రసము శాబ్దబోధాత్మకమును కాక పోవలెను మఱియు ఆ రస(రూప)ప్రతీతి శబ్దజన్యబోధయే యగునో - కావ్యాతిరిక్త వ్యవహారశబ్దజన్యము లౌకికమిథునరతివృత్తాంతజ్ఞానము కూడ రసము కావలసివచ్చును శాబ్దబోధరూపము కదా అది కాని లౌకిక మిథునరతివృత్తాంతము ప్రత్యక్షముగా గ్రహించినపుడే సరసము కాకపోవుటటుండ జుగుప్సాకరమును లజ్జాకరమును అగును ఇఁక (పరోక్షమగు) శాబ్దప్రతీతి విరసమవునని చెప్పవలెనా? అందుచే రసము లౌకికశాబ్దప్రతీతియుఁ గాదు

ఇట్లు లౌకికప్రమాణముల దేనికిని రసము గోచరము కాకున్న అలౌకికప్రమాణ విషయ మగునేమో పరికింతము అలౌకికప్రత్యక్షము జ్ఞానలక్షణప్రత్యాసత్తిరూప మగునా? అన్న అదియుఁగాదు సురభిచందనము అనుచోట చందనాంశ ప్రత్యక్షము సౌరభాంశ జ్ఞానలక్షణప్రత్యాసత్తివిషయము జ్ఞానరూప మగు నలౌకిక సన్నికర్షచే సౌరభాదుల స్మరణము కలుగును ఈ జ్ఞానలక్షణప్రత్యాసత్తి గోచరమానసప్రతీతికిని చింతోపనతము లగు - అటఁగా పునఃపునరనుసంధానరూపభావనచే నలౌకిక ప్రత్యక్షవిషయము లగు శకుంతలాది

పదార్థముల మానసప్రతీతికిని - కావ్యజన్యరసప్రతీతికిని - ఎంతేవి భేదము కలదు రసప్రతీతి చమత్కారప్రాణము జ్ఞానలక్షణాలౌకిక సన్నికర్ష జన్యశారభాదిస్మరణజ్ఞానము చమత్కారవిధురము అందుచే అది రసప్రతీతి కానేరదు

ఈ రసప్రతీతి స్మృత్యాత్మకమును గాదు ఏలన స్మృతి సంస్కారజన్యము సంస్కారము పూర్వానుభవజన్యము శకుంతలాది పదార్థవిషయక మగు పూర్వానుభవము సామాజికునకు లేకపోవఁగా తత్సంస్కార మెక్కడనుండి వచ్చును ? కారణములేక కార్యము ఎట్లు పుట్టును ? స్మృతిరూపమే యని ఎట్లేనియు నంగీకరించినను పరోక్ష జ్ఞానము చమత్కారికాదు కావున స్మృతి రసప్రతీతి ఎట్లగును అది ఆహార్యజ్ఞాన మన కారణము లేదు ఇట్లు ప్రకారాంతరముల నే ప్రతీతి కలుగుటయు సంభవింపమిఁ జేసి భట్టనాయకుఁడు వక్ష్య మాణరీతిని రసప్రతీతిని ప్రతిపాదించెను

గుణాలంకారాది విశిష్టము శ్రవ్యకావ్యముఁ జదువుచో, తొలుత అభిధచేతను చతుర్విధాభినయ రంగ పరికరాది విశిష్టమును దృశ్యకావ్యమును జూచుచో మొదట [అభిధోపలక్షితము] ఇంద్రి యార్థసన్నికర్షము చేతను ప్రత్యక్షగోచరీక్రియమాణములైన దుష్యంతాదులును రత్యాదులును నగు పదార్థములు తత్తద్దేశకాలాది వైయక్తికవిశేష ధర్మసహితములుగ బోధితము లగును అనంతరము భావనాఖ్యవ్యాపారముచే కలిగిన విభావాదిసమవేతసాధారణీ కరణమహిమంజేసి ఆ శకుంతలాదులు - అగమ్య లను రసవిరోధి జ్ఞానము ప్రతిబద్ధము కాఁగా, అగమ్యలుకాని కాంతలు అను రసాను కూల నిశ్చయప్రతీతికి విషయము లగుదురు ఇట్లు సాధారణీకరింపఁ బడిన అనఁగా సామాన్యధర్మావచ్ఛిన్నముగా బోధితములైన)

పదార్థములందు శకుంతల కన్యాప్రత్రి) దుష్యంతరమణీ ప్రాచీన దుష్యంతుఁడు రాజు ధైర్యశౌర్యాదిమహితుఁడు పురాతనుఁడు గ్రీష్మము కాలము కణ్వాశ్రమము దేశము యౌవనము ప్రాయము సంయోగ విప్రయోగాదులు అవస్థలు ఇత్యాది దేశకాల వయోవస్థాది వైయక్తికవిశేషము లెల్ల మఱుఁగుపాటు అగును అట్లే విభావాదుల విశేషధర్మములే గాక రత్యాదిస్థాయులయు లజ్జాదివ్యభిచారు లయు కటాక్షభుజాక్షేపాద్యనుభావములయు శకుంతలాదులవి అను మున్నగు విశేషధర్మములును మఱుఁగుపాటు లగును అంతటితో భావకత్వ వ్యాపారము విరత మగును అంతట భోగకృత్త్వము (భోజ కత్వము రసన వ్యంజన) అను వ్యాపారమహిమచే రజస్తమస్సు లభిభవ మొంద నుద్రిక్తమైన సత్త్వగుణమువంజేసి సామాజికుని యాత్మరూప చైతన్యాకారమైన నిర్వృతి (ఆనందము) జనించును అది సర్వలౌకికవిషయవిశ్రాంతి(వినాశ)రూపము విగళితవేద్యాం తర స్వరూపావస్థితి లక్షణము ఆ యాత్మసాక్షాత్కారప్రతీతికి గోచరమగు [భావనోపస్థాపిత సాధారణాత్మక విభావాది సంవలితము] (రామాది) రత్యాదిస్థాయిభావమే రసము

విభావాదులు (1) అభిధావ్యాపారముచే సవిశేషములుగా బోధితములై (2) భావనావ్యాపారముచే సాధారణీకృతములై (3) భోజకత్వ వ్యాపారముచే (వ్యంజనా వ్యాపారముచే) సహృదయ సాక్షాత్కార విషయములుగాఁ జేయఁబడిన పూర్వ రామాదుల రత్యాదిస్థాయి - సచ్చిదానందరూపము వేద్యాంతర శూన్యము - రసము అని నిగ్గు ఇట మమ్మటాదుల మతమునంబోలె శ్రుతిసారస్య ముచే చైతన్యవిశిష్టస్థాయిగాని రత్యాది విశిష్ట చైతన్యముగాని రసము అని సిద్ధము

ఈ భోగము (ఆస్వాదము) బ్రహ్మాస్వాదవిలక్షణము తత్క ల్పము (తత్సవిధము) అని చెప్పఁబడినది ఏలన బ్రహ్మాస్వాదము స్వభిన్న విషయాసంపృక్తము అనఁగా నిర్విషయము రసాస్వాద మన్ననో విభావాదిసంయుతము స్వభిన్నవిషయసంపృక్తము ఇది భట్టనాయకమత సంక్షేపము

మతవిమర్శ : (1) ఈ మతమునందు వ్యాపారములు మూఁడు అభిధ ఇది శ్రవ్యమున లక్షణకును దృశ్యమున ఇంద్రి యార్థ సన్నికర్షమునకును ఉపలక్షణము (2) భావన ఇది విభా వాదికి సాధారణీకరణ సంపాదకము ఇది విభావాదినిష్ఠను (3) భోగీ కృతి (భోజకత్వము భోగము భుక్తి ఆస్వాదము) వ్యంజనావ్యాపార నిర్విశేషము ఇది సాధారణీకృత విభావాదిసంవలిత రత్యాదిస్థాయికి రసరూపసంపాదకము ఇది భగ్నావరణ చిద్రూపాస్వాదమే పూర్వ మతములకన్న నిందు అభిధా (లక్షణ) వ్యంజనలకన్నఁ బై పెచ్చుగా క్రొత్తది భావకత్వ మను వ్యాపారము అంగీకరించుట విశేషము అభి నవగుప్తాచార్యపాదమతమున ఇది ప్రత్యేకవ్యాపారముగా గాక సహృదయసహజ (సమవేత) ధర్మముగ నంగీకృతము ఇది కావ్యార్థ పునఃపునరనుసంధానాత్మ స్వమహిమచే నీభావన (సహృదయ త్వము) విభావాది సాధారణీకరణము సంపాదింపఁజాలును ఇట్లు అభినవగుప్తాచార్యులు రెండు వ్యాపారముల నొప్పుటలో లాఘవము కలదు.

(2) భట్టనాయకుఁడు తత్పూర్వుల మతమునందు తాటస్థ్య దోషమును చూపెను తత్పరిహారమునకై పూనియు రత్యాదిని సహృదయహృదయగతముగఁ జెప్పలేదు అభిధాతిరిక్తభావకత్వ భోగకృత్య వ్యాపారముల మహిమచే రామాదిగతస్థాయిని ఆత్మ

సాధారణముగఁజేసికొని సహృదయుఁ డాస్వాదించునని చెప్పినాఁడు అందుచే రత్యాదికి పరగతత్వదోషము ఇందును - భట్టలోల్లట శంకుకాదిమతములందుంబోలె - దుర్నివారమై పట్టుకొనియున్నది (రత్యాదిస్థాయి పరగతము, రామనటాదిగతము కాదు అది సహృదయగతమే అని ప్రతిపాదించుటచే అభినవగుప్తపాదమతమందే అవి పరగతత్వము - తాటస్థ్యదోషము - తొలఁగినది)

3. నవ్యమతము - రసము అనిర్వచనీయము

మఱి నవ్యులన్నో రసస్వరూపమును మఱియొక విధముగఁ ప్రతిపాదింతురు అది యిట్లు

గుణాలంకారాది భూయిష్ఠమగు శ్రవ్యకావ్యమందు కవి ప్రయుక్తశబ్దములచేతను తౌర్యత్రికయవనికాప్రతిశీర్షకాది రంగ పరికరసహకృతమగు నటకృతచతుర్విధాభినయముల చేతను దృశ్యకావ్యమందును విభావాదులు తొలుత సహృదయునకు అభిధా వ్యాపారబోధితము లగును కాఁగా (2) పిమ్మట వ్యంజనా వ్యాపారమునం జేసి శకుంతలాది నాయికారతి దుష్యంతాదినటులందు [దుష్యంతుఁడు శకుంతలావిషయకరతిమంతుఁడు అని] సహృదయునిచే గ్రహింపఁబడును (3) అనంతరము సహృదయుని సహృదయత్వముచే నుల్లసితమై (ప్రాదుర్భావితమై = పరిపోషితమై) విలక్షణభావనావిశేషము (కావ్యార్థపునఃపునరనుసంధానము) అను దోషముయొక్క ప్రభావముచే [తన యాత్మయందు లేకున్నను ఉన్నట్లు జ్ఞాత మగు] దుష్యంతత్వాది యజ్ఞానముచే సహృదయుని స్వాత్మ అవచ్ఛిన్నమగును అనఁగా సహృదయుఁడు తాను దుష్యంతుఁడు కాకున్నను దుష్యంతుఁడననుకొనును అప్పుడు [శుక్తికా

శకలమందు వాస్తవికరజతము లేకున్నను ఉన్నట్లు జ్ఞాయమానమగు నట్లు ప్రతిభాసించునట్టి యనిర్వచనీయమును సాక్షిభాస్యమును శకుంతలాది విషయకమును అగు రత్యాదిస్థాయిభావము రసముగ నాస్వాద్యమాన మగును

దూరమునుండి చూచినవానికి సూర్యరశ్మిచే తళతళ మనుట యను దోషమునంజేసి శుక్తియందు రజతభ్రమ అనిర్వచనీయము సదసద్విలక్షణము—పొడమును రజతము శుక్తిలో వాస్తవముగా లేక పోవుటచే సద్విలక్షణము ప్రత్యక్షగోచర మగుట అసద్విలక్షణము [ఇట్లు రజతము సదసద్విలక్షణము] అట్లే నిజమునకు సామాజికునకు శకుంతలాదులందు రతి లేదు భావనాదోషముచే ఉన్నట్లు ప్రతిభాసించు చున్నది అట్లే సహృదయుని శకుంతలాదివిషయకరతి సదస ద్విలక్షణము అనిర్వచనీయము అనఁదగును సాక్షిభాస్య మెట్లు ప్రతిభాసించునో అట్లే విలక్షణభావనాదోషమువనే సహృదయు నకు తాను శకుంతలాదిరతిమద్దుష్యంతుఁడ నని భ్రమ కలుగ రస త్వము అన్యరత్యాదిస్థాయి భాసమాన మగును భ్రమరూపము రసము ఇది నిత్యము ఈ మతమున నవీనవ్యాపారకల్పనాపేక్ష లేదని యెఱుక

[శంక] రసము నిత్య మగునో ఉత్పన్నము రసము వినష్టము రసము అను వ్యవహారములు ఎట్లు సంగతములు ?

[సమా] రసము ఉక్త విలక్షణ భావనాదోషవిశేష కార్యము. ఆ దోష మున్నప్పుడు రసము ఉత్పన్న మగును ఆదోషము నశించి నపుడు నశించును అని వ్యవహారము భావనాదోష సత్త్వాసత్త్వ ములఁబట్టి రసమునకు ఉత్పత్తివినాశవ్యవహారము ఎట్లన శుక్తి

విషయమున రజతభ్రాంతి యున్నప్పుడు రజతఖండ సత్త్వోత్పత్తి భ్రాంతి లేనప్పుడు తన్నాశము ఇట్లు రజతఖండంపు సత్త్వాసత్త్వములు భ్రాంతిసత్త్వాసత్త్వవ్యవహారమును బట్టి అంతేకాని నిత్య మగు రసమునకు ఉత్పత్తి వినాశములు వాస్తవములు కావు

[శంక] రసస్వరూప మేమి ?

[సమా] రసోత్పత్తి యైన వెనువెంటనే (అనఁగా నేను శకుంత లాదివిషయకరతిమద్దుష్యంతుఁడను అని (ప్రాతిభాసిక) ప్రతీతి కలిగిన వెనువెంటనే) లోకోత్తరానందము కలుగుచున్నది ఇట్లు రసానందములకు రెంటికి పౌర్వాపర్యమున్నది ఉన్నను ఆ రెంటను భిన్నము లను ప్రతిపత్తి లేకపోవుటంజేసి సుఖము ఆనందము అను శబ్దములచే రసము వ్యపదిశ్యమాన మగుచున్నది వాస్తవముగా రసము సుఖాత్మక మనరాదు అది అనిర్వచనీయము (వర్ణనాతీతము)

[శంక] రసము లోకోత్తరానందమున కన్న భిన్నముగా నెఱుకపడమింజేసి వ్యంజనాసాధ్యాత్సంపర్కశూన్య మగును కావున అది వ్యంగ్య మెట్లగును ?

[సమా] వాస్తవముగా రసము వ్యంగ్యముకాని వర్ణనీయము కాని కాదు అట్లైనను వ్యంగ్య మని వర్ణనీయమని వ్యవహారము లోకమునఁ గలుగుటకు నిమిత్త మేమన రసమునకు అవ్యవహిత పూర్వక్షణమున నభివ్యక్తమైన (ఉపస్థితమైన) శకుంతలాది విషయక దుష్యంతాదిగత రతిరూపవ్యంగ్యమున కన్న శకుంతలాది విషయక భావనాదోషపరికల్పితమైన రసము భిన్నముగా నెఱుకపడకపోవుటం జేసి కాదా అభిన్నముగా అధ్యవసాయము (నిశ్చయము) కలుగుటం జేసి రసము వ్యంగ్య మని వ్యవహారము అట్లే దుష్యంతాదినిష్ఠ

మైన శకుంతలాది విషయకరతి కల్పితము కాకుంజేసి వాస్తవికము అది అనిర్వచనీయము కాదు అందుచే అది యిట్టిది అట్టిది అని కవులు కావ్యములందు వర్ణింప యోగ్యమగును మఱి దానిచే సహృదయుని యాత్మయందు భావనాదోష పరికల్పితమైన రసము (అనిర్వచనీయమగుట) కవులకు వర్ణింప యోగ్యముకాదు కాకున్నను భిన్నముగా నెఱుకపడకుంజేసి కాని ఏకనే (అభిన్నమే) అను నధ్యవసాయముంబట్టికాని వర్ణనీయ మని వ్యవహారము అంతేకాని వాస్తవముగా రసము వ్యంగ్యమునుకాదు వాచ్యము (వర్ణనీయము)ను కాదు

[శంక] ఇఁక సహృదయునియందు కల్పితమైన దుష్యంతత్వము మాట యేమి ?

[సమా] సహృదయుని యాత్మయందలి (శకుంతలాది విషయక) రత్యాది కాల్పనికమైనట్లే నేను శకుంతలాది విషయక రత్యాదిమంతుఁడను దుష్యంతుఁడను అను నిత్యాద్యాకారము గల రత్యాది విశిష్టప్రతీతియందు (రత్యాది ప్రకారకమును సహృదయ విశేష్యకమును నైనదానియందు) విశేష్యతావచ్ఛేదకము అవచ్ఛేదకదుష్యంతత్వమును అనిర్వచనీయమె ఆ విశిష్టప్రతీతి యున్నంతవఱకు నేను దుష్యంతుఁడను అను నజ్ఞానము అవచ్ఛేదకముగ నుండును - అనఁగా సహృదయుని హృదయము నావరించి యుండును అది వాస్తనము కాదు అవి అనిర్వచనీయము సదసద్విలక్షణము

ఇట్లు భావనావిశేషదోష ప్రభావముచే అనిర్వచనీయ దుష్యంతత్వముతో సహృదయుని యాత్మ జ్ఞాయమానము కాఁగా అనిర్వచనీయ మగు శకుంతలావిషయకరతి సహృదయాంతఃకరణమున రసముగా భాసించుట నిర్బాధకము

ఈ మతమునందు - భట్టనాయకమతమున సావకాశములైన యాక్షేపణలు (కొన్ని) వక్ష్యమాణములు - పరాస్తము లగును -

(1) దుష్యంతాది నిష్ఠమైన శకుంతలాదివిషయకరతి పరకీయము కావున సామాజికునకు తాటస్థ్యము(ఔదాసీన్యము)నం జేసి ఆస్వాద్యముకాదు అను నాక్షేపణ యిందు లేదు స్వగతత్వ భ్రాంతి కలిమిచే

(2) స్వగతములైన రత్యాదులకు శకుంతలాదులు ఆలంబనములుకావు కావున నెట్లు అభివ్యక్తి అను నాక్షేపణయు లేదు దుష్యంతత్వభ్రాంతి కలదు కావున

(3) తనయందు దుష్యంతాభేదబుద్ధి యెట్లు పొడమును అను నాక్షేపణయు పుట్టదు అదియు భ్రాంతిజనితమే కావున

ఇత్యాది యాక్షేపణలెల్ల ఈ యనిర్వచనీయరసమతమునఁ బుట్టవు వేలన విలక్షణభావనాత్మకదోషప్రభావమునం జేసి అనిర్వచనీయ దుష్యంతాదిత్వమున సహృదయుని యాత్మ జ్ఞాయమానము కాఁగా అభేదబుద్ధి సిద్ధింపగా, శకుంతలాదివిషయకరతి అనిర్వచనీయముగా ప్రతిభాసించుటకు బాధ లేదు దోషమూలకభ్రాంతి బాధనిశ్చయమును ప్రతిబంధింపదు భ్రాంతినిగూర్చి దీని కొక బాధ కలదని యభిమర్శ పుట్టుట ఘటిల్లినచో భ్రాంతి మటుమాయమగును గదా అట్లు పరగతరతిని గూర్చి అచమత్కారిత్వాది దోషములు ఎవి మున్నుద్ఘాటింపఁబడినవో అవెల్ల నిరవకాశము లగును

దోషవిశేషకల్పనము ఈ నవీనమతమాత్రమునఁ దెచ్చి పెట్టిన మోయలేని బరువుకాదు ప్రాచీనులకు అభినవగుప్త

చార్యాదులకును శకుంతలాదివిభావసాధారణ్యము (కాంతాత్వాది సామాన్యధర్మప్రకారకప్రతీతివిషయత్వము) ఎట్లు కుదిరినది ? తొలుత కావ్యమునందుఁ గూర్పఁబడిన శకుంతలాది శబ్దములు అభిధా వ్యాపారముచేశకుంతలత్వాదివిశేష(వైయక్తిక)ధర్మావచ్ఛిన్నశకుంత లాదులను బోధించి విరతములు కాఁగా పిమ్మట కాంతాత్వాది సామాన్య ధర్మప్రకారక ప్రతీతి విషయత్వ రూపమును సాధారణ్యమును చెప్పిరి అది విలక్షణ భావనాత్మక దోషకల్పనచేఁ గానియెడల దుపపాదమే యగును అందుచే దోషకల్పనము ప్రాచీనులకును ఆవశ్యక మైనదే క్రొత్తది కాదు దానిచే వారు చెప్పిన విభావాది సాధారణ్యమేకాక మా చెప్పిన సహృదయ విషయక దుష్యంతాద్యభేద ప్రకారక ప్రతీతియు శుక్తియందు రజతాభేదబోధవలె నూపపాదమే యగును

కరుణాది రసవిషయము

[శంక] పోనీ సుఖమయ మగుటంజేసి రతికి శృంగారరసమున దుష్యంతునందుంబోలె సహృదయునందు సుఖవిశేష జనకత్వము ఒప్పుఁగాక ! మఱి, కరుణాది రసములందు అభీష్టనాశాదిజన్యము దుఃఖజనకత శోకాదిస్థాయికి ప్రసిద్ధముకదా! వాని కెట్లు సహృదయాహ్లాదకత్వము ? అట్లు లేకపోగా నాయకునందుంబోలె సహృదయునందును దుఃఖజనకత్వముకదా తగును ? ఇట శోకాదులు' అనుచో ఆదిశబ్దముచే భయక్రోధ జుగుప్సాదులు [భయానక-రౌద్ర - బీభత్స రస స్థాయులు] వివక్షితములు అవి వైక్లబ్యరూపములు లోకమునందు రతి రామాదులందు ప్రణయాత్మకము సుఖమయము సహృదయునందు సుఖవిశేషోత్పాదక మగుటంజేసి శృంగార రసము

ఆనందమయము అట్లే కరుణాదిరసములు వైక్లబ్యరూపములు వైక్లబ్యమయములుకదా కావలెను ?

[సమా] సత్యమైన (రామాదుల) శోకములకు దుఃఖజనకత్వము నిశ్చితమే కల్పిత (భ్రాంతిభాస్య) శోకమునకు దుఃఖజనకత్వము లేదు ఆస్వాద్యత్వమే కలదు

[శంక] ఆ సమాధానము సరిపడదు ఏలన కేవల భ్రాంతి భాసితమైన రజ్జుసర్పముకూడ భయకంపాదిజనకముగా ననుభవ గోచరమై యున్నది ఆ పక్షమున రత్యాదియు కల్పితమే యగుట సహృదయునకు సుఖజనకము కాకపోవుఁగాక.

[సమా] నిజమే శృంగార రసప్రధాన కావ్యములవలె కరుణ రసప్రధాన కావ్యములవలనంకూడ [దుఃఖసంమిశ్రితము కాక] కేవలాహ్లాదమే కలుగుననుటకు సహృదయహృదయమే (సహృదయుల యనుభవరూప (ప్రత్యక్షమేప్రమాణమగుచో - అప్పుడు 'కార్యానురోధేన కారణాని కల్ప్యన్తే' అను నియమము ననుసరించి [దోషాత్మకమగు విలక్షణభావన యను] లోకోత్తర వ్యాపారము ఆహ్లాద ప్రయోజకమేకాక - దుఃఖప్రతిబంధక మనియు కల్పనీయ మగును

కుమారసంభవము శాకుంతలము మున్నగు శృంగారమయ కావ్యములు చదివినప్పుడు రంగమున చూచినపుడును ఆనందము అనుభవించునట్లు సహృదయుఁడు రామాయణాది కరుణరస ప్రధాన కావ్యములు చదివినప్పుడును (సంస్కృతభాషయందు కరుణరస ప్రధానరూపకమే లేదు కావున) కరుణవిప్రలంభ ప్రధానములగు ఉత్తరరామచరితాదిరూపకములఁగాని,అందు కరుణరసస్రావి సన్నివేశ

ములఁగాని రంగస్థలమున చూచునపుడును శోకమిశ్రితముకాని కేవలానందమే అనుభవించునేని అప్పుడు దుఃఖప్రతిబంధకత్వమును కల్పనీయము అని యభిప్రాయము విలక్షణవ్యాపారము సుఖజనకమే కాక దుఃఖప్రతిబంధక మగుట కావ్యమునందే కాదు లోకము నందును కలదు నఖక్షతదంతక్షతాదిరూప విలక్షణవ్యాపారము సురత మందు సుఖవిశేషజనక మగుటేకాక దుఃఖోత్పత్తిప్రతిబంధకము నగు నని రసికజనానుభవప్రసిద్ధముకదా ఇది ప్రథమకల్పము ఇఁక ద్వితీయ కల్పము కావ్యమువలన సుఖమునుంబోలె దుఃఖము ను ఉత్పన్న మగు ననుటకు సహృదయానుభవమే ప్రమాణమగునేని అప్పుడు కరుణరస ప్రధానమగు కావ్యముచే సుఖమునుంబోలె దుఃఖమును అనుభ వించును అప్పుడు కార్యానుసారముగ దుఃఖోత్పత్తిప్రతిబంధకత్వము లోకోత్తర (భావనా) వ్యాపారమునకుఁ గల్పింపనక్కఱలేదు తమ తమ కారణమునుబట్టి రెండును కలుగును అనఁగా కావ్యముయొక్క యలౌకికవ్యాపారమువలన రత్యాదులచే సుఖమును శోకాదులచే దుఃఖమును యథాసంభవముగా ఉత్పన్నము కావచ్చును

[శంక] అట్లైచో కరుణరసప్రధానమగు కావ్యము దుఃఖమయ మగుట అందు కవికి రచనమునఁగాని సహృదయునకు పఠనమునఁ గాని రంగస్థలమునఁ ప్రేక్షణమునఁగాని ఎట్లు ప్రవృత్తి కల్గును? దుఃఖరూపానిష్టసాధన మగుటంజేసి కరుణరస ప్రధానకావ్యమును గూర్చి నివృత్తియే ఉచితమగును

[సమా] సుఖాధిక్యము ఇష్టతావచ్ఛేదకము - ఇష్టసమ నియతధర్మము సుఖరూపమైన యిష్టము అధికమగుటంజేసి దుఃఖ రూపమగు ననిష్టము అల్పమగుటంజేసి ప్రవృత్తి ఉపపన్నమే సానపై గంధము తీయు క్లేశము కలదని శ్రీగంధలేపనమునందు ఎవని

కేని నివృత్తి కలుగుచున్నదా? ప్రవృత్తియే కలుగుచున్నది గొడుగు మోత క్లేశకర మని మానక ఎండలో వానలో నెవఁడు గొడుగువేసి కొనకున్నాఁడు ? కావ్యము లోకోత్తరాహ్లాదజనకము అందు కరుణ రసజన్యము ఇంచుక శోకము కలదని దాని నెవఁడు పరిహరించును ?

ఇఁక కావ్యమున అలౌకికభావనాప్రభావమునంజేసి శోకము ప్రతిబద్ధ మగును కేవలాహ్లాదమే కలుగును అందుచే శోకముసైతము ఆహ్లాదజనకమే అనువారి మతమున కరుణరసాది ప్రధానకావ్యము లందు ప్రవృత్తి నిర్బాధకమే

[శం] కావ్యమువలన కేవల మానందమే కలుగు నని యంగీక రించువారు కరుణరసప్రధానకావ్యాస్వాదన కాలమున [దుఃఖకార్య ములగు] అశ్రుపాతాదికి ఏమి యుపపత్తి చెప్పెదరు ?

[సమా] అశ్రుపాతాదులు కేవల దుఃఖకార్యములు కావు ఆనందానుభవస్వాభావ్యములును అగును ఇట కరుణరసప్రధాన కావ్యమువలనఁ గలుగునవి ఆనందబాష్పములే దుఃఖాశ్రువులు కావు అందుకనియే భగవద్భక్తాదులకు భగవద్వర్ణనాకర్ణనమువలన నశ్రుపాతాదులు జనించుచున్నవి అందు ఎన్నఁడుగాని దుఃఖాను భవ శంక గలుగదు కదా

[శం] కరుణరసాదిప్రధానమైన రామాయణాదికావ్యము లందుఅభివర్ణితులైన దశరథాదులకుఁ బుత్రశోకాదిమంతులకు దుఃఖము కల్గుచున్నదికదా తత్కావ్యముల చదువుచో రంగస్థలమునఁ జూచుచో సహృదయులకు పుత్త్రశోకాదిమద్దశరథుఁడను నేను అని తాదాత్మ్యత్వారోప్యము కలిగినపుడు [ఆ శోకాదిప్రకారక

తాదాత్మ్యవిశేష్యక - [ప్రతీతిచే] ఆహ్లాదము కలుగునో ఆ సహృదయునకు ఎప్పుడేని సన్నిపాతాపస్మారాదులు (జన్నిమున్నగునవి) కలుగునప్పుడు తనయందు ఆ దశరథాదుల తాదాత్మ్యారోపముచే ఆహ్లాదము కలుగవలదా? రెండుచోటులను తాదాత్మ్యము సమానము కావున కాని దుఃఖమే అనుభవసిద్ధముగా నున్నది అందుచే కరుణాది రసాదులందు కేవల దుఃఖమే యుక్తము

[సమా] లోకములో ఏవి దుఃఖజనములుగా వాసికెక్కియున్నవో ఆ యరమణీయపదార్థములు శోకాదులు కావ్యమునందుపనిబద్ధమైన వ్యంజనావ్యాపార మహిమచే అలౌకికాహ్లాదమునే కల్గించుచున్నవి అందుచే కరుణాదిరసములందు ఇంచుకేని దుఃఖోత్పత్తిలేదు ఇతరవ్యాపారములకన్న నిది అత్యంతవిలక్షణము ఎట్లన లోకమందు అన్యవ్యాపారజన్యమైన యనుభవము లౌకికము అచమత్కారి కమనీయముకాదు వ్యంజనావ్యాపార మన్ననో అలౌకికము చమత్కారి రమణీయము అందుచే తజ్జన్యము - వ్యంగ్యము రసము సర్వము అఖండసుఖాత్మకమే. అందుచే కరుణాది రసములందును దుఃఖజన్యత్వము ఘటిల్లదు

[శం] సరి వ్యంజనావ్యాపారము అట్టి మహిమ కలదే యగుఁగాక మఱి రసము తజ్జన్యము కాదుకదా

[సమా] సాక్షాజ్జన్యముకాదు నిజమే కావ్యవ్యాపారమగు వ్యంజనవలన జనించినది భావన (దోషాత్మకము) ఆ భావనవలన నుత్పన్నమైనది రత్యాద్యాస్వాదము అందుచే సాక్షాత్తుగ లోకోత్తర కావ్యవ్యాపారాత్మక వ్యంజనాజన్యము కాకపోయినను రసము పారంపర్యముగ వ్యంజనాజన్యమే పుత్రత్వముకంటెఁ పౌత్రత్వము

న్యాపముకాదు అందుచే రసము కావ్యవ్యాపారజన్య మని చెప్పుట పాడియే ఇట్లు పై వ్యాఖ్యానమున రసాస్వాదము సాక్షాత్కావ్య వ్యాపారజన్యము కాకపోయినను లోటులేదు ఇంతటికిని పిండితార్థ మిది _అగమ్యత్వప్రకారకము శకుంతలాది విశేష్యకము నైన రసవిరోధి జ్ఞానము సహృదయుని దుష్యంతుఁడను నేను అను నాకారముగల స్వాత్మవిశేష్యక దుష్యంతాభేదప్రకారక జ్ఞానముచే ప్రతిబద్ధ మగుడు రసోత్పత్తి అవ్యాహత మగును

ఈ మతమునందు (1) ప్రాచీనులు అంగీకరించిన భావన దోషరూపము అని (2) రసము ప్రాతిభాసికము అనిర్వచనీయము అని అంగీకృతము (3) ప్రాచీనులు ఒప్పిన వ్యంజనావ్యాపారము అంగీకృతము (4) అన్యవ్యాపారములు కల్పితములు కాలేదు

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అ॥ 5 చతుర్థము పరమతము

మఱి కొందఱు ఇంకొక విధముగా నిట్లు రసస్వరూపము ప్రతిపాదింతురు ఈ మతమువారు ప్రాచీనులును నవీనులును అంగీకరించిన వ్యంజనావ్యాపారమునుగాని నవీనసమ్మతమైన యనిర్వచనీయఖ్యాతినిగాని ఒప్పరు వీరి మతమున రసము వ్యంగ్యమును కాదు, అనిర్వచనీయమును కాదు ఆ రెంటితో నక్కఱలేకయే తృతీయమతమునందుఁ జెప్పఁబడిన భావనావిశేష దోషముచేత రసము ఉత్పన్న మగునందురు ఆ దోషముచే సహృదయునియందు – సహృదయ విశేష్యకము శకుంతలాది విషయక రతిమదభేదప్రకారకము– నేను దుష్యంతుఁడను శకుంతలాది విషయక రతిమంతుఁడను అను నాకారము కలది యగు జ్ఞానము కలుగును [శకుంతలా దుష్యంత విషయకము] ఈ జ్ఞానము మానసికప్రత్యక్షరూపము బహిరింద్రియములతోఁ బనిలేక – స్వప్నమందుంబోలె – మనఃపరికల్పితములగు నింద్రియములవలన ఇది కలుగును నిజముగా సామాజికుఁడు దుష్యంతాభిన్నుఁడుకాఁడు కావున ఈ జ్ఞానము భ్రమాత్మకము. ఇది కావ్యార్థభావనచే కలుగునది కావున అలౌకికము, విలక్షణము. అందుచే సహృదయ చమత్కారజనకము ఆస్వాద్యము, రసము.

[శంక] ఇది మానసిక పరికల్పితము లగు నింద్రియార్థ సన్ని కర్షములచే జనించినదికదా అట్లే స్వప్నకాలమందు శకుంతలా విషయక రతిమద్దుష్యంత ప్రకారక జ్ఞానము మనస్సన్నికర్ష జన్యము కలుగునేని అదియు రసము కావలయుఁగదా

[సమా] కాదు ఆ స్వప్నజ్ఞానము కావ్యార్థ భావనాజన్యము కాదుకదా ఆ కారణమున అది రసముకాదు అందుచే దానికి సహృదయాహ్లాదకత్వము లేదు అందుచే మా చెప్పిన లక్షణమునకు అందు అతిప్రసక్తిలేదు.

[శంక] అతిప్రసక్తి లేకపోవుఁగాక అసంభవ దోషము ఆపన్నము అది అనివార్యము ఏలన సహృదయునియందు శకుంత లాదిరతిమ ద్దుష్యంతాభేదప్రకారక మానసికబోధ యున్నదని అంగీక రించినను వాస్తవికరతి లేదుకదా అనుభవమునకు విషయ సత్తా కారణము అపేక్షిత మగును వాస్తవికరతి లేక రత్యనుభవము (ఆస్వాదము) ఎట్లు కలుగును ?

[సమా] ఇది రత్యాదియొక్క లౌకికప్రత్యక్షము కాదు అట్లగుచో ఇంద్రియములకు విషయసద్భావము ఆవశ్యకము అట్లున్న యర్థములతోడ నింద్రియముల సన్నికర్ష చేతనే లౌకికప్రత్యక్ష జ్ఞానము కలుగును మఱి మా చెప్పిన మానసికప్రత్యక్షము భ్రమాత్మ కము అందు వాస్తవికవిషయ సద్భావాపేక్ష లేదు అసద్వస్తుభానమే కలుగును భ్రమలో రజ్జువునందు అసద్వస్తువైన సర్పంపుభానము కలదుకదా అట్లే సహృదయునకుఁ గలుగు రత్యాదిప్రతీతి భావనా రూపదోషజన్యము, మనఃపరికల్పితము అట నింద్రియార్థములు రెండును మనఃపరికల్పితములే తన్మానసికసన్నికర్ష జన్యము భ్రమ

[శంక] సరికదా రసము భ్రమాత్మకజ్ఞాన మగువో మీ మత మున రసాస్వాదము కలిగినది అను వ్యవహార మెట్లు కుదురును ? భ్రమాత్మకభానమునకు ఆస్వాదవిషయత్వము ఎట్లు పొసగును ? ఆస్వాదమును జ్ఞానరూప మగుఁగదా ? అందుచే రసాస్వాద మన= రసవిషయకాస్వాదము = రసాత్మకభ్రమజ్ఞానవిషయకాస్వాదరూప జ్ఞానము అని అర్థము ఏర్పడునుకదా జ్ఞానవిషయకము జ్ఞానాంత రము ఎట్లు సంగతమగును ?

[సమా] లోకములో రత్యాద్యాస్వాదనము అనుభవసిద్ధముగ నున్నదికదా (అది నిజము) అదే రసాస్వాదన మనియు వ్యవహరింపఁ బడుచున్నది (అది భ్రమ) వాస్తవముగ నంతకన్న వేఱు రసాస్వా దము లేదు మాకు రసవిషయక మన రసత్వానుకూల రత్యాది విషయకము అనియే వివక్షితార్థము

ఈ మతమునుబట్టి రసము విశిష్టవైశిష్ట్యావగాహి జ్ఞానము భ్రమాత్మకము ఆ జ్ఞానస్వరూపము చెప్పఁబోవు మూఁడు ప్రకారము లలో నెదేని కాఁదగును ఏలన మూఁడింటను రసస్వరూపము ఏ యాకారము కలదని చెప్పుటకును వినిగమకము లేదు ఉద్దేశ్య విధేయముల భేదమునుబట్టి ఈ మూఁడు భేదములు రసస్వరూపము నకు కలిగినవి అవి యెవ్వియన (1) దుష్యంతాది యందున్న శకుంత లాది విషయకరతి యేది కలదో ఆ రతికలవాఁడను 'నేను' అని సహృదయునియందు దుష్యంతత్వధర్మితా(విశేష్యతా)వచ్ఛేదక శకుంతలావిషయక రతివైశిష్ట్యావగాహిజ్ఞానము (రతివైశిష్ట్యము ధర్మము (విశేషణము) దుష్యంతుడు ధర్మి (విశేష్యము) దుష్యం తత్వము ధర్మితావచ్ఛేదకము ఇవి ఏ జ్ఞానమునందు విషయము

లగునో ఆ జ్ఞానము. (అవగాహి=విషయీకరించుజ్ఞానము) ఇందు 'నేను' ఉద్దేశ్యము, దుష్యంతుని యందు దున్న రతి' విధేయము (2) 'నేను శకుంతలాది విషయకరతివిశిష్ట దుష్యంతాభిన్నుఁడను అని సహృదయునియందు దుష్యంత ధర్మితావచ్ఛేదక-శకుంతలా విషయక రతివైశిష్ట్యావగాహిజ్ఞానము. (సహృదయునియందు దుష్యంతతాదాత్మ్యము అవగాహిబోధ) ఇందు నేను' ఉద్దేశ్యము. శకుంతలా విషయకరతి విశిష్టదుష్యంతాభేదము(తాద్రూప్యము)విధేయము. ఇది ద్వితీయబోధ (3) నేను దుష్యంతత్వము శకుంతలావిషయకరతిత్వము (ఈ రెండును) కలవాఁడను అను సహృదయునందు దుష్యంతత్వము శకుంతలాదివిషయకరతివైశిష్ట్యావగాహిజ్ఞానము. ఇందు నేను ఉద్దేశ్యము విధేయములు రెండు-దుష్యంతత్వము శకుంతలా విషయకరతి (ఇది సమూహాలంబనజ్ఞానము) ఈ మూఁడు బోధలలో రసపదార్థమునకు ఏదేని స్వరూపము కాఁదగును

[శంక] ఈ మతమునందు రత్యాదిగ్రాహక మేది? పైఁజెప్పిన మూఁడు బోధలందును సహృదయుని యాత్మయందు విశేషణముగా ఏరతి కలదో అది అభిధావ్యాపారమువలన - వాచకశబ్దమువలనను ప్రతీతము కాదు మఱి అది వ్యంజనాప్రతీత మందమన్న, వ్యంజనా వ్యాపారము ఏతన్మతమున నంగీకృతము కాదాయెను. అందుచే నీఁక నెట్లు గృహీతమగును?

[సమా] అనుమానగృహీత మగును నటాది చేష్టలు అను లింగము (హేతువు) చే ' ఈ (నటరూప) దుష్యంతుఁడు శకుంతలాదివిషయకరతిమంతుఁడు - తద్విషయిక కటాక్షభుజాక్షేపాది

చేష్టలు కలవాఁడగుటం జేసి" - అను నాకారము కలది అనుమానము రతిజ్ఞాననిమిత్తముగా నంగీకార్యము

ఈ మతమునఁ దొలుత నటుఁడు దుష్యంతుడుగా ఎఱుకపడఁగా వెనుక ఆ దుష్యంతునితోడ సహృదయాత్మతాదాత్మ్యము నవగాహించునట్టి పూర్వోక్తత్రివిధజ్ఞానమే రసము అని నిష్కు.

రసగంగాధరము

పరివస్యావివరణసముల్లసితము

అధి 6. భట్టలోల్లటుని మతము

భట్టలోల్లటుఁడు భరతసూత్రవ్యాఖ్యాత మీమాంసకుఁడు ఇంకొకతీరున రసస్వరూపమును వ్యాఖ్యానించెను ఎట్లన - నిజమునకు సాక్షాత్సంబంధమున అనుకార్యులగు ముఖ్యదుష్యంతాదిగతము [విభావాది నిమిత్తమున దుష్యంతాదులందు ఉదయించినది] శకుంతలాదివిషయక మగు రతియే రసము అంతేకాని నటాదినిష్ఠము కాదు సహృదయనిష్ఠమును కాదు. అయినను సహృదయుఁడు శ్రవ్యకావ్యములను జదువుచో కావ్యోపాత్త లింగములచేతను నాటకమును జూచునపుడు రంగస్థలమున నటులు ఆదుష్యంతాదుల (విభావముల) యవస్థానుకరణముచే (వేషభాషాభావచేష్టాభినయము చేసిచూపఁగా) సహృదయుఁడు తొలుత సాదృశ్యజ్ఞానరూపదోషమున ఆనటులనే దుష్యంతాదులుగా గ్రహించుచున్నవాఁడై ఆ దుష్యంతాదులరతి నటులందు లేకున్నను ఉన్నట్లు సమారోపించును అనంతరము భావనారూపముచే ఆ సహృదయునకు నటరూపదుష్యంతుఁడు తానను (నటరూపదుష్యంతతాద్రూప్య) భ్రాంతి ఉదయించును తదధ్యాసామహిమవలన ఆ దుష్యంతునిరతి తనయందున్నట్లు భ్రాంతిరూప మానసిక సాక్షాత్కారజ్ఞాన మొదవును

ఆ సాక్షాత్కారము చతుర్థమతమునందుంబోలె వినిగమనము లేమిం జేసి త్రివిధమున నొకండు అందు ఎదుట ఇదంత్వమున (ఇతఁ డని) తెలియఁబడుచున్న నటుఁడు ధర్మి అతఁడు సహృదయునకు చక్షుస్సన్నికృష్టుఁడు కావున ఆ ప్రత్యక్షము నటాంశయందు లౌకికము మఱి నటునియందు ఆరోప్యమాణుఁడగు దుష్యంతుఁడన్ననో సహృదయ చక్షుస్సన్నికృష్టుఁడు కాఁడు కావున అలౌకికము అట్లు విభావములచేఁ బుట్టినది అనుభావములచేఁ బ్రకాశింపఁ జేయఁబడినది వ్యభిచారి భావములచే పరిపోషింపఁబడినది యైన శకుంతలాదివిషయక రతి - వాస్తవముగా దుష్యంతాద్యనుకార్యనిష్ఠము - సహృదయునిచే నటనిష్ఠముగా నారోపితము ఏదికలదో దానిని భావనాదోషముచే నొదవిన నటరూపదుష్యంత భ్రాంతినిమిత్తమున సహృదయుఁడు తన యందు సాక్షాత్కరింపఁ జేసికొని ఆస్వాదించును అదే రసము

రసగంగాధరము

మర్మప్రకాశవివరణసముల్లసితము

అధి 7 శంకుకమతము (ఓ)

భరతనాట్యశాస్త్ర వ్యాఖ్యాతలలో నింకొకఁడు తార్కికుఁడు శంకుకుఁడు భంగ్యంతరమున రసస్వరూపమును నిర్వచించెను ముఖ్య దుష్యంతాదిగతరతి నట దుష్యంతాదులలో ననుమితమై రసవ్యపదేశ మొందు నని తన్మతసారము

రతి ఉపచితమై రసత్వ మొందునని శంకుకుఁ డంగీకరింపలేదు అనేకములగు ననుపపత్తులు చెప్పి ఆ పక్షమును నిరాకరించి కేవలము అనుమీయమాన మైననే రతి ఆస్వాద్యమై రస వ్యవహార మొందునని అతఁడు తన్మతము ప్రపంచించెను ఇది యిట్లు

సామాజికుఁడు నాటకమును రంగస్థలమున చూచుచో అట వాదిత్రాది సంగీతకమహిమచేతను రంగపరికరముల మహిమచేతను చతుర్విధాభినయ కౌశలమహిమ చేతను శిక్షాబలముగల నటుడు అభినేయమును కావ్యార్థమును - విభావాదికమును - సామాజికునకు ప్రత్యక్షకల్ప మొనర్చును ఎట్లన శ్రీరామభూమికను దాల్చిన నటుఁడు సీతావేషధారిణియై తన యెదుట నున్న నటిని జూచి ఇంత కాలమునుండి విరహతప్తుఁడ నగు నా భావవీధియందు మెలఁగుచుండి ఇప్పుడు ఇదే నా ప్రియ నాకు లోచనగోచర మైనది అని సంభోగ శృంగార విషయ కాలంబన విభావ కావ్యార్థము నభినయించును

ఒండె 'దుర్దైనవిమిత్తమున ఆ చపలనయననోడ నేను వియుక్తుడ
నైతిని అవిరళజలదకాలోత్పాతమ్ము డుపాగతమైనది ఎట్లు నైతును?
అని విప్రలంభ శృంగారోద్దీపకమును జలదాగమనును అభినయిం
చును ముఖ్యరామాదుల వేషములు ధరించిన నటులు ఆ రామా
దులవిగాఁ బలికిన యీ మాటల చేతను రంగ పరికరముల మూల
మునను సామాజికులకు విభావములు ప్రత్యక్షకల్ప మగును నటులు
శిక్షాప్రభావమున ముఖ్యరామాదుల కటాక్షస్వేద పులకాంకురా
ద్యనుభావములను ప్రదర్శింతురు ఉత్కంఠాది వ్యభిచారిభావము
లను - అవి చిత్తవృత్తు లగుట - తన యభినయముచే ప్రత్యక్షకల్ప
మొనర్ప నేరకున్నను- కృత్రిమ దృష్ట్యాది భావసంపాదనచే-సామాజి
కులకు అవగత మొనర్చును

అభినీతము లగు విభావాదులు నిజముగ ముఖ్యరామాద్యను
కార్యగతములే నటునియందన్నవో ప్రయత్నోపార్జితములు కృత్రిమ
ములు అవాస్తవములు కాని సామాజికుఁడు అభినయనైపుణ్యము
చేతను రంగపరికరముల మహిమచేతను- నటులే ముఖ్యరామాదులుగ
గ్రహించును సామాజికునిది యీ ప్రత్యక్షజ్ఞానము తాద్రూప్యజ్ఞా-
విలక్షణము ఏలన తాద్రూప్యజ్ఞానము కించిద్భేదసహిష్ణువు
ఇదియో భేదావగాహిప్రతీతి కానేకాదు చిత్రలిఖిత తురగమును
జూచి ఇది తురగము' అని బాలుఁడు ప్రత్యక్షప్రతీతి నొందినట్లు
నటునిజూచి సామాజికుఁడు ఇతఁడు రాముఁడు అని ప్రతీతి నొందును
ఈ చిత్రతురగప్రతీతి లోకసిద్ధములైన సర్వప్రతీతుల కన్న భిన్నము
ఎట్లన నటుఁడు రాముఁడుకాడు కావున ఇది రామ ఏవాయం అను
సమ్యగ్ జ్ఞానము - ప్రమాత్మకము - కాదు ఉత్తరకాలమున
న రామోఽయం' (ఇతఁడు రాముఁడుకాఁడు) అని బాధావతరణము

లేదు కావున మిథ్యాజ్ఞానమును కాదు ఈ మతమున బాధశిర స్కనే మిథ్యాజ్ఞానము 'అయం రామో వా న వా' అను నుభయ కోటికము సంశయజ్ఞానమును కాదు రామసదృశోఽయం అను సాదృశ్యజ్ఞానమును కాదు ఈనాలుగు ప్రతీతులును లోకప్రసిద్ధములు రామోఽయం అను నీ చిత్రతురగప్రతీతి ఐదవది—ఆ నాల్గింటికన్న విలక్షణ మైనది

[శంక] సమ్యక్ప్రతీతిభిన్న మగుట నిజముగ నిది భ్రమాత్మ కనే నటుఁడు సామాజికునకు వాస్తముగా విభావము కాఁడుకదా ? వానియందు రతి యెక్కడిది ? ఇట్టి భ్రమయుఁ గార్యకారియగునా ?

[సమా] మణిప్రభను మణి యనుకొని ఆవైపు పరుగిడిన వాఁడును దీపప్రభ మణి యనుకొని ఆ వైపు పరుగిడిన వాడును ఇరువురు భ్రాంతులే యైనను భేదమున్నది మొదటివానికి మణి లభిం చినది రెండవవానికి లభింపనేలేదు ఇందు మొదటివానిది సంవాది భ్రాంతి రెండవవానిది విసంవాదిభ్రాంతి విసంవాదిభ్రాంతి అర్థకారి కాదు సంవాదిభ్రాంతి యర్థకారి యైనది కావున భ్రమాత్మక జ్ఞానము కార్యకారి కాదనరాదు

(౧) ఇట్లు సామాజికుఁడు నటులను అకృత్రిమవిభావములుగ గ్రహించును

(౨) పిమ్మట విభావాది రూపహేతు ప్రత్యక్షబలమున స్థాయికి దద్గతవిభావాదులతోడ నున్న వ్యాప్తి గ్రహించి దానివలన (సంయో గాత్) నటునందు స్థాయిని అనుమానించును న్యాయ ప్రయోగము ఇట్లు—

రాముఁ డితఁడు సీతావిషయక రతిమంతుఁడు సీతాత్మకాలంబన విభావము ఉద్యానాదిరూపోద్దీపనవిభావము కటాక్షాదిరూపాను భావములు ఉత్కంఠాదిరూప వ్యభిచారిభావములు కలవాఁ డగుట చేత – నావలె.

ఇట నటుఁడు రాముడు పక్షము సీతాదివిషయకరతి సాధ్యము విభావాదులు హేతువు విభావాదు లున్నచోట రతి అవశ్యంభావి యనునది వ్యాప్తి ఉదాహరణము తానే సామాజికుఁడు తన విభావాదులతోఁడ తనరతికి వ్యాప్తి కలదని స్వానుభవమును ఇప్పుడు నాటకము చూచునపుడు స్మరించును ఇట్లు అనుమితిసామగ్రి సకలము కలదు ఇఁక అనుమితి పుట్టుట కేమి ? అదే రసము (అను మితిరూపము) ముఖ్యరామాదులం దున్నదియే స్థాయి దానికి ఈ మతమున రసవ్యపదేశము లేదు ఏలన ఇది యా రూపమున (ముఖ్య రామాది గతరూపమున) సామాజికులకు చర్వ్యమాణము కాదు చమత్కారహేతువు కాదు ఆ ముఖ్యరామాదిగతస్థాయి నటులచే ననుక్రియమాణ మగునపుడే – అది నటులయం దున్నట్లు (అముఖ్య రామాదులం దున్నట్లు–అనుమీయమాన మగునపుడే సామాజికులకు ఆస్వాద్యమాన మగును అందుచే ముఖ్యరామాదిగతస్థాయి నటాను క్రియమాణమై సహృదయానుమీయమానమై రసత్వవ్యపదేశ మొందును

[శంక] స్థాయి అనుమేయ మైనచో వహ్న్యాదులవలె అచమ త్కారికాదా ?

[సమా] చమత్కారిత్వముకాని తదభావముకాని అను మేయత్వ నిబంధనము కాదు మఱి వస్తుస్వభావాయత్తము అనఁగా

అనుమేయవస్తుసౌందర్యమహిమాయత్తము అనుమీయమానమైనను కామిని హృదయము ఆహ్లాదసంధాయకముకాదా ?

(౨) అదిగాక వహ్న్యాదులవంటిది కాదు స్థాయిభావరతి అన్యానుమితులకును దీనికిని మృద్ఘట కనకఘట తారతమ్యము ఇది రమణీయస్వరూపము నిరతిశయసుఖరూపము అందుచే ఆస్వాద్యత్వము రత్యాదిస్వభావాయత్తము

[శంక] జ్ఞానము ద్విక్షణవృత్తి కావున రసము అనుమితి జ్ఞానరూప మగుచో అది తాఁబుట్టిన మూఁడవక్షణములో నశించును గదా

[సమా] నశింపదు ఏలన నొకటి వెంబడి ఇంకొకటిగా అనుమితి ధారావాహికముగా విభావాదులు అభినయింపఁబడుచు తత్సాక్షాత్కార మున్నంతవఱకు సామాజిక హృదయమునందు కొనసాగుచుండును (వాసనయా చర్వ్యమాణో రసః అని కావ్యప్రకాశము నందును జెప్పఁబడినది వాసన యన ధారావాహిక మగు నిచ్ఛ) శ్రవ్యదృశ్యకావ్య పరన ప్రేక్షణకాలమందు సామాజికులకు అనుమిత్స (సిసాధయిష) నిరవచ్ఛిన్నముగా కడవఱకు నుండును అనుమానము నడుమ ముగిసిపోవదు అందుచే అనుమితమైనదానికి కాదు అనుమితి ఆ కారణమున అనుమితికి ఇట ప్రతిబంధకము అనుమిత్యంతర మను శంక నిరవకాశము ఒక్కటే అనుమితి రసరూపము ధారావాహిక ముగ కడవఱకు కొనసాగుచుండుటచే రసప్రతిబంధక మగు ననుమిత్యంతరమును లేదు రసము క్షణికమును కాదు

[శంక] ఇంద్రియ సన్నికర్ష రూప సామగ్రిసద్భావముచే నట విషయక ప్రత్యక్షప్రమితి రత్యాది రూపసాధ్యవిషయకానుమితి

సామగ్రిసద్భావముచే రసానుమితి కలుగు కాలములో నుండునుగదా ఎట్లు ఒక క్షణములో (ప్రత్యక్షప్రమితి అనుమితిరూపము) రెండు జ్ఞానముల సద్భావము సంభవించును ? అది సమూహాలంబనాత్మక మని చెప్పనగునా ?

[సమా] ఒక్క క్షణములో ప్రత్యక్ష సామగ్రియు అనుమితి సామగ్రియు నుండునేని అవి రెండును ఏకవిషయము లైనచో ప్రత్యక్ష సామగ్రియే బలవత్తరమై అనుమితిని ప్రతిబంధించును ఇట నన్ననో నటాది విషయము ప్రత్యక్ష సామగ్రి రత్యాది విషయకము అనుమితి సామగ్రి ఇట్లు ఈ రెండును విభిన్న విషయకములు జ్ఞాన సామగ్రులు విభిన్నవిషయకము లైనపు డన్ననో అనుమితి సామగ్రి బలవత్తరమై ప్రత్యక్షప్రమితి సామగ్రిని ప్రతిబంధించును అను మితియే కొనసాగును ఇట అనుమితిరూప రసాస్వాదనము అప్రతి హతముగా కొనసాగును ఇది శంకుకుని మతము

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అథ 8 ప్రకీర్ణకమతములు

(౭) విభావాదిత్రయము కలిసి రసవ్యపదేశ మొందును అని కొందఱు

పరస్పర సమ్మిళితములు విభావానుభావవ్యభిచారి భావములు మూఁడును కలిపి పానకరసన్యాయమున సహృదయులకు అఖండాస్వాద్యమానములై రస వ్యపదేశ మొందునని అభిప్రాయము ఈ మూఁడును కలసి (సముదితాః) పరస్పరము కలిసి అని భావము రతితో కలిసి అని కాదు అట్లగునేని అది సిద్ధాంతమే కావున

(౮) మఱికొందఱు విభావానుభావవ్యభిచారిభావములు (మూఁడును పరస్పరము సమ్మిళితములైకాదు) అందేది (స్వపోషక సామగ్రి ప్రకర్షచే) చమత్కారి విచ్ఛిత్తి విశేషశాలి - యగునో ఆ యొక్కటే రస మనఁబరఁగును అని చెప్పుదురు చమత్కారాధాయకములు కానిచో మూఁడును కలిసిన నేమి ప్రయోజనము? రసత్వము లేదు చమత్కారాధాయక మైనచో ఒక్కటియే చాలును రసత్వము కలుగును అందుచే మూఁడింటికే కలిసియే అని నియమము అకించిత్కర మని ఈ మతమువారి యభిప్రాయము

(౯) అన్యులు కొందఱు భావ్యమానము విభావమే రసము అందురు పునఃపునరనుసంధానరూపము భావన తద్విషయీభూత

మగు నాలంబనోద్దీపనవిభావమాత్రమే రసము హేతువులందు విభావమే ప్రధానమగుట అదే రసమని భావము

(౧౦) భావ్యమానము అనుభావము మాత్రమే రసమని కొందఱు కారణముకన్న కార్యమే విచ్ఛిత్తివిశేషాధాయక మని భావము

(౧౧) భావ్యమానము వ్యభిచారిభావమే రసరూపముగ పరిణమించునని కొందఱు

ఇవి రసమును గూర్చిన మతభేదములు

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అధి 9 భరత రససూత్ర సమన్వయము

పైఁజెప్పిన పదునొకండు మతములందును మూలమగు 'విభావానుభావ వ్యభిచారి భావసంయోగము వలన రసనిష్పత్తి' అను భరతముని సూత్రము ఆ యా మతపరముగా ఎట్లు సమన్వితమాయెనో గ్రంథకారునిచే వ్యాఖ్యానింపబడుచున్నది

మొదటిదైన అభినవగుప్తాచార్యుల మతమున విభావానుభావవ్యభిచారులతోడ (సంయోగాత్) వ్యంగ్యవ్యంజకభావసంబంధమునలన ప్రథమకల్పానుసారము చిదానందవిశిష్టస్థాయ్యాత్మకు (చైతన్యానంద విషయీభూత రత్యాది స్థాయిభావమునకు) ద్వితీయ కల్పానుసారము - స్థాయ్యుపహిత (విషయక) చిదానందాత్మకు (నిష్పత్తిః) స్వరూపమున ప్రకాశనము అని వ్యాఖ్యానము

రెండవదియైన భట్టనాయకమతమున-విభావానుభావ వ్యభిచారి భావముల (సమ్యక్ + యోగాత్ =సంయోగాత్) సాధారణాత్మ భావకత్వ వ్యాపారముచే భావింపఁబడుటచేత (రసస్య) స్థాయ్యుపహితము సత్త్వోద్రేక ప్రకాశితము నైన స్వాత్మానందరూపము యొక్క (నిష్పత్తి) భోగాఖ్యసాక్షాత్కార విషయీభావము (భోగాఖ్యసాక్షాత్కారమువలన ఆస్వాద్యమాన మగుట అని సూత్ర వ్యాఖ్యానము

మూడవదైన నవ్యులమతమున - విభావానుభావ వ్యభిచారి భావముల (సంయోగాత్) భావనావిశేషరూపదోషమున (రసస్య) దుష్యంతాదినిష్ఠము శకుంతలాది విషయకము నగు ననిర్వచనీయ రత్యాదిరూపమైన రసముయొక్క (నిష్పత్తిః) ప్రాతిభాసికోత్పత్తి

చతుర్థమతమున (పరకీయమతమున) విభావాదుల (సంయోగాత్) జ్ఞానమువలన (రసస్య) మానసప్రత్యక్ష రూపజ్ఞానవిశేషము యొక్క (నిష్పత్తి) ఉత్పత్తి

ఐదవదియైన భట్టలోల్లటమతమున - విభావాదుల (సంయోగాత్) సంబంధమువలన (రసస్య) నటులయం దారోప్యమాణమైన రత్యాది రూపరసముయొక్క (నిష్పత్తి) యారోపము - సామాజికు నకు భావనాత్మదోషవిశేషమునం జేసి నటులతో తాదాత్మ్యా ధ్యాసవలన నాస్వాదము

ఆఱవదియైన శంకుకమతమున - కృత్రిమము లయ్యు నకృత్రిమ ములుగా గ్రహింపఁబడినట్టి విభావాది హేతువులచే (సంయోగాత్) వ్యాప్తిజ్ఞానరూపానుమానమువలన (రసస్య) అనుమేయ రత్యాది రూపరసము యొక్క (నిష్పత్తి) అనుమితి

ఏడవదాన - విభావాదిత్రయము యొక్క (సంయోగాత్) పరస్పర సమ్మేళనము వలన రసముయొక్క నిష్పత్తి

మిగిలిన మూఁడుమతములందును సూత్రవిరోధము కలదు ఎట్లన -

పైఁ జెప్పఁబడిన యెనిమిది మతములందును సమ్మిళితములైన విభావానుభావవ్యభిచారిభావములు మూఁడును భరతసూత్రాను

సారము చెప్పబడినవి కడపటి మూఁడన్నను ఆ విభావానుభావ వ్యభిచారిభావములయం దొక్కదానినే రసముగా చెప్పినవి. ఇది సూత్ర విరోధము

ఇట ఇదియు నవధరింపఁదగును అభినవగుప్తాచార్యమతము తప్ప కడమ యేఁడు మతములును అరుచిగ్రస్తములు అస్వారసములు ఎట్లన -

(2) భావకత్వరూపమును అధికవ్యాపారమును స్వీకరించుటచే గౌరవ ముప్పతిల్లుటంజేసియు తాటస్థ్యముచేతను ద్వితీయము

(3) భావనాదోషకల్పనమునంజేసియు, రసమును అనిర్వచనీయముగా స్వీకరించి అవాస్తవికాపత్తిపాలు చేయుటచే తృతీయము

(4) మానసికజ్ఞానాత్మక మైన రసమునకు భ్రమత్వాభ్యుపగమముచే అతాత్త్వికతాపత్తిపాత్ర మొనర్చుటచే చతుర్థము

(5) రసము నటవృత్తి యని యంగీకరించి వాస్తవముగా సామాజికనిష్ఠ మని యంగీకరింపకపోవుటచే తాటస్థ్యమునం జేసి విలక్షణాస్వాదము అసంభవ మగుటచే పంచమము

(6) ప్రత్యక్షాతిరిక్తజ్ఞానములు అచమత్కారము లని సర్వ సహృదయులు అంగీకరించినను రసము అనుమేయ మని యొప్పుటచే పరోక్షమై అచమత్కారియైన కారణమున షష్ఠము

(7) విభావాదిసమూహనమాత్రము గ లోకోత్తరత్వప్రాప్తి సంభవింపమింజేసి సప్తమము

(8) విభావాద్యన్యతమమునకు రససారమైన చమత్కార సాకల్యము లేనందున అష్టమము – ఇట్టి మతములెల్ల అనాదరణీయములు అభినవగుప్తాచార్యపాదుల మత మొక్కటియే సర్వ సహృదయచక్రవర్తుల సమాదరపాత్రమై లోకమున నసనవద్య సిద్ధాంతఖ్యాతితో విలసిల్లుచున్నది

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అధి 10 విభావాదిపృథగ్వ్యంజకత్వనిరాసము

[శంక] విభావానుభావ వ్యభిచారిభావములలో నొక్కొక్క దానినే ఏల రసాభివ్యక్తివ్యంజకముగ నంగీకరింపరాదు? మిళితము లకే ఏల రసవ్యంజకత్వము?

[సమా] విభావాదులకు సమ్మిళితములకే రసాభివ్యంజకత్వము అంగీకరింపకున్న బాధ కలదు ఏలన ఈ విభావాదులు ఈయొక్క రసమునకే ప్రత్యేక వ్యంజకములు అని నియమము లేదు అవి రసాం తరములకునుంగూడ సాధారణ్యమున వ్యంజకములై యుండును కావున సమ్మిళితములై (మూఁడును కలిసియే – సమస్తముగ) రసవ్యంజక మగునని (సంయోగాత్ ' అను శబ్దముచే) భరత ముని రససూత్రమునఁ బ్రతిపాదించినాఁడు తద్విరుద్ధముగ విభావాదు లను ప్రత్యేకించి (వ్యస్తముగ) నొక్కొక్క రసమునకే వ్యంజకము లగునని నియమించిన, అభీష్ట మగు రసాంతర వ్యంజక సాధారణ్యము భగ్న మగును కావున మిళితములే యని ముని చెప్పెను అట్లే కావ్య ప్రకాశకారాదులును చెప్పిరి

(క) విభావమాత్రములు రసవ్యంజకము లన్నచో బాధ ఇట్లు వ్యాఘ్రాదులు భయానకరసమునకుంబోలె వీరాద్భుత రౌద్రరసముల కును విభావములు (వ్యంజకములు) ఎట్లన పులినిజూచి హింసించు

స్వభావము కలదని యెఱింగి భయపడినవాఁడు పరుగెత్తును వీరుఁడు విక్రమము మెఱపి దానితోఁ బోర నుత్సహించును మున్నెన్నఁ డురు పులిని కని విని యెఱుఁగనివాఁడు-బాలుఁడు - కుతూహలితుఁడై విస్మయంపడును తన బంధువును పులి చంపి గాండ్రించుచుఁ దిను చున్నదని చూచి యొకఁడు కసిగొని కుపితుఁడై దానిని పొలియింప నరుకట్టును ఇట్టి బహురసములకు విభావముగా నుండ వ్యాఘ్రమును ఒక్క భయానకమునకే విభావము, (వ్యంజకము) అన నెట్లు పొసఁ గును ? అట్లే—

(చ) అనుభావములు అశ్రుపాతాదులు శృంగారమున కొక్క దానికే కాక కరుణ భయానకములకును సాధారణవ్యంజకములు ఎట్లన ఒకఁడు రతి ననుభవించుచు ఆనందబాష్పముల దోఁగును. ఇంకొకఁడు ఇష్టజననష్టముచే శోకించుచు కన్నీరు మున్నీరౌనట్లును మఱియొకఁడు సర్పాది కఱచునని భయమాత్రముచే అశ్రువృష్టి కురియును కావున అనుభావములకును ఏకరసమాత్రవ్యంజకము లని నియమము లేదు

(ట) అట్లే చింతాదులు వ్యభిచారిభావములు శృంగారము నకుంబోలె కరుణ వీర భయానకములకును సాధారణ వ్యంజకములు ఎట్లన శృంగారమున నాయికారూప లావణ్య విభ్రమాదుల నెఱిం గిన కాముకునకు తద్వియోగముచే సంయోగచింత కలుగును. వీర మునఁ బులిని జంప నుత్సహించు శూరునకు సహాయచింత కలుగును కరుణమున బంధూపకారాది సహకారచింత కలుగును భయానక మున భయహేతు ప్రచండత్వాది చింత కలుగును ఇట్లు వ్యభిచారు లకును అనైకాంత్యము అనఁగా ఏకరసనియతత్వము లేదు అందుచేతనే విభావానుభావవ్యభిచారులకు దండచక్రన్యాయమున కలిసియే

కారణత్వము (వ్యంజకత్వము) తృణారణిమణిన్యాయమున నొక్కొక్కదానికి విడివిడిగా వ్యంజకత్వము లేదనియే భరతముని మున్నగు ప్రామాణికాలంకారికు లెల్ల విభావాదులకు మిళితములకే రసవ్యంజకత్వమును ఉరరీకరించినారు ఏలన సాధారణము లగు వ్యంజకములఁబట్టి ఏరసము ప్రస్తుత మను వ్యవస్థ కుదురదు

[శంక] మిళితములకే వ్యంజకత్వము అంగీకరింతుముగాక ఆ మిళితములకైనను ఎచట సాధారణ్యము కలదో ఆ శాంతిశృంగా రాదులందే - ఒక్కకామిని సన్న్యాసికి కుణపము (పీనుగు) గను కాముకునకు కాంతగను క్రవ్యాదునకు భక్ష్యముగను ప్రతీతివిష యము కాఁగా అశ్రుపాతాదులు మూఁవురకును అనుభావములు కావలదా ? చింతాదులు మూఁవురకును వ్యభిచారిభావములు కావలదా ? ఇట ఏమి వినిగమకము ?

[సమా] కొన్ని యనుభావములకును వ్యభిచారిభావములకును అనేకరససాధారణ్య మున్నను మఱికొన్నింటికి అసాధారణ్యమే కలదు ఆ యసాధారణ్యము గల యనుభావ వ్యభిచారిభావములఁబట్టి రసవిశేషాభివ్యక్తి నిర్ణయము ఇట అసాధారణ్యము నిర్ణాయకము - వినిగమకము అని భావము ఎట్లన

శృంగారమునందు సకల వ్యభిచారిభావములకు నను ప్రవేశము కలదు హాస్యమునందు గ్లాని శ్రమము చపలత్వము హర్షము అవ హిత్థలు నుండును. కరుణమునందు మదము, ధృతి, వ్రీడ, హర్షము గర్వము, ఔత్సుక్యము ఉగ్రత — ఇవిగాక తక్కిన వన్నియు నుండును రౌద్రమునందు గ్లాని శంక, ఆలస్యము దైన్యము చింత వ్రీడ ఆవేగము జడత విషాదము సుప్తి నిద్ర అపస్మారము

అపస్మారము వ్యాధి ఉన్మాదము శ్రమము త్రాసము అనునవి పుట్టవు వీరమునందు శాంత్ర వ్యభిచారులకోపాటు నిర్వేదముగూడ నధికముగా వచ్చును భయానకమునందు అసూయ మదము ధృతి వ్రీడ హర్షము గర్వము నిద్ర సుప్తి అమర్ష అవహిత్థ ఉగ్రత మతి యనునవికాక మిగిలినవి సంభవించును బీభత్సమునందును అద్భుతమునందును చింతాత్రాసాదులు యథాసంభవముగా నూహ్యములు శాంతమునందు నిర్వేదము ధృతి సంభవించును ఇట్లే శృంగార శాంతములను ధృతి ఉభయసాధారణమైన వ్యభిచారిభావము నిర్వేదము శాంతమునందే సంభవించునుగాని శృంగారమునందు దాని పొడ కానరాదు అందుకే శాంతమునందిది యసాధారణ్యము వహించును ఇట్లే తక్కిన విషయములు నూహ్యములు

విభావానుభావవ్యభిచారి భావములు ఒక్కటే రసోద్బోధకము

[శంక] ప్రామాణికులు విభావానుభావవ్యభిచారిభావములు కలిసియే రసవ్యంజక మగునని అంగీకరింతురుగాక కొన్నిస్థలములందు కేవల విభావములే వర్ణితములైనవి వానిచే రసోద్బోధము కలుగుచున్నది అట్లే కొన్నిస్థలములందు కేవల మనుభావములే రసోద్బోధకములుగ నున్నవి మఱికొన్ని స్థలములందు కేవల వ్యభిచారి భావములచే రససముల్లాసము కలుగుచున్నది ఈ చెప్పినతావులలో కడమవి మాపట్టుటే లేదు ఆ కారణమున మిళితత్వమునకు అవకాశమే లేదు

(1) కేవల విభావములు రసోద్బోధకము లగుటకు ఉదా.
ఒక మానినింగూర్చిన సకి మాటలు

వియ దలిమలినాంబుగర్భమేఘం
మధుకరకోకిలకూజితా దిశాంశః
ధరణీ రభినవాంకురాంకటంకా
ప్రణతిపరే దయితే ప్రసీద ముగ్ధే

ఓసీ తెలివితక్కువదానా (కోపము మానవలసిన సమయ మందును కోపము పూనుచున్నావు) మాటిమాటికి పాదముల వ్రాలు చున్న యీ నీ దయితుని విషయమునఁ బ్రసన్నురాలవు కమ్ము ఏలన మదనోద్దీపకనిమిత్తములు ఎట్లు ముమ్మరించియున్నవో చూడ నింగి అలినీలములైన నీటిమబ్బులఁ గాముకొనియున్నది తేఁటుల కోకిలల రొదలు దిక్కులఁ బిక్కటిల్లుచున్నవి మర్మభేదకము లగు నవాంకురటంకములచే (పాషాణభేదములచే) నేల నిండియున్నది నింగి నేల దిక్కులు సర్వత్ర మదనోద్దీపన మాయిష్ఠముగా నున్నవి ఏవైపున చూపు చాపుటకును శక్యము కాకున్నది ప్రాణములు నిలుపుకొనుట దూరతరవార్త ప్రాణము పోయిన పోనీ నాబెట్టు బిట్టు సడలకూడ దందువా? వాఁడుగో నీ దయితుఁడు తానే వచ్చి పాదాక్రాంతుఁడై యున్నాఁడు ఇంకను ఏమి బెట్టు? అలుక మానుము

ఇట దయితుఁడు ఆలంబనవిభావము వియదాది ఉద్దీపనవిభావ ములు ఇవిమాత్రమే వర్ణితములు అనుభావ వ్యభిచారిభావములు కానరావు అట్లయ్యును ఇట రసాభివ్యక్తి పుష్కలముగా నున్నది

(2) కేవల విభావవ్యంజకత్వమునకే ఉదాహరణాంతరము -

మాకందాలీ మరంద ప్రసరభర నమన్మంజరీగుంజల శ్రీ
ర్వాయు ర్వాత్యేష యోషిత్ప్రణయకలిభిదా దక్షిణో దాక్షిణాత్యః
నాదః శ్రోత్రైకపేయః పరిలురతి కుహూకంఠకంఠోదరేషు
జ్యోత్స్నా స్వచ్ఛన్దమిందోః స్ఫురతిచ మయి తద్దేవి దాసే ప్రసీద
(అలంకార మహోదధిః)

మామిడిచెట్లు పూదేనె జాలు బరువుచే వంగుచున్న పూల గుత్తుల మనోహర శోభతో విలసిల్లుచున్నవి ఈ దక్షిణపు దిక్కునుండి ఇదే దక్షిణమారుతము ప్రమదల ప్రణయకలహాముసు భగ్నము చేయునది (దక్షిణనాయక ప్రతిమానము) వీచుచున్నది కోయిలల కంఠోదరములందు శ్రోత్రపేయమైన నాదము పొరలు చున్నది చంద్రుని వెన్నెల యిచ్ఛవచ్చినట్లు (హద్దు లేక) కాయు చున్నది ఇట్లు లోకమెల్ల మదనోద్దీపకముగా నున్నది కావున దేవీ దాసుడ నగు నాయందు ప్రసన్నురాలవు కమ్ము

ఇట నన్నియు ఉద్దీపనవిభావములే వర్ణితములు ఇట విప్రలంభనే స్ఫుటముగా నున్నది

(3) కేవల విభావవ్యంజకతకే ఉదాహరణాంతరము —

దీర్ఘాక్షం శరదిన్దుకాంతి వదనం బాహూ నతా వంసయోః
సంక్షిప్తం నిబిడోన్నత స్తన మురః పార్శ్వే ప్రమృష్టే ఇవ
మధ్యః పాణిమితో నితంబి జఘనం పాదా వరాళాంగులీ
ఛన్దో నర్తయితు ర్యథైవ మనసి శ్లిష్టం తథాస్యా వపుః
(మాళవిక 2)

కన్నులు విశాలములు నెమ్మోము శరచ్చంద్రకాంతి విల సితము బాహువులు అంసభాగముల నమ్రములు నిబిడోన్నతములైన

స్తనములచేత వక్షోభాగము సంక్షిప్తము ప్రక్కలు రెండును తీర్చిన ట్లున్నవి నడుము పిడికెడు జఘనము నితంబఘనముగా నున్నది పాదముల వ్రేళ్ళు వంకరలు దిరిగి యున్నవి ఈమె శరీరముయొక్క కట్టు నాట్యగురువుల మనస్సున కభిమత మైన తీరుగా నున్నది

(౨) కేవలానుభావ వ్యంజకతకు ఉదా—

(1) యద్విశ్రమ్య విలోకితేషు బహుశో, నిస్థేమనీ లోచనే
యద్గాత్రేషు దరిద్రతా ప్రతిదినం దూనాబ్జినీ నాలవత్
దూర్వాకాండ విడంబకశ్చ నిబిడో యత్పాండిమాగండయో
కృష్ణే యూని సయౌవనాసు వనితా స్వేషైవ వేషస్థితిః
(హేమచంద్రుడు)

యువకృష్ణునియందే చూపు నిలిపి పెల్లుగా విలోకించిన యా తరుణుల వేషస్థితి యిట్లున్నది వారి నయనములు అలసములు (నిర్వ్యాపారములైనవి) వారి యంగములు వాడిన తమ్మితూండ్లవలె దినదినము క్రుస్సిపోవు చున్నవి వారి చెక్కిళ్ళ తెల్లదనము గరిక కాడల సరి పోలి నిబిడముగా నున్నది ఇట అనుభావములే వర్ణితములు అయినను విప్రలంభశృంగారము స్ఫుటప్రతీతముగా నున్నది

(2) ఉదాహరణాంతరము—

మకరందునితో మాధవుడు మాలతిని వర్ణించి చెప్పుచున్నాడు—

పరిమృదితమృణాళీమ్లాన మంగం ప్రవృత్తిః
కథ మపి పరివారప్రార్థనాభిః క్రియాసు
కలయతిచ హిమాంశో ర్నిష్కలంకస్య లక్ష్మీ
మభినవకరిదంతచ్ఛేదపాణ్డుః కపోలః

(మాలతీ)

మేనెల్ల ఎడలేని సంతాపముచే నాడినతమ్మితూటివలె మ్లాన మైనది దీనిచే వైవర్ణ్యారూపము అనుభావము స్ఫురించుచున్నది ఆహారాద్యుచిత వ్యాపారములందును పరివార ప్రార్థనచేతనే ప్రవృత్తి. స్వయముగా లేదు ప్రవృత్తభావము స్తంభమో ప్రలయమో అను భావము ద్యోతక మగుచున్నది అప్పుడు నఱకబడిన కరిదంతంపు ఖండమువలె పాండురము కపోలము నిష్కలంకహిమాంశుశోభను కలిగించుచున్నది దీనిచే వైవర్ణ్యము సిద్ధము ఇచట కేవలాను భావములే నిబద్ధము లైనవి అట్లైనను రసాభివ్యక్తి అవికలముగా నున్నది

(3) 1 కేవల వ్యభిచారి వ్యంజకతకు ఉదా

దూరా దుత్సుక మాగతే వివలితం సంభాషిణీ స్ఫారితం
సంశ్లిష్య త్యరుణం గృహీతవసనే సంకుంచితభ్రూలతమ్
మానిన్యా శ్చరణానతివ్యతికరే బాష్పాంబుపూర్ణం క్షణాత్
చక్షు ర్జాత మహో ప్రపంచచతురం జాతాగసి ప్రేయసి

ప్రియతముడు సాపరాధుఁడు వచ్చుచుండఁగా నాయిక కుపిత యయ్యును తొలుత సహజప్రేమతో నతనిని ఉవ్విళ్ళూరుచుం గాంచి నది ఇట ఔత్సుక్యము స్ఫుటము అతఁడు సమీపమునకు రాగానే అతనిని చూడనొల్లక కంటిని అతనినుండి పెడగా మరల్చినది ఇట

లజ్జ అతఁడు మాటాడ నారంభింపఁగానే కన్నులు విచ్చిచూచినది ఇట హర్షము. అతఁడు కౌఁగిలింపఁగడంగుడు కన్నులు ఎఱ్ఱచేసినది ఇట కోపము అతఁడు వస్త్రము పట్టుకోఁగానే బొమలు ముడిచినది ఇట అసూయ పాదములం బ్రదేళ్ళఁగానే బాష్పములు గురిసినది ఇట మనఃప్రసాదము (హర్షము) ఇట్లు స్వల్పకాలములోనే ఆమె నేత్రము ఇన్ని విధముల భావములు పొంది మనోహరమైనది ఇట వ్యభిచారి భావములు మాత్రమే ఉల్లిఖితములు. ఇల విప్రలంభశృంగార రసాభివ్యక్తి ఉత్కటముగ నున్నది

ఇట్లు విభావానుభావ వ్యభిచారిభావములలో కేవల మొక్కొక్క దాననే రసాభివ్యక్తి కల్గుచున్నట్లు తేటతెల్ల మగుచుండ సమ్మిళితములకే రసాభివ్యంజకత్వము అనుట ఎట్లు పొసఁగును? అని ఇంతవఱకు శంకాగ్రంథ విస్తరము

[సమా] అవును అవి క్వాచిత్కములు మిళితసూత్రవాక్యమునకు అపవాదప్రాయములు అచ్చోటనుంగూడ ఉల్లిఖితములు కాకున్నను స్వానుకూలములు స్వసముచితములు నైన కడమరెంటిని ప్రకరణాదివలన సమాక్షేపించుకొనుట (ప్రత్యాయనము చేసికొనుట) కర్తవ్యము అప్పుడే రసాభినిబద్ధము లైన విభావానుభావ వ్యభిచారిభావాన్యతమమునకు రసాభివ్యంజకత్వము అంతేకాని ప్రత్యేకముగా కాదు ఏలన విభావాదిత్రితయసంవలితస్థాయిభావ విషయముగనే రసప్రతీతి కల్గుట స్వభావము అట్లే చెప్పఁబడినది

'సద్భావశ్చేద్ విభావాదే ర్ద్వయో రేకస్య వా భవేత్
ఝటి త్యన్యసమాక్షేపే తదా దోషో న విద్యతే '

విభావాదులలో ఒకటికాని రెండుకాని ఉన్నచో తటుకున నన్యమును సమాక్షేపము చేసికొన్నను దోషము ఉండదు అన్నియు సమప్రధానములుగా నున్న రసాస్వాదోత్కర్ష యుండును రెండు ప్రధానము లగునేని అది తగ్గును

అసాధారణములుగ విభావాదులలో నొక్కటే యుల్లేఖింపఁ బడిన యుదాహరణములలో — విరహ దశమలిన యనుదాహ ప్రణతి యను భావము ప్రసాద ప్రార్థనలచే ఉన్నేయమగు నసూయ సంచారిభావము రెండవదాన మాకందాల మరంద శ్లోకమునను ప్రణతి యను భావము ప్రసాద ప్రార్థనచే నున్నేయ మగు నసూయ వ్యభిచారిభావము మూఁడవదాన దీర్ఘాక్షిం అను శ్లోకమున నయన విస్ఫారాదులు అనుభావములు ఔత్సుక్యాదులు సంచారులును ప్రకరణౌచిత్యముచే నాక్షిప్తములు నాలవదాన యద్విశ్రమ్య శ్లోకమున ప్రకరణమునుబట్టి శ్రీకృష్ణుఁడు ఆలంబనవిభావము ఔత్సుక్యాదులు సంచారులు ఐదవదాన పరిమృదిత మృణాలీ శ్లోకమున మాలతి విభావము మదనోద్యానాది ఉద్దీపనవిభావములు నిర్వేద గ్లాని జడతా విషాదౌత్సుక్య చింతా మోహావేగ ప్రభృతులు సంచారులు ఆఱవదాన మానినీప్రేయసులు విభావములు చరణగతి యనుభావము ఇట్లు వర్ణితేతరద్వయము ఆక్షేపించుకొననగును ఇట్లు విభావానుభావవ్యభిచారిభావసంయోగము వలననే రసనిష్పత్తి అని నిష్కృష్టార్థము ఇట్లు భరతమునిసూత్ర ప్రతిపాదనము అవ్యాహతము

ఉక్తరీతిని నానావిధముల నశేషశేముషీసంపన్నులగు మనీషులు నానారూపముల నిరూపించినను ఎల్లరచేతను రసము లోకోత్తర పరమాహ్లాదమయముగా ప్రతీయమానమై (ఆస్వాద్యమానమై) చమత్కారోత్కర్షను పొంది విలసిల్లుచున్నదనుట నిర్వివాదము ఆ విషయమున వైమత్యము లేదు

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

3 రసప్రకరణము

అ౹ 1 రసభేదములు

ఆ రసము

శృంగారః కరుణః శాన్తో, రౌద్రో వీరోద్భుత స్తథా
హాస్యో భయానకశ్చైవ బీభత్సశ్చేతి తే నవ

అని తొమ్మిది విధములు ఇట భరతముని వచనమును, సహృదయానుభవమును ప్రమాణము భరతముని వచనము,—

శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానకాః
బీభత్సాద్భుత శాన్తాశ్చ కావ్యే నవరసాః స్మృతాః

ఇందు కామము సకలజాతిసులభ మగుటంజేసి అయత్న పరిచిత మగుటంజేసి సర్వజనహృద్య మగుటంజేసి తొలుత శృంగారము తదనుసారి (తత్సహకారి) యగుట వలన హాస్యము నిరపేక్షభావ మగుట (రతినాశస్వభావ మగుట) హాస్యవిరోధి యగుట వాని యనంతరము కరుణము దానివెనుక నిరాశానిమిత్తము స్వార్థప్రధానము రౌద్రము తదనంతరము కామార్థములు ధర్మమూలకము లగుట ధర్మప్రధానము వీరము అది భీతాభయప్రదానప్రధాన మగుట తదనంతరము భయానకము భయవిభావసాధారణ్య

సంభావన మగుట దాని వెనుక బీభత్సము వీరము అద్భుతఫలక మగుట అనంతరము చెప్పుట ఇవెల్ల త్రివర్గాత్మకప్రవృత్తి ధర్మ మూలకములు తద్విపరీతధర్మము అనఁగా నివృత్తిధర్మాత్మక మగు మోక్షరూపము శాంతము పరస్పరాసంకీర్ణములు ఇవి తొమ్మిదే రసములు కొందఱు ఇందు శాంతము నాట్యరసముగ నంగీకరింపరు వారు ఇట్లు నుడువుదురు

'శాంతస్య శమసాధ్యత్వాత్ నటేచ తదసంభవాత్
అష్టా వేవ రసా నాట్యే న శాంత స్తత్ర యుజ్యతే

వాస్తవిక సహృదయత్వములేక కేవల శిక్షాభ్యాసాదులచే అనుకరణపాటనము మాత్రము కలవాఁడైన నటునందు వైరాగ్యసాధ్యము శమము సంభవింపనేరదు కావునను శాంతము శమరూప స్థాయిభావసాధ్య మగుటవలనను అభినేయకావ్యము (నాట్యము) నందు ఎనిమిదే రసములు అందు శాంతమును పరిగణించుట యుక్తము కాదు అన్యులు అస్వరసమని దీనిని ఒప్పరు అందులకు వారి యుపపత్తి యిది నటునియందు శమము లేదు కావున శాంతము నాట్యరసము కాదనుట అసంగతము నటునియందు రత్యాదిస్థాయిభావ మేది యున్నది? అందుచే నటునియందు ఏరసముయొక్క యభివ్యక్తియు అంగీకృతము కాదు రసాస్వాదకతావచ్ఛేదకము (సమనియతధర్మము) సహృదయత్వమగును నటత్వముకాదు కావున సామాజికులకు శమరూపస్థాయి కలుగుటంజేసి రసోద్బోధకమునకు ఏబాధయు లేదు

[శంక] నటునికి శమము లేకపోవుటంజేసి తదభినయ ప్రకాశములకు అనుపపత్తి కలుగును

[సమా] అట్లైనచో అతనికి భయక్రోధాదులును లేకపోవుటం జేసి తదభినయప్రకాశములకును అనుపపత్తి ఉప్పతిల్లవలసి యుండును అందుచే అవియు నాట్యరసములు కాకపోవలసియుండును

[శంక] నటునకు వాస్తవికక్రోధాదులు లేకపోవుటచేత వాస్తవము లగు తత్కార్యములు శత్రువధబంధనాదుల నుత్పాదనచేయుట సంభవింపకున్నను శిక్షాభ్యాసబలమువలనఁ గృత్రిమములం దత్కార్యములను తర్జనభర్త్సనాదులను నుత్పాదింప బాధలేదు అందుచే క్రోధభయానకాదుల యభినయప్రకాశములకు అనుపపత్తి లేదు

[సమా] అట్లే ప్రకృతమున శాంతరస విషయమునందును అగుఁగాక తనయందు శమములేనందున నటుఁడు వాస్తవికము లగు తద్వ్యాప్యకార్యములను సకలతృష్ణావిరామాదులను సామాజికచిత్తముల నుత్పత్తి చేయఁజాలకున్నను కల్పితశమకార్యములను శరీరాద్యవస్థాదులను శిక్షాభ్యాసబలమున నభినయించి ప్రకాశింపఁజేయుట సుసాధ్యమే కావున భయానకరౌద్రాదులవలెనే శాంతమును నాట్యరస మగుట పొసఁగును.

[శంక] మఱి నాట్యమందు చిత్తవిక్షేపకరములు శమవిరుద్ధములు గీతవాద్యాదు లుండుటంజేసి సామాజికులకును విషయవైముఖ్యాత్మక మైన శాంతరసము యొక్క యుద్రేక మెట్లు కలుగును?

[సమా] ఇది సమాధానము నాట్యమందును శాంతరసమును ఒప్పువారు తద్రసము నభినయించు సన్నివేశముల దృశ్యకావ్యమందు చూచుచో వారికి వైముఖ్య మున్నను శాంతరసానుకూలములగు గీతవాద్యముల విషయమున ఫలానురోధమున శాంతరస విరోధ మున్నట్లు తలంపను అట్లుగాక శాంతరసమందు విషయచింతాసామాన్యమున

కెల్ల విరోధమే అంగీకరించిన దానికి ఆలంబనమైన సంసారానిత్యత్వమునకు ఉద్దీపనమైన పురాణశ్రవణము సత్సంగము బృందావన నైమిశారణ్యాది పుణ్యవనగమనములు కాశ్యాదిపుణ్యక్షేత్రయాత్రలు గంగాది పుణ్యతీర్థసేవనము మున్నగు విషయములందును విరోధము రావలసియుండును అది తగదుకదా ఈ విషయమందు ప్రాచీన సమ్మతియుఁగలదు సంగీత రత్నాకరమున చరమాధ్యాయమం దిట్లు శార్ఙ్గదేవుఁడు వచించినాడు

> అష్టావేవ రసా నాట్యే ష్వితి కేచి దచూచుదన్
> త దచారు యతః కంచి న్న రసం స్వదతే నటః

కొందఱు నాట్యరసములు ఎనిమిదే అని నుడివిరి అది సరసముకాదు ఏలన నటుఁడు ఏరసమును ఆస్వాదింపఁడు కావున

అందుచే శాంతము నాట్యరసము కాకపోవలసినది లేదు శాంతము నాట్యరసము కాదను వారికిని బాధకము లేకపోవుటంజేసి మహాభారతాది ప్రబంధములందు శాంతము ప్రధానమని 'అఖిల లోకానుభవసిద్ధ మగుటంజేసి స్వీకరింతురు కావున శ్రవ్యకావ్యము లందు శాంతము రసమని స్వీకరింపవలసినవారే యగుదురు అందుచే అష్టౌ నాట్యరసాః స్మృతాః అని యుపక్రమించి శాంతోఽపి నవమో రసః అని మమ్మటభట్టు సైతము ఉపసంహరించెను కావున దృశ్యశ్రవ్యోభయాత్మక కావ్యమునందు శాంతరసమును సముల్లసించు ననుట నిర్వివాదము

రసగంగాధరము

పరిమళావివరణసముల్లసితము

అ॥ 2 స్థాయిభావములు

ఈ శృంగారాది రసములకు తొమ్మిది స్థాయిభావములు

> రతిః శోకశ్చ నిర్వేద క్రోధోత్సాహాశ్చ విస్మయః
> హాసో భయం జుగుప్సాచ స్థాయిభావాః క్రమా దమీ

శృంగారమునకు రతి కరుణమునకు శోకము శాంతమునకు నిర్వేదము రౌద్రమునకు క్రోధము వీరమునకు ఉత్సాహము అద్భుతమునకు విస్మయము హాస్యమునకు హాసము భయానకమునకు భయము బీభత్సమునకు జుగుప్స అని తొమ్మిది రసములకు వరుసగా తొమ్మిది స్థాయిభావములు [రససూత్రవ్యాఖ్య చూడుడు]

పూర్వమతములందు రసములకు స్థాయిభావముల కన్న భేదము ఇట్లు తొంటిదైన యభినవగుప్తమతమునను రెండవదియైన భట్టనాయకమతమునను రత్యాద్యవచ్ఛిన్న చైతన్యము రసముగా నురరీకృతము కావున వాని రెంటికిని – ఘటాదులకు ఘటాద్యవచ్ఛిన్నాకాశమునకుంబోలె – అవచ్ఛేద్యావచ్ఛేదక భావము భేదము – విశేష్య విశేషణ భావము గోవు లన సర్వగోసందోహము అని అర్థము శ్వేత అను విశేషణోపాధిచే గోవులలో కొన్నింటికే యర్థమైనది అట్లే ఇట రతి అవచ్ఛేదకము – విశేషణము రసము అవచ్ఛేద్యము విశేష్యము (స్థాయిరసములకు ఉపాధ్యుపధేయ భావము సర్వవ్యాపక

మైన యాకాశము ఘటాంతర్భాగమునఁ జేరి పరిచ్ఛిన్నమై అల్పదేశ వృత్తియై (వ్యాప్యమై) ఘటాకాశ మని వ్యవహరింపఁ బడుచున్నది ఇట ఘట మను విశేషణము ఉపాధి ఘటాకాశమునకు ఉపధేయ మని పేరు మహాకాశము నిరుపాధికము) అట్లే రసము వ్యాపకము రత్యాద్యుపాధిచే రసము పరిచ్ఛిన్నత్వ మొంది శృంగారాదివ్యపదేశ ముల నొందినది మూఁడవ మతమందు-నవ్యమతమందు ప్రాతిభాసిక రత్యాది రసముగా నంగీకృతమగుట-దానిక సత్యరజతమునకును అని ర్వచనీయరజతమునకుంబోలె - సాదృశ్యరూప భేదము నాలవదాన- పరకీయ మతమున - రత్యాదివిషయకజ్ఞానము రసముగా సమ్మ తింపఁ బడుటంజేసి - రజతాదివిషయమునకు రజతజ్ఞానమునకుం బోలె - విషయ విషయీభావరూపము భేదము పంచమషష్ఠములం దన్ననో రసస్థాయిభావములకు అభేదము సప్తమాది మతములందు స్థాయి చెప్పఁబడలేదు అందుచే నాలుగు మతములందే భేదముండు టంజేసి చెప్పఁబడినది

[శంక] నిజమునకు స్థాయిభావముల స్థాయిత్వము ఆశువినాశి చిత్తవృత్తివిశేషము లగుటంజేసి స్థాయిభావములకును స్థిరత్వము లేదు మఱి స్థాయిభావ వ్యవహార మెట్లు సంగతమగును?

[సమా]పరమాత్మ కున్నట్లు స్థాయిభావమునకు కూటస్థత్వము (స్థిరత్వము) వివక్షితము కాదు అందుచే పారమార్థికస్థిరత్వము లేదనుట నిజమే కాని కావ్యమునందెల్ల నభివ్యాపించి తుదివఱకు నుండుటచే ఆ పేరు

'అన్తఃకరణవృత్తిరూపస్య రత్యాదే రాశు వినాశిత్వేఽపి సంస్కారాత్మనా చిరకాలస్థాయిత్వాత్, యావద్రసప్రతీతికాల మనుసంధానాచ్చ స్థాయిత్వమ్ (ప్రదీపప్రభా)

వ్యభిచారిభావములవలె ప్రబంధమునందు అటనట పొడసూపి అంతలో నంతరింపవు కావున క్షణికములగు వ్యభిచారులతోఁ బోల్చి స్థాయిభావములను స్థిరము లనుట

[శంక] స్థాయిభావములకు మీా చెప్పిన యాప్రబంధ స్థాయిత్వమును దుర్ఘటమే అవి చిత్తవృత్తివిశేషము లగుటచే అన్ని చిత్తవృత్తులవలె రెండు క్షణములే మనును పోనీ వాసనారూపమున వానికి స్థిరత్వము కల దందుమన్న అది వ్యభిచారిభావములకును కలదు ఇఁక స్థాయిభావముల స్థైర్యమున నేమి విశేషము?

[సమా] వాసనారూపములకు స్థాయిభావములకు ఆప్రబంధ యావద్రస ప్రతీతికాలము మాటిమాటికి అనుసంధానము కలుగుటే స్థిరత్వ మని వివక్షితము వ్యభిచారిభావముల కన్ననో అట్టి ముహు ర్ముహురభివ్యక్తి లేనేలేదు అవి మెఱుపు వంటివి అందుచే వానికి కాదాచిత్కత్వమే కాని స్థాయిత్వములేదు అట్లే ప్రాచీనులు చెప్పియున్నారు

విరుద్ధై రవిరుద్ధైర్వా భావై ర్విచ్ఛిద్యతే న యః
ఆత్మభావం నయత్యాశు స స్థాయీ లవణాకరః
చిరం చిత్తే ఽవతిష్ఠంతే సంబధ్యన్తే ఽనుబంధిభిః
రసత్వం యే ప్రపద్యన్తే ప్రసిద్ధాః స్థాయినో ఽత్ర తే

ఇట చిరమ్' అనుట వ్యభిచారులందు అతివ్యాప్తి వారించుటకు అనుబంధిభిః - అనఁగా విభావాదులచేత అని యర్థము అట్లే

"సజాతీయై ర్విజాతీయై రతిరస్కృతమూర్తిమాన్
యావద్రసం వర్తమానః స్థాయిభావ ఉదాహృతః

ఎట్లు ఉప్పుసంద్రము స్వాదుజలయుక్తములుగానీ అస్వాదు జలయుక్తములు కానీ యైన నదీపూరములు ఎన్ని తన్నుఁజేరినను తన స్వభావమును (లవణత్వమును) విడువదో మఱి నదీపూరముల నెల్ల వెలయించునో, అట్లే ఏభావము అనుకూలనములు కాని ప్రతికూలములు కాని యైన విభావాదులతో సమ్మిళితమయ్యు తనస్వభావమును విడువదో మఱి ఆ విభావాదులకు తన స్వభావమును (రస్యమానత్వ మును) సంక్రమింపఁజేయునో అది స్థాయిభావము ఏవి (వాసనా రూపమున) చిరకాలము (వ్యభిచారులవలె కాదాచిత్కముగఁ గాక) చిత్తమునందు నెలకొనియుండునో అట్లే విభావాదులతో సమ్మిళి తము లగునో మఱి రసత్వము నొందునో అవి కావ్యమందు స్థాయి భావము లని వాసికెక్కియున్నవి

సదృశములుకాని అసదృశములుకాని యైన భావములచే ఏది చెనకరాక స్వరూపపరివర్తన మొందక ఉండునో అట్లే ఏది (ప్రసూనప్రతన్యాయమున) రసాస్వాదన ముఖ్యంతవఱకు అభివ్యా పించి యుండునో అది కావ్యమందు స్థాయిభావ మని చెప్పఁబడును

విరుద్ధభావములచే రతి విచ్ఛేద మొందమి యెట్లన-మాలతీ మాధ వమునందు మాధవునియొక్క రతి మాలతీవిషయకము శ్మశానాంక ప్రతిపాదిత మగు (శృంగారవిరుద్ధ) బీభత్సరసముచే విచ్ఛేద మొంద లేదు

మతాంతర ఖండనము

కొందఱు 'రత్యాద్యన్యతమత్వము (రత్యాదులలో నొకటి యగుట) స్థాయిత్వము అని లక్షణము చెప్పిరి అదిపొల్లు ఏలన రత్యాదులకు స్థాయిభావత్వము స్వరూపముచేఁ గాదు. అవి మఱి

కొన్ని రసములకు వ్యభిచారులును అగును ఉదా॰ రతి శృంగార స్థాయి భక్త్యాదులకు వ్యభిచారి

[శంక] అట్లైనచో మఱి దేనిచేత రత్యాదులకు స్థాయిత్వము ?

[సమా] ప్రరూఢత్వము' చేత – అనఁగా బహువిభావాది జన్యత్వముచేత నని యర్థము రత్యాదులలో నొకటి ప్రరూఢము కాఁగా, అన్యములు ఉత్సాహాదులు అప్రరూఢములు వ్యభిచారాదు లగును.

[శంక] భావముల ప్రరూఢత్వ మన నేమి ?

[సమా] బహువిభావజన్యత్వము ప్రరూఢత్వము అని ఇప్పుడే చెప్పితిమి అట్లే శార్ఙ్గదేవుని సంగీతరత్నాకరమునందును చెప్పఁ బడినది,—

రత్యాదయః స్థాయిభావాః స్యు ర్భూయిష్ఠవిభావజాః
స్తోకై ర్విభావై రుత్పన్నా స్త ఏవ వ్యభిచారిణః ' అని

'కారణ గుణములు కార్యగుణముల నారంభించును" అను న్యాయమున భూయిష్ఠవిభావాదిజన్యములు రత్యాదిస్థాయిభావములు– శృంగారాది రసములు అనఁగా శృంగారరసము ప్రధానమగు శాకుంత లాది కావ్యమునందు శృంగార రస విభావాదులు తత్స్థాయిభావములు తత్పరిపోషకములు గ్రంథమున తొలినుండి తుదివఱకు అభివర్ణితము లగును శకుంతలాదుష్యంతాదివిభావములు గ్రంథమున సర్వత్ర నభివర్ణితము లగుచు తద్భూయిష్ఠత్వముచే రత్యాది (శృంగారరసము) పరిపుష్టమొందును ప్రాధాన్యమొందును అట్లు ప్రాధాన్యమొందిన రత్యాదులు స్థాయిభావము లనబడును హాస్యాదు లన్ననో అటనట

వర్ణింపబడును అందుచే అల్పవిభావాదిజన్యము లగును అట్లే వీర రసప్రధానమగు మహావీరచరితాది నాటకములందు శ్రీరాముఁడు (విభావము) తొలినుండి తుదివఱకు అభివర్ణితు డగును వీరరసంపు స్థాయి ఉత్సాహము అట్లు భూయిష్ఠవిభావాదిజన్య మగును ఉత్సాహము ప్రతి స్థలమున శ్రీరాముని వీరకార్యములు వర్ణించినచోటుల నెల్ల నిష్పన్న మగును (సహృదయహృదయమున) అనఁగా ఉత్సాహము ప్రరూఢమగును అందుచే అది స్థాయి మఱి రౌద్రరసము అప్రధాన మగుట తత్ స్థాయి క్రోధము అల్పప్రదేశములందే అభి వర్ణితమగును అందుచే అల్పవిభావాదిజన్య మగును అందుచే అది అప్రరూఢము అదియే వీరరసమునకు వ్యభిచారిమాత్ర మగును అది (రౌద్రస్థాయియైనమాత్రమున) వీరరసమునకును స్థాయి కానేరదు ఇట్లు శృంగారాదులు స్థాయిభావములైన రత్యాదులందు ఏదే నొక్కటి భావము ప్రరూఢము కాఁగా కడమభావములు అప్రరూఢములుగా నుండును ప్రరూఢభావములు స్థాయిభావము లనఁబడును అప్రరూఢభావములు వ్యభిచారు లనఁబడునని వ్యవస్థ ఇట హాసాదులచేఁ గాక శృంగారము (రతి) క్రోధాదులచేఁగాక వీరము (ఉత్సాహము) పరిపుష్టము లగుట అసంభవము కావున శృంగారమునకు హాస మత్యావశ్యకము ఉత్సాహమునకు క్రోధ మత్యావశ్యకము అందుచే అప్రరూఢభావములు ఆ యా వ్యభిచారిభావములు ఆయా స్థాయిభావాదులకు నాంతరీయకములు (అవినాభావములు నిత్యసంబద్ధములు – అయుతసిద్ధములు) గ నుండును ఇట్లు అన్యముల విషయమునను ఊహించుకొనవలయును

పైఁజెప్పిన దానినిబట్టి ఒక్క భావమునకే ఒక్కచోట స్థాయి భావత్వము మఱొక్కచోట వ్యభిచారిభావత్వము ప్రరూఢాప్రరూ

షత్వములచే ప్రదర్శిత మగుటచేత రత్యాద్యన్యతమత్వము స్థాయిత్వము అను లక్షణము ఎట్లు పొసఁగును ?

ఇట విశేష మున్నది ఎప్పుడు ప్రధానరస పరిపోషణమునకై ఆ వ్యభిచారిభావమును బహువిభావజ మగునో అప్పుడు (రసత్వ సంపాదకమైన విభావాది) సామగ్రిసమవధానమునంజేసి రసత్వ మొంది ప్రధానరసమునకు అంగమగును దానికి రసాలంకార మని (రసవదలంకారము) అని పేరు అట్లే ధ్వనికారులును వచించిరి

'ప్రధానేఽన్యత్ర వాక్యార్థే యత్రాంగంతు రసాదయః
కావ్యే తస్మి న్నలంకారో రసాది రితి మే మతిః '

(ధ్వని 2, ౫)

ఏ కావ్యమునందు వస్త్వలంకారరూప వాక్యార్థము ప్రధానము (అంగి) కాఁగా రసాదులు (నాతిచమత్కారము లగుట) అంగము లగునో (ఇట ఆదిశబ్దముచే రసాభాసాదులు గ్రాహ్యములు) ఆ కావ్యమునందు ఆ యంగభూతాదులైన రసాదులకు రసవదాది' వ్యవహారము అని నా యభిప్రాయము రసము అంగమైన రసవత్తు భావము అంగమైన ప్రేయము రసాభాసము అంగమైన ఊర్జస్వి భావశాంతి అంగమైన సమాహితము భావోదయము అంగమైన భావోదయము భావసంధి అంగమైన భావసంధి భావశబలత అంగమైన భావశబలత అను నలంకారము లగునని భావము

రసగంగాధరము

వ్యాఖ్యావివరణసముల్లసితము

అధి 3 రత్యాది స్థాయిభావ నిర్వచనము

1. రతి

స్త్రీ పురుషులందు ఒండొరులు ఆలంబనముగాఁ గలది ప్రేమాఖ్య చిత్తవృత్తి విశేషము రతి శృంగారరసస్థాయిభావము అది గురుదేవతాపుత్త్రాద్యాలంబన మగుచో వ్యభిచారిభావమే

మనోఽనుకూలేష్వర్థేషు సుఖసంవేద నాత్మికా
ఇచ్ఛా రతిః'

మనస్సున కనుకూలించు విషయములందు సుఖానుభవాత్మకమైన యిచ్ఛయే రతి

2 శోకము

పుత్త్రాది వియోగమరణములచే నొదవిన వైక్లబ్యాఖ్య చిత్తవృత్తివిశేషము శోకము

పుత్త్రుఁడు మున్నగు నిష్టజనుల వియోగము మరణము మొదలగు సందర్భములచేఁ గలిగిన మనోవ్యాకులత్వము శోకము కరుణరసమునకు స్థాయిభావము

[శంక] ఇట పుత్రాది అనుచో ఆదిశబ్దముచే శిష్యగురు మిత్రప్రియబంధుకాంతాదులు గ్రాహ్యులు అట్టిచో కాంతా వియోగహేతుకము విప్రలంభశృంగారము నిర్విషయ మగుఁగదా

[సమా] స్త్రీ పురుషు లిరువుర వియోగము కలిగినపుడు నా ప్రియజనము జీవించి యున్నదని జీవితత్వజ్ఞాన మున్న సందర్భ మున వైక్లబ్యపోషితమైన రతియే ప్రధానమగుట శృంగారము విప్రలం భాఖ్యమే రసము కరుణరసము కాదు కరుణ రసస్థాయి వైక్లబ్య మన్నచో అచ్చోట సంచారిభావమే - అప్రరూఢము - అప్రధాన మగుట మఱి ఇష్టజన మరణజ్ఞానము కలిగిన సందర్భమున నన్నచో రతిపోషితమైన వైక్లబ్యము ప్రధాన మగుట కరుణమే రసము రతి వ్యభి చారియే ఇందుఁ విశేషము కలదు ఎప్పుడు మృతత్వజ్ఞాన మున్నను దేవతాప్రసాదాదిచే పునరుజ్జీవనజ్ఞానము ఎట్లనియు కల్గునేని దీర్ఘతమప్రవాసమువలెఁ జూపట్టును ఇట ఆలంబనమైన ప్రణయి జనమునకు ఆత్యంతిక విచ్ఛేదము లేదు కావున విప్రలంభశృంగా రమే రసము కరుణరసము కాదు చంద్రాపీడునిగూర్చిన మహాశ్వేత వాక్యములు ఉదాహరణములు బాణభట్టుని కాదంబరి యందు మహాశ్వేతకు పతియైన పుండరీకుని మరణజ్ఞాన మున్నను గగనచారి వచనమువలన తత్పునరుజ్జీవనజ్ఞానము కలుగుటంజేసి ఆలంబనము ఆత్యంతికవిచ్ఛేద మొందమిచే మహాశ్వేతమాటలందు విప్రలంభ శృంగారమే రసము

కొందఱు-పునఃప్రత్యుజ్జీవన జ్ఞానస్థలమున కరుణవిప్రలంభము నంగీకరింతురు కొందఱు అనుటచే తన్మతమున గ్రంథకర్త అస్వారస తను సూచించినాఁడు పూర్వోక్తరీతి విప్రలంభము స్వీకరించుట

చేతనే నిర్వాహ మగుచుండ కరుణవిప్రలంభము రసాంతరముగ స్వీక రించుట వ్యర్థ మని భావము

(ఇతరు లన్ననో కరుణవిప్రలంభమును రసాంతరముగాఁ గాక విప్రలంభశృంగారభేదముగనే అంగీకరింతురు వారిట్లు వచింతురు. చిరప్రవాసము కలిగినను ఆలంబనధ్వంసము లేమిం జేసి రతి అవిచ్ఛిన్నమై ప్రధానముగా నుండుటచే అట వైక్లబ్యము అల్పవిభావత్వమునంజేసి సంచారియే అట్లు మరణపునరుజ్జీవనముల జ్ఞానము కలుగ సంభవింపదు కరుణమం దన్ననో ఆలంబన ధ్వంసము (తాత్కాలికమ మైనచోఁగూడ) వాస్తవికము రతి తొంటి దానికన్న క్షీణప్రాయము వైక్లబ్యము కొంచె మధికము విప్రలంభ శృంగారము కరుణరసపరిపోషితము అందుచే కరుణవిప్రలంభమును విప్రలంభప్రకారమునుగా దానిని స్వీకరింపఁదగును అందు గౌర వము లేదు అది రసాంతరము కాదు—అని

రసచంద్రికయందు సర్వప కుపర్యాలోచనపూర్వకముగ ఏతద్వి షయము సప్రపంచము ప్రతిపాదితము తత్సంగ్రహము —

ఇష్టజన విశ్లేష (వియోగ) జన్యమగు విప్రలంభస్థలమున మనోవికారాత్మకము స్థాయి శోకము ఉండుటంజేసి కరుణరసత్వా పత్తి శంకింపరాదు ఏలన అచ్చోట శోకమున్నను అది రతి పరిపోషకమగుట రత్యంగ మైనందున రతియే ప్రధానమగుట విప్రలం భమే ఉచితము ప్రధానమును బట్టికదా వ్యపదేశము అట్లే కరుణ రసస్థలమునందును రతియున్నను అది శోకపరిపోషక మగుటంజేసి తదంగమగుట శోకమే ప్రధానము తన్నిమిత్తమున అట కరుణమే రసము ఇట కొందఱు - [రసతరంగిణియందు భానుదత్తుఁడును

సాహిత్యసారమున అచ్యుతరాయఁడు మున్నగువారు] విప్రలంభము నకు కరుణరసాపత్తిని వారించుటకై ఇష్టవియోగాది జన్యము రత్యా నాలింగితము నగు మనోవికారము కరుణము ' అనిలక్షణము చెప్పిరి ఇట రత్యానాలింగితము ' అను విశేషణము వ్యర్థము దానిచే తన్మనోరథము సిద్ధింపదు ఎలన శోకము రత్యంగ మగు నో ప్రీత్యా త్మకమగు రతిలేక శోక ముదయింపదు కావున, లక్షణము అసంభవ దోషజుష్ట మగును మఱియు కరుణస్థలమందు ప్రీత్యాత్మకము రతి యున్ననుంగూడ అది శోకపరిపోషక మగుట దానిచే పరిపుష్టమైన శోకమునందే చర్వణవిశ్రాంతి యగుటంజేసి అదే ప్రధానము అందుచే శోకమునకు రతి అంగమగుటయే సంభవించును కావున 'రత్యానాలింగిత ' విశేషణము ఎట్లు సనివమును ?

ఇట నిది యవధేయము — యువలలో అన్యోన్య విషయక మగు ప్రీతియే రతి ఇష్టవియోగాది జన్యమనోవికారమే శోకము ఇట ఈ రెంటి సమావేశము సమానమైనను ఒకరికి అన్యుల జీవిత నిశ్చయ మున్నచో విప్రలంభము తదభావనిశ్చయ మున్న కరుణము అని వివేకము ఇట్లు జీవితనిశ్చయ మున్న విప్రలంభమున [ఇష్ట వియోగజన్య మనోవికారాత్మకము] శోకమున్ననుంగూడ అందు రతి శోకములలో రతికే ప్రాధాన్యము వస్తుస్వాభావ్యమునంజేసి తన్నిమిత్తమున శోకము తదంగమగును అందుచే శోకపరిపుష్టరతి విప్రలంభస్థాయి

(2) జీవితాభావనిశ్చయ మున్న కరుణమం దన్ననో నిరుక్త రతి లేక శోక ముదయింపదు కావున రతి సైతము అందుండనే యుండును [అది రత్యానాలింగితము కాదు] అట్లయ్యు దానికి అందు

ప్రాధాన్యము లేదు శోకమునకే ప్రాధాన్యము వస్తుస్వాభావ్య మును బట్టి రతిపరిపుష్టశోకమే కరుణరసస్థాయి

(3) మఱి జీవితసందేహస్థలమున నన్నచో రతి శోకములకు పరస్పరము పోష్యపోషకభావమున వినిగమకము లేదు అనఁగా ఇది పోష్యము ఇది పోషకము అని యొక్కదానినే స్థాపించు యుక్తి లేదు అందుచే రతి శోకములకు రెండింటికిని స్థాయిత్వము కల దన వలెను

ఇట్లు విప్రలంభమున జీవననిశ్చయముచే భావిసంభోగ రూపేష్టసాధనతాజ్ఞాన ముండుటం జేసి తదధీనమైన యభిలాష (సమీహా) అనువర్తించును కరుణమునం దన్నచో జీవనాభావనిశ్చ యమునం జేసి భావిసంభోగరూపేష్టసాధనతాజ్ఞానము లేమిం జేసి తదధీనమైన సమీహా నివర్తించును అట్లే చెప్పఁబడినది, సప్రత్యా శము విప్రలంభము నిష్ప్రత్యాశము కరుణము ' అని జీవనసందేహ మున్నచో ఒక పక్షమున జీవనజ్ఞానమున భావిసంభోగరూపేష్ట సాధ నతాజ్ఞాననిమిత్తమున తత్సమీహా పక్షాంతరమున జీవితాభావ జ్ఞాననిమిత్తమున సమీహాభావము - ఇట్లు రెండును సమకోటికము లగును ఇట్లుండఁగా ఎచ్చోట యువలలో నొకరు మృతినొందినను జీవించియున్నను - మృతిపొందినట్లు నిశ్చయమున్న అట తత్ప్రలా పము శోకప్రధాన మగుట శోకస్థాయికము కరుణరసమే మఱి యెచ్చోట నొకరు జీవించియున్నను మృతిఁబొందినను - జీవించి యున్నట్లు నిశ్చయమన్న వియుక్తుల ప్రలాపమున రతియే ప్రధాన మగుట రతిస్థాయికము విప్రలంభశృంగారమే రసము వెండియు నెచ్చోట యువలలో నొకరు జీవించియుండ - మృతిఁబొందినఁగాని - జీవితసందేహ మున్నప్పుడు అట వినిగమకము లేకపోవఁగా, రతి

శోకములు రెండును యుగపత్సంభవము లగుట రెండున ప్రధానము లగుట తదుభయస్థాయికము కరుణవిప్రలంభాఖ్యము రసాంత రము అంగీకర్తవ్యము. అట్లే చెప్పఁబడినది నాహిత్యదర్పణమున,
కరుణవిప్రలంభము

యూనో రేకతరస్మిన్ గతవతి లోకాంతరం పున ర్లభ్యే
విమనాయతే యదైక, స్తదా భవేత్ కరుణవిప్రలంభాఖ్య

అని

యౌవనవంతు లగు నిరువురు స్త్రీ పురుషులయందు ఒకరు లోకాంతరమునకుఁ బోయి వెండియు దొరకువారై యుండ రెండవవారు దుఃఖపడుట కరుణవిప్రలంభ మగును ”

(సాహిత్యదర్పణమున (1) పూర్వరాగ (2) మాన (3) ప్రవాస (4) కరుణాత్మక మైన నాల్గుతెఱంగులు విప్రలంభ ప్రకారములలో కరుణవిప్రలంభము ఒకటిగాఁ జెప్పఁబడినది అట రతి శోకోభయస్థాయికముగాఁ జెప్పఁబడలేదు ‘ఎందు రతి ప్రకృష్టము కాక అభీష్టముం బొందకయున్నదో అది విప్రలంభము ’ అని రతి స్థాయికముగనే చెప్పఁబడినది)

‘ఇట్లు రఘువంశమున అజవిలాపమునందు శుద్ధము కరుణ రసము (శరీరాంతరముచే దొరికిన పత్నిమునంగూడ కరుణమే రసము) అందు ఆకాశవాణి పలికిన యనంతరమే శృంగారము ఏలన సంగమ ప్రత్యాశచే రతి జనించుటవలన ప్రథమమందు కరుణమే” [సా ద.] మేఘసందేశమున యక్షప్రలాపాదులందు శుద్ధము విప్రలం భము శ్రీమద్రామాయణమున హనుమదుక్త సీతాజీవనవృత్తాంత శ్రవణమునకు ముందు శ్రీరాముని ప్రలాపమున కరుణవిప్రలంభము

అట్లే కాదంబరియందు చంద్రమండలావిర్భూత మహాపురుషుని యాశ్వాసనానంతరము చంద్రాపీడపునరుజ్జీవనసంభావనము వెనుక మహాశ్వేతప్రలాపమున విప్రలంభము. తత్పూర్వము మహాశ్వేత ప్రలాపమునందు శుద్ధకరుణము

[శంక] 'ఇష్టవియోగాదిజన్యము మనోవికారము శోకము ఇట ఇష్టజన వియోగాదిజన్యము ఇష్టవస్తువియోగాదిజన్యము అని శోకలక్షణమునకు అర్థముకదా ఇట స్త్రీ పురుషాన్యము కేవలము ఇష్టవస్తు విషయక మైనపుడు సంభోగసమీహాజన్యమనోవికారాత్మకము స్త్రీ పురుషాన్యోన్యాలంబనప్రీత్యాత్మకము రతి - విప్రలంభస్థాయి - సంభవింప నేరదు కేవలశోకము సంభవించును కావున కరుణరసమే చెప్పవలసినది అట్లే ఇష్టజనకాంతాదివిషయక మైనప్పుడును కరుణావాంతరభేదముగా చెప్పుటే ఉచితముకదా!

[సమా] స్త్రీపురుషాన్యవిషయ మైనపుడు ఉక్తరీతి రతి సంభవింపక శోకమే సంభవించు నని కరుణరసమే చెప్పినను స్త్రీపురుష విషయక మైనపుడు విప్రలంభస్థాయి యైన రతిసంభవించును కావునను కరుణరసస్థాయి శోకమును అచ్చోట సమకాలమున నున్నందునను - ఉభయస్థాయికము కరుణవిప్రలంభాఖ్యము శృంగార కరుణాతిరిక్తము రసము చెప్పుట ఉచితము అని మా యభిప్రాయము అని రసచంద్రికాకారుఁడు

ఉక్తరీతి కరుణ విప్రలంభమునకు కొంత యుపపత్తి కలుగుట స్పష్టము దానిని రసాంతరముగా గ్రహించిన మునివచనవిరోధము కలుగునని అది లేకయు ప్రాచీను లనుసరించినమార్గమునకు నిర్వాహము కలుగుటం జేసి గౌరవమునకు జడిసి రసగంగాధరకారుఁడు

డానిని నిరాకరించెను సాహిత్యదర్పణకారుఁడు విప్రలంభభేదముగనే గ్రహించి ముని వచనము ననువర్తించెను

3 నిర్వేదము

నిర్వేదము శాంతరసస్థాయి బ్రహ్మము నిత్యము జగత్తు అనిత్యము అని యీ రెంటిని వివేచించుటచే జనించినది – అనిత్యవస్తు విషయక మగు విరాగము (నిరభిలాష–విరక్తి) అను చిత్తవృత్తి విశేషమునకు నిర్వేద మని పేరు గృహకలహాదిజనితమైన యల్పకాలిక నిర్వేదమువ్యభిచారిభావమాత్రము నిరంతరస్థితిగల నిర్వేదమే స్థాయి అని భావము ఈ నిర్వేదమునకే శమ మని నామాంతరము (శమః అయ మేవ నిర్వేదశబ్దేనాపి వ్యజ్యతే ' రసచంద్రిక) శమమే స్థాయి నిర్వేదము కాదని హేమచంద్రుఁడు (చూ కావ్యానుశాసనము)

4 క్రోధము

గురుబంధువధాదిపరమాపరాధజన్యము జ్వలనాఖ్యము క్రోధము గురువు తల్లి తండ్రి సుతుఁడు ప్రియకాంత, మిత్రము మున్నగువారి వధాది (ఆదిశబ్దముచే మహాపరాభవము) పరమా పరాధములు చేసినవారి విషయమున నుద్భవించు ప్రజ్వలనాఖ్య మనోవృత్తివిశేషము క్రోధము – రౌద్రరసస్థాయిభావము ఈ స్థాయి భావము క్రోధము ప్రజ్వలించి ఉక్తపరమాపరాధము నాచరించిన శత్రువుల వినాశమునకు గారణభూత మగునది అవజ్ఞారూపాల్పాపరాధ జన్యమై వారలతో పరుషసంభాషణాదికారణభూత మగు నమర్ష రూప వ్యభిచారిభావమునకన్న ఇది వేఱైనది క్రోధామర్ష భేదము ఇది తెలియఁదగినది ఏకరూప మని శంకింపఁజనదు

5 ఉ త్సా హ ము

పరాక్రమదానాదిస్మృతిజన్యము ఔన్నత్యాఖ్య చిత్తవృత్తి విశేషము ఉత్సాహము – వీరరసస్థాయిభావము

శత్రువుల పరాక్రమము కాని అన్యమహాపురుషుల దానదయాది శ్లాఘ్యకర్మముల స్మరణముచే నొదవినది చిత్తౌన్నత్యరూపము వృత్తివిశేషము ఉత్సాహము

అన్యదీయ లక్షణము— కార్యారంభేషు సంరంభః స్థేయానుత్సాహ ఉచ్యతే' పూనినకార్యములందు ఉత్కటావేశము ఉత్సాహ మనఁబడును

6 వి స్మ య ము

అలౌకిక వస్తుదర్శనాదిజన్మము వికాసాఖ్య చిత్తవృత్తి విశేషము విస్మయము – అద్భుతరసస్థాయిభావము

లోకోత్తరములైన వస్తువుల ఇంద్రజాల దివ్యపురుషాదుల దర్శనము స్మరణము మున్నగు కారణములచే జన్మించినట్టిది చిత్తము యొక్క వికాస రూపము వృత్తి విశేషము విస్మయము

7 హా స ము

వాగంగాది వికారదర్శన జన్మము వికాసాఖ్యము హాసము హాస్యరసస్థాయిభావము

వాక్కు అంగము వేషము భాషణము చేష్ట మున్నగు వానియందు వికారమును (అన్యథాభావము – లోక విపరీత మగు

భ౦౧౨) చూచుట స్మరించుటచేత నొదవినది వికాసరూపము చిత్తవృత్తివిశేషము హాసము

8 భయము

వ్యాఘ్రాది దర్శనజన్మము పరమానర్థవిషయకము వైక్లబ్యాఖ్య చిత్తవృత్తి విశేషము భయము - భయానకరసస్థాయి

సద్యోమరణాది పరమానర్థమును పుట్టించు వ్యాఘ్రాసురాది ఘాతుకజనజంత్వాదులఁ జూచుట స్మరించుట మున్నగు నిమిత్తములచే జనించినది వైక్లబ్యాఖ్యచిత్తవృత్తివిశేషము భయము సద్యోమరణాది పరమానర్థ విషయకము కానిచో, అదే క్షుద్రవైక్లబ్యదశాపాదకము అల్పవిభావజ మగుట వ్యభిచారిభావ మగునేకాని స్థాయి కాదు ఈ భయ త్రాస భేదము తెలియవలెను

కొందఱు ఔత్పాతికప్రభవ స్త్రాసః స్వాపరాధోత్థితంభయమ్ అని భయత్రాసములకు భేదము చెప్పుదురు మహావాతము అశనిపాతము దవానలము మున్నగు నుత్పాతములవలన గల్గు మనఃక్షోభము త్రాసము స్వాపరాధద్వారమున కలిగిన చిత్త విహ్వలత్వము భయము అని కారణభేదమును బట్టి భేదము చెప్పుదురు

9 జుగుప్స

కదర్యవస్తు విలోకనజన్మము గర్హాణాఖ్య చిత్తవృత్తి విశేషము జుగుప్స - బీభత్సరస స్థాయిభావము

కుత్సితవస్తువుల శ్మశానాదులఁ జూచుట స్మరించుట మున్నగు నిమిత్తముల జనించినది గర్హాణాఖ్య చిత్తవృత్తి విశేషము జుగుప్స

గర్హణము=ఏవ రోత ఇట మూలములో విచికిత్సాఖ్యచిత్తవృత్తిః అని పాఠము విచికిత్సాతు సంశయః అని అమరము గర్హణాఖ్య అనియే సరియైనపాఠము కాఁబోలు నని శ్రీ బదరీనాథశర్మ వ్యాఖ్యాత అన్యదీయ లక్షణములు

"జుగుప్సాగర్హణార్థానాం దోష సందర్శనాదిభిః '

అహృద్యానాం పదార్థానాం దర్శన శ్రవణాదిభిః
సంకోచనం యన్మనసః సా జుగుప్సాత్ర విక్రియా '
(రసార్ణవః ౨)

దోషసందర్శనాదులచే పదార్థముల గర్హణ జుగుప్స.

అహృద్యములైన పదార్థములను చూచుట వానినిగూర్చి వినుట మొదలగుదానిచే మనస్సంకోచనరూప మగు వికారమే జుగుప్స

రసగంగాధరము

వరిమస్యావివరణసముల్లసితము

అధి 4 రసవిభావాదులు

విభావానుభావ వ్యభిచారిభావలక్షణములు చెప్పఁబడినవి ఒక్కొక్కరసమునకు ఏవి ఆలంబన విభావములో ఉద్దీపన విభావములో అనుభావములో వ్యభిచారిభావములో చెప్పఁబడుచున్నవి

శృంగారమునకు స్త్రీపురుషులు నాయికానాయకులు ఆలంబనములు చంద్రిక వసంతము వివిధములైన ఉపవనరహఃస్థానాదులు ఉద్దీపనవిభావములు రతివిషయీభూతవ్యక్తిముఖావలోకనములు తద్గుణశ్రవణకీర్తనాదులు అన్యములు స్తంభరోమాంచాదులు సాత్త్వికభావములు అనుభావములు స్మృతిచింతాదులు వ్యభిచారులు (ఆలస్యము ఉగ్రత జుగుప్స అను మూఁడు తప్ప కడమవెల్ల)

కరుణరసమునకు బంధునాశాదులు ఆలంబనములు తత్సంబంధి గృహాతురగాభరణాది దర్శనస్మరణాదులు తత్కథాశ్రవణాదులు ఉద్దీపనవిభావములు గాత్రాక్షేపము అశ్రుపాతము మున్నగునవి అనుభావములు నిర్వేదము గ్లాని క్షయము అస్రము వ్యాధి మరణము మోహము విషాదము చింత ఔత్సుక్యము దీనత జడత మున్నగునవి వ్యభిచారిభావములు

శాంతరసమునకు అనిత్యముగ జ్ఞాతమైన జగత్తు ఆలంబన విభావము వేదాంతశ్రవణము తపోవనము, తాపసదర్శనము మున్నగునవి ఉద్దీపనవిభావములు విషయమునందు అరుచి శత్రుమిత్రౌదాసీన్యము చేష్టాహాని నాసాగ్రదృష్టి మున్నగునవి అనుభావములు. హర్షము ఉన్మాదము, స్మృతి మతి మున్నగునవి వ్యభిచారులు

రౌద్రరసమునకు అపరాధిపురుషాదులు ఆలంబన విభావము వధ బంధనాదులకు అపరాధిపురుషుల గుఱిసేయుటకో పర్యవసించునవి నేత్రారుణిమ పండ్లుకొఱుకుట పరుషభాషణము శస్త్రగ్రహణము మున్నగునవి అనుభావములు అమర్షము ఆవేగము ఔగ్ర్యము చాపలము గర్వము అసూయ మదము ఉత్సాహము మున్నగునవి సంచారులు

ఇట్లు ఏ చిత్తవృత్తికి (ఏ స్థాయిభావమునకు) ఏది విషయమో అది ఆ స్థాయిభావమునకు ఆలంబన విభావము ఏ స్థాయికి ఏవి నిమిత్తములో (నిమిత్తకారణములో) అవి ఉద్దీపనవిభావములు ఏవి స్థాయికార్యములో అవి దాని యనుభావములు అవి (రోమాంచాదులు) స్వకారణమైన రత్యాదులను అధికముగ వ్యంజించును [ఉద్యోతప్రభ] ఏవి రత్యాదులకు పోషకములో అవి దాని సంచారి భావములు. అనఁగా ముహుర్ముహురభివ్యంజనముచే కావ్యమునం దంతటను స్థాయిని సంచరింపఁజేయును కార్యజననమునందు (రసనిష్పత్తి యందు) ఆనుకూల్యమున సంచరింపఁజేయును

రసగంగాధరము

వరివస్యావివరణసమన్వితము

అధి 5 శృంగార రస కారములు

చెప్పఁబడిన నవరసములలో ప్రథమము శృంగారము ఇఱు తెఱంగు - సంభోగము విప్రలంభము అని

ఎందు రతి సంయోగకాలావచ్ఛిన్న మగునేని - సంయుక్తలము అను బుద్ధిరూపాంతఃకరణవృత్తివిశేషము సంయుక్తులకు సంయోగకాలమున నియతముగ అనుభవగోచర మగుచుండునేని — అది సంయోగ శృంగారము. రతి వియోగకాలావచ్ఛిన్న మగునేని- వియుక్తులము అను జ్ఞానవిశేషము వియోగకాలవ్యాప్తమై వియుక్తులకు నియతముగ నుండునేని, అది విప్రలంభశృంగారము ఇట సంయోగ విప్రలంభశబ్దముల యర్థము స్పష్టముగా నెఱుఁగఁదగును సంయోగ మన నాయికానాయకుల సామానాధికరణ్యము కాదు - అనఁగా నొక్కచోట నుండుటకాదు అట్లు అర్థము గ్రహించుచో వారు ఏకశయ్యాగతులై యున్నను అప్పుడు అలుక మున్నగు కారణములచే (ఈర్ష్యాది)విప్రలంభము వర్ణింపబడుటంజేసి అట్లే వియోగ మన వైయధికరణ్యమునుంగాదు - అనఁగా వేర్వేఱుచోటుల నుండుటయు గాదు అట్లు గ్రహించిన దోషము ఉప్పతిల్లును పృథక్ స్థానములం దున్నను మనస్సున నాయకానాయకులకు రతియుండఁగా ఈర్ష్యాదులు లేకపోవఁగా వియోగము చెప్పరాదు సంభోగమే

చెప్పవలసివచ్చును ఇది కొసఁగు అందుచే అధికరణమునుబట్టికాక అంతఃకరణవిశేషమునుబట్టి సంయోగ విప్రలంభశబ్దముల నిర్వచించుట సముంజసము ఱలు ౧ సంభోగశృంగారమునకు

శయితా సవిధే౽ప్యనీశ్వరా అనునది ఉదాహరణము [ఉత్తమోత్తమ కావ్యమునకు ...్యముగా నా ప్రకరణమునందు నిరూపిత పూర్వము]

అప్పయ్యదీక్షితోక్తలక్ష్యఖండనము

మఱి చిత్రమీమాంసలో

వాగర్థావివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే
జగతః పితరౌ వన్దే పార్వతీపరమేశ్వరౌ ' (రఘు ౧)

అను శ్లోకమునందు రసధ్వని వంద్యులైన పార్వతీపరమేశ్వరులు వాగర్థములవలె నిత్యయోగమునం జేసి తత్కారణీభూతరతికి ప్రధానముగ వ్యజ్యమాన మగుట సంభోగశృంగారధ్వనికి ఇది ఉదాహరణము అని నుడివినారు అది చిత్రమీమాంసాకర్త అప్పయదీక్షితుల ధ్వనిమార్గానభిజ్ఞతను నిరూపించుచున్నది తత్ప్రతిపాదనము ధ్వనిసిద్ధాంతవిరుద్ధము కాళిదాసకవినిష్ఠము పార్వతీపరమేశ్వర విషయకము నగు రతిభావము ఇచట ప్రధానము పార్వతీపరమేశ్వరుల శృంగారము కవిగతరతిభావమునకు పోషకము అంగము అగును. అందుచే ఇచ్చట రసధ్వని అసంభవము

రసాది ప్రధానమైనచో అలంకార్య మగును, అలంకారము కాదు అట రసమునకే చమత్కారోత్కర్ష అందుచే నచ్చోట రసాదిధ్వని మఱి రసము గుణీభావ మొందిన రసవదలంకారము అని ధ్వనికారులు నిర్ణయించినారు అట్లే మమ్మటభట్టాదులును అంగీకరించినారు ప్రకృతమున నన్ననో వాగర్థా విన' అను శ్లోకమున శృంగారము వ్యంగ్య మైనను కవినిష్ఠరతిభావమునకు అంగ మైనందున అలంకారమే యగును అలంకార్యము కాదు అందుచే రసధ్వనికి ఉదాహరణము కాదు

విప్రలంభ శృంగారమునకు ఉదా

వాచో మాంగలికీః ప్రయాణసమయే జల్ప త్యనల్పం జనే
కేలీమందిర మారుతాయనముఖే విన్య స్తవక్త్రాంబుజా
నిశ్వాసగ్లపితాధరోపరి పతద్బాష్పార్ద్రవక్షోరుహా
బాలా లోలవిలోచనా శివశివ ప్రాణేశ మాలోకతే

ప్రాణేశుని దేశాంతర ప్రస్థానసమయమందు జనులు (గురుజనులు సఖీజనులు) ప్రస్థానమంగళవాక్యములు పెల్లుగా పలుకుచుండఁగా కేళీమందిరవాతాయనపుటంచున మోముదమ్మి నుంచి నిట్టూర్పులచే వాడిన యధరముపైకి జాలువారు కన్నీటిచేఁ దడిసిన వక్షోజములు కలది ఆ బాలతరళాక్షి శివశివ ప్రాణనాథుని నూరక విలోకించుచున్నది (కనుల నీరుగార్చుట అమంగళమని యెఱుఁగదు)

ఇట ఆలంబనవిభావము నాయకుఁడు మాంగలిక వాక్యానీకము ఉద్దీపనవిభావము నిశ్వాసాశ్రుపాతాదులు అనుభావములు విషాదచింతావేగాదులు వ్యభిచారిభావములు వీనిసంయోగమున

(నాయికానిష్ఠరతితో మిళిత మాటంజేసి) నాయికరతిని అభివ్యక్త పఱచుచున్నందున రసము శృంగారము ఆ రతి వియోగకాలావచ్ఛిన్న మగుట విప్రలంభశృంగారము

మఱియొక యుదాహరణము.

గోకులవధు వొకతె శ్రీకృష్ణుని లోకోత్తరసౌందర్యమును గూర్చి యిట్లు పల్కినది —

ఆవిర్భూతా యదవధిమధుస్యందినీ నందసూనోః
కాంతిః కాచి న్నిఖిలనయనాకర్షణే కార్మణజ్ఞః
శ్వాసే దీర్ఘ స్తదవధిముఖే పాండిమా గండయుగ్మే
శూన్యా వృత్తిః కులమృగదృశాం చేతసి ప్రాదురాసీత్

శ్రీకృష్ణుని యొక్క యనిర్వచనీయతనుకాంతిమధుస్రవంతి లోకుల నయన మోహన కర్మల నెఱింగినదై ఎప్పుడు ఆవిర్భవించెనో అది మొదలు కులకాంతల ముఖముల నిట్టూర్పులు, చెక్కిలిదోయిని పాండిమము చిత్తములందు శూన్య (నిరాలంబ) వృత్తియు ప్రాదుర్భవించినవి

ఇట శ్రీకృష్ణుఁడు ఆలంబనము శ్వాసాదులు అనుభావములు వానిచే వ్యంగ్యము లగు విషాదాదులు వ్యభిచారులు వీని సంయోగముచే వ్యజ్యమానము కులకాంతానిష్ఠము వియోగకాలావచ్ఛిన్నము నైన రతి విప్రలంభశృంగార మగును

ఉదాహరణాంతరము —

నయనాంచలావమర్శం
యా న కదాచిత్ పురా సేహే
ఆలింగితాపి జోషం
తస్థౌ సా గంతుకామేన దయితేన

ఆ క్రొత్తపెండ్లికూఁతురు (భర్త ప్రస్థానదినమునకు) ముందెన్న డును కనుగొనల (కటాక్షముల) చేతనేని భర్త స్పృశించుటను సైతము సహింపనిది (సమగ్రనిరీక్షణము మాట చెప్పనే యక్కఱ లేదు) అట్టి సిగ్గఱిగరిత మఱి యిప్పుడన్ననో (ప్రయాణదివసమున) దేశాంతరము పోనున్న ప్రియుఁడు తన్ను బిగ్గ కౌఁగిలించుకొన్నను కదలక మెదలక మిన్నకున్నది (వారింపలేదు)

ఇట పూర్వపద్యమునందుంబోలె సహజ చాంచల్య నివృత్తి (స్తిమితభావము) జడత అనుభావము తన్నిమిత్తమున వ్యజ్య మానమగు జడత వ్యభిచారి ఇట్లు జడత అనుభావవ్యభిచారులు రెండును ప్రియుఁడు ఆలంబనవిభావము ఇవి కలిసి ప్రవసత్పతిక యైన యా నవోఢయొక్క వియోగకాలావచ్ఛిన్నమైన రతిని విప్రలంభ శృంగారపదవికిఁ దెచ్చుచున్నవి

విప్రలంభ భేదములు —

ఈ విప్రలంభ శృంగారమును ప్రాచీనులు మమ్మటాదులు ప్రవాసాద్యుపాధులనుబట్టి ఐదువిధములుగాఁ జెప్పిరి

అవేవన (1) ప్రవాస విప్రలంభము (2) అభిలాషా విప్ర లంభము (3) విరహా విప్రలంభము (4) ఈర్ష్యా విప్రలంభము

(5) శాపవిప్రలంభము అని కరుణ విప్రలంభమును ఆఱవ ప్రకార ముగా (సాహిత్యదర్పణకారాదులు) వచించిరి ఇట్టి ప్రకార విభాగ మున విశేష మేమియు లేనందున నేము వచింప లేదు

కరుణ రసమునకు ఉదా —

అపహాయ సకలబాంధవచింతా ముద్వాస్య గురుకులప్రణయమ్
హా తనయ వినయశాలిన్ కథ మివ పరలోకపథికో౽భూః

హా వినయశాలి తనయా సకలబాంధవులను [నన్ను విడిచి పీ రెట్లు బ్రదుకుదు రను) చింతను ఉజ్జగించి గురుకుల ప్రేమను (తల్లిదండ్రులు మున్నగు గురుసమూహమునందలి ప్రేమను అనియు) త్రోసిపుచ్చి ఎట్లు పరలోకపుదారి పట్టితివిరా]

ఇట మరణించిన తనయుఁడు ఆలంబనము మరణకాల మున దాపున నున్న బాంధవుల దర్శనవిలపనాది ఉద్దీపనము [స్వజనస్యహి దుఃఖ మగ్రతో వివృతద్వార మివోపజాయతే] రోదనము అనుభావము దైన్యాదులు సంచారులు ఏతత్సామగ్రి సమవ ధానమునం జేసి శోకస్థాయి కరుణరసము యొక్క యభివ్యక్తి

శాంతరసము —

మలయానిల కాలకూటయో
రమణీకుంతల భోగిభోగయోః
శ్వపచాత్మభువో నిర న్తరా
మమ జాతా పరమాత్మని స్థితిః

మలయానిలము కాలకూటము ఇవి రెండును నాకు సమా నములు రమణీకేశపాశమును సర్పంపుపడగ ఈ రెండును నాకు

సమానములు చండాలుఁడు బ్రహ్మ ఈ యిర్వురును నాకు సమానులు భేదబుద్ధి లేదు తత్కృతములు సుఖదుఃఖములు, నీచత్వాధిక్యములు నాకు లేవు పరమాత్మయందు కుదురుకొనియున్న యట్టి చిత్తము నాకు కల్గినది

ఇట క్షణభంగురము ప్రపంచము సర్వమును ఆలంబనము సుఖదుఃఖ శత్రు మిత్రాది సర్వద్వంద్వములయందు సమదృష్టి అను భావము మత్యాదులు (ధృత్యాదులును) సంచారులు [ఇందు తృతీయపాదమున ప్రక్రమభంగదోషము కలదు తొలి రెండు పాదములందు మొదట మలయానిలము ’ పిమ్మట కాలకూటము మొదట రమణీకేశపాశము పిమ్మట సర్పము అని ఉత్తమాధమానుక్రమము కలదు మూఁడవపాదమున చండాలుఁడు బ్రహ్మ అని అధమోత్తమక్రమము కలదు ఈ ప్రక్రమభంగము వక్తయొక్క సమదృష్టిస్థాపక మగుట గుణమే దోషము కాదని భావము]

ప్రత్యుదాహరణము - ఈ చెప్పఁబోవు పద్యము శాంత రసమునకు ఉదాహరణము కాదు


సురస్రోతస్విన్యాః పులిన మధితిష్ఠన్ నయనయోః
విధాయా న్తర్ముద్రా మథ సపది విద్రావ్య విషయాన్
విధూతాంతర్ధ్వాంతో మధురమధురాయాం చితి కదా
నిమగ్నః స్యాం కస్యాంచన నవనభస్యాంబుదరుచి ?

దేవనది యిసుకదిబ్బపైఁ గూర్చుండి కనులను అంతర్ముఖముల నొనర్చి [ధ్యానమున నిలిపి] వెంటనే బాహ్యము లగు నింద్రియ విషయముల నెల్ల తఱిమివైచి లోఁ జీకటిని [జ్ఞానజ్యోతిచే] నశింపఁ

జేసి అనిర్వచనీయ మగు భాద్రపద (నభస్య) నవజలధరశ్యామ కాంతిరూపమైన శ్రీకృష్ణాఖ్యచైతన్యమునందు ఎప్పుడు నిలీనుఁడ నగుదునో కదా

ఇటను (పూర్వపద్యమునందుంబోలె) విషయానగణనము ఆలంబనము దేవనదీతటము ఉద్దీపనము ఎయననిమీలనాదులు అనుభావములు శాంతరసస్థాయి నిర్వేదము ప్రతీయమానమగు చున్నను అది సర్వప్రధానముగా వ్యజ్యమాన మగు కవినిష్ఠ శ్రీకృష్ణవిషయక (ఆలంబనక) మగు రతియందు గుణీభావము నొందియున్నది అందుచే ఇది [నిర్వేద]భావధ్వని యని కాని రసవదలంకారమని కాని చెప్పఁదగుఁ గాని శాంతరస మని వ్యవహ రింప నిమిత్తము లేదు

అదియునుంగాక ఈ పద్యము నాచే (పండితరాయలచే) నిర్మిత మగు కరుణలహరియందలిది భగవద్భక్తిప్రధానము అది అందుచే ఈ పద్యము భగవద్విషయకరతిభావప్రధాన మగుటే ఉచితము మఱియు ఇందలి ఓజోగుణగుంఫనము శాంతరసాను గుణము కాదు అందుచే శాంతరసోదాహార్యముకాదు పూర్వ (మలయానిల) పద్యమున పరమాత్మని స్థితిః అను నుక్తింజేసి వక్త యొక్క పరమాత్మతాదాత్మ్యముకలిమి బోధపడుచుండుటం జేసి రతిప్రతిపత్తి లేదు పూజ్యపూజక ప్రతిపత్తి (జ్ఞానము) ఉన్న ప్పుడే దేవాదివిషయకరతిరూప మైన భక్తిభావమునకుఁ బ్రసక్తి ఆ కారణమున మలయానిలపద్యమున భావప్రాధాన్యము లేదు శాంత రసమునకే ప్రాధాన్యము ఇట్లు ఉదాహరణ ప్రత్యుదాహరణభేదము అవధరింపఁదగును


Sundarayya Vignana Kendram
Library
Ac No
Hyderabad-500 044.

రౌద్రరసమునకు ఉదా —

శివధనుర్భంగధ్వనిచే తనసమాధి (ధ్యానము) భగ్నముకాఁగా క్రోధోద్దీపితుఁడైన పరశురాముని మాటలు —

నఖోచ్ఛలిత యూనవస్ఫురదఖర్వజ్వారే
మదీయగురుకార్ముకం గలితసాధ్వసం వృశ్చతి
అయం పతతు నిర్దయం దలితదృప్తభూభృద్గల
స్ఖలద్రుధిరఘస్మరో మమ పరశ్వధో భైరవః

ఎలబ్రాయపుఁ గారణమున క్రొత్తగా విజృంభించు నపారమద జ్వరముచే భయములేక మద్గురుచాపమును విఱిచిన యీ మహాప రాధియందు ఇదే గర్వోన్మత్త రాజన్యకంఠస్రవద్రక్తపాన స్వభావము నా భయంకరపరశువు దయవీడి పడుఁగాక

ఈ శ్లోకమునందు ఆ క్రోధోద్రేకకాలమున రాముఁడని తెలియఁబడనివాఁడు గురుకార్ముకభంజకుఁడు పరశురాముని క్రోధమునకు ఆలంబనము రాముఁ డని విశేషించి తన్నామగ్రహణము చేయమి తెలియనందునఁగాని తెలిసియున్నను గురుద్రోహిపేరు ఉచ్చరింపఁ దగదనికాని ఒండె క్రోధోద్రేకముచే పేర్కొన మఱచె ననిగాని గ్రహింపఁదగును కాకున్న నవ మున్నగు రెండు విశేషణములు చెప్పి విశేష్యమును చెప్పమి ఉచితము కాకపోవును ధనుర్భంగోత్థితము తుములధ్వని ధనుర్భంగమునఁగాక ఆ తుములధ్వని పుట్టదను నర్థాపత్త్యనుమానముచే గృహీత మైనట్టిది-నిశ్శంకధనుర్భంగము ఉద్దీపకము పరుషోక్తి అనుభావము గర్వము ఉగ్రత అమర్షము మున్నగునవి వ్యభిచారులు. ఇది ధనుర్భంగధ్వనిభగ్నసమాధి యగు

భార్గవునివాక్యము ఇచట వృత్తియు మహోద్ధతము దీర్ఘసమాస భూయిష్ఠము సంయుక్తాక్షరమయము పరుషాఖ్యము ఓజోగుణాశ్రయ మైన రౌద్రరసమును పరిపోషించుచున్నది

అన్యస్థలముల - క్రోధోదయము లేనిచోట - గురుస్మరణము కలుగ (వినయోదయముసంజేసి) అహంకారనివృత్తి అవశ్యంభావి ప్రకృతమున నన్ననో పరశురామునకు గురుస్మరణముచే వినయోద్యదయనిమిత్తకాహంకారనివృత్తికి మాఱు గర్వోత్కర్షమే ప్రకటమగుచున్నది అంకులకు గమకము శ్లోకము నందలి మదీయ ' అను మాటకు అతని వివక్షితము కేవల వాచ్యార్థము కాదు మఱేమన ఆ వాచ్యార్థముతోఁబాటు ఇఱువదియొక్కమాఱు లోకమును అక్షత్రముగాఁ జేసినట్టి - విలువిద్యలో క్రౌంచభేది స్కందు నోడించినట్టి - ఏతాదృశలోకోత్తరవిక్రమశాలి యైన నా యొక్క అను లక్ష్యార్థమును వివక్షితము అజహత్స్వార్థలక్షణామూల మగు నా గర్వోత్కర్షచే స్ఫుటముగా తద్వివేకశూన్యత్వమును గమ్యమాన మగుచున్నది దానిచేతను అతని క్రోధాతిశయము వ్యజ్యమాన మగు చున్నది ఇట్టి క్రోధ రూపస్థాయి ఉపచీయమానమై రౌద్రరసముగా పరిణమించినది అందుచే ఈ శ్లోకము రౌద్రరసమునకు సర్వథా ఉదాహరణముగాఁ దగియున్నది

ప్రత్యుదాహరణము ఈ క్రింది పద్యము రౌద్రరసమునకు ఉదాహార్యము కాదు —

ధనుర్విదళన ధ్వని శ్రవణ తత్క్షణావిర్భవ
న్మహాగురువధస్మృతి శ్వ్వసనవేగ ధూతాధరః
విలోచన వినిస్సర ద్బహులవిస్ఫులింగవ్రజః
రఘుప్రవర మాక్షిపన్ జయతి జామదగ్న్యో మునిః

శివకార్ముకము విఱిచిన ధ్వని వినినంతనే ఆవిర్భవించిన మహా గురువధస్మృతి కలవాఁడు క్రోధనిశ్శ్వాసవేగమున కంపించు చున్న యధరము కలవాఁడు కనులనుండి వెడలుచున్న ముమ్మురమైన నిప్పురవలు గలవాఁడు రామచంద్రు నాక్షేపించుచు అదే జామ దగ్న్యముని సర్వోత్కర్షమై విరాజిల్లు చున్నాఁడు

ఈ శ్లోకమునందు అపరాధాస్పదుఁడైన రఘునందనుఁడు ఆలం బనము ధనుర్విదళనధ్వనిశ్రవణము ఉద్దీపనము నిశ్శ్వాస నేత్ర జ్వలనాదులు అనుభావములు మహాగురువధస్మృతి గర్వోగ్రత మున్నగునవి సంచారులు కలదైన క్రోధము (రౌద్రరసస్థాయి) వ్యజ్య మాన మగుచున్నది అట్లైననుంగూడ అది పరశురామప్రభావ వర్ణన భూతమైన కవిరతియందు గుణీభూత మైనది అందుచే రౌద్ర రసధ్వనికి ఉదాహరణము కాదు

మఱి కావ్యప్రకాశికయందు వక్ష్యమాణశ్లోకము ఉదా హరణముగా నీయఁబడినది —

కృత మనుమతం దృష్టం వా యై రిదం గురుపాతకం
మనుజపశుభి ర్నిర్మర్యాదై ర్భవద్భి రుదాయుధైః
నరకరిపుణా సార్ధం తేషాం సభీమ కిరీటినా
మయ మహ మహ మసృఙ్మాంసైః కరోమి బలిమ్

ఇది వేణీసంహారనాటకమునందలిది ద్రోణాచార్య శిరశ్ఛే దానంతరము క్రుద్ధుఁడు అశ్వత్థామ పాండవవీరుల నుద్దేశించి పల్కిన వాక్యము.

ఈ గురుపాతకము ఆయుధములు ధరించి మర్యాదలేని మనుజ పశువులు మీలో నెవరు చేసిరో లేక అనుమతించిరో లేక

చూచిరో వారలను నరకదమనునితోడ ఆ భీమకిరీటులతోఁగూడ రుధిరమాంసములతో ఇదె దిక్కులకు బలిచేయుదును

ఈ పద్యములో వృత్తి రౌద్రరసవ్యంజనసమర్థము కాదు అందులకుఁ గారణము ఆ (వేణీసంహారనాటక) కవి యొక్క శక్తి ప్రతిభాలోపమే

రౌద్రరసోచితము పరుషవృత్తి ఇట నిబద్ధము కాలేదు దీర్ఘసమాసభూయిష్ఠము సంయుక్తాద్యక్షరబహులము పరుషవృత్తి దానినే గౌడీరీతి యందురు

[ఇట ధ్వనికారుల యభిప్రాయము పండితరాయాభిప్రాయ విరుద్ధముగా నున్నది ద్వితీయోద్యోతమున ఓజోగుణనిరూపణ సందర్భమున ధ్వనికారులును లోచనకారులును సమాసజటిలబంధము లేకున్నను పరుషవృత్తి లేకున్నను అర్థకాఠిన్యమాత్రముననే ఓజోవృత్తి కలుగు నని తదాశ్రయరౌద్రాదిరసములు వ్యజ్యమానము లగునని ఆనతిచ్చినారు ప్రకృతశ్లోకము నుదాహరించినారు (1) తత్ (ఓజః) ప్రకాశనపరశ్చార్థో అనపేక్షిత దీర్ఘసమాసరచనః ప్రసన్నవాచకాభిధేయః యథా- యో యః శస్త్రం బిభర్తి ఇత్యాదౌ (2) మఱల తృతీయోద్యోతమందు తథా రౌద్రాది ష్వసమాసా దృశ్యతే యథా యో యః శస్త్ర మిత్యాదౌ మఱి రసగంగాధరకారునకు ఈ శ్లోకమునందు అర్థకాఠిన్యము సైతము లేదని యభిప్రాయమా? అది యున్ననుంగూడ దీర్ఘసమాసవృత్తియు పరుషశబ్దబంధమును రౌద్రాదిరసములకును ఓజోవృత్తికిని నియతముగ నుండి తీరవలెనని యభిప్రాయము కాబోలు

వీరరసము -

దానవీరము దయావీరము యుద్ధవీరము ధర్మవీరము అని ఉత్సాహస్థాయి భావోపాధిని బట్టి (ఉపధేయము) వీరరసము నలు తెఱంగులుగా నుండును

దానవీరమునకు ఉదా -

విప్రవేషమున యాచింప వచ్చిన యింద్రునకు దాన మీయ నిచ్చకొని అందులకై వెఱగుపడు సభ్యులతో కర్ణుని మాటలు

కియ దిద మధికం మే య ద్ద్విజా యార్థయిత్రే
కవచ మరమణీయం కుండలే చార్పయామి?
అకరుణ మవకృత్య ద్రాక్ కృపాణేన నిర్యత్
బహులరుధిరధారం మౌళి మావేదయామి

ఏమి గొప్ప నాకు యాచకమాత్రుడైన విప్రునకు అరమణీయము సర్వసామాన్యమునైన కవచమును కుండలములను ఇచ్చుట యందు ?(అడుగక యే యిచ్చుట గొప్ప అడిగిన నిచ్చుటయందు వాసి లేదని భావము 'అర్థయిత్రే') ఇందుల కేల మీకు ఇంత విస్మయము ? వలయుచో నిర్దయముగా తలుకున కత్తితో కోసి బయల్వెడలు రక్తధారలతో నా మస్తకము నీయనా ?

ఇవి బ్రాహ్మణవేషునకు ఇంద్రునకు కవచకుండలములు దానము చేయ సిద్ధపడిన కర్ణుడు విస్మితులైన సభ్యులతోఁ బలికిన మాటలు

ఇట యాచమానుఁడు ద్విజవేషి ఇంద్రుఁడు ఆలంబనము అతఁ డొనర్చిన స్తుతి ఉద్దీపనము కనచాదివితరణము అందు తుచ్ఛత్వాదిబుద్ధ్యాదికము అనుభావము నాకు అనుచో అర్థాంతరసంక్రమిత వాచ్యధ్వన్యుత్థాపితము గర్వమును స్వకీయలోకోత్తర పితృ (సూర్య) జన్యత్వాది స్మృతి యు సంచారులు 'నాకు - ఇట అర్థాంతరసంక్రమితవాచ్యధ్వని లక్షణామూలకము అందుచే ముఖ్యార్థము అనుపపన్నము. ఇట లక్ష్యార్థము కర్ణుని సమస్తైశ్వర్య దానదక్షత్వాదిధర్మము నాకు అను స్వార్థము పరిత్యక్తము కాదు సమస్తైశ్వర్యదానదక్షుఁడ నైన నాకు అని స్వార్థవిశిష్టము - అజహత్స్వార్థము దానంజేసి కర్ణుని సాటిలేని దానశౌండీర్యము అను వ్యంగ్యార్థము వ్యజ్యమాన మగుచున్నందున ఇట లక్షణ ప్రయోజనవతి ఇట వాచ్యార్థము వ్యంగ్యార్థమున అసమానదానశౌండీర్యమున నత్యంతసంక్రమితము అందుచే నాకు అన అంతటి దాత నైన నాకు ఈ దానము ఏపాటి అను గర్వము వ్యజ్యమానము ఈ పద్యమునందు వృత్తియు ఆ యా యర్థము ననుసరించి తొలినుండి తుదిదాఁక నిర్వహింపఁబడియున్నది అందుచే సహృదయులకు అత్యంతము చమత్కారాధాయకము ఎట్లన కవచకుండలదానముల లఘుత్వనిరూపణ మొనర్చుటకై శ్లోకపూర్వార్థమునందు తదను కూలమైన శిథిలబంధము మృదులవర్ణఘటితము, కోమలాఖ్యవృత్తి. ఉత్తరార్థమునం దన్ననో 'హాళి' అను శబ్దమునకన్న పూర్వము వక్తయైన కర్ణుని గర్వోత్సాహపరిపోషకము ఉద్ధతము (ప్రౌఢము) వృత్తి - పరుషవృత్తి' ఆపైని దదామి అనుచోట బ్రాహ్మణుని యెడ సవినయత్వము ప్రదర్శించుటకు ఉచితమగుటఁ దన్మూలభూత గర్వరాహిత్యమును ధ్వనింపఁజేయుటకు మఱల శైథిల్యవృత్తి (కోమల వృత్తి) సన్నివేశము అందువలననే ఆవేదయామి (సమర్పయామి)

అని చెప్పఁబడినది అంతేకాని గర్వస్ఫోరకముగా దదామి విశ్రాణయామి (ఇచ్చుచున్నాను) అని చెప్పఁబడలేదు

ప్రత్యుదాహరణము —

యస్యోద్దామ దివానిశార్థివిలసద్దానప్రవాహప్రథా
మాకర్ణ్యావనిమండలాగత విపశ్చిద్వంశీంద్ర బృందాననాత్
ఈర్ష్యానిర్భర ఫుల్లరోమనికర వ్యావల్గ దూధః ప్రస
వద్పీయూష ప్రకరైః సురేంద్రసురభిః ప్రావృష్పయోదాయతే

ఆ రాజు రాత్రింబవళ్ళు అడ్డులేక నిరంతరముగ యాచకులకు చేయుచున్న దానపరంపరల కీర్తిని భూమండలమునుండి వచ్చిన స్వర్గస్తుతి పాఠకప్రవరబృందముల నోళ్ల విని దేవేంద్రుని (కామ) ధేనువు యొక్క యీర్ష్యా పులకితమై విక్షోభ ప్రకంపితమైన పొదుగు నుండి స్రవించుచున్న దుగ్ధామృతధారలచే వర్షాకాలపు మబ్బులు కల్పితము లైనట్లున్నది అట్టి దానవీరాగ్రణి ఆరాజు అని తాత్పర్యము

ఇట ఇంద్రసభామధ్యగతులైన సకలసదస్యులు ఆలంబనము భూలోకాగత స్వర్గస్తుతి పాఠకశ్రేష్ఠుల నోళ్ళనుండి వెలువడిన రాజ దాన వర్ణనము ఉద్దీపనవిభావము పొదుగునుండి జాలువారు నమృత ధారలు అనుభావము అసూయాదులు సంచారులు. వీనిచే నెల్లఁ బరి పోషితమైన దయ్యు కామధేనుగతోత్సాహస్థాయి రాజస్తుతికి గుణీ భూత మైనది. అందుచే నిట (దానవీర)రస వ్యపదేశము లేదు దాన వీరమునకు ఇది ఉదాహరణము కాదు (రతి) భావధ్వనికి ఉదాహరణ మగును

ప్రత్యుదాహరణాంతరము —

సాబ్ధిద్వీపకులాచలాం వసుమతీ మాక్రమ్య సప్తాంతరాం
సర్వాం ద్యామపి సస్మితేన హరిణా మందం సమాలోకితః
ప్రాదుర్భూత పరప్రమోద విదల ద్రోమాంచిత స్సత్వరం
వ్యాసగ్రీవీకృత కంధరోఽసురవరో మౌలిం పురో న్యస్తవాన్.

సముద్రములు ద్వీపములు కులాచలములతోడి భూమి నెల్ల (నొక్క యడుగున) నాక్రమించి సప్తప్రాకారములతోడి సర్వ స్వర్గమును [రెండొక యడుగున] నాక్రమించి అల్లన వామనావ తారుఁడు శ్రీమన్నారాయణుఁడు అవలోకింపఁగా పరమానందో దయమునఁ బులకాంకితుఁడై బలిచక్రవర్తి వెంటనే మెడ వంచి [నీ మూఁడవ యడుగు నిట నుంపు మని] హరి పురోభాగమునఁ దన శిరము నుంచెను

ఇచట భగవంతుఁడు వామనుఁడు ఆలంబనము ఆయన పొన ర్చిన మందనిరీక్షణము ఉద్దీపనవిభావము రోమాంచాది అను భావము హర్షాదులు సంచారులు వీనిచే పోషితము బలి నిష్ఠోత్సా హము అప్రధాన మైనది ప్రధాన మైననే రసవ్యపదేశము ఇట బలి స్తుతి ప్రధానమైనది దానికి (కవి గత బలివిషయక రతిభావమునకు) ఉత్సాహము అంగమైనది అందుచే వీరరసోదాహరణము కాదు

ముందు 'ఉసోద్దామ' అను శ్లోకమున అన్యగతమైన (కామధేనుగతమైన) యుత్సాహమున కన్న ఎట్లు రాజస్తుతికే ఉత్కర్ష కలుగ నట నుత్సాహము గౌణము ఎట్లైనదో అట్లే ప్రకృత శ్లోకము నందును బలిరాజగతోత్సాహస్థాయిభావమున కన్న బలి

రాజస్తుతికే ఉత్కర్ష అంటుచే రెండుచోటులందును ఉత్సాహ స్థాయిభావమునకు అంగత్వమే అంగిత్వములేదు అంటుచే రెండును దానవీరరసమునకు ఉదాహార్యములు కావు పూర్వతరోదాహరణ మందు కాకుత్థేసునందు (స్థాయిభావము) అంగము రాజునందు అంగి (స్తుతి) - ఇట్లు భిన్నవ్యక్తి నిష్ఠములు ఇట అంగ్యంగములు రెండును ఏకవ్యక్తి (ఒలి) నిష్ఠములు ఇది విశేషము

ఈ చెప్పినదానినిబట్టి (పరశురామనిష్ఠోత్సాహము కవి నిష్ఠ పరశురామవిషయక రతికి అంగమైనది కావున) వక్ష్యమాణశ్లోక మును ఉదాహార్యము కాదు

ఉత్పత్తి ర్జమదగ్నితః స భగవాన్ దేవః పినాకీ గురుః
శౌర్యం యత్తు నతత్ గిరాంపథి నను వ్యక్తంహి తత్కర్మభిః
త్యాగః సప్తసముద్రముద్రితమహీనిర్వ్యాజదానావధిః
క్షత్రబ్రహ్మతపోనిధేః భగవతః కింవా న లోకోత్తరః
(మహావీర)

శ్రీరామచంద్రునిమాటలు - మీ జన్మమూ జమదగ్నివలన మీ ధనుర్గురువా భగవంతుఁడు మహాదేవుఁడు పినాకపాణి మీ శౌర్యమూ వర్ణనాతీతము మీ పొనర్చిన కార్యములచేతనే వ్యక్త మగుచున్నదికదా మీ త్యాగ మన్ననో సప్తసముద్రముద్రిత సమస్తమహీమండల నిర్వ్యాజదానమర్యాద కలది భగవా నులు మీరు క్షత్రబ్రహ్మతపోనిధులు సర్వవిధముల లోకోత్తర చరిత్రులు.

ఈ శ్లోకమును కావ్యప్రకాశికా వ్యాఖ్యాతలలో నొకఁడు శ్రీవత్సలాంఛనభట్టాచార్యుఁడు తన సారబోధినీవ్యాఖ్యానమున

వీరరసోదాహరణముగా నిచ్చెను ఇది వీరరసోదాహార్యము కాదు ఏలన సాధ్వి శ్లోకమునందుంబోలె నిందును ఉత్సాహస్థాయి వీరరస వ్యంగ్యమైనను అది పరాంగమై గుణీభూతవ్యంగ్య మైనది రసధ్వని కాదు

[శంక] అట్లైన వో తుల్యన్యాయమున 'కియదిదమ్' అను శ్లోకమున 'అకరుణ మనకృత్య' అను చోటనుంగూడ ప్రతీయమాన మగు దానవీరరసము కర్ణస్తుతికి అంగ మౌటంజేసి రసధ్వని యెట్లగును?

[సమా] సందేహము సరియే కాని నిజమునకు అక్కడ రస ధ్వనియే ఇట తుల్యన్యాయములేదు పైపద్యమున కర్ణవచనాను వాదమున మాత్రమే కవికి తాత్పర్యము కర్ణుని స్తుతించుటయందుఁ గాదు అందుచే కర్ణస్తుతికి వీరరసము అంగము కాదు వీరరసము అంగియే అటుగాక 'సాధ్వి' శ్లోకమున బలిస్తుతి కవితాత్పర్య విషయ మైనందున ప్రధానము వీరరసము తదంగము

[శంక] పోనీ కవికి ఇట కర్ణస్తుతియందు తాత్పర్యము లేదుగాక కర్ణునకే ఆత్మస్తుతియందు తాత్పర్యము కావున స్తుతికే ప్రాధాన్యము అని ఏల యనరాదు ?

[సమా] కర్ణుఁడు మహాశయుఁడు అందుచే ఆత్మస్తుతియందు అతనికి తాత్పర్యము అనుపపన్నము అందుచే అట స్తుతియున్నను వాక్యార్థము కానేరదు వాక్యార్థము కానిది తాత్పర్యార్థముకాదు అందుచే అట సర్వథా తాత్పర్యార్థమైన వీరరసమే వాక్యార్థము

[శంక] ఓయీ కియదిద మను శ్లోకమున ప్రతీయమానము స్తుతి తాత్పర్యవిషయకము కాకపోవుటంజేసి శాబ్దబోధ విషయము కాకపోవుఁగదా ?

[సమా] మఱి దానవీరరస ప్రధానకము శాబ్దాత్మకవాక్యార్థ బోధ ముగియఁగనే తాదృశోత్సాహలింగము(హేతువు)చే శ్రోతకు తనయందు (స్వాధికరణమందు) కర్ణుఁడు స్తుత్యుఁడు దానవిషయ కోత్సాహవిషయత్వమునంజేసి -అని యిట్టి యాకారము గల యను మితిపుట్టును స్తుతి యిచట అనుమితిగోచర మగునుకాని శాబ్దబోధ గోచరముకాదు అట్లుకాక ఎట స్తుతి ప్రధానవిషయ మగునో రసము అప్రధాన మగునో అచ్చోట స్తుతియే తాత్పర్యవిషయీ భూతము వాక్యార్థ మగును శాబ్దబోధవిషయక మగుటంజేసి అట స్తుతియే ప్రధాన మగును

దయావీరరసమునకు ఉదా :

శిబిచక్రవర్తి మాటలు —

న కపోత భవంత మణ్వపి
స్పృశతు శ్యేనసముద్భవం భయం
ఇద మద్య మయా తృణీకృతం
భవదాయుఃకుశలమ్ కళేబరమ్

ఓ పావురమా నిన్ను డేగభయము ఇసుమంతేని తాఁక కుండుఁగాక నీ ప్రాణమును రక్షించుటకై ఈ నా శరీరమును తృణ ప్రాయముగా నొనర్చి డేగకు నే నర్పించుచున్నాఁడను.

పై శ్లోకమును ఇట్లును విన్యసింపవచ్చును.

న కపోతకపోతకం తవ
స్పృశతు శ్యేన మనాగపి స్పృహా
ఇద మద్య మయా సమర్పితం
భవతే చారుతరం కలేబరమ్

ఓ శ్యేనమా నీ స్పృహ కపోతకిశోరమును ఇంచుకేని స్పృశింపకుండునుగాక నీకు ఇంతకన్న మనోహరమైన నా శరీరము ఇప్పుడిదే మత్సమర్పితమైనది శిబిచక్రవర్తి యొక్క దయామయత్వమును పరీక్షింపఁగోరి దేవేంద్రుఁడు శ్యేనరూపమున తన్నుఁ దఱుము కొనిరాఁగా ధర్మదేవత కపోతరూపమునఁ బఱచివచ్చి శిబిని శరణు సొచ్చెను అప్పుడు శిబి కపోతముతోఁ బల్కినమాటలు తొలి శ్లోకమున (డేగతోఁ బల్కినమాటలు మఱిశ్లోకమునఁ) గలవు శిబినిష్ఠము దయావిషయకము ఉత్సాహము స్థాయిభావము కపోతము ఆలంబనము తద్గతము వ్యాకులత్వము ఉద్దీపనము తదర్థము స్వశరీరార్పణము అనుభావము ధృత్యాదులు వ్యభిచారులు ఇవెల్ల సమ్మిశ్రితములై దయావీరరసమును వ్యజ్యమాన మొనర్చుచున్నవి

[శంక] ఈ శ్లోకమున శిబి డేగకు చేసిన స్వశరీరదానము అవగత మగుటంజేసి దానవీరధ్వనికే ఉదాహరణము అనఁదగునుగదా?

[సమా] అట్లుకాదు ఏలన శ్యేనకపోతములకు భక్ష్యభక్షక భావము సంబంధము కలదు శ్యేనము భక్షకము కపోతము భక్ష్యము అందుచే శ్యేనము కపోతార్థియగును శిబిశరీరార్థి కాదు అందుచే శిబిశరీరదానప్రతీతి సంభవింపదు. మఱి కపోతశరీరము రక్షించుటకై శ్యేనమునకు శిబిశరీరము ప్రతిపణీకృతము - అనఁగా ప్రత్యాపితే

మైనది అది ద్రవ్యవినిమయమేకాని దానముకాదు వినిమయ మన ఒక వస్తువిచ్చి బదులు ఇంకొక వస్తువు గైకొనుట (ఇట్లే గరుడు నకు శంఖచూడ శరీరరక్షణార్థము స్వశరీరము నర్పించిన జీమూత వాహనుని విషయమునందును వినిమయమేకాని దానముకాదు అంకుచే ఈ రెండు చోటులందును దయావీరమే రసము దానవీరము కాదు అని ఎఱుంగవలెను)

యుద్ధవీరమునకు ఉదా —

రణే దీనాన్ దేవాన్ దశవదన విద్రావ్య వహతి
ప్రభావప్రాగల్భ్యం త్వయితు మమ కోయం పరికరః ?
లలాటోద్యజ్జ్వాలాకబలితజగజ్జాలవిభవో
భవో నే కోదండచ్యుతవిశిఖవేగం కలయతు

యుద్ధమున దీనులను (అసాయులను కాందిశీకులను) దేవతలను పాఱద్రోలి ఓయి దశానన శౌర్యప్రాగల్భ్యమును వహించు చున్నావు అట్టి నీ విషయమున నాకు (జగదేకవీరునకు) సమర సన్నాహము ఏల ? త్రిభువన సముదయము నెల్ల ఏకలోచనవహ్నిచేఁ గబలించిన నిరతిశయపరాక్రమప్రాభవశాలి ఆ త్రిపురారి మద్ధనుః ర్విముక్తశరవేగమును తెలిసికొనుఁగాక

ఇది దశవదనుని రావణునిగూర్చి భగవంతుఁడు శ్రీరాముఁడు నుడివినమాట ఇట వీరరసమునకు అవజ్ఞాపాత్రుఁడు రావణుఁడు కాఁడు శివుఁడు ఆలంబనము రణదర్శనము ఉద్దీపనము, దశవదనుని యెడ అవజ్ఞ అనుభావము గర్వాదులు సంచారులు ఆది శబ్దముచే అసంమోహము ఉత్సాహము ఆవేగము హర్షము

మతి, ఉగ్రత అమర్షము, మదము, రోమాంచము, స్వరభేదము, క్రోధము, అసూయ ధృతి వితర్కము గ్రాహ్యములు ఇట వృత్తి రససముచితముగా నున్నది. అది దేవతల ప్రస్తావమున వారి కాతర్యము (భీరుత్వము) ప్రకాశింపఁజేయుట మూలమున వీరరసమునకు ఆలంబనము కాకపోవుటచే అనుద్ధతము (కోమలము.) రావణప్రస్తావమున తత్కృతదేవేంద్రాద్యపరాక్రమత్వప్రతిపాదనమునకై ఈషదుద్ధత మయ్యె అతఁడవజ్ఞాపాత్రుఁడగుటఁ రామోత్సాహమునకు అనాలంబన మగుట అత్యంతోద్ధతము కాదు ఏలన తదాలంబనము వీరరసము ఇట అభివ్యక్తము కాదు. అందుచే వృత్తి ఉద్ధతము కాదు మఱి ఉత్తరార్థమున భగవంతుఁడు శివుఁ డన్నవో పరమోత్కృష్టాలంబనవిభావ మగుటంజేసి తదాలంబననిమిత్తమున ఓజోగుణమునకు ఆశ్రయము వీరరసము నిష్పన్నమగుటచే తత్ప్రస్తావమున వృత్తి ప్రకృష్టోద్ధతము

ధర్మవీరమునకు ఉదా,

ధర్మరాజు మాటలు :-

సపది విలయ మేతు రాజ్యలక్ష్మీః
ఉపరి పతం త్వథవా కృపాణధారాః
అపహరతుతరాం శిరః కృతాంతో
మమ తు మతి ర్నమనాగపైతి ధర్మాత్

అప్పుడే రాజ్యలక్ష్మి నశించుఁగాక ఖడ్గధారలు పైని పడుఁగాక యముఁడు శిరస్సు ఖండించుఁగాక నామనస్సు ఇంచుకేనియు ధర్మమునుండి తొలఁగదు

అధర్మముచేతనేని శత్రువును జయింపవలసినదే అని తన్ను ప్రబోధించు వారినిగూర్చి ఇవి ధర్మజుఁడు పలికిన మాటలు ఇట ధర్మవిషయము ఆలంబనము న జాతు కామాత్ న భయాత్ న లోభాత్ ధర్మం త్యజేత్ జీవితస్యాపి హేతోః, ఇత్యాది వాక్యాలోచనము ఉద్దీపనము శిరశ్ఛేదాద్యంగీకారము అనుభావము ధృతి సంచారి ఇవెల్ల నిట చేరి ధర్మవీరమును స్ఫురింపఁ జేయుచున్నవి

వీరరసప్రకారములు

ఇట్లు వీరరసము నలు తెఱంగుగఁ బ్రాచీనమతానుసారము ప్రపంచితము నిజమునకు శృంగారమునకుం బోలె వీరరసమునకును బహుప్రకారములు చెప్ప శక్యమగును అది ఇట్లు ప్రాచీనుల మతము ననుసరించి సపది విలయ మేతు అను పద్యమున 'మమతు మతి ర్నమనా గస్పైతి సత్యాత్ 'అని తుది పాదమును మార్చి పద్యాంతర మొనర్చిన అది సత్యవీరమునకు ఉదాహరణ మగుట సంభవించును సత్యమును ధర్మములో నంతర్గత మగుఁ గావున ఇటను ధర్మవీరమే రసము అని వచింపరాదు అట్టివో దానదయావీరములును ధర్మవీరములో చేరిపోవును గావున వానిని ధర్మవీరమునకన్న వేఱుగా గణింపఁదగదుకదా అందుచే ఇది అప్రయోజనశంక కావున ఇట్లు నాలుగు ప్రకారములే కాదు అనేకప్రకారములు శక్యము కదా ఇదిగో పాండిత్యవీరమునకు ఉదా —

ఒకానొక పండితవీరుని మాటలు —

అపి వక్తి గిరాంపతిః స్వయం
యది తాసా మధిదేవతాపి వా,
అయ మస్మి పురో హయానన
స్మరణోల్లంఘితవాఙ్మయాంబుధిః

స్వయముగా బృహస్పతియే [శాస్త్రార్థమునఁ బూర్వపక్షము] చెప్పఁగాక కాదా వాగధిదేవత సరస్వతియే చెప్పను గాక హయగ్రీవదేవస్మరణముచేత వాఙ్మయసముద్రమును దాటిన నేను మీ యెదుట [సిద్ధాంతముచేయ నిదే సిద్ధముగా] నున్నాఁడను

ఇట బృహస్పతియు సరస్వతియు ఆలంబనములు సభాది దర్శనము ఉద్దీపనము నిఖిలవిద్యాత్రిరస్కారము అనుభావము గర్వము సంచారి ఇవెల్ల చేరిన కర్తయొక్క యుత్సాహము పాండిత్య వీరరసముగ నభివ్యక్త మగును

[శంక] పై శ్లోకమున యుద్ధవీర మని యేల వచింపరాదు ? వాదమును యుద్ధవిశేషమే ఒకటి శస్త్రయుద్ధము ఇంకొకటి శాస్త్ర యుద్ధము వైరిపరాజయము రెంటను సమానమే

[సమా] అట్లు వచించునో మఱి క్షమావీరవిషయమున నేమి వచించెదరు ? ఇదే ఉదా —

> అపి విశిఖ దహనజాలం
> మూర్ధ్ని రిపుర్మే నిరంతరం ధమతు
> పాతయతు వాఽసిధారా
> మహ మణుమాత్రం నకించి దాభాషే

శత్రువులు నా శిరమున శరాగ్ని వెల్లుగా నిరంతరము జ్వాలింపఁ జేయనీ ఖడ్గధార నేయనీ నే నణుమాత్రమును పలుకను ఇది క్షమా వంతుని వచనము

ఇట వక్తృక్షమావిషయక మగు నుత్సాహమునకు శత్రు కృతాపకారములు ఆలంబనములు తటస్థుల ప్రశంసాది ఉద్దీపనము మౌనము అనుభావము ధృతి వ్యభిచారి

మఱి బలవీరుని విషయమున నేమి సమాధానము చెప్పె దురు

గరుత్మంతుఁడు ఇంద్రునితో నుడువుచున్నాఁడు —

పరిహరతు ధరాం ఫణిప్రవీరః
సుఖ మయతాం కమఠోపి తాం విహాయ
అహ మిహ పురుహూత పక్షకోణే
నిఖిల మిదం జగదండకం వహామి

సర్పప్రవీరుఁడు సర్పరాజు ఆదిశేషుఁడు ధరను ధరింపక పరిహరించుఁగాక. ఆదికమఠము సైతము దానిని మోయు పాలు మాలి పరిహరించి సుఖ ముండుఁగాక ఓయి దేవేంద్రా నేను నా గరుకోణమున (ఱెక్కయంచున) ఈ నిఖిలధరామండలమును వహింతును ఇట శేషుఁడు వేయితలలచేత ఆదికూర్మము పృష్ఠ భాగమున నెట్లో శ్రమపడి భూమిని మోయుచున్నవి నే నన్నో నా ఱెక్కకొనచేతనే అవలీలగా అఖండబ్రహ్మాండమండలమును దాల్పఁజాలుదును అని శేషకమఠాతిశాయి బలాఢ్యత్వము తార్క్ష్య గతము ప్రతీతము

ఇట శేష కూర్మములు ఆలంబనములు తత్ప్రశంసాకర్ణనము ఉద్దీపనము ధరాధరణోద్యమము అనుభావము గర్వాదులు వ్యభి చారులు

[శంక] అపి వక్త్రే' 'పరిహరతు ధరామ్' అను రెండు శ్లోకములందును గర్వమే ప్రతీతమగుచున్నది ఉత్సాహము ప్రతీత మగుటలేదు నడిమిదైన 'అపి విశిఖ' అను పద్యమున ధృతియే ధ్వనించు చున్నది అందుచే వీనియందెల్ల భావధ్వనియే కాని రస ధ్వని ప్రతీత మగుటలేదు

[సమా] ఆ పక్షము ననుసరించి దాన దయా యుద్ధ వీరాదు లందును గర్వాదులే ధ్వనించుచున్న వని యేల నుడువరాదు? అచట నెల్ల భావధ్వనియే అని యేల వచింపరాదు? రసధ్వనిసామాన్యము నెల్ల నుచ్ఛేదపఱచి అది తద్వ్యభిచారిభావధ్వనిచేతనే గతార్థమైన దని యేల ఉగ్గడింపరాదు? భవన్మతము ననుసరించిన ఇట్లు సకలరస తంత్రవ్యాకులీభావము ఉప్పతిల్లును అందుచే నింతకన్న రసధ్వనిని విలక్షణముగా నొప్పుట శ్రేయము

[శంక] ఓయీ రసధ్వనిస్థలములందు స్థాయిభావమునకు వ్యభిచారిభావములకన్న ఉత్కటప్రతీతి కలదు కావున స్థాయిభావ బలమునుబట్టి రసధ్వని అని వ్యపదేశము మఱి ఉక్తోదాహరణములం దన్ననో గర్వాదివ్యభిచారిభావములకు ఉత్కటికప్రతీతి కలిమిం జేసి భావధ్వని అని వ్యపదేశము ఏది ప్రకృష్టమో దానినిబట్టికదా వ్యపదేశము

[సమా] అట్లు నీవు అచ్చోటుల స్థాయిప్రతీతి ఉత్కటి కముగా నున్నందున రసధ్వనిని ఒప్పెదు నందువేని ప్రకృతమందును పాండిత్యవీరాదిస్థలములందు ఉత్సాహమే ఉత్కటముగా ప్రతీత మగుటంజేసి రసధ్వనియే ఒప్పవలసి యుండును ప్రాచీనులు

చెప్పిన దయావీరాద్యుదాహరణములందు స్థాయిభావము ప్రతీత మగుచున్నది మేము చెప్పిన పాండిత్య వీరాద్యుదాహరణము లందు స్థాయిభావప్రతీతి లేదు' అని మీ రనుటవుట కేవల రాజాజ్ఞా ప్రాయముగా నున్నదే కాని ఉపపత్తి పర్యాలోచన పూర్వకముగ లేదు నిజమునకు ఛలము మాని మీరు సహేతుకముగా విచారింపుడు ప్రాచీన నవీనమతములు రెండును సంగతములే వైషమ్య లేశమును లేదు అందుచే తత్త్వ మాలోచించిన వీరరసమున ప్రాచీనోక్తములు నాలుగే ప్రకారములు పారిభాషికము లనుట యుక్తి సహము కాదు

సాహిత్యసారమున అచ్యుతరాయుఁడు వీరరసప్రకారములు బహుధా ప్రపంచించినాఁడు

ప్రభావైః స్థైర్యగర్వాద్యై ర్విభావాదిభి రున్నతః
ఉత్సాహ స్థాయిభావస్య వీరో ద్వాదశధాతు సః
యుద్ధదాన దయాధర్మ సత్య విద్యా తపోబలైః
త్యాగయోగక్షమాజ్ఞానై స్తదుపాధే ర్విభేదతః'

[(ప్రభావః (సామర్థ్యః) ఉద్దీపనవిభావః స్థైర్యం చానుభావః గర్వ స్సంచారిభావః అస్య అనేకవిధత్వాత్ సర్వత్ర సాధారస్యేన ఏకవిధాలంబన సంభవాత్ కర్తృతః తదనుక్తిః తదుపాధేః = ఉత్సాహస్యేత్యర్థః]

పైఁజెప్పిన ద్వాదశ సంఖ్యయు వివక్షితము కాదు అతఁడే వెండియు 13 సంపద్వీరము 14 రూపవీరము 15 గానవీరము 16 అహింసావీరము 17 ఐశ్వర్యవీరము 18 కవిత్వవీరము

19 శ్రద్ధావీరము 20 భక్తివీరము అని యిట్లు బహుప్రకారముల నోదాహరణముగా నిరూపించినాఁడు

ఏవ మన్యేపి తద్భేదాః బుద్ధ్యా హ్యూహ్యా సతాం మతాః
నచైవ మస్యాః సంఖ్యాత్వం దోష స్తస్యేప్సితత్వతః

"రసభేద బాహుళ్యేన తద్విపులత్వం హి అలంకారాణామైవాలంకారాణా మితి తాత్పర్యమ్ (చూ సాహిత్యసారము) శృంగారమునందుంబోలె వీరరసము నందును ఈ భేదప్రతిపాదనమున విశేషము లేదని పండితరాయల భావము

అద్భుత రసమునకు ఉదా —

యశోద శ్రీకృష్ణునితోఁ బలుకుట .–

చరాచర జగజ్జాల సదనం వదనం తవ
గలద్గగన గాంభీర్యం వీక్ష్యాస్మి హృతచేతనా

ఓ కృష్ణా స్థావరజంగమాత్మక మగు భువనమండలమునకు ఇక్కయైనదాని ఆకాశగాంభీర్యమును అతకరించుదానిని నీ నోటిని చూచి విస్మయాతిశయమున నిర్విణ్ణురాలను

ఒకప్పుడు మృద్భక్షణము చేసెనని విని యశోద దండింపుఁడు భగనంతుఁడు శ్రీకృష్ణుఁడు తాను తినలేదని నోరు తెఱచి (తల్లికి) చూపెను అందు సకలబ్రహ్మాండము నవలోకించి యశోద పల్కిన మాట లివి ఇందు వదనము ఆలంబనము తదంతర్గతచరాచర జగజ్జాలము ఉద్దీపనము హృతచేతనత్వమును దానిచే ధ్వనిత మగు రోమాంచము నయనవికాసము మున్నగునవి అనుభావములు

త్రాసాదులు వ్యభిచారులు ఏతత్సామగ్రీసమవధానమున ప్రతీయమానము విస్మయస్థాయి అద్భుతరసముగ నాస్వాద్యమానము

[శంక] ఇట యశోదయొక్క పుత్త్రప్రీతి ప్రతీత మగుచున్నది అందుచే అదియు భావధ్వనియే

[సమా] అట్లు శంకింపరాదు ఏలన నిందు ప్రీతికి వ్యంజకములు లేవు విస్మయమునకే కలవు అందుచే ఇది అద్భుతరసధ్వనికే ఉదాహరణము

[శంక] ప్రకరణపర్యాలోకనమున పుత్త్రగతప్రీతి ప్రతీయమాన మగుచున్నది

[సమా] ఉండుగాక అది ప్రధానము కాదు ఏలన 'హృతచేతన అను మాటచే విస్మయమే ప్రబలమగుటంజేసి ప్రీతికి విస్మయము గుణీభూతమని ఇది గుణీభూత వ్యంగ్యోదాహరణము అని వాదించుట పొసఁగదు విస్మయమే ప్రధానము ఇది అద్భుతరసధ్వనికే లక్ష్యము అనుటే సమీచీనము

[శంక] అట్లుకాదు శ్రీకృష్ణుని వదనమున బ్రహ్మాండము నెల్లఁ జూచి యశోద ఇతఁ డెవఁడో మహాపురుషుఁడు అను బుద్ధి యుత్పన్నమగుట శ్రీకృష్ణవిషయకయశోదాభక్తి ఇట ప్రధానము తత్పోషక మగుట విస్మయము దానికి అంగము అందుచే భావధ్వనికే ఇది యుదాహరణము

[సమా] అదియు సంగతముకాదు ఏలన యశోదకు ఈ బాలుఁడు నా కుమారుఁడు' అను నిశ్చయాత్మకజ్ఞానము కలదు

[సమాన విషయమున నిశ్చయము తదితరజ్ఞానోత్పత్తికి ప్రతిబంధకము అను న్యాయమునుబట్టి] ఆ ప్రతిబంధమువలన ఇచ్చోట ఇతఁడు మహాపురుషుఁడు అను జ్ఞానము, అది ప్రతిబద్ధమగుట పుట్టనే పుట్టదు. అందుచే భక్తియే అసంభవ మగును ఇఁక దానికి విస్మయము అంగమగుట ఎట్లు ఘటిల్లును ? అందుచే ఇట ప్రధానము విస్మయ స్థాయికము అద్భుతరసధ్వనియే.

ప్రత్యుదాహరణము—

సహృదయ శిరోమణులు ప్రాచీనులు కావ్యప్రకాశికాకారాదులు వక్ష్యమాణశ్లోకమును అద్భుతరసధ్వనికి ఉదాహరించినారు —

వామనుని గూర్చి బలి తలపోఁతమాటలు —

చిత్రం మహా నేష నవావతారః !
క్వ కాన్తి రేషాఽభినవైవ భంగిః !
లోకోత్తరం ధైర్య మహో ప్రభావః !
కా ప్యాకృతిః నూతన ఏష సర్గః !

ఔర, అపూర్వము ఈ మహావతారము ! ఈ శరీరకాంతి ఎక్కడ? అపూర్వనే ఈ భంగియు లోకోత్తరము ఇతని ధైర్యము ఔరా ప్రభావము ! ఏమి ఆకారము ! - ఇదెల్ల (మున్నెన్నఁడును కని విని యెఱుఁగనిది) నూతన సృష్టి !

ఇట ఇది వక్తవ్యము ఇట విస్మయము ప్రతీయమాన మగుఁ గాక మఱి అది యెట్లు రసధ్వనికి ఆస్పదము ? ఇట వర్ణనీయుఁడైన యొకానొక మహాపురుషుని గూర్చిన స్తోతృగతభక్తి ప్రధానము

విస్మయము గుణభూతము (అంగము) అయినది అందుచే నిది అద్భుతరసమునకుఁగాక భక్తి భావధ్వనికి ఉదాహార్యము

ఇంకొక ప్రత్యుదాహరణము —

భగవద్గీతలో విశ్వరూపమును జూచుచున్న యర్జునునకు,

"పశ్యామి దేవాం స్తవ దేవ దేహే
సర్వాం స్తథా భూతవిశేషసంఘాన్"

ఇత్యాది వాక్యగ్రంథమునందు భగవద్విషయక రతి (భక్తి) ప్రధానముగా ప్రతీయమానము అదృష్టపూర్వ విశ్వరూప సందర్శనముచేఁ గల్గిన విస్మయ మన్నదో ఆ భక్తికి అంగమై దానిని పరిపోషించుచున్నది అందుచే నితైఅంగున చిత్రం' శ్లోకమును రసాలంకారమునకు (రసవదలంకారమునకు) ఉదాహరణ మనఁదగును ఎవ్వరేని పైయుదాహరణమందు భక్తి ప్రతీయమానమగుట లేదు" అందురేని ఆ సహృదయులు దరనిమీలితలోచనులై భావనచేసి ఇందలి పరమార్థము తెలుంగుదురుగాక అనఁగా నిష్పక్షపాత బుద్ధితో తత్త్వము పర్యాలోచించి గుఱుతించిన భావధ్వనికే ఇది ఉదాహరణ మని రసధ్వనికిఁ గాదని వేటతెల్ల మగునని భావము

హాస్యరసమునకు ఉదా —

ఒకానొక తార్కిక పుత్త్రుని వాక్యము —

శ్రీతాతపాదై ర్విహితే నిబంధే
నిరూపితా నూతన యుక్తి రేషా
అంగం గవాం పూర్వ మహో పవిత్రం.
కథం న వా రాసభధర్మపత్న్యాః ?

మా తండ్రిగారు రచియించిన గ్రంథమునందు శ్రోత్రయుక్తి యొకటి నిరూపితమైనది అది యిట్లు ఆవుయొక్క పూర్వకాయము పవిత్ర మగునేని తుల్యన్యాయమున ఆఁడుగాడిద పూర్వకాయము ఎట్లు పవిత్రముకాదు ?

ఇట తార్కికపుత్త్రుఁడు ఆలంబనము అతని నిశ్శంకోక్తి ఉద్దీపనము దంతప్రకాశనాది అనుభావము ఉద్వేగాదులు వ్యభిచారులు (ఆదిశబ్దముచే గ్లాని శంక అసూయ శ్రమము, చపలత, సుప్తము, నిద్ర అవహిత్థము గ్రాహ్యములు

హాస్యప్రకారములను ప్రాచీనులు ఇట్లు నిరూపించినారు

ఆత్మస్థః పరసంస్థశ్చేద్ యస్య భేదద్వయం మతమ్
ఆత్మస్థో ద్రష్టు రుత్పన్నో విభావేక్షణ మాత్రతః
హాస స్త మపరం దృష్ట్వా విభావ శ్చోపజాయతే
యోసౌ హాస్యరస స్తజ్ఞైః పరస్థః పరికీర్తితః

ఉత్తమానాం మధ్యమానాం నీచానా మప్యసౌ భవేత్,
త్ర్యవస్థః కథిత స్తస్య షడ్భేదాః సన్తి చాపరే
స్మితంచ హసితం ప్రోక్తం ఉత్తమే పురుషే బుధైః
భవే ద్విహసితం చోపహసితం మధ్యమే నరే,
నీచేఽపహసితం చాతిహసితం పరికీర్తితమ్,

ఈషత్ఫుల్ల కపోలాభ్యాం కటాక్షై రప్యనుల్బణైః
అదృశ్యదశనో హాసో మధురః స్మిత ముచ్యతే
వక్త్రనేత్ర కపోలైశ్చే దుత్ఫుల్లై రుపలక్షితః
కించిల్లక్షితదంతశ్చ తదా హసిత మిష్యతే

సశబ్దం మధురం కాయగతం వదనరాగవత్
ఆకుంచితాక్షిమంద్రంచ విదు ర్విహసితం బుధాః
నికుంచితాక్షి శీర్షశ్చ జిహ్మాదృష్టివిలోకనః
ఉత్ఫుల్లనాసికాహాసో నామ్నా ప్రహసితం మతం

అస్థానజ స్సాశ్రుదృష్టి రాకంపస్కంధమూర్ధజః
శార్ఙ్గదేవేన కథితో హాసోపహసితాహ్వయః
స్థూలకర్ణకటుధ్వానో బాష్పపూరప్లుతేక్షణః
కరోపగూఢపార్శ్వశ్చ హాసోఽతిహసితం మతమ్

హాస్యరసము ఇఱుతెఱంగు ఆత్మస్థము పరస్థము అని అంచు ద్రష్టకు ఆలంబనదర్శనమునం జేసి స్వయముగ నుదయించు హాస్యము ఆత్మస్థము నవ్వుమన్నవానిని జూచిన నుదయించు హాసము అది పరస్థము ఈ రెండవదానికి విభావము నవ్వుచున్న పరకీయుని హాస్యము. ఈ రెండును ఉత్తములకును మధ్యములకును అధములకును గలుగును అగుచే దానికి నుత్తమము మధ్యమము అధమము అని మూఁడవస్థలు చెప్పఁబడినవి ఇతరులు దానికి (హాస్యమునకు) ఆఱుభేదములు చెప్పిరి 1 స్మితము 2 హసితము 3 విహసితము 4 ఉపహసితము 5 అపహసితము 6 అతిహసితము అని

అందు చెక్కిలి యించుక విప్పాఱ కనుగొనలు మిక్కిలి సారింపక పలువరుస కానరాకుండ పొసఁగు మధురహాసము స్మితము 2 కనులు చెక్కిళ్ళు మొగము పెల్లు వికసింప పలువరుస ఒకించుక కానరాఁగా నొదవు హాసము హసిత మనఁబడును 3 కాలోచితము మధురధ్వని సమన్వితమునై మోము జాజొంద కనులు గంభీరముగ ముకుళింప

నొనరు హాసము విహసితము బుజములను శిరస్సును వంచి కుటిల దృష్టితోఁ జూచుచు ముక్కుదొప్పలు విప్పాఱ హసించిన ఉపహసిత మనఁబడును పెద్దపెట్టున కర్ణకఠోరధ్వనితో కనుల నీరు జాలువాఱ ప్రక్కలు చేతులతోఁ బట్టుకొని పడిపడి నవ్విన అపహసిత మనబడును - అని ఇట్లు శార్ఙ్గధరుఁడు సంగీతరత్నాకరమున వివరించి నాఁడు

వీనిలో ఉత్కృష్ట హాసోదాహరణము —

పాణౌ కంకణ ముత్ఫణః ఫణిపతి
ర్నేత్రం జ్వలత్పావకం
కంఠః కూటిత కాలకూట కుటిలో
వస్త్రం గజేంద్రాజినమ్
గౌరీలోచనలోభనాయ సుభగో
వేషో వరస్యైష మే
గంగోల్లాసవిభావితః పశుపతే
ర్హాసోద్గమో భ్రాజతే.

(హేమ కావ్యాను.)

కయిని నుత్ఫణ ఫణిరాజకంకణంబు
కన్నొ యుజ్జ్వలదనలంబు కంఠ ముగ్ర
కాలకూటిత కుటిలంబు చేల మజిన
మగజ మద్వర వేషహృష్టాత్మ కాదె

పరస్థ హాసోదాహరణము —

కనక కలశస్వచ్ఛే రాధాపయోధరమండలే
నవజలధరశ్యామా మాత్మద్యుతిం ప్రతిబింబితామ్
అసితసిచయప్రాంతభ్రాంత్యా ముహుర్ముహు రక్షిపన్
హసతి జనితక్రీడాహాసః ప్రియాహసితో హరిః

(హేమ - కావ్యాన)

బంగరుకుండలవలె స్వచ్ఛమైన రాధికాపయోధర ప్రదేశ మందు క్రొమ్మెయిలువలె నల్లఁగాఁ బ్రతిబింబితమైన తన తను కాంతిని రాధయొక్క నీలిచీర చెంగుఁగా భ్రమ గొని పలుమఱు శ్రీకృష్ణుఁడు లాగసాగెను అది చూచి రాధ నవ్వెను తానుగూడ లజ్జితుఁడై నవ్వెను

స్మితాదులైన ఆఱు హాసప్రకారములకు నుదాహరణములు సాహిత్యసారమున నెఱుంగఁదగుచు

భయానకరసమునకు ఉదా —

శ్యేన మంబరతలా దుపాగతం
శుష్యదాననబిలో విలోకయన్
కంపమానతను రాకులేక్షణః
స్పందితుం నహి శశాక లావకః

ఆకసమునుండి తనవైపు వచ్చుచున్న డేగను ముఖబిలము ఎండిపోవ నవలోకించుచు శరీరము కంపించుచుండ కనులు ఆకుల పాటొంద మృత్యు వాసన్నమైనట్లు భావించుకొని లావకము కదలుట కేని నేరదాయెను

ఇట శ్యేనము ఆలంబనము వేగముతో నచ్చిపడుట ఉద్దీపనము ఆననశోషాదులు అనుభావములు దైన్యాదులు సంచారులు — ఆదిశబ్దముచే స్వేదము వేపథువు రోమాంచము గాద్గద్యము త్రాసము వైవర్ణ్యము, మరణము

బీభత్సరసమునకు ఉదా —

నఖై ర్విదారితాన్త్రాణాం శవానాం పూయ శోణితం
ఆననే ష్వనులిమ్పన్తి దృష్ట్వా బేతాలయోషితః

పెల్లు గోళ్ళలఁ జీల్చుచుఁ బ్రేవుల శవ
పూతిగంధావిలము నెత్తు రాతతముగఁ
బూసికొనుచున్నవారలు మొగములందు
వల్లకాటను బేతాళవల్లభ లిట

ఇట శవములు ఆలంబనము ఆంత్రవిదారణము (ప్రేవులఁ జీల్చుట) ఉద్దీపనము జుగుప్సాకార్యముగఁ బ్రతీయమానము రోమాంచనేత్రనిమీలనాది అనుభావములు ఆవేగాదులుసంచారులు

[శంక] రతి క్రోధము ఉత్సాహము భయము శోకము విస్మయము నిర్వేదము అను పూర్వోదాహృత స్థాయిభావములలో రత్యాదుల యాలంబనములును ఆశ్రయములును వేర్వేఱఁ బ్రతీయమానము లగుచున్నవి దుష్యంతుని రతికి దుష్యంతుఁడు ఆశ్రయుఁడు శకుంతల ఆలంబనము అట్లు హాసజుగుప్సలం దన్ననో అట్లు రెంటి ప్రతీతి లేదు. ఆలంబనమునకే ప్రతీతి కలదు ఆశ్రయమునకుఁ బ్రతీతి లేదు ఎట్లీ వైషమ్యము?

[సమా] హాస జుగుప్సా ప్రధానము లగు వాక్యముల విను చున్న వాఁడే తదాశ్రయుఁడు (అధికరణము) ఇఁక వైషమ్య మే మున్నది ?

[శంక] ఆ సమాధానము పొసఁగదు ఏలన రత్యాదులందుం బోలె లౌకికము అలౌకికము అని హాస జుగుప్సలందును ద్వైవిధ్యము కలదు పద్యశ్రోత కావ్యోపనిబద్ధుఁ డగుటచే అలౌకికహాసజుగుప్స లకు ఆశ్రయము కాఁదగును లౌకిక హాస జుగుప్సలకును ఆశ్రయము కానేరఁడు అందుచే లౌకికహాసజుగుప్సలకు రెంటికిని లౌకికరత్యా దులకుంబోలె వేఱుగా ఆశ్రయము (అధికరణము) లబ్ధ మగుట లేదు అందుచే వైషమ్య మున్నది

[సమా] అవును ఆశ్రయము ఉపలబ్ధము కాకపోవుట నిజమే అందుచే నట్టి హాస్య జుగుప్సల విషయమున - ఆధేయాను రోధముగ ఆధారమును (ఆశ్రయమును) ద్రష్టృపురుషవిశేషమును ఆక్షేపించుకొనఁదగును - అనఁగా అనుమానముచేఁ గల్పించుకొనఁ దగును ఎట్లన — లౌకికములగు హాస జుగుప్సాములకు కొండొక లౌకిక పురుషుఁడు ఆశ్రయము కాఁదగును కర్త యగుటవలన అలౌకిక హాస్య జుగుప్సలకుఁబోలె అని అనుమానము అట్లు అను మానలభ్యుఁ డైనవాఁడే ఇట ఆశ్రయుఁడు కల్పనీయుఁ డగును ఇఁక నిప్పుడు రత్యాదులయందుంబోలె హాస్య జుగుప్సాదులందును ఆశ్ర యము (ఆలంబనముంబోలె) సిద్ధమగుటంజేసి వైషమ్యములేదు

ఇట్లు ఆలంబనము నాక్షేపముచే సిద్ధింపఁజేసికొన నొప్పుకొన కొన్నను స్వకాంతావర్ణనాత్మకము కావ్యము తాను జదువుట విను కొండె ఘటిల్లినపుడు అందు స్వకాంతాలంబక మగు రతికి ఆశ్రయుఁ

డై లౌకికనాయకుఁడైన తాను సహృదయుఁ డగును అనఁగా అలౌకిక రత్యాశ్రయుఁ డగును కావ్యము కవిరొక్క అలౌకికకర్మ కావున అట్లే హాస్యజుగుప్సలకును ఒక్కఁడే లౌకికాలౌకికములు రెంటికిం గూడ ఆశ్రయుఁ డగును లౌకికభావమునకు ఆశ్రయుఁడైన వాఁడు అవస్థాభేదమును బట్టి అలౌకికభావమునకును ఆశ్రయుఁడు కాఁగూడ దని నియమము లేదు

అవస్థాభేదమును బట్టి అనఁగా స్వకీయకాంతావర్ణనము సందర్భమున - భామినీవిలాసము విషయమున – స్వకాంతాలంబనక మగు రతికి తాను (శ్రోత) ఆశ్రయుఁడై లౌకికనాయకుఁ డగును స్వకాంతావర్ణన కావ్యము అలౌకికము కావున దానిని వినుచు తాను సహృదయుఁ డగును – అలౌకికరత్యాశ్రయుఁడు నగును ఆ రతియే స్వకాంతాలంబనవిభావము తద్వర్ణితోద్దీపన విభావానుభావవ్యభిచారి భావములు – ఏతత్సామగ్రీసమవధానమున శృంగారరసముగ నాస్వాద్యమాన మగును. ఇందు రసోద్బోధకమున బాధక మెద్దియు లేదు

ఇట్లు రసములు సంక్షేపములుగ నిరూపితము లైనవి అవి బహుప్రభేదము లగుట సాకల్యముగ నిరూపింప శక్యముకాదు

రసగంగాధరము

పరివష్యావివరణసముల్లసితము

అథ 6. రసవిశేషములు

౧. రసధ్వని - రసవదలంకారము

రసము ప్రధానముగ వ్యంగ్య మగునేని రసధ్వని యనఁ బడును అప్రధానము (గుణీభూత మగునేని) రసాలంకారము (రసవదలంకార మొండె) అనఁబడును

కొందఱీ విషయమున నిట్లు అభిప్రాయభేదము ప్రకటింతురు

రసమునకు ప్రాధాన్య మున్న రసత్వమే కాదేని అలంకారత్వమే రసాలంకారము అను వ్యపదేశము బ్రాహ్మణశ్రమణ న్యాయమున భూతపూర్వగతిచేబట్టి అలంకారధ్వని' అను వ్యవహారముకూడ నట్టిదే [చూ అం సాహిత్యదర్పణము పుట 113]

దీని వివరము, ఒకఁడు మొదట బ్రాహ్మణుఁడు వెనుక శ్రమణకుఁడు (బౌద్ధసన్యాసి) అయ్యెను 'సాంప్రతికాభావే భూతపూర్వస్యాగతిః ఇప్పుడు లేకున్నను మున్నటిదానిని బట్టియే వ్యవహారము అను న్యాయమునుబట్టి తత్కాలమున బ్రాహ్మణత్వము లేకున్నను తొంటి బ్రాహ్మణత్వమునుబట్టి అతనిని జనులు బ్రాహ్మణశ్రమణుఁ డని వ్యవహరింపసాగిరి అట్లే మొదట అలంకారము పిదప ప్రధానముగా వ్యజ్యమాన మగుటంజేసి ధ్వనిత్వమును పొందఁగా ధ్వని స్వయముగా నలంకార్యమే యగుట, తాత్కాలికము అలంకా

రము గాకున్నను భూతపూర్వమగు అలంకారమును పురస్కరించు కొని అలంకారధ్వని అని పేరు అట 'అలంకారము' అను విశేష ణము గౌణము ధ్వని ప్రధాన మగుట వాస్తవముగా దానికి ధ్వని వ్యపదేశమే తగును అట్లే రసము అలంకార్య మైనను తాత్కాలికముగ గుణీభూతవ్యంగ్యత్వము నొందుటంజేసి రసత్వము లేకున్నను అలంకారత్వమే యున్నను భూతపూర్వగతిని బట్టి రసాలంకార మని (రసవదలంకారము) అని పేరు వాస్తవముగా దానికి అలంకార వ్యపదేశమే తగును రసత్వము అప్పుడు లేనందునను అలంకారత్వ మున్నందునను ఇట రసవత్ అను విశేషణము గౌణము ఇది పూర్వపక్షుల యభిప్రాయము ఈ రసధ్వనిత్వమును రసవదలం కారత్వమును రసములకు అసంలక్ష్యక్రమ వ్యంగ్యత్వమునందే సంలక్ష్యక్రమ వ్యంగ్యత్వమునం దన్ననో వాని వ్యంగ్యము వస్తు మాత్రము రసము కాదు ' అనియు ఆ కొందఱు వచింతురు

కొందఱు వచింతురు ' అనుట తన్మతమునందు గ్రంథ కర్తకు ఇష్టము లేమి సూచితము భూతపూర్వగతి నాశ్రయింపఁ బొల్పుకుట అనుచిత మనియు అలంకారధ్వని' రసాలంకారము' అను వ్యపదేశములే ప్రాచీను లగు ధ్వనికారాదుల యభిప్రాయాను సారము అంగీకర్తవ్యము లనియు భావము

౨. రసములయసంలక్ష్యక్రమవ్యంగ్యత్వ స్వరూపము

ఇంతవఱకు నిరూపించిన రసములకు - భావములకును - అసంలక్ష్యక్రమవ్యంగ్యత్వము చెప్పఁబడినది ఇందు రసాది వ్యంగ్య ప్రతీతికి విభావాది వాచ్య ప్రతీతి కారణ మగుటవలన క్రమము ఉండనే యున్నది కార్యనియతపూర్వభావి కారణము కారణ నియత

పశ్చాద్భావి కార్యము ఇట్లు కారణము ముందు, కార్యము వెనుక అను సంబంధము ప్రసిద్ధము ఉన్నను సహృదయునకు రసాభివ్యక్తి కలుగునప్పుడు అది (ఆ రసాభివ్యక్తి) తెలుసుకొనగల్గును అందుచే ఆ క్రమము లక్ష్యముకాకుండును కాని వాస్తవ మారసిన - విభావానుభావవ్యభిచారిభావముల పర్యాలోచనకుం దొడంగిన వానికిని రసాభివ్యక్తికిని గల క్రమము పౌర్వాపర్యము శతపత్రపత్రశతభేదన్యాయమున లక్ష్యమగును అనఁగా నూఱు తమ్మిరేకుల మొత్తమును ఒక్కుమ్మడిగా సూదితోఁ గ్రుచ్చినప్పుడు ఒక్కొక్క తమ్మిరేకునకు వరుసగ వేధ కల్గినను, వానికి సూక్ష్మ కాలభేదము సంభవించినను‌ంగూడ అది అంత శీఘ్రముగ కలుగుటం జేసి క్రమము గుఱుతింపఁబడదు కాని మొదటి రేకునకు వేధ యేర్పడిన యనంతరమే కాని రెండవదానికిని రెండవదానికి వేధ యేర్పడిన తరమే కాని మూడవదానికిని వేధ కలుగుట యొదవ దని ఔపపత్తికముగా విచారించినచోఁ గ్రమము సిద్ధమగును అట్లే వాచ్యములగు విభావాదుల ప్రతీతి వ్యంగ్య రసప్రతీతి, ఈ రెంటికి హేతుహేతుమత్తుల (హేతుకార్యముల) పౌర్వాపర్యక్రమము నిజమునకు ఉన్నను ఆశుభావిత్వముచే సహృదయునకు సమ్యగ్లక్ష్యభూతము కాకుండు నని పిండితార్థము

[శంక] విభావాదిప్రతీతి రసప్రతీతి ఈ రెంటి క్రమము సంలక్ష్య మగుటలేదు కావున లేనే లే దనరాదా ?

[సమా] అనరాదు అప్పుడు విభావాదికిని రసాభివ్యక్తికిని హేతుహేతుమద్భావము సంగతము కాకపోవలసివచ్చును రసనిష్పత్తికి కారణము లేకపోవును అందుచే క్రమము ఒప్పి అది ఆశుసంభవ యగుట సహృదయునకు అసంలక్ష్యము అనియు నంగీకరించుటే పాడి

3. రససంఖ్య

[శంక] పూర్వ నిరూపితములు తొమ్మిదే రసములా? భగవదాలంబనకము రోమాంచాశ్రుపాతాద్యనుభావము హర్షాది వ్యభిచారిభావ పరిపుష్టము భగవదనురాగ(రతి)రూప స్థాయిభావకము భాగవతాది పురాణశ్రవణ సమయమున భక్త సహృదయ బృందములచే ననుభూయమానము (ఆస్వాద్యమానము) భక్తిరసమును పదియవరసమును కల్పింపుచ్చి తొమ్మిదే రసము లను టెట్లు శక్యము?

[సమా] భక్తి రస మన నేమి ప్రమాణము?

[శంక] అథాతో భక్తిజిజ్ఞాసా అని ప్రారంభించి శాండిల్యానుయాయులు కొందఱు వారి మతము నిట్లు ప్రపంచింతురు –

పరత్రానాసంగం జనయతి రతి ర్యా నియమతః
పరస్మి న్నేవాస్మిన్ సమరసతయా పశ్యత ఇవమ్
పరప్రేమా ఖ్యేయం భవతి పరమానందమధురా
పరాభక్తిః ప్రోక్తా రస ఇతి రసాస్వాదనచణైః

(భగవద్భక్తి చంద్రికామృతము – రసోల్లాసము)

అని శాండిల్యాదిమార్గానుసారులు భక్తిని రసరూపముగ వర్ణించిరి భక్తిస్వరూపము నిట్లు ఉపపాదించిరి

అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవచ
నిర్మమో నిరహంకారః సమదుఃఖ సుఖః క్షమీ
సంతుష్టః సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః
మయ్యర్పిత మనోబుద్ధి ర్యో మద్భక్తః స మే ప్రియః

(భగవద్గీత)

'జీవన్ముక్తః స్థితప్రజ్ఞః విష్ణుభక్తశ్చ కథ్యతే
(జీవన్ముక్తి వివేకము)

ఇట్లు రసమన ముఖ్యభక్తి యని యేర్పడినది పదియవ రసము నంగీకరింపనేల? కష్టమగు శాంతరసము నందే అది యంత ర్భూతము కాఁదగునని మఱి కొందఱు వచింతురు ఇట తాత్త్వికుల కును ఆలంకారికులకును నిజమునకు భేదము లేదు అది ఇట్లు భక్తి ద్వివిధము ముఖ్యము అముఖ్యము అని అందు తొంటిది ముఖ్య భక్తి) ఆలంకారికులు శాంతమునందు అంతర్భవింపఁ జేయుదురు అన్యమును (అముఖ్యభక్తి) రసముకాదు భావము అని ఖండింతురు మఱి భక్తిమతానుసారు లన్ననో శాంతమునే భక్తిరసమునందు అంత ర్భవింపఁజేసి ముఖ్యభక్తినే రసముగాఁ జెప్పుదురు ఇట్లు ఇరువురును ముఖ్యభక్తిని రసమని చెప్పిరి అందుచే ఇట ఖండనము మండనమే అని సమన్వయింతురు (సాహిత్యసారము 131 పు)

[సమా] కాని ఆలంకారిక సార్వభౌములు భరతాదులు భక్తిని వేఱురసముగా నంగీకరింపరైరి. శాంతరసమునందు తదంతర్భావమును సంగతముకాదు ఏలన భక్తికి స్థాయిభావము అనురాగము (రతి) శాంతరసమునకు స్థాయి నిర్వేదము (వైరాగ్యము) అందుచే వీనికి విరోధము కలదు. అందుచేతనే ప్రాచీనాలంకారికులు 'భక్తి దేవాది విషయకరతి రూపమగుట భావాంతర్గతము అందువలన దానిని రస మనుట అనుపపన్నము అనిరి

రతిర్దేవాదివిషయా వ్యభిచారీ తథాంజితః
భావః ప్రోక్తస్తదాభాసా అనౌచిత్యప్రవర్తితాః '

అని సిద్ధాంతీకరించిరి

(కా. ప్రకాశ)

దేవ గురు రాజపుత్రాదివిషయకరతి ప్రధానముగా వ్యంజితమగుటవలన (అంజితః) అభివ్యక్తి విషయమై వ్యభిచారి భావముగా రసశాస్త్రకోవిదులు చెప్పుదురు అనౌచిత్య ప్రవర్తితములు (న్యనహ్యాతములైన) రసములు భావములు రసాభాస భావాభాసములు ఇవెల్ల భావములు ప్రాచీనమతానుసారము భక్తి దేవాదివిషయకరతిరూపము రసముకాదు అందుచే తొమ్మిదే రసములు

[శంక] పుత్రాదివిషయకరతి భావ మగుచో అట్లే కామినీ విషయకరతియు రతివిశేషమేకదా అదియు భావమగుఁగాక రస మేల కావలయును ? వినిగమకములేదు కావున భగవద్భక్తియే స్థాయి యగుఁగాక కామినీ విషయక రతియే వ్యభిచారి యగుఁగాక.

[సమా] ఈ సాహిత్యశాస్త్రమునందు భరతమున్యాదుల వచనమే రసభావాది నిర్ణాయకము అదే ఆధికారిక మగు స్వతంత్ర ప్రమాణము అందుచే దాని నుల్లఘించి ఇచ్చవచ్చిన ట్లెల్ల విపరీత కల్పనము చేయ నధికారములేదు అట్లు ప్రమాణము నతిక్రమించి కల్పింపఁబూనిన పుత్రాదివిషయకరతియు ఏల స్థాయిభావము కారాదు ? అట్లే జుగుప్సా శోకములును ఏల స్థాయిభావములు కావలెను ? వ్యభిచారిభావములు ఏల కారాదు ? విశృంఖలతర్క కర్కశ నిర్ణయములకుఁ గడంగి భరతాదుల ప్రమాణము నుజ్జగించిన సకలసాహిత్యశాస్త్రమును అవ్యవస్థితమై పోవును అందువలన తొమ్మిదే రసము లని మునియనుశాసనశాస్త్రానుసరణియే శ్రేయ మని మేము అనుసరించితిమి

౪. రసవిరోధావిరోధములు

[ప్రశ్న] ఈ నవరసములలో వేనితో వేనికి అవిరోధము (ఉపకార్యోపకారక భావము)? విరోధము (బాధ్యబాధక భావము)?

[సమా] అందు శృంగార వీరములకు శృంగార హాస్యములకు శృంగారాద్భుతములకు వీరాద్భుతములకు వీర రౌద్రములకు (భయానక బీభత్సములకు) అవిరోధము మఱి శృంగార బీభత్సములకు శృంగారకరుణములకు శృంగార శాంతములకు వీర భయానకములకు శాంత రౌద్రములకు విరోధము

ఈ విరోధావిరోధ భావమును పర్యాలోచించి కావ్య నిర్మాతలు సముచితరీతిని రసపోషణము చేయఁదగును రసాభివ్యంజక కావ్యమున ప్రకృత (ప్రధాన) రసమును పోషింప నెంచు కవి తద్రస విరుద్ధములగు విభావాదులను నివేశింపరాదు అట్లు చేయుచో ఆ విరుద్ధరసము స్వాంగపరిపుష్టమై ప్రకృతరసమును బాధించును కాదా ఆ ప్రకృతాప్రకృతరసములు రెండును తుల్యబలములై సుందోపసుందన్యాయమున పరస్పరము హతమగును

విరోధరస సమావేశము

విరుద్ధములగు రసములను ఒక్కచో కావ్యమున సమావేశింపఁ దలంచుచో విరోధమును పరిహరించి సమావేశింపవలెను. ఎట్లన విరోధము ఇఱుతెఱఁగు స్థితి విరోధము జ్ఞానవిరోధము అని అందు తొంటిది ఏకాధికరణమున (ఒక వ్యక్తియందు) ఉండమి భిన్నాధికరణములందు (భిన్నవ్యక్తులందు) విరుద్ధరసములను నివేశించిన అది తొలఁగును నాయకునియందు వీరరసమును ప్రతినాయకునియందు

భయానకరసమును నివేశించిన స్థితివిరోధము నివర్తిల్లును ప్రధాన రస పోషకము నగును రెండవ విరోధము జ్ఞాన విరోధము సమ్యగ్ జ్ఞానమును విరోధి రసజ్ఞానము ప్రతిబంధింప జ్ఞానవిరోధము కలుగును.

[శంక] విరోధజ్ఞానముచేఁ బ్రతిబధ్యమై భాసింపకుండుటకదా జ్ఞానవిరోధము రసములు వేద్యాంతరస్పర్శశూన్యములు సచ్చిదానందలక్షణములు, అపరిచ్ఛేద్యములు కదా అవి సామాజికనిష్ఠములే కాని, నాయకాదుల నుండునవి కావు అవి సమములు అద్వితీయానందమయములు. వానికి పరస్పరవైరుధ్యము (వైషమ్యము) ఎట్లు సంభవించును?

[సమా] ఇట రసపదముచే రసోపాధిభూతము స్థాయిభావము వివక్షితము అది అపరిచ్ఛిన్నము కాదు అందుచే దానికి విరోధము కాని భిన్నాధికరణసమావేశముకాని అసంభవము కాదు అట్లే కావ్యప్రకాశమునందుఁ జెప్పబడినది -

ఆశ్రయైక్యే విరుద్ధో యః స కార్యో భిన్నసంశ్రయః
రసాంతరేణాంతరితో నైరంతర్యేణ యో రసః

ఏది ఏకాధికరణమున విరుద్ధమగునో దానిని భిన్నాధికరణముగఁ జేయవలెను నైరంతర్యముగా (అవ్యవహితముగ) విరోధమాపాదించుచో [అవిరుద్ధ] రసాంతరముచే వ్యవహిత మొనర్పవలెను

ఈ ప్రకరణమున రసపదముచే స్థాయిభావము ఉపలక్షితము' అనియు నందే చెప్పఁబడి యున్నది

స్థితి విరోధ పరిహారమునకు ఉదా,-

కుండలీకృత కోదండ దోర్దండస్య పుర స్తవ
మృగారాతే రివ మృగాః పదే నైవావతస్థిరే.

కుండలీకృత కోదండ చండ బాహు
దండు నినుఁజూచి నీ వైరితండము లవె
పఱచుచున్నవి నిలువక హరిని జూచి
హరిణకంబులు పఱతెంచు నట్టు లవుర.

ఇట నాయకుఁడుగ వర్ణనీయుఁడైన రాజునందు వీరరసము ప్రతినాయకులైన వైరిరాజులందు భయానకరసము - ఇట్లు భిన్నాధి కరణముల విరోధిరసముల నివేశించుటంజేసి స్థితివిరోధరూపదోషము నివర్తిల్లుటే కాదు ప్రధానమగు వీరరసము పరిపుష్టిని పొందినది.

౨ మఱి జ్ఞానవిరోధనివృత్తికి ఉదా —

ఇఱువురు విరోధుల నడుమ సంధాతయుంబోలె, విరోధిరస ముల రెంటినడుమ అవిరోధిరసాంతరమును నెలకొల్పినచో రెండ వదియగు జ్ఞాన విరోధము సైతము నివర్తిల్లును ఎట్లన మన్నిర్మిత (పండితరాయ నిర్మిత) మైన యాఖ్యాయికయందు కణ్వాశ్రమ గతుఁ డైన శ్వేతకేతు మహర్షి యొక్క శాంతరసప్రధానవర్ణన సంద ర్భమున

కిమిద మనాకలితపూర్వం రూపం !
కోయ మనిర్వాచ్యో వచనరచనాయా మధురిమా !

ఏమి యిది! మున్ను కని విని యెఱుఁగనట్టి
యీ మహాద్భుతరూప మిదేమి వాగ
తీతవచనాదిరచనంపుఁ దీయఁదనము
ఎవఁడో యీ శాంతమూర్తి వశీంద్రుఁ డౌర!

అను నీ యద్భుతరసమును వరవర్ణినీసమాఖ్య నాయికా శృంగారమునకును శ్వేతకేతుమహర్షి శాంతరసమునకును నడుమ నివేశింపఁబడినది. తొలుత శాంతము పిమ్మట శృంగారము ఈ రెండు విరుద్ధరసముల నడుమ నివేశింపఁబడిన యద్భుతరసము రెంటికిని అవిరుద్ధము సంధాత్మకల్పము అప్పుడు రెండు విరుద్ధ రసములకును నైరంతర్యము – సహప్రయోగము ఉండదు ఉభయావిరుద్ధరసవ్యవధాన మున్నందున అందుచే జ్ఞానకృతవిరోధము వివర్తిల్లును.

ఉదాహరణాంతరము —

సురాంగనాభి రాశ్లిష్టా వ్యోమ్ని వీర విమానగాః
విలోకన్తే నిజాన్ దేహాన్ ఫేరునారీభి రావృతాన్

దివ్య వారాంగనాశ్లిష్ట దివ్యదేహు
లైన వీరులు వ్యోమ విమానగతులు
ఇలను వీక్షింత్రు నిజదేహములను మాంస
మాంసలాశను ఫేరవమహిళ లఱుమ

ఇట తొలుతటి సగమున – సురాంగనాలంబకము శృంగారము కడపటి పాదమున మృతశరీరాలంబనకము బీభత్సము ఈ రెండును విరోధిరసములు, వీనినడుమ తదుభయావిరోధిత్వము సమకూడుటకై

స్వర్గలాభమును వర్ణించుటచేఁ దదాక్షిప్తము వీరరసము విలోకనో త్సాహ స్థాయికము, అంతర్నివేశితము వీరరసము శృంగార బీభ త్సములకు రెంటికిని విరోధి కాదు అందుచే శృంగారముతో ప్రారం భించిన చర్వణ అప్రతిబధ్యముగా సాంతముగా నెఱవేఱినది అంత ర్నివేశన మనఁగా - పరస్పర విరోధము గల రసముల నాస్వాదించు సమయమున నడుమకాలమున నుదాసీనరసము నాస్వాదించుట

ఉదాహరణాంతరము —

భూరేణు దిగ్ధాన్ నవపారిజాత
మాలారజోవాసిత బాహుమధ్యాః
గాఢం శివాభిః పరిరభ్యమాణాన్
సురాంగనా శ్లిష్ట భుజాంతరాలాః
సశోణితైః క్రవ్యభుజాం స్ఫురద్భిః
పక్షైః ఖగానా ముపవీజ్యమానాన్
సంవీజితా శ్చందనవారిసేకైః
సుగంధిభిః కల్పలతాదుకూలైః
విమాన పర్యంకతలే నిషణ్ణాః
కుతూహలావిష్టతయా తదానీమ్
నిర్దిశ్యమానాన్ లలనాంగుళీభి
ర్వీరా స్వదేహాన్ పతితా నపశ్యన్.

(౧) అప్పుడే రణభూమిపై దొఱఁగినవి, దుమ్ముచేఁ గప్పఁ బడినవి, ఆఁడునక్కలచేఁ దృఢముగాఁ బొదువఁబడినవి, నెత్తుటఁ దోఁగిన ఱెక్కలతో మాంసాశిపక్షులు వీచుచున్నవి నైన తమ దేహములను,

(2) యుద్ధమున నప్పుడే సేనలు వాసి వీరస్వర్గమును జూడఁ గొన విమానముల నాసీనులైరివారు

(3) నవపారిజాతమాలలు వక్షస్థలమునఁ గ్రాల చందన ద్రవసేకములఁ దడిసి తావి గుబాళించు కల్పలతాదుకూలములు ధరించి అచ్చరలు బిగ్గఁ గౌఁగిలించి ప్రేమలతోఁ జూపు మండఁగా కుతూహలములతో సవిస్మయముగ చూచుచున్నారు

ధ్వన్యాలోక కావ్యప్రకాశికోద్ధృతములైన యీ పద్యకదంబమునం దన్నిటఁ (గ) తొలుత బీభత్ససామగ్రిచే బీభత్సరస చర్వణము తదనంతరము తద్రసాస్వాద జనక కారణసముదయముచే నాక్షిప్తమై ప్రతీతిపదవికి నవతరించిన నిశ్శంకప్రాణత్యాగాదిరూప సామగ్రీక మగు వీరరసంపుఁ జర్వణము, కడపట శృంగారరస చర్వణము – ఇది క్రమము 'సురాంగనా' పద్యమున కన్న విపరీతము. (అట శృంగార – వీర–బీభత్స క్రమము) ఇది భేదము

ఇట్లు విరోధిరసాంతరాళవర్తియైన యుదాసీనచర్వణచే ప్రతిబంధకజ్ఞానము నివృత్తము కాఁగా ప్రతిబంధము తొలఁగిపోవుఁడు నిష్ప్రత్యూహముగా వైరుద్ధ్యప్రతిబద్ధము లగు రసముల చర్వణ యుదయించును అని ఫలితార్థము

ఇట్లు విరోధిరసాంతర్నివేశనమునకు ఏ బాధయు లేదు ఏలన అపేక్షాబుద్ధీతరము లగు సర్వజ్ఞానములు ద్విక్షణస్థాయులు కావున మొదటి క్షణమున ప్రథమవిరోధిరసము (బీభత్సరసము) విలయమగు క్షణమున మధ్యమజ్ఞానము (వీరరసము) ఉత్పన్నమగును. ద్వితీయక్షణమున మధ్యమజ్ఞానస్థితి (వీరరసాస్వాదము) తృతీయ

క్షణమున మధ్యమజ్ఞాన విలయము ఆ క్షణమున ప్రథమ విరోధి జ్ఞానము ఉండదు కావున ప్రతిబధ్యజ్ఞానము (శృంగార రసము) ఉత్పన్నమైనను బాధలేదు

(3) విరుద్ధ రసద్వయంపు విరోధము తొలంగుటకుఁ బ్రకారాంతరము (1) రెండు రసములకు పరస్పరము అంగాంగి (పోష్య పోషక) భావము ఉండునేని, అట వైరుధ్యము ఉండదు ఏలన విరోధి భావ ముండుచో అంగాంగిభావ మెట్లుండును ? విరోధి ఎట్లు పోషక మగును ? (2) అట్లే అంగియైన వేఱొక రసమునకు విరుద్ధరసములు రెండు అంగము లైనపుడును ఆ యంగరసములు రెంటికిని విరోధము ఉండదు పరాంగములకు వానికి రాజు సేవకులకుంబోలె పరస్పరము విరోధించు స్వాతంత్ర్యమును ఉండదుకదా ఇతరమును పోషించుట యందే వాని శక్తి పర్యాప్తమగును

ఉదాహరణము —

ప్రత్యుద్గతా సవినయం సహసా సఖీభిః
స్మేరైః స్మరస్వచివైః సరసావలోకైః
మా మద్య మంజురచనైః ర్వచనైశ్చ బాలే,
హా ! లేశతోఽపి నకథం వద సత్కరోషి ?

ఓసి ముద్దరాలా నేఁడు ఎప్పటివలె సఖులతోడ వినయ పురస్సరముగా తటాలున నన్నుఁ జూచినంతనే యెదురు వచ్చి మరులు గొల్పు చిఱునగవులతో సరసావలోకనములతో, మనోహర చేష్టలతో మధురవచనములతో అక్కటా ! ఇంచుకేని నన్ను సత్కరింప వేమి ? చెప్పుము

ఇది ఎదుటఁ బడియున్న మృతనాయికనుగూర్చి నాయకుని మాటలు ఇట నాయిక ఆలంబనము అశ్రుపాతాదులు అనుభావములు ఆవేగవిషాదాదులు సంచారులు ఏతత్కారణ సామగ్రిచే వ్యజ్యమాన మగు నాయకగతరతి - నాయిక మరణించుటచే నిప్పుడు తన్మృతనాయికాలంబనము అశ్రుపాతాద్యనుభావములు ఆవేగాదిసంచారులు వీనిచే వ్యజ్యమాన మగు కరుణరసస్థాయికి శోకమునకు అంగమైనది అన్యత్ర విరోధులైన శృంగారకరుణములు రెంటికి ఇట అంగభావముచే విరోధము నివృత్తమైన దని ఈ యుదాహరణముచే స్పష్టము

ధ్వనికారులు

'అవిరోధీ విరోధీవా రసోఽఙ్గిని రసాన్తరే
పరిపోషం న నేతవ్య స్తథాస్యాద విరోధితా. (3) ఉద్యో

ఒక రసము ప్రధానముగా నుండఁగా దాని ననాదరించి దానికి అవిరోధిగాని విరోధిగాని యైన రసాంతరములను ప్రధానరసముతో సాటి పోటిగా పోషింపరాదు ప్రధానమునకు సెగిలేకుండ అంగములనుగాఁ బోషించిన విరోధము నివర్తిల్లును అవిరోధిరసము అంగమైన బాధ లేదు అవిరోధిరసమును ప్రధానమును మించినచో విరోధము తప్పదు ఇఁక విరోధిరసము ప్రధానము నతిక్రమించి పరిపుష్టమైన విరోధ మెసఁగు నని వేఱ చెప్పక్కఱలేదు కదా

[శంక] పై యుదాహరణ శ్లోకమునందు నాయకరతి ప్రతీత మగుటలేదు ఏలన ఆలంబనమైన నాయిక నష్టమైనది అందుచే నాయకుఁడు శోకవిహ్వాలితుఁడగుట శోకమే ప్రస్తుతము రతివ్యంజ

కముతైన విభావాది కారణసామగ్రిచే ప్రస్తుతమైన శోకమే ప్రతీత మగుచున్నది ఇట్లు నిరాలంబ మగుట అప్రతీతమగు నాయకనిష్ఠరతి శోకమునకు అంగ మగు టెట్లు సంభవము?

[సమా] అట్లు మీరు అరుచిని సూచింప పట్టు పట్టుమానేని పోనిండు అట్లే ఆలంబనవినాశమునం జేసి నాయకగతరతి ప్రతీత మగుటలేదని అభ్యుపగమింతము (వాదమునకై అంగీకరింతము) గాక అట్లైన నాయకాలంబనము ప్రత్యుద్గమాద్యనుభావము హర్షాది వ్యభిచారియు నగు నాయికానిష్ఠరతియే శోకాంగ మగుఁగాక నాయికాగతరతి నాయకశోకప్రకర్ష మునకు హేతు వని యెల్లరు ఒప్పుకొన్న దేకదా

[శంక] నాయిక నష్టమైనదికదా తద్గతరతి లేదుకదా ఆ నష్టమైన రతి ఎట్లు శోకమునకు అంగము కాఁగలదు ?

[సమా] అట్లనరాదు ఏలన సన్నిధానమం దున్న దే అంగము కావలె నని నియమము లేదు అట్టి నియమము మూర్త పదార్థముల విషయమున వలసిన వలయునుగాక అందుచే నాయికాగత రతి అప్పుడు లేకున్నను, [ఆ కలికికి నాపై నింత ప్రేమ యుండెను. ఇట్లుండెను అట్లుండెను అని] అది యిప్పుడు నాయకు నిచే స్మర్యమాణమై తచ్ఛోకమును ప్రకృష్టపఱుప సమర్థమగును కావున అది శోకాంగ మగుఁగాక. ఇట్లు స్మర్యమాణరతి అంగమగుట సుసంభవ మగుటంజేసి నాయికావిషయక నాయకగత రతియే స్మర్యమాణమై శోకాంగ మగుటయు సూపపన్నమే ఇట్టి రతి యిఱు తెఱంగులను శోకాంగ మగుట పొసఁగును

పరాంగములగు రసద్వయవిరోధనివృత్తికి ఉదా

ఉత్క్షిప్తాః కబరీభరం వివలితాః
పార్శ్వద్వయం న్యక్కృతాః
పాదాంభోజయుగం రుషా పరిహృతా
దూరేణ చేలాంచలమ్,
గృహ్ణంతి త్వరయా భవత్ప్రతిభట
క్ష్మాపాల వామభ్రువాం
యా స్త్రీనాం గహనేషు కంటకచితాః
కే కే న భూమీరుహాః ?

కేశపాశములు రేగిపోయినవి ప్రక్కలు ముడుచుకొని పోయినవి తామరలవంటి పాదములు నొచ్చినవి చీరచెంగులు కోపముచేతవలె దూరముగ పరిహృతము లైనవి రాజా నీ శత్రు భూపతుల భార్యలు అడవిలో పోవుచుండగా ముండ్లతో విండిన యే వృక్షములు వారిని పట్టుకొనుటలేదు ? అన్నియు పట్టుకొనుచునే యున్నవి.

ఇట కంటకపదమునకు కంటకుఁడు గగుర్పాటును అర్థములు వాచ్యములు ప్రకృతములు నగు శత్రుమహిషీ విషయక కంటకతరు కర్తృక కబరీగ్రహణప్రభృతు లగు కార్యములచే కరుణరసము అభివ్యక్తము వ్యంగ్యములు అప్రకృతములు నగు కామికర్తృక కబరీగ్రహణ ప్రభృతు లగు కార్యములచే శృంగారము స్ఫురించుచున్నది. ఇట సమాసోక్తి అలంకారము దానికి అవయవములైన యీ ప్రకృతాప్రకృత వ్యవహారముల (కార్యములచే) నభివ్యక్తము లగు కరుణ శృంగారములు పరస్పర విరుద్ధములు విరోధము నివృత్త మగుటచే

ప్రధానీభూత మగు రాజవిషయకవక్తృగతరతికి అంగములుగా సమావేశింపఁబడినవి

(౪) ఇంకొక విధముగను విరుద్ధరస సమావేశము చేయఁదగును ఎట్లన ప్రకృత రసపరిపోషణము చేయఁగోరు కవి తద్విరోధి యైన రసమునుంగూడ బాధ్యమునుగా (ప్రధానరసముచే నభిభవనీయముగా) కావ్యమున నిబంధింపవలెను అట్లు నిబంధించిన వైరివిజయముచేఁ బొసరిన యనిర్వచనీయశోభ, వర్ణ్యమైన ప్రధాన రసమునకు సమకూరునే కాని బాధ ఏపాటియుఁ గలుగదు

[శంక] రసమునకు బాధ్యత్వము (ప్రతిబధ్యత్వము) అన నేమి ?

[సమా] స్వరసాభివ్యక్తికి ఉపకారకములు ఆలంబనాదిస్వాంగములున్ననుంకూడ ప్రబలము లగు - అనఁగా అత్యంత పరిపుష్టాలంబనాదికములు గల - విరోధి రసమున ప్రస్తుతము వర్ణనీయమైన రసాస్వాదము నిరుద్ధ మగుటయే రసమునకుఁ బ్రతిబధ్యత్వము రసమునకు అంగము లున్నవి అంగబలము లేదు విరోధి రసమున కన్ననో అంగము లుండుటే కాదు అవి బలాఢ్యములుగను ఉన్నవి అందుచే విరోధిరసప్రాబల్యము ఇట్లు అంగబలమునుబట్టి ప్రాబల్యము అంగదౌర్బల్యమునుబట్టి దౌర్బల్యము అంగిరసమునకు కలుగు నని భావము మఱి వ్యభిచారిభావముల ప్రతిబధ్యత్వమన్ననో యిట్లు వానిచే పోషింపఁదగిన రసముయొక్క నిష్పత్తి (ఆస్వాదనము) బాధింపఁబడుట మాత్రమే వ్యభిచారిభావములు అభివ్యక్తములు [ఆస్వాద్యములు] కాకపోవుటకాదు అవి అభివ్యక్తము లైనను తత్పోష్యమగు రసాభివ్యక్తి నిరుద్ధమగుటయే ఏలన, వ్యభిచారి భావ

ముల నివృత్తి నడ్డుపెట్టున దేదియులేదు ఇది రసప్రతిబధ్యతకును వ్యభిచారిభావప్రతిబధ్యతకును భేదము

[శంక] విరోధిరసాభివ్యక్తిచే ప్రకృతరసము ప్రతిబధ్య మగుఁగదా అట్లే వ్యభిచారి భావముల విషయమునందును - విరోధి రసాంగముల (వ్యభిచారుల) యభివ్యక్తిచే ప్రకృతరసాంగముల (వ్యభిచారుల) యభివ్యక్తి ప్రతిబంధము కలుగునని ఏల చెప్పరాదు? అనఁగా రసములకుంబోలె భావములకును పరస్పర ప్రతిబధ్య ప్రతిబంధక భావము ఒప్పరాదా? వ్యభిచారి భావములకు పరస్పర ప్రతిబంధక భావము లేదని ఏల చెప్పవలెను?

[సమా] భావములకు పరస్పరము ప్రతిబధ్య ప్రతిబంధక భావము చెప్పుట సరికాదు ఏలన అపేక్షాబుద్ధికన్న నతిరిక్తమగు జ్ఞానము ద్విక్షణస్థాయి యగును అందుచే ఏ వ్యభిచారిభావముల యభివ్యక్తికి ప్రతిబంధము శంకనీయమో వానికి అభివ్యంజకము లగు శబ్దార్థము లుండు క్షణమునందు ప్రతిబంధకములుగ స్వీకరణీయ మగు వ్యభిచారి భావముల నభివ్యంజించు శబ్దార్థముల జ్ఞానము పుట్టదు ఒక్క క్షణములో నున్న రెండు జ్ఞానములకు ప్రతిబధ్య ప్రతిబంధక భావము ఒప్పుట లెస్సకాని యున్నదానికి లేనిదానికి ఒప్పుట యెట్లు సంగతమగును? అట్లు ఒప్పుటకు ప్రమాణమును లేదు పోనీ జ్ఞానములు లేకున్న వాని సంస్కారములు కలవుకదా వానికి ప్రతిబధ్య ప్రతిబంధక భావము ఒప్పుదము అందురేని అవి యుద్బుద్ధములై నప్పుడుకదా? అందులకు సంస్కారములకు ఉద్బోధకసామగ్రి వల యునుగదా? ఒక్క క్షణములో విరుద్ధములగు రెంటికి నొక్క యుద్బోధకత ఎట్లు కుదురును? భిన్నములు మఱి యేవి కుదురును?

ఆ యుద్బోధకములకు నిష్పాదకసామగ్రి వలయునుగదా ? ఆ యుద్బోధకములకును విరోధము వలయుఁగదా ఇట్లు అనవస్థ దురతిక్రమణీయము అందుచే భావములకు పరస్పర ప్రతిబధ్య ప్రతిబంధకము స్వీకార్యము కాదు

ఇంకొక బాధయు కలదు ఒకవేళ ఎట్లేని భావములకు రసములకుంబోలెఁ బ్రతిబధ్య ప్రతిబంధకభావము కల్పించిన భావశబలతకు ఉచ్ఛేదము ఆపాదించును విరుద్ధ వ్యభిచారిభావ సమావేశ రూపము కదా భావశబలత ఇట్లు సర్వాలంకారికులు సమ్మతింతురు మఱి ఆ వ్యభిచారిభావములకు ప్రతిబధ్య ప్రతిబంధకభావ మున్న అవి ఉత్పన్నములే కాకపోవును

[శంక] అట్లైన రసనిష్పత్తికిని వ్యభిచారిభావములకుం బోలె పరస్పర ప్రతిబంధకత్వము లేకపోవుఁగాక

[సమా] అది సరికాదు రసనిష్పత్తి కన్నను స్వవిరోధి రసాంగాభివ్యక్తిచే ప్రతిబంధము సహృదయానుభవసిద్ధము ప్రామాణికము అందుచే రసములకే ప్రబలము లగు విరోధ్యంగముల యభివ్యక్తిచే ప్రతిబంధకత్వము న్యాయ్యము వ్యభిచారిబావములకుఁ గాదని నిగ్గు

(౫) ప్రకారాంతరమునను రసవిరోధనివృత్తి కలుగును ఎచ్చట సాధారణ విశేషణ మహిమచే పరస్పర విరుద్ధ రస (భావ) ములకు అభివ్యక్తి యుండునో అచ్చోటను విరోధము నివర్తిల్లును.

ఉదాహరణము —

ఒకరాజు వర్ణనము —

నితాంతం యౌవనోన్మత్తాః
గాఢరక్తాః సదాహవే
వసుంధరాం సమాలింగ్య
శేరతే వీర, తే౽రయః.

యౌవనోన్మత్త చిత్తు లత్యంత రక్తు
లైన నీ వైరిబృందము లాహవమున
జ్మాతలేశ వసుంధరఁ గౌఁగిలించి
కొంచు శయనించినారు వీక్షింపుమయ్య

ఓ వీరుఁడా 'నితాంత యౌవనోన్మత్తులు గాఢరక్తులు నీ వైరులు రణవసుంధరను సదా ఆలింగనము చేసికొని పరుండి యున్నారు

ఇట 'యౌవనోన్మత్తులు' [(1) యౌవనగాఢోన్మత్తులు యౌవనప్రాయోన్మత్తులు] గాఢరక్తులు [(1) మిగుల రక్తమున దోఁగినవారు (2) నిగాఢానురక్తి గలవారు] అను విశేషణముల మహిమచే మొదట మరణప్రతీతి కలుగఁగా కరుణరసాభివ్యక్తి వెనుక శృంగారరసాభివ్యక్తి ఇట్లు ఉభయ రస సాధారణ విశేషణ బలమున ప్రతీయమానములైన కరుణ శృంగారముల విరోధము నివృత్తమైనది

రసగంగాధరము

పరివస్యావివరణసముల్లసితము

అ. 7 రస దోషములు

(1) వ్యంగ్యవాచ్యతాదోషము

ఇట్లు అవిరోధము సంపాదించిన రసమును సామాన్యముగ రస శబ్దముచేఁ గాని, విశేషించి శృంగారాది శబ్దములచేఁ గాని వచింపరాదు. [వాచ్యము చేయఁదగదని భావము.] అట్లొనర్చిన అది ఆస్వాద్యము కాకపోవును రసాస్వాదము వ్యంజనామాత్ర నిష్పాద్య మని మున్నె వచించినారము గుడశర్కరాదుల మాధుర్యము శబ్దముల వచింపరాక కేవల రసనేంద్రియ [ప్రత్యక్షగ్రాహ్య మగు నట్లే] ఆస్వాద్య మైనట్లే శృంగారాది రససారస్యమును వ్యంజనాఖ్య రసనైకగ్రాహ్య మగును శబ్దముల నభిధేయ మగునది కాదు

[శంక] పోనీ వ్యంజనచే గమ్యము లైనను అభిధచే వచింపఁబడిన నేమి తప్పు ?

[సమా] వినుఁడు ఎచ్చోట విభావాదులచే అభివ్యక్తము రసము సామాన్యముగ స్వశబ్దముచే (రసశబ్దముచే) బోధింపఁబడునో అచ్చోట దోష మేమందురా వమనాఖ్యదోషము వ్యంగ్యమును వాచ్యీకరించుటచే నది కలుగును [మున్ముందు చెప్పెద నని గ్రంథ కర్త వచించెఁగాని గ్రంథము అసంపూర్ణ మగుటచే అది ఘటిల్ల లేదు] భుజించిన పదార్థములను వమనము చేయుటవంటిది. వ్యంజనచే

గ్రహింపఁబడిన యర్థమును మఱల నభిధావృత్తిచే గ్రహించుట జుగుప్సాకర మని భావము ఇది సకల వ్యంగ్య సామాన్య దోషము

ఇట్లు సామాన్యముగ రసాది శబ్దములచేఁగాని శృంగారాది శబ్దములచేఁగాని విశేషించి వాచ్యమొనర్చిన నో నిరర్థకత్వము అను విశేష దోషమును పైవచ్చుగా నుప్పతిల్లును ఇది యెట్లన రసస్థలమున రసము నియతముగ వ్యంజనావ్యాపారముచే వ్యంగ్యరూపముగనే ఆస్వాద్యమగును. ఇంకొక రూపమున (వాచ్యాది రూపమున) కానే కాదు అందుచే వైయంజనికాపరోక్షజ్ఞానవిషయాస్వాద్యత్వము రసత్వము - రసమునందు నియతముగ నున్న యసాధారణ ధర్మము అట్లు వ్యంగ్యముగనే ఆస్వాద్యమాన మగును కావుననే రసము చమత్కార సారభూత మగుట అందుచే ఆస్వాద్యతావచ్ఛేదక రూపమున నియతాస్వాదకత్వ ధర్మ విశిష్టముగ ప్రత్యయజనకముకాదు రసస్థలమున వాచ్యవృత్తి అందుచే వాచ్యవ్యాపారము రసస్థలమున కాపేయకల్పము - కపిచేష్టాసదృశము స్థానాస్థానౌచిత్య జ్ఞాన విరహిత ప్రసక్తము నిరర్థకము అస్వరసము నగునని భావము

(౨) అట్లే, స్థాయిని రత్యాదిని స్వశబ్దవాచ్యము నొనర్చుటయు దోషమే

(3) అట్లే వ్యభిచారిని హర్షాదిని స్వశబ్దవాచ్య మొనర్చుటయు దోషము [రసస్యోక్తిః స్వశబ్దేన స్థాయిసంచారిణో రపి సా ద]

ఈ దోషమునకు ఉదాహరణములు —

(౧) రసశబ్ద వాచ్యత్వమునకు —

తా ముద్వీక్ష్య కురంగాక్షీం రసః కస్య న జాయతే
చంద్రమండల మాలోక్య శృంగారే మగ్న మాంతరమ్

ఆ మృగాక్షిని జూచినవాని కెవనికి అనురాగము (రసము) ఉదయింపదు ? చంద్రమండలమును జూచి ఎవని హృదయము శృంగార నిమగ్నము కాకుండును ?

(౨) శృంగారాది శబ్దముల స్వశబ్ద వాచ్యత్వమునకు ఉదా -

శృంగారీ గిరిజాననే సకరుణో రత్యాం ప్రవీరః స్మరే,
బీభత్సోఽస్థిభి రుత్ఫణీ చ భయకృ న్మూర్త్యాద్భుత స్తుంగయా
రౌద్రో దక్షవిమర్దనే చ హాసకృ న్నగ్నః ప్రశాన్త శ్చిరాత్
ఇత్థం సర్వరసాత్మకః పశుపతి ర్భూయాత్ సతాం భూతయే
(శృం. తిలక. హేమ.)

గిరిజయొక్క మొగమును చూచునపుడు శృంగారమూర్తియు, రతీదేవియెడల కరుణమూర్తియు మన్మథునియెడల వీరరసాకృతియు అస్థిమాలచేత బీభత్సరసరూపుడును పాములను తాల్చుటచే భయానకమూర్తియు సర్వోన్నతుఁ డగుటచే నద్భుత రసాకారియు దక్షవిమర్దనమునందు రౌద్రాకృతియు దిగంబరుఁ డగుటచే హాస్య రసాకృతియు స్వరూపానుసంధానమున శాంతరసమూర్తియు నైన శివుఁడు సత్పురుషులను పాలించుగాంక.

(3) స్థాయిభావవాచ్యత్వమునకు ఉదా —

శివే శృంగారార్ద్రా తదితరజనే కుత్సనపరా,
సరోషా గంగాయాం గిరిశనయనే విస్మయవతీ
హరాహిభ్యో భీతా సరసిరుహ సౌభాగ్యజయినీ
సఖీషు స్మేరా తే మయి జనని దృష్టి స్సకరుణా.
(సౌం. లహరి)

ఓ తల్లీ, నీచూడ్కి శివునియెడ శృంగారరసాత్మక మైనది, పసులయెడ రోతపడునది గంగయెడ రోషము వహించునది శివుని కనులకు వింత గొల్పునది శివుని భూషణములగు సర్పములకు జంకు నది పద్మముల సౌభాగ్యమును తిరస్కరించునది చెలులయెడ స్నిగ్ధ మైనది నాయెడల దయామయ మైనది

(3) వ్యభిచారి భావముల వాచ్యత్వమునకు ఉదా —

సవ్రీడా దయితాననే సకరుణా మాతంగ చర్మాంబరే
సత్రాసే భుజగే సవిస్మయరసే చంద్రే ఽ మృతస్యందిని
సేర్ష్యా జహ్నుసుతావలోకన విధౌ దీనా కపాలోదరే
పార్వత్యా నవసంగమప్రణయినీ దృష్టిః శివాయాఽస్తు వః

భర్త మోమునెడ సిగ్గటియు గజచర్మమునెడ జాలిచూపు నదియు పాములయెడ భయము నొందునదియు నమృతస్యంది యగు చంద్రునియెడ వింతపొందునదియు గంగా వీక్షణమున ఈర్ష్యాభువును శివుని భిక్షాపాత్ర మగు కపాల విషయమున దీన మైనదియు నైన, నవసంగమవేళ శివుని క్రొత్తగాఁ జూచుచున్న పార్వతీదేవిదృష్టి మీకు శుభముల నిచ్చుగాక

దోషవిషయ పర్యాలోచనము

విశిష్టవిభావాదిసామగ్రీసముల్లసిత మైన రసాది స్వశబ్దవాచ్య మైన మాత్రన దోషప్రసక్తి లేదని ఆంధ్రధ్వన్యాలోకకర్తలు శ్రీమాన్ వేదాల తిరువేంగళాచార్యులవారు సప్రపంచము ప్రతిపాదించినారు [చూ ఆం ధ్వన్యాలోకము (3) ఉద్యో పు 546 – 555] తత్సార సంగ్రహ ప్రతి —

వ్యంగ్యమగు నర్థము వాచ్యమగుట దోషము వమనాఖ్యము అని కొందఱు వచింతురు అది విచార్యము, (1) రసభావాదులు (2) వస్త్వలంకారములు ఇవికదా వ్యంగ్యములు ఇందు ఈ దోషము రసభావములకా? వస్త్వలంకారములకా? రెంటికినా?

మొదటిపక్షము రసభావాదుల కనుట - ఉపపన్నము కాదు ఏలన రసభావాదుల కెన్నఁడును వాచ్యత్వము లేదు వానికి వ్యంగ్యత్వమే సార్వత్రికము అది ఒకటే దశ వానికి వాని కాపాదింపఁదగిన దోషము చమత్కారాపకర్ష రసభంగ మొక్కటే విభావాది కారణ సామగ్రిచే రసభావాదిసముల్లాసము కలుగును ఆ సామగ్రి యుండ వానిచే రసాస్వాదము కలుగుచుండ రసభావాది స్వశబ్దోపాదాన మాత్రమున అదెట్లు భంగ మొందును? ఆ శృంగారవిస్మయాది శబ్దము లున్నను అవి రసభావాదుల బోధింపనేరవు వ్యంజనా వ్యాపారమాత్రవేద్యములు రసభావాదులు, అభిధావేద్యములు కానే కావు శృంగారాది పదములుగూడ రసోద్దీపకము లగుచో విభావాది సామగ్రిచే నుద్దీపితము లైనవానికి పదములచేఁ బునరుద్దీపనము కల్గుట యొక వేళ సంభవించిన నిరర్థకతాదోష ముప్పతిల్లఁదగును కాని ఏపదములకును రసోద్దీపనయోగ్యతయే లేదు పునరుద్దీపన శంకకు ఇఁక ఆస్పద మేది? అందుచే దోషప్రసక్తి లేదు

రసభావాదులు సహజ చమత్కారములు అలక్ష్యక్రమ వ్యంగ్యములు చమత్కారఘనములు వానికి - వస్త్వలంకారము లవంబోలె 'గూఢతా' కృత చమత్కారత్వము లేదు అసంలక్ష్య క్రమ వ్యంగత్వముచేతనే అత్యంతశీఘ్రముగ చమత్కారము స్ఫురించును అందుచే అభిధా సహకృత వ్యంజనాగూప మగు గూఢత తో అక్కఱ లేదు ఉక్తిగోచరములు అవి కానేకావు కావున వాని

యుక్తిగోచరత తొలగిపోవునని భయము లేదు. విశిష్టవిభావాది సామగ్రిచే రసాస్వాదము కలుగుటంజేసి ఆ చోట శృంగారాది పదములు ఉపాత్తము లైనను కేవలము అనువాదప్రాయము లగును వానిచే రసాభివ్యక్తిగాని రసభంగముగాని కానేరదు. వానివలన దోష ముప్పతిల్ల నేరదు.

ఇంక రెండవపక్షము - వస్త్వలంకార వ్యంగ్యములకు ఆ దోష మనుటయు సరిపడదు. వస్త్వలంకారములకు రెండుదశలు కలవు - వాచ్యత్వము (అగూఢత్వము) వ్యంగ్యత్వము (గూఢత్వము) అని. వాచ్యత్వదశయందున కన్న వ్యంగ్యత్వదశయందు వానికి చమత్కారము అధికము. వస్త్వలంకారముల వ్యంగ్యత్వము సంలక్ష్యక్రమము వాని చమత్కారము (అసంలక్ష్యక్రమ చమత్కారము వలెగాక) 'గూఢతా' కృతము. గూఢత యన అభిధా వృత్తిచే నస్పష్ట మగుట. అభిధాసహాకృత వ్యంజనావ్యాపార మొండె. దానిచే వస్తుధ్వని అలంకారధ్వని చమత్కారము కలుగును. అట్టి వస్త్వలంకారములు ఏరీతిన నైనను ఉక్తిగోచరము లగుచో - తచ్చమత్కారబీజము 'గూఢత' విధ్వస్త మగును. అప్పుడు వస్త్వలంకారరూపవ్యంగ్యార్థము 'వాచ్యాయమాన మగుటం జేసి" (అగూఢతచే) వాచ్యమున కన్న న్యూనచమత్కార మగును - అనగా గుణీభూతవ్యంగ్యము లగును. కాఁగా వస్త్వలంకారములు స్వశబ్దవాచ్యము లైనచో, ఉక్తిగోచరము లగుటం జేసి కొంత చమత్కారమును కోల్పోవును. ఎట్లన అవి సంలక్ష్యక్రమములు కావున మొదట వాచ్యము ప్రతీతమగును. వాచ్యకారణసామగ్రి - (విభావాది) సంలక్ష్యమైన పిమ్మటనే వ్యవధానమున వ్యంగ్య ప్రతీతి కలుగును. ఇట్లు [అసంలక్ష్యక్రమమునందుం బోలె ఝటితిస్ఫూర్తి కలు

గక] వ్యంగ్యము వేద్యమగుటకు కాలవ్యవధానము పట్టును తద్గూఢత విధ్వస్త మగును అందుచే వ్యంగ్యచమత్కారము సన్నగిలును [భగ్నముకాదు] అదే గుణీభూతవ్యంగ్యకావ్యము ఇది ధ్వని కావ్యమునకు రెండవది చమత్కార విధానమే ఇందును రసభంగ దోషము వస్త్వలంకారములకు స్వశబ్దోపాదానముచే కలుగుటకు అస్పదము లేదు గూఢత వస్త్వలంకారధ్వని చమత్కారబీజము కావున స్వశబ్దోపాదానముచే - ఉక్తిగోచరత్వముచే ఆ గూఢత ధ్వస్తము కాఁగా, వస్తుధ్వనిగా అలంకారధ్వనిగా సముల్లసించు వస్త్వలంకారముల చమత్కారాధిక్యము సన్నగిల్లి గుణీభూతవ్యంగ్యత్వము ఆపాదించునే గాని, భంగమై దుష్టములు కానేరవు అందుచే ఇచటను వమనాఖ్యదోషప్రసక్తి లేదు

కావ్యప్రకాశవ్యాఖ్యాత వామనాచార్యఝళ్కీకరులు ఇట్లు వచించిరి అనుభావాదులచే అభివ్యక్త మగునపుడే రసభావాదుల చమత్కారాస్వాదమునకు ఉత్కర్ష యేర్పడును వాచ్యము లగునప్పుడు గూఢత పోవును కావునఁజమత్కారాస్వాదములు అపకృష్టములగును దీని పర్యవసాన మిది అనుభావాదులవలన (స్ఫుటముగా) వ్యక్తము కాఁగల రసభావాదులు స్వశబ్దవాచ్యము లగుట వమన దోషము అట్లు స్ఫుటముగా వ్యక్తము కాఁజాలనివానిని శ[illegible]క్తి బోధించినను దోషములేదు. కావుననే న దోషః స్వపదేనోక్తా వపి సంచారిణః క్వచిత్' అని ముందు మమ్మటుని వ్రాఁత ససిపడును అని ఈ వ్యాఖ్యాత (౧) రసభావాదులు ఒకప్పుడు అనుభావాదులచే అభివ్యక్త మగునని, మఱొకప్పుడు అట్లు కావని తలంచినట్లున్నది అది సరికాదు రసభావాభివ్యక్తి సార్వత్రికముగ అనుభావాదుల చేతనే (౨) రసభావాదులకు స్వశబ్దవాచ్యము లగునపుడు

గూఢత పోవునని స్ఫుటాభివ్యక్తి ఉండదనియు నతఁడు అభిప్రాయపడినట్లున్నది రసభావాది చమత్కారము గూఢతాకృతము కానే కాదని వస్త్వలంకారముల చమత్కారమే గూఢతాకృత మని యుండే స్పష్టము (3) రసభావాదులు విశిష్టవ్యంజకము లున్నప్పుడు అస్ఫుటాభివ్యక్తము లగు ననుటయు సరికాదు

సర్వేష్వేవ ప్రభేదేషు స్ఫుటత్వేనావభాసనం
యద్వ్యంగ్య స్యాంగభూతస్య తత్పూర్ణం ధ్వనిలక్షణమ్'

అని స్ఫుటత్వావభాసనమే ధ్వనిలక్షణము స్పష్టముగా నభిధచే మాటలఁ జెప్పనొల్లని యర్థమునే విదగ్ధులు వ్యంజనచే సూచింతురు అది స్పష్టము కాకున్న నెట్లు ? అందుచే సైజముగ ధ్వని స్పష్ట రూపము కాని ధ్వనిసముల్లాసము వ్యంజకాధీనము

రసభావముల యభివ్యక్తి స్ఫుటమగుటయు కాకపోవుటయుఁ దద్వ్యంజకముల స్ఫుటత్వాస్ఫుటత్వములఁ బట్టియే స్వశబ్ద వాచ్యత్వముచే రసభావాదులకు స్ఫుటాభివ్యక్తియు లేదు అస్ఫుటాభివ్యక్తియు లేదు అభివ్యక్తియే లేదు రసభావాదులకు వాచ్యత్వదశ ఎప్పుడును లేదు కావున ఎన్నఁడు లేనిది ఒకప్పుడేని ఎట్లు వచ్చును?

(౪) వ్యభిచారిభావముల యభివ్యక్తియు అనుభావముల చేతనే అందుచే అనుభావాభివ్యక్తి రసాదుల విషయమున నెంత స్ఫుటమో వ్యభిచారిభావముల విషయమున నంతే ఇటను వ్యంజకముల స్ఫుటతాస్ఫుటతలును సమానమే భేదము లేదు ఇట భేదకల్పనము అప్రామాణికము ఇంతటికిఁ దత్త్వ మేమన స్వశబ్దముచే వ్యంగ్యము లుపాత్తము లైనచోట దోషము లేకపోవుటేకాదు కొన్ని

వాటుల సంశయము పోయి వైశద్యాధిక్యమే కల్గినది ఉదా —
ఔత్సుక్యేన కృతత్వరా ?' మున్నగు స్థలములందు - ఇట
కృతత్వరా - రోష భయాదులచేతను త్వర కల్గును ఉత్కంఠ
చేతను కల్గును ఇట దేనిచేత ? అను సంశయము కల్గఁగా ఔత్సు
క్యేన అని వ్యభిచారిభావము వాచ్యమగుటచేత సంశయ మపనయించి
నది వ్యభిచారిభావములందే ప్రసక్త్యాత్రకల్పముగా రసానుభవము
కల్గును వ్యభిచారిభావములపట్ల స్వపదగ్రహణము దోషము
కాకపోవుటేల ? రసవిషయమున దోష మగుటేల ? ఇట నిజమునకు
వ్యభిచారిభావముల విషయమున దోషము కాకపోవుట న్యాయ్యము
అట్లే రసవిషయమునను ఇట్లు సర్వత్ర వ్యంగ్యములకు స్వపద
గ్రహణము దోషము కాదని సిద్ధాంతము

ఈ విషయమున నిదియు పర్యాలోచనీయము రసాస్వాద
విషయమున భరతముని ఉదాహరణము నొసంగెను పానకము
నాస్వాదించిన రసజ్ఞునకు అది పానక మని దానిరసము మధురము
అని మాటల ననగత మైనంతనే పూర్వము స్ఫురించిన రసము భంగ
మగుట అనుభవసిద్ధమా ? అట్లే ప్రకృతమునందును - కావ్యరసాది
పట్లను అవగంతవ్యము

(2) విభావానుభావముల కృచ్ఛ్రప్రతీతి

కవి విభావాదులు లెస్సగా అసందిగ్ధప్రతీత మగునట్లు నిబం
ధింపవలెను అట్లొనర్పనిచో వాని సమ్యక్ప్రత్యయము కలుగదు
రసాపకర్ష కలుగును

ఉదా — వ్యాఘ్రము విభావ మగుట రౌద్రవీరభయానకా
ద్భుతరసములలో ఘటిల్లును అనుభావవ్యభిచారిభావముల సముచిత

ముగ వర్ణించినచో ఏ రసమునకు వ్యాఘ్రుము విభావమో స్పష్ట మగును అట్లు చేయనినాఁడు అస్పష్టప్రతీతిచేతను విలంబ ప్రత్యయముచేతను ప్రకృతరసము అతిక్లేశముచం గాని అభివ్యక్తము కాదు

ఉదా —

బహుశో విలురతి మోహం వ్రజతి రతిం ద్రాగపాకురుతే
అయ మతివికలః సంప్రతి కరోమి కిం త న్న జానే౽హః
(కావ్యా ని

ఈతడు మిక్కిలిగా దొర్లుచున్నాడు మోహము నొందు చున్నాడు. రతిని తిరస్కరించు చున్నాడు వికలుఁడై యున్నాడు ఇప్పుడు నేను చేయవలసిన దేదియో పాలుపోవుటలేదు

ఇది శృంగారకరుణములలో దేనికి ఉదాహరణమో స్పష్టము కాదు విలురనాదులు అనుభావములు కరుణశృంగారములందును కలుగును అభిమతమైన శృంగారరసవిభావము కామినీరూపము ఇట ఉపాత్తము కాలేదు అనుభావములచే నాక్షేపించుకొనను శక్య మగుట లేదు అందుచే విభావము కష్టపడి కల్పింపఁదగియున్నది

అట్లే అనుభావముల సమ్యక్ప్రత్యయము లేనప్పుడు విలంబ మునఁ బ్రతీతమగునపుడును దోషము వాటిల్లును

ఉదా —

వహతి పటీరసమీరే నవజలధర బంధురే నభసి
కించి దుదంచన్నయనా దృష్టిపథం సా గతా మూనః
(కావ్యాకిని)

చల్లని గాలి వీచుచుండఁగా ఆకసము క్రొమ్మొయిళ్ళఁ గాను కొనఁగా ఆ దరవికసితాక్షి యువకునికి దృగ్గోచర యాయెను

ఇట నాయికారూపాలంబనవిభావము పటీరసమీరాది రూపోద్దీపనవిభావములును శృంగారోచితములు కలవు ఇందు అనుభావములు లేమిం జేసి ఈ విభావములు శృంగారపర్యవసాయు లగుట లేదు కించి దుదంచన్నయనా అనుటచే భావము చెప్ప బడిన దనరాదు రసము యన్నిష్ఠమో తన్నిష్ఠముగ అనుభావమును చెప్పవలెను ఇట అట్లు లేదు నాయకనిష్ఠము రతి కించిదిత్యాదిచే నాయికానిష్ఠము అనుభావము చెప్పబడినది విభావములచేతనుం గూడ ఆక్షేపసాధ్యమునుం గాదు అందుచే ఆ యువకుఁడు శృంగా రియా? విరాగియా అన గమకము లేదు ఇటు ఇట్టో అనుభావ ముల కష్టకల్పన

(3) విరోధిరసాంగగ్రహణము

సమబలములుగాని ప్రబలములు గాని యైన విరోధి రస ముల యంగములను (విభావాదులను) నిబంధించిన ప్రకృత రసము నకు ఇటు తెఱంగు చేటు వాటిల్లును సమబలము లైనచో, ప్రకృత రసము విరోధిరసమును సుందోపసుందన్యాయమున హత మగును విరోధిరసము ప్రబలమైనచో మాత్స్యన్యాయమున - బలీయము బలహీనమును కబళించునట్లు - ప్రకృతరసమును భంజించును

ఉదా —

రామమన్మథ శరేణ తాడితా దుస్సహేన హృదయే నిశాచరీ
గంధవద్రుధిరచందనోక్షితా జీవితేశవసతిం జగామ సా
(రఘు స ౧౧ శ్లో 20)

దుస్సహ మగు రాము డను మన్మథుని శరముచే హృదయము నందు తాడితయై యీ నిశాచరి పరిమళముల నీరు రుధిరచందనము నలదికొని జీవితేశుని సదనమున కేగెను ఇట కరుణరసము ప్రకృతము విరుద్ధమైన శృంగారము తత్పోషకముకాదు ఇట శ్రీరామునిచే తాటక సంహరింపఁ బడెనని (కరుణరసము స్ఫురింపక దాని నతిక్రమించి యుల్లసించు శృంగారముచే తాటక కై సేసికొని తనప్రియుని సరసకుఁ బోయెనని (శృంగారము) ప్రకాశించును అందుచే దోషము. ఇది ప్రకృతప్రతీపదోషము

విరోధిరసాంగ్రగహణమునకు ఉదా —

మానినిని ప్రియనుగూర్చి ప్రియుని యనునయ వాక్యము —

ప్రసాదే వ ర్తస్వ ప్రకటయ ముదం సంత్యజ రుషం
ప్రియే శుష్యంత్యంగా న్యమృత మివ తే సించతు వచః
విధానం సౌఖ్యానాం క్షణ మభిముఖం స్థాపయ ముఖం
న ముగ్ధే ప్రత్యేతుం ప్రభవతి గతః కాలహరిణః
(సుభాషితావళి హేమ)

ఓ ప్రియా ప్రసన్నురాలవు కమ్ము హర్షమును ప్రకటింపుము రోసము నుజ్జగింపుము అమృతమువంటి నీ మాటలచే శుష్యమాణము లగు నా యంగములను దడుపుము సౌఖ్యముల నిధానమగు నీ నెమ్మోమును ఒక క్షణము నా కభిముఖముగా నిలుపుము ఓసి ముద్దరాలా గడచిపోయిన కాలహరిణమును మరలింపఁ దరముకాదు

ఇట కాలహరిణము చపలము వడివడిఁ బఱతెంచును అని ప్రకృత శృంగార ప్రతికూల మైన (నిర్వేద స్థాయికము) శాంతరసము

యొక్క విభావము అనిత్యత్వప్రకాశనరూపము గ్రహింపఁబడినది అందుచే దోషము

ప్రతికూలరసానుభావగ్రహణమునకు ఉదా—

నిభృతం దృక్పథయాతే దయితే గురుసన్నిధౌ
సర్వం సద్మని సంత్యజ్య వనం వ్రజతి సున్దరీ

ప్రియుఁడు ప్రచ్ఛన్నముగా గురుసన్నిధియందు దృక్పథమునకు రాఁగా ఆ సుందరి ఇంటిలోని సర్వము వదలి వనమునకుఁ బోయెను

ఇట నిర్వ్యాజ సర్వపరిత్యాగము వనగమనము శాంతానుభావములు శృంగారరసప్రతికూలములు ఇంధనాద్యాహరణ వ్యాజమున ఉపభోగార్థము వనగమనము అగునేని దోషములేదు శృంగారరసానుకూలము కావున

పై రెండు ఉదాహరణములందును విరుద్ధరసములు అబాధ్యములుగా నిబద్ధములు అబాధ్యత్వ మన అశక్యాభిభవత్వము అట్లుగాక దుర్బలమగు విరోధిరసముల యంగముల నిబంధించిన దోషము కాకపోవుటే కాదు గుణము నగును

ఉదా —

సత్యం మనోరమాః కామాః సత్యం రమ్యా విభూతయః
కింతు మత్తాంగనాపాంగ భంగలోలంహి జీవితమ్

కామములు మనోహరము లనుట నిజము ఐశ్వర్యములు రమ్యము లనుటయు నిజమే. కాని జీవిత మన్ననో సుందరి కడగంటి

మూపులవలె చంచలమైనది ఇట శ్లోకాద్యార్ధము బాధ్యముగా చెప్పఁబడినది ద్వితీయార్ధము జీవితాస్థిరత్వము ప్రసిద్ధోపమానముచే అతి బాధకముగా చెప్పఁబడినది ఇట శాంతరసనే ప్రధానము శృంగారాంగముల ప్రతిపత్తి లేమింజేసి తద్రసప్రసక్తి లేదు

ఉదాహరణాంతరము —

దంతక్షతాని కరజైశ్చ విపాటితాని
ప్రోద్భిన్నసాంద్రపులకే భవతి శ్శరీరే
దత్తాని రక్తమనసా మృగరాజవధ్వా
జాతస్పృహై ర్మునిభిర ప్యవలోకితాని

శిశువును కని దానినే భక్షింపఁగడంగిన యాఁడుసింగమునకు తత్కిశోరమునందు దయగాని తత్పరిత్రాణార్థము స్వశరీర మర్పించు చున్నట్టి యొకానొక బోధిసత్త్వుని గూర్చి ఒకానొకని మాటలు —

ఓ దయామయా నీ శరీరమందు - అనురక్తునియందలి ప్రేమచే దంతక్షత నఖక్షతము లొనరించు మృగజాతీయరాజ వధువు చేతనుంబోలె - ఈ యాఁడుసింహము దంతములతోను నఖముల తోను గాయము లొనర్చెను [రాగికింబోలె] విరాగికి నీకు పరపరిత్రాణ జనితానందభరమున శరీరము పులకనిబిరీస మయ్యెను మన మును ఎన్నఁడు మన శరీరమును పరార్థము వినియోగించి చరితార్థుల మగుదుమా అని మునులు చూచుచున్నారు

ఇట తొలుత అనురక్తనాయికాకృత సంభోగశృంగారరసము స్ఫురించును పిమ్మట ప్రకరణబలమున శృంగారము నతికరించి ప్రధానరసము శాంతము సముల్లసించును శృంగారశాంతములు

విరుద్ధరసములైనను శృంగారము అంగమై శాంతరసమును పరిపో షించుచున్నది అందుచే విరోధములేదు. దోషమును వారించినది

(4) విచ్ఛిన్నాంగ పునరుద్దీపనము, పరిపుష్టరస పునరుద్దీపనము

కావ్యమునఁ బ్రకృతమైన రసము ప్రసంగాంతరమున విచ్ఛిన్న మైపోవఁగా తత్పునఃపునరనుసంధాన మొనర్చిన అప్పుడు సహృ దయచిత్తములందు సమగ్రరసాస్వాదము కలుగదు అట్లే పరిపోష మును పొందినట్టి రసమున కైనను పౌనఃపున్యమున నుద్దీపనము చేయుటయు దోషమే అది ఉపభుక్తమై పరిమ్లానమై విగతపరిమళమైన కుసుమస్తబకమును మాటిమాటికి మూర్కొనుటవలె సహృదయులకు ఆస్వాదాపకర్షను కలిగించును

విభావానుభావ సామగ్రీ పరిఘటిత శరీరమైన (రసయిత్రు రసనయోగ్య మగు) రసమునకు పునఃప్రకాశనము మాలతీకుసుమ విమర్దనమువలె అననుగుణమే ఏలన, ధారాప్రాప్తము కాఁగా రసము తదావిష్టులును తత్పరవశులును అగువారికి ఉక్తి అల్పతరముగా నుండును అట్టి దశయందును మహాకవుల ముఖముల నుండి రెండు మూఁడే శ్లోకములు నిర్యాతము లగును అందుచేతనే తాపసవత్సరాజ నాటకమున ధారాప్రాప్తము కరుణరసము ద్వితీయాంకమున స్వల్ప ముగ కవి నిబద్ధ మైనది

(హైమ. కావ్యానుశాసనవివేకము)

అట్లే ధ్వనికారులును ఆనతిచ్చినారు —
పరిపోషం గతస్యాపి పౌనఃపున్యేన దీపనమ్
రసస్య స్యాత్ విరోధాయ అని

ఉదా —

కుమార సంభవమున రతివిలాపఘట్టమున అథ మోహ పరాయణా ఇత్యాదిచే దీప్తి నొందింపఁబడినదయ్యు కరుణరసము అథ సా పునరేవ ఇత్యాదిచే పునఃపునరనుసంధానము చేయఁబడినది అందుచే రసాపకర్షకముగ పరిణమించెను

(5) అసమయ ప్రకాశనము

తత్తద్రసప్రస్తావనానర్హమైన సమయమున ప్రస్తావము సంధ్యావందన దేవయజనాదివర్ణనము చేయుటకు ఉచితమైన సమయమునను మహావీరసంగ్రామము ప్రవర్తిల్లుచుండు సమయమునను నాయకుని శృంగారప్రవృత్తిని వర్ణించుట ఉదా —

వేణీసంహారమున ద్వితీయాంకమున భానుమతితోడ భీష్మ ప్రముఖ మహావీరక్షయకారి మహాహవసంరంభసమయమున ధీరోద్ధతప్రకృతి యైన దుర్యోధనుని శృంగార వ్యాపృతి వర్ణనము

(6) అసమయ విచ్ఛేదనము

అట్లే విచ్ఛేదానర్హమైన సమయమున విచ్ఛేదమును దోషమే రోషోద్ధతులై శత్రువులు ఎదుట నిలిచి యుండ మర్మభేదకములైన మాటలు పలుకుచుండ వీరరసమో రౌద్రరసమో నిరవచ్ఛిన్నముగా

కొనసాగింపవలసిన సమయమున తదనుచిత మగు సంధ్యావందనాది నిబంధనము అనర్థా రసవిచ్ఛేద హేతుక మగును ఉదా —

మహావీర చరితలో ద్వితీయాంకమున రాఘవభార్గవుల వీర రసము అధిరూఢదశయం దుండ శ్రీరాముడు కంకణమోచ నార్థము పోవుచున్నా ననుట రత్నావళి నాలవయంకమున సాగరి కోదయనుల ప్రేమ వృత్తాంతము ఉత్కర్షముగానుండ రాజు దాసిని విస్మరించి విజయవర్మవృత్తాంతము వినును ఇది పాయసములో పుడకవంటిది

ఇట్లే అప్రధానములైన ప్రతినాయకాదులు నానావిధ చరిత ములను బహువిధసంపదలను నాయక సంబంధములైన చరిత్ర సంబంధములకన్న మిన్నగ వర్ణింపరాదు అట్లొనర్చిన వర్ణింప నిచ్ఛ గించిన నాయకునకు ఉత్కర్ష సిద్ధింపకపోవును తన్నిమిత్తమున ప్రకృతరసాస్వాదమునకు భంగము కల్గును

[శంక] అట్లేల కావలెను ? ప్రతినాయకుని యుత్కర్ష ఎంత మిక్కుటముగ వర్ణించినను అతనిని పరాభవింప నిమిత్తమైన నాయ కుని విజయోత్కర్షకు అంగమే యగుంటజేసి ఏమిలోటు ?

[సమా] అట్లు వచింపరాదు ఎట్టిప్రతినాయకోత్కర్షాభివర్ణనము తదభిభావకుడైన నాయకుని యుత్కర్షకు ఉపకార మగునో అది మాకును సమ్మతమే తద్విరుద్ధ మైనదే నిషిద్ధము ప్రతినాయకుని యుత్కర్షను ఎంత వర్ణించినను దాని కాశ్రయుడైన ప్రతినాయకుని సంహర్త నాయకుడౌటచేతనే నాయకునకు ఉత్కర్ష సిద్ధించును కదా ? అందుచే ప్రతినాయకుని యుత్కర్షాతిశయ వర్ణనము దోషా వహము కానేరదు అనియు వచింపరాదు అట్లైనచో విషశర

ప్రయోగ మాత్రమున మహారాజును చంపిన నరాకశబరునికి ప్రకర్ష కల్గునా ? శబరునకు సంహర్తృత్వము కలదుకదా అదె యుత్కర్షాధాయక మంటిరికదా అట్లే సంహర్తృత్వ మాత్రమున నాయకునకు ఏ యుత్కర్షయు రాఁబోదు

(7) అంగిరసాననుసంధానము

రసమునకు ఆలంబనము ఆశ్రయము నైన వానిని పునః పున రనుసంధానము లేకున్న రసపరిపోషము కొనసాగదు ఏలన రసప్రతి ప్రత్తి తదంగాధీనమైనది కావున అంగిరసాంగములను పునఃపునరను సంధానము చేయకున్న తదాస్వాదనము విచ్ఛిన్నమగును అది దోషము

ఉదా.— వేణీసంహారనాటకమునఁ దొలియంకమునఁ దుదియంకమునందప్ప పాండవుల విషయము స్మరింపఁబడలేదు అభిమన్యు ప్రభృతులు మరణించినను ధర్మజాదుల ప్రస్తావనే లేదు రత్నావళి చతుర్థాంకమున బాభ్రవ్యుడురాగా సాగరిక విస్మృత యగుట

అనుసంధి సహృదయతాసర్వస్వము కదా అందుచే తాపసవత్సరాజ నాటకమునందు ఆఱంకములందు వాసవదత్తావిషయమగు ప్రేమబంధము కథావశమున విచ్ఛేదముగా శంక లేనట్లు సమస్తేతివృత్తవ్యాపిగా అనుసంధింపఁబడినది వాసవదత్తాభిగమమే ఫలముగా నిబంధింపబడినది

అట్లే అనంగప్రపంచనమును దోషమే ప్రకృతరసమునకు అనుపకారకమగు కథను వర్ణించుటయు ప్రకృత రసాస్వాద విచ్ఛేద కారణ మగును ఉదా.—

హయగ్రీవవధమునందు హయగ్రీవవర్ణనము అనేక సర్గములు విస్తరించి వర్ణింపఁబడినది అట్లే నాయకుని విప్రలంభశృంగారము వర్ణింప నుపక్రమించి కవి యమకానుప్రాసాద్యలంకార నిబంధన ప్రౌఢితో సముద్రాది వర్ణనాభోగనిమగ్నుఁ డగుట అట్లే హరవిజయమునందు ఈర్ష్యాకుపిత సత్యభామానునయప్రవృత్తుఁడగు హరి యొక్క పారిజాతహరణ వ్యాపారముచే నుపక్రాంతమగు విప్రలంభ ప్రస్తావమున సముద్రవర్ణనాది గడుస్థానీయముగ విస్తరింపఁ బడినది అట్లే కాదంబరియందు 'రూపవిలాస' అని మహావిప్రలంభ బీజ ముపక్షేపించి కవి తదనుపయోగులైన యటవీ శబరేశాశ్రమ ముని నగరీనృపాదివర్ణనములందు అతిప్రసంగాభినివేశము చూపెను హర్షచరిత్రమునందు హర్షోత్కర్షముతోఁబాటు మూఁడు ఉల్లాసములు బాణవంశాభివర్ణనము అప్రస్తుతము అట్లే శిశుపాల వధాదులందు ఆదినుండి వీరరసమునకు బీజోపక్షేపము చేసి తదసంగత శృంగారాంగభూత ఋతువనవ విహారపుష్పాపచయ మజ్జనాదియందు కవులు అత్యాసక్తి చూపిరి ఇట్లు అప్రస్తుతవస్తువిస్తృతి ప్రస్తుతరసప్రతీతిని వ్యవధానపఱచును అట్లయ్యు మహాకవుల గ్రంథములందు ఇట్టివి కొల్లగా నున్నవి వీనితత్త్వము వారలకే ఎఱుక (హేమ)

అనౌచిత్యదోషము

ఇట్లు భిన్నప్రకారముల నేర్పడిన దోషములు పూర్వోక్తములటుండ దోషముల నెల్ల ప్రధానము అనౌచిత్యము అది రసభంగహేతు వగుట అవశ్యము పరిహర్తవ్యము భంగ మన ఇసుక (పుల్లలు పీచు) మున్నగునవి పానకమునంబడి రసాస్వాదమున నేయరంతుదప్రతీతిని (మర్మవిచ్ఛేదక) విమాతకప్రతీతిని కల్గించునో అది (1) జాతి (2) దేశము (3) కాలము (4) వర్ణము

(5) ఆశ్రయము (6) వయస్సు 7 అవస్థ (8) ప్రకృతి (9) వ్యవహారము మున్నగు ప్రాపంచికవస్తుజాతము విషయమున ఏయే జాతి గుణ కర్మాదులు లోకమునుబట్టియు శాస్త్రమునుబట్టియు సిద్ధములో అవి ఉచితములు తద్భిన్నములు అనుచితములు

(1) జాత్యనుచిత మెట్లన గోవు మున్నగు సాధుమృగములకు ఓజోబలకార్యములను పరాక్రమాదులను వర్ణించుటయు సింహాది క్రూరసత్వములకు సాధుభావముల వర్ణించుట (2) దేశానౌచిత్యము-స్వర్గమున జరామరణాదులు భూలోకమున అమృతసేవనాదులు వర్ణించుట (3) కాలానౌచిత్యము-శిశిర ఋతువున జలవిహారాదులు గ్రీష్మమున చలిగాచుకొనుట [హర్షాదులు అయోమార్గప్రయాణము చేసినట్లు వర్ణించుట] (4) స్థానౌచిత్యము - బ్రాహ్మణునియందు వేట క్షత్రియునందు పరిగ్రహము శూద్రునందు వేదాధ్యయనము వర్ణించుట (5) ఆశ్రమానౌచిత్యము - బ్రహ్మచారియందు యతీశ్వరునియందును తాంబూలచర్వణము దారోపసంగ్రహము వర్ణించుట (6) వయోనౌచిత్యము - బాలవృద్ధులందు స్త్రీ సేవనము, తరుణునియందు విరాగము (7) అవస్థానౌచిత్యము - దరిద్రులయందు ఆఢ్యచరితము ఆఢ్యులయందు దారిద్ర్యము

(8) ప్రకృత్యనౌచిత్యము వివరించుటకు ముందు ప్రకృతి భేదము ఇంచుక ప్రతిపాదింపఁబడుచున్నది (1) నాయకాదులు ప్రకృతులు దివ్యములు అదివ్యములు దివ్యాదివ్యములు అని త్రివిధము దివ్యులు దివి (స్వర్గ) భవులు ఇంద్రాదులు అదివ్యులు మానవులు దుష్యంత వత్సరాజాదులు దివ్యాదివ్యులు - దివ్యులయ్యు మానవులుగా అవతరించినవారు కృష్ణాదులు ఏ రొక్కొక్కరును ధీరోదాత్త ధీరోద్ధత ధీరలలిత ధీరశాంతులు అని నలుతెఱంగు

అందు ధీరోదాత్తునందు ఉత్సాహము మెండు ధీరోద్ధతునందు క్రోధము మిక్కుటము ధీరలలితునందు కామినీరతి ముమ్మరము ధీరశాంతునందు నిర్వేదము ప్రధానము ఇట్లు (3 x 4) పండ్రెండు భేదములు మరల ఉత్తమ మధ్యమాధమ భేదములచే (12 x 3) ముప్పదియాఱు భేదములు

ప్రకృత్యనౌచిత్యము

ఈ నాయకులందు భయముగాక కడమ స్థాయిభావములు సర్వత్ర సమమైనను రతి సంభోగరూపమును మనుష్యులందు దుష్యంతాదులందుంబోలె ఉత్తమదేవతలందు పార్వతీపరమేశ్వరాదులందు [పిత్రాదులందుబోలె] స్ఫుటముగా స్పష్టముగా (చుంబనాలింగనాది) సర్వానుభావము లు వర్ణించుట అనుచితము అందుచే కావ్యములందుఁ దన్నిబంధనము చేయరాదు [మధ్యమాదులం దన్ననో ఇంద్ర నలకూబరాదులందు - కవికి కొంత స్వాతంత్ర్యము కలదు] రత్యనౌచిత్యమునంటిదే క్రోధానౌచిత్యమును లోకములను భస్మీకరించు పాటవము గలది రాత్రిందివములు తాఱుమాఱు జేయుట మున్నగు ననేకాశ్చర్యములు కలిగించునదిగ క్రోధము దివ్యులందుం బోలె అదివ్యులందు (మానవులందు) వర్ణించుట అనుచితము - అనాచరణీయము ఏలన ఉత్తమ దేవాద్యాలంబనగత మగు నారాధ్యత్వము సహృదయుని చిత్తమునకు ప్రతీతమగును. ఆ దివ్యనాయకులందు కవి వర్ణించినచో లోకభస్మీకరణాది క్రోధ వ్యాపారాదుల విషయమున సంభావ్యములే కాని మానుషనాయకాదులందు కావు అందుచే అసత్యము లను ప్రతీతియు సహృదయుని చిత్తమున నుదయించును ఈ ప్రతీతివైరస్యముచే రౌద్ర రసాస్వాదోదయమునకు చేటొదవును అందుచే అట్లనుచితముగ వర్ణింపరాదు

[శంక] మున్ను రసాస్వాద ప్రక్రియను ప్రతిపాదించునపో చెప్పిన (విభావాదుల) సాధారణీకరణంపు మహిమచే ఆలంబన విషయము ఆరాధ్యత్వజ్ఞానము ఉత్పన్నము కాదుకదా అందు రౌద్ర రసాస్వాద మెట్లు చేకూరును ?

[సమా] ఎచట సహృదయులకు రసోద్బోధము (రసాస్వాదము) ప్రమాణసిద్ధమో, అచ్చోట సామగ్రిలేక అది ఉత్పన్నము కాదు కావున గత్యంతరములేక – ఫలానురోధమున సాధారణీకరణము కల్పితము మఱి ఇచ్చోట రసానుభవ ప్రమాణసిద్ధియే లేదు ఇక సాధారణీకరణ కల్పనచే నేమిలాభము? అట్లుగాక సాధారణీకరణము సార్వత్రిక మని యభ్యుపగమించిన (వాదమునకుగా నంగీకరించిన) స్వమాతృవిషయకము రతియందును సహృదయునకు రసోద్బోధము కలుగవలెను జయదేవాదులు గీతగోవిందాది ప్రబంధములందు సకల సహృదయ సమ్మతమైన యీ నియమమును మదోన్మత్తమాతంగములవలె నిరంకుశచిత్తులై భగ్న మొనర్చిరి అట్లు వర్ణించుట సమంజసము కాదు

అట్లే విద్యావయోవర్ణాశ్రమ తపస్సులచేత ఉత్కృష్టులైన వారు తక్కువవారిని సబహుమానవచనముతో వ్యవహరింపరాదు తక్కువవారన్నను ఉత్కృష్టులైనవారిని బహుమానవచనములచే సమ్మానింపవలెను ఎట్లన 'తత్రభవన్ భగవన్' అను మున్నగు సంబోధనలచే మునులను గురువులను దేవతలను మున్నగు వారలనే కాని రాజాదులను సంబోధింపరాదు అట్లు జాత్యుత్తములగు ద్విజులనే సంబోధింపవలెను జాత్యధములను గాదు మహేశ్వర అని చక్రవర్తినే సంబోధింపవలెను మునిప్రభృతులను సంబోధింప

రాదు. ఔచిత్యానౌచిత్యములఁ గూర్చి ధ్వనికారులు ఇట్లు సిద్ధాంత వాక్యము నాదేశించినారు

అనౌచిత్యా దృతే నాన్యత్ రసభంగస్య కారణమ్
ప్రసిద్ధౌచిత్యబంధస్తు రసస్యోపనిష త్పరా ' అని

రసభంగమునకు అనౌచిత్యమునకన్న వేఱు కారణము లేదు ప్రసిద్ధమైన యౌచిత్యబంధ మన్ననో రసబ్రహ్మప్రతిపాదనమునకు పరమమైన యుపనిషత్తు అందుచే సహృదయ వైముఖ్యకారియైన యనౌచిత్యమును సర్వథా పరిత్యజించి ఔచిత్యమును పరిపోషింప వలెను

అనౌచిత్యము నిత్యదోషము కాదు. మఱి ఎట్టి యనౌచిత్యమున రసపుష్టి కలుగునో అట్టిదానిని వారింపఁ బనిలేదు రసప్రతికూల మైనప్పుడే అనౌచిత్యము నిషేధ్యము అందువలననే,

బ్రహ్మ న్నధ్యయనస్య నైష సమయ
స్తూష్ణీం బహిః స్థీయతామ్
స్వల్పం జల్ప బృహస్పతే జడమతే
నైషా సభా వజ్రిణః
వీణాం సంహర నారద, స్తుతికథా
లాపై రలం తుంబురో
సీతారల్లక భల్ల భిన్నహృదయః
స్వస్థో న లంకేశ్వరః.

(కావ్యదర్పణము. పుట 136)

ఓ బ్రహ్మ అధ్యయనమునకు (వేదపాఠమునకు) ఇది సమయము కాదు మిన్నక బైటనుండుము ఓ మందమతీ బృహస్పతీ

అతిప్రసంగము మానుము ఇది యింద్రునిసభ కాదు నారదా వీణావాదనము చాలింపుము ఓయి తుంబురుఁడా చాలు నీ సుశ్లోకగానాలాపములు సీతయందలి యుత్కంఠాభల్లముచే భగ్నహృదయుఁడు లంకేశ్వరుఁడు ఇప్పుడు స్వస్థచిత్తుఁడు కాఁడు

పై పద్యము ఏదో నాటకమునందలిది ఇది రావణుని ద్వారపాలకుని మాటలు అవి బ్రహ్మాదిదేవతలను ధిక్కరించునవి అందుచే అనుచితములు కాని అవి యీప్రకరణమున రావణుని పరమైశ్వర్యమునకు పోషకములుగా నున్నవి ఆత్రైలోక్యప్రభుత్వము వీరరసాక్షేపకము(వ్యంజకము)గా నున్నది ఆ వీరరసము సీతాలంబనకమైన విప్రలంభశృంగారాభాసమునకు అంగము అందుచే బ్రహ్మాది ధిక్కారపరములు ద్వారపాలకుని వాక్యములకు అనౌచిత్య దోషము లేదు

ఉదాహరణాంతరము —

అరెరే సద్యస్సముత్పాటిత హరితకుశగ్రంథిమయాక్షమాలా

పరివృత్తి విస్రంభిత బాలవిధవాంతఃకరణాః బ్రాహ్మణాః

[మూ॥ అరేరే సద్దస్సముప్పాడి అహరిఅ కుసగ్గంథిమయాచ్ఛమాలా పఇవిత్తి విస్సంభి బాల విహావందకణాబ్రాహ్మణాః]

[ఓరోరి అప్పుడే పెరికిన క్రొందబ్బముడుల మయంగా వున్న జపమాలను త్రిప్పి బాలవిధవల మనస్సులను నమ్మించే బాపలారా]

ఇట ఓరోరి అనునది ఉత్తమ బ్రాహ్మణుల విషయమునఁ బ్రయోగించుట అనుచితమే కాని యీ సందర్భమునఁగాదు ఏలన ఇవి విదూషకుని మాటలు హాస్యరసానుగుణములు అందుచే నిట అనౌచిత్యదోషము లేదు

పైఁ జెప్పినవే కాదు రసదోషములు మా రొనర్చినది దిక్ప్రదర్శన మాత్రము సుధీవరులు సహృదయులు అన్యముల నూహించి తెలిసికొనునది

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

4 గుణ ప్రకరణము

అధి 1 మత భేదములు

రసములను బ్రతిపాదించిన పిమ్మట వాని గుణములగు [తత్ప్రయోజకము లొండెనగు] కావ్య గుణములు నిరూపింపఁ బడుచున్నవి మాధుర్యము ఓజస్సు ప్రసాదము అని మూఁడు కావ్య గుణములను ప్రాచీనులు మమ్మటభట్టాదులు ప్రతిపాదించిరి అందు ఏయేగుణములు ఏయేరసములం దుండునో ఏ యే కొలంది యుండునో వచించుచున్నారము ఇట మూఁడు మతములు కలవు

(1) అందు మొదటిమతమునుబట్టి —

సంభోగశృంగారమున మాధుర్యగుణము ఏపాటి యుండునో అంతకన్న నెచ్చుగ కరుణమందు ఆ రెండింటికన్న మిక్కుటముగ విప్రలంభశృంగారమునందు వాని యన్నింటిని మించి శాంతరసమునందును - [ఆ మాధుర్యముచే జనించు] చిత్తద్రుతి తారతమ్యమును బట్టి పూర్వపూర్వముల కన్న ఉత్తరోత్తరములందు అతిశయించి ఉండునని చెప్పుదురు

(2) మఱికొందఱు మాధుర్యము సంయోగశృంగారమున కన్న కరుణశాంతములందు హెచ్చు వాని రెంటియందున కన్న విప్రలంభమందు అతిశయముగా నుండును అందురు

(3) ఇంకఁ గొందఱు సంయోగశృంగారముకంటె కరుణరస మందు విప్రలంభశృంగారమునందు శాంతరసమునందు ఈమూఁడింట మాధుర్యము అతిశయనే కాని ఆ మూఁడింట తారతమ్యములేక సమానముగా నుండును అని నుడువుదురు

పైఁ జెప్పిన మూఁడు మతములందు ప్రథమ తృతీయములు ప్రాచీన సమ్మతములు ఎట్లన

మాధుర్యౌజః ప్రసాదాఖ్యా స్త్రయ స్తే న పున ర్దశ
ఆహ్లాదకత్వం మాధుర్యం సంభోగే ద్రుతికారణమ్
కరుణే విప్రలంభే త చ్ఛాన్తే చాతిశయాన్వితమ్
దీప్త్యాత్మవిస్తృతే ర్హేతు రోజో వీరరసస్థితిః
బీభత్స రౌద్రరసయో స్తస్యాధిక్యం క్రమేణ తు

మాధుర్యము ఓజస్సు ప్రసాదము అనునవి మూఁడే గుణములు పది కావు అందు మాధుర్యమన ఆహ్లాదకత్వము (ఆనంద స్వరూపత్వము) ద్రుతికి అది కారణము [ద్రుతి కారణమైన యాహ్లాదకత్వము (ఆనందస్వరూపత్వము) మాధుర్యమని భావము] అది సంయోగశృంగారమునందు కరుణరసమందు విప్రలంభ శృంగారమందు క్రమాతిశయమున - ఉత్తరోత్తరాతిశయమున వరలును దీప్తి అను ఆత్మవిస్తారహేతు చిత్తవృత్తివిశేషము వీరరస మందు బీభత్సమందు రౌద్రరసమందు క్రమాధిక్యమున (ఉత్తరోత్తరాధిక్యమున) వరలును

ఈ చెప్పిన కావ్యప్రకాశకారికలోని క్రమేణ అను పదమును అపకర్షించుటచే మొదటి వ్యాఖ్యానము ఉత్తరోత్తర ప్రకృష్ట మని అపకర్షింపకున్నచో మూఁడవ వ్యాఖ్యానము ఘటిల్లును అట్లు

రెండు మతములును మమ్మటాది ప్రాచీన మతానుకూలములు ఇక సంయోగశృంగారమునకన్న మాధుర్యము కరుణశాంతములందు అధికము పరస్పరము సమానము అంతకన్నను విప్రలంభము నందు మిక్కుటము అను మూడవమతము ప్రతికూలము అందు కరుణశాంతములకన్న విప్రలంభమున మాధుర్యము ముమ్మరము అను టకు ప్రమాణాంతరము కానరాదు సహృదయుల యనుభవము అట్లున్నచో అప్పుడు అదియు ప్రమాణమే ప్రమాణము లేనందున ఈ మూడవ మతము అశ్రద్ధేయ మని భావము

ఓజోగుణము తజ్జనకమగు చిత్తదీప్తి ననుసరించి వీర బీభత్స రౌద్రములందు ఉత్తరోత్తరాధికము అనఁగా వీరమునకన్న బీభత్సమున బీభత్సమునకన్న రౌద్రమున చిత్తదీప్తి అతిశయము అందుచేత తత్కార్యము ఓజోగుణమును క్రమప్రకృష్ట మగుట

అద్భుత హాస్య భయానకములందు కొందఱు ప్రసాదగుణము మాత్ర ముండు నందురు [ప్రసాదము చిత్త విస్తారాధాయకము] మఱికొందఱు అందు ఓజస్సు ప్రసాదము అను రెండు గుణములు నుండు నందురు ప్రసాదగుణమునకు వైలక్షణ్య మొండు కలదు అది సర్వ రసములందును సర్వరచనలందును ఉండును అందుచే అది అద్భుత హాస్యభయానకము లను నీ కొన్నింటికే మాత్రమే సంబంధించినది కాదు శృంగారాదులలో నది మాధుర్యమిశ్రితముగ నుండును వీరాదులందు ఓజోమిశ్రితముగా నుండును అద్భుతాదులం దన్ననో నిస్సపత్నముగా నుండును అనఁగా తత్తద్రసనుయరచనలయందు మిశ్రితముగనో ఒక్కొక్కటియో వ్యజ్యమానమగు నని భావము

ఇచట నిది తెలియఁదగును

కారిన్యాది దోషాపగమాహితము శృంగారాది రసత్రయ చర్వణాజన్యము ఆర్ద్రీభావరూపము ఆనందలక్షణము అంతేకాని మాధుర్యము ద్రుతికి కారణము కాదు ద్రుతి మాధుర్యకార్యమునుం గాదు ద్రుతి ఆస్వాదాభిన్నము ఇట్లు చెప్పిన శృంగారరసమున కును మాధుర్యగుణమునకును భేదమే లేకపోవదా? భేద మున్నది అది కారణభేదము రసమునకు విభావాదులు కారణము ద్రుతి కన్నో శృంగారాదిరసాస్వాదము కారణము ఇట్లు కారణభేదముచే కార్యభేదము అట్లే ప్రతిపక్షోత్కర్షదర్శనాద్యాహితము వీరాది రసత్రయ చర్వణాజన్యమునైన చిత్తవృత్తి విశేషము విస్తారరూపము దీప్తియే ఓజోగుణము అంతేకాని దీప్తికి ఓజోగుణము కారణము కాదు దీప్తికి వీరాదిరసాస్వాదము కారణము కావున అట్లే సరళ శబ్దార్థజ్ఞానాహితము అద్భుతాదిరసత్రయచర్వణాజన్యమైన చిత్తవృత్తివిశేషము వికాసమే ప్రసాదగుణము. అంతేకాని వికాసమునకు ప్రసాదము కారణము కాదు వికాసమునకు అద్భుతాదిరసా స్వాదము కారణము కావున ఇట్లు కారణభేదముచే గుణము వేఱు రసము వేఱు అని స్పష్టము

ద్రుతి దీప్తి వికాసములు మూఁడును చిత్తవృత్తివిశేషములు వరుసగా మాధుర్యోజః ప్రసాదగుణ విశిష్టములైన(ప్రయుక్తములైన) శృంగారాది రసాస్వాదసమయమున అవి కలుగును అవి రసాస్వాద సాక్షాజ్జన్యము లగును గుణసాక్షాజ్జన్యములు కావు అందుచే గుణ ప్రయోజ్యమాత్రములు

[శంక] ఇట్లు కేవల రసధర్మములుగాఁ గదా గుణములు నిర్ణీతము లైనవి మఱి రచన మధురము బంధము ఓజస్వి ఇత్యాది వ్యవహారములు ఎట్లు సంగతములు?

[సమా] అవి ఔపచారికప్రయోగములు అతని యాకారము శూరము అను ప్రయోగమువంటివి శౌర్యము ఆత్మగుణము అవయవసంస్థానవిశేష మగు నాకారమున నుండునది కాదు అట్లైనను స్వాశ్రయాశ్రయత్వ సంబంధమున ఆకారమున శౌర్యము లాక్షణికముగ నున్నట్లు గుణములును రచనయందున్నవి శౌర్యమునకు ఆశ్రయము ఆత్మ ఆత్మకు ఆశ్రయము ఆకారము (శరీర సన్నివేశవిశేషము) అట్లే గుణములకు ఆశ్రయము రసము రసమునకు ఆశ్రయము (వ్యంజకము) రచన (శబ్దార్థరూపము కావ్యము) ఇట్లు స్వాశ్రయాశ్రయసంబంధమున లాక్షణికములు పైప్రయోగములు ఇట్లు మమ్మటభట్టాదులు ప్రాచీనులు వచింతురు

ప్రాచీనమతఖండనము

[శంక] ఈ మాధుర్యౌజః ప్రసాదములు రసమాత్రధర్మములనుట కేమి ప్రమాణము? ప్రత్యక్షమా? కాదు ఏలన అట్లగునేని అగ్నియొక్క దాహాది రూపకార్యమున కన్న వేఱుగ అగ్నిగుణమైన యుష్ణస్పర్శాదికము మనకు [స్పార్శనిక] ప్రత్యక్షగోచర మగునట్లు రసకార్యములైన ద్రుత్యాదులకన్న భిన్నముగ రసగుణములు (రసమాత్రనిష్ఠములైన) మాధుర్యాదులు గోచరము లగుట లేదే? ద్రుత్యాది తాదాత్మ్యములుగనే మాధుర్యాదులు ప్రత్యక్షగోచరములగుచున్నవే అందుచే మాధుర్యాదులు కేవల రసమాత్ర ధర్మములనుటకు ప్రత్యక్ష మెట్లు ప్రమాణము ?

అనుమానము ప్రమాణమా ? ఎట్లన — కారణత ంచ్ఛిద్ధర్మావచ్ఛిన్నముగ నుండును అను వ్యాప్తి నియమము అందుచే ప్రకృతమున ద్రుత్యాదియొక్క రసనిష్ఠ కారణతయు ంచ్ఛిద్ధర్మావచ్ఛిన్నము - ఘటనిష్ఠకార్యతానిరూపిత దండగత కారణత దండత్వావచ్ఛిన్న మైనట్లు ఆ రసనిష్ఠకారణతయందు ఆ యవచ్ఛేదకధర్మము మఱొక్కటేదియు లేకపోవఁగా పరిశేషాను మానముచే మాధుర్యాదిగుణ మగును మాధుర్యాద్యవచ్ఛిన్న రసనే - కేవల రసముకాదు - ద్రుత్యాదికారణము ఇట్లు అను మాన ప్రమాణముచే గుణములు రసమాత్రవృత్తు లని సిద్ధము

[సమా] అది పొసఁగదు అది గౌరవజుష్ట మగుట సంభవింప నేరదు ఎట్లన ప్రాతిస్వికరూపముననే - క్త ప్తరసత్వ ధర్మావచ్ఛిన్న శృంగారాది రసకారణముచేతనే అనుమానసిద్ధి కలుగుచుండ క్రొత్తగా గుణత్వ విశిష్ట రసత్వమును కారణతావచ్ఛేదక ధర్మ ముగఁ గల్పించి మాధుర్యాది విశిష్ట రసత్వావచ్ఛిన్న శృంగారాదిని ద్రుత్యాది కారణముగా కల్పించుట యందు వ్యర్థమగు గౌరవ దోషము కలదు నోటఁ బోవుదానిని గొడ్డంట సాధించిన ట్లైనది అందుచే అనుమానము సంగతముకాదు.

[శంక] పైని నీ చెప్పిన కార్యకారణభావమునందు గుణము విశేషించు టావశ్యకము అందువలన లాఘవము కలదు నీ చెప్పినట్లు 1) శృంగారము ద్రుతికి కారణము (2) కరుణము ద్రుతికి కారణము (3) శాంతము ద్రుతికి కారణము (4) వీరము దీప్తికి కారణము (5) బీభత్సము దీప్తికి కారణము (6) రౌద్రము దీప్తికి కారణము (7) అద్భుతము వికాసమునకు కారణము (8) హాస్యము వికాసము

నకు కారణము (9) భయానకము వికాసమునకు కారణము అని యిట్లు ప్రాతిస్వికముగ (ప్రత్యేకప్రత్యేకముగ) తొమ్మిదికార్యకారణములు కల్పించుటకన్న లఘువుగా నిట్లు మూఁడు కార్య కారణ భావములు కల్పింపఁదగును ఎట్లన — (1) శృంగార కరుణ శాంతములు మాధుర్యవంతము లగుటచే ద్రుతికి కారణములు (2) వీర బీభత్స రౌద్రములు ఓజోగుణవంతము లగుటచే దీప్తికి కారణములు (3) అద్భుత హాస్య భయానకములు ప్రసాదవంతము లగుటచే వికాసమునకు కారణములు అని సామాన్య రూపమున కారణత నంగీకరించిన మూఁడే కార్యకారణభావములు కల్పించినఁ జాలును దానంజేసి లాఘవమును గుణత్వసిద్ధియు 'ఏకక్రియా ద్వ్యర్థకరీ' అను న్యాయమున లభించును

[సమా] లాఘవము కలదని సామాన్యరూపమున గుణద్వారక కార్యకారణభావత్రయము నంగీకరింపరాదు ఏలన తొమ్మిది కార్యకారణ భావములును ఆవశ్యకములే ఏలన మమ్మట భట్టాదులు ప్రాచీనులకు అవి సమ్మతములు వా రిట్లు నుడివిరి — మధురమగుట సంభోగశృంగారముచే ద్రుతియు మధురతర మగుట కరుణచేతను శాంతముచేతను అధికతరద్రుతియు మధురతమమగుట విప్రలంభముచే అధికతమద్రుతియు జనించును అట్లే ఓజోవంతమగుట వీరముచే దీప్తి, ఓజస్తరవంత మగుట బీభత్సముచే అధికతరదీప్తి ఓజస్తమవంతమగుట రౌద్రముచే అధికతమదీప్తి జనించును అట్లేఁగు వనే ప్రసాదవంతమగుట అద్భుతముచే విస్తారము ప్రసాదతరవంతమగుట హాస్యముచే అధికతరవిస్తారమును ప్రసాదతమవంత మగుట భయానకముచే అధికతమవిస్తారమును జనించును ఇట్లు చెప్పుటచే ద్రుతికి మాధుర్యవంతము శృంగారము కారణము అధికతరద్రుతికి

మాధుర్యతరవంతము కరుణము శాంతిరెయుండె కారణము అధికతమ ద్రుతికి మాధుర్యతమవంతము విప్రలంభము కారణము ఇట్లే తారతమ్యయుక్త కార్యకారణభావము కడమ రెండు త్రయములకును ఊహ్యము ఇట్లు తారతమ్య యుక్తములు వేర్వేఱు విశేష (ప్రాతిస్విక) కార్యకారణ భావములు తొమ్మిది ఎల్లరు నంగీకరింపవలసినవే ఇఁక వానికి పై పెచ్చు నీ నుడువునట్లు సామాన్యములు మఱిమూఁడు కార్యకారణభావములనుంగూడ నొప్పుచో నీకు పండ్రెండు కార్యకారణభావము లగును మాకన్ననో తొమ్మిదే చాలును అందుచే మాకే లాఘవము కలదు నీది గడు గూపము [గళగ్రంథి గురుతర గూపము] కావున ప్రాతిస్విక రూపముననే కారణము నంగీకరించుట లెస్స

[శంక] పోనీ అట్లే మమ్మటభట్టాదుల మార్గముననే ప్రాతిస్విక రూపమున కారణత్వము ఒప్పినను రసధర్మములుగా గుణములు సిద్ధించునుగదా

[సమా] ప్రాచీనులు చెప్పిరి కాని గుణములు రస ధర్మములుగా నంగీకరించుట పొసఁగదు ఏలన రసము సచ్చిదానంద స్వరూప నిర్గుణ పరమాత్మరూప మని సిద్ధాంతితము అందుచే గుణములు రసధర్మము లనుట సిద్ధాంత విరుద్ధము

[శంక] పోనీ రసధర్మములు కాకున్న రసోపాధులైన స్థాయిభావముల ధర్మము లగుఁగాక

[సమా] అందులకును ప్రమాణము లేదు రత్యాదులు స్థాయిభావములు వాసనాత్మకములు విభావాది కారణసామగ్రిచే

అవి ఆస్వాద్యమానత్వము రసత్వము నొందును తత్పూర్వము వానికి స్వాదుత్వమే లేకుండఁగా మాధుర్యాదిగుణత్వము ఎట్లు సంగత మగును? అవి రసత్వ మొంది సహృదయాస్వాద్యమాన మైనప్పుడే ఆ యాస్వాదనము మాధుర్యరూపమా? ఓజోరూపమా? ప్రసాద రూపమా? అను విచారము సావకాశ మగును అదియునుం గాక మమ్మటభట్టాదులవలె రత్యాదులు సుఖరూపములుగా నంగీకరించిన గుణమున గుణాంతరము ఉండుట సంభవింపదు ఇట్లు ఎన్నివిధములఁ జూచినను రత్యాదుల ధర్మములు గుణము లనుట సరిపడదు

[శంక] మఱి శృంగారాదులందు మాధుర్యాది గుణము లుండవన్న శృంగారము మధురము' వీరము ఓజస్వి' అను నిత్యాది వ్యవహారము లెట్లు సంగతము లగును?

[సమా] మాధుర్యాదులు (1) ద్రుత్యాది చిత్తవృత్తి ప్రయోజకము లని కాని (2) ప్రయోజకతాసంబంధమున ద్రుత్యాది చిత్తవృత్తులే మాధుర్యాదిగుణము లనిగాని సహృదయులైనవారి యనుభవమునుబట్టి అంగీకరించుట లెస్స ప్రయోజకత వృత్తినియామక సంబంధముకాదు అందుచే ప్రయోజకము ఆశ్రయమున సార్వత్రికముగ నుండవలె నని నియమము లేదు అందుచే ప్రయోజక మన సద్యఃకాలికకారణము కాదు [పార్యంతిక - పారిణామిక ఒండె] పారంపర్యకారణము ఇట్లు శృంగారము మధురము అను ప్రయోగము అశ్వగంధము ఉష్ణము అను ప్రయోగమువంటిది అశ్వగంధము ఓషధీవిశేషము దానియందు (ఆశ్రయమందు) ఉష్ణము సార్వత్రికముగ నుండదు స్పార్శనికప్రత్యక్షగోచరము కాదు సేవించినవారికి పార్యంతికముగ నెప్పుడో ఉష్ణపరిణామజనక మగును అందుచే ఉష్ణప్రయోజక మగుట అశ్వగంధము ఉష్ణము అని వ్యవ

హారము అట్లే శృంగారము మధుర మన మాధుర్యప్రయోజకము శృంగార మని యర్థము ఆశ్రయ మగు శృంగారరసాదులందు ఎల్లప్పుడు మాధుర్యాదు లుండకున్నను ఆస్వాదనకాలమందు ద్రుత్యాది చిత్తవృత్తి విశేషములందు శృంగారాదిరసములు మాధుర్య విశిష్టములుగ నుండును ఆ మాధుర్యమును పురస్కరించుకొని శృంగారము మధురము అను వ్యవహారము కలిగెను ఈ పక్షమున ద్రుత్యాదులు వేఱు, మాధుర్యాదులు వేఱు మాధుర్యాదులు ద్రుత్యాది జనకములు

లాఘవార్థము పక్షాంతరము ప్రతిపాదితము ప్రయోజకతా సంబంధమున ద్రుత్యాదులే మాధుర్యాదులు అని సంసర్గకుక్షౌ ప్రవిష్ట పదార్థానాం స్వారూప్యేణైవ భానమ్ [సంబంధ కుక్షియందు ప్రవేశపెట్టఁబడిన పదార్థములు తాద్రూప్యములుగనే భాసించును] అను నియమమును బట్టి ప్రయోజకతాసంబంధమున ద్రుత్యాదులు మాధుర్యభిన్నములుగనే భాసించును ఎప్పుడు ద్రుత్యాదులు శృంగారాదులతోడ ప్రయోజకతాబంధమున నుండి ఆ రసాస్వాద కాలమున వానికి (శృంగారాదులకు) మాధుర్యాదుల కలిగించునో అప్పుడు ఆ ద్రుత్యాదులు మాధుర్యగుణము లనఁబరఁగును

[శృంగారాది రసాస్వాదన కాలమున మనస్సు ద్రవించును అప్పుడు మాధుర్యానుభవము కలుగును ఆ మనస్సు ద్రవించుటే మాధుర్యగుణము వీరాదిరసాస్వాదకాలమున మనస్సు ప్రదీప్తమగును (ప్రజ్వలించును) అప్పుడు ఓజోనుభవము కలుగును ఆ మనస్సు ప్రదీప్తమగుటే (enkindling) ఓజోగుణము అట్లే అద్భుతాది రసాస్వాదకాలమున మనస్సు వికాసమొందును అప్పుడు ప్రసాదానుభవము కలుగును ఆ మనస్సు వికాసమొందుటే ప్రసాద

గుణము అని సారము] ఈ పక్షమున ద్రుత్యాదులు పార్యంతికముగ మాధుర్యాద్యభిన్నములు

సాంగాత్మ్యమర్మజ్ఞచూడామణులు లోచనకారులు ద్రుతి దీప్తి వికాసములు చిత్తవృత్తులే నని మాధుర్యాదులనే వచించునని లక్షణచే రసధర్మముల లక్షించునని లక్షితలక్షణచే రసధర్మవ్యంజకము లగు శబ్దార్థములను - రచననుగూడ లక్షించు నని ఆదేశించినారు

[శంక] ప్రయోజకతచే ఇట వివక్షితనేమి ? ప్రయోజకత ఏది చెప్పఁబడినదో అది అదృష్టాదులందును కలదు అదృష్ట మన ధర్మాధర్మములు దేశము కాలము ఈశ్వరేచ్ఛ ఇవి ఆదిశబ్ద గ్రాహ్యములు ఇవి కార్యమాత్ర మైన దాని కెల్ల ప్రయోజకములు. (పారంపర్యకారణములు) ఆ మాధుర్యాదులవలెనే అదృష్టాదులును ద్రుత్యాదులకు పారంపర్యకారణములు (ప్రయోజకములు) అగుటచే అతివ్యాప్తి - అదృష్టము మధురము (ద్రుత్యాదిప్రయోజకము) కాలము మధురము దేశము మధురము అని ఉప్పతిల్లినది ఇట ఇది అవధేయము కావ్యజగత్తునందుం బోలె - లౌకిక జగత్తునందును కొన్ని సందర్భములు ద్రుత్యాది చిత్తవృత్తిజనకము లగును జన స్థానదర్శనముచే సీతావియోగము స్మారితము కాఁగా శ్రీరామ చంద్రుని హృదయము ద్రవించినది

జనస్థానే శూన్యే శిథిలకరణై రార్యచరితై
రపి గ్రావా రోదిత్యపి దలతి వజ్రస్య హృదయమ్

శూన్యమైన జనస్థానముచ వైకల్యమును కలిగించు నాష్యాని చేష్టలచే రామ్యసైతము దుఃఖముచే గరగును వజ్రముయొక్క హృదయ మైనను బ్రద్ద లగును

[సమా] కాని ఇట ఆ యదృష్టాదులు ప్రసక్తములు కావు అందులకై అదృష్టాదివిలక్షణము శబ్దార్థరచనారసగతప్రయోజకత' అని చెప్పబడినది అదే వివక్షితము అందుచే నిట ప్రయోజకత అదృష్టాదులందు అతివ్యాప్తము కాదు ఇట ప్రాచీనులు చెప్పినట్లు మాధుర్యాదులు కేవల రసమునందేగాక శబ్దమునందును అర్థము నందును రచనయందును కలనని యేర్పడుటచే శబ్దము మధురము అర్థము మధురము రచన మధురము (అనఁగా ద్రుత్యాది ప్రయోజకము) బంధము ఓజస్వి (దీప్తిప్రయోజకము) ఇత్యాది వ్యవహారములు సుసంగతములగును అవి మమ్మటాదులకుం బోలె ఔపచారిక ప్రయోగములు కావు ముఖ్యార్థకము చే

మఱియు మమ్మటాదులమతమున గుణములు తదాశ్రయమైన రసనిమిత్త మున్నప్పుడే ద్రుత్యాదిచిత్తవృత్తిజనకములు. జగన్నాథుని మతమునం దన్ననో - రసనిమిత్తము లేకయు - శబ్దార్థ రచనాదులచేతను ద్రుత్యాదిజనకములు [ప్రయోజకములు - పారంపర్య కారణములు.] ఏలన మాధుర్యాదులు రసమాత్రధర్మములుగ నంగీకృతములు కావు గుణములు ద్రుత్యాది చిత్తవృత్తి ప్రయోజకము లని చెప్పుటచేత రచన (కావ్యమును వాక్యమొండె) ఆలకించినపుడు, కాదా అందాక శబ్దమును పర్యాలోచించినపుడును ఆ శబ్దార్థమును గ్రహించినపుడు గూడ సహృదయుని చిత్తమునకు ద్రుతి దీప్తి విస్తారములు కలిగి, మాధుర్యౌజఃప్రసాదములు అనుభూతము లగును ఇది విశేషము

మాధుర్యాదులు ద్రుత్యాదిప్రయోజకములు ఒండె ప్రయోజకతాసంబంధమున ద్రుత్యాది చిత్తవృత్తులే మాధుర్యాదిగుణములు అని వికల్పించుటకు లాఘవము మాత్రమేకాదు ప్రయోజనము ఇట విశేషము కలదు ద్రుత్యాదులు చిత్తవృత్తివిశేషము లగుట చిత్తమునందు రసాదిగతము లగుట సంభవము అవి భిన్నాధికరణమున శబ్దార్థరచనాదులం దెట్లుండుట ఘటిల్లును? అందుచే మాధుర్యాదులు తచ్చిత్తవృత్తిప్రయోజకములు - పారంపర్యకారణము లగును. సహృదయుని చిత్తమున శబ్దార్థరచనాగత మాధుర్యాదిగుణములు ద్రుత్యాదుల కలిగించును మఱి మాధుర్యాది గుణములు రసగతము లైనప్పుడు ఈ బాధ లేదు రసాదులును ద్రుత్యాది చిత్తవృత్తులును చిత్తమునందే-ఏకాధికరణముననే యుండును రసము నాశ్రయించియుండును రసాస్వాదకాలమున రసగతములై మాధుర్యాదిరూపముననే ఆస్వాద్యమానము లగును గుణములయు చిత్తవృత్తులయు ప్రయోజ్యప్రయోజకభావము - కార్యకారణభావము వేఱుగ గోచరింపదు అవి రెండును ప్రత్యేకరూపమును గోల్పోయి ఆస్వాదనమున లీనమైపోవును మాధుర్యాదులచే ఆ చిత్తవృత్తినిష్పత్తియు రసాస్వాదమును ఏకకాలముననే సంభవించుటంజేసి అభేదమే స్ఫురించును అందుచే ప్రయోజకతాసంబంధమున ద్రుత్యాదులే మాధుర్యాదులు ఇట్లు శబ్దార్థరచనాగతము లగు మాధుర్యాదులకు ద్రుత్యాదితో ప్రయోజ్యప్రయోజకభావమును రసగతములైన మాధుర్యాదులకు ప్రయోజకతాసంబంధమున ద్రుత్యాద్యభేదము చెప్పఁబడె నని నిగ్గు

ఇట్లు గుణములు శబ్దార్థరచనాగతములు నగునని చెప్పుటచే - లక్షణమునందు మమ్మటాదులవలె గుణనివేశనము చేయకున్నను

లక్షణగత రామణీయకత ఎంత విపులార్థకమో గుణములను శ్రద్ధమై రచనలయందు పరిపోషించుట కవులకు ఎంత యావశ్యకమో స్పష్టమైనది తత్తద్గుణవ్యంజకమగు రచనానిరూపణముచేతను, తద్దోషముల సవిస్తరముగ సోదాహరణముగా నిరూపించుటచేతనుం గూడ అది తేటతెల్లమే అతిప్రాచీనులు ఆలంకారికులవలె కేవల శబ్దార్థరచనాగతము లనిగాక మమ్మటాదులవలె కేవల రసగతము లని గాక - సర్వసమ్మతముగ సముచితముగ శబ్దార్థరచనారసగతము లని ఇట నిరూపితమైనది అందుచే గుణములు రసవస్త్వలంకార ధ్వనిగతములును వాచ్యాలంకారాదిగతములునై సహృదయాస్వాద యోగ్యములగు నని ఫలితార్థము

రసగంగాధరము

వకివస్యావివరణసముల్లసితము

అ॥ 2 ప్రాచీనోక్త గుణములు

అతి ప్రాచీనులు దండి వామనాదులు పది శబ్దగుణములు పది యర్థగుణములు ప్రతిపాదించినారు అవెల్ల మాధుర్యాది గుణత్రయమునందే అంతర్భవించును ప్రాచీనోక్తగుణములు —

శ్లేషః ప్రసాదః సమతా మాధుర్యం సుకుమారతా
అర్థవ్యక్తి రుదారత్వ మోజః కాంతి సమాధయః '

అని పది శబ్దగుణములు ఆ పేరిటివే అర్థగుణములు పది పేరులు సమానములైనను లక్షణములు భిన్నములు

అందు మొదట శబ్దగుణములు పరామర్శింపఁబడును

1. శ్లేష

అందు శ్లేష మొదటిది శబ్దములు వేఱైనను–అవి వేఱుగా వినిపించునట్లు ఏకజాతివర్ణములను సంహితచే–(అవ్యవహితముగ) విన్యసించుట శ్లేష యను శబ్దగుణము దీనికే గాఢత్వ మని పేరునుం గలదు 'బహూనా మపి పదానా మేకపదవ ద్భాసమానాత్మా శ్లేషః శ్లిష్ట మస్పృష్టశైథిల్యమ్ ' (దండి) మసృణత్వం శ్లేషః (వా) అని ప్రాచీన లక్షణములు శైథిల్య మన పదభేదము వేర్వేఱు శబ్దముల ఒండొంటితోఁ గదియఁ గూర్ప ఆ పదములెల్ల మసృణత్వమువలన

ఏకపదమునవలె భాసించునని దానికి శ్లేష అని గాఢత్వమనియు పేరు అని సారాంశము సంహితచే అనుటచే విసంధిచే విశ్లేషాత్మకము గుణవిపర్యయము వాక్యలోపము ఉప్పతిల్లునని అభిప్రాయము

ఉదా .—

అనవరత విద్వద్ద్రుమ ద్రోహి దారిద్ర్య మాద్యద్విపోద్దామ దర్పాఘ విద్రావణ ప్రౌఢ పంచాననః

ఎడతెగక పండితులను వృక్షములకు చేటొదవించు దారిద్ర్యమను మదపుటేనుఁగుయొక్క గర్వాతిశయముఁ బాఱఁదోల నేర్పుగల మహాసింహము ఆ రాజు

ఇట సమస్తత్వమునం జేసి శ్లిష్టత్వము అభిప్రేతముకాదు సమాసము లేకున్నను ఈ శబ్దగుణ ముండును ఉదా —

అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా హిమాలయోనామ నగాధిరాజః [వామన కావ్యాలంకారసూత్ర 3 అధి ౧ అధ్యా ౧౦సూ] కామధేనువు యత్రహి వ్యాసేఽపి సమాసవ దవభాసః సశ్లేషః విఘటమానము లగు శబ్దములకు సంహితమూలమున సజాతీయశబ్దములతో నిబంధనము - శబ్దశ్లేష అని ఫలితార్థము

2. ప్రసాదము

గాఢత్వశైథిల్యములు వ్యుత్క్రమముగా మిశ్రణముచేయు బంధమునకు (పదరచనకు) ప్రసాద మను శబ్దగుణము

వ్యుత్క్రమము= (క్రమవిపర్యయము=తాఱుమాఱు)

గాఢత్వ మన కనకశలాకావయవఘటన వలె నిబిడత్వము శైథిల్య మన బంధవిశకలితత్వము (శబ్దములు విడివిడిగా భాసించుట) తొలుత శైథిల్యము పిమ్మట గాఢత్వము – ఈ క్రమమునఁ పదరచన చేయుట ప్రసాద మను శబ్దగుణ మని యర్థము

ఉదా —

కింబ్రూమ స్తవ వీరతాం వయ మమీ యస్మిన్ ధరామండల
క్రీడాకుండలితభ్రు శోణనయనే దోర్మండలం పశ్యతి
మాణిక్యావళి కాంతి దంతురతరై ర్భూషా సహస్రోత్కరైః
వింధ్యారణ్య గుహాగృహావనిరుహా స్తత్కాల ముల్లాసితాః

ఓ రాజా (అల్పులము) మేము నీ వీరత్వమును ఏమని వర్ణింప నేర్తుము? భూదేవేంద్రుఁడవు నీవు విలాసార్థము బొమముడి దాల్చి కన్నెఱ్ఱ చేసిన నీ భుజమండలమును కాంచినంతనే నీకు వెఱచి పలాయితులైన నీ శత్రురాజులయొక్క మాణిక్యపుంజంపుఁగాంతి తత్కాలమున నెసలారు భూషాసహస్రసందోహముచే వింధ్యాద్రి గుహాగృహ వృక్షములు దీపించినవి

ఈ శ్లోకమునందు యస్మిన్' అను శబ్దమువఱకు బంధ శైథిల్యము అది మొదలు భ్రుశబ్దమువఱకు బంధగాఢత్వము. మఱల తదాది నయనే వఱకు శైథిల్యము ఇట్లు సర్వత్ర ప్రసాదగుణము ఊహ్యము ఈ ప్రసాదగుణము సమాధిగుణ వ్యతిరేకము

ఇట లక్షణమున గాఢత్వ శైథిల్య మిశ్రణములఁ జెప్పుటకు హేతువు కలదు అది యవధేయము

వామనుఁడు గాఢత్వమోజః శైథిల్యం ప్రసాదః అని లక్షింపఁగా శిథిలత్వము ఓజోగుణ విపర్యయరూపము తదాత్మకత్వము ప్రసాదము దోషమేయగును గుణ మెట్లగును? అని శంక యుప్పతిల్లగా ప్రసాదము ఓజోగుణముతో (గాఢత్వముతో) సప్లవనము (మేలనము)నం జేసి గుణమగును మిశ్రమమైనదో శైథిల్యము దోషము ' అని సమాధానము చెప్పఁబడినది దాని నెల్ల పర్యాలోచించి జగన్నాథుఁడు గాఢత్వశైథిల్య మిశ్రరూపమున ప్రసాద లక్షణము చెప్పినాఁడు

3 మత

ఉపక్రమము మొదలు ఉపసంహారపర్యంతము రీత్యభేదము (శబ్దసన్నివేశము ఒక్కతీరున నుండుట) సమత యను శబ్దగుణము

దీనికి ఉదాహరణము చెప్పఁబోవు మాధుర్యోదాహరణము అందు ఉపక్రమోపసంహారములందు ఒక్కటే యుపనాగరక వృత్తి కలదు అందుచే సమతకు లక్ష్యము

వృత్తులను జగన్నాథుఁడు చెప్పలేదు ఈ గుణప్రకరణమున కనంతరము సంగ్రహముగా పూర్వాలంకారికోక్తి పర్యాలోచన పూర్వకముగ జిజ్ఞాసుజనోపకారార్థము మేము చెప్పెదము

4 మాధుర్యము

సంయోగపరహ్రస్వములకన్న వేఱైన వర్ణముల కూర్పుగలుగ పృథక్పదరచన మాధుర్య మను శబ్దగుణము సంయుక్తవర్ణములు

పరమునందు గల హ్రస్వములు గురువు లగును ఇది సంధి సమాస దైర్ఘ్యనివృత్తికరము

వామనుడు పృథక్పదత్వం మాధుర్యమ్ అని లక్షణము చెప్పెను

ఉదా —

నితరాం పరుషా సరోజమాలా
న మృణాళాని విచారపేశలాని
యదికోమలతా తవాంగకానా
మథ కా నామ కథాపి పల్లవానామ్

ఓ ప్రియా నీయంగకముల కోమలత్వమును భావించిన మృదువగు తమ్మిసరము మిక్కిలి కర్కశముగ కన్పట్టును తామరతూండ్లు విచారించిన (నీ యంగములకన్న) మృదువులు కావు (సరోజన్యములు అవి రెండే సాటికా వన) నింక తరుపల్లవముల సౌకుమార్యము మాట యెందులకు ?

ఈ శ్లోకమునందు పదములు ప్రాయికము పృథగ్భూతములు సంయుక్త పరకము లగు హ్రస్వాక్షరములును లేవు పల్లవ అనుచోట సంయుక్తలకార మున్నను పూర్వహ్రస్వము ప గురువైనను అది వ్యాకరణానుశాసనవిధానమున సంధిసమాసకార్యనిష్పన్నము కాలేదు కాన దోసఁగుకాదు అందుచే ఇట మాధుర్యము గుణము పూర్వోక్త సమతతో సంకీర్ణము

5. సుకుమారత

అపరుష వర్ణఘటితత్వము సుకుమారత యను శబ్దగుణము కేవల కోమల వర్ణములకూర్పు సుకుమారత అని యర్థము

ఉదా :—

స్వేదాంబు సాంద్ర కణశాలి కపోలపాలి
దోలాయిత శ్రవణ కుండల వందనీయా
ఆనంద మంకురయతి స్మరణేన కాపి
రమ్యా దశా మనసి మే మదిరేక్షణాయాః

స్వేదాంబు కణ నిబిరీసమగు కపోలతలముల ఇటు నటు నూఁగు చున్న చెవికమ్మల విలసిల్లు చున్నది యగు నా మదిరేక్షణ యొక్క యనిర్వచనీయ రమణీయ దశా విశేష మొకటి (పురుషాయితకేళి) నా హృదయమునకు ఆనందము కలిగించుచున్నది

ఇట పూర్వార్ధమున కోమల వర్ణఘటన కలిమింజేసి సుకుమారత గుణము అసంకీర్ణము (శుద్ధము) ఉత్తరార్ధమున పృథక్పద ఘటితమగుటంజేసి మాధుర్య సంకీర్ణము సుకుమారత ఓకారము కర్కశమయ్యు ఒకచోకాన గణనీయముకాదు

6. అర్థవ్యక్తి

ఝటితి ప్రతీయమానమగు నర్థాన్వయము ఎచ్చోట కలదో ఆచ్చోట అర్థవ్యక్తి అను శబ్దగుణము ఆకాంక్షాది సామగ్రీ సమవధానమునంజేసి అవిలంబితముగ నెట శాబ్దబోధ కలుగునో అట ఆ పదములచే నర్థవ్యక్తి నితరామ్' అను మున్నగు పూర్వోదాహృత శ్లోకములు ఉదాహరణములు

7. ఉదారత

కఠిన వర్ణఘటనారూపము బంధ వికటత్వము ఉదారత యను శబ్దగుణము

వికటత్వ మన లీలాయమానత్వము' [ఒయ్యారము గల్గి యుండుట శబ్దము వినఁబడిన వెంటనే అర్థనిరపేక్షముగా వాచ్యముల లీలలు స్ఫురించుట] అని వామనుఁడు Sound echoing sense.

ఉదా :—

ప్రమోదభర తున్దిల ప్రమథ దత్తతాలావలీ
వినోదిని వినాయకే డమరుడిణ్డిమ ధ్వానిని
లలాటతట విస్ఫుటన్నయనకృపీటయోనిచ్ఛటా
హఠోద్ధత జటోద్భటో గతపటో నటో నృత్యతి.

శివతాండవ వర్ణనము' సంతోషాతిశయముతో ప్రమథులు తాళములు వేయుచుండ, (విని) వినోదించుచున్న వినాయకుఁడు డమరుడిండిమవాద్యములు మొరయించుచుండ లలాటతటమునుండి క్రొత్త యగ్నిజ్వాలలు బయల్వెడలుచుండ నృత్యాభినివేశము వలనఁ బైకెగయు జడలచే వికటముగా నున్నవాఁడు దిగంబరుఁడు నటుఁడు (శివుడు) తాండవించుచున్నాఁడు

ట వర్గాక్షరములు కఠినవర్ణములు. ఉత్తరార్థము టవర్ణ ప్రచుర మగుట బంధవికటత్వము.

'అట సని కాంచె' పద్యము ఆం వా. కా వృత్తిలో నుదాహృతమును వివృతము

కావ్యప్రకాశటీకాకారుఁ డొకఁడు "పదముల నృత్యత్ప్రాయత్వము వికటత ' అని వ్యాఖ్యానించినాఁడు, వక్ష్యమాణ శ్లోకము నుదాహరించినాఁడు

'స్వచరణవినివిష్టై ర్నూపురై ర్నర్తకీనాం
ఝణిత రణిత మాసీత్ తత్ర చిత్రం కలంచ '

"అచట అందంపుటడుగులయందు నెలకొన్న నర్తకీనూపు
రములు ఝణీ అని చిత్రమును అవ్యక్తమధురంబును నగు రణితము
గావించినది " ఆం సా ద

[పైఁ చెప్పిన లక్షణోదాహరణములు వామనుఁడు నిచ్చినాఁడు
సాహిత్యదర్పణకారుఁడు విశ్వనాథుఁడు నట్లొనర్చియుండుటచే గ్రంథ
కర్త పేర్కొన్నవాఁడు కావ్యప్రకాశిక వ్యాఖ్యాకారుఁడే కాఁబో
లును]

ఈ వికటత్వలక్షణము సమీచీనము కాదు దీనిని ఓజస్సున
నంతర్భవింపఁ జేయునట్టి వ్యాఖ్యాతలు కావ్యప్రకాశికాకారులకు ఎట్లు
అనుకూలురో వారికే ఎఱుక ఆ యుదాహరణమున ఓజస్సు విపుల
ముగాఁ బ్రతిభాసించుటలేదు 'వినివిష్టైర్నూపురై ర్నర్త' అనుచోట
సంయుక్త షకార టకార రేఫ వర్ణఘటిత మగుటం జేసి ఓజస్సు రవంత
యున్నను చమత్కారి కాదు అందు నృత్యప్రాయత్వ మను వర్ణ
నము సహృదయానుభవగోచర మగుటయు లేదు ఇందు మాధు
ర్యమే బహుళము అందుచే వ్యాఖ్యానోదాహరణములు రెండును
అసంగతములు

8. ఓ జ స్సు

సంయుక్తాక్షర పూర్వఘటితములైన హ్రస్వవర్ణముల ప్రాచు
ర్యమునఁ గల్గు గాఢత్వము ఓజ స్సను శబ్దగుణము

ఉదా. —

సాహంకార సురాసురావలి కరాకృష్ట భ్రమన్మందర
క్షుభ్యత్క్షీరధి వల్గు వీచివలయ శ్రీ గర్వ సర్వంకషాః
తృష్ణాతామ్యదమంద తాపసకులై స్సానంద మాలోకితా
భూమీభూషణ భూషయన్తి భువనాభోగం భవత్కీర్తయః

ఓ భూవిభూషణా నీ కీర్తులు అహమహమికతో దేవాసుర సమూహకరాకృష్టమై (భ్రమించుచున్న) మందరాద్రివలన కల్లోల పడుచున్న పాలవెల్లి తరగల శోభాగర్వమును (శ్వేతత్వ దురభిమానమును) ఒరయుచున్నది (మించుచున్నది) దప్పిచే తపించు చున్న యుత్తమ తాపసకులములచే నమృతభ్రాంతితో సానందముగా నవలోకింపఁబడుచున్నది భువనాభోగమును అలంకరించుచున్నవి

ఇచట సంయుక్తాక్షరములు పరమునం దుంటచే గురువులైన హ్రస్వవర్ణములు మెండుగా నున్నందున ఓజోగుణము రౌద్ర రసమునకు ఉదాహరణముగా నీయఁబడినది అయం పతతు నిర్దయమ్ అను శ్లోకమును ఉదాహరణాంతరము

9. కాంతి

అవిదగ్ధులగు (అరసికులగు) శ్రోత్రియాదులు ప్రయోగింపఁదగిన శబ్దముల నుజ్జగించి సహృదయహృదయంగమశబ్దములు ప్రయోగింప నేలోకోత్తరశోభారూపము ఔజ్జ్వల్యము కలుగునో అది కాంతి యను శబ్దగుణము ఇచ్చటను పూర్వోక్తము నితరాం' అను శ్లోకము ఉదాహరణము అందు సహృదయహృదయంగమ

పదములు మెండుగా నున్నందున కాంతి గుణము అది మాధు
ర్యార్థవ్యక్తి సంకీర్ణము

ఔజ్జ్వల్యరూపా హాలికాది ప్రసిద్ధ పదవిన్యాస జన్య
గ్రామ్యతాబుద్ధి వైపరీత్యేన అలౌకికశోభాశాలిరూపా కాంతిః
(చండీదాసుడు. కావ్యప్రకాశ వ్యాఖ్యాత

ఔజ్జ్వల్యరూపమై, హాలికాదిప్రసిద్ధపదబంధముచే కలుగు
గ్రామ్యత లేనిదై అలౌకికశోభారూప మైనది కాంతి

10. సమాధి

బంధముయొక్క గాఢత్వశిథిలత్వముల వరుసగా నెల
కొల్పుట సమాధి అను శబ్దగుణము ప్రసాదమున కిది విపరీతము
అందు శిథిలత్వగాఢత్వములు వరుసగా ప్రయోగింపఁబడును
మా చెప్పిన గాఢత్వ శిథిలత్వములనే ప్రాచీనులు ఆరోహావరోహము
లని పేర్కొనిరి 'చంచద్భుజ భ్రమిత' అను శ్లోకమును వేణీసంహా
రస్థమును భీమవాక్యమును ఉదాహరించిరి

ఆరోహము ఓజోరూపము ప్రసాదము అవరోహారూపము
కదా సమాధి వేఱుగుణ మెట్లగు నని శంక.

[సమా] ఓజఃప్రసాదములు ఆరోహావరూపములనుట సరికాదు
ఓజస్సు నియతముగ ఆరోహారూపమునను ప్రసాదము నియతముగ
అవరోహారూపమున నుండు ననరాదు ఇట సమాధిగుణము స్వరూప
మేమన ఓజస్సు ఆరోహారూపమునను ప్రసాదము అవరోహ
రూపమునను నదియొక్క రెండు పాయలవలె సంపృక్తములై (క్రమ

సమ్మిళితములై) ఒక్కచోఁ బవర్తించుట అని ఆరోహావరోహక్రమము నొందుటకే తదుత్కటావస్థ యని పేరు. ఆ రెంటి యుత్కటక్రమ వృత్తికి నిమిత్తము సమాధిలక్షణము శబ్దగుణము.

(వా కా సూ 3. 1 13-17)

సమాధి స్వతంత్రగుణము కాదు అది ప్రసాదవ్యతిరేక రూపము గాఢత్వ శిథిలత్వముల భిన్నక్రమము ప్రసాదసమాధులకు భేదకము

ఉదా గంగానదీవర్ణనము —

స్వర్గ నిర్గత నిరర్గల గఙ్గా తుఙ్గ భఙ్గుర తరఙ్గ సఖానామ్
కేవలామృతముచాం వచనానాం యస్య లాస్యగృహ మాస్యసరోజమ్

స్వర్గమునుండి బయల్వెడలిన నిరర్గళ గంగానది యుచ్చనీచ గతతరంగములకు తుల్యములును కేవలామృత వర్ష రూపములును నైన వచనములకు ఏది నృత్తగృహమో అది నీ ముఖపద్మము.

ఈ శ్లోకమునందు తొలిసగమున ఆరోహము - గాఢత్వము మూఁడవ పాదమున అవరోహము - శైథిల్యము ఇట్లు వాని క్రమ సన్నివేశము కలదు [నాల్గవ చరణమున గాఢత్వ శైథిల్యముల నేదియు వివక్షితము కాదు] ఈ శ్లోకమున పూర్వార్ధమున గఙ్గేత్యాది పదఘటిత వర్ణములందు మాధుర్యవ్యంజకము లున్నను వానికి దీర్ఘ సమాసాంతత్వముచే పృథక్పదత్వము లేమింజేసి మాధుర్యగుణంపు పొలకువ లేదు ఉత్తరార్ధమున నన్ననో దీర్ఘసమాసము లేదు అందుచే సమాధి మాధుర్యసంకీర్ణము

ఇట్లు పది శబ్దగుణములు నిరూపితము లైనవి

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అధి 3 అర్థగుణములు

1 శ్లేష

విదగ్ధచేష్టితము తద్గోపనము అస్ఫుటత్వము తదుపపాదక యుక్తి ఇవెల్ల నొక్కనియందే కూడియున్నట్లు వరుసగా వర్ణించుట శ్లేష యను నర్థగుణము


క్రమకౌటిల్యానుల్బణతోపపత్తియోగఘటనా స శ్లేషః

అర్థక్రమము కౌటిల్యము బాధాభావస్వభావముతో యోజన చేయుట

చంద్రాలోకోక్త లక్షణము

శ్లేషో విఘటమానార్థ ఘటమానత్వ వర్ణనమ్
ఉల్లసత్తనుతాం నీతేఽనన్తే పులకకణ్టకైః
భీతయా మానవత్యైవ శ్రియాశ్లిష్టం హరిం స్తుమః

ఏ యర్థము సమకూడునది కాదో దానిని యేదే నిమిత్తము చేత సమకూర్చినట్లు వర్ణించుట అర్థశ్లేష ఇట మానవత్యాలింగనము అసంభావితము శేషుని భయమున [illegible] కంటకజనిత కార్శ్యము నిమిత్తకమున సాధ్యమైనట్లు వర్ణింపబడినది [illegible] శ్లేష



సాహిత్యసారోక్త లక్షణము —

శ్లేష స్సదర్థస్య రచనా చాతురీ సూత్రి చిత్రితా
ఉమాకపోలం సోఽచుంబ చ్ఛంభు ర్గంగాస్యబింబనాత్

చిత్రితమైన యర్థరచనాచాతురియు శ్లేషయే - శివుఁడు గంగాదేవి మోము ప్రతిఫలించుటచే పార్వతి కపోలమును ముద్దిడు కొనెను (మోసకారి శివుడు ఇందువలన గంగాపార్వతుల నిద్దఱను ముద్దిడుకొన్న ట్లైనది)

దీనికి పలువు రాలంకారికు లిచ్చిన యుదాహరణము —

ఇద్దఱు కాంతల మగని చెయ్దము .—

దృష్ట్వైకాసన సంస్థితే ప్రియతమే పశ్చా దుపే త్యాదరా
దేకస్యానయనే విధాయ విహితక్రీడానుబంధచ్ఛలః
ఈషద్వక్రితకన్ధరః సపులకః ప్రేమోల్లసన్మానసా
మ న్తర్హాస లసత్కపోలఫలకాం ధూర్తోఽపరాం చుమ్బతి

'ఒకటే యాసనమునందు కలిసి కూర్చున్న ప్రేయసులను (అనుకము) ఇరువురను జూచి మెల్లఁగువగా వారి వెనుకవైపుగా సమీపించి ఆటకై చేసినట్లు నటించుచు ఆ యిరువురలో నొకతె నేత్రములను తన చేతులతో మూసి మెడను అడ్డముగా వంచి ఆ వంచకుఁడు నాయకుఁడు లోపలి నవ్వుచేత నొప్పారుచున్న విశాలమైన చెక్కిళ్ళు గలదైన యా రెండవదానిని ముద్దుపెట్టుకొనుచున్నాఁడు

ఇట ఒకతెను వంచించి కొండొకతెను ముద్దుగొనుట విదగ్ధ చేష్టితము. అది మొదటిదానికి తెలియమిం జేసి అస్ఫుటత్వము (గోప

నము) ఇట్లు అన్యను ముద్దుగొనుటకు క్రీడార్థముని తోఁచునట్లు వెనుకనే వచ్చి కనులు మూయుట యుక్తి (ఉపాయము) చుంబనక్రియా చాతుర్యము ఇవెల్ల నొకటి వెంబడి ఇంకొకటి ఏకపురుషకర్తృకములుగా నిబంధించుటచే పై శ్లోకమున శ్లేష అను నర్థగుణము

2 ప్రసాదము

అర్థమునకు వలసినన్ని మాత్రము పదము లుండుట అను నర్థవైమల్యము (అర్థవైశద్య మొండె) ప్రసాదాఖ్యము అర్థగుణము

చంద్రాలోకోక్త లక్షణము —

'యస్మా దంతస్థిత స్సర్వః స్వయ మర్థోఽవభాసతే
సలిలస్యేవ సూక్తస్య స ప్రసాద ఇతి స్మృతః "

దేని బలమున ప్రతిపద్యమాన వాక్యార్థము రసము తటుకున చమత్కారజనక మగునో ఆ యర్థగుణము ప్రసాదము [ప్రసిద్ధార్థకత్వం ప్రసాదః' దండి] ప్రసిద్ధమైన యర్థము గలిగియుండుట ప్రసాదము

ఉదా — నాయికనుగూర్చి దూతివాక్యము —

"కమలానుకారి వదనం కిల తస్యాః '

ఆ బాలది కమలానుకారి వదనము కదా!

ఇట అర్థముయొక్క స్పష్టప్రతిపత్తికి వలసినన్ని శబ్దములే న్యూనాధిక్యములుగాక - ఉన్నవి. వదనమందున్న కమలాసాదృశ్యము కిల శబ్దము దృఢము చేయుచున్నది అందుచే అదియు సార్థకమే.

ప్రత్యుదాహరణము —

కమలా కాన్త్యనుకారి వక్త్రమ్'

ముఖము లక్ష్మీకాంతిని అనుకరించునది ఇట కాంతి శబ్దము లేకున్నను అర్థ మవగత మగును అందుచే కాంతి శబ్దము అధికము కావున నిందు అర్థవైమల్యము లేదు

3 సమత

ప్రక్రమభంగము లేమిం జేసి అర్థఘటనాత్మకము అవైషమ్యము ఏది కల్గునో అది సమత యను నర్థగుణము తొలుత నే శబ్దముచే ఉపక్రాంత మైనదో ఆ శబ్దముచేతనే-తత్పర్యాయ శబ్దముచేఁ గాదు- అర్థిక క్రమము నిర్వహింపఁబడునట్లు అర్థరచన చేయుట సమత

ఉదా —

హరిః పితా హరి ర్మాతా హరి ర్భ్రాతా హరిః సుహృత్
హరిం సర్వత్ర పశ్యామి హరే రన్య న్న భాతి మే

హరియే నాతండ్రి హరియే నా తల్లి హరియే భ్రాత, హరియే మిత్రుడు హరినే సర్వత్ర చూచుచుంటిని నాకు హరికంటె వేరొకటి భాసించుటలేదు

ఇట విష్ణుః భ్రాతా అని మున్నుగా రచియించిన ప్రక్రమ భంగాత్మకము వైషమ్యము ఉప్పతిల్లును

నసోస్తి ప్రత్యయో లోకే యః శబ్దానుగమాదృతే
అనువిద్ధ మివ జ్ఞానం సర్వం శబ్దేన భాసతే '

శబ్దానుగతి లేక లోకమునందు అట్టి ప్రత్యయము లేదు. సర్వమును శబ్దజ్ఞానముచే ననువిద్ధ మైనట్లులే భాసించును

అను పెద్దలసూక్తినిబట్టి శాబ్దికతంత్రమందు శబ్దము శాబ్దబోధవిషయ మగుటంజేసి హరిశబ్దమును విష్ణుపర్యాయశబ్దముగా మార్చిన ప్రక్రమించిన హరిశబ్దము లేకపోవఁగా వైషమ్య ముప్పతిల్లును ఇది సమతకు ఉదాహరణము కాకపోవును

ఇట శబ్దోపక్రమనిరపేక్షముగా అర్థోపక్రమ మైన యర్థపద్ధతి కడవఱకు మార్పులేకుండ నిర్వహించుటకు ఉదాహరణము -

చ్యుతసుమ సమాః కున్దాః పుష్పోద్గమే ష్వలసా ద్రుమా
మనసిచ గిరం బధ్నన్తీమే కిరన్తి న కోకిలాః
అథచ సవితుః శీతోల్లాసం లునన్తి మరీచయో
నచ జరఠతా మాలంబంతే క్లమోదయదాయినీమ్

చెట్లు పూచియు పూయకుండ నున్నవి కోకిలలు వాక్కును మనసునందే బిగించుకొన్నట్లున్నవి సూర్యునికిరణములు శైత్యాధిక్యమును చీల్చుచున్నవి కాని యలసటను కలిగించు ముదురుతనమును వెలయించుట లేదు

గర్భగ్రన్థిషు వీరుధాం సుమనసో, మధ్యేఙ్కురం పల్లవాః
వాంఛామాత్ర పరిగ్రహాః పికవధూకణ్ఠోదరే పఞ్చమః
కించ, త్రీణి జగన్తి జిష్ణుదివసైః ద్విత్రై ర్మనోజన్మనో
దేవస్యాపి చిరోజ్ఝితం యది భవే దభ్యాసవశ్యం ధనుః

లతాసుమములు గర్భగ్రంథులయందే యున్నవి చివురాకులు అంకురము పుట్టియు పుట్టని స్థితిలో నున్నవి ఆడుకోయిలల పంచమ

స్వర మెంత పెరుగుచుండినను కోరికమాత్రముగనే యుండిపోయినది చిరకాలముక్రింద వదలిపెట్టఁబడిన మన్మథదేవుని ధనుస్సు మఱల నభ్యాసమున కొగ్గినచో అది రెండు మూఁడు దినములలో మూఁడు లోకములను తప్పక జయించును

4 మాధుర్యము

ఒకటే యర్థమునకు భంగ్యంతరపునఃకథనాత్మకము ఉక్తివైచిత్ర్యము మాధుర్యము

ఉదా :—

విధత్తాం నిశ్శంకం నిరవధి సమాధిం విధి రహో !
సుఖం శేషే శేతాం హరి రవిరతం నృత్యతు హరః;
కృతం ప్రాయశ్చిత్తై, రల మథ తపోదాన యజనైః,
సవిత్రీ కామానాం యది జగతి జాగర్తి భవతి

ఓ భగవతి గంగా! కోర్కెలనెల్ల తీర్చుదానా నీవు జగత్తులో సావధానవై యుండఁగా బ్రహ్మదేవుఁడు కర్తవ్యాభావముచే నిస్సంశయముగా నిరవధికమైన సమాధిని (ధ్యానమున) నుండునుగాక విష్ణువు హాయిగా శేషతల్పముపై శయనించుఁగాక శివుఁడు నిరంతరము తాండవము చేయుఁగాక. ప్రాయశ్చిత్తములతోఁ బనిలేదు తపోదాన యజ్ఞములతో నక్కఱలేదు నీవు సర్వపాపవినాశినివై సృష్టిస్థితిలయవ్యాపారసమర్థ వగుదువు

ఈ శ్లోకమునందు బ్రహ్మాదులతో నించుకేని ప్రయోజనము లేదు ' అను నొక్కటే యర్థము సమాధి నుండుట, హాయిగా శయ

నించుట నిరంతర తాండవము చేయుచు అని పెక్కు క్రొంగ్రొత్త ప్రకారములఁ జెప్పుటచే అర్థగుణము మాధుర్యము చెప్పుటయందు నవనవ ప్రకారత్వము లేకున్న సదా చరతి ఖే భానుః సదా వహతి మారుతః ఇత్యాదులంబోలె అనవీకృతత్వము అను దోషము ఉత్పత్తిల్లును

5 సుకుమారత (Euphemism)

అకారణ శోకదాయిత్వరూపము పారుష్యము సుకుమారత

అకారణ శోకదాయిత్వము పారుష్యము కారిన్యము

ఉదా :—

త్వరయా యాతి పాన్థోయం ప్రియా విరహకాతరః '

ప్రియావిరహమునకు వెఱచి ఆ తెరువరి వేవేగ పోవు చున్నాఁడు

ఈ యుదాహరణమునందు విరహ ' అనుటకు మాఱు మరణ ' అను శబ్దము నివేశించిన ఆలంబన (ప్రియా) నాశరూపము శోకము కలిగించు మరణ ' శబ్ద ముండుటంజేసి పారుష్యము విరహ శబ్దము దుఃఖజనక మైనను [ప్రియానాశ రూప] శోకజనకము కాదు అందుచే దానఁ బారుష్యములేదు ఈ పారుష్యము వ్రీడా జుగుప్సా ద్యమంగళ వ్యంజకమైన యశ్లీలతాదోషమునఁ జేరును

చంద్రాలోకమున :—

సౌకుమార్య మపాకృష్యం పర్యాయ పవివ ర్తనమ్
న కథా శేషతాం యాతః సమాలింగ్య మనుత్సుఖమ్"

అమంగళశబ్దము పర్యాయశబ్దములచే జెప్పుట సౌకు మార్యము అగ్నిలో పడి మృతినొందెను ' అనుటకు మాఱు మను త్సుఖుని పరిష్వంగమున నతఁడు కథావశిష్టుఁ డయ్యెను అని చెప్పుట

6 అర్థవ్య క్తి

వర్ణనీయవస్తువుయొక్క యసాధారణక్రియారూపముల వర్ణనముల నర్థవ్య క్తి

వర్ణనీయవస్తువునకు ఇతరవ్యావృ త్తి కలుగునట్లు ఏకజాతి మాత్రవృత్తు లగు వ్యాపారములను అవయవసంస్థానమును వర్ణించుట

ఉదా — నాయకుఁడు సఖునితో చెప్పుచున్నాఁడు

గురుమధ్యే కమలాక్షీ కమలాక్షేణ ప్రహర్తుకామం మాం
రదయన్త్రిత రసనాగ్రం తరలితనయనం నివారయాంచక్రే

అ త్తమామలు మున్నగు గురుజనుల నడుమనున్న నలిన నయన ప్రియ పద్మబీజమాలతో (కమలాక్షేణ) తన్నుఁ గొట్టఁ గోరిన నన్ను నాల్కకొనను దంతములతో నొక్కి కనుల కదలించి వారించినది

ఇచట కమలపత్రములవలె దీర్ఘములైన నేత్రములు కలది అని రూపమును జిహ్వాగ్రదంతపీడన లోచన చంచలీకరణము చేయుట అను వ్యాపారము కేవల స్త్రీ జాతి స్వభావముల వర్ణించుటచే అర్థ వ్యక్తి అను నర్థగుణము దీనినే ఇదానీంతనులు ఆలంకారికులు స్వభావోక్త్యలంకారము అని వ్యపదేశించినారు.

7 ఉదారత

'చుంబనం దేహి మే భార్యే కామచండాల తృప్తయే' మున్నగు గ్రామ్యార్థముల పరిహారము ఉదారత అను నర్థగుణము

ఉదారతాతు వైదగ్ధ్య మగ్రామ్యత్వాత్ పృథఙ్మతా అని చంద్రాలోకము వైదగ్ధ్యోక్తిత్వమే ఉదారత అది గ్రామ్యత్వ పరిహారమునవనే నిష్పన్నము కాదు మానం ముంచ ప్రియే, కించి ల్లోచనాంత ముదంచయ -ఇట'ప్రియా అలుకయుడుగుము ఒకింత కను దెఱువుము అన్నంత మాత్రమున అగ్రామ్యత్వము కల్గును ఉదా రత యన్న రాదు లోచనాంత మిత్యాది చేతనే కల్గును అందుచే అగ్రామ్యత్వమున కన్న విశేషము ఆవశ్యక మని చంద్రాలోకకర్త యాశయము

8 ఓజస్సు

(1) ఏకపద ప్రతిపాదితార్థమును బహుపదముల నుడువుట
(2) అనేక పద ప్రతిపాద్యార్థమును ఒక పదమున నుడువుట
(3) అట్లే ఏకవాక్యార్థమును బహువాక్యముల ప్రతిపా దించుట

(4) బహువాక్యార్థముల నేకవాక్యమునఁ బ్రతిపాదించుట
(5) విశేషణముల సాభిప్రాయముగఁ బ్రయోగించుట
అని ఓజ స్సను నర్థగుణము ఐదు విధములు

అర్థస్య ప్రౌఢి రోజః ' వామనుఁడు ప్రౌఢి యన ప్రతిపాదన వైచిత్రి అర్థముయొక్క ప్రౌఢప్రతిపాదనము ఉక్తపంచప్రకారక మని భావము

అట్లే ప్రాచీనులు చెప్పుదురు —

పదార్థే వాక్యరచనా వాక్యార్థేచ పదాభిధా
ప్రౌఢి ర్వ్యాస సమాసౌచ సాభిప్రాయత్వ మస్యచ '

కారికయందు పూర్వార్థమున ప్రతిపాదింపఁ బడినవి (1 2) రెండు ఉత్తరార్థమున ప్రతిపాదింపఁబడినవి (3) వ్యాసము (విస్తరము) (4) సమాసము (సంక్షేపము) సాభిప్రాయత్వము మూఁడు–ఇట్లు అర్థప్రౌఢి ఐదువిధములు అనఁగా (1) పదార్థవ్యాసము (పదార్థము లొక్క తీరున చెప్పుట (బహుపదార్థముల) వ్యాసము (విస్తరణము) (2) వాక్యార్థ సమాసము (వాక్యార్థమును పదమున సంక్షేపముగా చెప్పుట (సమాసము) (3) ఏక వాక్యార్థ వ్యాసము (ఏకవాక్యమును బహువాక్యముల విస్తరణము) (4) ఏకవాక్యార్థ సమాసము (బహువాక్యార్థముల ఏకవాక్యార్థముగ సంక్షేపించుట (5) విశేషణముల సాభిప్రాయముగా చెప్పుట ఇట్లు పంచప్రకారము ప్రౌఢి ఓజస్సు అను నర్థగుణము

క్రమముగ వీని కేనింటికిని ఉదాహరణములు:—

(1) ఏకపదార్థంపు బహుపదప్రతిపాదనమునకు ఉదా —

ప్రభాత వర్ణనము :-

సరసిజ వనబంధుశ్రీ సమారమ్భకాలే
రజనిరమణరాజ్యే నాశ మాశు ప్రయాతి
పరమపురుషవక్త్రా దుద్గతానాం నరాణాం
మఘు మధురగిరాంచ ప్రాదురాసీ ద్వినోదః

కమల బంధుని (సూర్యుని) కాంతి ప్రారంభించు కాలమందు-ప్రభాతసమయమున - నిశారమణుని (చంద్రుని) రాజ్యము త్వరగ నాశ మొందుచుండ వేదపూరుషుని నోటినుండి పుట్టిన నరుల (బ్రాహ్మణుల) తేనెవలె తీయనైన శబ్దవినోదము(వేదమంత్రపారము) ప్రారంభమయ్యెను

ఇందు ఉపమున్ననందు అని యేకపద ప్రతిపాద్యార్థము పద్యమున తొలిచరణమునఁ బ్రతిపాదింపఁబడినది బ్రాహ్మణ' అనుటకు తృతీయచరణము వేదపారము అనుటకు చతుర్థచరణము విస్తరించి చెప్పఁబడినది అది ప్రౌఢి

(2) ద్వితీయప్రకారము - బహుపదప్రతిపాద్యార్థము ఏక పదమున ప్రతిపాదించుటకు ఉదా —

ఖండితానేత్ర కంజాలి మంజు రంజన పండితాః
మండితాఖిల దిక్ప్రాంతా శ్చండాంశో ర్భాన్తి భానవః

ఖండితల కనుదమ్మి మాలికలవలె మనోహరమైన కెంపు కాంతి సంపాదించు నేర్పుగలవి సకల దిక్ప్రాంతముల నలంకరించు నవియు నైన చండాంశు (సూర్యుని) కిరణములు శోభించుచున్నవి

ఈ యుదాహరణమునందు దేని పతి పరాంగనాగృహమున రాత్రి గడపి అచటనుండి ప్రొద్దుపొడుపున నింటికి వచ్చెనో అను వాక్యార్థము (పదసముదాయార్థము) ఖండిత' అను నొక్క పదమునఁ బ్రతిపాదిత మైనది

(3) తృతీయము ఓజఃప్రకారము – ఏకవాక్యార్థమును అనేక వాక్యార్థములఁ బ్రతిపాదించుటకు ఉదా —

అయాచితం సుఖం దత్తే యాచితస్య న యచ్ఛతి
సర్వస్వం చాపి హరతే విధి రుచ్ఛృంఖలో నృణామ్

వేడని వానికి సుఖము నిచ్చును వేఁడుకొనువానికి ఈయఁడు. సర్వధనమును హరించును, నరుల భాగ్యదేవత ఉచ్ఛృంఖలుఁడుగా నున్నాఁడు ఇట దైవాధీనము సర్వము అను నేకవాక్యార్థమునకు నానా వాక్యరచనాత్మకవిస్తరమునే ప్రాచీనులు "వ్యాస" మనిరి

(4) చతుర్థప్రకారము – అనేకవాక్యార్థమును ఏకవాక్యమునఁ జెప్పుటకు ఉదా :–

తపస్యతో మునే ర్వక్త్రాద్ వేదార్థ మధిగత్య సః
వాసుదేవ నివిష్టాత్మా వివేశ పరమంపదమ్

తప మొనర్చుచున్న ముని నోటినుండి వేదార్థమును తెలిసికొని అతఁడు భగవంతుఁ డగు వాసుదేవునియందు మనస్సు నుంచిన వాఁడై పరమపదము (మోక్షము) నొందెను

ఇట (1) ముని తపస్సు చేయుచున్నాఁడు (2) అతని నోటి నుండి వేదార్థమును అధిగమించెను. (3) తదనంతరము వాసుదేవ

పరబ్రహ్మమునందు మనసు ప్రవేశపెట్టెను (4) పిమ్మట ముక్తుడాయెను - అను నీ వాక్యార్థకలాపమున ప్రతిపాదితమైన యర్థము అంతయు ఏకవాక్యార్థీకరింపఁబడినది ఎట్లన తపస్యతః (తపస్సు చేయుచున్న) ఇట శతృ ప్రత్యయము అనగత్య (ఎఱింగి) క్త్వాప్రత్యయము వాసుదేవనివిష్టాత్మా (వాసుదేవునం దుంపబడిన మనస్సు గలవాఁడు) - బహువ్రీహిసమాసము వివేశ - ప్రవేశించెను ఇట తిఙంతము వీని ద్వారమున నాల్గువాక్యములఁ జెప్పదగిన యర్థము ఉద్దేశ్యవిధేయభావమున సంక్షేపరూపమున (సమాసమున) ప్రతిపాదింపఁబడినది 'తపస్యతో' ... నివిష్టాత్మా ఇది విధేయము (Subject) వివేశ ' ఉద్దేశ్యము (Predicate)

(5) పంచమప్రకారము - సాభిప్రాయత్వమునకు ఉదా. సాభిప్రాయ మనఁ బ్రకృతార్థపోషకత్వము

గణికాజామిాలముఖ్యా నవతా భవతా బతాఽహ మపి
సీదన్ భవమరుగర్తే కరుణామూర్తే న సర్వథోపేక్ష్యః

ఓ కరుణామూర్తీ (మూర్తి అనుటచే ప్రత్యక్షకరుణాస్వరూపా) (విదేహనగరస్థ పింగళికానామ) వేశ్యను అజామిాలుని (తన్నామక కన్యాకుబ్జదేశమువానిని దాసీపతిని ద్విజుని) మున్నగువారల నెందఱనో పతితులనుంగూడ రక్షించియున్నట్టి నీవు నన్ను సంసార మను నిర్జలగర్తమందు వెతల ననుభవించుచున్నవానిని సర్వథా ఉపేక్షింపఁదగదు

ఇందు విశేషణము లెల్ల ఉపేక్ష్యాభావమునకు పోషకములు కరుణామూర్తి ' అనుటచే ఎన్నండును ఉపేక్షించువాఁడు కాఁడని

భావము కాపురుషుఁడే ఉపేక్షింపఁడు సాక్షాత్కృతపరమాత్ముఁడు ఉపేక్షింపనే యుపేక్షింపఁ డని భావము తాను పాపాత్ముఁ డగుట ఉపేక్షించునేమో యను శంకకు పరిహారముగ 'గణికాజామిళాఘల 'ను చెప్పుట వారినే రక్షించుటచే తన్నును రక్షించు నని యభిప్రాయము సీదన్' ఆర్తులు ఉపేక్షానర్హు లని భావము ఇట్లు ఇందు సర్వ విశేషణములు సార్థకములు

9 కాంతి

దీప్తరసత్వము కాంతి స్ఫుటముగా ప్రతీయమాన మగుటచే రసము ఎట సముజ్జ్వలముగా నుండునో అచట కాంతి అర్థగుణము

ఉదాహరణము రసప్రకరణమందు 'శయితా' అను మున్నగు శ్లోకములందు వర్ణింపఁబడినది ఉత్తరగ్రంథమున అలంకారప్రసంగమునను వర్ణింపఁబడును

10 సమాధి

ఎవనిచేతను మున్ను వర్ణింపఁబడినదికాదు వర్ణ్యమాన మీ యర్థము ఎవఁడు వర్ణించినదానిఛాయయుఁ గాదు అను కవి యాలోచనము సమాధి అనఁగా ఉక్తరీతిని అది ఇట్టు తెలియగు

[శంక] ఆలోచన మన జ్ఞానవిశేషరూపము, ఆత్మగుణము కదా అది యర్థగుణ మెట్లగును ?

[సమా] జ్ఞానము గుణము గుణియైన యాత్మయందు సమవాయ సంబంధమున నుండును విషయతా సంబంధమున విషయమున (జ్ఞేయమున) నుండును జ్ఞానజ్ఞేయములకు విషయతా సంబంధము అందుచే ఆలోచన అర్థగుణమును అగుటకు బాధలేదు

(౧) సమాధియొక్క ప్రథమప్రకారమునకు ఉదా :—
తనయ మైనాక గవేషణ" కావ్యప్రకరణము అధి 9. పుట 74.

ఈ శ్లోకమునందు భగవతి గంగాదేవిని హిమాచలము భుజముగా పూర్వము ఎవరును ఉత్ప్రేక్షించినది లేదు.

(౨) సమాధి ద్వితీయ ప్రకారమునకు ఉదాహరణము ప్రాయికముగ సర్వత్ర.

ఇట్లు వామనాదులు ప్రాచీనులు గుణస్వరూపమును చెప్పిరి

రసగంగాధరము

మర్మప్రకాశవివరణసముల్లసితము

అధి 4 గుణత్రయమతము

ఇతరు లన్ననో మమ్మటాదులు ఈ గుణములనెల్ల (1) పూర్వోక్తములైన మాధుర్యౌజఃప్రసాదములందో, చెప్పఁబోవునట్లు దోషాభావమునందో (3) అలంకారములందో గతార్థపఱతురు (4) కొన్నింటిని వైచిత్రీమాత్రరూపములుగఁ జెప్పిరి (5) కొన్నింటిని దోషరూపములుగఁ జెప్పిరి. పర్యవసానము ఆ యితరుల మతమున మూఁడే గుణములు — ఇఱువది కాదు

(౧) శబ్ద గుణములు .—

శ్లేష ఉదారత, ప్రసాదము, సమాధి ఈ నాలుగు గుణములకు ఓజోవ్యంజక ఘటనయందే (వర్ణ రచనయందే) అంతర్భావము నిజమునకు ఇవి శబ్దగుణములు కావు.

[శంక] శ్లేషోదారతలు సర్వాంశమునందు గాఢబంధాత్మకములు. కావున ఓజోవ్యంజకరచనలో నంతర్భవించుఁగాక ప్రసాద సమాధు లన్ననో గాఢబంధ శిథిలబంధ ద్వయాత్మకములు కదా అందు గాఢబంధాంశము సరే, ఓజోవ్యంజకరచనలో నంతర్భవించినను, శిథిలబంధాంశమునకు ఎట్లనంతర్భావము ?

[సమా] మాధుర్యవ్యంజకరచనలోఁగాని, ప్రసాదవ్యంజక రచనలోఁగాని తదంతర్భావము చెప్పనౌను వామనాదుల

మాధుర్యగుణము మమ్మటాదులు స్వీకరించిన మాధుర్యవ్యంజక రచనయే - రసనిష్ఠమైన వ్యంగ్యమాధుర్యగుణమునకు వ్యంజకమైన రచనయే ఇట్లు సర్వత్ర వ్యంజకమునందు వ్యంగ్య శబ్దము లాక్షణికము అని యెఱుంగ వలెను అందుచే ఓజోగుణము ఓజోవ్యంజక రచనయందు అంతర్భావ మొందును అందుచే మాధుర్యము గుణము కాదు సమత సర్వత్ర ఏకరీతిని సముచితము కాదు ప్రతిపాద్యము (వర్ణ్యము) యొక్క ఉద్భటానుద్భటత్వములఁబట్టి రచనయందు భేదము కలుగుచునే యుండును అనఁగా వర్ణ్యమైన విషయము ఎచ్చట ఉద్ధతమో అచట రచన ఉద్ధతము, ఎచట అనుద్ధతమో అచట రచన కోమలము ఇట్లు మార్గద్వయరచనాభేదము ఇష్టమే కాని అన్ని పద్యములయందు సర్వాంశముల రచన ఏకవిధముగా నున్నచో అది గుణముకాదు అనుచితమై దోష మగును అభిన్నమార్గ రూపము సమత ఇట్లు గుణముకాదు.

ఉదా :—

నిర్మాణే యది మార్మికోఽసి నితరా
మత్యంత పాకద్రవ
న్మృద్వీకా మధు మాధురీ మదపరీహారో
ద్ధురాణాం గిరామ్
కావ్యం తర్హి సఖే, సుఖేన కథయ
త్వం సమ్ముఖే మాదృశాం
నోచేద్, దుష్కృత మాత్మనా కృత మివ
స్వాంతాద్ బహి ర్మాకృథాః.

ఓ నెచ్చెలీ, నీవు అత్యంతపక్వమగుట మధురసము స్రవించు ద్రాక్ష ఫలముల తియ్యదనంపు టభిమానము సర్వము పరిహార మగునట్టి యుత్తమ శబ్దముల కావ్యము నిర్మించు మర్మము నెఱుంగుదువేని, మావంటివారి యెదుట కావ్యము చెప్పుము. అటుకాదేని, తాఁజేసిన దుష్కృతమును (పాపమునుం) బోలె నీ కృతిని నీ మనస్సున నుండి బయల్వెడల నీయకుము.

ఈ శ్లోకమునందు తొలి మూఁడు చరణముల లోకోత్తర కావ్యనిర్మాణమునుగూర్చి ప్రతిపాదింపఁబడినది. అందు రచన ఉద్ధత వర్ణవిన్యాసముగా నున్నది. నాల్గవచరణమునం దన్నో కుకావ్యము ప్రతిపాదింపఁబడినది. అది అనుద్భట మగుట రచనయు అనుద్భట వర్ణ విన్యాసముగ నున్నది. ఇట్లు రెండు మార్గముల ప్రతిపాద్యము కలదు తదుచితముగ రెండు మార్గముల రచనయుఁ గలదు అందుచే నిట విషమతయే గుణమగును, సమతకాదు. అది దోషమే యగును.

సౌకుమార్యమును కాంతియుఁ బ్రత్యేక గుణములు కావు శ్రుతికటుత్వరూప మగు కష్టత్వదోషాభావమా సౌకుమార్యము గ్రామ్యత్వదోషాభావము కాంతి ఈ రెండును దోషాభావరూపములే. గుణములు కావు. ఇట కష్టత్వ మన దుశ్శ్రవత్వము పద దోషము, దురూహత్వము కాదు, అది అర్థదోషము కావున ఓజో వ్యంజకవర్ణఘటనారూపము కష్టత్వాభావము మాధుర్య (అపరుషత్వ) వ్యంజకవర్ణఘటితత్వము సౌకుమార్యము తదభావము (సౌకుమార్యాభావము) దుశ్శ్రవత్వము.

అర్థవ్యక్తియు స్వతంత్రమగు గుణము కాదు అది ప్రసాద గుణములో నంతర్భవించును ఇట్లు వామనాద్యుక్తశబ్దగుణములు పదియు నిరాకృతములు

అర్థగుణములు :— ఇఁక అర్థగుణము లందును, శ్లేష ఓజస్సు యొక్క తొలి నాల్గుప్రకారములు అర్థవైచిత్రిమాత్రరూపములు, ద్రుత్యాదిచిత్తవృత్తిరూపములు కానేరవు అందుచే గుణత్వానర్హ ములు అట్లుగాక అర్థచిత్రమాత్రమున కెల్ల గుణత్వము ఒప్పినచో ప్రతిశ్లోకమునందును అర్థవైలక్షణ్య ముండును కావున అచ్చోట నెల్ల గుణత్వము నంగీకరింప నమకట్టిన ఎన్నోని గుణభేదముల నంగీక రింపవలసియే యుండును ఓజస్సు యొక్క పంచమ ప్రకారమును, వామనోక్తములైన యర్థగుణములలో మాధుర్యౌజఃప్రసాదములు గాక తక్కిన యేఁడును స్వతంత్రగుణములు కావు దోషాభావ రూపమాత్రములే ఎట్లన (1) అధికపదము అను దోషము లేమియే ప్రసాదము (2) ఉక్తివైచిత్రిరూపము మాధుర్యము అనవీకృత మను దోషము లేమియే (3) అమంగళరూపాశ్లీలత్వదోషము లేమియే సౌకుమార్యము (4) అగ్రామ్యత్వరూపదోషము లేమియే అగ్రా మ్యాత్మ ఉదారత. (5) ప్రక్రమభంగరూప దోషము లేమియే (అవైషమ్యరూపము) సమత (6) అపుష్టార్థత్వదోషము లేమియే (సాభిప్రాయాత్మకము) ఓజఃపంచమప్రకారము ఇట్లు దోషాభావ రూపములు కొన్ని. (7) స్వభావోక్త్యలంకారరూపము (స్ఫుటత్వా త్మకము) అర్థవ్యక్తి (9) రసప్రాధాన్యమున్న చోట రసధ్వనిరూపము రసము అప్రధానమైనచోట రసవదలంకారరూపము (స్ఫుటరసత్వ లక్షణము) కాంతి – ఇట్లు అలంకార స్వీకరణముచేఁ గొన్ని – గతార్థములు (9) సమాధియు కవిగతము కావ్యకారణము నగు

నాలోచనారూపజ్ఞానాత్మకము అది ఆత్మగుణము - కవిగతము - అగుఁ గాని, రసగతము కాదు అందుచే కావ్యగుణము కాదు మఱి 'కావ్యకారణమైనను సమాధి కావ్యగుణ మగుఁగాక ' అనరాదు అట్టిచో కావ్యకారణము ప్రతిభయు కావ్యగుణము కావలసివచ్చును

ఉక్త హేతువులం బట్టి మాధుర్యౌజః ప్రసాదములు మూఁడే కావ్యగుణములు అని మమ్మటాదులు నుడువుదురు

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అధి 5 మాధుర్యాది వ్యంజకవర్ణములు

మాధుర్యౌజః ప్రసాదగుణములు కేవల రస ప్రయోజక మాత్రములే కావు రచనాగతములు నగునని సిద్ధాంతితము. అందుచే తత్తద్గుణవ్యంజకరచనాస్వరూపజ్ఞానము అత్యావశ్యకము అందుచే తద్రచనాస్వరూపము నిరూపింపఁ బడుచున్నది. క్రమబద్ధ వర్ణ విన్యాసము రచన మొదట మాధుర్య వ్యంజకరచనా నిరూపణము

(1) టవర్గము కాక కడమ నాల్గు వర్గముల ప్రథమ తృతీయ వర్ణములు. [క గ చ జ త ద ప బ వర్ణములు — పరుష సరళాక్షరములు]

(2) శ ష స య ర ల వ లు

(3) నికట నికట ప్రయుక్తములు (౧) అనుస్వారములు (౨) అనునాసికపరసవర్ణములు (3) కేవలానునాసికములు

(4) హ్రస్వస్వరానంతరిత రేఫణకారములు, ఏతద్ఘటితములు.

(5) చెప్పఁబోవు సామాన్య విశేషనిషిద్ధము లైన సంయోగ స్పర్శలేనివి.

(6) అసమాసము అల్పసమాస మొండె యైనది యగు వర్ణానుపూర్వీరూప రచన మాధుర్యగుణవ్యంజక మగును

పైని వర్గ ప్రథమ తృతీయ వర్ణములనే చెప్పి కేలన, ద్వితీయ చతుర్థములు - వర్గయుక్కులు = ఖఘ, చఝ ధధ ఫభ అను నొ త్తక్షరములు - మాధుర్యగుణానుకూలములు కావు దూర దూరమునం బ్రయుక్తములైనచోఁ బ్రతికూలములునుం గావు ఉదాసీనము లగునని భావము. ఆ యూదాసీన్యమునందును విశేషము కలదు అనుప్రాసలు తదధీనము లగునేని దూరదూరమున నివేశితములైనం గూడ తప్పక మాధుర్యగుణ ప్రతికూలములై ఉదాసీనములు కాకపోవును

కొందఱు ట వర్గము గాక కడమ వర్గముల యక్షరములై దేసి సమీపనివేశనాదివిచారరహితముగ (అవిశిష్టముగ) ప్రయుక్తములైనచో మాధుర్య వ్యంజకము లగు నందురు ఆ మతము అవిచారితరమణీయము [అని 'కొందఱు' అందురు. ఖాది వర్గయుక్కులు ఓజోవ్యంజకము లని చెప్పఁబోవు చుండుటచేతను సూచితము]

మాధుర్యవ్యంజనకు ఉదా :—

భగవద్భక్తుఁ డొకఁడు తన మనస్సును ప్రబోధించుచున్నాడు.

తాం తమాలతరు కాన్తి లఙ్ఘినీం
కిఙ్కరీకృత నవామ్బుద త్విషామ్
స్వాన్త, మే కలయ శాన్తయే చిరం
నైచికీనయనచుమ్బితాం శ్రియమ్.

ఓ మనసా, తమాలతరు శ్యామల కాంతిని మీఱునది, నూత్న జలదచ్ఛవిని మించునది, మేలియావుల కనులు (ముద్దుగొను)

ప్రేమతో నవలోకించు శ్రీకృష్ణుని శోభను నాకు చిరకాలము శాంతికై సమకూర్పుము

ఒండె—

స్వేదాంబు సాన్ద్ర కణశాలికపోలశాలి
రన్తస్స్మితాలస విలోకన వన్దనీయా
ఆనన్ద మఙ్కురయతి స్మరణేన కాఽపి
రమ్యా దశా మనసి మే మదిరేక్షణాయాః

స్వేదబిందువులచే దట్టమై ప్రకాశించు కపోలములు గలదియు అంతరమైన చిరునగవుచే నలసమైన చూపుగలిగి వందనీయమైనదియు నగు మదిరేక్షణయొక్క ఒకానొక రమ్యమైన దశను స్మరించుట నా మనసున గొప్ప ఆనందమును మొలకెత్త జేయుచున్నది

తొలి పద్యమునందు అతిశయోక్తిచే నలంకృత మగు భగవద్ధ్యానౌత్సుక్యముకాని భగవద్విషయకరతిభావముకాని ధ్వాయమాన మగుచున్నదై కడకు శాంతరసమందే పర్యవసన్న మగుటంజేసి తద్గతమాధుర్యమును అభివ్యంజించు చున్నది రచన రెండవదానియందన్నో రచన మదిరేక్షణాదశాస్మృతి రూప వ్యభిచారిభావముచే పరిపోషింపఁ బడుచున్నట్టి శృంగారరసమం దున్న మాధుర్యమునకు వ్యంజకము

శిఞ్జాన మఞ్జుమఞ్జీరా శ్చారుకాఞ్చన కాఞ్చయః
కఙ్కణాఙ్క భుజా భాన్తి జితానఙ్గ! తవాఙ్గనాః

ఓ జితమన్మథుఁడా, ధ్వనిచేయు మనోహరమైన యందియలు గలవారును, అందమైన బంగరు మొలనూలు కలవారును,

కంకణ చిహ్నితమైన బాహువులు కలవారును నైన నీ స్త్రీలు విల
పిల్లుచున్నారు

> దారుణ రణే రణన్తం కరిదారణకారణం కృపాణం తే
> రమణకృతే రణరణకే పశ్యతి తరుణీజనో దివ్యః
> (హేమ. కావ్యానుశాసన)

రాజా భయంకరమైన యుద్ధమునం దేన్గుల నఱకుచు రణరణ
ధ్వని చేయుచున్న నీ కృపాణవిలాసమును దివ్యవనితలు తమ
నూత్న రమణులు (యుద్ధమృతులు) చేయుచున్న రణరణధ్వనిగాఁ
జూచుచున్నారు

> అనఙ్గరఙ్గప్రతిమం తదఙ్గ
> భఙ్గీభి రఙ్గీకృత మానతాఙ్గ్యాః
> కుర్వన్తి యూనాం సహసా తథైతాః
> స్వాన్తాని శాన్తాపరచిన్తనాని

సన్నతాంగియైన యాస్త్రీ యొక్క అంగభంగిమములచే
మన్మథరంగమునకు సాటియగునట్లుగా నంగీకృత మైనది. మఱియు
నా యంగభంగిమములుయువకుల మనస్సులను మిక్కిలి త్వరితముగా
నశాంతిమగ్నము(నిర్వేదమగ్నము)లగువానినిగా నొనరించుచున్నవి

> మనీషితాః సన్తి గృహేపి దేవతా
> స్తపః క్వ వత్సే క్వచ తావకం వపుః ?
> పదం సహేత భ్రమరస్య పేశలం
> శిరీషపుష్పం న పునః పతత్రిణః
> (అలం మహోదధి)

ఓ బిడ్డా మన గృహమున కోర్కెల నొసఁగు దేవతలు కలరు తపస్సెక్కడ ? నీదగు శరీర మెక్కడ ? శిరీషపుష్పము తుమ్మెద యొక్క మెత్తని పాదములను సహింపగలదు కాని పక్షియొక్క పాదబలమును సహింపలేదుగదా

ఓజో వ్యంజక రచన

ఒండొంటి సమీపప్రయుక్తము లగు (1) వర్గ ద్వితీయ చతుర్థ వర్ణములు (వర్గయుక్కులు) (2) టవర్గాక్షరములు (3) భూయిష్ఠముగ జిహ్వామూలీయోపధ్మానీయ విసర్గ సకారములు (4) పరమున సంయుక్తము గల్గి హ్రస్వాక్షర నికటప్రయుక్త మగు బహుళరేఫయో జయ్యో (అనునాసికేతరవర్గాక్షరమో) కలిగిన రచన — దీర్ఘసమాసాత్మకము — ఓజోవ్యంజకము

ఇందు విశేషము కలదు ఈ రచనలో ప్రథమతృతీయ వర్గ్య వర్ణములు (మాధుర్యవ్యంజకము లగుట) ఓజోగుణమునకు అనుకూల ములు కావు సంయోగఘటకములు కానిచో అవి ప్రతికూలములే యగును ఉదాసీనమాత్రములును గావు సంయోగఘటకములైనచో అవే అనుకూలము లగును అట్లే అనుస్వారములు పరసవర్ణములును సంయోగఘటకములు కానిచో ఉదాసీనములు, సంయోగఘటకము లైనచో అనుకూలములు

ఉదా :—

నవోచ్ఛలిత యావనస్ఫురదఖర్వగర్వజ్వరే
మదీయ గురుకార్ముకం గలిత సాధ్వసం వృశ్చతి
అయం పతతు నిర్దయం దలితదృప్తభూభృద్గల
స్ఖలద్రుధిరఘస్మరో మమ పరశ్వథో భైరవః

నూతనముగా ప్రాదుర్భవించు యౌవన వికాసముచే నున్నత మగు గర్వజ్వరము గలిగి నా గురువగు శివుని ధనుస్సును నిర్భయముగా విఱిచినవాడగు రామునిపై, చీల్చబడిన దృప్తులగు రాజుల యొక్క కంఠములనుండి చిప్పిలు రక్తమును గ్రోలునదియు భయంకరము నగు నా గండ్రగొడ్డలి దయావిహీనమై పడుగాక!

[ఇది రౌద్రరసోదాహరణముగా నీయబడినది] ఇందు ఝుయ్ సంయోగాది ఘటిత మగుట ఓజస్సునకు ఉదాహరణము,

జ్యాజిహ్వా కావలయితోత్కటకోటి దంష్ట్ర
ముద్గారి ఘోర ఘన ఘర్ఘరఘోష మేతత్
గ్రాసప్రసక్త హస దన్తక వక్త్ర యన్త్ర
జృమ్భావిడమ్బి వికటోదర మస్తు చాపమ్.

(మ. రా. చ)

జ్యారసన యుత్కటార్త్రి దంష్ట్రలను జుట్టి
ప్రోద్గిరద్ఘన ఘర్ఘర స్ఫూర్జనంబు
అశనసక్త ఖఖత్కృతాంతాస్యయన్త్ర
జృంభ వికటోదరముగాత మీ ధనుస్సు.

ఈ నా విల్లు అల్లెత్రాడను నాల్కచేత చుట్టబడియున్న యుత్కటమగు నంచులను కోరలు కలదై భయంకరమగు గ్రేన్పులం బోలు మేఘముయొక్క ఉరుమువంటి ధ్వని కలదియునై జగత్కబళనమునందు లగ్నమై నవ్వుచున్న యముని వక్త్రయంత్రంబునుండి వెడలు నావులింతల యాడంబరముచే వికటోదరమైన దగుగాక

అద్యాపస్కందలీలా చలిత బలపరిస్పన్దఖర్వీకృతోర్వీం
సంరంభోత్తంభనాయోన్నమిత భరనమత్కన్ధరాసన్ధి రాసీత్
శేషో విష్కార ఫుల్లస్ఫుటపృథులఫణా స్ఫాత్కృతాగ్నిస్ఫులింగ
స్ఫూర్జత్సందోహ సన్దేహిత వికట శిఖామణ్డలీరత్న ఖణ్డః.
(అలం. మహో.)

ఇప్పుడు నిత్యమును దుర్బల యగుటచే తలలమీదినుండి జారిపడి పోవుచున్న పృథివిని ఎత్తిపట్టుటకై నిక్కించబడిన మెడ కలవాఁడైన శేషునియొక్క ఆ యత్నోత్సాహములో విప్పారుకొన్న పడగలనుండి వెలిగ్రక్కబడుచున్న నిప్పురవ్వలు ఆయన శిఖామండలములమీఁదఁ దాపఁబడిన రత్నఖండముల భ్రాంతిని గలుగఁజేసినవి.

ప్రసాదవ్యంజకరచన

వర్ణవిశేష నియమరహితమై శ్రవణమాత్రమున వాక్యార్థము కరతలామలకమువలె నావిష్కరించు ఘటన ప్రసాదవ్యంజక మగును. ఇది సర్వరససాధారణ మగు గుణము.

ఏలన వాక్యార్థంపు ఝటితిప్రతీతిమాత్రమే వలసినది. ఏది ఎండు కట్టియలలో నిప్పువలె వడిగా చిత్తములో వ్యాపించునో (ఆవిష్కరించునో) అది ప్రసాదము. ఎల్ల రచనలయం దుండును. (సా ద) ఓజోమాధుర్య వ్యంజకరచనలయందునుం గూడ నుండునని భావము.

ఉదాహరణములు ప్రాయికముగ నా (పండితరాయుని) పద్యములెల్లను. అట్లైనను ఇది ఉదాహరణము:—

అలుకఁబూనిన యొకానొక ముగ్ధరాలితో సఖి వచించు చున్నది —

చిన్తామీలితమానసో మనసిజః,
సఖ్యో విహీనప్రభాః,
ప్రాణేశః ప్రణయాకులః పున రసా
వాస్తాం సమస్తా కథా
ఏత త్త్వాం వినివేదయామి మమచే
దు క్తిం హితాం మన్యసే
ముగ్ధే మాకురు మాన· మాననమిదం
రాకాపతి ర్జేష్యతి.

ఓసిగోలా, మన్మథుఁడు (ఈ యలుక ఎట్లు పరిణమించునా అను) చింతచే మనస్సంకోచము నొందినాఁడు నీ సఖులు (విపరీతఫలాశంకచే) కాంతి దక్కియున్నారు నీ ప్రాణేశుఁడు (తన తప్పు నెఱుంగక) ప్రేమకారణమున వ్యాకులితచిత్తు డైనాఁడు. మఱి యీ కథ యెల్ల ఉండనిమ్ము నేను చెప్పుచున్నాను నామాట హిత మని యెంచిన, ఈ పూర్ణచంద్రోదయ సమయమున అలుకను మానుము ఏలందువా, (నిసర్గనిష్కలంకమును) నీ నెమ్మోము (ఇప్పుడు రోష కలుషితము కాఁగా) ఈ పూర్ణచంద్రుఁడు జయించును

ఈ శ్లోకము "చిన్తామీలితమానసో మనసిజః" "మా కురు మాన మాననమిదం" అను నంశల మాధుర్యాభివ్యంజకము "సఖ్యో విహీనప్రభాః" ఇత్యాద్యంశమున ఓజోవ్యంజకము అట్లెనను సర్వాంశలయందు ఝటిత్యర్థస్ఫూర్తిచే ప్రసాదాభివ్యంజకము

[శంక] ఓయీ, శృంగారాశ్రయమైన మాధుర్యమునకు అభివ్యక్తి కలుగుటంజేసి రచన మాధుర్యానుకూల మగుంగాక. మఱి ఓజోగుణమునకు ఏమి ప్రసక్తి? ఓజోవ్యంజకవర్ణవిన్యాసము వీరాదిరసముల సందర్భమునఁగదా?

[సమా] ఇట వీరాదిరసస్ఫూర్తి లేదు కావున ఓజోగుణము నిరర్థక మనరాదు ఏలన, నాయికామనఃప్రశాంతికై అనేక యత్నముల హిత ముపదేశము చేయువారైన సఖులు క్రోధమునుంగూడఁ బూనుట స్వాభావికము పలుమాట లేల? రౌద్రాది రసముల అమర్షాది భావముల వ్యంజించు స్థలములందే ఓజోవ్యంజకరచన అని వివక్షానియమము లేదు అట్టి వివక్ష లేనపుడును వక్త క్రోధస్వభావుఁడని ప్రసిద్ధి కలచోటను, వాచ్యము అతికర్కశ మగు చోటఁగాని, ఆఖ్యాయికాదిప్రబంధములలోఁ గాని పరుషవర్ణఘటన ఇష్టమే. అట్లే మమ్మటభట్టు వచించినాడు .—

'వక్తృవాచ్య ప్రబంధానా మౌచిత్యేన క్వచిత్ క్వచిత్
రచనా వృత్తి వర్ణానా మన్యథాత్వ మితీష్యతే'

[సంఘటనలు (రచనలు) వర్ణములు సమాసములు గుణవ్యంజకములైనను గూడ] కవి తన్నిబద్ధుఁడేని యైన వక్త, వాచ్యము (వర్ణ్యము), ప్రబంధము - వీనికిఁ దగినట్లు క్వాచిత్కముగ రచనా వృత్తి వర్ణములు గుణపరతంత్రములు కాకపోవుట మాకు ఇష్టమే అందుచే వక్తృవాచ్య ప్రబంధౌచితిచే బాధిత మైనప్పుడు కాక, వక్త్రాద్యౌచిత్యము లేనప్పుడే గుణపారతంత్ర్యము అంగీకర్తవ్యము. (మా కావ్య ప్రదీపము)

కాని, పూర్వోదాహరణమున మాధుర్యసాంకర్య మున్న దన్న ఇదె అసంకీర్ణము ప్రసాదోదాహరణము :—

వాచా నిర్మలయా సుధామధురయా
యాం నాథ శిక్షా మదా
స్తాం స్వప్నేఽపి న సంస్పృశా మ్యహ మహం
భావావృతో నిస్త్రపః,
ఇ త్యాగశ్శతశాలినం పునరపి
స్వీయేషు మాం బిభ్రతః
త్వత్తో నా స్తి దయానిధి ర్యదుపతే
మత్తో న మ త్తః పరః

ఓ నాథా యదుపతీ, నిర్మల సుధామధుర వాక్కుచే నాకు మున్ను నీవు (క ర్తవ్య) శిక్షను దేనిని అనుగ్రహించితివో దానిని అహంభావముచే నావరింపఁ బడినవాఁడనై నేను లజ్జాశూన్యుఁడను స్వప్నమందైనను స్మరించిన(అనుష్ఠించిన)వాఁడను కాను ఇట్టి యపరాధ శతశీలుని నన్ను మఱల ఆత్మీయులలో నొకనిగా నెన్ను చున్న నీకన్న దయానిధియు లేఁడు నా కన్న మత్తుఁడును లేఁడు

పై శ్లోకమున గుణాంతరసమ్మిశ్రముకాని ప్రసాదగుణము విలసిల్లుచున్నది

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అధి. 6. రచనలందు వర్జనీయములు

1 సామాన్యదోషములు

ఇప్పుడు తత్తద్రస వ్యంజన సమర్థమైన రచనయొక్క పరిచయమునకై సామాన్యముగను విశేషముగను వర్జనీయ మొకింత నిరూపింపఁబడును అందు తొలుత వర్జనీయసామాన్యములు చెప్పఁబడును

వర్జనీయమున అశ్రవ్యత్వము అగ్రగణ్యము శ్రవణమునకు అప్రియ మగుట అశ్రవ్యత్వము అది బహుప్రకారకము

(౧) (క) అవే వర్ణములు ఏకపదమున ఒక పర్యాయము సహప్రయుక్తము లైన ఒకించుక అశ్రవ్యము లగును

ఉదా :—

'కకుభసురభిః వితతగాత్రా పలల మి వాభాతి."

[కుటజ పుష్పముల తావిగలది విశాలాంగి ఈ తెలువ మాంసపిండమువలె నున్నది] ఇట "కకుభ" అనుచో కకార ద్వయము, "వితత" అనుచో తకారద్వయము, 'పలల అనుచో లకార ద్వయము ఏకపదమున అవ్యవహిత సహప్రయోగముచే ఒకించుక అశ్రవ్యత్వము కలిగినది. కావున వర్జనీయము

(చ) అవే వర్ణములు ఏకపదమున అనేకపర్యాయములు అవ్యవధానసహప్రయుక్తములైన అత్యంతము అశ్రవ్యత్వము కలుగును అందుచే అది కూడనే కూడదు

ఉదా :—

వితతతరస్తరు రేష భాతి భూమౌ.

ఏకపద ఘటకమైన తకారమునకు రెండుమారులు సానంతర్యము (అవ్యవహితోత్తరముగ ప్రయోగము) కలిగినది ఉచ్చారణ క్లేశము శ్రవణకారిన్యము ఇందుంటచే వర్జ్యము మొదటిది ఇంచుకేని సహ్యమగును ఇది కానేకాదు

(ట) అవే వర్ణములకు భిన్నపదగతములకు సకృదానంతర్యమున ఇంచుక అశ్రవ్యత్వము కలుగును.

ఉదా :—

శుక, కరోషి కథం విజనే రుచిమ్ ?

భిన్నపదములందు కకారద్వయమునకు ఏకపర్యాయము ఆనంతర్యమును [ఏకపదమునందు సకృదానంతర్యమునంబోలె] ఒకించుక అశ్రవ్యత్వజనక మగును

(త) భిన్నపదముల అనేకపర్యాయములు సానంతర్యము అత్యంతము అశ్రవ్యత్వహేతుకము.

ఉదా .—

పిక, కకుభో ముఖరీకురు ప్రకామమ్.

ఇట భిన్నపదములందు కకారమునకు అసకృదానంతర్యము

(ఌ) ఇంతవఱకు వర్ణములకు స్థానానంతర్యమునఁ గలుగు నశ్రవ్యత్వము చెప్పఁబడినది ఇంక స్వవర్గ్యాక్షరానంతర్యమునఁ గలుగు నశ్రవ్యత్వము చెప్పఁబడును

(క) [స్థానానంతర్యముచేత వర్ణముల కెట్లో అట్లే] వర్గ్యాక్షరములకును ఏకపదగతములకు సకృదానంతర్యమున ఇంచుక అశ్రవ్యత్వము కలుగును.

ఉదా :—

"వితథస్తే మనోరథః"

ఇట తకార థకారములకు ఏకవర్గ్యములకు ఏకపదమున సకృదానంతర్యముచే ఒకించుక అశ్రవ్యత్వము

(చ) స్వవర్గాక్షరములకు ఏకపదగతములకు అసకృదానంతర్యమున అత్యంతము అశ్రవ్యత్వము

ఉదా :—

వితథతరం వచనం తవ ప్రతీమః

ఇట ఏకపదమున (1) తకారథకారములకు (2) థకారతకారములకు అసకృదానంతర్యము అత్యంతము అశ్రవ్యము

(ట) అట్లే భిన్నపదగతములకు ఏకవర్గీయాక్షరములకు సకృదానంతర్యమున ఇంచుక అశ్రవ్యత్వము

ఉదా :—

అథ తస్య వచః శ్రుత్వా

ఇట భిన్నపదముల తథలకు సకృదానంతర్యము.

(త) భిన్నపదగతములకు ఏకవర్గీయాక్షరములకు అసకృదానంతర్యముచే అత్యంత మశ్రవ్యత్వము.

ఉదా :—

అథ తథాకురు యేన సుఖం లభే

భిన్నపదములందు (1) థత లకు (2) తథలకు అసకృదానంతర్యము

(ప) ఏకవర్గమందలి ప్రథమ ద్వితీయవర్ణములకుం బోలె తృతీయ చతుర్థ వర్ణములకును ఆనంతర్యము, సమానము

(3) తదతిరిక్తములకు :—

(క) ఏకవర్గీయ ప్రథమ తృతీయ వర్ణములకు (క, గ లకు) గాని, ద్వితీయ తృతీయములకు (ఖ గ లకు) గాని సకృదానంతర్యముచే ఇంచుకే అశ్రవ్యత్వము అత్యధికము కాదు ఇది కావ్యరచనమున కుశలులైనవారలకే ఎఱుక కావున వారు ఈ దోసఁగును పరిహరింతురు. అన్యులకు అవగతము కాకపోవుటచే పరిహరింప నేర్వరు

ఉదా :—

నిగదతి ఖగః శుకోఽయమ్.

ఇట ద్వితీయ తృతీయవర్ణములకు సకృదానంతర్యమునంజేసి ఇంచుక అశ్రవ్యత్వము

(చ) పైఁ జెప్పిన వర్ణములకు అసకృదానంతర్య మున్నచో అశ్రవ్యత్వము అధికతరమగుటంజేసి కావ్యనిర్మాణ మర్మజ్ఞులు కాని వారలకును ఎఱుఁగ శక్యమే

ఉదా :—

ఖగ కలానిధి రేష విజృంభతే

ఇతి వదతి దివానిశం స ధన్యః

ఇందు తొలింటి యుదాహరణమున 'ఖగ'లకు గక' లకు,

(వర్గద్వితీయ తృతీయములకు తృతీయ ప్రథమ వర్ణములకు) అసకృదానంతర్యముచే అధికాశ్రవ్యత్వము రెండవ యుదాహరణమున, 'దత', 'తద' (తృతీయ ప్రథమ, ప్రథమ తృతీయములకు) అసకృదానంతర్యముచే అధికాశ్రవ్యత్వము

(ట)వర్గపంచమములకు (ఙకారాద్యనునాసికములకు) స్వవర్గాక్షరములతోఁ గూడ నానంతర్యము మధురమగుటంజేసి అశ్రవ్యము కాదు

ఉదా :—

తనుతే తనుతాన్తనో

ఇట నకారమునకు తకారముతో గూడ సకృదానంతర్యముచే అశ్రవ్యత్వము లేదు. మధురత్వమే కలదు

(త)వర్గపంచమవర్ణములకు స్వానంతర్య మున్ననో అశ్రవ్యమే - మధురము కాదు

ఉదా :—

మమ మహతీ మనసి వ్యథాఽవిరాసీత్.

ఇట మకారమునకు మకారముతో అసకృదానంతర్యము అశ్రవ్యనే

అపవాదములు

(౧) ఈ చెప్పిన యశ్రవ్యత్వమునకు అపవాదములు కలవు ఎట్లన :—

(క) గురువులగు నజ్వర్ణవ్యవధానము కలిగిన అశ్రవ్యత్వము తొలఁగును

ఉదా:—

సఞ్జయతాం కథఙ్కారం కాకేకేకా కలస్వనః

ఇట కకారములకు అసకృదానంతర్యముచే అశ్రవ్యత్వదోషము ఉప్పతిల్లవలసియున్నను, ఆ, ఏ, ఏ ఆ అను గుర్వచ్చులు నడుమ నడుమ వచ్చుటచే, అది నివర్తిల్లినది.

ఉదాహరణాంతరము:—

యథా యథా తామరసాయతేక్షణా
మయా సరాగం నితరాం నిషేవితా
తథా తథా తత్త్వకథేవ సర్వతో
విక్రుష్య మా మేకరసం చకార సా.

ఆ నలినాక్షి ఎట్లెట్లు నాచే ప్రణయపూర్వకముగ మిక్కిలి సేవింపఁబడినదో అట్లట్లు బ్రహ్మోపదేశవాక్యమువలె సర్వవిషయములనుండి యాకర్షించి స్వమాత్రసంలగ్నచిత్తునిగా చేసినది.

ఇందు మూఁడవ పాదమున తత, తథలకు అసకృదానంతర్యమునఁజేసి అశ్రవ్యత్వ ముప్పతిల్లవలసి యున్నను, దీర్ఘాకారస్వరము నడుమ నడుమ వచ్చుటచే దోషము తప్పినది ఇవి దీర్ఘత్వమున గురువులైన యక్షరముల వ్యవధానమునకు ఉదాహరణము

(చ) సంయోగాక్షరములు పరమునం దుండుటచే గురువులైన వర్ణముల వ్యవధానమునకు ఉదా :—

అంగదేశ రాజవర్ణనము :—

సదా జయానుషంగిణాం మగ్గానాం సగ్గరస్థలమ్
రఙ్గాఙ్గణ మివాభాతి త త్తత్తురగతాణ్డవైః.

నిరంతర జయసంబంధముగల యంగదేశరాజుల యుద్ధభూమి ఆ యా తురంగముల తాండవముచే (గతి విశేషముచే) నాట్యరంగాంగణమువలె నొప్పారుచున్నది

ఇట చతుర్థపాదమున 'త త్తత్తు' అనుచోట తకారమునకు అసకృదానంతర్య మున్నను, సంయుక్తము పరమునం దుంటజేసి గురుత్వమొందిన 'అ' కారముయొక్క వ్యవధానము కలుగుటచే అశ్రవ్యత్వము లేదు. ఈ యపవాదమున విశేషము కలదు అది గుఱుతింపఁదగును గుర్వక్షర వ్యవధానము ఏ వర్ణములకుఁ గలదో ఆవర్ణముల సహప్రయోగము (ఆనంతర్యము) యొక్క యశ్రవ్యత్వము

కూడ నివర్తిల్లదు అంటుచే 'యథా యథా' అను పద్యములో గుర్వాకారవ్యవహిత మైన థకార తకారముల యానంతర్యము యొక్క యశ్రవ్యత్వమే తలఁగినది అంతేకాని, 'తథా తథా' అని తకారథకారముల యానంతర్యంపు టశ్రవ్యత్వముకూడ తొలఁగినది కాదు [త్ + అ థ్ + ఆ త్ + అ థ్ + ఆ త్ + అ] ఆయంశలో అశ్రవ్యత్వ దోషము ఉండనే ఉన్నది ఏలన, [త్ అథ్ త్ అథ్] అని తథలకుమధ్య హ్రస్వము అకారము కలదు గురువు ఆకారము లేదు

(గ) ఇంకొక యశ్రవ్యత్వము —

(క) మూఁడు నాల్గు వర్ణముల సంయోగము కల్గినను ప్రాయికముగ అశ్రవ్యత్వము ఉత్పత్తిల్లును ప్రాయికముగ ననుటచే నొక్కొక్కప్పుడు ఉత్పత్తిల్లదని భావము

ఉదా. —

రాష్ట్రే తరోష్ట్ర్యః పరితః చరన్తి.

'రాష్ట్రే' (ష్ + ట్ + ర్) - షకార టకారరేఫలు మూఁడింటి సంయోగము 2 ఉష్ట్ర్య' - (ష్ + ట్ + ర్ + య్) షకార టకార రేఫ యకారములు నాల్గింటి సంయోగము ఇట్లే 'కార్త్స్న్యము' 'కార్త్స్న్యము' ఇత్యాదులందును బహువర్ణ సంయోగముచే అశ్రవ్యత్వము ఇట ఏకపదగతము.

(చ) భిన్నపదగతమైన సంయోగము దీర్ఘానంతర్యము కల్గుచో ఒక్కపరియైనను అశ్రవ్యత్వము కలుగును. పలు పర్యాయములైన అత్యధికము.

ఉదా :—

హరిణీప్రేక్షణా యత్ర గృహిణీ న విలోక్యతే
సేవితం సర్వసంపద్భి రపి తద్భవనం వనమ్

[ఎందు రమణి (ఏణాక్షి) గృహిణి చూపట్టదో సర్వసంప ద్భాయిష్ఠమైనను ఆ భవనము వనమే యగును]

హారిణీ ప్రే' ఇట ణీ' యను దీర్ఘమునకు భిన్నపదగతమైన ప్రే' అను సంయోగము యొక్క సకృదానంతర్యము దోషము.

(చ) అసకృద్దీర్ఘావ్యవహితోత్తరసంయోగోదాహరణము అరిది దీర్ఘావ్య' 'కార్తార్థ్యము' అను నిచోట్టుల దీర్ఘమునకు అస కృదానంతర్యమున అధికాశ్రవ్యత్వము

(ట) దీర్ఘానంతరసంయోగము ఏకపదగతమైచో (భిన్న పద గతమైనప్పటి యంత) అధికాశ్రవ్యత్వము లేదు ఇంచుక కలదు

ఉదా :—

జాగ్రతా విచితః పన్థాః శాత్రవాణాం వృథోద్యమః

[జాగరూకత గలవానిచే దారి అన్వేషింపఁబడినది శాత్ర వుల యుద్యమము వ్యర్థము].

'జాగ్రతా' 'శాత్రవ' ఏకపదమున దీర్ఘమునకు సంయోగా నంతర్యము, ఈషదశ్రవ్యత్వము

(ట) పరసవర్ణ కృతమైన సంయోగము పూర్వపదావయవ మగుటంజేసి (ఏకపదఘటకమే యగుట) సర్వవిధముల భిన్నపద ఘటకము కానేరదు కావున మాధుర్యకారణము అందుచే ఇంచుకే నశ్రవ్యముకాదు

ఉదా .—

తా న్తమాల తరుకా న్తి లఙ్ఘినీ
ఝఙ్కృతి నవామ్బుద త్విషామ్

ఇత్యాది స్థలములందు తా న్తమాల' అనుచోట, నీఝఙ్కృతి అనుచోట పరసవర్ణము (నీఞ్ అని) పూర్వపదావయవము (భ క్తము) కావున సంయోగము భిన్నపదఘటకము కాదు

[శంక] 'హల న్తరాః సంయోగః" అని పతంజలి మహాభాష్యమునందు హల్వర్ణమునకు ప్రత్యేక ప్రత్యేకముగా సంయోగ సంజ్ఞ ఆదేశించినాఁడుకదా! ఆ పక్షము ననుసరించిన తా న్త' అను నిత్యాది స్థలములందు త' న' అను హల్లులలో నొక్కొక్క దానికి వేర్వేఱ సంయోగసంజ్ఞ రాఁగా తా న్తమాల'లో తరూప సంయోగము భిన్నపదఘటకమేకదా (1) 'న్తమాల' = న్ + అ + త = న్త ఇందు న, త యీ రెండును రెండు సంయోగములు. త ఇది భిన్న పదఘటితము. అట్లే (2) తాన్' అను దానిలో త్ + అ + న్ + తమాల

[సమా] ఆ పక్షమున తమాలపదమందలి తరూప సంయోగము భిన్నపదగత మగునని అంగీకరించినను 'తా' అను దీర్ఘములోని దీర్ఘాకారమునకును తమాలలోని తకారమునకును నడుమ నకార వ్యవ

ధానమున్నది కావున సంయోగమునకు (తమాలలోని తకార గూప సంయోగమునకు) దీర్ఘానంతర్యము లేదు అందుచే దోషములేదు. అందుచే అశ్రవ్యత్వము లేదు [సముదాయమునకే సంయోగసంజ్ఞ అను పక్షమునకు అశ్రవ్యత్వము లేదని ముందే నిరూపింపఁబడినది]

మ తాం త ర ము

[శంక] నవామ్బుద అను పదమున నవ' శబ్దము తుది అ కారము అంబుద శబ్దముయొక్క మొదటి అకారము వీని రెంటి సానమున దీర్ఘము ఏకాదేశమైనది అన్తాదివచ్చ అను వ్యాకరణ సూత్రానుసారము ఆ దీర్ఘము పూర్వాపరపదముల రెంటికి అవయవమగును పరపదగతమగు మ్బు' అను సంయోగమునకు పూర్వపదమగు దీర్ఘాకారముతో ఆనంతర్యమును భిన్నపదగతత్వమును ఉండనే యున్నది అందుచే అశ్రవ్యత్వము దుష్పరిహారము కదా

[సమా] భిన్నపదగతత్వ మన నిఒ వివక్షితము ఏకపదగత భిన్నత్వము - ఏకపదాగతత్వము - ఏకపదగతము కాకుండుటే. నవ+అమ్బుద' అను పదములు భిన్నపదములైనను ఏకాదేశ దీర్ఘము పరోత్తర పదముల రెంటి యవయవ మౌటచే నవాంబుద అనునది ఏకపదమే యైనది మ్బు అను సంయోగము ఆ యేకపద గతమే ఏకపదఘటిత భిన్నము కాదు అందుచే భిన్నపదగతము కాదు ఇట్లగుట దీర్ఘమునకు అనంతరము ఏకపదఘటిత సంయోగమే యున్నది కావున అశ్రవ్యత్వము లేదు

(త) దీర్ఘమునకు అనంతరప్రయుక్తమైన సంయోగము (పర సవర్ణానిష్పన్నమైనది, భిన్నపదఘటక మైనది) ఒక్కమాఱు ప్రయో

గింప అశ్రవ్యత్వము చెప్పఁబడినది అదే పలుమాఱు ప్రయుక్తమైన అధికము అశ్రవ్యత్వము

ఉదా :—

ఏషా ప్రియా మే క్వ గతా త్రపాకులా.

ఇట 'ప్రి' అను సంయోగమునకును 'త్ర' అను సంయోగమునకును ఈ వాక్యమున రెండుమాఱులు దీర్ఘానంతర్యము కలిగినది అందుచే అశ్రవ్యత్వము

[శంక] ఏమి ఈ యశ్రవ్యత్వమువలన కావ్యమునకు సేగి?

[సమా] శరీరమునకు పంగుత్వము (కుంటితనము) ఎట్టిదో, కావ్యమునకు ఈ యశ్రవ్యత్వము అట్టిది - అపకర్షకము అని భావము

(ఛ) ఇంకొక యశ్రవ్యత్వము - **విసంధికృతము.**

(క) ఇచ్ఛవొప్పన పద్యములలో విసంధి చేయుట ఇచ్ఛవొప్పన' అనుట శాస్త్రానుసారము ప్రకృతిభావము వచ్చుచో సంధి చేయమి తప్పు కాదని భావము

ఉదా :—

రమ్యాణి ఇన్దుముఖి తే కిలికిఞ్చితాని

('ఓ చంద్రముఖీ నీ కిలికించితములు (అభీష్ట జనసంగమాది జనితములు హర్ష స్మిత రుదిత త్రాస క్రోధ శ్రమాది భావసాంకర్యములు) మనోహరములు కదా) 'రమ్యాణి + ఇన్దుముఖి.' ఇట

సవర్ణదీర్ఘము శాస్త్రప్రాప్తమైనను విశృంఖలముగా మానఁబడినది. అందుచే అశ్రవ్యత్వము కలిగినది. ఈదంతము ఊదంతము ఏదంతము నగు ద్వివచనము ఓదంతము, నిపాతయు ప్రగృహ్యము లనఁబడును. వీనికి అచ్చు పరమగు నో ప్రకృతిభావము.

(చ) ప్రగృహ్యసంజ్ఞ కారణమున ప్రకృతిభావము వచ్చిన యెడల సంధి ఒకమాఱు మానిన అశ్రవ్యత్వము లేదు మాటిమాటికి ప్రకృతిభావము వచ్చునట్లు రచనచేసిన విసంధి అవ్వోట శాస్త్రీయమైనను - అశ్రవ్యత్వదోష జుష్టమే యగును

ఉదా :—

అహో అమీ ఇన్దుముఖీవిలాసాః

ఇట (1) అహో + అమీ (2) అమీ + ఇన్దు-అను చోటుల అవాదేశ దీర్ఘసంధి కార్యము చేయమి ప్రగృహ్యసంజ్ఞకప్రకృతిభావసంధి ప్రయుక్తము. అట్లు శాస్త్రీయమైనను అశ్రవ్యత్వము ఉప్పతిల్లినది

(ట) అట్లే పలుమఱు యవలోపనిమిత్తమైన సంధి కార్యము చేయమిచేతను అశ్రవ్యత్వమే.

ఉదా :—

అపర ఇమవ ఏతే కామినీనాం దృగన్తాః

ఇట రెండు పర్యాయములు విసంధి

[శంక] మీ కావ్యమందును ఈ దోష మున్నదే దాని కేమి గతి? ఎక్కడ నన, —

భుజగాహిత ప్రకృతయో గారుడమన్త్రా ఇవావనీరమణ,
తారా ఇవ తురగా ఇవ సుఖలీనా మన్త్రిణో భవతః

ఓరాజా, నీ మంత్రులు గరుడదేవతాకమంత్రములవలె 'భుజగాహితప్రకృతులు' అనఁగా సర్పనివారకస్వభావులు, పక్షాంతరమున విటుల నివారించు స్వభావము కలవారు ఒండె, భుజ+గాహిత=అధిష్ఠిత, ప్రకృతులు=ప్రజలు కలవారు) తారల వలె తురగములవలె సుఖలీనులు తారలవలె సుఖముగా ఆకాశము నందు లీనులు, తురగములవలె సు+ఖలీనులు = గట్టి కళ్లెములు గలవారు - మంత్రులు సౌఖ్యనిమగ్నులు

ఇట 'మన్త్రా ఇవ', 'తారా+ఇవ' తురగా+ఇవ' అని యలోపప్రయుక్తము విశ్లేషము సంధ్యకరణము ఎట్లు సంగతము ?

[సమా] యలోపము వైకల్పికము కావున, లోపముచేయక 'మన్త్రాయివ, తారాయివ, తురగాయివ'' అని యకారఘటితముగనే పాఠము గ్రహించుట అభిమతము అప్పుడు దోసఁగు లేదు

(౭) అశ్రవ్యాంతరములు సమాహరించి చెప్పఁబడుచున్నవి.—

(క) ధీరో వరో నరో యాతి' ఇత్యాదులందుంబోలె రకారము నకు ఉత్వము.

(చ) ఇమా నిశా గతా వ్యర్థమ్ - ఇత్యాదులందుఁ బోలె హల్లు పరము కాఁగా యకారలోపము

(ట) యణాదేశ గుణ వృద్ధి సవర్ణదీర్ఘ పూర్వరూప పర రూపాది సంధులు సమీప సమీపమున బహుళముగా ప్రయోగిం చిన అశ్రవ్యత్వము ఉప్పతిల్లును.

ఉదా .—

(1) అత్యప్యుపద్రవము. (అతి + అపి + ఉపద్రవము) ఇట యణ్ణునకు.

(2) రమేశోమేశ లోకేశాః రమా + ఈశ + ఉమా + ఈశ + లోక + ఈశాః - ఇట గుణము.

(3) మానసౌకౌహౌత్సుక్యము (మానస + ఓక + ఓహ + ఔత్సుక్యమ్ ఇట వృద్ధి

(4) అర్కాబ్జారీన్ద్రిగురూపమః (అర్క + అబ్జ + అరి + ఇన్ద్రిగురు + ఉపమః) ఇట సవర్ణదీర్ఘము

(5) ఇట్లే పూర్వరూప పరరూపములు సమీప సమీపమున పెల్లుగాఁ బ్రయోగించుటచే అశ్రవ్యత్వము ముప్పరించును

ఇట్టివైన యశ్రవ్యభేదము లన్నియు కావ్యసామాన్యమందెల్ల వర్జనీయములు ఇది నిత్యదోష మని భావము ఇది సర్వథా సర్వరసప్రతికూలము, అనేకవిధము. ఇది కోమలవర్ణఘటిత మైనను గూడ వర్ణానంతర్యాదిమూలకము దోషజనకము. కావ్య మన్నదాని యందెల్ల వర్జనీయము. ఇది శ్రుతికటుత్వమున కన్న వేఱు. శ్రుతికటుత్వము నిత్యదోషము కాదు. మధురరసప్రతికూలమైనను ఓజోరసానుకూలము. అది మధురరసాదికావ్యములందే వర్జనీయము అశ్రవ్యత్వమువలె సర్వకావ్యములందు వర్జనీయము కాదు. ఈ భేదము తెలిసి మెలఁగుట కవులకు అత్యావశ్యకము

రసగంగాధరము

పరివస్యావివరణసముల్లసితము

అధి 7 విశేష దోషములు

ఇఁక వర్జనీయవిశేషములు చెప్పఁబడును

అందు మధురరసములందు - శృంగార కరుణ శాంతము లందు - ఏవి విశేషించి వర్జనీయములో అవే ఔజస్వీరసములంకు అనుకూలములు. ఏవి ఔజస్వీరసానుకూలములో అవి మధురరస ప్రతికూలములు ఇది సామాన్య నిర్ణయము.

మధురరస ప్రతికూలములు :

(౧) దీర్ఘ సమాసమునకు ఉదా :—

అభిసారికా వర్ణనము :—

లోలాలకావలివలన్నయనారవింద
లీలావశంవదిత లోక విలోచనాయాః
సాయాహ్ని ప్రణయినో భవనం వ్రజన్త్యా
శ్చేతో న కస్య హరతే గతి రఙ్గనాయాః

చంచలములైన ముంగురులతో చపలములైన నయనారవింద విలాసములతో లోకుల విలోకనముల హరియించుచు సాయంకాలము ప్రియుని యింటికిఁ బోవుచున్న యీ యంగన గమనము ఎవని చిత్తము హరింపదు ?

ఇందు శ్లోకపూర్వార్ధమునందు దీర్ఘసమాసము శృంగార రసప్రతికూలము కావున వర్జనీయము

(౨) ఝయ్ సంఘటిత సంయోగ పరహ్రస్వముల తఱచుగా దగ్గఱదగ్గఱగా ప్రయోగించుటకు ఉదా. —

హీరస్ఫురద్రదనశుభ్రిమశోభి కిఞ్చ
సాన్ద్రామృతం వదన మేణవిలోచనాయాః
వేధా విధాయ పునరుక్త మి వేన్దుబిమ్బం
దూరీకరోతి న కథం విదుషాంవరేణ్యః

వజ్రాలవలె మెఱయుచున్న దంతముల ధావళ్యముచే శోభించునట్టియు మఱి అమృతభూయిష్ఠమును అగు నా యేణనయన నెమ్మోమును సృష్టించి విద్వద్వరేణ్యుఁడు అబ్రహ్మ పునరుక్తమువలె నున్న చంద్రబింబమును దూరీకరింపకుండు టెట్లు ?

ఇట "హీరస్ఫురద్రదనశుభ్రిమశోభి' ఇంతవఱకు రచన శృంగారరసప్రతికూలము ఏలన ఇందు ఫదభ లను ఝయ్యులతో సంయుక్తములు స్ఫు, ద్ర భ్రి అనునవి అ అ ఉ అను హ్రస్వ స్వరములకు పరముగా అత్యంతసమీపప్రయుక్తములుగా నున్నవి కడమ శ్లోకమంతయు రమణీయము. ఉత్తరార్ధమున పునరుక్త' మను చోట కకార తకారములను ఝయ్యుల సంయోగమున్నను అది యొక్కటే అట్టివి ప్రచురములుగా లేవు కావున దోషములేదు పూర్వార్ధమున 'రక్తాంశుకాంత మరవింద రమాపహారి సాన్ద్రామృతమ్" అని మార్చిన అప్పుడు సర్వము రమణీయముగా నుండును

(౩) విసర్గ ప్రాచుర్యమునకు ఉదా :—

నాయకుఁడు తలపోయుచున్నాఁడు :

సానురాగా స్సానుకమ్పా శ్చతురా శ్శీలశీతలాః
హరంతి హృదయం హన్త కాంతానాం స్వాంతవృత్తయః

అనురాగయుక్తములు కృపాయుక్తములు పరవశీకరణ చాతుర్యయుక్తములు సౌశీల్యముచే సంతాపరహితములునైన కాంతల మనోవ్యాపారములు ఔరా! నా మనస్సును హరించుచున్నవి

ఇట [సానురాగాః, సానుకమ్పాః చతురాః శీతలాః] స్సా శ్చ, శ్శీ అను శకారసకార సంయోగములు విసర్గస్థానీయములు పూర్వార్ధభాగమునఁ బ్రచురముగా నున్నవి అవి [ఓజోరసానుకూల ములుగాని]మాధుర్యరసానుగుణములుకావు అందుచే వర్జనీయములు

(౪) జిహ్వామూలీయ ప్రాచుర్యమునకు ఉదా.—

కఖలపూర్వమం దుండు విసర్గము జిహ్వామూలీయ మనఁ బడును (ᳵ)

ఉదా —

కలితకులిశయాతాగ్లకేపి ఖేలన్తి వాతాగ్ల
కుశలమిహ కథం వా జాయతాం జీవితే మే
అయ మపి బత! ఖుఞ్జన్నాలి మాకన్దహాకా
చులుకయతి మదీయాం చేతనాం చఞ్చరీకః.

అలి=సఖి

ఓ సఖీ పిడుగుపాటులవంటివి ఏ వో (ఇట్టి వట్టి వని వర్ణింపరాని) మారుతములు సవిలాసముగా వీచుచున్నవి మఱి ఇది తియ్య

మామిడిపైని రొదపెట్టుచు చంచరీకము నా ప్రాణము మునుముట్ట పుడిసిటఁబట్టి త్రావుచున్నది ఇంక నా జీవితమునకు కుశల మెట్లు కలుగును?

ఇందు ద్వితీయ జిహ్వామూలీయమునకును రచన మధురరస ప్రతికూలము ఏలన ఇందు యాత్రాగ్రకే వాతాగ్రకుశల అని రెండు మాటలు జిహ్వామూలీయము ఉపాత్తము అందుచే వర్జనీయము కథయ కథ మివాశా జాయతాం జీవితే మే, మలయ భుజగవాన్తా వాన్తి వాతాః కృతాన్తాః' అని పూర్వార్ధము మార్చిన అప్పు డా దోషము ఉండదు [మలయ పర్వత సర్పములు వెలిగ్రక్కినట్టివి విరహులను సంహరించునట్టివి దక్షిణమారుతములు వీచుచున్నవి చెప్పుము, నాకు జీవితాశ యెట్లు కల్గును] అని యాపాదమునకు అర్థము]

(౨) ఉపధ్మానీయప్రాచుర్యమునకు ఉదా –

అలకాః ఫణిశాబతుల్యశీలా
నయనాన్తాః పరిపుఙ్ఖితేషుపాతాః
చపలోపమితాః ఖలు స్వయం
యా బత! లోకే సుఖసాధనం కథం సా!

ముంగురులా సర్పశిశుకుటిలములు కడగంటిచూపులా పరిపుంఖిత శరపాతములు తానో విద్యుల్లతాచంచల అయ్యో! అట్టిది ఆ చాన ఎట్లు సుఖసాధన మగును?

ఈ శ్లోకమునందు ఉపధ్మానీయములు రెండు మాధుర్యాప కర్షకము లగుట శాంతరసానుగుణములు కావు కడమ శ్లోక మెల్ల అనుగుణమే

(౬) టవర్గముయొక్కయు, ఝయ్యల ప్రాచుర్యమునకు ఉదా. —

నాయకుడు నాయికను అనునయించుట:—

వచనే తవ యత్ర మాధురీ సా
హృది పూర్ణా కరుణాచ కోమలేఽభూత్
అధునా హరిణాక్షి హా కథంవా
కటుతా తత్ర కఠోరతాఽవిరాసీత్.

ఓ మేణాక్షీ, మున్ను ఎచట నీ కోమలవచనముల ఆ(అనుభూతపూర్వము) మాధురి యుండెనో నీ కోమలహృదయమున కరుణయు నిండారియుండెనో అచట నిపుడు అయ్యో! ఎట్టి కటుత్వ మును కఠోరత్వమును ఆవిర్భవించినవి?

ఇట ఉత్తరార్ధమున కటుతా, కఠోరతా అను టవర్గాక్షరములు "కథం" అను ఝయ్యలును సమీపమున ప్రచురముగా ప్రయోగిం చుట మధురతమమైన విప్రలంభమునకు ప్రతికూలములు

'అధునా సఖి తత్ర హా కథంవా
గతి రన్యైవ విలోక్యతే గుణానాం"

అని మార్చిన అనుకూలముగా నుండును

(౭) రేఫఘటిత సంయోగప్రాచుర్యమునకు ఉదా,

తులా మనాలోక్య నిజా మఖర్వ
గౌరాఙ్గి, గర్వం న కదాపి కుర్యాః
లసన్తి నానాఫల భారవత్యో
లతాః కియత్యో గహనాన్తరేషు.

ఓ గౌరాంగీ, నాసాటి యెంయును లేదని ఎన్నడును అఖర్వ గర్వ మొందకుము నానాఫలభారనతులు గహనాంతరములలో లతలు ఎన్నేని కలవు

ఇందు ఖర్వం గర్వం కుర్యాః అని రేఫఘటిత సంయోగ ప్రాచుర్యము శృంగారరస ప్రతికూలము

తులా మనాలోక్య మహీతలేఽస్మిన్
గౌరాఙ్గి నూనం కురు మాభిమానమ్.

అని పూర్వార్ధము మార్చిన అనవద్యము.

(ఙ) (క) ల మ న అను హల్లులుగాక తక్కిన హల్లుల స్వసంయోగ (ద్విత్వ) ప్రాచుర్యమునకు ఉదా,

ఖండిత నాయకుని దూఱుచున్నది —

విగణయ్య మే నికాయ్యం
త్వా మనుయాతోఽసి నైవ త న్న్యాయ్యమ్'

ఓరి శఠ! నా యింటిని విడిచిపోయి దానిని అనుగమించుచున్నావు ఇది న్యాయ్యము కానేకాదు.

ఇట యకారద్విత్వము ముమ్మాఱు ప్రయుక్తము. ఇది విప్రలంభశృంగారప్రతికూలము

(చ) ల మ న ల ద్విత్వమన్ననో అట్లు పారుష్యము కలిగింపదు

ఉదా.—

సంభోగచిహ్నానాయికను ప్రశ్నించుచున్నది —

ఇయ ముల్లసితా ముఖస్య శోభా
పరిఫుల్లం నయనామ్బుజద్వయం తే
జలదాలిమయం జగ ద్వితన్వన్
కలితః క్వాపి కి మాలి నీలమేఘః?

ఓ సఖి ఈ నీ ముఖశోభ ఎంతయు ఉల్లసిలు చున్నది నీ కనుదమ్ములు మిక్కిలి వికసించి యున్నవి. లోకము నెల్ల నీరద మాలామయముగా చేయుచున్న కృష్ణమేఘము ఎటనేని నీతో కలిసి కొన్నదా యేమి?

ఇట లకారద్వితము, 'ఉల్లసితా" 'ఫుల్లం" అని యిఱు మాఱు ప్రయుక్త మైనను పారుష్య మొదవలేదు అట్లే మకార ద్విత్వము నకారద్విత్వమును శృంగారోచితములు

(౯) ఝయ్యోర్ద్వయ సంయోగమునకు ఉదా.—
నాయకుఁడు మానిని నాయికతో పలుకుచున్నాఁడు

ఆసాయం సలిలభరే సవితార ముపాస్య సాదరం తపసా
అధునాఽబ్జేన మనాక్తవ మానిని తులనా ముఖ స్యాప్తా

సాయంకాలమువఱకు వారిపూరమున భక్తితో సూర్యుని తపస్సుచే నుపాసించి ఇప్పుడు [ఆ తపోబలముచే] పద్మము ఓ మానినీ, నీ నెమ్మొగంపు సామ్యము నొకించుక పొందినది

ఇట (బ్జ) బకారజకార సంయోగము, (ప్త) పకార తకార సంయోగము క్త కకారతకారసంయోగము - (ఝయ్యుద్వయ సంయోగము) కలదు అందుచే ఉత్తరార్ధము శృంగారోచితము కాదు

'సరసిజకులేన సమ్రతి భామిని తవ ముఖతులాధిగతా" అని మార్చిన సాధువుగా నుండును

(౧౦) సవర్ణఝయ్యుల సంయోగము ఒకమాఱు ప్రయోగించినను దోషమే

ఉదా :—

అయి, మన్దస్మిత మధురం
వదనం తన్వఙ్గి, యది మనా క్కుకుషే
అధునైవ కలయ శమితం
రాకారమణస్య హన్త! సామ్రాజ్యమ్

ఓ కోమలాంగీ, నీ వదనమును ఇంచుక మందస్మితమధురముగ నొనర్తువేని పూర్ణచంద్ర సామ్రాజ్యము అహో! అప్పుడే పోయిన దని తెలియుము.

అసవర్ణఝయ్యుద్వయసంయోగము ఒక పర్యాయమును దుష్టమే ఇట 'మనాక్+కురుషే' (క్కు) కకార ద్విత్వము సవర్ణమయ్యు శృంగారప్రతికూలమే.

[శంక] ఓయీ, కకారద్వయ సంయోగము 'హల్ఘటిత ప్యాత్మసంయోగరూపదోషముచేతనే నిషిద్ధమైనది కఖ సంయోగ

మన్ననో మహాప్రాణ సంయోగముచే గతార్థము తృతీయ సంయోగము అసంభవము అందుచే సవర్ణఝయ్యు సంయోగ నిషేధము అనావశ్యకము

[సమా] అట్లుకాదు ఒకమాఱు ప్రయోగించినను సవర్ణ సంయోగము దుష్టము అందుచే సకృత్ప్రయోగ విషయ మది కడమ జయ్యుల సంయోగనిషేధము అసకృత్ప్రయోగ విషయము అందుచే మనాక్కురుషే' అను దానిని వేఱ నిషేధింపకున్న నిర్దోష మగును. అందుచే తన్నిషేధము వ్యర్థముకాదు

కఖద్వయ సంయోగమునకు ఉదా :—

సమ్యక్ఖేలసి,' 'మనాక్ఖిద్యతే ' 'అగ్ఘోరాహిః "
(శృం. నై. ౭ అ 125 ప.)

(౧౧) మహాప్రాణి ఘటిత సంయోగ ప్రాచుర్యమునకు ఉదా :—

['అయి, మన్దస్మిత మధురం
వదనం తన్వంగి యది మనా క్కురుషే."

అనుదానిని పరివర్తించిన].

అయి మృగబిందుం చే ద్ఘాలే బాలే, సమాతనుషే
అధునైవ కలయ శమితం రాకారమణస్య హన్త! సామ్రాజ్యమ్.

ఓసి బాలా, నీ నెమ్మోమున కస్తూరిబొట్టు పెట్టు కొన్నచో అప్పుడే పూర్ణచంద్రుని సామ్రాజ్యము శమించును

ఇట (ద్భా') మహాప్రాణమైన భకారముతోడి దకార సంయోగము ఒక్కమాత్రైనను దుష్టము అసకృత్ప్రయోగముచే దోషాధిక్యము ఉదాహరణము ఊహ్యము

(౧౨) ఇట్లే త్వాప్రత్యయము యఙ్ణ్వనులు యఙ్లుగంతములు, కృత్తద్ధితాంతములు మున్నగునవి వైయాకరణ ప్రియములైనను మధురరసములందు (పలుమఱు) ప్రయోగింపరాదు

(౧౩) అట్లే వ్యంగ్య రసాస్వాదాతిరిక్త యత్నవిశేషమును యోజనావిశేషము వేనికి వలయునో ఆ యనుప్రాసయమకాదులను శబ్దచిత్రములను కేవలము ఆపాతచమత్కారములను పరిణామ చమత్కారరహితములను—కవికి సుసంభవములైనను – కవి మధుర రసప్రధానకావ్యములందు ప్రయోగింపరాదు

[అట్లే ధ్వనికారులును నుడివియున్నారు :—

రసాక్షిప్తతయా యస్య బన్ధః శక్యక్రియో భవేత్
అపృథగ్యత్ననిర్వర్త్యః సోఽలంకారో ధ్వనౌ మతః

ఈ శబ్దాలంకారాదులు రసచర్వణయందు అంతర్భవింప నీయక సహృదయుని హృదయమును తమయందు అభిముఖీకరించుకొని రసపరాఙ్ముఖములఁ జేయుటయు నొకప్పుడు ఘటిల్లును ఈ యనుప్రాసాదులను ప్రయోగింప కవిచిత్తము ఎంత ప్రలుబ్ధమైననుంగూడ, అందులకు పాల్పడి మధురరసములందు ప్రయోగింపరాదు విప్రలంభశృంగారమున మొదలే ప్రయోగింపరాదు ఏలన అది మధురతమరసము నిర్మలమైన తెల్లచక్కెర పానకరసము నాస్వాదించువారో, ఇసుక పీచు మున్నగు స్వతంత్ర పదార్థములు

ఎంత కొంచెపాటి దైనను సహృదయహృదయారుంతుదములు (ఉద్వేజకరములు) అగును అందుచే రసముతోఁ గూడ ననుప్రాసాదుల సమావేశము ఉపరాదు

అట్లే ధ్వనికారులును వచించినారు —

ధ్వన్యాత్మభూతే శృంగారే యమకాదినివేశనమ్
శక్తా వపి ప్రమాదిత్వం, విప్రలంభే విశేషతః
(౩, ౧౫ కా)

ధ్వన్యాత్మకమైన శృంగారమునందు యమకాది నివేశించుట - కవికి అందు శక్తియున్నను - ప్రమాదకరము ఆ శృంగారము నందును (మధురతమ మగు) విప్రలంభశృంగారమునఁ గమంగడు ప్రమాదకరము

అట్లయిననుంగూడ ఏవి అక్లిష్టములు, అనున్నతస్కంధములో (అనుత్కటములో) రసనివేశనప్రయత్నమునకన్న వేఱైన ప్రయత్నము లేక నిష్పన్నములో రసానుకూలములో, ఆ యనుప్రాసాదులను పరిత్యజించుట యుక్తము కాదు

ఉదాహరణము :—

సఖి నాయికతో వచించుచున్నది —

కస్తూరికా తిలక మాలి విధాయ సాయం
స్మేరాననా సపది శీలయ సౌధమౌలిమ్
ప్రౌఢిం భజన్తు కుముదాని ముదా ముదారా
ముల్లాసయన్తు పరితో హరితో ముఖాని.

ఓ సఖీ నాయందువేర నీవు కస్తూరిబొట్టు పెట్టుకొని చెఱువగ విగురొత్త వేవేగ సౌధాగ్రమున నిలిచి పరిశీలింపుము దానం జేసి కలువలు ప్రమోదాతిశయ మొందుఁగాక దిఙ్ముఖములు అంతటను ఉల్లసిల్లును గాక

ఇట వృత్త్యనుప్రాసము కవికి పృథక్ప్రయత్న మక్కఱలేమిం జేసియు, ఆస్వాదనమున సహృదయునకును శృంగారరసానుకూల మగుటం బట్టియు పరిత్యాజ్యము కాదు

ఇట్లు ప్రాసంగికముగా మధురరసాభివ్యంజకము లగు రచనల యందు దోషములు సంక్షేపముగా నిరూపితము లైనవి, మధురరసము లకు ఏవి అనుకూలములో అవే ఓజస్విరసమునకుఁ బ్రతికూలములు అని మున్నె చెప్పఁబడినది వానిని ఓజస్విరసవ్యంజకరచనలో పరిత్య జింపవలెను ప్రసాదగుణము సర్వరచనాసాధారణ మగుట తద్వ్యం జక రచనలో ప్రత్యేకముగ వర్జనీయములు లేవు ఇట్లు సర్వరసాభి వ్యంజకరచనలలో వర్జనీయము లెల్ల సంక్షేపముగ ప్రతిపాదిత ప్రాయముల

ప్రసంగవశమున మధురరసానుగుణము వైదర్భీరీతి నిరూ పింపఁబడుచున్నది :—

ఏభి ర్విశేషవిషయైః సామాన్యైరపిచ దూషణై రహితా
మాధుర్య భారభఙ్గుర సున్దర పదవర్ణ విన్యాసా
వ్యుత్పత్తి ముద్గిర న్తీ నిర్మాతు ర్యా ప్రసాదయుతా
తాం విబుధా వైదర్భీం వద న్తి వృత్తిం గృహీతపరిపాకామ్

పైని చెప్పఁబడిన దూషణసామాన్యములుగాని విశేషములు గాని లేనిది, మాధుర్యాతిశయముచే వెల్లివిరిసిన దగుట సుందరపద

నర్గవిన్యాసము కలది, కవియొక్క శాస్త్ర నైపుణ్యము నావిష్క రించునది ప్రసాదగుణవ్యంజ మైనది, కవితారసపాకసంపన్నమైనది యైన రచనను వైదర్భీవృత్తి (రీతి) అని కావ్యార్థతత్త్వజ్ఞులు వచిం తురు [దీనికే ఉపనాగరికవృత్తి అనియు పేరు (ఏషా ఖలు నాగ రికయా వైదగ్ధీజుషా వనితయా ఉపమీయతే తత ఉపనాగరికతా) నగరవాసిని జాణ, రాణ విలసిల్లునది, కావున దీనికి ఆ పేరు.]

ఈ వైదర్భీరీతి యందు కొన్ని పద్యములు ముందే ఉదా హరింపఁ బడినవి అట్లయినను సహృదయహృదయవినోదార్థము ఇదే ఇంకొక యుదాహరణము :—

సఖి కోపనను నాయికను బోధించుచున్నది :—

ఆయాతైవ నిశా నిశాపతికరైః కీర్ణం దిశా మన్తరం
భామిన్యో భవనేషు భూషణగణై రుల్లాసయన్తి శ్రియమ్
వామే మాన మపాకరోషి న మనా గద్యాపి రోషేణ తే
హా హా బాలమృణాలతోఽప్యతితరాం తన్వీ తను స్తామ్యతి

ఓసి మానినీ, రాత్రి రానే వచ్చినది నిశానాథునికరములచే (చేతులనంటి కిరణములచే) దిగంత ప్రదేశ మెల్ల వ్యాప్తమైనది ఇండ్లలో నింతులు భూషణగణములచే మిక్కిలి శోభించుచున్నారు నీకో రోసముచే ఇంచుకేని అలుక మానకున్నావు అయ్యో అయ్యో ! ఆరోసముచే బాల మృణాలము కన్ననుంగూడ కోమలము నీ నెమ్మేను అత్యంతము వాడిపోవుచున్నది [అతితరాం' అనుచో తకారమునకు స్థానాంతర్య మున్నను క్వాచిత్కమగుట ఉపేక్షణీ యము - ఈ వైదర్భీరీతి రచనయందు కవి యెంతేని మెలఁకువ నహింపవలెను లేకున్న పరిపాకభంగము ఉప్పతిల్లును కవి యనవ

ధానముచే పరిపాకభంగమునకు ఇదె యుదాహరణము అమరుకకవి పద్యము —

శూన్యం వాసగృహం విలోక్య శయనా దుత్థాయ కిఞ్చిచ్ఛనైః
ర్నిద్రావ్యాజ ముపాగతస్య సుచిరం నిర్వర్ణ్య పత్యుర్ముఖమ్
విస్రబ్ధం పరిచుమ్బ్య జాతపులకా మాలోక్య గణ్డస్థలీం
లజ్జానమ్రముఖీ ప్రియేణ హసితా బాలా చిరం చుమ్బితా

ఒకానొక బాల లజ్జావతి సఖ్యావులుపోయి పడకటిల్లు విజన మైనదని యెఱింగి మెల్లగా పడకనుండి యించుకంత లేచినదై కపట సుప్తుఁడైన కాంతుని ముఖమును చాలసేపు పరికించి నిద్రితుఁడే యని నమ్మి జంకుమాని ముద్దుగొని అంత నతని చెక్కుటద్దం బొడ మిన పులకలంగాంచి కపటనిద్ర యని యెఱింగి తన బేలతనమునకు లజ్జి తయై మోము వాంచినది అంత తత్ప్రియుఁడు నవ్వుచు ఆ గోలను చాలసేపు ముద్దుగొనియెను

ఇట 'ఉత్థాయ కిఞ్చి చ్ఛనైః' అనుచో నవర్ణమైన ఝయ్యు ద్వయమునకు (తథలకు చఛలకు) సంయోగము దోషము అందును సమీపమున అత్యంతము అశ్రవ్యము. త్థాకుఁ బూర్వము ఉకారము, చ్ఛ కుఁ బూర్వము ఇ' కారము కలుగుటచే ఝయ్యు ఘటిత సంయోగము హ్రస్వపూర్వక మగుట ఇంకొక దోషము అట్లే శనైః నిద్రాం' అను చోటను నిర్వర్ణ్య పత్యుర్ముఖమ్ అను చోటను రేఫఘటిత సంయోగము దోషము దకారము తకారము అను ఝయ్యుఘటిత సంయోగములకన్న పూర్వమందు 'ఇ'కారము, అకారము అను హ్రస్వాచ్చుల ప్రాచుర్యము దోషము. విస్రబ్ధం' అనుచోట మహాప్రాణ (ధ) ఘటిత సంయోగము లజ్జా అనుచోట

ఝయ్యు జకారమునకు స్వాత్మసవర్ణ ఝయ్యు (జ) ఘటిత సంయో
గము ముఖ్యే ప్రియేణ' అనుచో భిన్నపదగత దీర్ఘమునకు (ఈకి)
అనంతరము పకారరేఫ సంయోగము (ప్రి) విలోక్య ఉద్ఘాయ
పరిచుమ్బ్య ఆలోక్య అని అయిదుపర్యాయములు 'క్త్వా' ప్రయో
గము 'విలోక్య' ఆలోక్య' అని రెండు పర్యాయములు 'లోకృ
ధాతు ప్రయోగము - దోషములు ఇట్లు కవియొక్క నిర్మాణ
సామగ్రీదారిద్ర్యము తేటతెల్లము.

[అమరుక కవి శ్లోకము నుదాహరించుట, అట్టి రసజ్ఞ చూడా
మణికి అట్టి కవయిత్రి చక్రవర్తికే అనవధానముచే గొనఁగు లుప్ప
తిల్లినవని అన్యు లెంత రచనావధానపారీణులు కావలెనో ఎఱుగుఁడు
అని స్ఫురింపఁజేయుటకు] ఇకఁ జాలు పరకీయకావ్యవిమర్శనము
ఇంతటితోనే సహృదయులకు వివక్షిత గుణదోషస్వరూపము తేట
పడును ఏల యింక పరోభాగ్యాభాగ్యము? వారే గ్రంథములు
చదువుచో మా చూపిన మార్గమున గుణదోషముల నూహింప
వలంతులు

ఇట్లు సంక్షేపముగా రసములు నిరూపితము లైనవి

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

5. భావధ్వని నిరూపణము

అధి. 1 లక్షణ వివేచనము

రసధ్వని నిరూపణానంతరము ఇక భావధ్వని నిరూపింపఁబడును మఱి, భావ మన నేమి? బహులక్షణములు కలవు పర్యాలోచనీయములు.

(౧) అందొకటి: —

"విభావానుభావభిన్నమై ఏది రసవ్యంజక మగునో అది భావము" అని ఈ లక్షణము. ఈ లక్షణము సరికాదు రసప్రతిపాదక వాక్యము (శబ్ద సముదయము) నందు దీనికి అతివ్యాప్తి ఆపన్నమగును

[శం] సరి అర్థము రసవ్యంజక మగును శబ్దము రసవ్యంజకము గాదుకదా! దానియందు అతివ్యాప్తి యెట్లు?

[సమా] అర్థము సాక్షాత్తుగా రసవ్యంజకము అర్థద్వారమున (పారంపర్యముగ) శబ్దముసైతము రసవ్యంజకము

'శబ్దబోధ్యో వ్యనక్త్యర్థః, శబ్దో ప్యర్థాన్తరాశ్రయః
ఏకస్య వ్యంజకత్వే తదన్యస్య సహకారితా."

శబ్దబోధ్యమగు నర్థము రసవ్యంజకము శబ్దముసైతము అర్థాంతరమునకు ఆశ్రయము ఇంకొకటి సాక్షాద్వ్యంజక మగునప్పుడు ఇంకొకటి సహకారికారణ మగును అను నభియుక్తోక్తిని బట్టి శబ్ద సహకారికారణము (సహకారి వ్యంజకము) అగును

ఇట వాస్తవ మారసినచో, వాచ్యార్థబోధకము లైనను గీతాది శబ్దములు రసవ్యంజకము లగునని ధ్వనికారాదుల యభిప్రాయము అందుచే అర్థద్వారమననే (పారంపర్యముగనే) శబ్దము రసవ్యంజకము కానక్కఱలేదు కాని, ఎట్లైనను ఇట అతివ్యాప్తి తప్పదు

[శం] ద్వారాంతర నిరపేక్షకముగా' (ఏది రసవ్యంజక మగునో) అని లక్షణమున నొక విశేషణము నివేశింతుము అప్పుడు శబ్దమునందు అతివ్యాప్తి తొలఁగును శబ్దము అర్థద్వార మునగదా రసవ్యంజకము ? భావము [అర్థము] సాక్షాద్రస వ్యంజక మగును

[సమా] అదియు సరిగాదు ఏలన భావమునకు సాక్షాద్రస వ్యంజకత్వము అసంభవము ఏలన అది (అ సాక్షాద్రసవ్యంజకత్వము] భావము యొక్క పునఃపునరనుసంధానాత్మకమైన భావనకు కలదు (౧) ఆ భావనద్వారమున భావము రసవ్యంజకమగును అందుచే ద్వారాంతర నిరపేక్ష రస వ్యంజకత్వము లేకున్న భావమే లేదు కావున అతి వ్యాప్తి దోషము వారించుకొనఁబోయిన, అది తప్పక పోవఁగా, విశేషణ నివేశనమున అసంభవదోషమును ఉప్పతిల్లినది. పైఁ జూపిన అతివ్యాప్త్యసంభవములకుఁ దోడు ఇంకొక యతివ్యాప్తి దోషమును అదియు నివేశించిన విశేషణమహిమచేతనే సాక్షాద్రసవ్యంజకమైన భావనయందే మీభావలక్షణమునకుఅతివ్యాప్తి

ఉప్పతిల్లినది భావనయు 1 విభావాదిభిన్నము 2 ద్వారాంత రాపేక్ష లేక రసవ్యంజకము

[శంక] విభావానుభావభిన్నమై శబ్దభిన్నమై ఏది రసాభి వ్యంజక మగునో అది భావము, అని లక్షణము సవరింతుము

[సమా] అప్పుడును భావనయందు పైఁజూపిన అతివ్యాప్తి తప్పదు

(౨) అది అట్లుండ భావధ్వనిస్థలమందు ఏ భావము ప్రధానముగా వ్యజ్యమాన మగునో, అది రసాభివ్యంజకము కాదు అందు అవ్యాప్తియు నుప్పతిల్లినది

[శంక] భావధ్వనియందు అవ్యాప్తి లేదు భావధ్వనిస్థల మందు తొలుత భావధ్వని వ్యక్తమగును తుదిని రసమునైతము వ్యక్తమగును అందుచే భావము రసాభివ్యంజకము కాదనుట పొల్లు

[సమా] నీ చెప్పినట్లు భావధ్వని స్థలమందు పర్యవసానమున రసాభివ్యక్తిని అంగీకరించుచో - అచ్చోట రసము ప్రధాన మగుటం జేసి అదియు రసధ్వనిస్థలమే యగును. అందువలన సాహిత్యలోకమున నిఁక భావధ్వని మునుముట్ట లోపింపవలసినదే అందుచే అత్తెఱంగున అంగీకరింపరాదు

[శంక] భావధ్వనికి ఉచ్ఛేదము ఏల కలుగును ? భావధ్వని స్థలమున తొలుత భావధ్వనిప్రతీతియు వెనుక రసప్రతీతియుఁ గలిగి నను, అచ్చోట రసప్రతీతి చమత్కారి కాదు అందుచే రసధ్వని అని పేరులేదు భావధ్వనికే ప్రకర్షకలదు కావున ' భావధ్వని ' అని పేరు.

[సమా] ఎంత వింత సిద్ధాంతము! "లోకోత్తర చమత్కారము రసము రసమునందు సారము చమత్కారము అది సర్వత్ర రసజ్ఞులచే అనుభవింపఁబడు చున్నది" అను నిట్టి యభియుక్తులఁబట్టియు రసజ్ఞుల యనుభవమును బట్టియు చమత్కారరహితమైన రసాభివ్యక్తి కలదనుటకు ప్రమాణము లేదు మఱి ప్రతి సహృదయ హృదయసమవేత ప్రత్యక్షప్రమాణముచే ధర్మియైన రసముయొక్క జ్ఞానము సిద్ధించుచున్నదో, ఆ ధర్మి గ్రాహక ప్రమాణముచే సచ్చిదానందమయ బ్రహ్మస్వరూపముగనే రసము ప్రతీత మగుచున్నది రసము చమత్కారముకన్న వేఱుకాదని మున్ను రస నిరూపణ ప్రకరణమున తేటతెల్ల మొనర్పఁబడినది అందుచే మీ సిద్ధాంతము అసంభావ్యము

పోనీ "నభావహీనోఽస్తిరసో న భావో రసవర్జితః" అను నభిజ్ఞుల నుడినిబట్టి భృత్యుని పెండ్లిలో పెండ్లికొడుకును రాజు అనుగమించునట్లు రసము అనతిచమత్కారవంతమై భావముయొక్క చమత్కార ప్రకర్షకు భంగములేక అనుగమించి తుదిని అభివ్యక్త మగునని అభ్యుపగమింతముగాక - వాదమునకు నంగీకరింతముగాక అప్పుడు పూర్వోక్తమగు నవ్యాప్తి తప్పునుగాక మఱి అట్లైనను దేశము కాలము, వయస్సు అవస్థ మున్నగు ననేక పదార్థములతో ఘటితమగు కావ్యవాక్యార్థము విభావానుభావభిన్నమును, శబ్దభిన్నమును రసాభివ్యంజకమును అగుటంజేసి అందు, (తద్దేశకాలాదిఘటిత కావ్యవాక్యార్థమందు) మీ భావలక్షణమునకు అతివ్యాప్తి అనివార్యముగా నున్నది

ఇట్లు ఎన్నివిధములఁ బర్యాలోచించినను ఈ భావలక్షణము సంగతముగా లేదు

(౨) ఇంకొక భావలక్షణమును పరిశీలింతము. —

'రసాభివ్యంజకము చర్వణావిషయకము నగు చిత్తవృత్తి భావము' అని రసాభివ్యంజక మగు చిత్తవృత్తి భావము' అని మాత్రమే లక్షణము చెప్పిన భావాదిచర్వణయందు అతివ్యాప్తి యుప్పతిల్లు నని, దానిని వారింప చర్వణావిషయము' అని భావము నకు విశేషణ మింకొకటి నివేశించుట చర్వణ చర్వణావిషయము కాదు కావున - భావచర్వణయందు అతివ్యాప్తి తప్పినది అని ఈ లక్షణనిర్మాతలు వచింతురు కాని ఈ లక్షణమును సంగతముగా లేదు ఏలన, పర్యాలోచింపుఁడు ఈ పద్యమును సఖియొక తె యింకొకతెతో విరహిణి నాయికావృత్తాంతము చెప్పుచున్నది

కారాగురుద్రవం సా హాలాహలవద్ విజానతీ నితరామ్
అపి నీలోత్పలమాలాం బాలా వ్యాలావలీం కిలామనుతే

అగురుద్రవమును హాలాహలసమానముగా గ్రహించు చున్నదై ఆ లేమ కలువదండను నల్లత్రాచుపాములబారుసాటిగా గదా తలంచుచున్నది

ఈ శ్లోకమున నాయిక హాలాహలసదృశముగ అగురుద్రవము నెంచుచున్న చిత్తవృత్తిరూపమైన జ్ఞానమునందు పైఁ జెప్పిన లక్షణమునకు అతివ్యాప్తి ఘటిల్లినది ఏలన ఆ చిత్తవృత్తి రూప జ్ఞానము విప్రలంభశృంగారమునకు అనుభావ మగుటం జేసి రసాభి వ్యంజకము చర్వణావిషయమును' అగును

[అనుభావభిన్న మగు చిత్తవృత్తికి విశేషణము నివేశించిన అతివ్యాప్తి తొలఁగునని నాగేశభట్టు వివరించినాఁడు అప్పుడు

రసాభివ్యంజకము చర్వణావిషయకము అనుభావభిన్నము నగు చిత్తవృత్తి భావము' అని లక్షణము నిర్దిష్టమగును

(3) కొందఱు 'భావత్వము అఖండోపాధిరూపము దానికి లక్షణ నిర్దేశ మక్కఱలేదు" అని భావలక్షణము చెప్పుదురు అదియు సరిపడదు భావత్వము అఖండోపాధిగా నంగీకరించుటకు ప్రమాణము లేదు అఖండోపాధికి లక్షణములు ఇట్లు చెప్పుదురు- అనిర్వచనీయో ధర్మః' అని అందుచే లక్షణము చెప్పుటకు శక్యము కాదు. నానార్థపదఘటితో ధర్మః' అని ఆ నానాపదార్థము లేవో తెలిసికొనుటకు ప్రమాణము లేదు 'అసమవేతత్వేసతిఅనుగతత్వమ్' ఆ యనుగతధర్మము లేవో జ్ఞాపకముచేయు ప్రమాణము లేదు (2) అదిగాక భావత్వమును అఖండోపాధి కాక ఇంకొక తీరున నిర్వచించుటకు శక్యమగుటచే అఖండోపాధిగా నంగీకరింప నక్కఱలేదు

(ర) మే మిట్లు లక్షణము చెప్పెదము

విభావాది వ్యజ్యమానము హర్షాదులలో నొకటి యగునది భావము హర్షాదులు ముప్పదినాలుగు వ్యభిచారిభావములు విభావాది వ్యజ్యమానము" అను విశేషణము నివేశింపక "హర్షాదులలొ నొకటి' అని మాత్రము లక్షణము చెప్పిన విభావాదులచే వ్యజ్యమానము లగు వ్యభిచారిభావమునకన్న భిన్నములు హర్షాది శబ్దవాచ్యము లగు హర్షాదులందు అతివ్యాప్తి కలుగును 'హర్షాదులలో నొకటి' యగుట అని చెప్పక 'విభావాది వ్యజ్యమానము' అని మాత్రము లక్షణము చెప్పిన రసాదులందు అతివ్యాప్తి కలుగును. ఇప్పుడు లక్షణము నిర్దుష్టము అట్లే ప్రాచీనులు "వ్యభిచార్యంజితో భావః" అని నుడివిరి [అంజితము=వ్యంజితము] - అభివ్యక్తి విషయీభూతమైన వ్యభిచారికి భావ మని పేరు అని అర్థము

వ్యభిచారిభావముల యభివ్యక్తి

ఈ వ్యభిచారి భావములు ఎట్లు అభివ్యక్తము లగును? ఈ విషమున మూఁడు మతములు కలవు.—

(౧) సామాజికగతము లగునవియే యైన హర్షాదులు స్థాయిన్యాయమున (స్థాయిభావములవలె) అభివ్యక్తము లగును అని మొదటి మతము దాని నిర్వచనము - వాసనారూపముల సామాజికహృదయముల నెలకొని నాటకము చూచునపుడు శ్రవ్యకావ్యముల పఠించునపు డుపస్థాపితములైన విరుద్ధావిరుద్ధభావములచే అనభిభూతములై స్వాభివ్యక్తి సామగ్రిచే స్థాయీభావములు ఎట్లు అభివ్యక్తము లగునో అట్లే ప్రకరణాదిచే ప్రాధాన్య మొందిన హర్షాదులు స్థిరమైన యభివ్యక్తినే కాంచును ఇది రసనిరూపణమున మొదటి మతము ననుసరించినది ఇదే సిద్ధాంతము.

(౨) రెండవమతము .— భావములు రసన్యాయమున - రసములవలె - అభివ్యక్తము లగునని కొందఱు చెప్పుదురు సామాజికుల హృదయమున స్వాభావికముగనే యే యానందరూపాత్మ కలదో అది అవిద్యచేఁ గప్పఁబడినదై యుండును. అది కావ్యగతమైన యలౌకిక వ్యాపారమువలన - విభావాద్యభివ్యక్తిసామగ్రి కారణమున కలిగిన భావనవలన (సాధారణీకరణమువలన ?) సామాజికుని హృదయమున సత్త్వోద్రేకము కలుగును ఆ మాయావరణము భంగమొందును అప్పుడు స్థాయీభావోపహిత మగు (భగ్నావరణమైన) చిదానందమే ఎట్లు రసస్వరూపమున అభివ్యక్త మగుచున్నదో, అట్లే విభావాద్యభివ్యక్తిసామగ్రిచే సత్త్వోద్రేకమున భగ్నావరణమై చిత్తుతోఁ గూడిన హర్షాదిభావములుపైతము సామాజికుని హృదయ

మున నభివ్యక్తము లగుచున్నవి ఇది రసనిరూపణమున ద్వితీయ మతానుసారము చెప్పఁబడినది.

(3) వ్యంగ్యాన్యన్యాయమున - అనఁగా రసభిన్నము లగు వస్తురూపము అలంకారరూపము నగు వ్యంగ్యముఁ వలె భావము అభి వ్యక్త మగునని మూఁడవ మతము.

వాచక శబ్దముచే వాచ్యార్థము ఉపస్థిత మైనను వక్తృ బోద్ధ వ్యాది వైశిష్ట్యము కలుగుడు వెనుక అనురణన న్యాయముగా [సంలక్ష్యక్రమార్థము] వస్తువో, అలంకారమో నాటకము చూచు నట్టి కావ్యము పఠించునట్టి సహృదయుల హృదయమున ఎట్లు అభివ్యక్తి నొందుచున్నదో, అట్లే హర్షాదిభావములును అభివ్యక్తమగుచున్నవి రసనిరూపణమున ఇది 'అపర' మతము ననుసరించినది

ఇందు ప్రథమ మతము సిద్ధాంతము.

అభివ్యక్తి హేతువు

ఈ భావముల యభివ్యక్తికి ఏది కారణము ? (వ్యంజకము) కేవల విభావానుభావములా ? ఇంకొక వ్యభిచారిభావముకూడనా? భావవ్యంజనమున విభావానుభావములే వ్యంజకములు వ్యజ్యమాన మగు వ్యభిచారిభావమున కన్న వేఱైన కొండొక వ్యభిచారిభావము వ్యంజకము కాదు ఒక వ్యభిచారిభావము ధ్వన్యమాన మగునపుడు ఇంకొక వ్యభిచారిభావము వ్యంజకము కావక్కఱలేదు అట్లైనచో ఆ వ్యభిచారిభావమే (వ్యంజక మైనదే) ప్రధాన మగును. అది వ్యంగ్యము వ్యంజకము కూడ నగుఁగదా అది దాని ప్రకర్ష అంనుచే కేవల విభావానుభావములే భావము

నకు వ్యంజకము లని యంగీకరించుట సరి కాని వాస్తవ మాలో చించినచో ఇంకొక వ్యభిచారిభావమునకు (అంగమైనను) వ్యంజక మైనను సేగిలేదు. ఏలన ప్రకరణాదిబలమున ధ్వన్యమానభావము ఒకటి ప్రధానముకాఁగా ఆ భావమునకు వ్యంజకసామగ్రి యేదో ఆ వ్యంజక సామగ్రి చేతనే ఇంకొక వ్యభిచారిభావము [అవినాభావ ముగ నిత్యసంబద్ధముగ] తోడ్తోన వ్యజ్యమాన మగుచో, ఆ రెండ వది తొంటిదానివలె ప్రబలముగా నుండక [అన్యథా సిద్ధరూపమున నభివ్యక్త మగుటంజేసి] దుర్బలముగనే యుండును అందుచే అది ప్రధానము కానేరదు కావునఁ గొండొక వ్యభిచారిభావముసైతము వ్యంజకమైనను హానిలేదు ఉదా.— గర్వాదులు ప్రధానమగు నపుడు అమర్షము అంగమగుటయు అమర్షాదులు వ్యంగ్యమైన గర్వము అంగమగుటయు విరుద్ధముగాదు

[శంక] ఒక భావము అంగియు, నింకొక భావము అంగము నైనచో ఆచోటు గుణీభూతవ్యంగ్య మగుఁగాని భావధ్వని యగు టెట్లు ?

[సమా] ఒక భావము ఇంకొకభావమునకు అంగమైనంత మాత్రముననే గుణీభూతవ్యంగ్యము కాదు మఱేమన గుణీభూత వ్యంగ్యమున ప్రధానాప్రధానభావములకు వ్యంజక సామగ్రి - విభావానుభావములు - భిన్నము కావలయును అనఁగా అంగియైన భావమునకు ఏవి వ్యంజకములో [ఏవి విభావానుభావములో] తద్భిన్న వ్యంజకములు అప్రధానభావమునకు కలుగుచోటు గుణీభూత వ్యంగ్య మనఁబడును. ఏలన అందు ప్రధానభావము వ్యజ్యమాన మగునప్పుడే గౌణభావమును వ్యజ్యమానము కావలసినదిలేదు

దాని వ్యంజకసామగ్రి వేఱు అది ఆకస్మికము అందుచే గుణీ భూతము [అప్రధానము] మఱి భావధ్వని స్థలమున నన్ననో అట్లు కాదు అందు అంగిభావము వ్యజ్యమానమగునపుడే [తన్నిత్య సంబద్ధముగనే] దాని వ్యంజక(నిష్పాదక)సామగ్రివలననే అంగ మగు భావమును వ్యజ్యమాన మగును ప్రధానాప్రధానభావములకు నడుమ అంతర మేమియు నుండదు రెంటికిని నిష్పాదక(వ్యంజక) సామగ్రి సాధారణము అందుచే నిట భావములు నాంతరీయకములు నాంతరీయక మన నిత్యసంబద్ధము అన్యనిష్పాదకనిమిత్తమున తాను నిష్పాద్య మగునది అవ్యవహితనిష్పాద్య మగునది ప్రకృతమున గర్వామర్షాదులకు ఒక్కటే వ్యంజకసామగ్రి కావునను, అవ్యవధాన ముగ వ్యంజితము లగుటంజేసియు నాంతరీయకములు. ఆ కావ్యము భావధ్వనియే అదియు గుణీభూతవ్యంగ్యకావ్యనే యన్న ఇఁక సార్వత్రికముగ భావధ్వనికి ఉచ్ఛేదనే ఉప్పతిల్ల వలసివచ్చును. అందుచే భావములకు అంగాంగిభావ మున్నంతమాత్రముననే గుణీభూతవ్యంగ్య మను మతము సమ్మతము కాదు

ఇట వ్యభిచారిభావధ్వని స్థలమందు విభావాదులు ప్రాయిక ముగ నిమిత్తకారణములు రసవ్యంగ్యస్థలమునందుంబోలె ఆలం బనోద్దీపనరూపములుగా విభావాపేక్ష లేదు ఎటనేని భావధ్వని స్థలమునను విభావము ఆలంబనము ఉద్దీపనము నగుట సంభవించిన సంభవించుఁగాక వారింపఁ బనిలేదు. అందుచే ప్రాయికముగ ననుట [అందుచేతనే రసాభాసోదాహరణమున విభావము ఉద్దీపన ముగా ఉపపాదింపఁబడెనని గ్రహింపవలెను.]

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అధి 2 వ్యభిచారి భావములు

1 హర్షము 2 స్మృతి 3 వ్రీడ 4 మోహము
5 ధృతి 6 శంక 7 గ్లాని 8 దైన్యము
9 చింత 10 మదము 11 శ్రమము 12 గర్వము
13 నిద్ర 14 మతి 15 వ్యాధి 16 త్రాసము
17 సుప్తము 18 విబోధము 19 అమర్షము 20 అవహిత్థము
21 ఉగ్రత 22 ఉన్మాదము 23 మరణము 24 వితర్కము
25 విషాదము 26 ఔత్సుక్యము 27 ఆవేగము 28 జడత
29 ఆలస్యము 30. అసూయ 31 అపస్మారము 32 చపలత
33 నిర్వేదము (ప్రతిపక్షాదికృతధిక్కారజన్మము) 34. గురుదేవ పుత్రాది విషయకము రతి [ఇట నిర్వేదప్రారంభక ప్రాచీన గ్రంథ క్రమమునఁగాక హర్షారంభకముగ భిన్నక్రమమున వ్యభిచారి భావములు పేర్కొనఁబడినవి 'తత్ర హర్షస్య సర్వాభిలషణీయత్వాత్ ప్రథమ నిర్దేశః" [అలంకార మహోదధి]

వాత్సల్యము రసాంతరము కాదు ఇట్లు పుత్త్రాది విషయక రతిని భావముగ భరతోక్తి ననుసరించి అంగీకరించుటచే పుత్త్రి శిష్యాద్యాలంబనకము వాత్సల్యము రసాంతర మను మతము తిరస్కృతము అట్లే దేవాద్యాలంబనము భక్తియను మతము నిరాకృతము ఇట భరతముని వాక్యమే ప్రమాణము అది కాదని ఉచ్ఛృంఖల

ముగాఁ జెప్పఁబూనుకొన్న వ్యవస్థ లేకపోవును [రసములు తొమ్మిదే అను సిద్ధాంతమే సమ్మతము]

ఉద్దేశ్యక్రమమున హర్షాదివిభావములకు లక్షణములును లక్ష్యములును చెప్పఁబడును

1 హర్షము

ఇష్టప్రాప్త్యాది జన్యము, సుఖవిశేషరూపము నగు చిత్తవృత్తి విశేషము హర్ష మను వ్యభిచారి భావము. (చిత్తవృత్తి=భావము) అన్యులు చెప్పిన లక్షణము [దాన విభావాది ప్రపంచితము]

దేవభర్తృ గురుస్వామి ప్రసాదః, ప్రియసంగమః
మనోరథాప్తి, రప్రాప్యమనోహర ధనాగమః
తథోత్పత్తిశ్చ పుత్రాదే ర్విభావో యత్ర జాయతే
నేత్ర వక్త్ర ప్రసాదశ్చ ప్రియోక్తః పులకోద్గమః
అశ్రు స్వేదాదయ శ్చానుభావో హర్ష స్తమాదిశేత్

దేనియందు దేవత పతి గురువు ప్రభువు వీరి ప్రసాదము ప్రియురాలి సమాగమము మనోరథసిద్ధి, పొందరానిదియు మనోహరమునైన ధనాగమము పుత్త్రాద్యుత్పత్తియు విభావములో నేత్ర ముఖ ప్రసన్నత, ప్రియభాషణము పులకాంకురము అశ్రుస్వేదాదులు అనుభావములో, దానిని హర్ష మను వ్యభిచారిభావముగా చెప్పవలెను.

ఉదా :—

నాయకుఁడు తన ప్రియురాలినిగూర్చి తన మిత్త్రునితోఁ జెప్పుచున్నాఁడు :—

అవక్షా దివసావసానకాలే భవనద్వారి విలోచనే దధానా
అవలోక్య సమాగతం తదా మా మథ రామా వికసన్ముఖీ బభూవ

[నేను మరలివచ్చు] గడువునాఁటి సాయంకాలము వాకిటనే కనులుపెట్టి చూచుచు వచ్చుచున్న నన్నుఁజూచి నా ప్రియురాలు వెంటనే వికసన్ముఖి యాయెను.] (అథ=హర్షోద్భవానంతరము)

ఇందు అవధికాలమున ప్రియాగమనము విభావము, ముఖ వికాసము అనుభావము హర్ష భావధ్వని.

ఉదాహరణాంతరము :—

సమీక్ష్య పుత్త్రస్య చిరాత్పితా ముఖం
నిధాన కుంభస్య యథైవ దుర్గతః
ముదా శరీరే ప్రబభూవ నాత్మనః
పయోధి రిన్దూదయమూర్ఛితో యథా (సా ద.)

'దరిద్రుఁడు నిధికుంభముఖముంబోలె చిరకాలమునకుఁ బుత్త్రుని ముఖమును జూచి తండ్రి చంద్రోదయముచేత పొంగిన సముద్రునిబోలె తన శరీరమందు సంతోషముచేత ఇముడలేక పోయెను"
(అలం. మహో)

జాతస్య తే పితుర పీన్ద్రజితో నిహన్తు
ర్వత్సస్య వత్స కతి నామ దినాన్యమూని
తస్యా ప్యపత్య మనుతిష్ఠతి వీరధర్మం
దిష్ట్యా గతం దశరథస్య కులం ప్రతిష్ఠామ్
(ఉ. రా. చ. ౫. అం. (రస చం)

చిరంజీవి ఇంద్రజిహంత లక్ష్మణుని కడుపున బుట్టిన నీ వెంత యీడుకలవాఁడవు? అంతచిన్నవానికిఁగొడుకవైన నీవును, నాయనా వీరధర్మమును నెఱపుమంటి వనఁగా, దశరథులకులము భాగ్యవశమున ప్రతిష్ఠావంతమైనది

ఆయాతే దయితే మరుస్థలభువా ముత్ప్రేక్ష్య దుర్లంఘ్యతాం
గేహిన్యా పరితోషబాష్పకలిలా మాసజ్య దృష్టిం ముఖే
దత్త్వా పీలుశమీకరీరకవలాన్ స్వేనాంజలే నాదరా
దున్మృష్టం కరభస్య కేసరసటాభారాగ్రలగ్నం రజః
(అద్భుతపుణ్యుఁడు, కవి - హను. రసరత్న)

ప్రాణప్రియుఁడు రాగా ఎడారిభూమి (మార్వారు దేశము) గడవరాని దని తెలిసినదై అతని ప్రియురాలు అతని ముఖమున సంతోషబాష్పములతో వీక్షించి అతని యొంటెకు తన దోసిటితో సాదరముగా - తాటిచెక్క జమ్మికొమ్మలు వెదురు చిగుళ్ళతోఁగూడిన మేఁతను స్వయముగా పెట్టి దాని జూలునందు లగ్నమై యున్న దుమ్మును తుడిచెను.

2 స్మృతి

సంస్కారజన్యమైన జ్ఞానము స్మృతి

ప్రత్యక్షానుమాన శాబ్దాద్యాత్మకానుభవము జ్ఞానము నైయాయిక మతానుసారము త్రిక్షణస్థాయి. అందులో పుట్టు క్షణ మొకటి ఉండు క్షణ మొకటి, నశించు క్షణ మొకటి కొంతకాల మగునప్పటికి ఆజ్ఞానముయొక్క స్మరణము అనుపపన్న మగును అందుచే స్మృతికి కారణము క్షణిక మగు జ్ఞానము కానేరదు చిర

స్థాయియు, అనుభవజన్యమును నైన సంస్కారము కారణముగా నంగీకృతము. ఆ యనుభవజన్యసంస్కారము స్మృతికి హేతువు.

ఉదా :—

నాయకుఁడు తన ప్రియురాలి లావణ్యమును తలపోసికొను చున్నాఁడు.

తన్మంజు మందహసితం శ్వసితాని తాని
సా వై కలంకవిధురా మధురాననశ్రీః
అద్యాపి మే హృదయ మున్మదయ న్తి హన్త!
సాయ న్తనామ్బుజసహోదరలోచనాయాః

సంజ ప్రొద్దు తమ్మి పూఁ దమ్ములైన యరమోడ్పుకనులు గలదైన యా నా ప్రియురాలి ముద్దు లొల్కు మందహాసము, ఆ నిట్టూర్పులు, ఆ నిష్కలంకచంద్రాతిశాయి ముఖశోభ, అక్కటా! ఇప్పటికిని నా మనసును వేదుకు గొల్పుచున్నది.

[శంక] ఇట చింతావిశేషము విభావము ప్రూలతోన్నయ నము (కనుబొమ పైకెత్తుట) గాత్రనిశ్చలత్వము మున్నగునవి ఇట వాచ్యములు కామిం జేసి ఆక్షేపగమ్యములు (ఊహ్యములు) అను భావములు ఈ యుదాహరణమునందు నాయిక ఆలంబన విభా వము (హన్త!) అకటా ' పదవ్యంగ్యమైన హృదయవైకల్యము అను భావము. స్మృతి వ్యభిచారిభావము ఇవి నాయకగత మగు రతి సంయోగమువలన విప్రలంభశృంగారధ్వని వ్యజ్యమాన మగు చున్నది. అందువలన నిది రసధ్వనికి ఉదాహరణము కాని, భావ ధ్వనికిఁ గాదు ' అని యాశంకింపఁ దగుమ

[సమా] కాని, స్మృతియే యిందు దోలుదోల్త ప్రతీయమాన మగుచున్నది. అదే అధికచమత్కారి. (పశ్చాద్భావియైన ధ్వని అల్పచమత్కారవంతము) అందుచే నిది స్మృతి రూప భావధ్వనికే ఉదాహరణము

స్మృతికి యెట్లు ధ్వనిత్వము?

శ్లోకమునందు తన్మంజు,' 'తాం' అనన శ్రీః అని తచ్ఛబ్దము ప్రయోగింపబడినది ఇట స్మృతి తద్వాచ్యము తచ్ఛబ్దమునకు లోకమునందు ఘటపటాదిసర్వపదార్థములయందు శక్తి యున్నది. అందుచే అవెల్ల తచ్ఛబ్దమునకు నానార్థము లవుదగునా? హరి శబ్దమున ఇంద్ర విష్ణు సింహాద్యర్థనిరూపకము శక్తి యొకటి యున్నట్లు సర్వపదార్థములందును తచ్ఛబ్దమునకు ఒక్క శక్తి చెప్పవగునా ? మఱి స్మృతివాచక మగు తచ్ఛబ్దార్థమున కేది వ్యంగ్యార్థము?

[సమా] ఇట వతద్వయము కలదు తచ్ఛబ్దము ప్రకరణమును బట్టి ఘట పటాది నానార్థబోధక మగును అట్లగుటం జేసి హర్యాది నానార్థకశబ్దత్వము దానికిని రావలసియుండును కాని అది నానార్థక శబ్దము కాదు ఏలన ఏశబ్దమునకు అనేకార్థనిరూపితము లగు ననేక శక్తులు శాస్త్రసమ్మత మగునో అది నానార్థకపదము. ఉదా.- హరి శబ్దము. మఱి ఏ శబ్దమునకు అధి అనేకార్థనిరూపక మైనను ఒక్కటే శక్తి అంగీకృతమో అది ఏకార్థకశబ్దమే [ఏకార్థక నిరూపక శబ్ద తుల్యమే] ఉదా.- తచ్ఛబ్దము ఇది న్యాయశాస్త్ర విర్ణయము. ఏలన తదాది శబ్దములకు అవి అనేకశబ్దబోధకము లైననుంగూడ బుద్ధి విషయతోపలక్షిత తత్తద్ధర్మావచ్ఛిన్నమున శక్తి సమ్మతము [బుద్ధియొక్క ప్రకారములలో స్మృతియు నొకటి] ప్రకరణమునుబట్టి

ఘటత్వము బుద్ధికి విషయమైనపుడు ఘటత్వధర్మావచ్ఛిన్నఘటమును తచ్ఛబ్దము బోధించును అట్లే పటత్వము బుద్ధికి విషయ మైనప్పుడు పటత్వావచ్ఛిన్నపటము తచ్ఛబ్దవాచ్య మగును నైయాయిక మతమునందు జాతివిశిష్టవ్యక్తియందు శక్తి ఘటశబ్దమునకు ఘటము శక్యార్థము వాచ్యార్థ మొండె - సంకేతార్థ మొండె ఘటత్వము పటత్వము ఇత్యాదులు శక్యతావచ్ఛేదకములు నియత శక్యార్థబోధకధర్మములు తచ్ఛబ్దమునకు ఘటత్వపటత్వాదులు అనేకములు శక్యతావచ్ఛేదకము లుండుటచే శక్తి ఏకమా ? అనేకమా ? అని ప్రశ్న ఏకమే అని సమాధానము ఏల ? ఇట మతిభేదము. మొదటి మతమునుబట్టి-నానాశక్యతావచ్ఛేదకము లున్నను వానికెల్ల ననుగతధర్మము - శక్యతావచ్ఛేదకావచ్ఛేదకత్వము, బుద్ధిస్థత్వము ఒకటేయగుట, బుద్ధిస్థబోధత్వావచ్ఛేదకతోపలక్షిత ధర్మావచ్ఛిన్నమునందు శక్తి శక్యతావచ్ఛేదకములైన ఘటత్వ పటత్వాదుల కెల్ల ననుగత ధర్మము (శక్యతావచ్ఛేదకావచ్ఛేదకత్వము) బుద్ధిస్థత్వము అను ఉపలక్షకధర్మము ఒక్కటే అందుచే శక్తి ఒక్కటే అనుగతధర్మ మొక్కటి యగుట అందు శక్తి ఒక్కటే ఇట్లు తచ్ఛబ్దము నానార్థకశబ్దము కాదు

రెండవ మతమును బట్టి తదాదిశబ్దములకు శక్తి బుద్ధిస్థత్వావచ్ఛిన్నమునందు. [బుద్ధిస్థ మగు ఘటత్వావచ్ఛిన్నఘటమునందు] అందువలన తచ్ఛబ్దమువలన ఘటపటాదిబోధ అసాధారణఘటరూపముగాక, సాధారణబుద్ధిస్థరూప మగును] తత్పదశక్యములు ఘటపటాదికములు అనేకములున్నను శక్యతావచ్ఛేదకము బుద్ధిస్థత్వము ఒక్కటే అదే అనుగతధర్మము [తొంటి మతమునం బోలె అనుగతధర్మము శక్యతావచ్ఛేదకావచ్ఛేదకపర్యంతము అనుధావనము

లేదు. అందుచే లాఘవము కలదు. అనుగతధర్మము ఒక్కటి యగుట అందు శక్తి ఒక్కటే. ఇట్లు తదాదిశబ్దములు నానార్థకములు కావు.

బుద్ధిసత్త్వ మను ననుగతధర్మముచే నుపలక్షితమైన మొదటి మతమున బుద్ధిసత్త్వోపలక్షిత [ఘటత్వావచ్ఛిన్న] ఘటరూపార్థ వాచకము తచ్ఛబ్దము

రెండవమతమున బుద్ధిస్థమైన [ఘటత్వావచ్ఛిన్న]ఘటరూపార్థ వాచకము తచ్ఛబ్దము

బుద్ధి అనునది వాచ్యార్థము వ్యంగ్యార్థము, అనుభవము, స్మృతి, సర్వవిషయకము అది అన్నిటికి అనుగతధర్మము

[తచ్ఛబ్దమువలన ఘటాదిపదబోధ అసాధారణ ఘటాది రూపము.]

ఈ రెండు మతములందును తదాదిపదవాచ్యము బుద్ధి విషయీభూత మగు నర్థము స్మృతియు బుద్ధిప్రకారములలో నొకటి అట్టిచో స్మృతికి ధ్వనిత్వము - వ్యంగ్యత్వము ఎట్లు సిద్ధించును ? రెండు మతములందును సిద్ధించును ఎట్లన, మొదటి మతము ననుసరించి_బుద్ధి 1 అది శక్యతావచ్ఛేదకతానుగత ధర్మము [శక్యతావచ్ఛేదకతావచ్ఛేదక) కుక్షిలో ప్రవేశించినను, అది ఉపలక్షణ మాత్ర మగుట - విశేషణము కాదు కావున - తద్వాచ్యత్వము సార్వత్రికము కాదు అందుచే తత్ పదముయొక్క వాచ్యత (1) శక్యార్థము (2) శక్యతావచ్ఛేదకము దనుకనే వ్యాపించును. పిమ్మట శక్యతావచ్ఛేదకావచ్ఛేదము వఱకు అనువర్తింపదు.

[ఏలన ఉపలక్షణము వ్యావృత్త్యధికరణమున సార్వత్రికముగ నుండి సార్వకాలికముగ నియతవ్యావర్తకశక్తి కలది కాదు కార్య స్థానమున నెల్లప్పుడు నుండి సేవకుల నియమించి పనిచేయింప నోపని యజమానివంటిది] అందుచే శక్యతావచ్ఛేదకతావచ్ఛేదకవాచ్యత్వము సార్వత్రికముకాదు ధ్వన్యమానము నగును అందుచే బుద్ధి విశేషమైన స్మృతికి ధ్వనిత్వము అవ్యాహతము.

మఱి ద్వితీయమతమున బుద్ధి శక్యతావచ్ఛేదకము తొంటి మతమునందుంబోలె కాదాచిత్కవ్యావృత్తిమగు నుపలక్షణముకాదు విశేషణ మగుట నియతవ్యావర్తకము వ్యావృత్త్యధికరణమున నిత్యముగ నుండునది స్వకాలనియతవ్యావృత్తిబోధ జనకము అందుచే తత్పదముయొక్క వాచ్యార్థమునే తప్పక బోధించును కావున బుద్ధి ప్రకారములలో నొకటియైన స్మృతి వాచ్యమేకాని వ్యంగ్యము కానేర దనుట నిజమేయైనను గూడ బుద్ధిత్వ సామాన్యధర్మరూపమున స్మృతికి వాచ్య మున్నను, స్మృతిత్వరూపాసాధారణ(విశేష) ధర్మరూపమున వ్యంగ్య మగుటకు ఏ బాధయులేదు సామాన్యమును విశేషము బాధించునుగదా! ఇట్లు ఉభయమతములను స్మృతికి ధ్వనిత్వము సిద్ధము

[శంక] ద్వితీయమతమున బుద్ధిత్వధర్మమున అభిధచే బోధ్యమానమైన స్మృతికి స్మృతిత్వధర్మమున వ్యంగ్యత నంగీకరించుచో "శయితా సవిధే అను శ్లోకస్థలమున (ఉత్తమోత్తమ కావ్యోదాహరణముగ పూర్వోక్తశ్లోకస్థలమున) వ్యంగ్యమునకు - ఎట్లుకాని వాచ్యవృత్త్యనాలింగితమైనదానికే చమత్కారిత్వము అని

ఆలంకారికనియమము ' అని తా ముగ్గడించినదానికి ఇట విరోధము స్ఫుటనే

[సమా] ఎక్కడ వాచ్యతావచ్ఛేదకము నవ్యంగ్యతావచ్ఛేదకమా, అది జాతిరూపమును ప్రతీతివిషయ మగు [జాతిరూపము కాని తదన్యము కాని] ఏకధర్మమో [ఘటత్వ కలశత్వములవలె] అచ్చటనే ఆ యర్థమునకు వ్యంగ్యత్వము లేదు చమత్కారమును లేదు మఱి ఎచ్చోట సామాన్యవిశేషాదిభావములచే నించుకేని భేద మున్న, ఆధర్మముల పట్ల నీ నియమము లేదు. 'శయితా ' మున్నగు స్థలముల వాచ్యతావచ్ఛేదకమైన మనోరథత్వము వ్యంగ్యతావచ్ఛేదకమైన చుంబనేచ్ఛాత్వము రెండును [కలశత్వఘటత్వములవలె] ఏకధర్మరూపనే మఱి ఇచ్చోట నన్ననో బుద్ధిత్వస్మృతిత్వములకు గుణత్వజ్ఞానత్వములకుంబోలె – సామాన్యవిశేషభావము కలిమిచే భేదము అందుచే వ్యంగ్యత్వము చమత్కారిత్వమును సిద్ధము

ఇట 'తన్మంజు" శ్లోకము మున్నగు చోటుల స్మృతి తన్మంజు' ఇత్యాదివాక్యముచే నెల్ల వ్యజ్యమానమైనను తత్పదవ్యంగ్య మగు స్మృతిచమత్కారనే విలక్షణముగ (కుర్వద్రూపము) అపూర్వ శక్తిసంపన్నముగ నున్నది అందుచే నిట పదధ్వనిత్వనే ప్రసిద్ధము దీనిచే 'భావములకు పదవ్యంగ్యత్వమున విచ్ఛిత్తిలేదు" అని యుగ్గడించు మతము పరాస్తమైనది

'విచ్ఛిత్తిశోభినైకేన భూషణేనైవ కామినీ
పదద్యోత్యేన సుకవే ర్ధ్వనినా భాతి భారతీ "

(ధ్వన్యాలోకము)

ఈ శ్లోకమునందు పదాంతరవ్యంగ్యమును స్ఫురించుచున్నది. 'సాయంతనాంబుజ సహోదరలోచనాయాః' అని సాయంకాలకమల ముల యుపమానముచే నయనములు క్రమనిమీలనోన్ముఖత్వము ధ్వననద్వారమున నాయిక యానందమగ్నత్వము ధ్వన్యమాన మగుచున్నది.

ప్రత్యుదాహరణము.—

నాయకుఁడు తన మిత్రునితో చెప్పుచున్నాఁడు —

దరానమత్కంధరబంధ మీషన్నిమీలితస్నిగ్ధవిలోచనాబ్జమ్
అనల్పనిశ్వాసభరాలసాంగం స్మరామి సంగం చిర మంగనాయాః

ఇంచుక వంగిన కంధరభాగమును ఆనందాతిశయముచే దరమీలిత నయనారవిందములును మిక్కుటమైన నిశ్వాసములచే నత్యంతాలసాంగమును అయిన యా తన్వంగి సంగమము చిరము స్మరించుచున్నాను

ఈ పద్యమందు స్మృతి 'స్మరామి' అని స్వశబ్దముచే నుప పాదిత మగుటచే వ్యంగ్యము గాదు అందుచే అది భావము కాదు సాదృశ్యమూలకము కామింజేసి స్మరణాలంకారము కాదు సాదృశ్య మూలమే స్మరణాలంకార మని అన్యవ్యంజితము భావ మని ఆలంకారిక సిద్ధాంతము మఱి ఆలంబనవిభావమైన నాయిక నుహించుచే కంధర దరనమనము, నయనేషన్నిమీలనము మున్నగు ననుభావములు తత్కారణములుగా నూహ్యములైన లజ్జారూప సంచారిభావములు వీని సంయోగముచే నాయకనిష్ఠరతి శృంగారరసముగా నెట్లని

సమన్వయించుకొనవలయును ('కథంచిత్') 'ఎట్లెని' అనుటచే మనోహరమైన విభావమాత్రమున రసపరిణామము శక్యము కావున.

3 వ్రీడ

స్త్రీలకుఁ బురుషముఖావలోకనాదులచేతను బురుషులకుఁ బ్రతిజ్ఞాభంగము, నైరకృత పరాభవము మున్నగు వానిచే నుద యించినది వైవర్ణ్యము, అధోముఖత్వము, మొదలైన వానికి కారణ భూతమైనది అగు చిత్తవృత్తివిశేషము వ్రీడ

ఉదా .—

నాయకుఁడు ముగ్ధప్రియావృత్తము చెలికానితోఁ జెప్పు చున్నాఁడు .—

> కుచకులశయుగాంత ర్మామకీనం నఖాంకం
> సపులకతను మందమంద మాలోకమానా
> వినిహితవదనం మాం వీక్ష్య బాలా గవాక్షే
> చకితనతనతాంగీ సద్మ సద్యో వివేశ

ఆ గోల కుచకులశయుగము నడుమ నా చేసిన నఖక్షతము చిహ్నమును మెలమెల్లగాఁ జూచుకొనుచు నన్నెను గవాక్షన గవాక్షమునందు ముఖ ముంచి తనుఁ జూచుచున్న ననుఁజూచి మోము వంచుకొని చకితనతాంగియై అప్పుడే యింటిలోనికిఁ బోయెను

ఇందుఁ బ్రియుని నాయిక చూచుట అతఁడు తనపాలింట్ల సందున మున్నొనర్చిన నఖక్షతము తాఁ జూచుకొనుటచే తన కొద

విన హర్షమును నేనిగనుర్పాటు ప్రియుఁడు చూచుట విభావములు సద్యఃస్నదనప్రవేశము అనుభావము. వీనిచే వ్రీడ వ్యజ్యమానము.

ఉదాహరణాంతరము:—

నాయకుఁడు నెచ్చెలితో చెప్పుచున్నాడు

నిరుధ్య యాంతీం తరసా కపోతీం
కూజత్కపోతస్య పురో దదానే
మయి స్మితార్ద్రం వదనారవిందం
సా మంద మందం నమయాంబభూవ

పఱచుచున్న యాడుపావురమును నే తటాలున నడ్డగించి మసలుకొని కూజించుచున్న మగపావురము పురోభాగమున నుంపఁగా దరహాసార్ద్రమును ముఖకమలమును ఆ నా ప్రియ అల్ల నల్ల వంచినది.

తొలింటి యుదాహరణమున త్రాసలేశ మున్నట్లు ఇట హర్షలేశమున్నను అది వ్రీడకు పోషకముగా నున్నందున అనుగుణముగా నున్నది. అట్లే రెండవ యుదాహరణమున ప్రియుఁడు కపోతము నెదుట కపోతి నుంచుట విభావము, ముఖము వంచుట అనుభావము స్మితవదనముచేఁ బ్రతీయమానహర్షమును వ్రీడకు పోషకముగా నున్నందున అనుగుణము. ఇట ప్రధానభావ మగు వ్రీడకు హర్ష త్రాసాదులు సాంతరీయములు కావున భావధ్వని

ఉదాహరణాంతరము :—

పటాలగ్నే పత్యౌ నమయతి ముఖం జాతవినయా
హఠాశ్లేషం వాంఛ, త్యపహరతి గాత్రాణిచ భృశమ్.
న శక్నో త్యాఖ్యాతుం స్మితముఖసఖీద త్తనయనా
హ్రియా తామ్యత్యస్యాః ప్రథమపరిభోగే నవవధూః (అమరుక.)

నూతనవధువు ప్రథమసమాగమమున భర్తచేలాంచలమును లాగగా వినయముగలదై మోము వంచుచున్నది భర్త హఠాత్తుగా కౌగిలించుకొనఁగోరగా శరీరావయవములను గట్టిగా సంకోచింప జేసి కొనుచున్నది. చిరునవ్వు మోములతో నున్న సఖురాండ్రను జూచుచు తన కోరికను వెలిబుచ్చలేనిదై సిగ్గుచే లోలోన గుదుసుక్కొ పడుచున్నది.

4 మోహము

భయము వియోగము మున్నగువానిచే జనించినది, తత్త్వ నిశ్చయవిరోధి యగు చిత్తవృత్తి విశేషము మోహము నవ్యులు దీనిని వస్తుతత్త్వానవధారణరూప మగు నవస్థాంతరము పొందిన చింతాఖ్య చిత్తవృత్తియే మోహ మను పేరఁ బరఁగు నని యెంతురు. అందుచే అవస్థాంతరశబలిత మగు చింతయే మోహము అని లక్షణము చెప్పుదురు.

ఉదా :—

సఖి యొకతె నాయిక యొక్క మోహమును వర్ణించుచున్నది :—

విరహేణ వికలహృదయా
విలపంతీ దయిత దయితేతి
ఆగత మపి తం సవిధే
పరిచయహీనేవ వీక్షతే బాలా.

ఆ బాల విరహవ్యాకులహృదయ ఓ ప్రియా, ఓ ప్రియా ఎక్కడ నున్నావు?' అని యాక్రందించుచు, వచ్చి దాపుననే యున్న ప్రియుని అపరిచితునింబోలె చూచుచున్నది.

ఇందు ప్రియావియోగము విభావము. ఇంద్రియవైకల్యము [పరిచితుని కనులయెదుట నున్నను పరిచితుఁ డను జ్ఞానములేమి], లజ్జాద్యభావము అనుభావములు ఈ విభావానుభావములు నాయిక యొక్క మోహరూపభావమును ధ్వనింపఁ జేయుచున్నవి

ఉదాహరణాంతరము :—

శుండాదండం కుండలీకృత్య కూలే
కల్లోలిన్యాః కించి దాకుంచితాక్షః
నైవాకర్ష త్యంబు నైవాంబుజాలిం
కాంతాపేతః కృత్యశూన్యో గజేంద్రః

తన ప్రియవశ నెడబాసి గజేంద్రుఁడు దండోపమమైన తన తొండమునుచుట్టి కనుల నాకుంచించి చేష్టదక్కి నదీతటమున తా నున్నను ఎదుటనున్న జలమును [ఉన్నట్లు గ్రహింపనందున] పీల్పఁడు, త్రాగుటలేదు, పద్మసందోహమును ముట్టఁడు ఇట్లు ఆహార పానీయములు వర్జించి యున్నాఁ డని భావము

ఇందు ప్రియావియోగము విభావము, నదియొడ్డునం దుండియు సలిలసరోజముల ముట్టకుండుట కృత్యౌదాసీన్యత్వము సంభ్రమము అను భావము వస్తుతత్త్వానవధారణరూపమోహము ధ్వనితము.

5. ధృతి

లోభము శోకము భయము మున్నగు వానిచే జనించిన యుపప్లవమును వారింప కారణభూత మగు చిత్తవృత్తివిశేషము ధృతి.

ఉపప్లవ మన చిత్తక్షోభము

ఉదా :—

ధీరుని పరామర్శ వాక్యము :—

సంతాపయామి హృదయం
ధావం ధావం ధరాతలే కి మహమ్ ?
అస్తి మమాగ్రే సతతం
నందకుమారః ప్రభుః పరమః.

నేను (లోభమునకు లోనై) భూతలమంతయు పఱచి పఱచి ఏల నా హృదయము నిట్లు తపింపఁజేయుచున్నాను సర్వోత్కృష్టుఁడు పరమేశ్వరుఁడు నందకుమారుఁడు నాకు ముందు మార్గదర్శకుఁడై సర్వదా వెలసియున్నాఁడు, (ఆయనయే నా కోరికలెల్లఁ దీర్చును నా కేల యీ చింత ?) 'అస్తి మమ శిరసి' అను పాఠమున 'భారభూతుఁడు' అను నస్వారస్యప్రతీతి కలదు.)

ఇందు వివేకము శ్రుత సంపత్త్యాదులు (శాస్త్రజ్ఞానాదులు) విభావము చపలతాశంకాద్యుపశమము అనుభావము.

[శంక] ఇందు ఉత్తరార్థమున నాకు చింతలేదు" అను వస్తురూప వ్యంగ్యమునకు ఇది ఉదాహరణ మగును. భావధ్వని కెట్లు ఉదాహరణము?

[సమా] అను శంక కలుగునేని ఆ వస్తురూపధ్వని ప్రధానము కాదు అది ధృతిభావపోషకముగ నున్నది బాధకము కాదు భావధ్వని యన్ననో ప్రధానముగా నభివ్యక్త మగుచున్నది అందుచే ధృతికే ఇది ఉదాహరణము

ఉదాహరణాంతరము .— జ్ఞానమువలన,

అశీమహి వయం భిక్షా మాశావాసో వసీమహి
శయీమహి మహీపృష్ఠే కుర్వీమహి కి మీశ్వరైః ?
(రసార్ణవము)

మేము బిచ్చమునే తిందుము దిక్కులనెడి వస్త్రములనే ధరింతుము కటికనేలయందే శయనింతుము అట్టి మాకు రాజులతో నేమి పని?

భవ హృదయ సావధానం సంప్రతి సందేహనిర్ణయో జాతః
ఆశంకినే యదగ్నిః త దిదం స్పర్శక్షమం రత్నమ్
(శాకుం విశ్వే రసచంద్రిక.)

ఓ హృదయమా నీవు సావధానముగా నుండుము ఇపుడు నీకు సందేహనిర్ణయ మైనది నీవు దేనిని నిప్పుగా భావింతువో అయ్యది స్పర్శయోగ్య మైన వణి

విజ్ఞానము వలన :—

అస్త్యర్థ్యాపి చతుస్సముద్ర పరిఘా పర్యంత ముర్వీతలం
సంత్యన్యేపి చ తత్ర తత్ర సుధియాం గోష్ఠీషు సక్తా నృపాః
తత్రైకోఽపి నిరాదరోయది భవే దన్యో భవే త్సాదరో,
వాగ్దేవీ వదనాంబుజే వసతిచేత్ కో నామ దీనో జనః (రసార్ణవము)

చతుస్సముద్ర ముద్రితమైన భూమండల మింకను ఉండనే యున్నది విద్వద్గోష్ఠులందు సక్తులైన రాజులు నచ్చటచ్చట గలరు మఱియు నొకడు నిరాదరుడైనను ఆదరించు వారును కొందఱు గలరు వాగ్దేవి యెవని వదనాంబుజమున వసించునో ఆతఁడు దీనుఁ డెట్లగును ?

6 శంక

(తన దోసముచేఁగాని పరక్రౌర్యముచేఁగాని మఱే కారణముచేఁగాని) ఏమి యనిష్టము నాకు ఉప్పతిల్ల నున్నదో అను చిత్తవృత్తి విశేషము శంక

పరక్రౌర్యాత్మ దోషాదేః శంకాఽనిష్టస్య చింతనమ్
వైవర్ణ్య కమ్ప వైస్వర్య పార్శ్వాలోకాస్యశోషకృత్
శంకా చౌర్యాపరాధాదేః స్వానిష్టోత్ప్రేక్షణం మతం
తత్ర చేష్టా ముహుః పార్శ్వదర్శనం ముఖశోషణం
అవకుంఠన వైవర్ణ్య కంఠనాదాదయోఽపిచ
ద్వివిధా చేయ మాత్మోత్థా పరోత్థా చేతి భేదతః
స్వకార్యజనితా స్వోత్థా ప్రాయో వ్యంగ్యేయ మింగితైః
ఇంగితానితు పక్ష్మప్రాంతతారకా దృష్టివిక్రియాః
(రసార్ణవ)

చౌర్యము మొదలగు నపరాధము వలన ఇతరుల క్రౌర్యము వలన శంక కలుగును తన కేదో కీడు మూడనున్నదని భావించుట దాని స్వభావము దానిలో మాటి మాటికి ప్రక్కలకు చూచుట మో మెండుట కప్పుకొనుట వెల్లనగుట కంఠనాదము మొదలగు చేష్టలు కలుగును ఈ శంక రెండు విధములు తనవల్లనే కలిగినది యొకటి ఇతరులవల్ల కలిగినది రెండవది తాను చేసిన పనులచేఁ గల్గిన శంక తన యింగితములవలన వ్యక్తమగును ఇంగితములన కనుఱెప్పలు వ్రాలుట కనుబొమలు వంకరయగుట కనీనికలు నల్లనగుట మొదలగు వికారములు

ఉదా :—

దైవ నిరోధమున సంకేతస్థలమునకుఁ బోనేరని నాయిక సఖితో ఆ వృత్తాంతము చెప్పుచున్నది

విధి వంచితయా మయా న యాతం
సఖి, సంకేత నికేతనం ప్రియస్య
అధునా బత కిం విధాతుకామో
మయి కామో నృపతిః పున ర్నజానే

సఖి, నేను పోఁగోరియు దైవవంచితనై [ఇచ్ఛలేక కాదు] నేను నా ప్రాణప్రియుని సంకేత గృహమునకుఁ బోవనైతిని అయ్యో మఱి యిప్పుడు (క్రూరస్వభావుఁడు ఆరాజు, కాముఁడు) నన్నేమి చేయునో ఎఱుఁగను

ఇందు రాజాజ్ఞాభంగాపరాధము విభావము శబ్దోపాత్తములు కామి ఆక్షేప్యములు (ఊహ్యములు) ముఖవైవర్ణ్యాదులు అనుభావములు

శంకకును చింతకును భేద మేమన శంక భయాదులఁ బుట్టి కంపాద్యనుభావములఁ బుట్టించును. చింత యున్ననో కంపాదులఁ బుట్టింపదు ఇది భేదము

7 గ్లాని

ఆధివ్యాధి జన్య బలహానిచేఁ బుట్టినది వైవర్ణ్యము శిధిలాంగత్వము దృగ్భ్రమణము మున్నగునవి కల్గించునదియైన దుఃఖాత్మక చిత్తవృత్తి విశేషము గ్లాని ఆధిమనోవ్యథ - వ్యాధి క్షుధాద్యుపలక్షకము

[సా దర్పణము —గ్లాని రత్యాయాస మనస్తాప క్షుత్పిపాసాదుల వలన జనించును నిష్ప్రాణత, వణకు, కార్శ్యానుత్సాహము ఇత్యాదులం గలిగించును]

ఉదా .—

నాయిక వియోగినీ దశను సఖి వర్ణించుచున్నది :—

శయితా శైవలశయనే
సుషమాశేషా నవేందులేఖేవ
ప్రియ మాగత మపి సవిధే
సత్కురుతే మధుర వీక్షణై రేవ

నాచు సెజ్జపై పరున్నది, క్రొత్త చంద్రరేఖవలె పరశోభ మాత్రము మిగిలియున్నది. దాపునకు వచ్చియున్నను ప్రియుని మధురవీక్షలచే మాత్రనే సమ్మానించుచున్నది విరహవేదనచే

సంత దుర్బలయై యుండుటచే అన్యోత్థానాకులచేఁ బ్రియుని సమ్మానింప శక్తురాలు కాకున్నది అని భావము.

ఇట ప్రియ విరహము విభావము మధురవీక్షణముచేతనే అను సేవకారముచేత బోధ్యమాన మగు ప్రత్యుద్గమనప్రణామాలింగనాది నివృత్తి అనుభావము ఇందు శ్రమభావధ్వని అని ఆశంకింపరాదు ఏలన శ్రమకు కారణములైన బహుశరీర వ్యాపారములు ఇట లేవు ఆ శారీరకశ్రమమయొక్క వర్ణన ఎచట నుండదో అచట కారణ భూతములైన బహుశరీరవ్యాపారములు నుండకుంజేసి - అకారణ ముగ శ్రమ ప్రతీతి కలుగదు

కొందఱు "వ్యాధ్యాది ప్రభవ బలనాశము గ్లాని' అని లక్ష ణము చెప్పిరి చిత్తవృత్తులు భావపదార్థములు కదా వారి మతమున వానిలో (నాశము) అభావరూపము గ్లానియొక్క సమావేశము ఎట్లు సంభవ మగును? అది అసంగతము 'బలస్యాపచయో గ్లాని రాధి వ్యాధి సముద్భవః' అని భరతముని లక్షణము ఇందును అప చయశబ్దముచే నాశనే (అభావనే) బోధ్యమైనను ముందు చెప్పిన యనుపపత్తిచే - బలనాశజన్యమైన దుఃఖవిశేషమే' ఇట బలాపచయ శబ్దముచే వివక్షిత మని లక్షణచేఁ గల్పింపఁదగును

ఉదాహరణాంతరము. — (సా ద)

స్రస్తాంసా వతి మాత్ర లోహితతలా బాహూ ఘటోత్క్షేపణాత్,
అద్యాపి స్తనవేపథుం జనయతి శ్వాసః ప్రమాణాధికః
బద్ధం కర్ణశిరీషరోధి వదనే ఘర్మాంభసాం జాలకం
బంధే స్రంసిని చైకహస్తయమితాః పర్యాకులా మూర్ధజాః
(శాకుం వి - ప చం)

ఈమె చేతులు నీటికుండల నెత్తుటచే జారిన భుజశిరస్సులు గలవిగను మిక్కిలి యెఱ్ఱనైన కరతలములు కలవిగాను నున్నవి నిట్టూర్పులు ప్రమాణాధికములై యుండుట ఇప్పుడుగూడ స్తనముల కంపము మానలేదు కర్ణమందలి దిరిసెనపు పువ్వుచే నిరోధింపఁ బడిన మోమునందు స్వేదబిందువుల సందోహము నిండారియున్నది కొప్పుముడి జారిపోగా కేశములు చెల్లాచెదరైనవై యొక చేతితో సర్దుకొనఁ జేయఁబడుచున్నవి

'కిసలయ మివ ముగ్ధం బన్ధనా ద్విప్రలూనం
హృదయకమలశోషీ దారుణో దీర్ఘశోకః
గ్లపయతి పరిపాణ్డు క్షామ మస్యాః శరీరం
శరదిజ ఇవ ఘర్మః కేతకీగర్భపత్రమ్." ఉ రా. చ

హృదయకమలమును శోషింపఁజేయు దారుణమైన శోకము తొడిమనుండి యూడిన చిగురుటాకువలె పరమ సుకుమారమై పాలిపోయి, కృశించియున్న యీమె శరీరమును శరత్కాలపు టెండ మొదలిపువ్వుపొట్టనువలె వడిలిపోవునట్లు చేసినది.

8 దైన్యము

దారిద్ర్యము అపరాధము, దుఃఖము మున్నగువానిచే పుట్టినది ఆత్మనిందాభాషణాదిని పుట్టించునది యైన చిత్తవృత్తివిశేషము దైన్యము

ఉదా :—

సీతను వివాసము పాల్చేసి శ్రీరాముఁ డనుతపించుట.—

హతకేన మయా వనాంతరే
వనజాక్షీ సహసా వివాసితా
అధునా మమ కుత్ర సా సతీ
పతితస్యేవ పరా సరస్వతీ

"హతభాగుఁడను నేను వనమధ్యమున తెలుపక (అవిచారిత ముగ) వనజాక్షిని సీతను విడిచితిని పతితునకు వేదవాణివలె ఇప్పుడు నాకు మరల ఆసాధ్వి యెట్లు లభించును?' సీతను పరిత్యజించి భగవంతుఁడు శ్రీరామచంద్రుఁడు ఇట్లు పలుకుచున్నాఁడు ఇట సీతాపరిత్యాగ మను నపరాధముగాని తజ్జన్యమైన దుఃఖముగాని విభావము. 'ఎవఁడు నావంటి పతితుఁడు? అను పతితసామ్యరూపమైన స్వాపకర్షణభాషణము అనుభావము.

అట్లే ప్రాచీనులు లక్షణము చెప్పిరి —

"చిత్తౌత్సుక్యా న్మనస్తాపాద్ దౌర్గత్యాచ్చ విభావతః
అనుభావాత్తు శిరసోఽభ్యాన్నత్తే ర్గాత్రగౌరవాత్
దేహోపస్కరణత్యాగాత్ దైన్యం భావం విభావయేత్"
వెండియు,
"దౌర్గత్యాదే రనౌజస్యం దైన్యం మలినతాదికృత్"

చిత్తౌత్సుక్యము, మనస్తాపము దౌర్గత్యము (దారిద్ర్యము) అను విభావములచేత తల సుడియుట శరీరభారము, శరీరాలంకార త్యాగము, అను ననుభావములచే దైన్యము స్ఫూర్తి నొందనలెను. దారిద్ర్యాదిచే ఏ నిస్తేజత్వము కలుగునో అది దైన్య మనఁబడును. అది మాలిన్యాదిజనకము.

'హాతకేన మయా వివాసితా'' అని చెప్పుటంజేసి 'విధిచే కాదు'' అని ప్రతీత మగు నర్థమునకు పతితోపమయే పరిపోషకము (వృషలస్యేవ' అను పాఠము ననుసరించిన) శూద్రాద్యుపమగాదు. ఏలన శూద్రునకు జాతిచేతనే – 'న స్త్రీశూద్రా వేదమధీయీయాతామ్' అను విధినిబట్టి వేదము నిషిద్ధము శూద్రునకుఁ దొలుత వేదాధ్యయనాధికార ముండి పాతిత్యముచే అది పోయినదికాదు బ్రాహ్మణున కన్ననో జాతిచేతనే (స్వభావసిద్ధము అజన్మసిద్ధము) వేదము సులభమని విధియున్నను ఆ బ్రాహ్మణాదులు పాతిత్యము సంక్రమింపఁజేయు పాప మాచరించి స్వయముగనే శ్రుతిని దూరీకరించుకొన్నారు కావున పతితునితో శ్రీరామునకు సామ్యము సీతకు శ్రుతితో సామ్యము ఇట్లు ఉపమాలంకారము వాచ్యము అది స్వాపకర్ష భాషణజనక మైన దైన్యవ్యంగ్యమును అలంకరించుచున్నది అనఁగా ఉపకరించుచున్నది అందుచే ఉపమాలంకారము ప్రధాన మను శంక నిరాస్పదము

హాతకేన' అను శ్లోకమందు మయా' 'సా' అను రెండు పదములలో ప్రయోజనమూలము ఉపాదానలక్షణ కలదు నాచే అను స్వార్థమునందే వక్తకుఁ దాత్పర్యముకాదు మఱేమన అరణ్యవాసప్రియసఖయైన సీతయెడ కృతఘ్నుఁడ నైన నాచే అని తాత్పర్యము ఆ లక్ష్యార్థము నాచే అను స్వార్థవిశిష్టముగనే ఉపాదానమొందినది (అన్వయమొందినది) అందుచే ఉపాదానలక్షణ ఈ లక్షణ కేమి ప్రయోజన మన శ్రీరాముని కృతఘ్నత్వము- నిర్దయత్వము అను వ్యంగ్యార్థము. అట్లే 'సా' సీత అని స్వార్థమాత్రమునంగాదు వక్తకు శ్రీరామునకుఁ దాత్పర్యము మఱి నను నరణ్యవాససమయమునను వీడక సేవించు చుండిన దయానతి, కృతజ్ఞురాలు

రాలు నగు సీత అని ఈ లక్ష్యార్థము 'సా' అను స్వార్థవిశిష్టముగనే ఉపాదాన మొందినది అందుచే ఉపాదానలక్షణ ఈ లక్షణకుఁ బ్రయోజనము సీత యొక్క కృతజ్ఞత్వము దయానతీత్వము మున్నగు ననేకధర్మములు ప్రతీయమానములు ఈ వ్యంగ్యము ద్వారమున దైన్యభావధ్వని పరిపుష్ట మగుచున్నది సా అను నర్థముచే పరిపోషక సామగ్రి లేమింజేసి స్మృతి ఇంచుక ప్రతీయమానమై దైన్యభావధ్వనినే పోషించుచున్నది (దశ. రూ. సా ద-హేమ)

ఉదాహరణాంతరము :—

౧ వృద్ధోఽన్ధః పతి రేష మంచకగతః స్థూణావశేషం గృహం
కాలోఽభ్యర్ణ జలాగమః కుశలినో వత్సస్య వార్తాపి నో
యత్నాత్సంచితతైలబిందుఘటికా భగ్నేతి పర్యాకులా
దృష్ట్వా గర్భభరాలసాం నిజవధూం శ్వశ్రూశ్చిరం రోదితి

'పతి యీయన ముదుసలి అంధుఁడు మంచానంబడి యున్నాఁడు ఇల్లు స్తంభావశిష్టము కాలమా వానలరాకకు చేరువగా నున్నది. పుత్రుఁడు కుశలిగా నున్న వార్తయేని లేదు కష్టపడి [దీపార్థము] సేకరించుకొన్న నూనెబొట్టుగల పిడత పగిలిపోయినది, అని తల్లడము చెంది అత్త పూర్ణగర్భిణిని కోడలింగాంచి చాలసేపు ఏడ్చుచున్నది "

౨ తావ ద్విద్యానవద్యా ప్రచరతి విదుషాం తావ దాచారపన్థాః
తావ ద్వైదగ్ధ్యకీర్తిః ప్రసరతి కవితాడమ్బర స్తావ దేవ,
యావన్నో దేతి పాకాకులనిజగృహిణీప్రేషితాపత్యవర్గాత్
నాస్త్యాజ్యం నాస్తి తైలం నచలవణమపీత్యాదివాచాం ప్రచారః.

అంతవఱకే విద్వాంసుల విద్య ప్రసరించును అంతవఱకే ఆచారమార్గము సాగును. అంతవఱకే నేర్పఱితనపువాసి ప్రసరించును, అంతవఱకే కవితాడంబర మెల్ల విలసిల్లును – ఎంతవఱకు నీ వంట యెట్లు చేయుటా అని ఆకులపాటునకు లోనై తన గృహిణి పంపిన బిడ్డలగుంపునుండి చింతపండు లేదు నూనెలేదు అను వాక్కుల ప్రచారము ఉదయింపదో !

[పై రెండును దౌర్గత్యనిమిత్తకదైన్యమునకు ఉదాహరణములు]

9 చింత

ఇష్టాప్రాప్తి అనిష్టావాప్తి మున్నగువానిచే జనితము, వైవర్ణ్యము, నేలరాచుట, అధోముఖత్వము, మున్నగువానికి జనకము – ధ్యానాపరపర్యాయము – నగు చిత్తవృత్తి విశేషము చింత యనఁబడును

ఇది శరీరకంపనాదులు పుట్టింపదు (అవి అనుభావములు కావు) కావున శంక కన్న భిన్నము

అట్లే ప్రాచీనులు లక్షణము చెప్పిరి —

విభావా యత్ర దారిద్ర్య మైశ్వర్యభ్రంశనం తథా
ఇష్టార్థాపహృతిః శశ్వ చ్ఛ్వాసోచ్ఛ్వాసా వధోముఖమ్,
సంతాపస్మరణంచైవ, కార్శ్యం దేహానుపస్కృతిః
అధృతి శ్చానుభావాః స్యుః, సా చింతా పరికీర్తితా
వితర్కోఽస్యాః క్షణే పూర్వే పశ్చాదేవోపజాయతే.

ఎందు దారిద్ర్యము ఐశ్వర్యభ్రంశనము (రాజ్యావిచ్యుతి), ఇష్టార్థాపహరణము విధానము లగునో, మాటిమాటికి నిట్టూర్పులు అధోముఖము, సంతాపస్మరణము, శరీరము క్రుస్సిపోవుట, శరీరము నలంకరించుకొనమి, అధైర్యము (అధృతి)యు అనుభావములో అది చింత యనఁబరఁగును చింతయొక్క పూర్వక్షణమందును వెనుకటి క్షణమందుఁ గాని వితర్కము జనించును హితవస్తువు లభింపకపోవుటచే సంతాపాదికమును కలిగించును

ఉదా :—

నాయికను జూచి నాయకుఁడు చింతించుచున్నాఁడు.

అధరద్యుతి రస్తపల్లవా,
ముఖశోభా శశికాంతిలంఘినీ
అకృత ప్రతిమా తనుః, కృతా
విధినా కస్య కృతే మృగీదృశః.

ఆ మృగాక్షి యధరకాంతి పల్లవముల నిరసించినది ముఖశోభ చంద్రకాంతిని జయించినది, నెమ్మేను అప్రతిమానము, ఎవనికై యీ యేణాక్షిని బ్రహ్మ సృజించెనో?

ఇందు నాయికయప్రాప్తి భావము వాచ్యములు గామిచే నాక్షేప్యము లగు ననుతాపాదులు అనుభావములు వీనిచే చింతాఖ్య భావము ధ్వనితము. 'ఇందు ఔత్సుక్యధ్వని కలదు' అనరాదు కస్య కృతే" (ఏ ధన్యుఁడైన వయసుకానికొఱకో) అని అనిర్ధారిత ధర్మ్యాలంబనము (అనిర్ధారిత పురుషాలంబనము) చింతయే తొలుత ప్రధానముగఁ బ్రతీయమాన మగుచున్నది వెనుక నాయిక విష

యకము నాయకుని యౌత్సుక్యము గౌణముగాఁ బ్రతీయమాన మగుచున్నది ఔత్సుక్యభావము అంకుచే ఇట ప్రధానము కాదు చింతాపోషకము ఇట్లు ఇది చింతాధ్వనికే యుదాహరణము

10 మదము

మద్యాద్యుపయోగముచే జనించినది శయనము హసితము మున్నగు వానిని జనింపఁజేయునది - ఉల్లాస మను నామాంతరము కలది యగు చిత్తవృత్తి విశేషము మదము మద్యాది - [ఇట ఆది శబ్దముచే ఐశ్వర్య రూప తారుణ్య కుల విద్యా బలేష్టలాభాదులను కొందఱు గ్రహింతురు అవి గర్వనిమిత్తము లని అన్యులు వచింతురు]

ప్రాచీనులు ఇట్లు లక్షణము చెప్పిరి

సమ్మోహానంద సందోహో మదో మద్యోపయోగజః
స త్రిధా తరుణో మద్యోపకృష్టశ్చేతి భేదతః
దృష్టిః స్మేరా ముఖే రాగః సస్మితా కుంచితం వచః
లీలా విదగ్ధగత్యాద్యా శ్చేష్టాస్య స్తరుణే మదే
మధ్యమే తు మదే వాచి స్ఖలనం ఘూర్ణనం దృశోః
గమనే వక్రతా బాహ్వో ర్విక్షేప స్రస్తతాదయః
అపకృష్టేతు చేష్టాస్య ర్గతిభంగో విసంజ్ఞతా
నిష్ఠీవనం ముహు శ్శ్వాసో హిక్కాచ్ఛర్ద్యాదయో మతాః
తరుణ స్సూత్తమాదీనాం మధ్యమో మధ్యనీచయోః
అపకృష్టస్తు నీచానాం తత్తన్మదవివర్ధనే (రసార్ణవసుధాకరః)

ఇందు ప్రకృతినిబట్టి పురుషులలో అనుభావభేదము కలదు. ఎట్లన మద్యాది సేవనముచే ఉత్తమ పురుషునందు నిద్ర మధ్యమ పురుషునందు హసితము, గానమును, నీచపురుషునందు రోదనము పరుషభాషణము మున్నగునవి అనుభావములు [ఇట్లే దర్పణ కారుఁడును సుధాకరకారుఁడును నుడివినారు అన్యులు పలు విధములుగ ననుచితముగఁగూడ నుడివియున్నారు]

ఈ మదము [సుధాకరమునందు చెప్పఁబడినట్లు] తరుణము మధ్యమము అధమము అని ముత్తెఱంగు అందు అస్ఫుటోచ్చారిత వర్ణములు అసంబద్ధార్థములు నగు వాక్యములు సుకుమారము అనుద్ధత గుమ తొట్రుపాటు గమనముతో నేది అభినయింపఁ బడునో అది మొదటిది బుజముల విసరు, పదముల తొట్రుపాటు, నుడియుట మున్నగు విధముల నేది అభినయింపఁబడునో అది మధ్యమము గతి భంగము స్మృతినాశము దగ్గు వమనము మున్నగు వానితోఁగూడినదిగా నేది అభినయింపఁబడునో అది మూఁడవది

ఉత్తమ ప్రకృతి మదవివృద్ధికి, ఉదా .—

తత్ క్షణం విపరివర్తిత హ్రియో
ర్నేష్యతో శ్శయన మిద్ధరాగయోః
సా బభూవ వశవర్తినీ ద్వయోః
ప్రేయస స్సువదనా మదస్యచ (రసార్ణవ సుధాకరము)

విడువబడిన లజ్జగలవారును పాన్పును పొందగోరినవారును, సంసక్తానురాగము గలవారును నగు నా యిర్వురిలో నా సువదన తక్షణమే ప్రియునకును, మదమునకును, వశవర్తిని యైనది.

మధ్యమ పురుషగత తరుణమదమునకు ఉదా :

మధురతరః స్మయమానః
స్వస్మిన్నే వాలపంశ్చ శనైః కిమపి
కోకనదయం ల్రిలోకీ
మాలంబనశూన్య మీాక్షతే క్షీబః.

మత్తుఁడు మధురతరముగా నవ్వుచు, ఏమేమొ మెలమెల్లఁ దనలోనే యాలపించుకొనుచు అరుణనేత్రకాంతుల ముల్లోకముల నెఱ్ఱకలువవలె నెఱ్ఱచేయుచు, నిరాలంబ (శూన్య) దృష్టితోఁ జూచుచున్నాఁడు.

ఇట మాదకద్రవ్యసేవనము విభావము అవ్యక్తాలాపాదులు అనుభావము ఇచ్చోట మత్తస్వభావ వర్ణనము మత్తునియం దున్న మదవ్యంజనార్థ మగుటంజేసి మదభావమే ప్రధానము అందుచే స్వభావోక్త్యలంకారము ప్రధానము కాదు దానికన్ననో మదభావ ధ్వన్యుపస్కారత్వమే కలదు.

శంక :— ఓయీ స్వభావోక్త్యలంకారము అప్రధానమైనను పై శ్లోకమునందు మదధ్వని ప్రధానమైనను మదాస్కందితమతి అర్థమగును. క్షీబపదముచేతనుం గూడ మదమే బోధిత మగుచున్నది. అందుచే మద ధ్వని వాచ్యవృత్త్యనాలింగిత మగుచున్నది ఎట్లుగాని వాచ్యవృత్త్యనాలింగిత మగు (వాచ్యవృత్తికి విషయముకాని) వ్యంగ్యమునకే చమత్కారము కల దను తొల్లి మీా ప్రతిపాదనము బట్టి - ఇట మదభావధ్వని వాచ్యవృత్తికి గోచరమగుట చమత్కారికాదు అందుచే స్వభావోక్త్యలంకారమే ఇట చమత్కారాధాయకము

[సమా] పోని, అట్లగునేని ఇదిగో ఉదాహరణాంతరము

మత్తుఁడు ప్రియురాలితోఁ జెప్పుచున్నాఁడు.—

మధురసా న్మధురం హి తవాధరం,
తరుణి మద్వదనే వినివేశయ
మమ గృహాణ కరేణ కరాంబుజం
పథ పతామి హాహా బత భూతలే


ఓ తరుణీ, నీయధరము మధువు తీపికన్న తియ్యనిది అందుకని దాని నా నోట నుంపుము నీ చేతితో నా చేఁదమ్మిని పట్టుకొనుము అయ్యో అయ్యో! నేను నేలమీఁద పడిపోవుచున్నాను,

ఈ శ్లోకమునందు అదే (మధుపానమే) విభావము అధిక వర్ణోచ్చారణాది అనుభావము పూర్వార్ధగతము గ్రామ్యోక్తి అదియు ఉత్తరార్థమునందు – తరుణీకరమునకు అంబుజోపమానము చెప్పుట సముచితమైనను, అది మాని స్వకరమునకే ఆ పోలికను చెప్పికొనుటయు ఈ రెండును మదధ్వనికి అలంకారములు.

[నీచపురుషగత మగు మదోదంతమునకు నాగానంద నాటకమున ద్వితీయాంకము – శేఖరకుఁ......మేటి యుదాహరణము.]

11. శ్రమము

బహుతరశరీరవ్యాపారముచే జనించినది నిట్టూర్పు అంగమర్దనము, నిద్ర మున్నగు కారణముల జనించు ... ఖేద విశేషాత్మకమును – అగు చిత్తవృత్తి విశేషము శ్రమము


Sundarayya Vignana Kendram Library
Ac No. .. ..
Hyderbad-500 044.

ప్రాచీనోక్త లక్షణము:—

అధ్వవ్యాయామ సేవాద్యై ర్విభావై రనుభావకై
గాత్ర సంవాహనై రాస్యసంకోచై రంగమోటనై ః
నిశ్వాసై ర్జృంభితై ర్మందైః పాదోత్క్షేపైః శ్రమో మతః

దారి నడచుట, వ్యాయామము సేవ మున్నగునవి విభావములు ఒడలు పట్టుట, మొగము ముడుచుకొనుట, ఒడలు విరుచుకొనుట, నిట్టూర్పులు, ఆవులింతలు, మెలమెల్ల నడుగు లిడుట, చెమ్మట, నిద్ర మున్నగునవి అనుభావములు

గ్లాని ఆధివ్యాధి జన్యబలనాశముచే జనించునది శరీర వ్యాపారాదులచేఁ గల్గునది కాదు శ్రమ మన్ననో బలమున్ననుం గూడ శరీరవ్యాపారములచేఁ గల్గునది. అందుచే శ్రమ గ్లాని కన్న వేఱు.

ఉదా :—

నాయకుఁడు విపరీతసురతవృత్తమునుగూర్చి సఖునితో వచించు చున్నాఁడు.

విధాయ సా మద్వదనానుకూలం
కపోలమూలం హృదయే శయానా
చిరాయ చిత్రే లిఖితేవ తన్వీ
న స్పందితుం మంద మపి క్షమాఽసీత్

ఆ తన్వంగి- తన కపోలమూలమును నా ముఖమునకు (ముద్దాడ) ననుకూలముగా నుంచి నా యురస్స్థలమున పరుండి

శ్రమచే చిత్తరువుబొమ్మవలె మెల్లఁగానేని కదలుటకేని మెదలుటకేని శక్తురాలు కాదాయెను

ఇట విపరీత సురతరూపము శారీరకవ్యాపారము విభావము స్పందరాహిత్యము శయనాదులు అనుభావములు

[శంక] చిత్రలిఖితోపమానముచే నిట నిద్రాభావమే ధ్వనితము నిద్రయే ఇట ప్రధానము దానిచేతనే శ్రమధ్వని గతార్థము

[సమా] సుషుప్తియందు నియతముగ జ్ఞానము ఉండదు అందుచే యత్నము ఉండదు ఆకారణమున 'మంద మపి స్పందితుం న క్షమాఽసీత్" (మెల్లఁగానేని కదలుటకు ఓపదాయెను) అను శ్లోక భాగమునకు విశేషప్రయోజనము లేకపోవలసి వచ్చును. కాని ఇట నన్ననో దానికి ప్రయోజన మున్నది జ్ఞాన మున్నది భర్తృవక్షస్థల శయన విశ్రాంతి సుఖప్రతీతియుఁ గలదు శరీరశ్రమచేత కదలుటకు యత్నము చేయలేకున్నది' అని ప్రయోజనము మఱియు నిట నిద్రాభావధ్వనియే అని చెప్పుట పొసఁగదు 'శయితా' అను పదము "శీఙ్ నిద్రాయాం' అని నిద్రను శీఙ్ధాతువు వాచ్యవృత్తి చేతనే బోధించును అందుచే నిట నిద్రాభావధ్వని ఎట్లు ఉపపన్నమగును ? అందుచే ఇందు శ్రమభావధ్వని అనుటకే ఉచితము

ఉదాహరణాంతరము .—

సీత ప్రయాణ శ్రమ :

సద్యః పురీపరిసరేఽపి శిరీషమృద్వీ
సీతా జవా త్త్రిచతురాణి పదాని గత్వా
'గన్తవ్య మస్తి కియ' దిత్యసకృ ద్బ్రువాణా
రామాశ్రుణః కృతవతీ ప్రథమావతారమ్

(బాల రామాయణం. ఉ. అ. సా. ద. రసార్ణవము)

'వెంటనే శిరీషకుసుమకోమల సీత నడిగా మూఁడు నాలుగు అడుగు లిడి పురముచెంతం బాయకముందే ఇంకను నడువవలసినది ఎంతకలదు ?' అని పలుమాఱు అడుగుచు రాముని కంటినుండి తొలుదూఱు బాష్పముల రాలంజేసెను ''

12 గర్వము

ధనరూప విద్యాదిప్రయుక్తమైన యాత్మోత్కర్షజ్ఞానమునకు అధీనమైన పరావహేలన చిత్తవృత్తివిశేషము గర్వము

రూపాదుల నిమిత్తమున నొకఁడు తన్ను గొప్పగా నెంచుకొని పరుల గేలిచేయఁ దివురు చిత్తవృత్తి గర్వము

ప్రాచీన లక్షణము:—

ఐశ్వర్య రూప తారుణ్య కుల విద్యా బలై రపి
ఇష్టలాభాది నాన్యేషా మవజ్ఞా గర్వ ఈరితః
అనుభావా భవ న్త్యత్ర గుర్వాద్యాజ్ఞాన్యతిక్రమః
అనుర క్తప్రదానంచ వైముఖ్యం భాషణేషుచ
విభ్రమాపహ్నుతీ వాక్యపారుష్య మనవేక్షితం
అవేక్షణం నిజాంగానా మంగభంగాదయోపిచ

(రసార్ణవ.)

సంపద సౌందర్యము యౌవనము కులము, విద్య బలము మొదలగువానిచేతను వాంఛాప్రాప్తి మొదలగువానిచేతను ఇతరులను తిరస్కరించుట గర్వ మనబడును దీనిలో గుర్వాదుల యాజ్ఞను తిరస్కరించుట తనకు లోబడినవారికి దానమిచ్చుట, మాటలయం దనిష్టమును, విభ్రమము విషయగోపనము, వాక్పారుష్యము, అనాలోచనము తన శరీరసౌష్ఠవమును పర్యాలోకించుట ఒడలి విఱుపులు మొదలగునవి యనుభావములు

ఉదా :—

విద్యాగర్వితుని మాటలు —

ఆమూలా ద్రత్నసానో ర్మలయవలయితా దాచ కూలాత్పయోధే
ర్యావంత స్సంతి కావ్యప్రణయనపటవ స్తే విశంకం వదన్తు
మృద్వీకామధ్యనిర్యన్మసృణరసఝరీ మాధురీభాగ్యభాజాం
వాచా మాచార్యతాయాః పద మనుభవితుం కోఽస్తి ధన్యో మదన్యః

మేరు పర్వత మూలభాగము మొదలు మలయపర్వతపరి వలయితమైన సముద్రతీరమునఱకు ఎందఱు కావ్యనిర్మాణచణులు కలరో వారు – ద్రాక్షాఫలాంతర్భాగమునుండి స్రవించు మసృణ రసపూర మాధుర్య సౌభాగ్యమునకు పాత్రమైన వాక్ప్రపంచంపు టాజ్ఞనంపు టధికారము నధిష్ఠించుటకు నాకన్న ధన్యుఁ డన్యుఁ డెవఁ డేని కలఁడో నిర్భయముగా (నిజము) ఉగ్గడింతురుగాక

ఇందు నిజకవితచే అనన్యసాధారణుఁడ నను జ్ఞానము విభావము పరాక్షేపపరము లగు ఆమూలాత్ . ..' అను నిట్టి వాక్యముల ప్రయోగము అనుభావము

ఈ వాక్యములందుఁ బరాక్షేపముచే నొకించుక యసూయ ప్రతీయమాన మగుచున్నను అది ప్రధానము కాక గర్వభావధ్వనికి పోషకముగా నున్నది గర్వమును వీరరసధ్వనిగా పొరఁబడరాదు వీరరసధ్వనియందు స్థాయిభావము ఉత్సాహము ప్రధానము అది ప్రకటము గర్వము వ్యభిచారిభావ మగుట దాచి తేటము - గూఢముగా నుండును అందుచే నప్రధానము [నిగూఢగర్వము ఉత్సాహప్రధాన మగునదేకదా వీర రసము] మఱి, గర్వధ్వనియం దన్ననో గర్వము ప్రధానము. ప్రకటముగా నుండును అందుచే ఉత్సాహము ప్రతీయమానము

కానమ్మను కాకనుపోవమ్మను ప్రతీయమానమగు వో గర్వమునకు పోషకముగా నుండును ఇది వీరరసధ్వనికిని గర్వధ్వనికిని భేదము ఎట్లన వీరరసప్రసంగమున మున్నుదాహృతమైన అపి వక్తి' అను పాండిత్య వీర రసోదాహరణశ్లోకమునందు గీష్పతితోడను వాగధి దేవతయైన సరస్వతి తోడను కూడ నేను వాదింతును ' అను వచనముచేత ప్రధానముగా నభివ్యక్త మగు నుత్సాహమునకును పరి పోషకముగా నున్న పండితులలో నెల్ల నేనధికుడను'అను గర్వము అంగముగా ప్రతీయమానమైనది అందుచే అది వీరరసధ్వని మఱి 'ఆమూలాత్ ' అను ప్రకృతపద్యమునందున్న మహీతలమునందు మదన్యుడు(కవి) లేడు అని ప్రస్ఫుటోదిత మగు నొల్లుంఠన వచనాను భావముచే ప్రధానముగా ప్రతీయమాన మైనది కావున నిట గర్వభావధ్వని ఈ భేదము మెలకువతో గ్రహింపదగును

13 నిద్ర

శ్రమాదిజన్యము చేతస్సమీలనము నిద్ర [చేతస్సమీలన మన మనస్సు ముణుచుకొని పోవుట మనస్సు 'పురీతత్" అను పేరి నాడిని ప్రవేశించుటచే నిరింద్రియముగా నుండుట నిద్ర]

శ్రమాదికములు విభావములు నేత్ర నిమీలనము అవయ వములు చేష్ట దక్కుట మున్నగునవి అనుభావములు

అన్యదీయ లక్షణము .—

చేతస్సమీలనం నిద్రా శ్రమ క్లమ మదాదిజా
జృంభాక్షిమీలనోచ్ఛ్వాస గాత్రభంగాదికారణం సా ద

ఆదిశబ్దముచే స్వభావము, వ్యాయామము నిశ్చింతత్వము మున్నగునవి (రసార్ణవ) గ్రాహ్యములు అనుభావములలోని ఆది పదముచే మ్లాననేత్రత్వము, అంగపరిమర్దనము జాడ్యము]

ఉదా :—

మిత్రునితో నాయకుని మాటలు :—

సా మదాగమన బృంహితతోషా
జాగరేణ గమితాఖిలదోషా
బోధితాపి బుబుధే మధుపైర్న
ప్రాతరాననజ సౌరభలుబ్ధైః.

నా రాకచే పెంపొందిన సంతోషముకలది అన్ని రాత్రులు జాగరముచే గడిపినది నెమ్మోముదమ్మితావికి ఆసగొని ప్రాతఃకాలమున ముసరుకొన్న తేంట్లు మేల్కొల్పినను మేల్కొనదాయెను. ఇందు రాత్రి జాగరణ శ్రమము విభావము మధుపానవబోధము అనుభావము.

ఉదాహరణాంతరము :—

అలసలులిత ముగ్ధా న్యధ్వసంజాతఖేదా
దశిథిలపరిరంభై ర్దత్త సంవాహనాని
పరిమృదితమృణాలీ దుర్బలా న్యంగకాని
త్వ మురసి మమ కృత్వా యత్ర నిద్రా మవాప్తా (ఉ. రా. చ)

మార్గశ్రమముచే నలసములై మృదువుగను మనోహరముగ నున్నవియును గాటమగు కౌగిలింతలచే నీయఁబడిన సంవాహనము కలవియు నలిగియున్న తామరతూడులవలె దుర్బలములైనవియు నగు శరీరావయవములను నీవు నా రొమ్ముపై నుంచి ఎచట నిద్రించితివో!

నైశ్చింత్య నిమిత్తము నిద్ర :—

దత్తేంద్రాభయ దక్షిణాద్భుత భుజా
సంభార గంభీర మా
ద్యద్వల్త్యా శిథిలీకృత త్రిభువన
త్రాణాయ నారాయణః
అంతస్తోషతుషార సౌరభమయ
శ్వాసానిలాపూరిణ
ప్రాణోత్తుంగ భుజంగ తల్ప వధునా
భద్రేణ నిద్రాయతే. (రసార్ణవ)

ఇంద్రున కభయ మొసంగిన తన దక్షిణబాహువు రొక్క (రాక్షస సంహార రూపమైన) గంభీర సంరంభముతోఁ గూడిన పరాక్రమముచేత మూడు లోకములఁ బరిరక్షించుటయందు బడలియున్న నారాయణుఁడు, నేడు అంతరంగమునఁ బొడముచున్న యానందమను తుషారమును వెలార్చుచున్న నిశ్వాసరూపమైన ప్రాణముపొంగుచున్న శేషతల్పమునందు సుఖముగా నిద్రించుచున్నాఁడు.

నిశ్వాసోస్య న శంకితః సువిశద స్సల్పాంతరే వర్తతే
దృష్టి ర్గాఢనిమీలితా, నవికలా, నాభ్యంతరే చంచలా
గాత్రం ప్రస్తశరీరసంధి శిథిలం శయ్యా ప్రమాణాధికం
దీపం వాపి నధర్షయే దభిముఖం స్యా ల్లక్ష్యసుప్తం యది
(విశ్వేశ్వర రసచంద్రికా)

ఇతఁడూపిరి విడుచుచున్నట్లును గనబడుటలేదు ప్రక్కమీఁద నిర్మలముగఁ బండుకొని యున్నాఁడు కనులు గట్టిగా మూఁతపడి యున్నవి. అందు వైకల్య మే మాత్రమును లేదు నాభిదగ్గర

మాత్రము కొంచెము స్పందనము కలుగుచున్నది. శరీరసంధులన్నియు సడలియున్నవి ప్రక్కయంతయు బాగుగా చెఱిగియున్నది దీపమున కెదురుగఁ బండియున్నను దానికాంతి యీతనికన్నులను చేరకుటలేదు

14. మతి

శాస్త్రాదివిచారజన్యము అర్థనిర్ధారణరూప చిత్తవృత్తివిశేషము మతి. [ఆదిశబ్దముచే లోకవృత్తము గ్రాహ్యము]

శాస్త్రలోక వృత్తాది విచారణ విభావము. నిశ్శంక తదనుష్ఠానము. సంశయోచ్ఛేదము (శిష్యోపదేశము, భ్రూక్షేపము, ఊహాపోహాదులు) అనుభావములు.

ఉదా.—

విరక్తునిమాటలు :

నిఖిలం జగదేవ నశ్వరం
పునరస్మి న్నితరాం కళేబరమ్
అథ యస్య కృతే కియానయం
క్రియతే హన్త! మయా పరిశ్రమః ?

జగత్తెల్ల నశించు స్వభావము కలది మఱి ఇందు ఈ శరీరము మఱియు నశ్వరము దీనికొఱకు నేనెంత పాటుపడుచున్నాఁడను ? అయ్యో ఎంత విషాదకరము !

ఇందు 'శరీర మేతజ్జలబుద్బుదోపమమ్" (శరీరము నీటిబుడగవంటిది) ఇత్యాది శాస్త్ర పర్యాలోచనము (పునఃపునర్విచారము) విభావము హన్త' (అయ్యో!) పదగమ్యమైన స్వనిందరాజసేవాది నివృత్తి, తృష్ణారాహిత్యము అనుభావములు.

ఇట శాంతరసధ్వని ఆశంకింపరాదు ఏలన తటాలున ప్రతీయమాన మగు మతికే అత్యంతము చమత్కారము. శాంతరసమునకుం గాదు అది విలంబితముగ తర్వాత నాస్వాద్యమానము అందుచే నిట భావధ్వనియే లక్ష్యము సా. ద

ఉదాహరణాంతరము :

అసంశయం క్షత్రపరిగ్రహక్షమా
యదార్య మస్యా మభిలాషి మే మనః,
సతాంహి సందేహ పదేషు వస్తుషు
ప్రమాణ మంతఃకరణప్రవృత్తయః. శాకుం.

ఈమె క్షత్రియునకు పరిగ్రహణయోగ్యయే ఇందు సంశయము లేదు కానిచో నియమసంస్కృతమైన నా మనస్సు ఈమెపై ప్రేమ భావము కలది కాదు సందిగ్ధవిషయములయందు సత్పురుషులకు హృదయనిశ్చయమే ప్రమాణము

న పండితాః సాహసికా భవన్తి
శ్రుత్వాపి తే సంతులయన్తి తత్త్వమ్
తత్త్వం సమాధాయ సమాచరన్తి
స్వార్థం ప్రకుర్వన్తి పరస్య చార్థమ్ దశ

పండితులు సాహసికులు కారు విషయము తెలిసికొనియు దాని తత్త్వమును బాగుగా పరిశీలింతురు. పరిశీలించిన తదుపరి తత్త్వమును దెలిసికొనియే కార్యముల నాచరింతురు స్వార్థముతో బాటు పరోపకారమునుగూడ నిర్వహింతురు.

15. వ్యాధి

రోగమువల్లను విరహమువల్లను బుట్టిన మనస్తాపము వ్యాధి. గాత్రశైథిల్యము శ్వాసము మొదలగునవి యనుభావములు.

ఉదా :—

వ్యాదయే క్షలితశైవలానుషంగా
ముహు రంగాని యత స్తతః క్షిపన్తీ
తదుదంతపరే ముఖే సఖీనా
మతిదీనా మియ మాదధాతి దృష్టిమ్.

ఈమె యురస్స్థలమున శైవలములచే గప్పబడియున్నదై యంగముల నటు నిటు మాటిమాటికిఁ గదలించుచున్నది. అయ్యో, యిట్టిదని తొందరపడుచు తన ప్రియుని వార్తనే చెప్పఁగోరుచున్న సఖులవంక నీమె దీనమైన దృష్టిని బఱపుచున్నది.

ఇట విరహము విభావము. అంగాక్షేపాదులు అనుభావము.

16. త్రాసము

భీకరమైన చావను భయంకర జంతుదర్శనము వల్లను పిడుగుపాటు మొదలగువాని శ్రవణమువల్లను పుట్టిన చిత్తవృత్తి విశేషము త్రాసము.

పూర్వుల లక్షణము :—

ఔత్పాతికై ర్మనఃక్షేప స్త్రాసః కంపాదికారకః.

పిడుగులు పడుట మున్నగు ఔత్పాతికములచేత గలుగు మనఃక్షోభము త్రాసము. ఇది శరీరమునకుఁ గంపాదులు పుట్టించును.

ఉదా :—

అలీషు కేలీరభసేన బాలా ముహు ర్మమాలాప ముపాలపన్తీ
ఆరా దుపాకర్ణ్య గిరం మదీయాం సౌదామనీయాం సుషమా మయాసీత్.

ఆటల సందడిలో సఖులతోఁగూడి నా (ప్రియునిరొక్క-) మాటలను జెప్పుకొనుచు నింతలో నా (ప్రియునిరొక్క-) కంఠస్వరమును దగ్గరలోనే విని మెఱపుతీగవలె గానరాకుండఁ బోయెను

ఇట పతి తనమాటలు వినుట విభావము. పలాయన మనుభావము ఇట లజ్జాభావము వ్యంగ్య మగుచున్న దని శంకింపరాదు అది చిన్నతనమందే పోయినది కావున

కాదా, యింతకంటె విశదమైన ఉదాహరణము :—

మా కురు కశాం కరాబ్జే కరుణావతి కంపతే మమ స్వాంతమ్
ఖేల న్న జాతు గోపై రంబ విలంబం కరిష్యామి

ఇది భగవంతుడైన లీలాగోపాలుని ఉక్తి

అమ్మా! కరుణావతివి కొరడాతో పద్మములవంటి నా చేతులపైఁ గొట్టబోకుము నా స్వాంతము కంపించుచున్నది ఇక నెప్పుడును గోపకులతో నాడుకొనుచు నింటి కాలస్యముగా రాను

17 సుప్తము (స్వప్నరూపము)

నిద్రావిభావోత్పన్నమైన జ్ఞానము (చిత్తవృత్తివిశేషము) సుప్తము స్వప్నమని తాత్పర్యము

నిద్ర కేవి విభావములో వానిచే (శమాదివిభావములచే)నుత్పన్నమైన జ్ఞానము (విషయావభాసము) స్వప్నమని భావము ప్రలాపాదులు అనుభావములు నేత్రనిమీలనాదులు నిద్రకే అనుభావములు సుప్తమునకుఁ గాదు ఏలన స్వప్నజన్యములు కావు ఇట నిద్రాసుషుప్తులకు కారణైక్య మున్నను కార్యభేదమున్నదని కార్యభేదమును బట్టి స్వరూపభేదము కల్గిన దని గ్రహింపవలెను

ప్రాచీనులు (అస్యానుభావాః నిభృతగాత్ర నేత్రే నిమీలనమ్ అని) సుప్తమునకు అంగనిశ్చేష్టత నేత్రనిమీలనము అనుభావము

లని చెప్పిరి అవి అన్యథాసిద్ధములు నిద్రారూప కారణాంతర జన్యములు అందుచే స్వప్నజన్యము లనుట సరికాదు. అట్లైనను నిద్ర లేక స్వప్నము రాదు కావున వ్యాపకమైన నిద్రయొక్క యనుభావములనే వ్యాప్యమైన స్వప్నమునకును చెప్పిరి అని గ్రహింపవలెను

ఉదా :—

స్వప్నములో ప్రియాసమాగత మొంది నాయకుఁడు నిద్రను ప్రస్తుతించుచున్నాఁడు

'అకరుణ, మృషాభాషాసిన్ధో విముఞ్చ మమాఞ్చలం
తవ పరిచితః స్నేహః సమ్య జ్మయే త్యనుభాషిణీమ్,
అవిరళగళద్బాష్పాం తన్వీం నిరస్తవిభూషణాం
క ఇహ భవతీం భద్రే వినా వినివేదయేత్

"ఓ కటికవాఁడా ఓరి కల్లల మున్నీరా విడు నా కొంగు. లెస్సగా తెలిసినదిలే నీ ప్రణయము' అను మాటలు పలుకుచున్నదియు అవిరళముగా కన్నీరు కార్చుచున్నది కృశించినది సొమ్ములెల్ల తీసివైచినది ఐన (స్వప్నగత) ప్రేయసిని 'ఓ భద్రా నిద్రా, నీవు తప్ప మఱెవ్వరు ఇచట నాకు సమకూర్తురు? అని ప్రవాసగతుఁడైన నాయకుఁ డొకఁడు స్వప్నమందేనియు ప్రియను అట్లు పలుకుదానిని, చూచినవాఁడై తదుపకారనిమిత్తమైన నిద్రను ఇట్లు ప్రస్తుతించి పల్కెను ఇట 'అపి' (ఏనియు) శబ్దము జాగ్రద్దశలో ప్రియాదర్శనము అతని కెంత దురాసదముగా నుండెనో తేటపడుటకై గ్రంథకర్త ప్రయోగించెను అందుచే అది స్వప్రయోజకము వ్యాఖ్యాతయొకఁడు దానిని అప్రయోజక మనుట అనాలోచిత మనవలెను]

ఇచ్చోట అట్టి దశావిశేషము పాలైయున్న ప్రియతమయొక్కయవస్థను నివేదించుటచేత 'ఓనిద్రా, నీవు నాకు మహోపకారము

చేసితివి ' అను మహోపకారరూప వస్తుధ్వనియు, విప్రలంభ శృంగార రూప రసధ్వనియు ప్రతీతికి చూపుమేరలో నున్నను వీనికన్న మున్నె స్వప్నధ్వని స్ఫురించుటంజేసి అది ప్రధానము అందుచే ఇది స్వప్న (భావ) ధ్వనికి ఉదాహరణముగా నీయబడినది అంతే కాని వెనుక స్వప్నాంగములుగా వ్యక్తము లగు నా వస్తు రసధ్వనుల నాదరించ మాకు నిచ్చలేదు అవి ప్రధానవ్యంగ్యమైన స్వప్నధ్వనిని ఉపస్కరించుట మాకు ఇష్టమే ఇందు భావధ్వనికే ఉదాహరణమని నిగ్గు

ఉదాహరణాంతరము —

ఏతే లక్ష్మణ జానకీ విరహితం మాం ఖేదయ న్త్యంబుదాః
మర్మాణీవ విఘట్టయ న్త్యల మిమాః క్రూరాః కదంబానిలాః
ఇత్థం వ్యాహృతపూర్వజన్మచరితో యో రాధయా వీక్షితః
సేర్ష్యా శంకితయా స వః సుఖయతు స్వప్నాయమానో హరిః
(శుభాంకుని సదుక్తికర్ణామృతము)

ఓలక్ష్మణా జానకీవిరహితుఁడ నైన నన్ను ఈ మేఘములు బాధపెట్టుచున్నవి హింసపెట్టెడి యీ కదంబవాయువులు నా మర్మములను భేదించుచున్నవా యనునట్లున్నవి ఈ రీతిగా తన పూర్వావతారచరిత్రను నిద్రలో పలువరించుచుఁ దన ప్రియురా లైన రాధచే సాసూయముగ సేర్ష్యాకముగఁ జూడఁబడుచున్న శ్రీకృష్ణుఁడు మిమ్ము సుఖపెట్టుగాక

18 విబోధము

నిద్ర నశించినవెంటనే కలుగు బోధ (చేతనాగమము) విబోధ మనఁబడును నిద్రాపగమహేతువులు - నిద్రానాశము తత్పూర్తి స్వప్నాంతము ఒకులోనచ్చు ప్రబలశబ్దము ప్రబలస్పర్శము

మున్నగునవి విభావములు కనులు నులుముకొనుట ఒడలువిరుచు కొనుట ఆవులించుట మొదలగునవి అనుభావములు

ఉదాహరణము ——

నితరాం హీ తయాద్య నిద్రయా మే
బత యామే చరమే నివేదితాయాః
సుదృశో వచనం శృణోమి యావ
న్మయి తావ త్ప్రచుకోప వారివాహః

నేఁడు తుదిజామున మిక్కిలి హితనిద్రలో (స్వప్నదశలో) సమాగతయై ప్రియురాలు చెప్పుట కుద్యమించు మాటలను విను నంతలో అక్కటా కాఱుమొయిలు కోపించెను కోపించినట్లు గర్జించెను.

ఇట గర్జితశ్రవణము విభావము ప్రియావచనశ్రవణోల్లాస నాశము అనుభావము అది సాక్షాచ్ఛబ్దోపాత్తము కాకున్నను బత శబ్దముచే ఉన్నేయము [ప్రచుకోప శబ్దసారస్యముచే కోపము గల వాఁడు అపకారము చేసినట్లు వారిధరము గర్జనముచేసి నా స్వప్న మునకు వినాశము కలిగించెను] కేవలము ఒరుల మేలును గాక తన గొప్పనే వారివాహశబ్దము సూచించును (వారిదము పరోపకార సూచకము) ఇట మతాంతరము కలదు కొందఱు అవిద్యాధ్వంస జన్య మగు జ్ఞానము విబోధ మని తలంతురు వారు ఈ భగవద్గీతా శ్లోకము పూటగా నుదాహరింతురు ——

'నష్టో మోహః స్మృతి ర్లబ్ధా త్వత్ప్రసాదా న్మయాచ్యుత!
స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ

ఓ యచ్యుతా, నీ తత్త్వోపదేశప్రభావమువలన నాకు అజ్ఞా నము (దేహాత్మభ్రమ) నశించినది ఆత్మస్మరణము మఱలఁ గల్గినది.

ఇప్పుడు కర్తవ్యాకర్తవ్యములంగూర్చిన సర్వసందేహములు నశించిన వాఁడనై నిలిచియున్నాఁడను నీయాదేశము ననుష్ఠింతును

ఇందు అవిద్యాధ్వంసజన్యము విబోధభావధ్వని కలదని వారి యభిప్రాయము

"నితరాంనా' అను పూర్వోదాహృత శ్లోకమందు పర మోపకారకమైన నిద్రను భగ్నము చేసినదని వారివాహవిషయకము అసూయాధ్వనివాక్యార్థబోధ ప్రధానము అందుచే ఇందు విబోధధ్వని ప్రధానము కాదు అని ఆశంకింపరాదు ఏలన (1) తొలుత విబోధము ప్రతీతము కాఁగా (2) పిమ్మట స్వప్నము సుఖకర మగుట, విబోధము అనుచిత మని (విబోధానౌచిత్య) ప్రతీతి (3) అనంతరము అనుచితవిబోధకారణమైన గర్జన మొనర్చిన దని వారివాహముపై అసూయాప్రతీతి ఇట్లు అసూయాప్రతీతి వలన విబోధప్రతీతికి ఎంతో యవలంబనము కలిగినది అది పర ముఖ నిరీక్షము - అనఁగా స్వోపపాదకవిబోధముఖమున (ద్వార మున) ప్రతీయమానము - పరప్రతీతి సాపేక్షకము అందుచే ఇట విబోధమే ప్రధానము విబోధధ్వనియే లక్ష్యము

'భ్రాత స్తాన దహం శరేన విధినా నిద్రాదరిద్రీకృతః' అన్న చోట విధిశార్యముంబోలె, ఇట వారివాహ నిష్కారుణ్యాదిబోధకము ఏదేని వ్యంజకము ఉండునేని అసూయ ప్రధానవ్యంగ్య మై యుండును అట్టి దేదియు లేదు మేఘగర్జితముచే స్వప్ననాశమే ధ్వనిత మగుచున్నది స్వప్నము కాదు నష్టరూపమైన జ్ఞానమునకు స్వప్నము ఎట్లు ప్రధానవ్యంగ్య మగును? అందుచే స్వప్నధ్వనియు లేదు వారిద శబ్దమువలె జీవనప్రదకర్తృత్వమును తెల్పునది కాక వారి(జీవన)వాహపదము ఇట జీవనాహరణకర్తృత్వాన

గమకము ప్రయుక్తమై యున్నది మఱియు ప్రచుకోప' (కోపించెను) అను క్రియాపదము మేఘుని కోపస్వభావవ్యంజకముగా నున్నది ఈ రెంటివలన అసూయాధ్వని స్వప్నభావప్రశమమువలన భావశాంతిధ్వనియు విబోధభావధ్వనితో సాంకర్యము కలిగి యున్నది ఇట్లు విబోధము అంగికాగా అసూయాధ్వనియు స్వప్నభావశాంతిధ్వనియు అంగములై అంగికి పరిపోషకములై యున్నవని పిండితార్థము

ప్రత్యుదాహరణము —

ఈ క్రిందిశ్లోకము విబోధభావధ్వనికి ఉదాహరణము కాదు.

విరహివృత్తాంతము —

గాఢ మాలింగ్య సకలాం యామినీం సహతస్థుషీమ్
నిద్రాం విహాయ స ప్రాత రాలిలింగాథ చేతనామ్

ఇతఁడు పూర్తి రాత్రితోఁగూడ కూడియుండిన నిద్రను గాఢముగా నాలింగనము చేసికొని ప్రాతఃకాలమున దానిని విడిచి చేతనను కౌఁగిలించుకొనెను

ఇది ఏల ఇట ఉదాహార్యముకాదు? ఏలన ఇందు చేతన విబోధపదవాచ్య మగుటవలన అనఁగా విబోధము చేతన అనురెండుపదములును మేల్కొనుటనే బోధించును అందుచే రెండును ఏకార్థకములు అభిన్నములు అందువలన చేతనాపదవాచ్యార్థమే విబోధము వ్యంగ్యమయ్యు చమత్కారికాదు వాచ్యమైనయర్థము వ్యంగ్యమైనను చమత్కారికాదు ఇట వాచ్యమే-సమాసోక్త్యలంకారమే చమత్కార యుక్తము సత్యప్రతిజ్ఞుఁడు పురుషుఁ డొకఁడు ఇరువురు నాయికలతో వేర్వేఱ రెండు కాలముల నుపభోగింప నియమము చేసికొని యథోచితముగ నొక కాలమున నొకతెతోఁ

గూడి, ఇంకొక కాలము రాఁగా తొంటి నాయికను వీడి రెండవ నాయికతో భోగించెను ఈ పురుషవృత్తాంతము (అప్రస్తుతము) నాయకుఁడు రాత్రి యెల్ల నిద్రించి వెనుక వేకువ మేలుకొనెను అను వృత్తాంతముచే - ప్రస్తుతముచే గమ్యమాన మగుచుండుటచే సమాసోక్తియే ఇట ప్రధాన చమత్కారముకో వరలుచున్నది విబోధభావధ్వని కాదు ప్రధానము అందుచే ఇది విబోధభావధ్వనికి ఉదాహరణము కాదు

ఉదాహరణాంతరము'—

ప్రత్యగ్రోన్మేషజిహ్మా క్షణ మనభిముఖీ రత్నదీపప్రభాణా,
మాత్మవ్యాపారగుర్వీ జనితజలలవా జృమ్భితైః సాంగభంగైః
నాగాంకం మోక్తు మిచ్ఛోః శయనగురుఫణాచక్రవాలోపధానం
నిద్రాచ్ఛేదాభితామ్రా చిర మవతు హరే ర్దృష్టి రాకేకరా వః
(ముద్రారాక్షస)

అప్పుడే తెలుపుడుపడుటచే వక్రమైనదియు, రత్నదీప ప్రభలకు క్షణకాల మెదురుగఁజూడలేనిదియు జగద్రక్షణభారముచేఁ దీవ్రమైనదియు ఒడలి విరుపులతో గూడిన ఆవులింతలచే జనించిన జలకణములు కలదియు పాన్పుగా నున్న గొప్ప పడగల సమూహమే దిండుగగల శేషుని యురకస్థలమును విడువగోరు నారాయణుని నిద్రాభంగముచే నెఱ్ఱనైన యర్ధనిమీలిత మగు దృష్టి మిమ్ములను చిరకాలము కాపాడుగాక

19 అమర్షము

పరు లొనర్చిన యవమానాది నానాపరాధములచే జనించునది మౌనము వాక్పారుష్యము మున్నగువానిని జనింపఁజేయునది యగు చిత్తవృత్తివిశేషము అమర్షము మున్నగు అనుటచే

కన్నెఱ్ఱ నగుట శిరఃకంపము, భ్రూభంగము తర్జనము మొదలగునవి గ్రాహ్యములు

ఇట పరకృతానజ్ఞాదులు విభావములు, మహానాదులు అనుభావములు

ఉదా॰— ఒక కోపన వృత్తాంతము

వక్షోజాగ్రం పాణినాఽఽమృశ్య దూరే
యాతస్య ద్రా గాననాబ్జం ప్రియస్య
శోణాగ్రాభ్యాం భామినీ లోచనాభ్యాం
జోషం జోషం జోష మే వానతస్థే

తన కుచాగ్రమున తటుకున చేతితో సంస్పృశించి [తన కుచముల నుపమర్దించి] అంతలో దూర మేగిన ప్రియుని ముఖాబ్జమును రక్త కోణములైన యీక్షణములతో తెప్పవేయక చూచుచు ఆ కోపన నిల్చియున్నది

ఇట ఆకస్మిక స్తనాగ్రస్పర్శ విభావము నయనారుణ్యము నిర్నిమేషనిరీక్షణములు అనుభావములు

[శంక] 'ఓయీ క్రోధస్థాయి యగు నమర్షమునకును సంచారి యగు నమర్షమునకును ఏమి భేదము?

[సమా॰] విషయతాభేదమే - అనఁగా అవస్థావైలక్షణ్యమే ఒకటి స్థాయిభావమై రసత్వ మొంద నొట ఇంకొకటి యాకస్మికముగ జనించి అంతలోనే సమసిపోవుట - ఈ భేదమే రెంటికిని కల దని యనుకొనుము

[శ] రెంటికి విషయతావైలక్ష్యణము ఎట్లు నిర్ణయించుట?

[సమా॰] భావముయొక్క యుత్కటావస్థ క్రోధరూపము దానిచే పరవినాశాదిప్రవృత్తిరూపకార్యము జనించును భావము

యొక్క యనుత్కట (కోమల) మగు అమర్ష మగుటం జేసి దానిచే వైముఖ్యాదికార్యములు మాత్రమే ఉదయించును ఇట్లు భావముయొక్క యవస్థాభేదమును తజ్జన్యకార్యముల వైలక్షణ్యము స్థాయిభావ వ్యభిచారిభావరూపామర్షములకుఁ గల దని గ్రహింపవలెను

ఉదాహరణాంతరము —

భీముని యమర్షము

లాక్షాగృహానల విషాన్న సభాప్రవేశైః
ప్రాణేషు విత్తనిచయేషుచ నః ప్రహృత్య
ఆకృష్టపాండవవధూ పరిధాన కేశాః
స్వస్థా భవన్తు మయి జీవతి ధార్తరాష్ట్రాః.

లాక్షాగృహానలము పాల్చేసియు విషాన్నము భక్షింపజేసియు సభాప్రవేశము నొందింపచేసియు మిమ్ములను ప్రాణ విత్త చయములందు ప్రహరించి (దెబ్బదీసి) పాండవవధు వగు ద్రౌపది పరిధాన కేశముల నూడ్చిన ధార్తరాష్ట్రులు నే జీవించియుండగనే స్వస్థు లైయుందురుగాక

పితు ర్మూర్ధ్ని స్పృష్టే జ్వలదనల భాస్వత్పరశునా
కృతం యత్క్షుద్రేణ శ్రుతి ముపగతం కి న్న భవతామ్
కి మద్యాశ్వత్థామా యదరిరుధిరాసారవిఘసం
న కర్మ క్రోధాన్ధః ప్రభవతి విధాతుం రణముఖే

మున్ను పరశురాముఁడు తన తండ్రి శిరస్సు శత్రువులచే స్పృశింపబడగా, నిప్పువలె మండుచున్న గండ్రగొడ్డలిచే నేమి చేసెనో అయ్యది మీ స్మృతిపథమునందు లేదా? నేఁడీ యశ్వత్థామయు క్రోధాంధుఁడై రణభూమియందు శత్రురక్తపు బల్యన్నముల నిక్షేపించు కర్మయందు సమర్థుఁడు కాఁడా ?

20 అవహిత్థము

హర్షాదులచే జనించు నశ్రుపాతాద్యనుభావముల దాఁచు టకై వ్రీడాది నిమిత్తములచే నుదయించు చిత్తవృత్తి అవహిత్థ యనఁ బడును

అట్లే ప్రాచీనుల లక్షణమును —

అనుభావ పిధానార్థే ఽ వహిత్థం భావ ఉచ్యతే
తద్విభావ్యం భయవ్రీడా ధార్ష్ట్యకౌటిల్య గౌరవైః

అనుభావములఁ గప్పిపుచ్చుటకై భయవ్రీడా ధార్ష్ట్య (ప్రాగల్భ్య) కౌటిల్య - గౌరవములచే నుత్పాదనీయమైన (విభావ్యమైన) చిత్తవృత్తి విశేషము అవహిత్థ యనఁబడును

ఉదా :—

కులాంగనావహిత్థము

ప్రసంగే గోపానాం గురుషు మహిమానం యదుపతే
రుపాకర్ణ్య స్విద్యత్పులకితకపోలా కులవధూః
విషజ్వాలాజాలం ఝటితి వమతః పన్నగపతేః
ఫణాయాం సాశ్చర్యం కథయతి తరాం తాండవవిధిమ్

గురువులతోఁగూడఁ గూర్చుండియుండ గోపాలకృష్ణుని మహిమ ప్రసంగమురాఁగా దానిని విని చెక్కిలి చెమర్చుచుండ, మేను గగుర్పొడుచుచుండ గోపాంగన యొకర్తు [ఆ తన ప్రణయ కార్యములు గురువులు తెలిసికొందురేమొ అని లజ్జ గొని] వానిని గప్పిపుచ్చుటకై వెంటనే అచటివారి కెల్ల నచ్చెరువు కల్గునట్లు విష జ్వాలాజాలము గ్రక్కుచున్న పాపఱేని పడగలపైని శ్రీకృష్ణుఁ డొనర్చిన తాండవవిధానతత్పరాక్రమకథను మఱి మఱి వర్ణింపసాగినది అనఁగా తన కుదయించిన స్వేదరోమాంచాదులు శ్రీకృష్ణప్రణ

యోత్పన్నములు కాక, కృష్ణతాండవకథారసోత్పన్నము లని యనిపించుటకై ఆ యుపాయము చేసినది అని భావము]

ఇట క్రీడ విభావము విషజ్వాలల వెలిగ్రక్కు కాలీయుని కథా ప్రసంగము అనుభావము ఇట్లు భయాది ప్రయోజ్యములు అవ శిష్ఠోదాహరణములు ఊహ్యాములు

ఉదాహరణాంతరములు :—

ఏవం వాదిని దేవర్షౌ పార్శ్వే పితు రధోముఖీ
లీలాకమలపత్రాణి గణయామాస పార్వతీ (కుమారసంభవము)

నారదమహర్షి ఈ విధముగా పలుకుచుండగా జనకుని పజ్జనున్న పార్వతి మోము వంచినదై లీలాకమలపత్రములను లెక్కించు చుండెను

స్నిగ్ధం వీక్షిత మన్యతోఽపి నయనే యత్ప్రేషయన్త్యా తయా
యాతం యచ్చ నితంబయో ర్గురుతయా మన్దం విలాసా దివ
మాగా ఇత్యవరుద్ధయా యదపి సా సాసూయ ముక్తా సఖీ
త త్సర్వం కిల మత్పరాయణ మహో కామీ స్వతాం పశ్యతి
(విశ్వే - రస చం శాకుంతలము)

ఆమె కనులను మఱొకవైపునకు ప్రసరింప జేసినను- నా యెడ స్నిగ్ధభావము వ్యక్తముచేసినట్లుగను, నితంబభారముచే మందగమ నయై వెళ్ళినను అది నాయందలిప్రేమచే విలాసము వెలార్చినట్లుగను చెలి పోవలదని నిరోధించినపుడు ఆమె సాసూయముగ చెలికత్తెతో మాఱుపలికినను అది యంతయు నన్నుద్దేశించి యనియే భావించు చుంటిని కాముకుడు సర్వవిషయములను తన కనుకూలమైన వానినిగనే భావించునుగదా

21 ఉ గ్ర త

అధిక్షేపాది తిరస్కారము మున్నగు వానిచే జనించునది అతని కేమి బదులు ప్రతీకారము చేయుదును ?" అను నిత్యాద్యా కారము కలదియైన చిత్తవృత్తి విశేషము ఉగ్రత యనఁబడును

అట్లే ప్రాచీనులును చెప్పిరి .—

నృపాపరాధోఽ సద్దోషకీర్తనం, చోరధారణం
విభావాస్యు రథో బద్ధ వధ స్తాడన భర్త్సనే
ఏతే యత్రానుభావా స్త దౌగ్ర్యం నిర్దయాత్మకమ్

ఎచట రాజాపరాధము లేని దోషము చెప్పుట దొంగను రక్షించుట, (దొంగసొత్తు ధరించుట) మున్నగునవి విభావములో చెఱ వధ తాడనము బెదరింపు అనుభావము లగునో అచట నిర్ద యాత్మకము - చిత్తవృత్తివిశేషము ఉగ్రత

ఉదా .—

యుధిష్ఠిరుఁడు గాండీవనింద చేయఁగా నర్జునుని యుగ్రత —

అహ్యాత్తభంగం ఖలు సంగరాగ్రే
నితాంత మంగాధిపతే రమంగళం
పరప్రభావం మమ గాండీవం ధను
ర్వినిందత స్తే హృదయం న కంపతే

ఓ యుధిష్ఠిరా, యుద్ధరంగములలో నెదురులేనిది అంగదేశ రాజగు కర్ణునకు మిక్కిలి యమంగళకరమైనది (అనిర్వచనీయ విక్రమమును దివ్యప్రభావసంపన్నమునగు) నా గాండీవమును నిందించు చున్న నీ హృదయము ఏల భయకంపితముకాదు

ఇది కర్ణునిచే పరాభూతుని గాండీవమును నిందించుచున్న వానిని యుధిష్ఠిరుని భర్త్సనము చేసి పల్కిన వాక్యము ఇందు యుధి

ష్ఠిరుఁ డొనర్చిన గాండీవనింద విభావము యుధిష్ఠిరు వధింప నర్జును నిచ్ఛ అనుభావము

అమర్షోగ్రతలకు భేదము లేదనరాదు వక్షోజాగ్రమ్ అను నమర్షభావధ్వన్యుదాహరణమునందు వధేచ్ఛారూపమగు నను భావము ప్రతీతమగుట లేదు కావున నుగ్రత ప్రతీత మగుటలేదు ఇందన్ననో వధేచ్ఛానుభావము కలదు. ఉగ్రత నిర్దయాత్మక ప్రచండ చిత్తవృత్తి అమర్షము కోమలావస్థారూపము వచన వైముఖ్యాది కార్యమాత్ర జనకము ఉగ్రత క్రోధము సైతము గాదు. క్రోధము బంధువధాదిమహాపరాధజన్యము స్థాయిబావము. భావముయొక్క యుత్కటావస్థ రౌద్రరసస్థాయి ఉగ్రత యన్ననో నిందాదివాగపరాధజన్య మగుట అల్పవిషయము - వ్యభిచారాత్మకము. [ఇంతటికి అమర్షము ఔగ్ర్యము క్రోధము ఉత్తరోత్తరము బలీయములు)

ఉదాహరణాంతరములు —

ఏతైస్త్వం పరుషాక్షరైశ్చ వచనైః దౌర్ముఖ్య మాపాదయ
న్నుద్వేగం జనయన్ జనస్య నితరాం ప్రాప్తోసి మత్సన్నిధిమ్
తీవ్రాఘాతచపేట దారితముఖం సద్యోబ్రహ్మహీమండలే
మూర్ఛావిశ్లథ కాయకాండ వికలం త్వాం పాతయిష్యామ్యహమ్.

నీవు పరుషాక్షరములు గల మాటలతో, నోరు పాఱవైచు కొనుచు జనులకు మిక్కిలి యుద్వేగమును గొల్పుచు, నాసన్నిధికి వచ్చితివి అట్టి నిన్ను పెద్ద చెంపదెబ్బచే పగులగొట్టబడిన మోము కలవాఁడవై మూర్ఛచే శిథిలమైన కళేబరమున రెల్లపోవునట్లుగా భూమిపై పడవేయుదును.

మాలతి . —

ప్రణయ సఖీ సలీలా పరిహాస రసాధిగతై
ర్లలిత శిరీష పుష్పహననైరపి తామ్యతి యత్
వపుషి వధాయ తత్ర తవ శస్త్ర ముపక్షిపతః
పతతి శిర స్యకాణ్డయమదండ ఇవైష భుజః

(అలం. మహో. సా ద)

ప్రియసఖులు విలాసముగా పరిహాసముగా చేసిన శిరీష పుష్పతాడనములచేఁ గూడ బాధజెందుచుండినయట్టి శరీరమును వధించుటకై బాణమువేయు నీ శిరస్సున ఈ భుజము అకాలయమ దండపాతమువలె పడుచున్నది

వేశి —

నిర్వీర్యం గురుశాపభాషణ వశాత్ కిం మే తవే వాయుధం
సంప్రత్యేవ భయా ద్విహాయ సమరం ప్రాప్తోస్మి కిం త్వం యథా
జాతోఽహం స్తుతివంశకీ ర్తనవిదాం కిం సారథీనాం కులే
క్షుద్రారాతికృతాప్రియం ప్రతికరో మ్యస్రేణ నాస్త్రేణ కిం ?

(విశ్వేశ్వర రసచంద్రికా.)

నేను నీవలె గురుశాపముచే నిర్వీర్యమైన యస్త్రము కల వాడనా ? నీవలె భయముచే సమరమునకు విముఖుడనై మఱల నెట్లో తిరిగివచ్చినవాడనా ? నీవలె స్తుతిపాఠములు వంశకీ ర్తనములు తెలిసిన సారథికులమునఁ బుట్టినవాడనా ? క్షుద్రులైన విరోధులు చేసిన యపకారమునకు ప్రతిక్రియను నేను గన్నీటితోఁ జేయవలయు నేమి ? అస్త్రములతోఁ బ్రతిక్రియ చేయలేనేమి ?

22 ఉన్మాద

విప్రలంభము, మహాపత్తి, పరమానందము మొదలైనవానిచే జనించినది ఒక వస్తువునందు వస్త్వంతరావభాసము (వస్త్వం

తర (భ్రమాత్మకము) చిత్తవృత్తి విశేషము ఉన్మాదము 'ఒక వస్తువు నందు వస్త్వంతరావభాసము' అని మాత్రమే లక్షణము చెప్పిన, శుక్తిరజతజ్ఞానమునందు అతివ్యాప్తి తన్నివారణార్థము 'విప్రలంభాదిచే జనించినది' అను విశేషణదళము నివేశింపఁబడినది శుక్తిరజతాది భ్రమ శుక్తిరజతాదులవలన జనించునది కాదు మందాంధకారాది దోషజన్యము

"ఇష్టజనవిభవనాశా దభిఘాతా, ద్వాతపిత్తకఫకోపాత్
వివిధా చ్చిత్తవికారా దున్మాదో నామ సంభవతి.

(రసచంద్రిక)

ఇష్టజనవియోగముచేతను, సంపద్వినాశముచేతను పెద్ద దెబ్బచేతను అనేక విధములైన చిత్తవికారముల చేతను వాతపిత్తకఫాదుల ప్రకోపముచేతను నున్మాదము సంభవించును.

ఉన్మాద శ్చిత్తవిభ్రాంతి ర్వియోగా దిష్టనాశనః
వియోగజేతు చేష్టాస్యు ర్ధావనం పరిదేవనం
అసంబద్ధప్రలపనం శయనం సహసోత్థితం
అచేతనై స్సహాలాపో నిర్నిమిత్త స్మితాదయః
ఇష్టనాశే కృతే త్వస్మి న్భస్మాదిపరిలేపనం
నృత్తగీతాదిరచనా తృణనిర్మాల్యధారణం"

[రసార్ణవము]

చిత్తవిభ్రాంతియే ఉన్మాదము. ఇది ఇష్టనాశము మొదలగు వానిచే గల్గును వియోగజమైనచో పరుగెత్తుట, ఏడ్చుట, అసంబద్ధ ప్రలాపములు చేయుట, పండుకొనుట ఆకస్మికముగా లేచిపోవుట అచేతనములతో సంభాషించుట, నిర్నిమిత్తముగా నవ్వుట ఇష్టనాశ కృతమైనచో ఒడలినిండ బూడిద పూసికొనుటయు వికార

ముగ నృత్తగీతాదుల చేయుటయు గడ్డిగాదములను తల మీఁద ధరించుటయు నుండును

ఉదా —

విరహిణి యొక్క యున్మత్తత

అకరుణ హృదయ ప్రియతమ,

ముంచామి త్వా మితఃపరం నాహమ్

ఇత్యాలాపతి కరాంబుజ

మాదా యాళీజనస్య వికలా సా "

ఓయి యకరుణహృదయ ప్రియతమా ఇఁక మీఁద నిను విడువను ' అని మనోవికల ఆ విరహిణి సఖి కేలుదమ్మి పట్టుకొని (అదే ప్రియుఁ డనుకొని) అపలపించుచున్నది

ప్రవాసగతుని స్వనాయికావృత్తాంతము నడుగుచున్న వానిని నాయకుని జూచి సందేశహారిణి యొకానొకతె పల్కిన మాట లివి ఇందు ప్రియుని విరహము విభావము అసంబద్ధవచనము అను భావము ఉన్మాదము వ్యాధిరూపమే యగుట వ్యాధి యను వ్యభిచారిభావములో నంతర్భవింపఁ జేయుటయు సంభవమే అట్లైనను వేఱుగాఁ జెప్పుట కడమ వ్యాధుల కన్న దీనికి వైలక్షణ్యము - విచ్ఛిత్తివిశేషము (చమత్కారాతిశయము) కల దని స్ఫురింపఁ జేయుటకు

ఉదాహరణాంతరములు —

విద్ధసాలభంజిక

శ్యామాం శ్యామలిమానమానయత భోః సాన్ద్రైర్మషీకూర్చకై

ర్మన్త్రం తంత్ర మథ ప్రయుజ్య హరత శ్వేతోత్పలానాం శ్రియమ్

చన్ద్రం చూర్ణయత క్షణాచ్చ కణశః కృత్వా శిలాపట్టకే

యేన ద్రష్టు మహం క్షమే దశదిశ స్తద్వక్త్రముద్రాంకితాః

ఓయీ, దట్టమైన మసికుంచెలచే రాత్రిని మఱింత నల్లగా చేయుము, పిమ్మట మంత్ర తంత్రముల నుపయోగించి తెల్ల కలువల శోభ నపహరింపుము చంద్రుని ఱాతిపలకపై నొక్క క్షణములో ముక్కలు ముక్కలుగా చేసి చూర్ణము చేయుము. వీనిచేత నేను దశదిశలును నా ప్రియురాలి వదనముద్రచే ముద్రితమైన వానినిగా చూడఁగల్గుదును.

విక్రమోర్వశీ:—

భ్రాత ర్ద్విరేఫ భవతా భ్రమతా సమన్తా
త్ప్రాణాధికా ప్రియతమా మమ వీక్షితా కిం?

(ఝంకార మనుభూయ సానందం)

బ్రూషే కి మోమితి? సఖే, కథ యాశు తన్మే
కిం కిం వ్యవస్యతి? కుతో౽స్తి చ? కీదృశీయం.

అన్నా భ్రమరా! ప్రాణాధిక యగు నా ప్రియను ఎల్లయెడ తిరుగాడుచున్న నీవు చూచితివా? నీయోంకారనాదముచే చూచితి ననుచున్నావా చెలికాడా? అయినచో నామె యేమి చేయదలచుకొన్నది? ఎక్కడనున్నది? ఎట్లున్నది?

23 మరణము.

రోగాదిజన్యము మరణమునకు ప్రాక్కాలికము మూర్ఛాది రూపము మరణము ముఖ్యార్థమైనజీకోద్గమము కాదు ముఖ్య మరణ మన శరీరప్రాణసంబంధము నశించుట అప్పుడు చిత్త మెక్కడనున్నది? అందుచే ముఖ్యమరణమునకు చిత్తవృత్తిత్వము ఎట్లు సంభవించును? అందుచే ముఖ్యమరణము భావరూపము కాదు

సర్వభావములకు శరీర ప్రాణ సంయోగము కారణము హర్షాది సర్వభావములకు. హర్షాది భావములు కార్యములు హర్షాది

భావములకెల్ల కారణసహానవృత్తిత్వము కలదు మరణ ముఖ్యార్థము శరీర ప్రాణ సంయోగనాశము కావున కార్యము పుట్టుటకు ముందు క్షణముననే శరీరప్రాణసంయోగము – కారణము – నశించును కారణము నశింపఁగా తత్సహావృత్తిత్వము మరణరూప కార్యమున కెట్లు కుదురును? అందుచే భావరూపమగు మరణమున ముఖ్య మరణముగాక తత్ప్రాగవస్థారూప మూర్ఛగ గైకొన్న దానికి శరీరప్రాణ సంయోగ సహానవృత్తిత్వము కుదురును భావత్వము సిద్ధించును కావ్యప్రదీపమందు అట్లే చెప్పఁబడినది

"జీవ స్యోద్యమ నారంభో మరణం పరికీర్తితమ్' అని పైని లక్షణమునందు రోగాది అనుచోట ఆది శబ్దముచే అభిఘాత పతన – దాహోద్బంధన విషాది నిమిత్తములు గ్రాహ్యములు ఉద్బంధన మన ఉరి ప్రియదర్శికా నాగానందములలోఁ బ్రయుక్తము దాహము రత్నావళిలో విషము మాళవికలో ప్రయుక్తములు

అనుభావములు —

అమీ తత్రానుభావాస్యు రవ్యక్తాక్షరభాషణం
వివర్ణగాత్రతా మందశ్వాసోక్తి స్తంభ మీలనం
హిక్కా పరిజనాశ్లేషో నిశ్చేష్టేంద్రియతాదయః (రసార్ణవము)

ఉదా :—

దయితస్య గుణా ననుస్మరంతీ
శయనే సంప్రతి యా విలోకితాసీత్
అధునా ఖలు హంత సా కృశాంగీ
గిర మంగీకురుతే న భాషితాపి

ప్రాణప్రియుని గుణముల ననుస్మరించుచు సెజ్జపై ఇప్పుడు ఏ తన్వి కానఁబడెనో అయ్యో ఆ కృశాంగి సఖ్యాదులు అడిగినను బదులు మాట పలుక నిచ్చగించుటలేదు

ఈ పద్యమునందు ప్రియవిరహము విభావము వచన నివృత్తి అనుభావము సంపూర్ణ వాక్యముచే మరణభావము వ్యజ్యమాన మగుచున్నను ఇట హన్త (అయ్యో) పదము అత్యంత దుఃఖాతిశయమును బోధించుచున్నది కావున మిక్కిలి దుఃఖోపకారక మగును అందుచే ఇట మరణభావము వాక్య వ్యంగ్యమైనను పద వ్యంగ్యమును కూడనై యెంతేని చమత్కారభరితముగా నున్నది దీనిచే పద వ్యంగ్య మైనచో భావము అత్యంతచమత్కారికాదు' అను కొందఱమతము పరాస్తమైనది

[శంక] 'దయితస్య గుణా ననుస్మరన్తీ' అను దానిచే చరమావస్థయందు ఆ తన్వికి ప్రియగుణవిస్మరణము కలుగలేదు అను వస్తువు వ్యజ్యమానమై విప్రలంభశృంగారమునకో కరుణరసమునకో ఏది చరమాభివ్యక్తమైన దానికి పోషక మగును అందుచే అట్లు చరమాభివ్యక్తమైన రసధ్వనికో వస్తుధ్వనికో ప్రస్తుత శ్లోకము ఉదాహరణము కారాదా ?

[సమా] అట్లుకాదు ప్రథమాభివ్యక్తమైనను మరణ ధ్వనికే ఇట ప్రాధాన్యము చమత్కారిత్వము చరమాభివ్యక్తము లకుఁగాని ఒకదానివెంటనభివ్యక్త మగుదానికి ప్రాధాన్యములేదు దానికి అగ్రచమత్కారిత్వమునులేదు అందుచే ఇది రసధ్వనికి ఉదాహరణము కాదు ఇట నిది ఎఱుఁగనగును ఒక్కటే ప్రబంధమునందు మరణరూపభావము స్వవ్యంజక మైన వాక్యమునకు వెనుక నింకొకవాక్యము నందు నాయికానాయకులలో నొకరి పునరుజ్జీవనము వర్ణింపఁబడిన విప్రలంభ శృంగార రసపోషక మగునని పునరుజ్జీవనము వర్ణింపఁబడకున్న కరుణరసపోషక మగును అని యభిప్రాయము మఱి కవులు ఈ ముఖ్య మరణమును అమంగళప్రాయ మగుటంజేసి ప్రధానముగా

వర్ణించుటలేదు ("రస విచ్ఛేదహేతుత్వాత్ మరణం నైవ వర్ణ్యతే")
రసవిచ్ఛేదహేతు వగుటచే మరణము వర్ణింపరాదందురు

ఉదాహరణాంతరములు :—

అభిఘాతజ మరణమునకు.

"స గతః క్షితి ముష్ణశోణితార్ద్రః
ఖురదంష్ట్రాగ్ర నిపాత దారితాశ్మా
అసుభిః క్షణ మీక్షితేంద్రసూనుః
విహితామర్ష గురుధ్వని ర్నిరాసే" (భారవి. ౧౨౦. సర్గ)

ఆ వరాహము వేడిరక్తముచే తడిసినదై తీవ్రమైన గిట్టల కొనల
చేతను, కోరల కొనలచేతను చీల్చబడిన శిలలుకలదై నేలపైఁ
బడి, కొనయూపిరితో క్షణ మర్జునుని చూచుచు నసూయచే గొప్ప
ఘుర్ఘురధ్వని చేయుచున్నదై ప్రాణములు వీడెను

ఇట ముఖ్య మరణమే వర్ణితము. మహావీర చరితము తాటకా
మరణము ముఖ్యమే వర్ణితము ఇట ఇది వ్యవస్థ "శృంగారాశ్రయా
లంబనత్వేన మరణే వ్యవసాయమాత్ర ముపనిబంధనీయమ్ అన్యత్ర
కామచారః" (దశరూపావలోకము) ఎవరి నుద్దేశించి భావము ప్రవ
ర్తించునో వారికి అది ఆలంబనము ప్రియు నుద్దేశించి మరణము వర్ణిం
చిన ప్రియుడే మరణమునకు ఆలంబనము ప్రియ నుద్దేశించి మరణము
వర్ణించిన ప్రియయే మరణమునకు ఆలంబనము శృంగారమునందు
ప్రియాప్రియులలో నెవరి మరణమునేని వర్ణింపవలసినచో వ్యవసాయ
మాత్రముగనే వర్ణింపవలెను శృంగారభిన్నస్థలములందు కవికి
స్వాతంత్ర్యము కలదు సాక్షాన్మరణమునుగూడ వర్ణింపవచ్చునని
భావము కాని, దృశ్యకావ్యములందు శృంగారవీరములలో నేదే
నొక్కటి ప్రధానము కావలెనని నియమము కావున అందే రసము

ప్రధానమైనరూపకమందుచు నాయికానాయకుల ముఖ్యమరణము వర్ణింపరాదు.

ఉదా :— రత్నావలీ నాగానందములందు ఉద్బంధన వ్యవసాయమే వర్ణితము. మఱి ఎచట పునర్జీవన సంభావన కలదో అచ్చోట శృంగారమునందును ముఖ్యమరణము వక్తవ్యము - ఉదా : కాదంబరియందు పుండరీకుని మరణము

ప్రియదర్శికలో, విషజనిత మరణము :—

ఏషా మీలయతీద మక్షియుగళం జాతా మమాంధా దిశః
కంఠోఽస్యా ఉపరుధ్యతే మమ గిరో నిర్యాంతి కృచ్ఛ్రాదిమాః
ఏతస్యా శ్శ్వసితం హృతం మమతను ర్నిశ్చేష్టతా మాగతా,
మన్యేఽస్యా విషవేగ ఏవహి పరం సర్వంతు దుఃఖం మయి.

ఈమె రెండు కనులను మూయుచున్నది నాకు దశదిశలు అంధకారబంధురము లగుచున్నవి. ఈమె కంఠము రుద్ధమగుచున్నది. నాకు నోట మాట వచ్చుటలేదు. ఈమె శ్వాసవాయువు ఆగిపోవు చున్నది. నా శరీరము నిశ్చేష్టమైనది ఇది యంతయు విషవేగము వలన సంభవించినది ఇకపై నాకు సర్వమును దుఃఖమయమే యగు నని తలంచు చున్నాను

ఒకానొక నాయిక మరణవ్యవసాయము తత్సఖీజనము నాయకునికిఁ జెప్పుచున్నది.

సంప్రాప్తేఽవధివాసరే క్షణ మను త్వద్దర్శ్యవాతాయనం
వారంవార ముపేత్య నిష్క్రియతయా నిశ్చిత్య కించిచ్చిరమ్
సంప్రత్యేవ నివేద్య కేలికురరీః సాస్రం సఖీభ్యః శిశో
ర్మాధవ్యాః సహకారకేణ కరుణః పాణిగ్రహో నిర్మితః.]
(దశరూపక. హేమ. కావ్యానుశాసన. అలం. మహో.)

నీవు వచ్చెడి గడువుదినము సమీపింపగా నీ ప్రియ నీ దర్శనము నకై క్షణక్షణము భవనముయొక్క వాతాయనమునొద్దకు మాటికి మాటికేగి కదలక మెదలక కొంతసే పేదో ఆలోచించి నిశ్చయించి తనవిలాసార్థమై పెంచెడి ఆడు గోరువంకలను కన్నీళ్ళు కార్చుచు తన చెలికత్తెల కప్పగించి లేతదగు మాధవిలతకు తీయమామిడికిని దయతో పాణిగ్రహణము నిర్వహించినది

24 వితర్కము

సందేహాద్యనంతరము కలుగునట్టియూహా వితర్కము. అదే నిశ్చయానుకూలము అనఁగా తొలుత సందేహవిపర్యయ జ్ఞానములు కలుగ, వితర్కమున నవి తొలఁగి కడకు నిశ్చయాత్మకజ్ఞానము పుట్టును. అందుచే వితర్కము చింతాదులకన్న విలక్షణము.

ఊహో వితర్కః సందేహ విమర్శ ప్రత్యయాదిభిః
జనితో నిర్ణయాంత స్స్యా దసత స్సత ఏవ వా
తత్రానుభావాస్యు రమీ భ్రూ శిరఃకంపనాదయః

(రసార్ణవము)

ఉదా:—

యది సా మిథిలేంద్ర నన్దినీ
నితరామేవ నవిద్యతే భువి
అథ మే కథమస్తి జీవితం
న వినాఽలంబన మాశ్రితస్థితిః

ఆ మిథిలేన్ద్రనందిని భూమిపై లేనే లేకపోయినచో, నా జీవిత మిక నెట్లు? ఆలంబనము లేక దాని నాశ్రయించుకొన్నది.

నిలువలేదుకదా ఆ వరవర్ణిని మైథిలి భూమియందుమ్మూటికి లేదేని, మఱి నా జీవితము ఎట్లు నిలిచియున్నది? ఏలన, ఆలంబనము లేక (ఆధారములేక) ఆశ్రితము (ఆధేయము) ఎట్లు నిలుచును? ఇది

భగవంతుఁడు శ్రీరామచంద్రుడు తనలో ననుకొన్న మాట. భూమిలో సీత కలదా? లేదా? సందేహము ఇట విభావము. భ్రూవిక్షేపము, శిరః కంపనము అంగుళి నాడించుట ఇవి శబ్దోపాత్తములు కాఁబట్టి ఊహ్యములు అనుభావములు.

ఇది చింత ఏల కారాదు? అని వచింపరాదు ఏలన చింత నిశ్చయ ప్రయోజకము కావలెనని నియమములేదు ఏలన, సందేహాది నియతపూర్వవృత్తిత్వము దానికి (చింతకు) లేదు, వితర్కమునకో కలదు. సందేహము లేకున్న వెనుక నిశ్చయ మెట్లు కలుగును? వితర్కము నియతముగ సందేహపూర్వకము, నిశ్చయఫలకము ఏమగును? ఎట్లగును? ఇత్యాద్యాకారకము చింత ప్రాయికముగ ఇది యిట్లు కాఁదగును ఇత్యాకారకము వితర్కము ఇట్లు రెంటికిని విషయభేదము కలదు ఇట్లు పర్యవసానవైలక్షణ్యము, విషయ వైలక్షణ్యము కలుగుటంజేసి చింతావితర్కములు భిన్నములు.

[శంక] పై శ్లోకమందు తుదిపాదమున ఆలంబనము లేక ఆశ్రిత స్థితి లేదుకదా అని అర్థాంతరన్యాసము చెప్పఁబడియున్నది కదా ఇట భావధ్వని యెట్లు?

[సమా] ఇందు అర్థాంతరన్యాసము కూడ వితర్కమునకే అనుకూలము-పోషకము (చింతకుఁగాదు) భూమిలో సీతలేకున్న, రాముఁ డెట్లుండును? అను విశేషము, ఆలంబనములేక ఆధేయమెట్లుండును అను సామాన్యముచే సమర్థింపఁబడుట అర్థాంతరన్యాసము రాముని జీవితమునకు సీత జీవితము ఆధారము అను ప్రతిపాద్యవిషయనిర్ణయమునకుఁ దోడ్పడుచున్నది అందుచే వితర్కధ్వనికే ప్రాధాన్యము. అలంకారమునకుఁగాదు అట్లే అనిర్ణీతరూపము చింత ఇట తత్సమర్థన మక్కరలేదు అందుచే దానికిని ప్రాధాన్యము లేదు.

ఉదాహరణాంతరములు:—

చిత్రే నివేశ్య పరికల్పిత సత్త్వయోగాద్
రూపోచ్చయేన ఘటితా మనసా కృతాను ?
స్త్రీరత్నసృష్టి రపరా ప్రతిభాతి సా మే
ధాతు ర్విభుత్వ మనుచింత్య వపుశ్చ తస్యాః

(శాకుం.)

స్త్రీరత్నమైన యీ శకుంతల సృష్టి మిగుల విశిష్టముగనాకు భాసించుచున్నది ఈమె శరీర సౌందర్యమును, బ్రహ్మదేవుని సృష్టి సామర్థ్యమును పరిశీలించి చూడ, రూపనిర్మాణ సామగ్రిని చేకూర్చుకొన్న బ్రహ్మ శకుంతలను చిత్రపటములో ప్రవేశపెట్టి, జీవకల్పనము చేసి మనస్సులో కల్పించి నిర్మించెనా యనునట్లు నాకు బోధపడుచున్నది.

కిం లోభేన విలంఘితః స భరత స్తేనైత దేవం కృతం?
సద్యః స్త్రీలఘుతాం గతా కి మథవా మాతైవ మే మధ్యమా?
మిథ్యైత న్మమ చిన్తితం ద్వితయ మ ప్యార్యోఽనుజోఽసౌ గురుః
మాతా తాతకలత్ర మిత్యనుచితం, శంకే విధాత్రా కృతమ్.

ఏమి? ఆ భరతుడే లోభముచే నిట్లు ధర్మము మీరెనా? కావున నే యాతఁ డట్లు చేసెను, లేక మధ్యమాంబయైన కైకేయియే వెంటనే స్త్రీస్వభావజనితమైన లోభమును పొందినదా? ఈ రెంటిని వ్యర్థముగనే నేను శంకించుచున్నాను అన్నయైన భరతుఁడీ విషయము నంగీకరించునా? కైకేయికూడ మా పితృకళత్రములలో నొకతె. మా మాతృగణముల లోనిది, కావున ఇట్లు తలంచుట తగదు ఇదియంతయు బ్రహ్మదేవుని వ్రాతయే.

అంకం కేపి శశంకిరే, జలనిధేః పంకం పరే మేనిరే,
సారంగం కతిచిచ్చ సంజగదిరే, భూచ్ఛాయ మైచ్ఛన్ పరే
ఇన్దౌ యద్దలితేన్ద్రనీలశకల శ్యామం దరీదృశ్యతే,
తత్ సాంద్రం నిశి పీత మన్ధతమసం కుక్షిస్థ మాచక్ష్మహే
(భల్లాణీయ - రసార్ణవము)

చంద్రునిలో దళితమగు నింద్రనీలశకలమువలె నల్లగా నేది కన్పించుచున్నదో దానిని కొందరు అంకమని శంకించిరి సముద్రపు బురద యని కొందఱు భావించిరి కొందఱు సారంగ మని భావించిరి మఱికొందఱు భూచ్ఛాయ యనిరి కాని చంద్రుడు రాత్రియందు త్రావిన దట్టమైనచీకటియే కుక్షిస్థమై కన్పించుచున్న దని మేమందుము

25 విషాదము

ఇష్టము సిద్ధింపమి రాజునెడ నపరాధము, గురువునెడ నపరాధము మొదలగు నిమిత్తముల నుత్పన్నమైనది, పశ్చాత్తాపరూపము అగు చిత్తవృత్తి విశేషము విషాదము

ప్రాచీనుల లక్షణము :—

"ఉపాయాభావజన్మాత్తు విషాదః సత్త్వసంక్షయః
నిశ్వాసోచ్ఛ్వాస హృత్తాప సహాయాన్వేషణాదికృత్."

ఉదా :—

కర్ణుఁడు మృతుఁడు కాఁగా యుద్ధవిజయనిరాశఁ గొని దుర్యోధనుఁడు తన జీవితమును గూర్చి పలుకుచున్నాఁడు

భాస్కరసూనా వస్తం యాతే
జాతే పాండవోత్కర్షే
దుర్యోధనస్య జీవిత
కథ మపి నాద్యాపి నిర్యాపి!

ఓ దుర్యోధన ప్రాణమా, నీ కన్న వేఱుగాని కర్ణుఁడు అస్తంగ తుఁడు కాఁగా, పాండుపుత్రులకు ఉత్కర్ష కలుగఁగా, ఇప్పుడు కూడ ఎట్లును తనువు వెడలకున్నావు

ఇందు స్వాపకర్ష పరోత్కర్షల ప్రదర్శనము విభావము జీవిత నిర్యాణాభిలాష, తదాక్షేపము మొగము వంచుకొనుట, నిట్టూర్పులు, మనస్తాపము మొదలగునవి అనుభావములు ఈ విషాదధ్వనియందే దుర్యోధనునియొక్క" అనుదానికి అర్థాంతరసంక్రమితవాచ్య ధ్వని అనుగ్రాహకముగా నున్నది అనఁగా 'దుర్యోధనునకు' అనఁగా కేవలము తన్నామకునకు అను వాచ్యార్థము ఇట వివక్షితము కాదు మఱేమన - పదియకౌహిణుల ప్రభువను అనక్రవిక్రముఁ డను నైన నా జీవితము అను లక్ష్యార్థము వివక్షితము ఆ యర్థాంతర సంక్రమిత వాచ్యధ్వని దుఃఖాతిశయమునకు వ్యంజకముగా నున్నది. అనఁగా, విషాదధ్వనికిఁ బోషకముగా నున్నది అందుచే దానికి ప్రాధాన్యము లేదు. విషాద భావధ్వనికే ప్రాధాన్యము కలదు. ఇట కర్ణుఁడు పోయెనే' అని దుర్యోధనుఁడు భయపడె నని త్రాసధ్వనిని శంకింపరాదు ఏలన, శత్రువీరుల త్రాసలేశమేని దుర్యోధనునకు సంభవింపదు కావున చింతాధ్వనికూడ శంకింపరాదు. మదేకప్రాణ మైన కర్ణుని వధించిన శత్రువులపైఁ గసిదీర పోరి మడియుదుఁ గాక అని దుర్యోధనుని నిశ్చయము కావున చింత నిశ్చయపర్యవసాయి కాదు దైన్యధ్వనియుఁ గాదు. సకలసైన్యక్షయ మైనను విపత్తు గణించువాఁడు కాఁడు దుర్యోధనుఁడు (కావున దుఃఖాదిదైన్యవిభా వము ఇట లేదు అందుచే దైన్య ధ్వని జనింప కారణములేదు) వీర రసధ్వనియు కాదు ఏలన మరణమే శరణీకరించుకొనుటచే పరాప కర్ష జీవితునకు అతనికి వీరరసస్థాయి యుత్సాహము సంభవింపదు కావున. ఇట్లు సర్వప్రకారములఁ బర్యాలోచింప ఈ శ్లోకమునందు భావధ్వనియే ప్రధాన మని నిగ్గు

ప్రత్యుదాహరణము :—

భయపడినవాఁడు ఉత్తరుఁడు అర్జునునితో నివేదించుకొనుచున్నాఁడు.

అయి, పవనరయాణాం నిర్దయానాం హయానాం
శ్లథయ గతి మహం నో సంగరం ద్రష్టు మీహే
శ్రుతివివర మమీ మే దారయంతి ప్రకుప్య
న్భుజగనిభభుజానాం బాహుజానాం నినాదాః.

ఓయీ, వాయువేగము గలవి నిర్దయములు నైన యీ గుఱ్ఱముల వేగము సడలింపుము నేను యుద్ధముచూడ నిచ్ఛగింపను మహాకోపాద్రిక్త సర్పముల సాటి బాహువులు గల యీ క్షత్రియ వీరుల నినాదములు నా కర్ణరంధ్రములఁ బగుల్చుచున్నవి

ఇందు త్రాసమే ప్రతీయమాన మగుచున్నది విషాదము కాదు ఇసుమంత ప్రతీతమైననుం గూడ విషాదము ప్రధాన ప్రతీత త్రాసమునకే ఉపస్కారకము అందుచే విషాదధ్వనికి ఈశ్లోకము ఉదాహరణముకాదు

ఉదాహరణాంతరములు :—

వ్యర్థం యత్ర కపీంద్రసఖ్య మపి మే క్లేశః కపీనాం వృథా,
ప్రజ్ఞా జాంబవతో నయత్ర న గతిః పుత్రస్య వాయో రపి
మార్గే యత్ర న విశ్వకర్మతనయః కర్తుం నలోఽపి క్షమః,
సౌమిత్రే రపి పత్రిణా మవిషయ స్తత్ర ప్రియా క్వాపి మే ?
(ఉ. రా. చ)

ఎచ్చట కపీంద్రునితోడి సఖ్యము వ్యర్థమగునో, యెందు కపుల శ్రమయెల్ల వృథ యగునో, యెందు జాంబవంతుని ప్రజ్ఞయుఁ బోలేదో, యెచ్చోటికి వాయుపుత్రుఁడైన హనుమంతుఁడును జేరుకొన

లేఁలో, విశ్వకర్మతనయుఁడైన నలుఁడును నెచటికిఁ ద్రోవను నిర్మింపలేఁడో, సౌమిత్రి బాణములకు గూఢ నెయ్యది యగమ్యమో ఆ యెచ్చటనో నా ప్రియమైన జానకి యున్నది.

ఏపా కుటిలఘనేన చికుర కలాపేన తవ నిబద్ధా వేణీ
మమ సఖి దారయతి, దంశతి ఆయసయష్టిరివ కాలోరగీవహృదయమ్.

ఓ, సఖీ, కుటిలమును, ఘనమును చికురకలాపములో నిబద్ధమగు నీ వేణి నాహృదయమును ఆయసయష్టివలె, చీల్చుచున్నది, కాలోరగమువలె కరచుచున్నది. (సా.ద)

న భిక్షా దుర్భిక్షే, పతతి దురవస్థా కథ మృణం
లభ్యన్తే ? కర్మాణి ద్విజపరివృఢాన్ కారయతి కః ?
అదత్వాపి గ్రాసం దినపతి రసా వస్తమయతే,
క్వ యామః ? కిం కుర్మః ? గృహిణి గహనో జీవనవిధిః.

(రసరత్న ప్రదీపిక)

దుర్భిక్షము వచ్చినపుడు బిచ్చము దొరకదు దురవస్థ వచ్చి పడును. ఋణము లభించుట ఎట్లు ? బ్రాహ్మణోత్తములచే కర్మల నెవ్వరు చేయింతురు ? గ్రాస మీయకయే, ఈ దినపతి అస్తమించుచున్నాడు గృహిణీ, ఎచ్చటికి పోదు మేమి చేయుదుము జీవనవిధము క్లిష్టమై పోయినది.

26. ఔత్సుక్యము

'ఇప్పుడే తల్లాభము నాకుఁ గల్గుఁగాక' అను నుత్కంఠచే ఔత్సుక్యము ఇట ఇష్టవిరహాది విభావము త్వర, చింత (చిత్తతాపము, స్వేదము దీర్ఘనిశ్వాసము) మున్నగునవి అను భావములు.

అక్లే ప్రాచీన లక్షణము :—

"సంజాత మిష్టవిరహా దుద్దీప్తం ప్రియసంస్మృతేః
నిద్రయా తన్ద్రియా గాత్రగౌరవేణచ చింతయా
అనుభావిత మాఖ్యాత మౌత్సుక్యం భావకోవిదైః"

ఇష్టవిరహము ఆలంబనవిభావము ప్రియ సంస్మృతి ఉద్దీపన విభావము. నిద్ర, తూఁగు ఒడలుబరువు, చింత అనుభావము లైన చిత్తవృత్తివిశేషము ఔత్సుక్యము.

'ఔత్సుక్యం వాంఛితార్థస్య లాభే కాలాసహిష్ణుతా"

వాంఛితార్థలాభమున కాలవిలంబనము సహింపక పోవుటనే ఔత్సుక్యమందురు.

ఉదా :—

నిపతద్బాష్ప సంరోధ ముక్త చాంచల్యతారకమ్
కదా నయననీలాబ్జ మాలోకేయ మృగీదృశః

జాలువారు కన్నీటిని ఆఁపుటచే చాంచల్యము వీడిన కనీనికలు (తారకలు) కలదైన యా యేణీనయన నయననీలాబ్జములను ఎప్పుడు చూతునో కదా.

ఇట ప్రియానన దర్శనమునం దుత్కటేచ్ఛారూపము ఔత్సుక్యము ప్రధానముగా ప్రతీయమాన మగుచున్నది.

ఉదాహరణాంతరములు :—

ద్విత్రైః పాణిసరోరుహం, త్రిచతురై ర్ధమ్మిల్లమాల్యస్రజః
కంఠా న్మౌక్తికవల్లరీ స్తదనుచ త్రిః ప్రా పదైః పంచషైః
హిత్వా భారపరంపరా మపి జవాత్ త్వాం దేవ సంవీక్షితుం
తన్వంగీ నిరపాయ మధ్వని ఘనం శ్రోణీభరం నిందతి
(అలం. మహోదధి)

ఓ ప్రభూ అయ్యింతి మిమ్ములను చూడఁగోరి బయలుదేరి వేగముగ వచ్చుచు రెండు మూఁడడుగుల నైచి చేతియందలి లీలార విందమును, మూఁడు నాలు గడుగులు నైచి కొప్పులోని పూలదండ లను, అయిదాఱడుగులను నైచి కంఠమునందలి ముత్యాలహారమును తీసివేయుచు నిట్లు బారపరంపరను మార్గమందు తగ్గించుకొనియు నప్పటికిని తొందరగా రాలేక మిక్కిలి గొప్పదగు తన నితంబ భారమును నిందించుకొనుచున్నది

రత్నావళిలో వత్సరాజుయొక్క సాగరికా సమాగమౌత్సుక్యము

తీవ్రస్మర సంతాపో న తథాదౌ బాధతే యథా ప్రాప్తే
తపతిప్రావృషి సుతరా మభ్యర్ణ జలాగమో దివసః

తీవ్రమైన స్మరసంతాపము చివరలో బాధించినట్లు మొట్ట మొదట నంతగా బాధింపదు వర్షాకాలమున మేఘములు ముసురుకొనుటకుఁ బూర్వదివసమునందు ఉక్క యెక్కువపోయును గదా!

27 ఆవేగము

అనర్థాతిశయ జనితము సంభ్రమాఖ్యము చిత్తవృత్తి విశేషము ఆవేగము. అనుకొనని యనిష్టసంఘటనములచే నుత్పన్నమైన సంభ్రమ మను చిత్తవృత్తి - ఉద్వేగాపరపర్యాయము - ఆవేగము.

సా. దర్పణోక్త లక్షణము :—

ఆవేగః సంభ్రమ స్తత్ర హర్ష జే పిండితాంగతా
ఉత్పాతజే స్రస్తతాంగే, ధూమాద్యాకులతాఽగ్ని జే
రాజవిద్రవజాదేస్తు శస్త్ర నాగాది యోజనమ్
గజాదేః స్తంభ కంపాది పాంస్వాద్యాకులతానిలాత్

'ఆవేగ మనఁగా సంభ్రమము. అది హర్షజ మగునేని ఒడలు సంకుచిత మగును, ఉత్పాతప్రభవనేని అంగమందు స్రస్తత కలుగును. అగ్నిజనేని పొగ లోనగువానిచే కలఁతపడుట కలుగును. పరరాజులధాటి లోనగు కారణములవలన సంభవించినదేని ఆయుధములను ఏనుగు లోనగువానిని సమకూర్చుకొనుట కలుగును. గజాదిజమైన స్తంభకంపాదులం గలిగించును వాతజనేని ధూళ్యాదుల చేత కలతం బెట్టును.

"ఇత్యేషాష్టవిధో జ్ఞేయ ఆవేగః సంభ్రమాత్మకః
స్థైర్యోత్తమ మధ్యానాం నీచానాం చోపసర్పణాత్"
'ఏతేష్వ రుత్తమాదీనాం మనుభావా యథోచితమ్"

(విశ్వే. రసచంద్రిక) (రసార్ణవ

ఉదా :—

రాముఁడు యుద్ధమునకు రాఁగా రావణ భార్యలు ఆవేగముతో నిట్లు తలపోసిరి :—

లీలయా విహితసింధుబంధనః
సోయమేతి రఘువంశనందనః
గర్వ దుర్విలసితో దశాననః;
కుత్ర యామి నికటే కులక్షయః ?

అవలీలగా సముద్రమునకు వారధికట్టి ఇదే వీఁడు వచ్చుచున్నాఁడు రఘునందనుఁడు, దశాననుఁ డన్ననో నిజపరాక్రమ గర్వ దురభిమానిగా నున్నాఁడు. ఎక్కడికి పోవుదును ? కులక్షయము దాపురించినది ఇది మండోదరి తనలోఁ దలపోసికొనుమాట. ఇందు రఘునందనుని యాగమనము విభావము. ఎచటికి పోవుదును ? అనుదానిచే వ్యక్తము చిత్తస్థైర్యాభావము(చాంచల్యము)అనుభావము

భావము ఇట చింత ప్రధానముగా వ్యక్తమగుచున్నది' అనరాదు ఎచటికి పోవుదును ? అని స్ఫుటముగాఁ ప్రతీతమగు స్థైర్యాభావముచే ఉద్వేగము ప్రతీతమైనట్లు చింత ప్రతీతమగుటలేదు మఱియు ప్రధాన మగు నావేగముయొక్క చర్వణయందు అప్రధానమగు చింతయు పరిపోషకముగా విషయ మగుచున్నది అందుచే ఇది చింతాధ్వనికిఁ గాక, ఆవేగధ్వనికే లక్ష్యము.

ఉదాహరణాంతరము :—

నృసింహుని యావిర్భావముచూచి హిరణ్యకశిపుని యావేగము.

కిం కిం ? సింహ స్తతః కిం ? నరసదృశవపు ర్దేవ చిత్రం గృహీతో
నైవేదృ గ్కోఽపి జీవో ఽద్భుత ముపనిపతన్ పశ్య సంప్రాప్తఏవ
శస్త్రంశస్త్రం న శస్త్రీ త్వరిత మహహ హా కర్కశత్వం నఖానాం!
ఇత్థం దైత్యాధినాథో నిజనఖకులిశై ర్యేన భిన్నః స పాయాత్.

ఏమేమి ? సింహము అయిన నేమి ? నరసదృశశరీరము, ప్రభూ! చిత్రమైన శరీరము గైకొన్నదే (అవును) ఇట్టి ప్రాణి యింకొకటి లేదు అద్భుతము డాయుచున్నదే చూడు, రానేవచ్చి నది శస్త్రము శస్త్రము ఇది శస్త్రము కలదికాదు అహో త్వరగా (తెండు) అబ్బా గోళ్ళవాడి! ఇట్లు తన నఖకులిశముల నెవఁడు రాక్షసరాజును హిరణ్యకశిపుని చీల్చెనో వాఁడు రక్షించుగాక

(హేమ. కావ్యాను.)

కైలాసాద్రా వుదస్తే ప్రమథపతిగణే షూల్లసత్కౌతుకేషు
క్రోడం మాతుః కుమారే విశతి విషముచి ప్రేక్షమాణే సరోషమ్
పాదావష్టంభ సీదద్వపుషి దశముఖే యాతి పాతాళమూలం
క్రుద్ధో ప్యాశ్లిష్టమూర్తిః ఘనతర ముమయా పాతుహృష్టశ్శివోవః

(ప్రియదర్శిక — రసార్ణవ.)

కైలాస పర్వతము పైకెత్తబడగా ప్రమథగణములెల్లను వింత నొంది కుతూహలముతో చూచుచుండిరి కుమారస్వామి భీతిల్లి యమ్మ యొడిలో దూరెను శివుని కంఠమున నున్న సర్పరాజు సరోష ముగాఁ జూచుచుండెను పర్వతము నెత్తుచున్న రావణుడు కాలిపట్టు వదలి బడలిన శరీరముతో పాతాళమునకు దిగబడిపోవుచుండెను ఇట్టి స్థితిలో క్రుద్ధుడయ్యు ఉమాదేవిచే సమాశ్లిష్టుడై హర్షాత్మకుడై యున్న శివుఁడు మిమ్ముఁ బ్రోచుగాక

రత్నావళిలో, వానరావేగ వర్ణనము :—

నష్టం వర్షవరైః మనుష్య గణనాభావా దపాస్య త్రపా
మన్తః కంచుకి కంచుకస్య విశతి త్రాసా దయం వామనః
పర్యంతాశ్రయిభి ర్నిజస్య సదృశం నామ్నః కిరాతైః కృతం
కుబ్జా నీచతయైవ యాన్తి శనకై, రాత్మే క్షణాశంకినః

ఆ సమయమున వానరము భయముచే పరుగెత్తునపుడు మనుష్యులలో గణనము లేకపోవుటచే నపుంసకులు (కొజ్జాలు) పాఱి పోయిరి ఈ మఱుగుజ్జు సిగ్గువీడి కంచుకునియొక్క కంచుకము లోపల దూరుచున్నాడు చుట్టునున్న కిరాతులు తమపేరునకుఁ దగినట్లుగా కీయను శబ్దము చేయుచుఁ బాఱిపోయిరి గూనివాండ్రు ఆకోతి తమ నెక్కడ చూచునో యను భయముచే మఱియు వంగివంగి నెమ్మదిగా పోవుచున్నారు

రత్నావళి నాగానందములలో నాయికోద్బంధన ప్రయత్న మున నాయకుని యావేగము రత్నావళిలో వహ్న్యావేగము.—

అల మల మతి మాత్రం సాహసే నామునా తే;
త్వరిత మయి విముంచ త్వం లతాపాశ మేతత్
చలిత మివ నిరోద్ధుం జీవితం జీవితేశే
క్షణ మిహ మమకంఠే బాహుపాశం నిధేహి

(అలం మహోదధి)

వలదు నీ కిట్టి సాహసము వలదు ఈ లతాపాశమును వీడుము, జీవితేశుని చలితమగు ప్రాణమును నిరోధించుటకో యనునట్లు నా కంఠమున క్షణము బాహుపాశమును సారింపుము.

విరమ విరమ వహ్నే ముంచ ధూమానుబంధం
ప్రకటయసి కి ముచ్చై రర్చిషాం చక్రవాలమ్
విరహహుతభుజాహం యో నదగ్ధః ప్రియాయాః
ప్రలయదహనభాసా తస్య కిం త్వం కరోషి!

ఓయి అగ్నీ మానుకొనుము పొగలు గ్రమ్మకుము ఆ జ్వాలల చక్రవాళమును విజృంభింప జేయుదువా యేమి? ప్రళయాగ్ని తైక్ష్ణ్యము కలిగిన ప్రియురాలి విరహాగ్ని కూడ నన్ను దహింపనేర దయ్యెను. ఇట్టి వానిని నీ వేమి చేయగలవు?

నఖలు నఖలు ముగ్ధే సాహసం కార్యమీదృక్
వ్యపనయ కర మేతం పల్లవాభం లతాయాః
కుసుమ మపి విచేతుం యో న మన్యే సమర్థః
కలయతి స కథం తే పాశ ముద్బంధనాయ

ముగ్ధురాలా! వలదు. ఇట్టి సాహసకార్యము వలదు లతల నుండి పల్లవాభమగు నీ చేతిని తొలగింపుము పూవును కోయుటకైన సమర్థ మని యనుకొనుటకు వీలులేని నీ చేయి, ఉరిత్రాడు నుపయోగించుట కెట్లు తగియున్నది?

28 జడత

చింత, ఉత్కంఠ, భయము, విరహము, ఇష్టానిష్ట దర్శన శ్రవణాదులు మున్నగువానిచే జనించునది, అవశ్యకర్తవ్యార్థాను సంధానశూన్యము నగు చిత్తవృత్తివిశేషము జాడ్యము ఇది మోహమునకు ముందు వెనుకల నుండును.

అట్లే ప్రాచీనులు చెప్పిరి —

కార్యావివేకో జడతా పశ్యత శ్శృణ్వతో౽పివా
తద్విభావాః ప్రియానిష్ట దర్శన శ్రవణే రుజా
అనుభావా స్త్వమీ తూష్ణీంభావ విస్మరణాదయః
పూర్వం పరతో వా స్యా న్మోహా దితి విదాం మతమ్"

['అప్రతిపత్తి ర్జడతా స్యా దిష్టానిష్ట దర్శన శ్రుతిభిః
అనిమిషనయన నిరీక్షణ తూష్ణీంభావాదయ స్తత్ర]

(విశ్వే. రస చం)

చూచుచున్నను వినుచున్నను కర్తవ్యమునుగూర్చిన జ్ఞానము లేకపోవుట జడత దాని విభావములు ప్రియాప్రియులలో నెవరివేని యనిష్ట శ్రవణాదులు రుజ (దుస్సహాపీడ) (ఇష్టదర్శన శ్రవణాదులును ఒకొక్కప్పుడు విభావాదు లగును) అనుభావములు మిన్నకుండుట మఱపు రెప్పయార్పకచూచుట అనిరీక్షణము మున్నగునవి అది మోహమునకు ముందును వెనుకను నుండునని రసవేత్తల యభిప్రాయము

ఉదా. —

విరహిణియొక్క సహచరిమాటలు:—

యదవధి దయితో విలోచనాభ్యాం
సహచరి దైవవశేన దూరతో౽భూత్
తదవధి శిథిలీకృతో మదీయైః
అథ కరణైః ప్రణయో నిజక్రియాసు

ఏది మొదలు ప్రియుఁడు దైవవశమున నా కనులకు దూరమాయెనో అది మొదలు నా చక్షుశ్శ్రవణాదీంద్రియములకు తమ తమ వ్యాపారములందు ప్రేమ సడలినది. [చక్షువునకు సుందరరూప

సందర్శనప్రేమ సఫలితని శ్రవణమునకు మంజులశబ్దశ్రవణప్రేమ సఫలితని. ఇట్లు అన్యేంద్రియములకును.]

ఇట ప్రియావిరహము విఘాతము, చక్షుః శ్రవణాదులు తమ వ్యాపారములందు చాక్షుషాది ప్రత్యక్షజ్ఞానములందు ప్రణయము యొక్క శిథిలీకరణము అనుభావము జడతకును మోహమునకును భేదము కలదు అది ఎట్లన మోహమునందు చక్షురాదులచే చాక్షుషాదిజ్ఞానము పుట్టనే పుట్టదు. ఏలన సముచితవ్యాపారములు ఇంద్రియములకు ఉండనే యుండవు మఱి జడతయందు అట్లు కాదు. ఇంద్రియవ్యాపారము లుండును. కాని శిథిలములుగా నుండును. అందుచే చాక్షుషాదిజ్ఞానములు పుట్టును కాని అవి ప్రకారవిశేష వైశిష్ట్యముతో జనింపవు అనఁగా విశేషములతోఁ గూడిన వానిగా తెప్ప గ్రహింప నేరకుండును. సామాన్యరూపప్రమితి యుండునని భావము. ఇట్లు కార్యభేదమును బట్టి వస్తుభేదము కలదు. అందుచేతనే ఉదాహరణ శ్లోకమున 'శిథిలీకృతః' అని చెప్పఁబడినది 'త్యక్తః" అని చెప్పబడలేదు.

[రసచంద్రిక యందును విశ్వేశ్వరుఁడు ఈ వైలక్షణ్యమును గ్రహించినాఁడు. 'మోహే చాక్షుషాదే రనుత్పత్తిరేవ. ఇహతు తదుత్పత్తావపి ప్రకారవిశేషావగాహనం బాహుల్యాన్నావశ్చేతి విశేషః అని.]

ఉదాహరణాంతరములు:—

ఇష్టస్పర్శనమున:—

వినిశ్చేతుం శక్యో - సుఖ మితివా దుఃఖ మితివా,
విబోధో నిద్రావా, కిము విషవిసర్పః? కిము మదః?
తవ స్పర్శే స్పర్శే మమహి పరిమూఢేంద్రియ గణో
వికార శ్చైతన్యం భ్రమ-యతి, సమున్మీలయతి చ
(ఉ. రా. చ.)

నే నిది సుఖమో, దుఃఖమో, విబోధమో నిద్రయో విషప్రసరణమో, మదాతిరేకమో, నిర్ణయింపలేకున్నాను నీ స్పర్శ సోకిన ప్రతిపర్యాయము, ఒకానొక యావేశము నా యింద్రియగ్రామును మూర్ఛ మొనరించి చైతన్యమును హరించుచున్నది ఉజ్జీవింప చేయుచున్నది గూడ

ప్రశ్చ్యోతనం ను హరిచందనపల్లవానాం
నిష్పీడితేన్దుకరకందలజో ను సేకః
ఆత ప్తజీవితతరోః పరితర్పణో మే
సంజీవనౌషధరసో ను హృది ప్రసిక్తః

దుఃఖములచే దగ్ధప్రాయమగు జీవితవృక్షము గల నాకు నాప్యాయనకరముగ హృదయము సమార్ద్ర మగుచున్న దిదియేమి? హరిచన్దన పల్లవముల రసస్రావమా? బాగుగా పిండబడిన చంద్రుని కిరణలవముల రససారమా? సంజీవనౌషధి రసప్రసరణమా?

స్పర్శః పురా పరిచితో, నియతం స ఏష,
సంజీవనశ్చమనసః పరిమోహనశ్చ,
సంతాపజాం సపది యః ప్రతిహత్య మూర్ఛా
మానందనేన జడతాం పున రాతనోతి (ఉ. రా. చ)

ఈ స్పర్శము పూర్వము పరిచితమైనది నిక్కముగా నిది శరీరమునకు జీవము పోయుచు మనస్సును పరవశము చేయుచున్నది. అంతియేకాక సంతాపజనిత మగు మూర్ఛను తొలగించి, యానంద పారవశ్యముద్వారా తిరిగి జడతను చేకూర్చుచున్నది.

తటస్థం నైరాశ్యా దపిచ కలుషం విప్రియవశా
ద్వియోగే దీర్ఘేస్మిన్ ఝటితి ఘటనో త్తంభిత మివ
ప్రసన్నం సౌజన్యా, ద్దయిత కరుణై ర్గాఢ కరుణం
ద్రవీభూతం ప్రేమ్ణా తవ హృదయ మస్మిన్ క్షణ ఇవ
(ఉ రా. చ)

నీ హృదయము నైరాశ్యముచే నుదాసీనమై నిష్కారణపరిత్యాగముచే కలుషితమై ప్రియుని సౌజన్యమువలన ప్రసన్నమై ప్రియుని దుఃఖములచే గాఢకరుణమై యీ క్షణములో కరగిపోవు చున్నదా యనున ట్లుండెను.

29. ఆలస్యము

అతితృప్తి గర్భధారణము, వ్యాధి శ్రమ, మున్నగు వానిచే జనించినది క్రియాకరణమున కున్ముఖము కానిది అగు చిత్తవృత్తి విశేషము [క్రియామాంద్యరూప చిత్తవృత్తివిశేష మొండె] ఆలస్యము

కార్యకరణమున నిట అసామర్థ్యములేదు 'గ్లాని' యందు అసామర్థ్యము కలదు అందుచే నిది గ్లాని కన్న భిన్నము. ఇట కార్య నిర్వాహ వివేకమునకు లోటులేదు అది జడతయందుఁ గలదు అందుచే నిది జడతకన్న భిన్నము ఇట్లు ఆలస్య గ్లాని జడతలయందు మూఁడింటను కార్యకరణ రూపము అనుభావము తుల్యమైనను ఆల స్యమునకు ఉక్తరీతి గ్లాని జడతలకన్న భేదము కలదు

ఉదా .—

నిఖిలాం రజనీం ప్రియేణ దూరా
దుపయాతేన విబోధితా కథాభిః
అధికం న పారయామి వక్తుం
సఖి మాజల్ప తవాయసీ రసజ్ఞా

రాత్రియెల్ల దూరమునుండి వచ్చిన ప్రియునిముచ్చటల వినుచు మేలుకొనుటతో గడచిపోయినది అందుచే సఖి నీతో అధికము చెప్పు టకు ఇప్పుడు శక్తురాలను కాను ఊరక వదరకు నీకు నోరు నొప్పి లేదు నీ నాల్క అయోమయము (ఇనుపది)

ప్రియుఁడు వచ్చిన నాఁటి మఱునాఁడు మాటిమాటికి రాత్రి వృత్తాంతమును గూర్చి యడుగుచున్న సఖిలో రజనీజాగరణజని తాలస్యయుక్త ఒకానొకతె పల్కినమాట

ఇట రజనీజాగరణము విభావము అధిక సంభాషణా భావము అనుభావము ఆలస్యమునకును జడతకును పూర్వోక్త భేదము గాక ఇంకొక భేదమును కలదు జడత మోహపూర్వమో పరమో అగుట నియతము ఆలస్యమున నది ఉండదు

[శంక] పై యుదాహరణమున 'కథాభిః' ముచ్చటలలో అను శబ్దము స్వార్థమును బోధించి కృతార్థము కాలేదు ఏలన నాయిక 'నేలో్కని యుంటిని' - మాటలచే నేలో్కని కడపుట ఉపపన్నమే యైనను దూరమునుండి చిరకాలాగతుఁడైన ప్రియునితో రాతిరెల్ల మాటలతో ప్రియురాలు కడపిపుచ్చుట అను నర్థము అనుపపన్నము అందుచే 'కథా' (ముచ్చట) శబ్దమునకు 'సురత వ్యాపారశ్రమచే' అను నర్థము లెస్స అది లక్ష్యార్థము లజ్జచే నాయికకు అవివక్షితము - అవివక్షిత వాచ్యము సురతరూపమగు నవివక్షిత వాచ్య (లక్ష్యార్థముచే) శ్రమభావము ప్రతీయమాన మగుచున్నది దానికే ఇది యుదాహరణమగుఁగాక అని శంకాగ్రంథము

[సమా] శ్రమ ఆలస్యమునకు జనకము సురతశ్రమచే ఇట ఆలస్యము కలిగినది అందుచే శ్రమ ఆలస్యమునకు పరిపోషకమగును ప్రధానముకాదు ఆలస్యము శ్రమజన్య మగుటంజేసి శ్రమయు వ్యజ్యమాన మగుచున్నది అది అనివార్యము శ్రమాలస్యము లెల్లచోటుల సంకీర్ణములుగ నుండును ఆలస్యమునకు విభావ భేదము చెప్పి ఏమి ఫలమున్నది? అతితృప్త్యాది విభావములచేఁ గల్గిన యాలస్యము శ్రమజనితాలస్యము వివిక్తవిషయముగా నుండును అదే శ్రమ సంకీర్ణముగా నుండును అది తద్వైలక్షణ్యము

౩౨ అ సూ య

పరోత్కర్షాజన్యము పరనిందాదికారణము నగు చిత్తవృత్తి విశేషము అసూయ దీనినే అసహనము అసహిష్ణుత అని వ్యవహరింతురు

పరోత్కర్ష దర్శనము విభావము పరనింద (పరదోషోద్ఘాటనము) ఆదిశబ్దముచే బొమలు చిట్లించుట అవజ్ఞ బొడుగఱచుట మున్నగు క్రోధేంగితములు అనుభావములు

ఉదా .— రామోత్కర్షను సహింపని రాజుల మాటలు

కుత్ర శైవం ధను రిదం? క్వచాయం ప్రాకృతః శిశుః ?
భంగస్తు సర్వసంహర్తా కాలేనైవ వినిర్మితా

శివ సంబంధమైన యీ విల్లెక్కడ ? ప్రాకృతుడు ఈ పసినిసుఁ గెక్కడ ? సర్వసంహారకమైన కాలమే ఈ చాపమును భగ్న మొనర్చినది ఇది హరధనుర్భంగ మొనర్చిన రాముని లోకాతీత పరాక్రమమును సహింపని యచ్చటి రాజుల మాటలు ఇట సర్వోత్కృష్టము శ్రీమద్దాశరథి బలమును జూచుట విభావము ప్రాకృత శిశు పదగమ్యమైన నింద అనుభావము ఇది శుద్ధాసూయకు ఉదాహరణము

ఇదే అమర్షసంకీర్ణాసూయకు ఉదాహరణము —

ఉదయించుచున్న చంద్రుని మేఘాచ్ఛాదితుని జూచి ఒకానొకఁడు బ్రహ్మను నిందించు చున్నాఁడు —

తృష్ణాలోల విలోచనే కలయతి ప్రాచీం చకోరవ్రజే
మానం ముంచతి కించ కైరవకులే కామే ధను ర్ధున్వతి
మానే మానవతీజనస్య సపది ప్రస్థాతుకామే ఽ ధునా
ధాతః, కిన్ను విధౌ విధాతు ముచితా ధారాధరాడంబరః

సాయంసమయమున తూర్పుదిక్కును చకోరసముదయము వెన్నెల త్రావుటకు ఆశావిలోలలోచనములతో చూచుచుండఁగా మఱి కుముదసముదయము మునుపటి పానముద్రను (మూఁతి ముడుచుకొని యుండుటను) ఉజ్జగించుచుండ కాముఁడు నిజ చాపము సజ్జీకరించుచుండ మానినుల యలుకలు అప్పుడే వలప కోన గనకించుచుండ, ఇప్పుడు ఓ విధాతా చంద్రునికి మేఘా చ్ఛాదనము కలిగింప నీకు తగవా?

ఇచట సైతము విధాతయొక్క విశృంఖలతాదిదర్శనము విభావము అనుచితకారిత్వ నిందోద్ఘోషణము అనుభావము వీనిచే విధాత్రాలంబనము (విధాతృవిషయకము) కవిగతాసూయ వ్యక్త మగుచున్న దని చెప్ప శక్యము అయ్యెనను అది శుద్ధముగా — అసంకీర్ణముగా — అభివ్యక్తమగుట లేదు మఱి తనతో తుల్య మగు కార్యకారణములు గలుగుటంజేసి తనతో సమకాలమునందే అభివ్యక్త మగునట్టి యమర్షముతో శబలితమై (సంకీర్ణమై) యే అసూయ ప్రతీయమానమగుచున్నది వివిక్తముగా (శుద్ధముగా) కాదు విధాత యపరాధమున కవికి అమర్షము అభివ్యక్త మగునట్లు భగవంతుఁ డగు శ్రీరాముని యపరాధ మొంచు లేదు కావున వీరు లంకను శ్రీరాముని గూర్చి యమర్షము అభివ్యక్తమగుట లేదు అందుచే మొదటిది (కుత్రశైవమనునది) శుద్ధాసూయోదాహరణము

[శం] అచటగూడ శివధనుర్భంగమే రాముని యపరాధ మనుకొనఁగూడదా?

[సమా] మహోన్నతక్రియానిర్వర్తనము వీరులకు స్వభా వము కదా అందుచే శైవధనుర్భంగము మహావీరునకు శ్రీరాము నకు స్వభావము కాని అపరాధము కాదు. శ్రీరామునియందు

అపరాధము లేకున్న రాజులయందు అమర్ష ముండుటకు నిమిత్తము లేదు అసూయ యుండుటకు నిమిత్తము కలదు అందుచే అసంకీర్ణము అసూయాధ్వనియే కలదు.

[శం] రెండవపద్యములో అప్రస్తుతము చంద్రవృత్తాంతము ఎవనికో రాజకుమారునకు ఉత్కర్షము కలుగనుండ అది పోయి ఆకస్మికవిపదాపతనము ప్రస్తుతము ఇట చంద్రవృత్తాంతాప్రస్తుతాభిధానమున రాజకుమార వృత్తాంతము అను ప్రస్తుతము గమ్యమగుచుండుటంజేసి అప్రస్తుతప్రశంసాలంకారము కలదు దానివలన ప్రస్తుత రాజకుమారవృత్తాంతము అను వస్తువు వ్యక్తమగుచున్నది కావున అందుచే వస్తుధ్వనియే కలదు అసూయాధ్వని లేదు

[సమా] అట్లనరాదు రెండు ధ్వనులు నుండుఁగాక. వానికి విరోధము లేదు. [రెండును పరస్పరసాపేక్షకము లగునేని సాంకర్యము నైరపేక్ష్యమున సంసృష్టి] విరోధము నంగీకరించిన, మహావాక్యధ్వనికి [సమస్తప్రధాన వ్యంగ్యమునకు] అవాంతరవాక్య (ప్రధాన) ధ్వనులతోడను, ఆ యవాంతరవాక్యధ్వనులతో పద ధ్వనులతోడను సామానాధికరణ్యము లేకపోవలయును అనఁగా సంకరసంసృష్టిరూప వ్యవహారమున ఏకప్రబంధగతములై యుండుట ఎచ్చోటను లేకయే పోవలసివచ్చును అది ఆలంకారికమర్యాదకు విరుద్ధము. ఏలన ఆలంకారికులు ధ్వనుల సాంకర్యమును సంసృష్టికి అంగీకరించియున్నారు అందుచే ప్రస్తుత శ్లోకముల రెండు ధ్వనులుండుట అనుచితము కాదని సారము

32 చ ప ల త

అమర్షాది జన్యము వాక్పారుష్యాది జనకము నగు చిత్తవృత్తి విశేషము చపలత.

ప్రాచీనులును అట్లే లక్షణము చెప్పిరి —

అమర్ష ప్రాతికూ ల్యేర్ష్యా రాగ ద్వేషాశ్చ మత్సరః
ఇతి యత్ర విభావాస్యు రనుభావాస్తు భర్త్సనమ్
వాక్పారుష్యం ప్రహారా శ్చ తాడనం వధ బంధనే
తచ్చాపల మనాలోచ్య కార్యకారిత్వ ముచ్యతే

ఎందు అమర్షము ప్రతికూలత ఈర్ష్య రాగద్వేషములు మత్సరము ఇవి విభావములో బెదరింపు వాక్పారుష్యము ప్రహారము తాడనము వధ బంధనము ఇవి అనుభావములో ఆ చిత్త వృత్తి విశేషము చపలత యుక్తాయుక్త మాలోచింపక పని చేయుట దాని స్వరూపము

ఉదా. —

హిరణ్యకశిపుడు ప్రహ్లాదునితో నుడువుట —

అహితవ్రతి పాపాత్మన్ మైవం మే దర్శయాననమ్
ఆత్మానం హన్తు మిచ్ఛామి యేన త్వమసి భావితః

పాపాత్మా శత్రుసేవానిరత నా కిక నీమొగము చూపకు నీవు ఆత్మజుడ వైన కతమున నేను ఆత్మహత్య కిచ్ఛగించు చున్నాడను

భగవంతుడగు నారాయణునందు అనురక్తిని విఘటపఱుప నుపాయము గానక ప్రహ్లాదునితో హిరణ్యకశిపుడు పలికిన మాట లివి భగవద్ద్వేషోత్థితము పుత్రిద్వేషము విభావము ఆత్మహత్యేచ్ఛా పరుషవచనము అనుభావము ఇట హిరణ్యకశిపుని వర్తనమునందు అమర్షధ్వనియే కలదు చపలతాధ్వని కాదు అని వచింపరాదు ఏలన భగవంతునియందు ప్రహ్లాదుని యనురక్తి (ప్రాచీనము) కావున తజ్జన్యము హిరణ్యకశిపుని ప్రహ్లాదవిషయకామర్షమును ప్రాచీ

నమే కావలయును అమర్షము వలననే హిరణ్యకశిపుని యాత్మ వధేచ్ఛ పుట్టిన దను చో ఇంతకాలము ఆ కారణమున్నను (ఆ యాత్మ వధేచ్ఛా) కార్యము పుట్టకపోవుటేమి? ఇప్పుడు నవీనముగ నది పుట్టిన దగుటచే ప్రాచీనము అమర్ష తత్కారణ మనరాదు తొలి సారి క్రొత్తగాఁ బుట్టిన కార్యమునకు క్రొత్త కారణమే వలయును ప్రాఁతది అమర్షము ప్రయోజకము కానేరదు అట్టి క్రొత్త కారణమే చపలత అది ప్రాచీనమైన యమర్షకన్న విలక్షణ మైనదే. అద్య తనమైన యాత్మవధకారణముగా పనికి వచ్చినదే సిద్ధించుటచే - ఇందు చపలతాధ్వనియే అమర్షధ్వని కాదు

[శంక] చిరకాలికము అమర్షరూపకారణ మొకటి సిద్ధించి యుండఁగా దానిని కాదని ఆత్మవధేచ్ఛకు క్రొత్త కారణమును చపలతా రూపమును కల్పింప నేల? చిరకాలముగా సామాన్య రూపమున నున్న అమర్షము (అమర్ష సామాన్యము) కాకపోయిన, ఇప్పుడు ప్రకృష్టత నొందిన యమర్షము (అమర్షప్రకర్షము) ఆత్మ వధేచ్ఛారూప కార్యమునకు కారణము కాఁగాక అమర్షప్రకర్షవ్యంజ కమే ఆత్మవధేచ్ఛను వ్యక్తపఱచుఁగాక.

[సమా] అది పొసఁగదు ఏలన సాధారణమైన యమర్షముక కన్న ప్రకృష్టామర్షము విలక్షణము కదా ఈ ప్రస్తుతప్రకర్షకేమి కారణము? ఈ ప్రకర్షకును స్వాభావిక విలక్షణలక్షణత వలయుఁగదా అట్టి విలక్షణకారణములేక క్రొత్తగా ఆత్మవధేచ్ఛాకారణము పుట్టుట ఎట్లు సంభవించును? అట్టినవీనకారణము అన్యథానుపపత్తిచే చపలతయే అని సిద్ధము కావున నిది చపలతకే యుదాహరణము

33 నిర్వేదము

నీచపురుషులందు - ఆక్రోశనములును అధిక్షేపములును వ్యాధి తాడనము దారిద్ర్యము ఇష్టవిరహము పరసంపత్తిదర్శనము

మున్నగు వానిచేతను ఉత్తమపురుషులందు - తత్త్వజ్ఞానముచేతను జనించునది, రోదనము నిట్టూర్పు దీనముఖత్వము మున్నగు వానిని జనింపఁజేయునది యైన చిత్తవృత్తి విశేషము - విషయద్వేష పరపర్యాయము - నిర్వేదము

ఆలంబన భేదముచే నిర్వేదము ఇఱు తెఱంగుగా నున్నది. అందు నీచపురుషాలంబనమునకు ఆక్రోశాదులు అనుభావములు. ఆక్రోశము సామాన్యరూపము అధిక్షేపము విశేషరూపము, బ్రాహ్మణ వశిష్ఠ న్యాయమున వేఱుగాఁ జెప్పఁబడినది (౨) ఉత్తమ పురుషాలంబనక నిర్వేదమునకు ఉద్దీపనవిభావము తత్త్వజ్ఞానముచేఁ గల్గిన విషయవిద్వేషరూప చిత్తవృత్తి అనుభావములు రోద నాదులు

ఉదా :—

యది లక్ష్మణ సా మృగేక్షణా
న మదీక్షాసరణిం సమేష్యతి
అమునా జడజీవితేన మే
జగతా వా విఫలేన కిం ఫలమ్ ?

ఓ లక్ష్మణా ఆ యేణాక్షి సీత నా దృష్టిపథమునకు రాదేని, ఈ పాడు జీవితముచేఁగాని, ఈ విఫలమైన లోకముచేతఁగాని నాకేమి ప్రయోజనము ?

ఇట ప్రియావిరహము విభావము జీవనలోకనిష్ఫలత్వాభి ధానము అనుభావము ఈ శ్లోకమును నిర్వేదము కలదుకదా అని శాంతరసధ్వని యనరాదు నిర్వేదము శాంతరసమునకు స్థాయి భావము (౧), అది నిత్యానిత్యవస్తువివేకముచేఁ గల్గునది ఇఁట నన్ననో ఇష్టవిరహజనజన్యము ఇట్లు కారణభేద మున్నది

(౨) అదిగాక నిర్వేదస్థాయిభావము శాంతిరసాభిన్నము సామగ్రి సమకూఱినప్పుడు ఆ నిర్వేదస్థాయియే శాంతరసత్వ పరిణతిం గాంచును ఇటనో నిర్వేదము వ్యభిచారి మాత్రము స్థిరత్వముచే రసత్వ మొంద యోగ్యముకాదు ఇట్లు స్వరూపభేదమునుం గలదు ఏతత్పర్యాలోచనమై ఇది నిర్వేదభావధ్వనికే లక్ష్యమని నిగ్గు.

34. ర తి

శృంగారరసస్థాయి రతి దేవాదివిషయకము వ్యభిచారి భావము

స్నేహో భక్తిః వాత్సల్య మితిహ రతే రేవ విశేషః తుల్యయో యా పరస్పరం రతిః సస్నేహః అనుత్తమ స్యోత్తమే రతిః ప్రసక్తిః సైవ భక్తిశబ్దవాచ్యా ఉత్తమస్య అనుత్తమే రతి ర్వాత్సల్యమ్ ఏవమాదౌచ విషయే భావస్యైవ ఆస్వాద్యత్వ మితి ”
(హేమ కావ్యా నిపేక.)

స్నేహము - దీనిని వాత్సల్యమనియు భక్తి యనియు నందురు ఇవి రతియొక్క విశేషములే సమానులకు పరస్పర ముండెడి రతియే స్నేహము ఉత్తమునిపై చిన్నవారికి గల రతియే భక్తి ఉత్తమునకు చిన్నవారిపై గల రతియే వాత్సల్యము మఱియు నీ విధముగనే భావముయొక్క ఆస్వాద్యత్వభేదమును గుర్తెఱుగునది

ఉదా :—

భక్తుఁడు భగవంతునికి విన్నవించుకొనుచున్నాఁడు —

భవద్వారి క్రుధ్యజ్జయవిజయ దండాహతిదలత్
కిరీటాస్తే కీటా ఇవ విధిమహేంద్రప్రభృతయః
వితిష్ఠన్తే యుష్మన్నయన పరిపాతోత్కలికయా
వరాకాః కే తత్ర క్షపితపుర నాకాధిపతయః

ఓ మురారీ ఎచ్చట నీ ద్వారదేశమున బ్రసిద్ధులైన జయ విజయుల దండముల దెబ్బలచేఁ దలలు (కిరీటములు) పగిలిన బ్రహ్మేంద్రాదులు కీటములవలె యుల్లువలయి నీ కటాక్షపాతింపుఁ బేరాసతో నిలిచియున్నారు నిజమునకు అచట నాకాధిపతులు (స్వర్లోక దేశాధిపతులు) యమవరుణకుబేరాది వరాకుల దేమి లెక్క?

[శం] ఇట అవమానసహనము భగవద్ద్వారనిషేవణము, భగవత్కటాక్షాభిలాష అను మున్నగువానిచే బ్రహ్మాదిగతమగు భగవదాలంబనకమైన రతి అభివ్యక్త మగుట లేదు మఱి 'భగవ దైశ్వర్యము అవాఙ్మానసము'' అను వస్తువుమాత్రమే అభివ్యక్త మగుచున్నది అందుచే నిట వస్తుధ్వనియే కాని భావధ్వని లేదు

[సమా] అట్లైనంగూడ అట్టి భగవదైశ్వర్యవర్ణనము అను భావ మగును భగవంతుఁ డాలంబన విభావ మగును వానిచే కవి గతము భగవద్విషయము నగు రతిభావమే వ్యక్త మగుననుట అయుతము

ఇట రతిభావము భగదైశ్వర్యవస్తు వర్ణనప్రతీతికిఙనుక ప్రతీత మగుటచే అప్రధానము కావున అస్వరసము ఈ యుదాహర ణము అందు కేని ఇదియే ఉదాహరణాంతరము .—

భక్తుఁడు భగవంతునితోఁ బల్కుచున్నాఁడు :—

న ధనం న చ రాజ్యసంపదం నహి విద్యా మిద మేక మర్థయే
మయి దేహి మనాగపి ప్రభో, కరుణాభంగితరంగితాం దృశమ్

ఓ ప్రభూ ధనమును గాని సంపదను గాని విద్యను గాని వేడను. ఇది యొక్కటే అర్థించుచున్నాడను నాయందు ఇంచు కేని నీ కరుణాతరంగితదృష్టిని దయ సేయుము.

ఇందు ధనాఢ్యాపేక్షాశూన్యుఁడైన భక్తుని భగవద్దయా దృగంతపాతాభిలాష భగవంతునియందు అతని కున్న యత్యంతాను రక్తిని వ్యక్తము చేయుచున్నది కావున నిది రతిభావధ్వనికి ఉదాహరణము

ఉదాహరణాంతరము:—

పుత్రవిషయకరతికి ఉదా॰—

ఆలక్ష్యదంతముకులా వనిమిత్తహాసై
రవ్యక్త వర్ణరమణీయ వచః ప్రవృత్తీన్
అంకాశ్రయప్రణయిన స్తనయా న్వహన్తో
ధన్యా స్తదంగరజసా మలినీభవన్తి. (శాకుం)

కారణములు లేని హాసములచే కొలదిగా బయల్పడు దంత ముకుళములు గలిగినట్టియు వచ్చియురాని ముద్దుపల్కులాడునట్టియు, తొడలమీాద నాడుకొనుచున్న తనయుల గన్న తలిదండ్రులు వారి యొడలి దుమ్ముచే మాసిన వస్త్రములు గలవారై ధన్యులగు చున్నారు

ఇట్లు సంక్షేపముగా భావములు నిరూపితము లైనవి

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అథ 3 భావసంఖ్యా

ఎట్లు భావసంఖ్యా నియమము ?

[శంక] ముప్పది నాల్గని చెప్పఁబడెను అవిగాక మాత్సర్యము, ఉద్వేగము దంభము ఈర్ష్య వివేకము నిర్ణయము క్లైబ్యము, (పందతనము) క్షమ కుతుకము ఉత్కంఠ వినయము సంశయము ధార్ష్ట్యము మున్నగునవి అట నట లక్ష్యములందుఁ జూపట్టుచున్నవి కదా ఎట్లు ముప్పదినాల్గే అని భావసంఖ్య నిర్ధారణ చేయుట ఒప్పును ?

[సమా] ఎట్లన, ఉక్తభావములలో అవెల్ల నంతర్భవించును అందుచే పృథక్పరిగణనము అనుపపన్నము చెప్పినవే సరిపడును ఎట్లన అసూయకన్న మాత్సర్యమునకు త్రాసమునకన్న ఉద్వేగమునకు అవహిత్థకంటె దంభమునకు అమర్షమునకన్న ఈర్ష్యకు మతికన్న వివేక నిర్ణయములకు దైన్యమున కన్న క్లైబ్యమునకు ధృతి కన్న క్షమకు ఔత్సుక్యమునకన్న కుతుకోత్కంఠలకు లజ్జకన్న వినయమునకు, తర్కమునకన్న సంశయమునకు, చాపలమునకన్న ధార్ష్ట్యమునకును వాస్తవముగా సూక్ష్మభేదమున్నంగూడ అవి రెండొంటితో అవినాభావమున నుండుటం జేసియు ప్రాయికముగ ఉత్పత్తి నిమిత్తములు సమాన మగుటం జేసియు అనతిరిక్తముగ

నిశ్చితములు అట్లుగాక సూక్ష్మ సూక్ష్మతర భేదములఁ బురస్క-
రించుకొని వేర్వేఱఁ బరిగణింప నాగిన, మునివచనపాలనము అసం
భవమై ఉచ్ఛృంఖలత్వమునం జేసి అనౌచిత్యము వచ్చును
అందుచే మునివచనానుసారము ముప్పది నాలుగు భావములు
చెప్పఁబడినవి

ఈ సంచారి భావములలోఁ గొన్ని మఱికొన్నింటికి విభావ
ములును అనుభావములును అగును ఎట్లన ఈర్ష్య నిర్వేదమునకు
విభావము అసూయ అనుభావము చింత నిద్రకు విభావము
ఔత్సుక్యమునకు అనుభావము ఇట్టివి సహృదయులు స్వయముగ
నూహించుకొనఁదగును గ్రంథవిస్తరభీతిచే నేము చెప్పమైతిమి

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అధి 4 రసాభాసము

అనుచిత విభావాలంబనత్వము రసాభాసత్వము ఏ రసమునకు
ఆలంబన విభావము అనుచిత మగునో అందు రసాభాస మగును

విభావానౌచిత్య మన నేమి ?

ఇట మతభేదము కలదు ఒక మతమునుబట్టి విభావానౌచి
త్యము లౌకికవ్యవహారము వలన నెఱుంగఁదగును ఏ విభావము
విషయమున సహృదయలోకమునకు ఇది అనుచితమని బుద్ధి పొడ
మునో ఆ విభావము అనుచితము అని యర్థము ఈ మతమును మఱి
కొందఱు ఒప్పరు ఏలన, ఉక్త లక్షణము మునిపత్ని గురుపత్ని

రాజపత్ని మున్నగు వారిని గూర్చిన రతి అనుచితాలంబనక మగుట సహృదయహృదయోద్వేజక మని సంగ్రహించినను అందుచే నందు అవ్యాప్తి గ్రస్తము కాదు కాని ఇది నాయిక యొక్క బహు నాయక విషయక రతి స్థలమందును నాయికానాయకులలో ఒకరి యందు మాత్రమే రతియున్న స్థలమునందును అవ్యాప్తిజుష్టమైనది పై లక్షణమునుబట్టి ఆ రెండు చోటులు రసాభాస స్థలములు కాక పోవును ఏలన అట విభావగతమైన యనౌచిత్యము లేదు ఎల్ల స్త్రీ పురుషులు నాయికా నాయకులు విభావములు కాఁదగినవారే కదా మఱి యనౌచిత్య మెందుండి? అవియు రసాభాస గోచరము లైనవి ఉక్తస్థలములు రెండును రతియందున్నది యనౌచిత్యము బహునాయకగతరతి యనుచితము అట్లే ఒల్లని వారి విషయ మునను రతి యనుచితము అందుచే అనుచితము' అను విశేషణము విభావమునకుఁ గాక రతికి వేయునలెను అప్పుడు అనుచితప్రవృత్త రత్యాదిమత్త్వము రసాభాసత్వము అని లక్షణము ఏర్పడును (1) గురు పత్న్యాది విషయకరతియు (2) బహునాయక విషయము ఏక నాయికారతియు (3) నాయికా నాయకు లిరువురలో అనుభయ నిష్ఠము (ఏకతరనిష్ఠము) అగు రతియు అనుచిత మగుట రసాభాస మగును అవ్యాప్తి తలఁగును అని రెండవ మతము

మఱి అనౌచిత్యమున కేమి ప్రమాణము? మొదటి మతము నందు చెప్పినట్లే సహృదయలోకమే ప్రమాణము 'పానకమునందు ఇసుక పిచు పుడక మున్నగునవి పడిన పానముచేయు రసజ్ఞులకు ఎట్లు అరుంతుదము లగునో రసాస్వాదప్రతికూలము లగునో అట్లే కావ్యమునందును సహృదయులకు అనౌచిత్యము రసాస్వాదపరి పంథి యగును రసభంగహేతువు. అందుచేతనే అనౌచిత్యాదృతే

నాన్యత్ రసభంగస్య కారణమ్ అని ధ్వనికారులు నుడివి యున్నారు ఇది యుచితము' అని సహృదయలోకము దేనిని గ్రహించునో అది యుచితము ఇది అనుచితము అని సహృదయ లోకము దేనిని గ్రహించునో అది యనుచితము ఇట్లు సహృదయ ప్రపంచాసిద్ధత్వమే అనుచితత్వము ఇందు మతభేదము లేదు

పై లక్షణమున రత్యాది అనుచోట ఆది పదముచే సర్వ స్థాయి భావములకు గ్రహణము అందుచే శృంగారమే కాక కరుణా ద్యాభాసాదులందును కొఱఁత లేదు

రసాభాసము రసమా? భావాభాసము భావమా?

ఈ విషయమందు మతభేదములు కలవు

అందు ఒకమతమువారి ననుసరించి — రసాద్యాభాస మన రసముతో సామానాధికరణ్యము కాదు ఇట ఆది శబ్దముచే భావము నకు గ్రహణము అట్లే భావాభాసత్వ మన భావముతో సామానాధి కరణ్యము కాదు అనఁగా రసభావము లున్నచోటనే తదాభాస ములు నుండవు అని అర్థము ఏలన రసము నిర్మలము నిర్దుష్టము రసాభాస మన్న దోషయుక్తరసము దుష్టరసము నిర్దుష్టరసము ఎట్లు ఏకాధికరణమున (ఒక్కచోట) నుండును? దుష్టహేతువు హేత్వా భాస మనఁబడును సద్ధేతువును అసద్ధేతువును ఏకాధికరణమున మండవుకదా అట్లే ప్రకృతమునందును అందుచే రసము రసా భాసము కాదు, అని ఇది మొదటి మతము.

ఇఁక రెండవ మతము - దోషయుక్తమైన మాత్రమున స్వరూపహాని లేదు గుఱ్ఱము గ్రుడ్డిదో కుంటిదో యైన గుఱ్ఱము కాకపోవునా? దోషయుక్త మగు గుఱ్ఱము గ్రుడ్డిగుఱ్ఱము, కుంటి గుఱ్ఱము అందును అశ్వత్వమునకు సేగి లేదు కదా అట్లే రసము

భావము దుష్టత్వము నిమిత్తమునం జేసి రసత్వమును భావత్వమును గోల్పోవు రసాభాసమని భావాభాసమని మాత్రము వ్యవహారము కలవి యగును రసవదవభాసమాన మగుట రసాభాసము రసమే, భావవదవభాసమాన మగుట భావాభాసము భావమే రెండును సహృదయాస్వాదయోగ్యములే. అందుచే మహాకవులు ఒక్క కావ్యమునందే రసములు రసాభాసములు భావములు భావాభాసములునుంగూడ వర్ణించియున్నారు ఇది సిద్ధాంతము

రసాభాసము ముత్తెఱంగుగా పైని చెప్పఁబడినది —
(1) రతికి అనుచితవిభావత్వము (2) రతికి బహువిషయత్వము (3) రతికి అనుభయనిష్ఠత్వము వీనికిఁ గ్రమముగా నుదాహరణములు చెప్పఁబడుచున్నవి

రతి అనుచితాలంబనక మగుటకు ఉదా —

రాజరమణీకాముకుని వృత్తాంతము —

శతే నోపాయానాం కథ మపి గతః సౌధశిఖరం
సుధాఫేనస్వచ్ఛే రహసి శయితాం పుష్పశయనే
విబోధ్య క్షామాంగీం చకితనయనాం స్మేరవదనాం
సనిశ్వాసం శ్లిష్య త్యహహ సుకృతీ రాజరమణీం

ఎన్నెన్నో యుపాయముల ఎట్లెట్లో సౌధశిఖరము చేరి రాతిని నీటి నురుగునంటి తెల్ల పూలపాన్పున పరున్న దానిని, కృశాంగిని నిదురలేపి ఆ చకితనయనను స్మేరాననను రాజరమణిని అహాహా పుణ్యాత్ముఁడతఁడు (ఆ కాముకుఁడు) ఎంతయాతురతతోఁ గౌఁగిలించుచున్నాఁడు?

ఈ శ్లోకమునందు ఆలంబన మగు రాజరమణి ప్రణయము పరపురుష విషయ మగుట అనుచితము రాత్రివేళ ఏకాంత ప్రదేశము

ఉద్దీపన విభావములు సాహసించి రాజాంతఃపురప్రవేశ మొనర్చుట, ప్రాణములం దుపేక్ష నిట్టూర్పుపుచ్చుట ఆశ్లేషించుట మున్నగు నవి అనుభావములు శంకాదులు సంచారులు ఈ రాజాంగనారతి పరపురుషగత మగుట, లోకశాస్త్రనిషిద్ధాలంబనక మగుట రసము రసాభాసమైనది

[శంక] ఇట చకితనయనామ్" అను విశేషణముచే పర పురుష స్పర్శాత్రాసము అభివ్యక్త మగుచున్నది కావున రతి యను భయనిష్ఠ మగుట అను రసాభాసప్రకారాంతరము దీనిని ఏల చెప్పరాదు

[సమా] ఇచట రాజాంగన ఆ వయసుకానియందు చిరాసక్త పరపురుషునకు అంతఃపురము సొచ్చుట అసంభావనీయ మగుటఁ దొలుత అతనిని తన ప్రియునిగా గుఱుతింపకొనక, ఎవఁడు వీఁడు నన్ను మేల్కొల్పు చున్నాఁడు ? అని భయపడుట ఉచితమే వెంటనే పరిచయాభివ్యక్తిచే అతఁడే ఇతఁడు నా ప్రియుఁడు నాకై ప్రాణములంకూడ తృణీకరించివచ్చినాఁడు' అని తెలిసికొనుటచే నుత్పన్నమైన హర్షమును సూచించునదై నాయికగతరతిని స్మేరవదనాం' అను విశేషణము వ్యక్తీకరించు చున్నది అట్లే 'క్షామాంగీ అను విశేషణమును అతని విరాళిచే ఆ యింతి క్రుస్సి యున్నదని, "స్వచ్ఛే పుష్పశయనే' అను విశేషణముచే తద్విష యకస్మరతాపోపశమనముగా నవపుష్పతల్పముపైఁ బవళించు చున్నదనియునుంగూడ నాయికగతము తత్కాముకవిషయము నగు రతి సూచితము అందుచే నిది అనుచితవిభావనిమిత్తకరసాభాస ప్రకారమునకే ఉదాహరణము

ద్వితీయ ప్రకారమునకు ఉదా —

ఒకానొక పుంశ్చలి చరిత్రము వర్ణితము :

భవనం కరుణావతీ విశన్తీ
గమనాజ్ఞాలవలాభలాలసేషు
తరుణేషు విలోచనాబ్జమాలా
మథ బాలా పథి పాతయాంబభూవ

దయగలది యొక జవ్వని తనయింట ప్రవేశించుచు [తన వెనువెంట నంతదనుక వచ్చి] మరలిపోవ తన యనుమతిలేశము లభించునాయని యువ్విళ్లూరుచున్న వయసుకాండ్రదారికో తనదృగబ్జ మాలను పడవైచినది ఇచట నొకానొక యువతి ఎచటనుండియో తన యింటికి వచ్చుచుండెను దారిలో తదీయ రూపలావణ్యము తమ చిత్తము ముచ్చిలింప యువలు కొందఱు దాని వెంటాడి రాసాగిరి ఆ లేమ ఇలు చేరి లోపల ప్రవేశించుచుండ ఆ కోడెకాండ్రు ఆ సమయమున తమ సేవాసాఫల్యమును విన్నవించుకొనుటకై తాము మరలిపోవ నా పొలఁతి యనుమతిలేశము లభించునా యని యువ్విళ్లూరుచుండిరి అనఁగా తమ సేవను మనస్కరించి తమవైపు కటాక్షించిన తమరు కృతార్థుల మగుదు మని యెంచిరి ఆ కొమ్మయు తమకొఱకు వారంత శ్రమపడిరే యని దయచే వారికి మఱలి పోవుటకు సెలవు దయచేయునట్లు నివేదించు నిజవిలోచనాంబుజ మాలను వారి దారిలో పడవైచెను - వారివైపు ఒకించుకసేపు అవలోకించెను అనిభావము

ఇట తరుణులు పలువురు ఆలంబనవిభావము నాయిక, తద్రూపసౌందర్యములు ఉద్దీపన విభావములు దృష్టి నిక్షేపము అనుభావము మధుర దృష్టి నిక్షేప రూపానుభావ వర్ణనము వలన

నభివ్యజ్యమాన మగు నాయికాగతరతి తరుణులందు అను బహువచనముచే బహునాయకవిషయకముగ గమ్యమాన మగు చున్నది అందుచే నిది రసాభాస మైనది

ఉదాహరణాంతరము — (కావ్యదర్పణమునుండి)

సుమః కం వామాక్షి క్షణమపి వినా యం నరమసే
విలేభే యః ప్రాణాన్ రణముఖమఖేయం మృగదృశే
సులగ్నే కో జాతః శశిముఖి య మాలింగసి బలాత్ ?
తపశ్శ్రీః కస్యైషా మదననగరి ధ్యాయసి తు యమ్ ?

మే మెవ్వాని స్తుతింతుము ? వామాక్షీ ఒక్కక్షణమైన నీ వెవని వీడియుండలేవో వానినా? రణయజ్ఞమునం దెవ్వరు ప్రాణ మును వీడి నిన్ను వరించెనో వానినా? ఇప్పుడు నీవు బిగికౌగిటఁబట్టి యుంటివో వానినా ? లేక యెవని తపస్సు పండినది ఓసి మదన సామ్రాజ్యమా నీ వెవ్వని గురించి ధ్యానించుచుంటివో వానినా? - యెవ్వని స్తుతింతుము ?

తాంబూల పుష్ప పటవాస నవాంగరాగైః
సాచీకృతాక్షివలనై ర్భుజవేల్లనైశ్చ
చాటూక్తిభి ర్విటజనా ననురంజయు స్సీ
కేయం పున ర్ద్రుశే మన క్కి మమామృతేన ?

(శ్రీశైల రసచంద్రికా)

తాంబూలము పూవులు కస్తూరి గంబూర మొదలగువాని దానములచేతను క్రేగంటిచూపులచేతను భుజములతోఁ జుట్టవేసి కొనుటచేతను సరసోక్తులచేతను విటకోటి ననురంజింపఁజేయు నీమె యెవరో, నావంక నొక్కసారి చూచి యమృతముచే నన్ను దడుపుచున్నది.

పరస్పరేణ క్షతయోః ప్రహార్త్రో
రుత్క్రాంత వాయ్వోః సమకాల మేవ
అమర్త్య భావేపి తయో శ్చిరాప్తి
దేశాప్సరః ప్రార్థితయో ర్వివాదః (రసార్ణవ)

ఇరువురు వీరు లొకరొక్కరి గొట్టుకొనుచు నొక్కసారిగానే ప్రాణములు విడిచి వీరస్వర్గము నంది యందును నొక్క యప్సరసనే వలచి దానికై యిరువురును గ్రుద్దులాడుకొనసాగిరి

తృతీయ ప్రకారమునకు ఉదా —

నవోఢారహఃప్రవర్తనము —

భుజపంజరే గృహీతా
నవ పరిణీతా వరేణ వధూః
తత్కాల జాల పతితా
బాలకురంగీవ వేపతే నితరామ్

క్రొత్త పెండ్లికూఁతురు (ఇంకను ప్రణయము హృత్క్షేత్రమున నంకురింపనిది) వరుఁడు భుజపంజరమునఁ గైకొన - బిగ్గఁగౌఁగిలింప - అప్పుడే జాలమందు వలలోఁ జిక్కిన బాలకురంగివలె మిక్కిలి వణంకుచున్నది

ఇట నవవధువునకు రవంతేనియు రతిస్పర్శ లేనందున రతి అనుభయ నిష్ఠము.

అనుభయనిష్ఠ మనఁగా ఒకరికి రతియు ఇంకొకరికి రత్యభావము నుండుట అభావము నలుతెఱంగులు (1) ప్రాగభావము (2) అత్యంతాభావము (3) అన్యోన్యాభావము (4) ప్రధ్వంసాభావము అని పై నిచ్చిన (భుజపంజర శ్లోకము) ప్రాగభావమునకు ఉదాహరణము నవవధువు, ఇప్పటి కింకను ప్రేమ యుత్పన్న

వఁగుటకుఁ గారణములేదు ఇఁక కలుగఁ బోలును జానకికి రావణు నందు రత్యత్యంతాభావము అట్లే ఇట్టిచోట రసము పుట్టనప్పుడు రసాభాస వచనము సముచితముగఁ జూపట్టుటలేదు అట్లే రసార్ణవ సుధాకరమునఁ జెప్పబడినది తత్ర ప్రాగభావదర్శనాదికార కేషు సంభావితేషు రాగోత్పత్తి సంభావనాయ నాభాసత్వమ్ ఇతర యోస్తు కారణసద్భావేపి రాగానుత్పత్తే రాభాసతైవ అట్లే మారయువతుల యందు జినునకును ఉదా —

ధ్యానవ్యాజ ముపేత్య చింతయసి కా మున్మీల్య చక్షుః క్షణం
పశ్యానంగశరాతురం జన మిమం పాతాపి నోరక్షసి
మిథ్యాకారుణికోసి నిర్ఘృణతర స్త్వత్తః కుతోఽన్యః పుమాన్
సేర్ష్యామారవధూభి రి త్యభిహితః శ్శౌద్ధోదనిః పాతు నః

(నాగానందము)

ఓ బుద్ధుడా ధ్యాన మను మిష పెట్టి కనులు మూసికొని యెవతెను ధ్యానించుచున్నావు ? మన్మథు బాణములచే బాధ చెందిన మమ్ము నొక పర్యాయము చూడుము రక్షకుడ వైనను రక్షింపకుంటివి దయామయుడు అను పేరు నీకు వ్యర్థము నీకంటె కఠినాత్ముఁడైన మానవు డెందుగలడు ? ఈ విధముగా నసూయతో గూడిన మన్మథ స్త్రీలచే తూలనాడబడెడి బుద్ధుఁడు మిమ్ములఁ గాపాడు గాక.

రతి ప్రధ్వంసాభావమునకు —

గతప్రేమావేశే ప్రణయబహుమానే విగళితే
నివృత్తే సద్భావే పర ఇవ జనే గచ్ఛతి పునః
ముహుః ప్రేక్ష్యోత్ప్రేక్ష్య ప్రియసఖి గతాం తాంశ్చదివసాన్
నజానే కోహేతు ర్దళతి శతధా య న్న హృదయమ్

(అమరుకము)

ఓ ప్రియసఖీ ప్రేమావేశము నశింపగా ప్రణయగౌరవము పోయిన దగుచుండగా సద్భావము లోపించి ప్రియజనుడు పరాయి వానివలె నటించుచుండ మాటిమాటికి తలచి తలచి జరిగిపోయిన యా మధురమైన దినములను స్మరించి నా హృదయము నూరు ముక్కలుగా నేల బ్రద్దలగుటలేదో నా కెఱుగరాకున్నది

ఈ చెప్పిన రసాభాసత్రయమును గూర్చి ప్రాచీనప్రమాణము ఇట్లు:—

(1) ఉపనాయక సంస్థాయాం (2) మునిగురుపత్నీగతాయాంచ (3) బహునాయకవిషయాయాం రతౌ తథానుభయనిష్ఠాయామ్

ఇట మునిగురుశబ్దములు ఉపలక్షణము లగుట రాజశిష్యాది అగమ్యపత్నికు లైనవారి కెల్ల గ్రహణము నాయికరతి ఉపనాయక విషయమైనను నాయకరతి మునిగురు రాజాది సర్వాగమ్య స్త్రీ విషయకమైనను అది రసాభాసప్రకారములలో నొకటి (2) నాయికరతి బహునాయకగత మైన అది రెండవ ప్రకారము (3) అట్లే రతి నాయికానాయకులలో నొకరియందే యుండి మఱొకరియందు లేకపోవుటచే అనుభయనిష్ఠమైన అది మూఁడవ ప్రకారము

3

ఇట ఏది వ్యంగ్యము - రసమా? రసాభాసమా ?

వ్యానమ్రా శ్చలితాశ్చైవ
స్ఫారితాః పరమాకులాః
పాండుపుత్రేషు పాంచాల్యాః
పతన్తి ప్రథమా దృశః

ద్రౌపది తొలిచూపులు పాండుపుత్రులందు వరుసగా ధర్మ రాజునందు వినమ్రములు భీమునందు చంచలములు అర్జునునందు వికసితములు, నకులసహదేవులందు అత్యౌత్సుకములునై ప్రసరించినవి

ఇట ధర్మాత్మత్వనిమిత్తమున వ్యాపమ్రమము లగుటచే యుధిష్ఠిరునందు భక్తిని స్థూలాకారత్వ నిమిత్తమున చలితత్వముచే భీమునందు త్రాసమును, లోకాతీత శౌర్యనిమిత్తమున వికాసముచే అర్జునునందు హర్షము పరమసౌందర్యనిమిత్తమున పరమాకులత్వ ముచే నకులసహదేవులందు ఔత్సుక్యమును ద్రౌపది దృష్టులు స్ఫురింపఁజేసినవి అందుచే ఆమె రతి బహుపురుషవిషయముగా నభివ్యక్త మగుచున్నందున రసాభాసమే అని నవీనులు నుడువుదురు మఱి ప్రాచీను లన్ననో రతి (అన్యవస్థిత) అపరిణేతృ బహునాయక విషయక మైనచో రసాభాస మగునని వచింతురు పంచమవేదము మహాభారతమును ఔచిత్యమునకుఁ బ్రమాణముగా నంగీకృతమైన లోకమును ప్రాచీనమతపరముగనే ఉన్నది అందుచే నది సాధీయ మని భావము (అన్యతర స్యానేకాలంబనే రతీ రసాభాస ఏవ అత్ర వ్యవస్థితత్వ మిత్యనేకాలంబనే విశేషణీయం ఏవంచ అన్య తరస్య అవ్యవస్థితానేకాలంబనే రతీ రసాభాసః ఇతి సిద్ధం తేన కృష్ణపాంచాల్యాదీనా మనేక విషయాపి రతిః నాభాసః ఏవంచ అవ్య వస్థిత బహు కామినీక వైశిక తథావిధ బహుకాముక వేశ్యాంతర విషయకమేవ తథాభాసత్వ మితి మంతవ్యః' అని రసచంద్రిక]

రసాభాస విభాగము

శృంగారమువలెనే శృంగారాభాసమును సంయోగము విప్ర లంభ మని ఇఱుతెఱంగు అట్లే కడమ రసముల విభాగములఁబట్టి

యాభాసములందున ద్విభాగములు ఊహ్యములు సంయోగమునకు నవ్యమతానుసారము వ్యానమ్రా" శ్లోకమును ప్రాచీనమతాను సారము భుజ పంజరే ' అను శ్లోకమును ఉదాహరింపఁబడినవి ఇదే విప్రలంభాభాసమునకు ఉదా

సీతా విరహ వ్యాకులుఁడైన దశముఖుని దశ వర్ణితము —

వ్యత్యస్తం లపతి క్షణం క్షణ మథో మౌనం సమాలంబతే
సర్వస్మిన్ విదధాతి కిం చ విషయే దృష్టిం నిరాలంబనామ్
శ్వాసం దీర్ఘ మురీకరోతి న మనా గంగేషు ధత్తే ధృతిం
వైదేహీకమనీయతాకబలితో హా హంత లంకేశ్వరః!

అయ్యో లంకేశ్వరుఁడు రావణుఁడు జానకీసౌందర్యపర వశుఁడై ఒక క్షణము అసంగతముగాఁ బలుకును ఆవలి క్షణము మౌనము దాల్చును సర్వ (ప్రియాప్రియ) విషయములందును నిరాలంబన(శూన్య)దృష్టి పెట్టును నిట్టూర్పు పుచ్చును అవయ వములందు ఇంచుకేని (ధైర్యము) వహింపఁడు

ఈ శ్లోకమునందు ఆలంబన విభావము సీత. సీతా విషయక లంకేశ్వర గత విప్రలంభరతి అనుభయనిష్ఠ మగుటచేతను ఆమె జగద్గురు(జగదీశ్వరు)డైన రామచంద్రుని పత్నియగుట అను చితాలంభన మగుట చేతను - ఇట్లు ఇఱుతెఱంగుల యనౌచిత్యముచే విప్రలంభరతి రసాభాసమైనది అది (రావణుఁడు) ఒక క్షణము అసంగతముగాఁ బల్కుటచే ఉన్మాదము పై క్షణమే అనుటచే శ్రమము, సర్వవిషయములందు శూన్యదృష్టిచే మోహము నిట్టూ ర్పుచే చింత ఇంచుకేని స్థైర్యములేక వ్యాధి అను వ్యభిచారిభావ ములు వ్యజ్యమానములైన భావాభాసములచే పరిపోషితమై ప్రాధా న్యముగ విప్రలంభ రత్యాభాసధ్వనివ్యపదేశమునకు లక్ష్యమగును

ఇక్లే (౧) శృంగార రసమునకుంబోలె-కడమ రసములకునుం గూడ రసాభాసత్వము పొనకును ఎట్లన (౨) కలహశీలురగు కుపుత్త్రులు ఆలంబనముగా వీతరాగాదులం దున్నట్లు వర్ణ్యమానమగు శోకస్థాయి అనౌచిత్యమునంజేసి కరుణరసాభాసము (౩) బ్రహ్మ విద్యకు అధికారము లేని చండాలాదులందున్నట్లు వర్ణ్యమానమగు నిర్వేదస్థాయి అనౌచిత్యమువలన శాంతరసాభాసము (౪) కదర్య (హేయ) కాతర (భీరు) పురుషులం దున్నట్లుగాని పిత్రాద్యాలంబనముగాఁ గాని వర్ణింపఁబడిన (౪) క్రోధస్థాయి అనౌచిత్యమువలన రౌద్రరసాభాసము (౫) ఉత్సాహస్థాయి అనౌచిత్యము వలన వీరరసాభాసము (౬) ఐంద్రజాలికాదులు ఆలంబనముగా వర్ణింపఁబడిన విస్మయస్థాయి అనౌచిత్యమువలన అద్భుత రసాభాసము (౭) గుర్వాద్యాలంబనముగా వర్ణింపఁబడిన హాసస్థాయి అనౌచిత్యము వలన హాస్యరసాభాసము (౮) మహావీరాలంబనముగా వర్ణింపఁబడిన భయస్థాయి అనౌచిత్యమువలన భయానకాభాసము (౯) యజ్ఞ పశువుయొక్క వసాసృఙ్మాంసాద్యాలంబనముగా వర్ణింపఁబడిన జుగుప్స స్థాయి అనౌచిత్యమున బీభత్సరసాభాసము గ్రంథ విస్తర భీతిచే ఉదాహరణములు ఇట చెప్పలేదు సుధీజనులు ఊహించుకొనఁదగును

(భావప్రకాశము. 132 – 133 పుటలు భావాభాసములు)

రౌద్రాభాసమునకు ఉదా :—

రక్తోత్ఫుల్లవిశాలలోల నయనః కమ్పోత్తరాంగో ముహు
ర్ముక్తాకర్ణ మపేతభీ ర్ధృత ధనుర్బాణో హరేః పశ్యతః
ఆధ్మాతః కటుకోక్తిభిః స్వ మసకృద్దోర్విక్రమం కీర్తయ
న్నంసాస్ఫోటపటు ర్యుధిష్ఠిర మసౌ హన్తుం ప్రవిష్టోర్జునః

'ధర్మజుని కటు వచనములచే దగ్ధుఁడై అర్జునుఁడు ఎఱ్ఱని వికసించిన వెడంద కన్నులు త్రిప్పికొనుచు శిరఃకంపము సేయుచు కర్ణుని వదలి, భయము మాని కేల ధనుర్బాణములంబూని కృష్ణుని కంటియెదుర తన శౌర్య విక్రమమును మాటికిఁ జెప్పుకొనుచు, భుజశిరమును గట్టిగా చఱచుకొనుచు ధర్మరాజుం బరిమార్చుటకు (ధర్మజుఁ డున్న చోట) ప్రవేశించినాఁడు

వీర రసాభాసమునకు ఉదా :—

గురోర ప్యవలి ప్తస్య కార్యాకార్య మజానతః
ఉత్పథం ప్రతిపన్నస్య కార్యం భవతి శాసనం

మదించి యుక్తాయుక్త వివేచనములేక యుత్పథగామియైన గురుని శాసనముకూడ చేయక తప్పకున్నది

ఇట లక్ష్మణుని యుత్సాహము దశరథునియందు ప్రవృత్త మగుట అనౌచిత్యమున వీరరసాభాసము (కా దర్పణము 135)

ఇట్లే రసాభాసములవలెనే అనౌచిత్య విషయములలోననఁగా అనుచితాలంబనములుగాఁ గాని అనుచితాశ్రయనిష్ఠములుగాఁ గాని వర్ణ్యమానము లగుచో హర్షాదులు భావములు భావాభాసము లగును

ఉదా—

సర్వేఽపి విస్మృతిపథం విషయాః ప్రయాతాః
విద్యాపి ఖేదకలితా విముఖీ బభూవ
సా కేవలం హరిణశాబకలోచనా మే
నైవాపయాతి హృదయా దధిదేవతేవ

ఇప్పుడు ప్రియావిరహమునం జేసి (ఇంద్రియానుభవనీయములు] విషయములెల్ల విస్మృతి పదమును బట్టినవి అపార [గురు

కుల] క్లేశాసాదితము విద్యయు పరాంగనా ప్రాయోమాననీరసోర్గ్యా కషాయితాశయ ' యగు కులాంగనవలె ఖేదమొంది పెడమొగము పెట్టినది ఆ బిభ్వకుక్కురంగశాబనయన యొక్కతే అసిదేవతవలె నా హృదయమునఁ దిరముగ నెలకొని యెడఁగాయకున్నది

గురుకులమున విద్యాభ్యాస సమయమందు గురుకన్యయొక్క లావణ్యము [అగమ్యమైన యన్యకన్య లావణ్యముగాని] చిత్తము మ్రుచ్చిలింప దానినే స్మరించుచున్న ప్రవాసిమాటలు ఇచట చిరసేవితములు స్రక్చందనాది భోగవిషయములందును చిరోపాసిత మైన విద్యయందును తన్ను విడిచిపోవుటం జేసి కృతఘ్నత్వమును ఆ నాయిక యన్ననో అల్పకాలానుభూతయైనను నిరతస్మృతి గోచర యగుటచే తన్ను పరిత్యజించిపోవలేదు కావున కృతజ్ఞత్వమును స్ఫురించుచుండుటచే వ్యతిరేకాలంకారము ధ్వనించుచున్నది [ఉప మానమున కన్న నుపమేయమునందు ఆధిక్యము వర్ణించిన వ్యతి రేకాలంకారము ఇట విద్యాభోగవిషయములు ఉపమానము నాయిక ఉపమేయము] కాని ఇట వ్యతిరేకాలంకారము ప్రధానము కాదు ఏలన ఆ యలంకార ధ్వని ఆ నాయిక యొక్క లోకోత్తర లావణ్యస్మృతినే పోషించుచున్నది అందుచే అది స్మృతిరూప భావమునకే అంగమగును గురుకన్యారూపానుచితాలంబనక మగుట ఆ స్మృతిభావధ్వని భావాభాసధ్వని యైనది దానికే ఈ శ్లోకము ఉదాహరణము [అప్రధానమగు నలంకారధ్వనికిఁ గాదు]

ఈ శ్లోకమునందు భావాభాసమునకు ఉక్తరీతిని అలంకారము అంగమైనది వస్తువ్యంగ్యమును అంగమగును ఎట్లన — అసిష్ఠాత్రియైన దేవత స్వాధిష్ఠానము నెన్నఁడును త్యజింపనట్లు ఈ కన్యయు నా స్మృతిపథమును త్యజింపకున్నది ' అని వాచ్యోప

మాలంకారము పరిత్యాగాభావముయొక్క సార్వకాలికత్వము సర్వాధికత్వమును అను వస్తురూపవ్యంగ్యమును స్ఫురింపఁజేయుచు స్మృతిభావమునకు పోషకముగా నున్నది ఆ వస్తువ్యంగ్యమును స్మృతిభావాభాసధ్వనికి అంగమగును అందుచే ఇట భావధ్వనికే ప్రాధాన్యము

పై శ్లోకము భావాభాస మగుట రెండు తెఱఁగుల, (1) అనుచితాలంబనక మగుటచేత (2) అనుభయనిష్ఠమగుటచేతను కాని శ్లోకమునందలివి నాయికాపరిణేతమాటలని ప్రకరణముచే సిద్ధమైన నో అనుచితాలంబనకము కాకపోవును అప్పుడు భావాభాసమునకుఁగాక భావధ్వనికే ఉదాహరణ మగును

3 ప్రాచీనమత పర్యాలోచనము

(1) ఏకత్రానురాగశ్చే (2) త్తిర్యఙ్మ్లేచ్ఛగతోపివా
(3) యోషితో బహుసక్తిశ్చేత్ - రసాభాస స్త్రిధా మతః

ఈ కారికయందుఁ జెప్పబడిన రసాభాసప్రకారత్రయమును బహుశాస్త్రనిష్ణాతలు ఆలంకారికచూడామణులు శ్రీమాన్ వేదాల తిరువేంగళాచార్యులవారు స్వరచితధ్వన్యాలోకాంధ్రవ్యాఖ్యానమున కూలంకషముగ పరిశీలించినారు తత్సారసంగ్రహ ప్రతి ఇట చెప్పఁబడుచున్నది

(1) ఏకత్రానురాగశ్చేత్ - నాయికానాయకులలో నొకరికి మాత్రమే యనురాగమున్న అది రసాభాసములలో నొక ప్రకారము నాయికా నాయకులలో నొకరి రూప గుణ జాతి నీత్యవస్థలు ఇంకొకరి యభిలాషకు (రతికి) అనుద్బోధకములుగా ప్రతిబంధకముగా నొండె కవివర్ణితము లగుచో - అనుచితములుగా సహృదయులకు స్ఫురించుచో - అప్పుడు అందు రతి ఏకతరనిష్ఠ మగుట

శృంగారరసాభాస మగునని అభిప్రాయము [రూపాదివైపరీత్యమున్న మాత్రన చాలదు నిగమశర్మ ఒక నల్లమాలదానిని కామించెను గదా దశకుమారచరిత్రలో ధూమిని ఓతరూపువానిని కామించెను. అవి రత్యనుద్బోధకములుగా ప్రతిబంధకములుగా వర్ణితములు కావలెను సహృదయులకు స్ఫురింపవలె నొండె] వరూథినీరూప లావణ్యోజ్జ్వలవేష హావభావాదు లెల్ల ముఖ్యప్రవరుని (సత్యప్రవరుని) నీతిచే తద్రతికి అనుద్బోధకములైనవి వరూథిని యభిలాషకుఁ బ్రతికూలములైనవి అందుచే వరూథినీముఖ్యప్రవరాఖ్యకథయందు రతి కేవల నాయికామాత్రనిష్ఠమైనది అందుచే శృంగారాభాసము అట్లే భారతమున అర్జునుని నీతి సౌశీల్యము ఊర్వశి యభిలాషకు ప్రతిబంధకమైనది ఊర్వశియొక్క దివ్యసౌందర్యము దివ్యసముజ్జ్వలవేషము హావభావాదులు అర్జునునెడ రత్యుద్బోధకములు కాక రిక్తయైనవి అందుచే నిటను రతి ఏకమాత్రనిష్ఠమైనది అందుచే శృంగారాభాసము అట్లే సీత పాతివ్రత్యము రావణుని రతి విషయమున ద్రౌపది సతీత్వము కీచకుని రతి విషయమున అనుద్బోధకములును ప్రతిబంధకములు నైనవి రావణ కీచక మాత్రనిష్ఠము లైనవి

అట్లే చిత్రాంగి వేషభాషా రూపాదు లెల్ల మాతృభక్తి భూయిష్ఠుని సారంగధరుని చిత్తమున నభిలాషను ప్రతిబంధించెను ఇట్లే గుణము జాతియు ప్రతిబంధకమై అభిలాషను ఉద్బోధింపదు అవస్థకు ఉదాహరణము కళాపూర్ణోదయములో సుగాత్రి యలంకృతావస్థ శాలీనునకు అభిలాష నుద్దీపింపఁజేయక ప్రతిబంధించెను అట్లే దశకుమారచరిత్రలో మానసవేగుఁడు అవంతిసుందరిపై నెంతి యభిలాషతో వచ్చినను ఆ సుందరిని రాజహంసపరిష్వంగమున రతిసుప్తావస్థయం దీక్షింప అతని యభిలాష నశించెను ఇచ్చోటుల

నల్ల రసాభాస ముప్పతిల్లుటకు కారణము సాయి అవిచ్ఛిన్న ప్రకర్ష నొందకపోవుట అభిలాష రతిస్థాయి యగుటకు సజాతీయ విజాతీయ భావత్రుటితము కాక దృఢస్ఫూర్తి నొందవలెను అట్టి స్థితి నొంది పరిపోషింపఁబడుటకు రతి ఉభయ నిష్ఠము కావలెను. ఒకరియందు రతి పెంపొందినను ఇంకొకరియందు అన్యవిషయిక నైస్పృహ్యము పెరుఁగుచుండిన రతి అవిచ్ఛిన్న పరిస్ఫూర్తి నొందక రసాభాస మగునని ఎఱుక

ఇఁక రెండవది (ఏ) 'తిర్యఙ్మ్లేచ్ఛగతోఽపివా' రతి తిర్యగ్గతమైనను (బి) మ్లేచ్ఛ (నాయికా నాయక) గతమైనను రసాభాస మగును తిర్యక్కులు - పశుపక్షి మృగాదులు తదాలంబనమైన రతి రసాభాస మేల కావలెను - వానికిని విభావాదులున్నవి అవి భావుక చిత్తోల్లాస హేతువు లగును చమత్కార సారమగు రస నిష్పాదకము లగును క్రౌంచ మిథున వృత్తాంతము ఆదికవికి కరుణరసజనక మాయె గదా కరుణరసాభాస జనకము కాలేదు అట్లే కపోతోపాఖ్యానము జటాయు మరణదర్శనము కరుణరసస్రావిసన్నివేశవిలసితములు ఉత్తరరామచరితలోని కరికరేణువులయు ఉద్యోగపర్వములోని చక్రవాకమిథున కేళి వర్ణనము మనుచరిత్రలోని చక్రవాకివిరహము గోవ్యాఘ్రసంవాదము నైషధప్రభావతీప్రద్యుమ్నములలోని హంసల యుదంతములు-ఇవెల్ల సహృదయులకు నానారసోల్లాసాస్పద ములుగ నున్నవి రసాభాస లక్ష్యములా? అభినవగుప్తాచార్యుల వారు కణ్వాశ్రమమృగంపుభయవర్ణనశ్లోకమును గ్రీవాభంగాభిరామశ్లోకమును భయానకరసోదాహరణముగా నిచ్చుటకు తిర్యగాదుల వృత్తములు రసాభాసములకుఁగాక రసములకేలక్ష్యభూతములు అని యుగ్గడించుటకే అట్లే చెప్పెను అలంకారమహోదధికారుఁడు.

జటాయు రావణుల యుద్ధము మహావీరచరిత్రమున రౌద్ర వీరరస నిదానము ఇట సహృదయులకు స్థాయికాలుష్యముకాని ఆనందాంశ భంగముగాని గల్గింపుటలేదు హరిశశిసువ్యామోహమున తపో భంగమంది చెడిన భరతుని విషయమునను నైచికీపోషణముచే అధఃపతితుండైన యయుతుని విషయమునను తద్రతి కాలుష్య మొందుట తత్కారణమున ఆనందక్షయము నగుటకు తత్ప్రవృత్తి యందలి యనౌచిత్యము కారణము అందుచే నట రసాభాసము స్ఫురించునేమొ పాండురంగమాహాత్మ్యమున రాజపుత్రిక శాప వశమున మండూకరూపమున నున్న యయుతుని కామించిన వృత్తాం తము ఇప్పట్టున స్మరణీయము అందుచే పలుపురాలంకారికులు తిర్యగ్గత స్థాయిని రసాభాసముగఁగాక రసముగ నొప్పుకొన్నారు

(౨) రసార్ణవసుధాకర ద్వితీయోల్లాసాంతే —

తిర్యఙ్మ్లేచ్ఛగతయో రాభాసత్వం నయుజ్యేత తయో ర్విభా వాది సంభవేన ఆస్వాదయోగ్యతా ప్రతీతేః విద్యాధరేణ కవినా బాఢ మేవం ఖలు సమర్థితం ఏకావల్యా మనేన రసాభాసం తిర్యక్షు ప్రచక్షతే తన్న పరీక్షాక్షమం తేష్వపి విభావాది సంభవాత్ విభా వాదిజ్ఞానశూన్యా స్తిర్యంచో నభాజనం భవితు మర్హంతి రస స్యేతి చేత్ మనుష్యేష్వపి కేచి త్తథాభూతేషు రసవిషయభావా భావ ప్రసంగాత్ విభావాది సంభవోహి రసం ప్రతి ప్రయోజకః న విభావాది జ్ఞానం తచ్చ తిరశ్చా మ స్త్యేవ ' ఇతి

ఇంక మ్లేచ్ఛ గత స్థాయి విషయము ఇట మ్లేచ్ఛశబ్దము జాతిచేఁగాని వర్తనముచేఁగాని నీచ లైనవారలకు ఉపలక్షణము కాదు జాతి ఆలంబననిర్ణాయకముకాదు కావున ప్రతాపరుద్రీయమున ఎల్లి వేరయ్యలది శృంగారము కాని రసాభాసముకాదు అభారతీ

యులు ఆర్యావర్తబహిర్దేశవాసులు మ్లేచ్ఛులు తదాచారవ్యవహారములు భారతీయ సహృదయులకు అనుచితములు, జుగుప్సాజనకము. గుట సహజము ఆంగ్ల నాటకములలో రంగస్థలమున నాయికానాయకులు చుంబనపరిష్వంగాదు లాచరించుట మనకు ఏవగొల్పును అట్టి పట్టుల రసమునకన్న రసాభాసమే జాగరూకమగును ఇట రతి సముచితానుభావ పరిపుష్ట మొంద నవకాశము లేకపోవుట రసాభాస మొదవును

ఇట మ్లేచ్ఛ తిర్యగ్గత స్థాయికి పై పెచ్చుగా హేమచంద్రుఁడు జడపదార్థారోపిత స్థాయిని గూడ రసాభాసముగా నుదాహరించెను

నిరింద్రియేషు తిర్యగాదిషు చారోపే ద్రసభావాభాసౌ

(3) యోషితో బహుసక్తిశ్చేత్ —

మన ధర్మశాస్త్ర సంప్రదాయములకు విరుద్ధము పలువురు పురుషులను పెండ్లియాడుట (ద్రౌపది విషయము వేఱు) అందుచే ఔచిత్యమునకు పరమప్రమాణముగ నంగీకరింపబడినట్టిది లోకము స్త్రీలు బహుసక్తలుగా వర్ణితులైన వృత్తాంతముల ననుచితములుగ నెంచి ఉద్వేగపడును వేశ్య విషయమున బహుసక్తి వర్ణితమైనను రసాభాసమే అని అంగీకరింపఁబడినది ఏలన వేశ్యకును ఒక్కనిపై ప్రీతి యుండును అన్యులయెడ కల్లప్రేమ నటించి కపట భావహావచేష్టల నెఱపును నలకూబరుని యందు రంభ కున్న ప్రీతి రణమృత సోమపాయి కూలి కోడెగాండ్రపై నుండునా ? అందుచే బహుసక్తయోషిద్రతి కృతములు అనుభావములు కృతకప్రాయములై సహృదయులకు రస్యమానత లేకుండఁ జేయును రసనిష్పత్తి యన సంచారి భావములం దంతట స్థాయి పరిస్ఫురిత మగుటే స్థాయి లేనప్పుడు వ్యభిచారి భావములును, అనుబావములును నామమాత్రావశిష్టము లై

అనాస్వాద్యములగును వ్యభిచారులమూలముననే వాస్తవికానంద రూప స్థాయిభావచర్వణ గల్గును కావున ఆ వ్యభిచారిభావము లన్నియు నేకవిషయముననే రసోల్లాసజనకము లగును బహువిష యములైన రస్యమానత దూరీకృతము కాఁగా రసాభాసమే స్ఫురించును

అందుచే సర్వరసాభాసములును తత్తద్రసము పుట్టింపలేక పోవఁగా సహృదయచిత్తముల హాస్యరసపర్యవసితము లగును

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అధి 5 భా వ శాం తి

విభావానుభావవ్యజ్యమానమైన హర్షాది భావమునకు నాశమే భావశాంతి యనఁబడును ఇట ఉదయించిన భావమే గ్రాహ్యము దాని నాశమే ప్రస్తుతము ఉదయింపక కేవలసంస్కారరూపమున చిత్తమున నెలకొనియున్న దాని నాశముకాదు ఉదయింపనిది చమత్కారాధాయకము కాదు

స్వోత్పత్త్యవచ్ఛేదేన నిర్వేదాద్యన్యతమ
ధ్వంసత్వం భావశాంతిత్వమ్
స్వోత్పత్త్యవచ్ఛేదేన నిర్వేదాద్యన్యత
మోదయత్వం భావోదయత్వం

(సా సారము 140 పుటు)

ఉదా :—

ఒకానొక కోపనగూర్చి యమర్షంపు సద్యోనాశము వర్ణితము.

ముంచసి నాద్యాపి రుషం
భామిని, ముదిరాలి రుదయాయ
ఇతి తన్వ్యాః పతివచనై
రపాయి నయనాబ్జకోణ శోణరుచిః

ఓ కోపనా ఇప్పుడును అలుకమానవు చూడు, మబ్బుల గుంపు (ముదిరాలి) ఉదయించినది' అను పతి మాటలచే ఆ తన్వి (కృశాంగి) కనుదమ్మి క్రేవల కెంజాయ నశించెను

ఇటి కాదంబిన్యుదయరూపమును ప్రియవచనమును వినుట విభావము నయన కోణగత శోణకాంతి నాశము (అది సాక్షాదమర్ష నాశజన్యము కాదన్న) తదభివ్యక్తమగు ప్రసాదమొండె అనుభావము ఈ విభావానుభావములవలన ఉత్పత్తి కాలావచ్ఛిన్న రోషనాశము ధ్వనితము

ఉదాహరణాంతరము :—

ఆ మానిని కోపము ఎట్లు తీరినది?' అను వయస్యునితో నాయకుని వచనము :—

తస్యాః సాన్ద్రవిలేపనం స్తనయుగ ప్రశ్లేష ముద్రాంకితం
కిం వక్షశ్చరణానతివ్యతికరవ్యాజేన గోపాయతే
ఇత్యుక్తే క్వ తదిత్యుదీర్య సహసా తత్సంప్రమార్ష్టుం మయా
సా శ్లిష్టా రభసేన తత్సుఖవశాత్తన్వ్యా చ తద్విస్మృతమ్
(అమరుకము.)

అల దాని దట్టమైన పూత పాలిండ్ల బిగికౌగిలింతచే నేర్పడియున్న చనుముద్ర గుఱుతులు గలదానిని నీ వక్షమును,

నా పాదములపడ (సంబరపు) నెపమున (ఏమి) దాచుచున్నావు ? అని ఆ కోపన పలుకఁగా చాలులే' అని (నేను) పలికి (దానిని దాచుటకు ఉపాయాంతరము కానక) కేవల సాహసమూని ఆ ముద్రాంకమును తుడిచివేయుటకై తటాలున కౌఁగిలించితిని ఆ సుఖపారవశ్యమున ఆ తన్వి నేను నెపమున చేసిన దాపటికమును మఱచి పోయినది

ఇట అమర్ష శాన్తి వ్యక్తము ఇట సుఖవశాత్ అనుటచే మోహోదయము వ్యక్తమగుటంజేసి భావోదయమునకును ఇది యుదాహరణము కాదా ? అని శంకింప నవకాశము కలదు కాని ఆ భావోదయమును భావశాంతికే అంగమగుటచే అమర్ష భావ శాంతియే ప్రధానమగుటదానికేయిదియుదాహరణము (కావ్యదర్పణము)

రస గంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అధి 6 భావోదయము

భావముయొక్క యుత్పత్తి (ఆస్వాదపదవి నొందుట) భావోదయము

ఉదా —

ప్రియాపరాధము నెఱింగిన యొకానొక మానిని వృత్తాంతము వర్ణితము .—

వీక్ష్య వక్షసి విపక్ష కామినీ
హారలక్ష్మ దయితస్య భామినీ
అంసదేశ వలయీకృతం క్షణా
దాచకర్ష నిజబాహువల్లరీమ్

63)

ఒకానొక మానిని తన ప్రియుని వక్షమునందు తన విపక్ష కాంత హారపుగుఱుతును పరికించి అతని స్కంధదేశమున వలయా కారమునఁ జేర్చియున్న తనబాహులతను అప్పుడే యావలకు లాగు కొనెను

ఇచట దయితుని వక్షమునందున్న విపక్షకామినీహార చిహ్నముయొక్క దర్శనము విభావము ప్రియస్కంధదేశ వలయీ కృత నిజబాహులతను లాగుకొనుట అనుభావము అమర్షభావో దయము వ్యంగ్యము

విషయవిభాగవ్యవస్థ

ఏకభావశాంతి కలుగుచో అపరభావోదయ మావశ్యకమే అట్లే భావ మొకం డుదయింపగాఁ బూర్వభావశాంతిగాని ఆవశ్యకమే అందువలన భావములు సంకీర్ణములుగనే యుండును పృథగ్వ్యవహార విషయములు కావు అట్లైనను రెంటికి ఒక్కచోట చమత్కార ముండదు కావున వ్యవహారము చమత్కారాధీనము కావునను - ఎట రెంటిలో నేది ప్రధానచమత్కారవంత మగునో దాని కచట వ్యవహారము అందుచే సాంకర్యమున్నను స్వతంత్రమే అని గణింప వలెను

ఉదాహరణాంతరము —

ఏకస్మిన్ శయనే విపక్షరమణీ నామగ్రహే ముగ్ధయా
సద్యః కోప పరాఙ్ముఖా వపి తయా చాటూని కుర్వన్నపి
ఆవేగా దవధీరితః ప్రియతమ స్తూష్ణీం స్థిత స్తత్క్షణం
మాభూత్ సుప్త ఇవే త్యమందవలితగ్రీవం పున ర్వీక్షితః
(కా దర్ప)

తనతో పరుండియున్న నాయకుఁడు తన్ను (పేరఁ బిలువక) సవతిపేరఁ బిలిచినందులకు అలిగినదై నాయిక అతఁ డెంత బతిమాలినను మన్నింపకయుండి అతఁడు విసిగి యూరకుండినంతట ముగ్ధ కావున మనస్సు ఆఁపలేక అతనిని 'అయ్యో నిద్రించినాఁడే మొగదా మేల్కొనియే యుండునుగాక ' అని కోరుచు అతనివైపు మెడ త్రిప్పుకొని పరికించినది

ఇట కాలాక్షమత్వలక్షణము ఔత్సుక్యభావోదయము వ్యంజ్యమాన మగుచున్నది ఇచ్చోట అమర్షమునకు శాంతి కావున భావశాంతియు ధ్వనితము అయ్యెనను అది భావోదయమునకు అంగము అందుచే ఔత్సుక్యభావోదయమునకే ప్రాధాన్యము

చరణ పతన ప్రత్యాఖ్యానా త్ప్రసాద పరాఙ్ముఖే
'నిభృత కితవాచా రే త్యుక్త్వా రుషా పరుషీకృతే
వ్రజతి రమణే, నిఃశ్వస్యోచ్చైః స్తనస్థితహ స్తయా
నయనసలిలచ్ఛన్నా దృష్టిః సఖీషు నివేశితా (అమరుకము)

'ఆ యింతి తన పాదముల వ్రాలిన రమణుని తిరస్కరించి అందువలన అతఁడు మఱి బతిమాలుకొనుట మానఁగా రహస్య కపటవర్తనుఁడా ' అని అధిక్షేపించినదై అందువలన అతఁడు కోపించి మనస్సు విఱిగి వెడలిపోవుచుండఁగా హెచ్చునిట్టూర్పు పుచ్చి స్తనములయందు చేయియుంచుకొని కన్నీళ్ళు గ్రమ్మిన దృష్టిని సఖులపై నెఱపినది ఇట విషాద భావమునకు ఉదయము

రసగంగాధరము

పరివస్యావివరణసముల్లసితము

అధి 7 భావసంధి

అన్యోన్యము అనభిభూతము లైనట్టివి అన్యోన్యము అనభిభవనయోగ్యములు (తుల్యబలములు) నైన భావముల రెంటి సామానాధికరణ్యము భావసంధి తుల్యచమత్కారప్రతీతిబలములు కలవైన భావములు రెండు ఒండొంటిని బాధింపక అవిరుద్ధముగ తమ తమ ప్రతీతి చమత్కారబలముతోడ నొక్కచోట సమాస్థితిని బ్రతీతము లగుట భావసంధి యనబడు ధ్వని భావము ఇందు మొదటి సగము లక్షణము చెప్పకున్న రెండు భావముల వ్యంగ్యచమత్కారమును సుందోపసుందన్యాయమున నొండొంటికి బాధకములై ప్రతీతిచమత్కారము లేక తటస్థములుగా నుండును మొదట విశేషణముచే ఆ బాధ తప్పి సంధిప్రయోజకసఖ్యముతో విలక్షణ చమత్కారములతో రెండు భావములును ఉల్లసిల్లుట ఘటిల్లును రెండవ విశేషణము చెప్పకున్న రెండును తుల్యబలములై సమానముగ ప్రతీతిచమత్కారము నెఱపునవి యేర్పడక అంగాంగిభావసమన్వితము లగును రాజభృత్యన్యాయమునఁ గాక సమాన స్కంధములుగా నిలుచు రాజులవలె స్వతంత్ర విలక్షణ వ్యంగ్యచమత్కారయుక్తము లని సంధిప్రయోజక మగుటకై రెండవ విశేషణోపాదానము

భావసంధిస్తు భావ నాం తుల్యానాం వ్యంగ్యతా యది
[కా దర్ప]

ఉదా :—

రాముని ప్రథమదర్శనమున సీత లజ్జౌత్సుక్యములు :—

యౌవనోద్గమ నితాంత శంకితాః
శీల శౌర్య బలకాంతి లోభితాః
సంకుచంతి వికసంతి రాఘవే
జానకీ నయననీరజశ్రియః

యౌవనారంభముచే శ్రీరాముని ప్రథమదర్శనమున మిక్కిలి త్రాసము కలవి శ్రుతపూర్వములైన బల శౌర్య కాంతి లోలుపము లైనవియైన జానకీనయనపద్మములు శ్రీరామచంద్రునియందు పడినవై లజ్జచే సంకోచమును ఔత్సుక్యముచే వ్యాకోచమును గాంచుచున్నవి

ఇట భగవంతుఁడైన దాశరథియొక్క లోకోత్తర యౌవనోద్గమము అట్లే లోకోత్తరములైన శౌర్య బల శీల కాంతుల దర్శనము విభావము సీత యొక్క నయనగతి సంకోచ వికాసములు అనుభావములు ఇట వ్రీడౌత్సుక్యములసంధి వ్యంగ్యము

ఉదాహరణాంతరము —

ఉత్సిక్తస్య తపః పరాక్రమ నిధే రభ్యాగమా దేకతః
సత్సంగ ప్రియతాచ వీరరభసోన్మాద శ్చమాం కర్షతః
వైదేహీ పరిరంభ ఏవచ ముహు శ్చైతన్య మామీలయ
న్నానందీ హరిచందనేందు శిరసిస్నిగ్ధో రుణ ద్ధన్యతః (మహావీర-2)

గర్వియు తపః పరాక్రమనిధియునైన యీ భార్గవుని రాకచే నొక్కట సత్సంగప్రీతియు వీర రసోన్మాదమును రెండును నన్ను ఆకర్షించు చున్నవి జానకిని కౌగిలించుకొనవలయునను వాంఛయే నా చైతన్యము మాటిమాటికి వికసింపఁజేయుచున్నదై కల్పవృక్షము, చంద్రమండలములవలె నానందహేతు వగుచు అన్యములైన వీరాది ప్రవృత్తులను అడ్డగించుచున్నది

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అథ 8 భావశబలత

విరుద్ధములుగాని అవిరుద్ధములు (ఉదాసీనములు) గాని భావముల వ్యామిశ్రణము - ఏకచమత్కృతిజ్ఞాన గోచరత్వము భావశబలత పరస్పర బాధకములైనవి యుండె పోషకలైనవి యుండె కాని - అనఁగా ఉదాసీనములైనవియైన - భావములందు ఒక్కొక్కటియు తన తన వ్యంజకముల మూలమున వేర్వేఱ వాక్యముల వేర్వేఱ భావవ్యంగ్యచమత్కారము కలిగియు - అన్ని కలసి తిలతండులన్యాయమున సమప్రాధాన్యమునఁ జర్వ్యమాణములై మహావాక్యమున నొక సంపూర్ణవిలక్షణ భావ వ్యంగ్య చమత్కారమునకు విషయమై యుల్లసిల్లుట భావశబలత్వము

ఉదా —

సీతను వివాసము పాల్చేసి శ్రీరాముఁడు చింతిల్లుచున్నాఁడు -

పాపం హన్త మయా హతేన విహితం సీతాపి యద్వాపితా
సా మా మిందుముఖీ వినా బత వనే కిం జీవితం ధాస్యతి ?
ఆలోకేయ కథం ముఖాని కృతినాం? కిం తే వదిష్యంతి మాం ?
రాజ్యం యాతు రసాతలం పునరిదం న ప్రాణితుం కామయే

అయ్యో ! దుర్బుద్ధిని నేను (యజ్ఞభూమిసంభూతను) సీతనుం గూడ నిర్వాపితంజేసి పాపము చేసితిని ఆ చంద్రముఖి నేను లేక వనములో అకటా జీవము తాల్చియున్నదా ? నేను పుణ్యాత్ములఁ

మొగ మెట్లు చూతును ? వారు నను గూర్చి ఏమి పల్కుదురు? మఱి ఈ రాజ్యము పాతాళమునకు అఱఁగిపోవుఁగాక నేను జీవింప నొల్లను

ఇట వాని వాని విభావములవలన నుత్పన్నములైన యనేక భావముల వ్యామిశ్రణము ఎట్లన, మయా పాపం విహితం (నేను పాపము చేసితిని) అను వాక్యముచే మతి హా హేన అను పదముచే తన్నుఁ గూర్చి 'అసూయ హా న్త సీతాపి యద్యాపితా (సీతఁగూడ నిర్వాసిత) అను వాక్యముచే విషాదము ' సా అనుపదముచే స్మృతి 'మాంవినా ఇన్దుముఖీ కిం జీవితం ధాస్యతి? (నేను లేక ఆ చంద్రముఖి సీత బ్రదుకునా?) అనువాక్యముచే వితర్కము ఆలోకేయ కథం ముఖాని కృతినాం (పుణ్యాత్ముల ముఖము నెట్లు చూతును?) అను వాక్యముచే వ్రీడ ' కిం తే వదిష్యంతి మాం' అను వాక్యముచే శంక రాజ్యం యాతు రసాతలం పునరిదం అను వాక్యముచే నిర్వేదము అనుభావములు వ్యజ్యమానములై తిలతండులన్యాయమున వ్యామిశ్రమాణములై ఏక మహాకావ్యజన్యమైన వైయంజన చమత్కారమును పుట్టించు ప్రతీతికి విషయము లగుచున్నవి కావున ఇట భావశబలత

కావ్యప్రకాశికా వ్యాఖ్యాతృ్రోక్త లక్షణ నిరాసము.

కావ్యప్రకాశికాటీకాకారుఁడు ఉత్తరోత్తరభావముచే పూర్వమభివ్యక్తమైన భావముయొక్క యుపమర్దము (అభిభవము) శబలత అని లక్షణము చెప్పినాఁడు అది అసంగతము దానిచే పూర్వోత్తర మూలగ్రంథ విరోధము ఉప్పతిల్లును ఎట్లన కావ్యప్రకాశము చతుర్థాశ్వాసమున భావశబలతకు వక్ష్యమాణశ్లోకము ఉదాహృతము

క్వాఽకార్యం? శశలక్ష్మణః క్వచ కులం?
(క్వచ శర్వశేఖరకులం)
భూయోపి దృశ్యేత సా
దోషాణాం ప్రశమాయ నః శ్రుత మహో
కోపేఽపి కాన్తం ముఖమ్
కిం వక్ష్యన్త్యపకల్మషాః కృతధియః?
స్వప్నేఽపి సా దుర్లభా
చేతః స్వాస్థ్య ముపైహి కః ఖలు యువా
ధన్యోఽధరం పాస్యతి

[ఇట వంశశుద్ధతను చెప్పుచోట శశలక్ష్మణ శబ్దము అనర్థకము అందుచే పాఠాంతరము] శుక్రకన్యను దేవయానిని రాజు యయాతి కామించి ఇట్లు తలపోయుచున్నాడు.—

నే నిప్పుడు ఒడిగట్టిన యీ యకార్య మెక్కడ? నిరపవాదము శర్వశేఖరుని చంద్రుని విశుద్ధవంశ మెక్కడ? (అని యుక్తాయుక్త విచారాత్మకము వితర్కము) ప్రియ వెండియుం గనపడునా (అని ఔత్సుక్యము) నా శ్రుతము (శాస్త్ర శ్రవణజ్ఞానము) దోషముల నడంచుటకు (కదా) అని (మతి) ఆ నెమ్మోము కోపము నందును కాంతనే (అని స్మృతి) స్థిరతర చిత్త సంస్కారవంతులు అపకల్మషులు సత్పురుషు లేమందురో (అని శంక) స్వప్నమందును సఖి దొరకదు (అని దైన్యము) ఓ మనసా స్వస్థతం బొందుము (అని ధృతి) ధన్యాత్ము డెవడు ఆ యధర మానునో (అని చింత) - పూర్వపూర్వోపమర్దమున ప్రతీయమానము లగుటచేత శబలత చమత్కార స్థానము [కావ్యప్రదీపము] దీనిపై పూర్వ పూర్వము లైన మతి మొదలు ధృతి వఱకు నున్న శాంతి సంచారుల

శల్ల ఉపమర్దముచే శాంతి శబలతయే చమత్కార హాని (విశ్రాంతి స్థానము) ఇట్టిదైన చింతచే శృంగారప్రకర్ష శత్రు విజయమునే జేరికింబోలె కలుగును అని ప్రగ్యోతప్రభ ఇట బాధ్యబాధక భావ మున్న శబలత స్వీకరింప దగునని భావము కాని ఇది కావ్య ప్రకాశికాకారునికి మూలకారునకు తన గ్రంథమున పూర్వోత్తర విరోధము నాపాదింపఁజేయు వ్యాఖ్యానము ఎట్లన పంచమోల్లాసము కావ్య ప్రకాశమున గుణీభూతవ్యంగ్యప్రసంగమున భావ శబలతా లంకారమున కీయఁబడిన యుదాహరణమును వక్ష్యమాణమును పరిశీలింపుడు —

పశ్యేత్ కశ్చిత్ చల చపల రే కా త్వరా ? హం కుమారీ
హస్తాలంబం వితర హహహా వ్యుత్క్రమః క్వాసి యాసి ?
ఇత్థం పృథ్వీపరివృఢ భవద్విద్విషోఽరణ్య వృత్తేః
కన్యా కంచిత్ ఫలకిసలయా న్యాదదానాఽభిధత్తే

ఎవఁడేని చూచును ఓరి చపలా ఇటనుండి తలఁగుము ఏమి త్వర ? నేను కుమారిని (కన్నెను) కదా నాకుం గొంచెము చేయూతయిమ్ము అయ్యో అయ్యో (కన్యాగమన రూపము) విపరీతా చరణము జరుగుచున్నది (నను విడిచి) ఎక్కడికి పోవుచున్నావు? అని ఓ రాజా నీ శత్రురాజులు అరణ్యవాసమున నుండ తత్కన్య యొకతె ఫలకిసలయములు కోయుచు ఒకానొక వయసుకానియం దనురక్తయై వాఁడు దాని మనసు తెలిసి చుంబనాలింగనాది వ్యాపార ప్రవృత్తుఁ డగుచుండ నట్లు పల్కినది ఇట ఎవఁడేని చూచునని శంక ఓరి చపల అపసరెల్లు మని అసూయ ఏమి త్వర అని ధృతి నేను కన్నెనుకదా అని స్మృతి చేయూఁతయిమ్ము అని శ్రమ అకటకటా అని దైన్యము (కన్యాత్వమునకు) విపరీతాచరణము అని విబోధ

64)

చైతన్యాగమరూపము) ఎక్కడికి పోవుచున్నావు ? అని ఔత్సు క్యము - ఈ భావముల శబలత నృపవిషయక రతి భావమునకు అంగము అని కావ్యప్రకాశికాకారుఁడు ఉపపాదించెను ఇం శంకాసూయాది భావములకు ఉపమర్దలేశము లేకున్నను శబలత రాజస్తుతికి అంగము అందుచే కావ్యప్రకాశికాకారునికి అభిమతమైన శబలత ఉపమర్దరూపము కాదని ఉపమర్దరూపముగ మొదటి శ్లోకమున ననిపించినను అది ఈ రెండవ శ్లోకముకడ పూర్వపక్షమగు నని అట్టి వ్యాఖ్యానము ప్రకాశికాకారునికి గ్రంథపూర్వోత్తర వైరుధ్యాపాదకమని దుష్టమని జగన్నాధపండితుని యభిప్రాయము

ఇట నిది యవధేయము - కావ్యప్రదీపము సాహిత్య దర్ప ణము సాహిత్య రత్నాకరము కావ్యదర్పణము మున్నగు ననే కాలంకారికగ్రంథములందు శబలత పూర్వ పూర్వ భావోపమర్ద రూపమునసే ప్రతిపాదితము అందుచే కావ్యప్రకాశికాకారుఁ డును ఆ మతమువాఁడగుట అసంభావ్యము కాదు ఈ రెండవ శ్లోకమునను తద్రూపవ్యాఖ్యానమునకు వీలు కలదు అట్లొనర్పను బడినది (చూ వామనాచార్యజల్కీకరువ్యాఖ్యానము) ఇది ప్రాచీనుల యభిప్రాయము కాఁబోలును దీనిని గ్రంథకర్త సోప పత్తికముగ ఖండించి లక్షణాంతరము చెప్పుచున్నాఁడు

[శంక] నైయాయిక మతానుసారము ఇచ్ఛాదులు సర్వచిత్త వృత్తులు (భావములు) ఆత్మవృత్తి విశేషగుణములు అవి స్వోత్తర విశేషగుణనాశ్యములు - అనఁగా వెనుక పుట్టిన విశేషగుణము తొంటి దానిని నశింపఁజేయును తార్కికనియమానుసారము పూర్వ కాలిక భావము నాశముకాక ఉత్తరకాలికము ఇంకొక భావము పుట్టుటకు వీలులేదు ఏలన ఏకకాలమున ననేకచిత్తవృత్తుల యభి

వ్యక్తి అసంభవము ఒక్కొక్కనారి ఒక్కొక్కదానికే అభివ్యక్తి అందుచే ప్రాచీనులు చెప్పినట్టిది పూర్వ పూర్వభావమునకు ఉత్తరోత్తర భావోపమర్దరూపము శబలత పొసగును గాని మీరు చెప్పినట్లు ఏకకాలమున అనేకభావాభివ్యక్తిరూపశబలత ఎట్లు ఘటిల్లును?

[సమా] నైయాయికమతానుసారము శంకాదులు ఆత్మవిశేష గుణములగుటం జేసి స్వోత్తరవిశేషగుణనాశ్యము లను న్యాయము ఇట సాహిత్యశాస్త్రప్రయోజకము కాదు ఏలన స్వోత్తర విశేష గుణజన్యనాశమువ్యంగ్యార్థముకాదు ఆనాశముఉపమర్దశబ్దవాచ్యము వ్యంజనావృత్తిచే బోధ్యము కాదు అది వ్యంగ్యార్థము కావలసినచో ఉపమర్దశబ్దవాచ్య మెట్లగును? శబలత్వ మన్ననో వ్యంగ్యము అది చమత్కారవంతము వ్యంగ్యము కానట్టిది ఉపమర్దశబ్దవాచ్యమైన ట్టిది ప్రాచీను లంగీకరించిన శబలత్వము చమత్కారవంతము కాదు అందుచే నిట విలక్షణ సంయోగాత్మకము పానకరసన్యాయమున నుద్భవించునది అగు శబలత్వము మేము చెప్పచున్నారము దాని వేచ

నారికేళ జలక్షీర సితాకదళి మిశ్రణే
విలక్షణా యథాఽస్వాదో భావానాం సంహతౌ తథా

టెంకాయపాలు క్షీరము తెల్లచక్కెర అరటిపండు-ఇవెల్ల మిశ్రమము చేయుటచే - అన్నిటి ప్రత్యేక రుచులకు పై పెచ్చుగా - అపూర్వమగు నొక విలక్షణాస్వాదము కలుగునో అట్లే భావము లన్నియుంగలిసి ఒంటొంటి యాస్వాదనేగాక యొక విలక్షణాస్వాదము గల్గించును దానికే శబలత్వ మని పేరు అదే చమత్కార విలసితము

శంక — ఇట భావములయొక్క నాలుగవస్థలే - ఉదయము శాంతి సంధి శబలత అనునవే చెప్పఁబడినవి 'భావస్థితి' చెప్ప లేదు ?

[సమా] భావస్థితి భావస్వరూపమునకన్న వేఱు కాదు. అందుచే భావస్థితి నిరూపణము అది నిరూపితమైనదే

రసగంగాధరము

వ్యవస్యావివరణసముల్లసితము

అధి 9 భావశాంత్యాదులు నాలుగును భావధ్వన్యాత్మకములు

భావశాంతి భావోదయము భావసంధి భావశబలత అనునవి ధ్వన్యాత్మకములు ఏవి ఉదాహరణద్వారమునఁ బ్రతిపాదితము లైనవో అవెల్ల భావధ్వనులే ఇట ఉదయము (స్థితి) సంధి శబలత శాంతి అనునవి భావావస్థాభేదములు ఇట నొకప్రశ్న పుట్టును ఏమన అవస్థలు గల భావములకు ప్రాధాన్యమా ? భావముల యవస్థ లకు ప్రాధాన్యమా ? ఉన్న యవస్థలలో భావములు ఆస్వాద్య మానములగును ఉదయము నాశము సంధి అను భావావస్థ సంబంధ ములకును సంబంధులైన భావములకును చర్వణ సమానమేయైనను చర్వణ ఆ సంబంధమునదియా ? సంబంధులదియా ? అని తేల్చి నిరూపించుట త్యావశ్యకము అట్లు పరిశీలించి భావములదే ప్రాధా న్యము అని నిర్ణయించుట ఉచితము ఏల ? ఈ యూపాధికములైన యవస్థాసంబంధములతోడ ఉదయత్వావచ్ఛిన్నముగ, శాంతిత్వ

వచ్ఛిన్నముగ సంధిత్వావచ్ఛిన్నముగ శబలత్వావచ్ఛిన్నముగ నాస్వాద్యమాన మగు ధర్మి భావమే ఆశ్రితములైన ధర్మములకన్న సర్వధర్మాశ్రయమైన ధర్మికేకదా ప్రాధాన్యము సముచితము (౨) ఇదికాక భావస్థితి భావముయొక్క యవస్థలలో నొకటి భావ రూపముగనే యంగీకరింపఁబడినది అందుచే భావప్రాధాన్యము నిశ్చితప్రచము (3) ఇంకొక తెఱంగు గన భావప్రాధాన్యము నిరూపింపసగును భావశాంతి యన భావధ్వంసాత్మకము ధ్వంసము అభావ ప్రకారములలో నొకటి అభావజ్ఞానము ప్రతియోగిజ్ఞానాధీనము ఘటాభావమునకు ఘటము ప్రతియోగి ఘటరూప ప్రతియోగిత్వావచ్ఛిన్నముగనే ఘటాభావప్రతీతి కలుగును ఘటజ్ఞానములేక ఘటాభావజ్ఞానము కలుగదు అట్లే భావశాంతిప్రతీతియు భావప్రతియోగిప్రతీత్యధీనము ప్రాధాన్యము ప్రతియోగిది అందుచే భావప్రాధాన్యము సిద్ధము ఇదికల్పము (పూర్వసిద్ధము) నవీన కల్పితము కాదు ఏకత్ర నిర్ణీతః శాస్త్రార్థః బాధకాభావే అన్యత్రాపి సంచరతి ' అను న్యాయమున ఇట్లు భావశాంతి విషయమున సిద్ధమైన భావప్రాధాన్యమును భావోదయ భావసంధి భావశబలతల పట్లను వర్తింపఁజేసి సర్వావస్థలకు ఆధారమైన భావమునకే ప్రాధాన్యము ఒప్పుట లెస్స (౪) వెండియు భావప్రాధాన్యము కారణాంతరము చేతను అంగీకర్తవ్య మగును తదుపసర్జనకము లగు శాంత్యాదులకు చెల్లదు ఏలన ఏ కావ్యములందు భావములకు వ్యంగ్యత్వము శాంత్యాదులకు వాచ్యత్వము కలదో ఆ కావ్యములందు భావశాంత్యాది ధ్వనిత్వ వ్యవహారము (వ్యపదేశము) కలదు ప్రాధాన్యమునుబట్టి వ్యపదేశము అట్లుగాక శాంత్యాదులకే ప్రాధాన్య మొప్పినచో - శాంత్యాదులు వాచ్యము లగుట భావ

శాంత్యాది వ్యవహారమే కావ్యమునకు రాకపోవును అందుచే లోకప్రసిద్ధమైన ఆ వ్యవహారము వ్యపదేశ మొండె కుదురుటకై భావములకే ప్రాధాన్యము నంగీకరింపక తప్పదు గత్యంతరము లేదు

భావధ్వని యుదాహరణమును ఈశ్లోకమును పరికింపుఁడు —

ఖండిత వృత్తము వర్ణితము —

ఉషసి ప్రతిపక్షనాయికాసదనా దంతిక మంచతి ప్రియే

సుదృశో నయనాబ్జకోణయో రుదియాయ త్వరయాఽరుణద్యుతిః.

వేకువనే ప్రియుఁడు సవతాలి యింటినుండి వచ్చి తన దరి చేరఁగా ఆ మృగాక్షి కనుదమ్మికొనల (కోణముల) నమర్షజన్యము కెంజాయ అంతలో నుదయించెను

ఇచట ఉదియాయ అను క్రియాపదఘటక మైన ఉత్ పూర్వకము ఇణ్ ధాతువువలన భావోదయము వాచ్య మైనందున, శాంత్యాదికి ప్రాధాన్య మను పక్షమున దీనికి అమర్షభావధ్వని కావ్య వ్యపదేశము లేదు ఉదయము వాచ్యమైనను అమర్షభావము అవాచ్యమైనందున ధ్వని వ్యపదేశము సుస్థితమే అందు లేని ప్రధానేన వ్యపదేశా భవన్తి అను న్యాయమున ప్రధానమగు ఉదయము (వాచ్యమగుట) వ్యపదేశప్రయోజకము కాదాయెను అప్రధానమైన భావమును బట్టి వ్యపదేశము రాదాయెను ఇట్లు మీ మతము రెంటికిం జెడిన రేవణప్రాయ మైనది ఇఁక మా మతమునం దన్ననో ఉదయము వాచ్యమైనను ఉదయావచ్ఛిన్నమగు నమర్షభావము ప్రధానమైనది దానింబట్టి కావ్యమునకు భావధ్వని వ్యవహారము యుక్తమే మీకును భావశాన్తిధ్వని పేరు భావప్రాధాన్య మొప్పుకున్న కుదరదు ఏలన భావశాంతికి ప్రతియోగియైన భావము ప్రతీయమానమగుఁ గాని అనుయోగియైన ప్రశమము ధ్వంసరూపము

అభావము కావున వర్ణనకు వాచ్యము కాదు అందుచే భావశాంతి వ్యపదేశ మెట్లు కావ్యమునకు సిద్ధించును ?

ఎట్లన ఉదా —

ఒకానొక మానినియొక్క యమర్షభావశాంతి వర్ణన —

క్షమాపణైకపదయోః పదయోః పతతి ప్రియే
శేముః సరోజనయనా నయనారుణ కాంతయః

ప్రియుఁడు [తాఁ జేసిన యపరాధమునకై] క్షమాపణకు ప్రధానస్థానములైన ప్రియాపాదములఁ బడఁగా ఆ పద్మాక్షియొక్క నయనములందు అరుణకాంతులు శమించినవి

ఇచ్చట నేత్రారుణిమకాంతిశాంతిచే అమర్షభావము వ్యంగ్యము శేముః (శమించినవి) అను శబ్దముచే ఆ భావముయొక్క శాంతి వాచ్యమైనది అందుచే నిది భావశాంతి ధ్వనికి ఉదాహరణము శాంతికి ప్రాధాన్యము చెప్పిన భావము అప్రధాన మైన, దీనికి అమర్షభావశాంతి వ్యపదేశము రాకపోవలసినదే

[శంక] ఏల రాకపోవలయును? శేముః అను క్రియకు అరుణకాంతి కర్త ఇట్లు శబ్దాన్వయము కలుగుటంజేసి అరుణకాంతి శాంతియే వాచ్యమని తేలినది అంతేకాని అరుణకాంతిచే వ్యజ్యమానమగు అమర్షభావశాంతి కూడ (అన్వయద్వారమున) వాచ్యము కాలేదుకదా ఏలన వ్యంగ్య వ్యంజకములు (వాచ్యము) వేర్వేఱుగా నుండుట ఆవశ్యకము కావున ఇట వేర్వేఱుగా అరుణకాంతి శాంతి వాచ్యార్థము దానిచే వ్యక్తమగు వ్యంగ్యార్థము అమర్షశాంతి అని భేదము స్పష్టముగా నున్నది ఇఁక అమర్షభావధ్వని కావ్యము అని పేరు ఏల రాకపోవును?

(శంక) అట్లు కాదు భేదము లేదు వాచ్యమైన శాంతికి [వాచకమైన] నయనారుణకాంతితో తద్వ్యజ్యమాన మైన] యమర్ష భావముతోఁ గూడనే అన్వయము వేఱుకాదు

[సమా] అట్లనరాదు అది అసంభవము వాచ్యము కారణము నియత పూర్వభావి వ్యంగ్యము కార్యము నియతపశ్చాద్భావి ఇట్లు కార్యకారణ భావములచే వాచ్య వ్యంగ్యములకు ఆనుపూర్వి ఆవశ్యకము అట్లుండ వానికి యౌగపద్యము ఎట్లు? కావున వ్యంగ్యమైన యమర్షము వాచ్యమగు శాంతితో గూడి క్రియతో నన్వయించుట ఘటిల్లదు శాంతి వాచ్యార్థమును బోధించువేళ అమర్షభావము ఉపస్థితము కాదు అప్పటికి పుట్టకముందే ఎట్లు కారణమైన వాచ్యముతో దానికి సహాన్వయము సంభవించును? ఎట్లో వాచ్యవ్యంగ్యములకు పరస్పర సహాన్వయము ఒప్పదమన్న ఇంకొక బాధ కలదు సుదృశః అను పదమునకును నయనారుణకాంతి వ్యంగ్యమైన యమర్షముతో అన్వయము కుదురదు ఎట్లు కుదురదు? మనో హర నేత్రములందు అనునది అధికరణకారకము దానికి కర్త కర్మల ద్వారమున క్రియాన్వయము విహితము ఉదియాయ (ఉదయించినవి) శేముః' (శమించినవి) అను క్రియలతో కర్తగా అరుణద్యుతి అను వాచ్యార్థమునకైన అన్వయము కుదురును తద్వ్యంగ్యమైన యమర్ష మెట్లు అన్వయించును? అది చిత్తవృత్తి. అది కనుగొనల నెట్లుండును? అందుచే వ్యంగ్యవ్యంజకములకు భేదము ఆవశ్యకము? కాఁబట్టి వాచ్యములైన శాంత్యాదులకు అరుణ కాంత్యాదులతో నన్వయము సముచితము పై రెండుగాహరణము లందును ఇట్లు వాచ్యవ్యంగ్యములకు సహాన్వయము లేనందున

అనుపపత్తి లేకపోవఁగా భావశాంత్యాది వ్యవహారము నిర్బాధకము అందుచే భావశాంత్యాదులందు శాంత్యాదులకే ప్రాధాన్యము భావములకు అప్రాధాన్యము అని పూర్వపక్షము

(సమా] అది సరికాదు ఉక్తోదాహరణములందు అట్లు చెప్పిన అనుపపత్తి లేకపోయిన పోవుఁగాక వక్ష్యమాణశ్లోకమును పరికింపుడు

ఉదా :—

అనునయము లేకయు అలుక మటుమాయమగుట వర్ణితము —

నిర్వాపయ న్తీం ధృతి మంగనానాం
శోభాం హరే రేణదృశో ధయన్త్యాః
చిరాపరాధ స్మృతి మాంసలోఽపి
రోషః క్షణప్రాఘుణికో బభూవ

గోపకాంతల ధైర్యమువెడల నడుపుచున్న గోపాలకృష్ణుని కాంతిని నేత్రముల నానుచున్న యా మృగాక్షి రోసము చిరాపరాధ స్మృతి పరిపుష్టమైనను క్షణస్థాయ్యతిథి యయ్యెను

క్షణప్రాఘుణికః' (అచిరస్థాయి యగు నతిథి) ఇట్టి చోటులఁ గూడ [భావముప్రధానము కాదను వారి మతమున] భావము వాచ్యమైన (భావ) శాంతి (క్షణప్రాఘుణిక భావన) వ్యంగ్య మగుటంజేసి భావశాంతి ఆపన్నమగును కాని భావప్రధానవాదుల మగు మామతమున రోషము వాచ్యమగుటంజేసి ఇది భావశాంతిస్థలము కాదు 'భావమునకు తచ్ఛాంత్యాదులకు ఈ రెంటికిని వాచ్యత్వాభావమే భావశాంతిత్వము అని అంగీకరించినచో ఈ నిర్వాస పద్యమున -

భావము వాచ్య మగుటంజేసి - భావశాంతిధ్వనిత్వాపత్తి రాదు' అనరాదు ఏలన అట్టిచో అది సహృదయానుభవ విరుద్ధము కావున భావస్థితియందు ఎట్లు భావమునకు ప్రాధాన్యము స్థితికి అప్రాధాన్యము చెప్పఁబడినదో అట్లే భావశాంత్యాదులందును ప్రధానముగా భావమునకే చమత్కారిత్వము ప్రశాంత్యాదుల కన్ననో అప్రాధాన్యము స్వీకరింపఁదగును అందువలన నప్రధానములగు నాశాంత్యాదులకు వాచ్యత్వము దోషము కాదు ధ్వనిత్వము విఘటకము కాదని భావము

[శంక] మఱి భావశాంత్యాదులకు భావధ్వని కన్న నేల పృథగుపాదానము ?

[సమా] భావస్థితిధ్వనియు భావధ్వనియు ఏకరూప మగుట వేఱుగా జెప్పలేదు భావశాంత్యాదులం దన్ననో భావధ్వనిత్వ చమత్కారమేకాక శాంత్యాదుల ధ్వనిత్వమున విలక్షణచమత్కారము కలదు అందుచే వేఱుగాఁ జెప్పఁబడినవి శుద్ధభావధ్వని స్థలమందు స్థిత్యవచ్ఛిన్నముగనే అమర్షాదిభావముల చర్వణ యుండును అమర్షాదిత్వనే - కేవల విశేష్యత్వనే చమత్కారి అచట విశేషణమునకు ప్రత్యేక ముపస్థితి లేనందున భావశాంత్యాదులందన్ననో విశేష్యత్వావచ్ఛిన్నముగను విశేషణత్వావచ్ఛిన్నముగనుంగూడ చమత్కారిత్వ ముండును అనఁగా అమర్షాదులు అమర్షాదిభావములుగనే గాక ఉదయశాంత్యాద్యవస్థావచ్ఛిన్నామర్షాదులుగఁగూడ ఇఱుతెఱంగు చమత్కారమున నాస్వాద్యమానములగును అందుచే వానిని స్థితికన్న వేఱుగాఁ జెప్పుట


రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అధి 10 రసమునకు శాంత్యాదులు లేవు

[శంక] భావమునకుఁ జెప్పినట్లు రసమునను శాంత్యాద్యవస్థలు చెప్పఁబడలే దేల ?

[సమా] రసములకు భావముల కన్న నించుక భేదము కలదు రసములు కేవల స్థాయి మూలకములు స్థాయిసూత్రగ్రథితస్రక్కల్పములు అందుచే వానికి ప్రశమాదులు సంభవింపనేరవు భావశాంతి చెప్పినట్లు రసశాంతి చెప్పుట స్థాయినాశము చెప్పినట్లగును స్థాయి భావములు మానవహృదయములలో స్థిరముగ నెలకొనియున్నవి వానికి ఉత్పత్తివినాశములు లేవు అందుకని రసాదులకు భావాదులకు చెప్పిన యవస్థలు సంభవింపవు [స్థాయిని బట్టి కాక అభివ్యక్తినిబట్టి రసములకు ఉత్పత్తివినాశాదులను ఆరోపించినచో ఆరోప్యము గౌణమై చమత్కారజనకము కాదని (1) భావము (2) జన్మము (3) అనుబంధము (4) నిష్పత్తి (5) సృష్టి (6) సంకరము (7) హ్రాసము చెప్పినారు చూ అలంకారమహోదధి పుట 90] ఒకవేళ ఆ యవస్థలు సంభవములే యైనను చమత్కారము లేదని వానిని మేము నిరూపింపలేదు



రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అధి 11. రసములకు సంలక్ష్యక్రమమును కలదా?

మున్ను స్థాయ్యాదులకును సంలక్ష్యక్రమవ్యంగ్యత్వము చెప్ప బోవుదుము అని చెప్పబడినది ఇప్పుడు అది చెప్పుచున్నారము ఇంతవఱకు చెప్పఁబడిన రసాదిలక్షణమైన వ్యంగ్యప్రపంచ మంతయు అసంలక్ష్యక్రమముగా చెప్పబడినది ఏలన ప్రకరణము సుస్పష్టముగ నుండ విభావానుభావవ్యభిచారులు సాక్షాచ్ఛబ్దోపాత్తములై ఝడితివాచ్యార్థాన్వవహితముగ ప్రతీతము లగుచుండ సహృదయులకు సూక్ష్మతమకాలమునందే రసాదులు అభివ్యక్తమగును కావున హేతుహేతుమద్భావములకు పౌర్వాపర్యక్రమము లక్షింపఁబడదు అందుచే రసాదివ్యంగ్యప్రపంచమున కెల్ల అసంలక్ష్యక్రమ మని పేరు మఱి ఎచ్చోట అట్లుగాక ప్రకరణము అస్ఫుట మగుట విచారవేద్యముగ నుండునో మఱి ఎచ్చట ప్రకరణము స్ఫుటముగా నున్ననుంగూడ అనుక్తములు విభావాదులు ఊహనీయములుగ నుండునో అచ్చోటుల ప్రకరణవిభావాదివ్యంజకసామగ్రిచేఁ గల్గిన విలంబనకు లోనై వ్యంగ్యచమత్కృతి విలంబముగ ననుభవ గోచరమగును అందువలన నచట హేతుహేతుమత్తుల పౌర్వాపర్యక్రమము లక్షింప వీలగును అందుచే అట్టి స్థలములందు రసాది ప్రతీతికి సంలక్ష్యక్రమ మని వ్యవహారము

ఉదా: —

తల్పగతాపిచ సుతను:
శ్వాసాసంగం న యా సేహే
సంప్రతి సా హృదయగతం
ప్రియపాణిం మంద మాక్షిపతి

ఏ లజ్జావతి తల్పమునందు శయనించియు ప్రియుని నిట్టూర్పు కలయికనుగూడ సహింపలేనిదో ఆమె యిపుడు తన హృదయముపై నైచిన ప్రియునియొక్క పాణిని నెమ్మదిగా తీసివేయుచున్నది

ఈ పద్యమునందున్న సంప్రతి' (ఇప్పుడు) అనుపదమునకు అర్థావగతి తటాలునఁ గలుగుటలేదు అది విచారవేద్యము ఆబాల నవోఢ అనియు ఆకారణమున మొదట భర్తకడ సంకోచము అధికముగ నుండెడిది అనియు మఱి ఇప్పుడు అనఁగా ప్రియుఁడు ప్రవాసమునకుఁ బోవనుండిన నాఁటి ముందు రాత్రియందన్నచో తత్సంకోచము కొంచెము సడలినది అనియు పూర్వోత్తరసందర్భానుసంధానమునఁ బ్రకరణము స్ఫుటమగు నంతదాఁక పద్యముయొక్క యర్థావగతికి విలంబము కలిగినది అనఁగా ప్రకరణమును గూర్చి విచారించుట యందు విభావానుభావములయు రతియొక్క శృంగారరస నిష్పత్తి వీని యానుపూర్వి లక్షింప శక్యమగును అందుచే నిట రత్యాదిస్థాయికి సంలక్ష్యక్రమ మని వ్యవహారము

ఇట ప్రకరణ విశేష ప్రతీత్యనంతరము భావివిప్రవాసహేతుక విప్రలంభరతికి ఔపాయికమైన స్వస్థానప్రాపణాత్మకము మందాక్షేపము అను ననుభావముచే కొంత శ్రమ దైన్యాది వ్యభిచారిభావములే సంలక్ష్యక్రమముచే ప్రతీయమానము లగుచున్నవి అనంతరము

ఏతద్వ్యభిచారిభావముఖముగా తుదకు విప్రలంభశృంగారము ప్రతీతము ఇది ధ్వనికారోక్త్యుదాహరణము

[శంక] రసాదులకు సంలక్ష్యమే కలదని ఏలన సర్వత్ర ఒప్పరాదు? అసంలక్ష్యక్రమత్వము సార్వత్రికము కాదని పైపద్యమే నిదర్శనము అసంలక్ష్యక్రమత్వమునకు ప్రమాణములేదు దేనిచే ప్రమేయ పదార్థము (ధర్మి) యొక్క ప్రమ సిద్ధించునో అది కదా ప్రమాణ మనఁబడును రసపదార్థసిద్ధికి అట్టి ధర్మిగ్రాహకప్రమాణము సహృదయుల యనుభావము ఆ సహృదయుల యనుభవము రసధర్మిని అసంలక్ష్యత్వధర్మావచ్ఛిన్నముగనే గ్రహించుచున్న దనరాదు ఏలన పై శ్లోకమువంటివి - రత్యాదిని సంలక్ష్యక్రమ మని వ్యవహరింపఁదగు స్థలములు కొన్ని కలవు కావున అవియు సహృదయానుభవసిద్ధములే కావునను ఇంతటికిని రసవ్యంగ్యవ్యంజకములకు క్రమము కలదనియు అది శతపత్రపత్రసూచీభేదనక్రమన్యాయమున అత్యల్పకాలమున ఘటిల్లుటచే లక్షితమగుట లేదనియు అసంలక్ష్యక్రమ స్థలములందును మీరు ఒప్పుచున్నారు అసంలక్ష్యక్రమత్వ ధర్మిగ్రాహకప్రమాణసిద్ధి రసాదులకు లేనప్పుడు సంలక్ష్యక్రమత్వమే సార్వత్రికముగ నంగీకర్తవ్యము

[సమా] సర్వత్ర సంలక్ష్యక్రమ మన నేమి ప్రమాణము? అదియు కానరాదు అందుకనియే రసధ్వనికి కేవలము అసంలక్ష్యక్రమ వ్యంగ్యత్వమేకాక (క్వాచిత్కముగ) సంలక్ష్యక్రమ వ్యంగ్యత్వమును కలదని ధ్వనికారులు ఈ క్రింది శ్లోకమును ఉదాహరించి ఇట్లు వచించినారు —

నిజ వివాహ వార్తాశ్రవణమునఁ బార్వతిలజ్జ వర్ణితము —

ఏవం వాదిని దేవర్షౌ
పార్శ్వే పితు రధోముఖీ
లీలా కమలపత్రాణి
గణయామాస పార్వతీ (కుమారసంభవము 6)

దేవర్షి అంగిరసుఁడు ఇట్లు (శివసందేశమును) చెప్పుచుండఁగా తండ్రి హిమవంతుని పార్శ్వమున నిలచియున్న పార్వతి తలవంచుకొని విలాసార్థముచేఁ దాల్చియున్న తమ్మిపూవు రేకులను లెక్కపెట్ట సాగెను

ఈ శ్లోకములందు పార్వతి తలవంచుకొనుట లీలాకమలపత్రములు లెక్కించుటయు కన్యాజనస్వాభావ్యమున ఉపపన్నములే లజ్జాకృతములుగను ఉపపన్నములే ఇట్లుండ ఈ శ్లోకము చదువఁగనే ఆ కార్యములు ఏ నిమిత్తమున పార్వతిచే నొనర్పఁబడినవి ? కన్యాజన స్వాభావ్యముగనా ? లజ్జచేతనా ? అని జిజ్ఞాస పొడమును దేవర్షి అంగిరసుఁడు చేసిన పార్వతీపరమేశ్వరుల వివాహాదిప్రసంగములఁ గూర్చిన విజ్ఞానము కలిగిన పిమ్మట సహృదయునకు ఆ ప్రకరణాది జ్ఞానమువలన ఏ నిమిత్తమున ముఖనమన లీలాకమలపత్ర సంకలన కార్యములు పొనర్పఁబడినవో ఆ లజ్జానిమిత్తలు అభివ్యక్తములగును పార్వతి తన చిత్తమునందు కలిగిన హర్షమును (శివాలంబనకమును) లజ్జచే దాచుటకు ఆ కార్యము లొనర్చినది అని ఎఱుకపడును ఇట లజ్జాదిభావధ్వని చమత్కారి దానికి శివునందు పార్వతికి రతి (అభిలాష) యుండుటచేతనే అవకాశము కలిగినది అందుచే రతి ప్రధానము ఇట సామర్థ్యాక్షిప్త వ్యభిచారి భావధ్వని ముఖమున అది (రతి) ప్రతీతమైనది ఇందు వ్యంజకములయు రతి స్థాయి

మొక్కయు (హేతు హేతుమత్తుల) జ్ఞానము విలంబనమునఁ గల్గుటచే తత్పౌర్వాపర్యక్రమము సంలక్షితమైనది ' అని ఆనందవర్ధనాచార్యుల వారి మాటల వివరించుచు లోచనకారులు అభినవగుప్తాచార్యుల వారును రసభావాదియైన యర్థము సార్వత్రికముగ ధ్వన్యమానమే వాచ్యము కాదు అయినను అద్దెల్ల అసంలక్ష్యక్రమము నకు విషయము కాదు క్వాచిత్కముగ సంలక్ష్యక్రమమునకును విషయమగును అని వచించిరి ఇట్లు రసభావాదికి అసంలక్ష్య క్రమత్వమును సంలక్ష్యక్రమత్వమును అంగీకృతము

[శంక] అంగీకృతమైన నగుగాక రసములును సంలక్ష్యక్రమవిష యము లగునేని దోసఁగుకలదు ఆ యభినవ గుప్తాచార్యులవారే అందులకు గుఱియైరి ఎట్లన వారు అనురణన (సంలక్ష్యక్రమ) వ్యంగ్యభేదగణనప్రస్తావమున అర్థశక్తిమూలధ్వనికి పన్నెండు భేదములు అని నుడివియున్నారు తదనుసారము ఇది ద్వాదశాత్మకము అని మమ్మటభట్టును వచించెను మఱి రసాదులకు సంలక్ష్య క్రమము అని అంగీకరించుచో అద్దెల్ల అసంగత మగును ఏలన ఇప్పుడు క్రొత్తగా రసాదులకు మఱి ఆఱుభేదములు జేరఁగా సంలక్ష్య క్రమము పదునెనిమిది భేదములది కావలసినచ్చును [అదెట్లన - రసాదులు సంలక్ష్యక్రమధ్వనిగ నంగీకరించిన - సంలక్ష్యక్రమము వలె అది మొదట వస్తురూపము అలంకారరూపము అని ఇఱు తెఱంగగును ఆ వస్తురూపము అలంకారరూపమైన వ్యంగ్యార్థమునకు వ్యంజకమైన వాచ్యార్థమును వస్తురూపమును అలంకారరూపమును అని ద్వివిధము అందొక్కొకటియు స్వతస్సంభవి కవిప్రౌఢోక్తి నిష్పన్నము, కవినిబద్ధవక్తృప్రౌఢోక్తి నిష్పన్నము అని ప్రత్యేకము ముత్తెఱంగు - ఇట్లు వస్తుధ్వని షట్ప్రకారము అలంకారధ్వని

షట్ప్రకారము క్రొత్తగా సంలక్ష్యక్రమముగా నొప్పుకొన్నచో రసధ్వనియు షట్ప్రకారము - మొత్తము అష్టాదశ ప్రకారము కావలసి వచ్చును] అది గ్రంథ విరోధముచే అసంగతము కావున ద్వాదశ ప్రకారముగ సంలక్ష్యక్రమ వ్యంగ్యము నంగీకరించి రసాదులకు అసంలక్ష్యక్రమవ్యంగ్యత్వము నంగీకరించుటే లెస్స

వాస్తవ మాలోచించిన (శబ్దవాచ్యములైన) స్ఫుటప్రతీతములైన విభావానుభావ వ్యభిచారిభావములచే తథవ్యవహితముగ అసంలక్ష్యక్రమత్వమున నే వ్యజ్యమానములగు రత్యాది స్థాయిభావములే రసీభూతము లగును సంలక్ష్యక్రమత్వమున వ్యజ్యమానములగు స్థాయిభావములు (రసీభూతములు) కావు రసీభావ మనఁగా ఝటితి జాయమానమగు నలౌకికచమత్కారవిషయక స్థాయిత్వమే విభావాదియు స్థాయియు యోగపద్యమున ఝటితిస్ఫూర్తి కలిగినప్పుడు - అసంలక్ష్యక్రమత్వముగనే - రసాదికి ఆ యాస్వాద్యమానదశయందు అన్యజ్ఞానసంపర్కము ఉండకుండఁజేసి విగళిత వేద్యాంతరత్వము పొనరును అన్యజ్ఞానసంపర్క మేదేనియున్న రసమునకు విగళిత వేద్యాంతరత్వము ఎట్లు సంగతమగును ? సర్వాలంకారికులును రసమును అట్లు (విగళిత వేద్యాంతర మని) అంగీకరించిరి కదా మఱి అది సకల సహృదయానుభవసాక్షికమునుంగూడ నగుఁగదా దీని నెవఁడు ఎట్లు కాదనును ? అందుచే సంలక్ష్యక్రమమున వ్యజ్యమానమగు రత్యాది వస్తుమాత్రమే రసాదికాదు అనఁగా అవి వస్తుధ్వని రూపములే రసాది ధ్వని రూపమునఁ బరఁగవు ఇట్లు వర్ణించిన సంలక్ష్యక్రమవ్యంగ్యము తొంటి ద్వాదశ ప్రకారమే యగును రసాదికి అధికములుగాఁ జెప్పఁబడిన యాఱు ప్రకారములు వస్తుధ్వనిప్రకారముల చేతనే గతార్థము లగును

ఇంకొక బాధయుఁగలదు పైఁజెప్పిన దానింబట్టి రసములకు సంలక్ష్యక్రమత్వము అభినవగుప్తాచార్యాభిమతము కాదని స్పష్టము కదా అట్టిచో రసభావాది రర్థో ధ్వన్యమాన ఏవ న వాచ్యః తథాపి సర్వో అలక్ష్యక్రమస్య విషయః క్వచిత్ సంలక్ష్యక్రమస్యాపి విషయః ' అను వాక్యములు - అభినవగుప్తాచార్యులవారివి ఎట్లు సంగతపడును ?

[సమా] ఆ తీరున రసభావాదికి సంలక్ష్యక్రమత్వము ఉపపన్నము కాదనుట నిజమే అందుచే అందులకై ఉపపత్తి యింకను విచారింపవలసి యున్నది సూక్ష్మేక్షికతోఁ బరిశీలించిన ధ్వనికారలోచనకారుల వాక్యాంతర ప్రామాణ్యమున పైఁ జూపఁబడిన గ్రంథ విరోధాది బాధలు పరిహృతము లగును ఈ గ్రంథమున నుద్దేశించిన యర్థమును సిద్ధించును ఇది రసగంగాధరకారుని భావము తదభిప్రాయానుసారము వివరణగ్రంథము వక్ష్యమాణము

అభినవగుప్తాచార్యుఁ వారి వాక్యములపై నుద్ధృతములైన వానియందు రసపదముచే రత్యాదిస్థాయి వివక్షితము సంలక్ష్యక్రమమున నభివ్యక్తమగు రత్యాదిస్థాయి వస్తుధ్వనిరూప మొందును కావున అది రసమునుగాక [వస్తురూపమును] వ్యభిచారిభావమునే వ్యక్తమొనర్చును వ్యభిచారిభావముగనే ఆస్వాద్యమాన మగును అందుచే రసాదికి అసంలక్ష్యక్రమత్వమే తదభిమత మని సిద్ధము

ఇట నిది అవధేయము స్థాయిభావములు శబ్దసాక్షాన్ని వేదితములై - అనఁగా వాచ్యార్థావ్యవహితముగ వ్యజ్యమానములైన చోట విభావానుభావ వ్యభిచారి భావరూప వ్యంజక సామగ్రి సాకల్య సమవధానమున రసాదిప్రతీతి తటాలున కలుగును కావున అట అసంలక్ష్యమే క్రమము [కుమారసంభవములో తృతీయసర్గము

నందు నిర్వాణ ' (52) ప్రతిగ్రహీతుం ' (66) హరస్తు (67) శ్లోకములు ఉదాహరణములు ఇట వ్యభిచారిభావములు శబ్దసాక్షా న్నివేదితములు] మఱి 'ఏవం వాదిని దేవర్షౌ ' మున్నగు శ్లోకములం దన్ననో వాచ్యార్థము తొలుత ప్రకాశితము కాఁగా పార్వతి వదన నమనము లీలాకమలపత్ర సంకలనము అను నీ వాచ్యార్థవస్తుప్రకర ణాది సాహాయ్యమున లజ్జావహిత్థావ్యభిచారిభావరూపవస్తువు అభి వ్యక్త మగును

ఇట వ్యభిచారిభావములు సాక్షాచ్ఛబ్ద నివేదితములు కాలేదు అందుచే నిట అసంలక్ష్యక్రమము ధ్వని కాదు ఇట్లు ప్రకరణము స్ఫుటతరము కానప్పుడు – కుమారీభావముచే పార్వతి శిరోనమన కమలపత్ర సంకలన మొనర్చినదా? శివునితోడి స్వవివాహవార్త విను నప్పుడు తన్నిమిత్తమున నట్లొనర్చినదా? అని సంశయము కలుగ వివాహవార్తాశ్రవణసందర్భమునందే అట్లొనర్చె నను ప్రకరణము విచారవేద్యము కాగా శివరూపాలంబనవిభావముచేతను తన్ముఖ నమనము లీలాకమల పత్రసంకలనము అను ననుభావముల చేతను పార్వతి లజ్జావహిత్థలు వ్యభిచారులు తొలుదొలుత వ్యక్తము లగును [ఈ భావధ్వని అర్థశక్తి మూలవస్తుధ్వని] ఇట వాచ్య వ్యంగ్యములక్రమము లక్షిత మగుచున్నది ఆ నిమిత్తమునం జేసి యీ శ్లోకము భావధ్వనికి లక్ష్య మనరాదు ఏలన ఇట పార్వతికి శివాలంబనకరతి యుండుటచేతనే లజ్జకుగాని అవహిత్థకుఁగాని అవ కాశము కలిగినది (వస్తుధ్వనిరూపము సంలక్ష్యక్రమమే) వెంటనే – విభావానుభావ వ్యభిచారిసామగ్రి సంపూర్ణముగ ఏర్పడుటం జేసి సామర్థ్యాక్షిప్తమగు వ్యభిచారిభావధ్వని ముఖమున ఆ రతి అభిలాషా విప్రలంభశృంగారరస పరిణామ మొంది ఆస్వాద్యమానమైనది ఇది రసధ్వనికి ఉదాహరణ మైనది

ఇంకను ఇట విశేషము కలదు ఈ శ్లోకమునందు రసము వ్యంగ్యధ్వనిప్రభేద మైన యర్థశక్తిమూలకానురణనవ్యంగ్య మగు లజ్జాదిధ్వనిచేత ననుగృహీతమైనది అందుచే నిందు వానికి అనుగ్రాహ్యానుగ్రాహకభావసాంకర్యము కలదు ప్రథమ ప్రతీతము పార్వతీలజ్జ సంచారిభావధ్వని పార్వతీదేవి రతిని అను గ్రహించినది - వ్యక్తపఱిచినది అనుగ్రహ మన గ్రహము ననుస రించి కలుగు గ్రహము గ్రహము జ్ఞానము ' మొదట లజ్జాభావ ధ్వని స్ఫురణము తర్వాత రతి స్ఫురణము ఇట్లు క్రమము సంల క్ష్యము పిమ్మట తుదను విభావానుభావములు వ్యభిచారిభావధ్వని ఏతద్రూపవ్యంజక సామగ్రీపౌష్కల్యసమవధానమున అసంలక్ష్య క్రమమున అభిలాషావిప్రలంభరసస్ఫురణము

అత్లే తల్పగతాపి శ్లోకమునందును ప్రకరణవిశేషప్రతీతి కలిగిన పిమ్మట నాయకాలంబనకము పతిహస్త యథాస్థానప్రాపణ (మందాక్షేప) రూపానుభావము - వీనిచే శమదైన్యాదివ్యభి చారిభావధ్వని సంలక్ష్యక్రమమునఁ బ్రథమప్రతీత మగును నాయి కను రతిచే మందాక్షేపకార్యము సంభవించును కావున వెనుక తద్రతి ప్రతీతమగును ఇట్లు రతిప్రతీతి సంలక్ష్యక్రమమున ఆ రతి విభావానుభావ వ్యభిచారిభావ ధ్వనిరూప సమగ్రవ్యంజక సామగ్రీ సమవధానమున అసంలక్ష్యక్రమమున విప్రలంభశృంగారముగ సహృదయ జనాస్వాద్యమగును ఇచటఁగూడ రతికి (రసమునకు) భావ ధ్వనికిని అనుగ్రాహ్యానుగ్రాహకభావము ఇచ్చోటను రసధ్వనికే ప్రాధాన్యము

ఇవి రెండును స్వభేద సంకీర్ణధ్వనికి లక్ష్యములు

పై రెండు ఉదాహరణము లందును తొలుత వ్యభిచారిభావ ధ్వని సంలక్ష్యక్రమముగ వక్తృవైశిష్ట్య ప్రకరణాది జ్ఞానము కలిగిన వెంటనే విభావాదివ్యంజకసామగ్రి జ్ఞానము కలిగినది దానం జేసి వస్తురూపము భావధ్వని ప్రథమప్రతీత మైనది పిమ్మట రత్యాది ప్రతీతి కలిగినది అందుచే రత్యాదికి ఇట సంలక్ష్యక్రమము ఇప్పుడు స్ఫుటతరముగ ప్రకాశించు విభావానుభావ వ్యభిచారిభావ ధ్వని రూపసామగ్రిసాఫల్యసమవధానమునం జేసి అవిలంబితముగనే రసప్రతీతి అలక్ష్యక్రమముననే కలిగినది విభావాదిజ్ఞానము రస నిష్పత్తికి హేతువు హేతుమత్తు (కార్యము) రసనిష్పత్తి వీని రెంటి పౌర్వాపర్యము ఆశుసంభవి యగుట అసంలక్ష్యమే హేతుహేతు మత్తుల నడుమ అన్యజ్ఞానవ్యవధానము లేదు కావున రసమునకు విగళిత వేద్యాంతరత్వము సిద్ధింపనే సిద్ధించినది

సార్వత్రికముగ రసాదికి అసంలక్ష్యక్రమత్వమును క్వాచిత్క ముగ - రతిభావధ్వనులకు అనుగ్రాహ్యానుగ్రాహకభావ సంబం ధము గల చోటులందు రత్యాదికి సంలక్ష్యక్రమమును కలదని సిద్ధాం తము ఇది ధ్వనికారోక్తము (2 3 ఉద్యో)లోచనకారోపబృంహి తము రసగంగాధరకారానుసృతము సర్వసహృదయతమసమ్మ తము సర్వదా అనవద్యము. ఇట్లు సువిచారితము ప్రామాణికము 'రసభావాది' సంలక్ష్యక్రమత్వమునకును ఉపపత్తి సముల్లసించు చున్నది

రసగంగాధరము

వరివస్యావివరణసముల్లసితము

అ॥ 12 రసాదివ్యంజకవము

ఇట్లు నిరూపితమైన రసధ్వని ప్రపంచమునకు (1) పదము (2) వర్ణము (3) రచన (4) వాక్యము (5) ప్రబంధము (6) పదైకదేశము (7) వర్ణాత్మకములు కానివి రాగాదులు ఆదిశబ్దముచే చేష్టయు - వ్యంజకములై రసాస్వాదము కలిగించునని ప్రాచీనుల యభిప్రాయము

(1) పదవ్యంజకత్వము

[శంక] ఓయీ, ఎల్లెడలను వాక్యముచేతనేకదా రసాభివ్యక్తి? తద్ఘటకమగు పదమును తద్ఘటకమగు వర్ణము ఎట్లు రసాభివ్యంజకములగును?

[సమా] వాక్యార్థబోధ వాక్యగతములైన సర్వపదముల యుపస్థితి(స్మృతి)చేఁ గలుగును అందుచే సర్వపదములకు వాక్యార్థజ్ఞానమునకు కారణ కారణత్వము సమానమే యగును అట్లైననుంగూడ వాక్యముయొక్క వాచ్యార్థబోధ గలిగినపిమ్మట ఆ పదములలో నేదేని యొక్క పదమే నియతముగ విలక్షణచమత్కారశక్తివిశిష్టమగుటం జేసి వాక్యమునకు రసాది వ్యంగ్యార్థచమత్కారము పుట్టింపఁజాలియుండును ఆపదముచే వాక్యమునకు ధ్వనికావ్య మని వ్యపదేశము కలుగును అందుచే పదము రసాదివ్యంజకముగా నంగీకృతము

ఉదా.—

తల్పగతాపి సుతను అను శ్లోకమున (ఉత్తమోత్తమ కావ్యము నకు లక్ష్యముగా నుదాహరించినదానియందు) సర్వపదములకు వ్యంజకత్వము తుల్యమైనను 'మంద' మను పదమునకే కడమ పదములకు లేని రతివ్యంజకత్వ వైలక్షణ్యము కలదు

(2) రచనావ్యంజకత్వము

రచనకును వర్ణములకును స్వతంత్రవ్యంజకత్వము లేదు, ఏలన రచన యన పదగుంఫనమో వర్ణగుంఫనమో, వాక్యగుంఫనమో. పదములగుంఫనమున వర్ణగుంఫనము అంతర్గతము పదముల గుంఫనమున వాక్యముల గుంఫనమున రచన అంతర్భవించును అందుచే పదములది కానిది, వాక్యములది కానిదియు ప్రత్యేకముగ వర్ణములది రచనది అగు వ్యంజకత్వము లేదు అందుచే రచనగాని వర్ణములుగాని స్వతంత్రవ్యంజకములు గాక పదవాక్యవిశిష్టముగనే వ్యంజకములగును అనఁగా నియతవ్యంజకత్వము (వ్యంజకతావచ్ఛేదకము) పదవాక్యత్వము ఆ వ్యంజకతావచ్ఛేదకకోటిలో ఈరచన వర్ణములు విశేషణములుగా ననుప్రవిష్టము లగును. అనఁగా రచనావర్ణ-విశిష్టపదవాక్యములు నియతముగా రసాభివ్యంజకము లగునని భావము అట్లైననుంగూడ-పదవాక్యవిశిష్టరచనా వర్ణత్వము కాని, రచనావర్ణవిశిష్టపదవాక్యత్వము కాని వ్యంజకత్వము. వీనిలో నేదే నొక్కటియే వ్యంజకమని నిర్ణాయకమైనయుక్తి లేదు అందుకని ఘటమునుగూర్చి చక్రవిశిష్టదండమా కారణము దండవిశిష్ట చక్రమాకారణము అని. ఇందు ఏదేనొకవిశిష్టమునే కారణముగా నిర్ణయింప మార్గములేక, దండచక్రములు రెండును వేర్వేర ఘటము

నకు కారణము లని యొప్పినట్లు ప్రత్యేకముగ రచనయు వర్ణములును వేరుగా వ్యంజకములని ప్రాచీనులు అంగీకరించిరి మఱి నవీనులన్ననో- వర్ణరచనలు విశేషము మాధుర్యాదిగుణాభివ్యంజకములేకాని రసాభి వ్యంజకములుకావు అట్లు రసాభివ్యంజకము లనుటయందు గౌరవము కలదు ప్రమాణములేదు గౌరవ మెట్లన రసాదివ్యంజకముల సంఖ్యా ధిక్యమగుటచేత ఫలముఖగౌరవము దోషము కాదని అంగీకరింత మన్న రసాదులకు రచనావర్ణాదులు వ్యంజకము లనఁ బ్రమాణము లేదు

[శంక] రచనావర్ణాదులు మాధుర్యాభివ్యంజకము లగునేని రసాభివ్యంజకములు కానేయౌనుకదా గుణికి అభివ్యంజకములుగాక గుణమునకు అభివ్యంజక మగు టెట్లు సంభావ్యము ?

[సమా] గుణ్యభివ్యంజకముగాక గుణాభివ్యంజకముగా శక్యము కాదని నియమములేదు అట్టిచో ఘ్రాణ రసన శ్రోత్రేంద్రియ విషయమున వ్యభిచారము ఎట్లన ఘ్రాణేంద్రియము గంధ(గుణ)ము నకు వ్యంజకము గంధమున కాశ్రయమైన పృథివికి వ్యంజకము కాదు అట్లే రసనేంద్రియము రస (గుణ)మునకు వ్యంజకము రసాశ్రయమైన జలమునకుఁగాదు అట్లే శ్రోత్రేంద్రియము శబ్ద (గుణ)మునకు వ్యంజకము శబ్దాశ్రయమైన యాకాశమునకుఁ గాదు అందుచే మాధుర్యగుణవ్యంజకము రసాదిగుణవ్యంజ కము కానక్కఱలేదు జ్ఞానేంద్రియములవలన నుపస్థితములైన (బోధితములైన) గుణులు, (పృథివ్యాదులు), గుణాదులు (గంధాదులు) ఉదాసీనములు గుణిగుణభావమున పరస్పరమున సంబద్ధములుకాని యన్యములును ఒక్కొక్కప్పుడు పరస్పర సంబద్ధ ములై (పరోపశ్లేషముచేత) ఒక్కొక్కప్పుడు పరస్పరము అసంబద్ధ

ములై (ఔదాసీన్యముచేత) తత్తదింద్రియప్రత్యక్షప్రమితిగోచరము లగుచుండును అట్లే రసములును మాధుర్యాది గుణములును ఒక్కొక్కప్పుడు మిళిత రూపములుగ ఒక్కొక్కప్పుడు పృథగ్రూపములుగాను ఆస్వాదగోచరము లగుచుండును ఈ వ్యవస్థను బట్టి రచనలు వర్ణములు రసాదివ్యంజకములయ్యు మాధుర్యవ్యంజకము లగుచుండును అని నవ్యులు నుడువుదురు అనఁగా రసాదులు (గుణులు) మాధుర్యాదులు (గుణములు) తమ తమ వ్యంజకములను బట్టి కలిసియు, వేర్వేఱుగాను ఆస్వాదగోచరము లగుచుండును

ఉదా —

తాం తమాలతరుకాంతిలంఘినీం
కింకరీకృత నవాంబుద త్విషమ్
స్వాంత మే కలయ శాంతయే చిరం
నైచికీనయనచుంబితాం శ్రియమ్

(రచన ప్రకరణమున పూర్వోదాహృతము. పుట 322)

ఇట భగవద్విషయక రతిభావద్వారమున శాంతరసమునకును తన్నిష్ఠమాధుర్యగుణమునకును రచన వ్యంజకము వర్ణములు రచనా ద్వారమున గుణముల నిట నభివ్యక్తపఱచుచున్నవి

(3) వాక్యవ్యంజకత

వాక్యము వ్యంజక మగుటకు ఉదా. —

ఆవిర్భూతా యదవధి మధుస్యందినీ నందసూనోః
కాంతిః కాచి న్నిఖిలనయనాకర్షణే కార్మణజ్ఞా
శ్వాసో దీర్ఘ స్తదవధి ముఖే పాండిమా గండయుగ్మే
శూన్యా వృత్తిః కులమృగదృశాం చేతసి ప్రాదురాసీత్

(విప్రలంభరసోదాహరణము)

27225

నన్దనన్దనుని మకరందస్యంది యైన, విలక్షణమై సమస్తజనుల నేత్రముల నాకర్షించు కర్మస్వరూప మెఱింగిన కాంతి యెంతలో నావిర్భవించెనో ఆలోననే మృగాక్షులైన కులకాంతలకు శ్వాసము దీర్ఘమై కపోలద్వయమున తెల్లదనంబు భాసిలి హృదయమందు శూన్యవ్యాపారము ప్రాదుర్భవించెను.

రసధ్వని విప్రలంభశృంగారమునకు పైవాక్య మెల్ల వ్యంజకము

(4) ప్రబంధవ్యంజకత

యోగవాశిష్ఠము శాంతరసమునకు రామాయణము కరుణ రసమునకు, రత్నావళ్యాదులు శృంగారమునకు వ్యంజకము లని ప్రబంధివ్యంజకతకు ప్రసిద్ధనిదర్శనములు మన్నిర్మితములు (జగన్నాథ పండితరాయ నిర్మితములు) పంచలహరలును ప్రబంధ వ్యంజకతకు నిదర్శనములు.

(5) పదైకదేశవ్యంజకత

పదైకదేశవ్యంజకతకు ఉదా :—

పరిహరతు ధరా అను శ్లోకము (బలవీర రసధ్వని) యుదాహరణమున కడపటి పాదమున

'నిఖిల మిదం జగదండకం వహామి

ఇట 'జగదండకం' అనుచోట క' అను తద్ధితప్రత్యయము బ్రహ్మాండముయొక్క యల్పత్వమును ద్యోతకరించి వైనతేయుని యుత్సాహస్థాయిక బలవీరరసవ్యంజకము.

(6) రాగాదివ్యంజకత

ఇట్లే వర్ణాత్మకములు కానివి రాగాదులును రసాదులకు వ్యంజకము లగుననుటకు సహృదహృదయములే ప్రమాణము

ఇట్లు ఇవి రసాదులు ప్రధానధ్వనిరూపముగా నిరూపింపఁ బడినవి రసాదుల గుణీభూత వ్యంగ్యరూపములు - రసవత్తు ప్రేయము ఊర్జస్విప్రభృతులు - ఇఁక ద్వితీయాననమునందు అలంకారప్రకరణమునఁ బ్రతిపాదింపఁబడును [అసమాప్త మగుట ప్రతిపాదితములు కాలేదు] ఇట ఈ విశేషము గ్రహింపఁదగినది. వేనియందు రసాదులకు ప్రాధాన్యము కలదో వానికి రసాదిత్వము గుణభావము (అప్రాధాన్యము) కలదో వానికి రత్యాదిమత్త్వము-రసవత్తని పేరు ఇందు రస పదమున కేమి యర్థము? ఇట రసపదము రసత్వయోగ్యరత్యాదిపర మని కొందఱి మతము అన్యు లన్నారో రసాదులకు అప్రాధాన్యము కలుగుచో ధ్వనివ్యవహారము లేదు రసాదివ్యవహారము ఉండనే యున్నది రసవదలంకారము అని వ్యపదేశము అని తలంతురు.

ఇ ది

పదవాక్యప్రమాణ పారీణ

పండితరాయ జగన్నాథ విరచిత

ర స గం గా ధ ర ము

ప్రథమాననము


క వి స హృ ద య మూ ర్ధ న్య

శ్రీ ధరణికోట వేంకటసుబ్బయ్యసూరి

వి ర చి త

వరివస్యావివరణము ప్రథమాననము సద్యోగ్రాహిత్తము

—(శ్రీ)


Library
Ac No 3840
Hyderabad-500